# వివేచన ఉద్వేగవాదం విప్లవం

(ప్రథమ భాగం)



ఆంగ్లమూలం
మానవేంద్రనాథ్ రాయ్

అనువాదం
నరిసెట్టి ఇన్నయ్య

# వివేచన, ఉద్వేగవాదం, విప్లవం

## ప్రథమభాగం

ఆంగ్లమూలం

**మానవేంద్రనాథ్ రాయ్**

అనువాదకుడు

**డా॥ నరిసెట్టి ఇన్నయ్య,** ఎమ్. ఏ., పిహెచ్. డి.,

**2019**
**వీణాధరీ పబ్లికేషన్స్**
**హైదరాబాద్**

# వివేచన, ఉద్వేగవాదం, విప్లవం
## ప్రథమభాగం

ఆంగ్లమూలం
మానవేంద్రనాథ్ రాయ్

అనువాదకుడు
డాక్టర్. నరిసెట్టి ఇన్నయ్య, ఎమ్. ఏ., పిహెచ్. డి.,

ప్రథమ ముద్రణ 2019

వీణాధరీ పబ్లికేషన్స్,
హైదరాబాద్

# విషయసూచిక


ముందుమాట 5

1. పరిచయము 6

2. మానవస్వభావము 18

3. నియమబద్ధ ప్రకృతి 29

4. మానవుడి తిరుగుబాటు 48

5. ఎదురుతిరిగిన దేవతలు 86

6. ప్రకృతి నియమము 109

7. ఆధునిక తత్వం పుట్టుక 131

8. కొత్త విజ్ఞానం 159

9. జ్ఞానవికాసం 178

10. మహోన్నత విప్లవం - 1 199

11. మహోన్నత విప్లవం - 2 218

# ముందుమాట

ఆధునిక నాగరికతలో సాంస్కృతిక నైతిక సంక్షోభం గమనించిన సునిశిత ఆలోచనాపరులు ప్రపంచవ్యాప్తంగా మానవతా సంప్రదాయం వైపు మరలుతున్నారు. రోజు రోజుకూ మానవతావాదం తిరగదోడాలనే ఉద్యమం బలపడుతున్నది. నేడు కలవరపెడుతున్న సమస్యలకు వివేచనాత్మక దృక్పథం కావాలని గుర్తిస్తున్నారు. ప్రజా జీవితంలో నైతిక విలువలు కాపాడాలని బాగా వత్తిడి వస్తున్నది. ప్రపంచంలో జీవితం మెరుగుపడాలని, పొందికగా కొనసాగాలనే ఆక్రందనలో చిత్తశుద్ధిని ఎవరూ సందేహించడం లేదు. అయినా యిది అరణ్యరోదనంగా వున్నట్లనిపిస్తున్నది.

ఆధునిక సంశయవాదంలో వ్యతిరేక ఫలితం వలన బాధామయమైన అనుభవం వచ్చింది. "సరైన వివేచన" ఆధారంగా పరమార్థాన్ని కనుగొన్నట్లు ప్రాచీన సంపూర్ణ తత్వం పేర్కొనడాన్ని 19 వ శతాబ్దపు విమర్శనాత్మక ఆలోచనా ధోరణి సవాల్ చేసింది. జీవిత సమస్యలన్నిటికీ నైరూప్య ప్రథమ సూత్రాల నుంచి పరిష్కారాలను రాబట్టవచ్చనే విశ్వాసబంధం నుంచి, విమోచన కలగడానికి కారణం. అనుభవానికి పూర్వమే జ్ఞానం వున్నదనే ఊహతో గూడిన తాత్విక విధానాన్ని నిరాకరించడమే. కాని యిదే సమయంలో నైతిక, సాంస్కృతిక సంక్షోభానికి బీజాలు నాటారు. స్నానజలంతో బాటుగా పసిపిల్లను కూడా పారేశారు. "సరైన వివేచన" అనే అధి భౌతిక భావనను తృణీకరించడంతో, వివేచనావాదం అర్థరహితమైంది. దీని స్థానంలో, జీవితానికి చుక్కానిగా అన్ని విధానాలైన మార్మిక ప్రేరణలు–అంతర్బుద్ధి, జీవశక్తి, జీవసృష్టి ప్రవేశించాయి. వివేచనను ఉన్నతన్యాయస్థానం నుంచి ప్రాపంచికానుభవ వాదం పడద్రోయగా, నైతిక విలువలకు ఆచరణలో వ్యావహారిక వాదం తక్కువ స్థానం ఇచ్చింది.

సంశయవాదంలోని ప్రమాదపూరిత ఫలితాలనుంచి వివేచనను నీతిశాస్త్రాన్ని కాపాడడానికి యీ గ్రంథంలో ప్రయత్నం జరిగింది. ఆధునిక విజ్ఞానం ఆధారంగా మానవుడి వివేచన జీవ సంబంధమైనదని కనుగొన్నారు. వివేచన అధి భౌతిక న్యాయం కాదు. మానవుడిలోని వివేచన వలన నైతిక విలువలకు గట్టి ప్రాతిపదిక ఏర్పడింది. దీనికి ఏ ప్రమాణం అక్కరలేదు. అంతరాత్మ మినహా, అంతరాత్మ అంటే దివ్యవాణి కాదు. వివేచన వలన యిది జనిస్తుంది. సంప్రదాయబద్ధంగా మానవతావాదాన్ని అంటిపెట్టుకొని వస్తున్న మార్మికభావన తొలగిపోయింది. వివేచనకు భౌతిక ప్రాతిపదిక, నీతికి వివేచనాత్మక మతేతర వూతం లభించడం వలన యిది సాధ్యమైంది.

అనుభవానికి పూర్వమే జ్ఞానం ఉన్నదనే వూహాజనిత తత్వాలు గతానికి చెందినవి. మానవ జీవితానికి చుక్కానిగా ఒక సమగ్రతత్వం తప్పనిసరిగా అవసరం. వివేచనాత్మక సాంఘిక తత్వం రాబట్టటానికి మానవతావాదాన్ని విజ్ఞానం ఆధారంగా వ్యాఖ్యానించాలి. సాంస్కృతిక చరిత్రకు మానవతావాద భాష్యం చెప్పడంతో, యీ గ్రంథంలో ఒక సమగ్ర తత్వాన్ని సూచించడం సంభవించింది. ఇందులో సామాజిక రాజకీయ ఆచరణను, వివేచన నీతికి సంబంధించిన వైజ్ఞానిక తత్వంతో కలపడం తటస్థించింది.

డెహ్రాడూన్
ఆగస్టు 15, 1952.

ఎం.ఎన్. రాయ్

# పరిచయము

ప్రపంచచరిత్ర తత్వచరిత్ర అన్నాడు హెగెల్.(1) అతడి నుంచి నేర్చిన మార్క్స్ (2)గురువును సరిదిద్ది, వర్గపోరాట చరిత్రే నాగరికత చరిత్ర అని ప్రకటించాడు. పరస్పర విరుద్ధంగా కనిపించే ఈ చారిత్రకవాద సిద్ధాంతాలు పేర్కొని ఒక శతాబ్దం జరిగిపోయింది. విరుద్ధత్వం పైకి కనికరించేదే. హెగెల్, మార్క్స్ యిరువురూ చరిత్రను జీవపరిణామ విధానంగా, దాని చైతన్యాన్ననుసరించి బహిర్గతమయ్యేదిగానే పేర్కొన్నారు. విరుద్ధత్వం పైకి కనిపించడం వలన నేటికీ వివాదం పరిష్కారం కాలేదు. రాగరహిత ఆలోచనాపరులు ఏదో ఒక అభిప్రాయాన్ని ఎన్నుకొనడంలో కష్టపడుతున్నారు.

మార్క్స్‌కు ఒక తరం ముందుగానే, హెగెల్‌తో సంబంధం లేకుండా, ఈ రెండు విరుద్ధభావాలను కలిపే చారిత్రక చైతన్య సిద్ధాంతాన్ని మిష్‌లా ప్రవేశపెట్టాడు. సంప్రదాయబద్ధమైన చారిత్రక అభిప్రాయాలను చూచి అసంతృప్తి చెంది ఫ్రెంచి విప్లవానికి కాబోయే చరిత్రకారుడు, చరిత్రను విజ్ఞానంగా వ్రాసే కొత్తపద్ధతి కోసం అన్వేషించాడు. భాషోత్పత్తి పుట్టుపూర్వోత్తరాల అధ్యయనం వలన ప్రజల చరిత్రలో గత రహస్యాలకు కీలకం లభించవచ్చునుకున్నాడు. చారిత్రక వాద సమస్యలకు భాషోత్పత్తి విధానం అన్వయించి, చరిత్ర, తత్వం కలిసిపోయాయని మిష్‌లా నిర్ణయించాడు. తాను తలపెట్టి పూర్తిచేయని విశ్వచరిత్ర పీఠికలో మిష్‌లా(3) 1830లో యిట్లా వ్రాశాడు. "ప్రపంచంతో ఆరంభమైన యుద్ధం, దానితోనే అంతమౌతుంది. ప్రకృతిపై మానవుడి యుద్ధం, పదార్థంపై భావపోరాటం, విధిపై స్వేచ్ఛ సమరం గురించి వ్రాయడమే తప్ప, చరిత్ర అంటే మరేమీ కాదు."

మిష్‌లా చరిత్రను కొత్త విజ్ఞానంగా రూపొందించడానికి ఒక శతాబ్దం పూర్వమే నేపిల్స్‌లో రోమన్ చట్టం బోధిస్తున్న ఒక పేరులేని, జొవాసెబతెస్త వికో,(4) జాతుల స్వభావం గురించిన కొత్తవిజ్ఞాన సూత్రాలు సిద్ధాంతీకరించాడు. తద్వారా ప్రజల సహజనియమాలు కూడా చూపాడు. వికో చరిత్ర పరిశోధనలో కొత్తబాటలు వేసినట్లు

1) 1770–1831 జర్మనీలో తత్వవేత్త.

2) 1818–83 జర్మనీలో కమ్యూనిస్టు సిద్ధాంతవేత్త.

3) 1798–1874 ఫ్రెంచి చరిత్రకారుడు.

4) 1669–1744 ఇటలీ తత్వవేత్త. న్యాయనిపుణుడు.

మిష్‌లా కనుగొన్నాడు. అంతవరకు ఎవరికీ తెలియని వికో రచనలో మూల సిద్ధాంతమేమంటే, మానవాళి తనను తానే సృష్టించుకున్నదని, తెలిసిన చరిత్ర సత్యాలను సరిగా అవగాహన చేసుకోవాలంటే, ఆదిమస్థితికి వెళ్ళి చూడాలని వికో పేర్కొని "సామాజిక ప్రపంచాన్ని మానవుడే ఏర్పరచుకున్నాడనే తిరుగులేని సత్యాన్ని" వ్యవస్థాపించాడు. "మానవుడి మేథస్సులోనే యిందుకు సంబంధించిన సూత్రాలు" కనుగొనాలని యీ సత్యనిర్ణయ సారాంశము.

1830 జులై విప్లవం సాగుతుండగా, పారిస్ వీధుల్లో అగ్నిజ్వాలలు చెలరేగుతుండగా, యువకుడైన మిష్‌లా వికో పద్ధతికి విస్తుబోయాడు. చారిత్రక సమస్యలను ఆదిమ మానవుడు, భాషోత్పత్తి, సామాజిక విషయాల దృష్ట్యా వికో పరిశీలించాడు. వికో పూనకంతో వున్న మిష్‌లా స్వయంగా చెప్పుకున్నట్లు "వికో చారిత్రక సూత్రాల మత్తులో పడిపోయాడు" విశ్వ చరిత్ర వ్రాసి, యుగాలుగా చరిత్ర, తత్వం ఎలా మిళితమయ్యాయో చూపడానికి, మిష్‌లా అట్టేకాలం బ్రతకలేదు. కాని అతనిట్లా ప్రకటించాడు" విజ్ఞానమంతా ఒక్కటే. భాష, సాహిత్యం, చరిత్ర, పదార్థ విజ్ఞానం, గణితం, తత్వం ఒకదానికొకటి ఎంతో ఎడబాసినట్లగుపించినా, వాస్తవానికి సంబంధంగలిగి వుండడమేగాక, ఇవన్నీ ఒకే విధానం లోనివే"

కనుక మార్క్సు తన గురువును కాళ్ళపై నిలబెట్టినందువలన చరిత్రలో జీవవిధానం రాలేదు. వాస్తవానికి, మార్క్సు, ఏంగెల్స్ కూడా మిష్‌లాను చదివారు. వికో భావాలు వారికి తెలియనివికావు. ఆ మాట కొస్తే, నేపిల్స్‌లో ఆవిర్భవించిన "నూతన విజ్ఞానం" లెబ్నిజ్, వుల్ఫ్, హెర్డర్ మానవజాతి చరిత్ర తత్వానికి సంబంధించిన భావాలు అనే గ్రంథం వ్రాయకముందే వికో రచన తెలుసుకున్నాడు. హెగెల్ చరిత్రతత్వంపై వికో ప్రభావం వున్నదని రుజువు పరచవచ్చు.

వికో కూడా ఫ్రాన్సిస్ బేకన్ రచన చదివాడు. బేకన్ రచన నుండి గ్రంథ చౌర్యం చేసినట్లు కొందరు చరిత్రకారులు నిర్ధాక్షిణ్యంగా వికోను అన్నప్పటికీ, అది కేవలం దురుద్దేశంతో విమర్శించడమే. బేకన్ పరిశోధన నమూనాలో వికో తన రచన చేశాడు. ప్రకృతి చరిత్రకు బేకన్ ఆగమన పద్ధతి అన్వయించగా, వికో అతని నుండి ఆ పద్ధతిని స్వీకరించాడు. జాతుల విశ్వజనీన నియమాలు కనుగొనడానికి చరిత్ర, మతజ్ఞానం, తత్వం, వాటి భాషోత్పత్తి అధ్యయనం చేశాడు గ్రోషన్. అతని రచనలు చదివి, అటువంటి పద్ధతిలోనే, చరిత్రలో సాధారణ నియమాలు కనుగొనవచ్చునని వికో భావించాడు. భావ చైతన్యత ప్రాచీన యుగాలలో మహోన్నత చింతనాపరులలో చూడవచ్చు.

ఆధునిక కాలంలో భావ పరంపర పరిశీలిస్తే, వికో చారిత్రక న్యాయశాస్త్ర

సిద్ధాంతానికి తనకూ పోలిక వున్నట్లు శావిగ్నె గుర్తించినట్లు తెలుసుకుంటాము.

1837లో ప్రచురితమైన చరిత్రతత్వోపన్యాసాల పీఠికలలో హెగెల్ రచనను పరిచయం చేస్తూ వికో, హెర్డర్, ష్లెగల్‌లను ప్రస్తావించడం గమనిస్తాము. 1884లో తొలిసారి వికో 'యూనివర్సల్ లా'కు జర్మనీ అనువాదం వెలువడినప్పుడు, హెగెల్ భావాలకు, వంద సంవత్సరాలకు పూర్వం ఇటలీ చరిత్రకారుడు వ్రాసిన పోటీకి పోలిక వున్నదని పీఠిక పేర్కొన్నది. నూతన విజ్ఞానం తుదిరూపంలో ప్రచురితమైనప్పుడు వెనిస్‌లో వున్న రూసో ద్వారా, వికో ప్రభావం హెగెల్‌పై పడే అవకాశం వున్నది. సమాజ మూలానికి సంబంధించిన సమస్యలకు వికో చూపిన భాషోత్పత్తిలో కీలకాన్ని రూసో గ్రహించినట్లు, అతడి భాషల ఉత్పత్తిపై వ్యాసం చూసి నిర్ణయించవచ్చు.

"మార్క్స్, ఏంగెల్స్ ముందు మిష్‌లా ద్వారా, తరువాత మానవులు తమ చరిత్రను తామే రూపొందించుకుంటారనే సూత్రం వలన, వికో మంచి భావాలను స్వీకరించి చారిత్రక పదార్థవాదాన్ని పెంపొందించారు. చారిత్రక పదార్థ వాదం వికో చెప్పినదానికి మించి పయనించినా, మార్క్సిస్టుభాష్యకారులు గమనించినట్లు, అతడు కూడా చాలా ముందుకుపోయాడు."

మార్క్సిస్టు పదార్థవాద చరిత్రకు ఒక క్రమరూపాన్ని తొలుత ఇచ్చింది లాబ్రియెలా. మార్క్స్‌కు ముందు యీ విషయంలో వికో వున్నట్లు అతడు గుర్తించాడు. తరువాత పాల్ లాఫార్గ్ యీ విషయాన్ని యింకా స్పష్టంచేస్తూ, లూయీ మోర్గాన్ ద్వారా వికో వరకూ పోయి చరిత్రలో మార్క్సిస్టు దృక్పథాన్ని చూడవచ్చునన్నాడు. ప్రజ్ఞాశాలిగా తన యవ్వన దశలోనే వికోను అధ్యయనం చేశాడు మార్క్స్. 1861లో అప్పటికి యింకా న్యూసైన్స్‌ను లాస్‌ల్ చదవలేదంటే మార్క్స్ విస్తుబోయాడు. ఆ గ్రంథంలోని "రోమన్ చట్ట స్వభావపు తాత్విక దృష్టి"ని మార్క్స్ మెచ్చుకున్నాడు. "ప్రకృతి చరిత్రను మానవుడు రూపొందించలేదు. మానవ చరిత్రను మానవుడే ఏర్పరుచుకున్నాడు. ఇదే వాటి మధ్య ప్రధానతేడా" అని వికో చెప్పినట్లుగా, కేపిటల్ గ్రంథంలో ఒక వివరణగా మార్క్స్ వ్రాశాడు. "ఉత్పత్తి విధానాన్ని బట్టి భావాల తీరు వుంటుందనే మార్క్సిస్టు సిద్ధాంతాన్ని వికో భావోత్పత్తి నియమాలు ముందే ప్రస్తావించాయి"అని, వికోను కూలంకషంగా పరిశీలించిన సోరెల్ నిర్ధారించాడు. మార్క్సిజం వికో ప్రభావాన్ని క్రోచె బయటపెట్టాడు. "కొత్తరకపు ఆటవికత, ఆదిమ మానసిక స్థితికి సమాజాన్ని తీసికెళ్ళడం ద్వారా వర్గపోరాటభావాన్ని వికో చూపినరీతిలో, మార్క్స్ సోరెల్ పరిపక్వతకు తెచ్చాడు.

సంఘర్షణ వలన అభివృద్ధి అనే హెగెల్ సిద్ధాంతంగాని, ఆర్థిక నియతివాదం

అనే మార్క్సిస్టు పిడివాదం గాని సరికాదని, నిరంతరంగా వస్తున్న భావ పరిణామం సూచిస్తున్నది. మార్క్స్ కంటే యింకా హెగెల్ చెప్పిన చరిత్ర తత్వంతో యిది సరిపోతుంది. బేకన్, హాబ్జ్‌ల నుండి నేర్చిన వికో, ప్రకృతి నియమ సిద్ధాంత విమర్శకుడుగా తన చరిత్ర విజ్ఞానాన్ని పెంపొందించాడు. అతడిని కార్మిక విప్లవ సిద్ధాంతకారుడనజాలం. అతడు కాథలిక్, "మానవజాతి తనను తానే సృష్టించుకున్నది. కాని దేవుడు మహోన్నతుడు" – ఇటువంటి స్వవచన విఘాతాల నుండి వికో బయటపడలేదు. అయినా, మత వ్యతిరేకం, నాస్తికంగావున్న మార్క్సిస్టు చరిత్ర భాష్యాన్ని యితడు ముందే చెప్పాడు.

మార్క్సిస్టు విధానంలో పదార్థవాదమే సారాంశము. అది మార్క్సుతో జనించలేదు. మానవుడి ఆలోచనతోబాటే పుట్టింది. ఆదిమ మానవుడి వివేచనావాదం అతడిని దేవుళ్ళకు లొంగేటట్లు చేసింది. ఆ విధంగా మొదట్లో పతనమైన మానవుడు తిరుగుబాటు చేయగా తత్వం ఉద్భవించింది. అప్పటి నుంచి దానికి చైతన్యత వున్నది.

స్వేచ్ఛకై మానవుడి పోరాటఘట్టాలే చరిత్ర. జీవపరిణామం ఉన్నతస్థాయిలో సామాజిక పరిణామంగా సాగుతున్నది. అక్కడ ఉనికి పోరాటం బాగా సాగడానికి సహకారం సమష్టిత్వంగా మారుతుంది. అందుకే చరిత్ర జీవపరిణామ విధానము.

చరిత్రను వివేచనాత్మక పరిణామ విధానంగా పరిగణించిన తొలి తత్వవేత్త అరిస్టాటిల్. చరిత్రలో జీవదృష్టిని స్టాయిక్‌లు స్వీకరించారు. అగస్టిన్ సిద్ధాంతం వలన క్రైస్తవ మత జ్ఞాన ప్రభావం కిందకు ఐరోపా చింతన వచ్చేవరకూ స్టాయిక్‌ల భావనే అధిపత్యం వహించింది. వెయ్యేళ్ళపాటు పాండిత్యవాదం సాగిన అనంతరం, మానవాభివృద్ధికి సంబంధించిన వివేచనా దృక్పథాన్ని పునర్వికాసకర్తలు తిరగతోడారు. చరిత్రను సృష్టించడంలో వివేచనావాదం, ఉద్వేగవాదం సమాంతర ఆలోచనా స్రవంతులైనప్పటికీ, మిళితం గావడం గమనించవచ్చు. పునర్వికాసంలో ఉద్వేగవాదులు సైతం యిట్లా వాదించారు. "కాన్‌స్టాంటిన్ నుండి కొలంబస్ వరకూ జ్ఞానవికాసాన్ని రెండువిధాలుగా విభజించి చూడడం విడ్డూరం. ప్రతి యుగంలోనూ అంతర్లీనంగా నిరంతర విధానం కొనసాగుతున్నదని గ్రహించడం అవసరం."

చారిత్రకంగా మాట్లాడితే రెండు ధోరణులు అరిస్టాటిల్‌లో ఉన్నవి. మధ్యయుగాల క్రైస్తవ మత జ్ఞానానికి ప్రామాణికుడుగా భావించిన, మెటఫిజిక్స్, లాజిక్ రచయిత ఒకడు. పాలిటిక్స్, ఎథిక్స్, వ్రాసినవాడు మరొకడు. రెండవవ్యక్తిని అరబ్బులు పునరుద్ధరించి ఐరోపాకు పరిచయం చేసేవరకూ, పునర్వికాస మానవతావాదులు స్వీకరించేవరకూ పూర్తిగా విస్మరించబడినారు. ఆలోచనా పరిధిలో ఆ తరువాత

అనేకమంది విజ్ఞులు వచ్చి మానవజాతి అభివృద్ధిలో పరిణామ దృక్పథాన్ని విపులీకరించారు. తుదకు, ప్రపంచచరిత్రకు లేదా నాగరికత చరిత్రకు కీలకంగా హెగెల్ దీనిని తీర్చిదిద్దాడు. "స్వేచ్ఛాభావనను క్రమంగా గుర్తించడాన్నే మానవజాతి రాజకీయాభివృద్ధిగా అతను గ్రహించినాడు.

మార్క్స్ భౌతికవాదానికి, హెగెల్ భావవాదానికి అదే సమాన ప్రాతిపదిక. భవిష్యత్తు తత్వాన్ని గ్రహించమని, దానికి గతం లేదనే వారు మాత్రమే నాగరికత పుట్టినప్పటి నుండి ఆలోచనా పరిణామంలో అఖాతం ఉన్నదని ఊహించారు. నాగరికత చరిత్రకు కీలకమంతా ఆలోచనాచరిత్రలోనే ఉన్నది. అదంతా తార్కికంగా పునర్నిర్మాణం గావించవచ్చు.

పురాణాలు, గాథలపేరిట గత విషయాలను అట్టిపెట్టడం ప్రాచీనుల అలవాటు. గ్రీకులు రంగం మీద ప్రవేశించి, మానవ ఉనికిని వివేచనాత్మక, మతేతర దృక్పథాన్ని అన్వయించేవరకూ చరిత్ర రచన ఆరంభం కాలేదు. 'థేల్స్' ముందే జోస్యం చెప్పిన తీరులో క్రీ.పూ.585 లో గ్రహణం పట్టింది. భావవిమోచనకు అప్పటినుండే జయప్రదంగా, నిరంతర పోరాటం జరిగింది. భౌతిక సంఘటనలను అనంతమైన దేవగణం తీసుకురావడం లేదని గ్రీక్ చింతనాపరులు ధైర్యంగా ఆలోచించారు. మానవజాతి ప్రాచీనతతో సహా ప్రతివిషయాన్ని గురించి జిజ్ఞాసతో ఆలోచించడం మొదలైంది. చరిత్రకు తత్వం కీలకం అని హెగెల్ అభిప్రాయపడగా, సోదాహరణగా బోధించే తత్వమే చరిత్ర"(బోలింగ్ బ్రోక్) అనడం తూసిడైడిజ్ తో ప్రారంభమైంది. క్రీ.పూ. మొదటి శతాబ్దంలో హలికార్నసస్‌కు చెందిన దయనాసిస్ నేటి ఆధునిక రీతిలో అభివృద్ధి చెందించాడు. చరిత్ర రచనను తత్వం ప్రోత్సహించింది. తార్కికంగా, అనుభవరీత్యా తత్వచరిత్ర నాగరికత చరిత్రకు ప్రేరణ యిచ్చింది. అదే "ప్రకృతిపై మానవపోరాట చరిత్ర, విధిపై స్వేచ్ఛాపోరాటం" అని మిషెలా అన్నాడు.

క్రైస్తవ విశ్వాసం వెయ్యేళ్ళపాటు మతేతర విచారణను కప్పిపుచ్చినపుడు మత విజ్ఞానానికి అలంకారంగా చరిత్ర నిలిచింది. అదీ ఒకందుకు మంచిదే అయింది. చరిత్ర విజ్ఞానాన్ని సృష్టించడానికి తొలి క్రైస్తవ మత గురువుల చారిత్రకవాదం పునాదిగా వున్నది. మానవుడు ఈడెన్ వనంలో పతనం చెంది మళ్ళీ ముక్తి పొందే వరకూ మానవచరిత్రను పరిణామ విధానంలో తప్ప, కార్యకారణరీతిలో వినా పునర్నిర్మించవీలులేదు. ముందే విధి నిర్ణయం అనే పిడివాదం కూడా వివేచనాత్మక భావనే. సృష్టి మాయ అనంతరం, శూన్యం నుంచి ఏదీ రాదు. మానవజీవితంలో ప్రతి అడుగూ, మోక్షంగాని, విమోచనగానీ దైవేచ్ఛ ననుసరించే అయినా, కారణంతో

కూడుకునే ఉన్నది. అదే వివేచనాత్మక దృక్పథం. క్యాథలిక్ మత వ్యవస్థను కట్టుదిట్టపరచే నిమిత్తం తొలి మత గురువులు పెంపొందించిన దృక్పథం ఇదే. ప్రాచీన గ్రీకుల అనంతరం తొలిసారి 4 వ శతాబ్దంలో యూసిబిన్ వ్రాసిన మన చరిత్ర మానవ సమాజాన్ని గురించి వ్రాసిన తొలి చరిత్రగా పరిగణించవచ్చు.

తరువాత ఒక శతాబ్దానికి అగస్టిన్ రచన కూడా ప్రపంచసాహిత్యంలో ఆణిముత్యమే. మన దృక్పథాన్ని వివేచనాత్మకం చేసినందుకుగాక, చరిత్రతత్వంలో తొలి వ్యాసంగా దీనికి విలువ ఉన్నది. (సివిటస్ డై)

పదార్థం నాశనం కాదు. భావాలూ అంతే. విజ్ఞానం, తత్వం పెంపొందించిన పితామహులు. చూపిన అన్వేషణజ్వాలను వెయ్యేళ్ళు గాఢాంధకార యుగం కూడా ఆర్పలేకపోయింది. ప్రకృతిపై మానవుడు తొలుత జరిపిన పోరాట సంప్రదాయ ప్రేరణను ఐరోపా క్రైస్తవులు తమది కాదన్నట్లు వదిలేసినా, అరబ్బులు ఆ సంపదను అట్టిపెట్టి, తమ వారసులకు అందించారు. గ్రీకు పండితుల నుండి, ముఖ్యంగా అరిస్టాటిల్ నుండి నేర్చిన అరబ్బు పండితులు, 10వ శతాబ్దానంతరం, చరిత్ర విజ్ఞానంపై కృషి సాగించారు. 14వ శతాబ్దంలో ఇబన్ ఖల్దున్ వ్రాసిన విశ్వచరిత్ర ఇందులో పరాకాష్ఠ. "చరిత్ర విజ్ఞానానికి పితామహుడని" అతని గ్రంథాన్ని పేర్కొన్నారు. గ్రీకు తత్వవేత్తల సెక్యులర్, వివేచనాత్మక ధోరణితో ఉత్తేజం పొందిన అరబ్ సంస్కృతి స్పెయిన్, ఇటలీల ద్వారా ఐరోపాకు చేరింది. ఐరోపా పునర్వికాసానికి యిది ఎనలేని సేవచేసింది. సెక్యులర్ చరిత్రలో మానవతను తిరగదోడినందున, భావ చైతన్యవృత్తం పూర్తయింది. ప్రాచీనతలోని మారు మూలలకు విస్తరించిన వెలలేని ఈ సంపద ఆధారంగా భవిష్యత్తు అభివృద్ధిని వికో సూచించాడు. అతని రచనలలో చరిత్రతత్వం, తత్వచరిత్ర కలిసిపోయాయి. అందుకే వికోను తన గురువుగా మిష్లా భావించాడు. చరిత్రకు సంబంధించిన దృక్పథాలలో హెగెల్‌కు మార్క్సుకు మధ్య విరుద్ధంగా కనిపించే వాటిని మిష్లా సమన్వయీకరించాడు.

"భాషలు, విషయాలు– రెండు చరిత్రల" గురించి వికో ప్రస్తావించాడు. విషయాలంటే సామాజిక రాజకీయ సంబంధమైన మానవ చర్యలనే అతడి ఉద్దేశం. సంఘటనలకు విస్తృతార్థంయిస్తే, భూగర్భశాస్త్రం కూడా చరిత్రలో చేర్చాలి. భాషోత్పత్తి శాస్త్రం తత్వంలో భాగమే. ఆదిమ దశలో భాషా చరిత్రలో తత్వచరిత్ర కలిసిపోతుంది. పదార్థవిజ్ఞానానికి పరిశీలన పరిశోధన ఎట్లాగో, చరిత్ర జ్ఞానానికి విమర్శకూడా అటువంటిదే. వర్తమానాన్ని వివేచనాత్మకంగా వివరించాలంటే గతాన్ని అధ్యయనం చేయాలి. మానవజాతి గతం వర్తమానం మధ్య వివేచనాత్మక సంబంధం గమనిస్తేనే

పరిణామక్రమం విదితమౌతుంది. ఫలితంగా చారిత్రక సంఘటనలకు చెందిన కొన్ని సర్వసాధారణ నియమాలను రాబట్టవచ్చు.

చరిత్రకారుడు అధ్యయనం చేయడానికి గతం సిద్ధంగా అతని ముందు లేదు. కొన్ని రికార్డులు మాత్రం వున్నాయి. అవి రెండు రకాలు పరికరాలు, శిథిలాలు. కళల చేతివృత్తుల అవశేషాలు మొదలైన భౌతిక విషయాలుగా లభిస్తున్నాయి. లిఖితపత్రాలు మానసిక లేదా భావ సంబంధ విషయాలుగా వున్నాయి. ఇవి చాలా ముఖ్యం. వాటి ఆధారంగానే భౌతిక విషయాల ప్రాధాన్యత అవగాహన చేసుకోవచ్చు. లిఖితపూర్వక పత్రాల విమర్శ ఆధారంగా విశ్వ చరిత్రను పునర్మించడానికి భాషోత్పత్తిశాస్త్రం ఒక సాధన. ఆ విధంగా భాషాచరిత్ర కూడా చరిత్ర జ్ఞానంలో భాగమే. ఆదిమ మానవుడి ఉద్వేగాలు, భావాలు వ్యక్తపరచడానికి, ఇతరులకు తెలియజేయడానికి జీవపరిణామంలో మాటలు వచ్చాయి. భావాలను, ఉద్వేగాలను కలిపి సమన్వయీకరించడానికి వీలుగా భాషలు వికసించాయి. ఆదిమ తత్వచరిత్ర అంతా భాషల చరిత్రగా ఆలోచనా పరిణామక్రమంలో వున్నది. భాషోత్పత్తి శాస్త్రం లేకుండా చరిత్ర వ్రాయడం అసాధ్యం కాదు. నాగరికత చరిత్రే తత్వచరిత్ర అని హెగెల్ అనడం ఆమేరకు సరైనదే. వికో చెప్పిన రెండు చరిత్రల నుండి హెగెల్‌కు బహుశా ఇది స్ఫురించి ఉండవచ్చు. ఏమైనా, గతంలోని రికార్డుల అధ్యయనం వలన మానవ చర్యలోని గర్భిత విషయాలను చరిత్ర కనుగొంటుంది. ఆలోచనా చరిత్రగా గతాన్ని సరిగానే పునర్నిర్మించవచ్చు. హెగెల్ సూత్రాన్ని క్రోసే మాటల్లో చెప్పాలంటే, "చరిత్రకారులందరూ ఏదొక రీతిలో తత్వవేత్తలే." చరిత్ర గురించి సర్వసాధారణంగా అంగీకరించే సత్యం ఇందులో వున్నదనవచ్చు.

చరిత్రకు సంబంధించిన భౌతికవాద భావనలో, నాగరికత చరిత్రను వర్గపోరాట చరిత్రతో కలిపేసి, సామాజిక పరిణామంలో మేధస్సుకు చోటివ్వకపోతే, అర్థం లేదు. ఆచరణకు సంబంధించిన తత్వంగా మార్క్సిజానికి అటువంటప్పుడు తావేలేదు. విప్లవాలు అసంభవం అవుతాయి కూడా. చారిత్రకంగా విప్లవాలు అవసరమైనప్పటికీ, విప్లవభావంతో చలించిన మానవులే వాటిని సాధిస్తారు. ఏమైనా, ఉత్పత్తి విధానాల ద్వారా యాంత్రికంగా అభివృద్ధి జరుగుతుండగా, కేవలం ఈ సంఘటనల పరంపరనే చరిత్ర అంటారనుకోవడం అర్థరహితం. చరిత్ర పరిణామ క్రమంలో మానవుడిని తొలగించి చూడ వీలులేదు. సాంఘికశక్తులు ఆది భౌతిక విధానాలు కాదు. సృజనశక్తి గలవాడెప్పుడూ ఆలోచనా జీవికూడా.

ఆర్థిక నియతివాదంలోని సాంఘిక పరిణామం, సాంస్కృతిక చరిత్ర అనేవి

పదార్థవాదం నుంచే తప్పనిసరిగా ఆవిర్భవించవు. ఇందులో ఒకటి తత్వంకాగా, మరొకటి చరిత్రకు భాష్యం చెప్పే పద్ధతి మాత్రమే. తాత్వికంగా, భావాలకు బాహ్య సత్యాన్ని పదార్థవాదం అంగీకరించాలి. కేవలత అనేది జ్ఞానవాదంలోనే సాధ్యం. చరిత్ర ముఖ్యంగా సాంస్కృతిక చరిత్ర, సిద్ధాంతపరంగా నిర్ధారితమైంది. కనుక చరిత్ర నియతివాదాన్ని కేవలం ఆర్థికంగా చూడడం దోషమే. చరిత్ర నిర్ధారితమే కాని ఈ నిర్ధారణకు కారణాలు ఒకటికి మించి వున్నాయి. అదీగాక, నియతివాదం, తార్కిక భావన, నియతి విధానంలో ఇది అంతర్గతంగా వున్నది. బయటనుంచి జోక్యం చేసుకునే శక్తి ఏదీ లేదు. ఒకవేళ అలాంటిది వుంటే, ద్వంద విధానం చోటు చేసుకుంటుంది. నియతివాదంలో ఏకత్వ వాదం అంతర్గతంగా వుంటుంది. కనుక పదార్థవాదంలో నియతివాదం యిమిడివున్నది. కాని ఆర్థిక నియతివాదం ద్వందభావంతో కూడినది గనుక, దీనిని పదార్థవాదంతో తప్పనిసరిగా ముడిపెట్ట వీల్లేదు.

మేథస్సు సృజనపాత్రను, పదార్థవాద చరిత్ర గుర్తించడం తాత్వికంగా అవసరము. భావాల బాహ్య సత్యాన్ని పదార్థవాదం నిరాకరించ జాలదు. భావాలు వాటంతట అవి పుట్టవు. జీవసంబంధంగా భావాలు నిర్ధారితాలు. ముందు జీవి ఉంటుంది. అంటే పదార్థం అన్నమాట. ఇది పాతకాలపు పదజాలం. ఒకసారి జీవసంబంధంగా నిర్ధారణ అయిన భావుకత విధానం పూర్తి అయితే, భావాలు ఏర్పడి, తరువాత వాటంతట అవి వునికిలో కొనసాగనారంభిస్తాయి. పరిణామంలో వాటి క్రమం వాటికున్నది. సామాజిక పరిణామ విధానంలో భౌతికవిధానానికి సమాంతరంగా భావవిధానం కూడా వుంటుంది. భావం, భౌతికం కలిసి చరిత్ర అవుతుంది. రెండింటికి వాటి గతి తార్కికత- చైతన్యత, తర్కం వుంది. ఒకదానిపై మరొకటి ప్రభావం చూపుతూ పోతుంటాయి. ఆ రీతిగా చరిత్ర జీవవిధానం అవుతుంది. ప్రస్తుతాన్ని వివరించడానికి గతాన్ని వివేచనాత్మకంగా అవగాహన చేసుకోవడం అవసరమైతే, భావ, పదార్థవాదాల సమన్వయం, మానవ ఆలోచనా రీతిని అవగాహన చేసుకోవడం అనేదే భవిష్యత్తులో తత్వంగా వుండగలదు. ప్రస్తుతం దారి తెన్నూ లేకుండా వున్న స్థితినుండి, దట్టంగా ఆవరించిన నిరాశ నుండి నిష్పాక్షికతత్వం మానవాళికి కొత్తదారులు చూపి నూతన వెలుగును విరజిమ్ముతుంది.

అంటే పదార్థవాదాన్ని మళ్ళీ చెప్పాలన్నమాట. చారిత్రక, సామాజిక, రాజకీయ సాంస్కృతిక మానవ పరిణామంలో భావ చైతన్య ప్రాధాన్యతకు కచ్చితమైన ప్రాధాన్యతనిస్తూ, తిరిగి ప్రకటించడం అవసరం. జ్ఞానవాద దృష్ట్యా చూస్తే భావవాదం నిరాకరణకు గురైంది. యుగాలుగా తత్వాన్ని గందరగోళపరచిన ప్రత్యక్షదృష్టి సమస్యను,

ఆధునిక శారీరక శాస్త్ర సహాయంతో నవ్యపదార్థవాదం పరిష్కరించింది. పదార్థవిజ్ఞానానికి మనోవిజ్ఞానానికి వారధి నిర్మించడం యిప్పుడు సాధ్యమైంది. మనోవిజ్ఞానాన్ని శారీరక శాస్త్రంతో కలపడంతో యిది వీలుపడింది. ఎంతో ఉన్నతస్థితికి వెళ్ళిన జీవపదార్థాన్నైనాసరే, భౌతిక, రసాయనిక పదార్థాలుగా మార్చేసి పరిశీలించవచ్చు. అంటే బొగ్గు అన్నమాట. బర్గ్‌సన్ చెప్పే జీవశక్తి, డ్రైష్ పేర్కొనే జీవశక్తి వంటి మార్మిక అధి భౌతిక విషయాలను, పరిశోధనకు వీల్లేని రీతిలో, జీవపరిణామంలో ప్రవేశపెట్టడం సాధ్యంకాని పని. అనుభవ పరిధి నుంచి తత్వాన్ని గనుక భావవాదం దూరంగా తీసుకెడితే, అలౌకిక యింద్రియ శక్తులున్నాయని చెబితే, మతానికీ దీనికి తేడాలేదు. స్వేచ్ఛాపిపాసువులకు అటువంటి తత్వంతో పనిలేదు. ప్లేటో పేర్కొన్న విశ్వజనీనాలు ఏనాడో కవిత్వంలో భాగమయ్యాయి. చిత్తశుద్ధి, పొందికగల భావతత్వం యీ ప్రాచీన రుషి చెప్పినదానికి జోడించగలిగిందేమీ లేదు. డీకార్ట్ కాలం నుండీ ఆధునిక భావవాదం ద్వంద్వ విషవలయం నుండి బయటపడలేదు. అది తత్వాన్ని స్థంబింపజేసి మతంలోకి దారితీస్తుంది. పారలౌకికవాదం మాట అట్లా వుంచి, కాంట్ కనిపించే దానికంటే చాలా భౌతికవాది స్పినోజా హెగెల్ చెప్పే ఏకత్వ భావవాదం, తిరగేసిన పదార్థవాదమే.

భావాలకు సొంత చరిత్ర వుంది. మానవజాతి చరిత్ర పునర్నిర్మించాలంటే తత్వచరిత్రే ఆధారం. నాగరికత ఆవిర్భవించినప్పటి నుంచీ భావవాదం పదార్థవాదంలోకి చొచ్చుకుపోయింది. ఇవి రెండూ కలిసి గతాన్ని, వర్తమానాన్ని సమగ్రంగా వివరిస్తున్నవి. భవిష్యత్తులో యింకా తెలుసుకోవలసిన వాటికి వివేచనాత్మక మార్గదర్శకత్వాన్ని అందిస్తున్నవి.

"వాస్తవంకంటే ముందు ఆలోచన పరుగిడితేనే కొత్త విధాలైన నాగరికతల వైపుకు పయనించడం సాధ్యమౌతుంది. జాతులశక్తి యావత్తూ సాహసంతో కూడిన వూహల వైపుకు పోగలుగుతుంది. రానున్న వాటికోసం కలలుగనే లోకం, వాటిని సాధించ గలుగుతుంది. సాహసశక్తి వుంటే, నేడో, రేపో తెలిసిన నియమాలకు, సురక్షిత హద్దులకు మించిపోగలం. నాగరికమైన ప్రయత్నాలలో కొత్త ఆదర్శాలకు దారితీసే గందరగోళం ఏర్పడుతుంది.

భావ తాత్వికులలో అగ్రగణ్యుడైన ఇతని అభిప్రాయాలతో అంగీకరించని భౌతికవాదెవరూ ఉండరు. చరిత్రలో గొప్ప విప్లవాలకు మరొక వివరణలేదు. చరిత్రను మానవుడి మేథస్సే ఎక్కువగా సృష్టిస్తుంది. చరిత్రలో భావాలశక్తిని గమనించకపోతే, భౌతికవాద చరిత్ర కృత్రిమ సిద్ధాంతమౌతుంది. చారిత్రక నియతివాదం దోషబద్ధమైన ప్రతిపాదన అవుతుంది. సామాజిక పరిణామం సాంస్కృతిక చరిత్ర కేవలం ఆర్థిక

శక్తులవలననే నిర్ధారితమైనదనడం, పదార్థవాదం నుండి తార్కికంగా రాబట్టజాలం సరికదా, అనుభవరీత్యా రుజువు పరచలేం కూడా. సాంఘిక తత్వాన్ని సంకుచిత దృష్టితో చూచినా, ఆర్థిక నియతివాదంతో మార్క్సిజాన్ని తాదాత్మ్యం చేసి చూడలేము. ప్రకృతి నియమబద్ధమైనది గనుక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక చరిత్ర కూడా నిర్ధారితమైంది. ప్రకృతిలో వలె చరిత్రలోనూ నిర్ధారణకు ఒకటికి మించిన కారణాలున్నాయి. అందులో మానవ మేధస్సు ఒకటి. చాలావరకు సాంస్కృతిక చరిత్ర భావాల పరంగా నిర్ధారితమైనదే.

ఆర్థిక సంబంధాలపైన ఉండే నిర్మాణాలుగా ఆదర్శ సిద్ధాంతాలను, విధానాలను కొట్టి పారేస్తుంటే, జీవితంలో భౌతికస్థితితో సరాసరి ముడిపెడుతుంటే, చరిత్రలో పదార్థవాద ధోరణి వైఫల్యాన్ని పొందుతున్నది. భావాల తార్కికాభివృద్ధి, కొత్త సాంఘిక శక్తుల ఉత్పన్నత వెనువెంటనే జరుగుతుంటాయి. చరిత్రకు అవే వూతాన్నిస్తుంటాయి. భావం వలన ఆచరణ వస్తుందనడం మినహా, ఏ కాలంలోనూ వాటికి కార్యాకారణ సంబంధం లేదు. కొత్తభావాన్ని పాతభావానికి ప్రస్తావించి చూడాలి. తత్వానికి సొంత చరిత్ర ఉంది. అది అద్భుతాల చుక్కాని కాదు. భావాలవలన ఆచరణకు ఉపక్రమించినట్లే, చరిత్రలో నియతివాదం కూడా ప్రాయికంగా భావమే. భావచైతన్యతను విస్మరించి, ఏకపక్షంగా, కృత్రిమ దృక్పథంతో చారిత్రక నియతివాదాన్ని వివరించడంలో పెద్ద దోషం ఉన్నది.

వ్యవస్థాపిత సాంఘిక వ్యవస్థ తరచు మానవుడి సృజనశక్తికి హద్దులు ఏర్పరచి భౌతికంగానూ మానసికంగానూ గిరిగీసి చరిత్ర గమనాన్ని ఆటంకపరుస్తుంటుంది.

ఉనికి పోరాటంలో జనించిన స్వేచ్ఛాపిపాస, అభ్యుదయ కాముకత, ఈ అవరోధాలను తొలగించడానికి మరింత శక్తివంతంగా పనిచేస్తాయి. గతంలోని సాంస్కృతిక విలువలను, స్వేచ్ఛాభావాలను యిముడ్చుకుని, మానవ ప్రతిభా వ్యుత్పన్నతలను కనీస అవరోధాలుగల కొత్త సాంఘిక వ్యవస్థకై మానవుడు ముందుచూపుతో పయనిస్తాడు. మానవుడి భావసంపద నుండి కొత్త తత్వం ఆవిర్భవించి, సమాజాన్ని పునర్నిర్మించడానికి నాంది పలుకుతుంది.

జీవితంలోని ఉద్వేగదృక్పథంలో మానవుడి సృజన, స్వేచ్ఛలపై విశ్వాసం వుంచడం జీవన సారాంశం. కనుక, విప్లవభావం పరస్పర విరుద్ధ భావంగా కనిపించవచ్చు. వివేచన,ఉద్వేగవాదాన్ని ఒకే పరిణామక్రమంలో యిమడ్చవచ్చునా? చరిత్రతత్వానికి అదీ మూలసమస్య.

ప్రకృతి, చరిత్రల వివేచనాక్రమం నిర్ధారితం. వాటి ధోరణిలో అవి పయనిస్తాయి. మానవ ప్రయత్నంతో వీటిని మార్చలేము. వివేచనాత్మకమైన ఈ అభిప్రాయం వలన

విప్లవం సాధ్యం గాకుండా పోతుంది. వివేచనాత్మకస్థితిని వదలకుండానే ఈ సమస్యను మరొక కోణం నుంచి పరిశీలించవచ్చు. ప్రకృతిలో మానవస్వభావం భాగమే. వివేచనావిధానం నుండే అది జనిస్తుంది. మానవుడి కోరిక, తదనుగుణ ప్రయత్నాలు గూడా నిర్ధారితాలే. కనుక, విప్లవాలు అవసరం కొద్దీ జరుగుతవి. అవి చారిత్రకంగా నిర్ధారితాలు. సాంఘిక పరిణామంలో వివేచనా రీతులుగా, చరిత్రలో హఠాత్పరిణామాలుగా అవి అంతర్లీనంగా ఉన్నాయన్నమాట.

వివేచనకూ ఉద్వేగానికీ తేడా ఏమిటి? ఒకటేమో అవసరమేదో గ్రహిస్తుంది. కనుక అది సాధ్యమౌతుంది. మరొకటి కావలసినదేదో చెబుతుంది. ఏం చేయాలో ప్రకటిస్తుంది. అయితే, విప్లవభావం వివేచనా రహితమా? విప్లవాన్ని ఆచరించడంలో వివేచనకు తావులేదా? విప్లవాలు అవసరం కొద్దీ వస్తుంటే వివేచనకు చోటుండాలి. వివేచనతో పదునుబెట్టిన ఉద్వేగవాదం, సాహసధోరణిలో ఉద్వేగ జీవంబోసుకున్న వివేచనావాదం కలిస్తే, జయప్రదమైన విప్లవాలకు బాట వేసినట్లే.

పైన పేర్కొన్న తర్కం పైకి గందరగోళంగా కనిపిస్తున్నప్పటికి వాస్తవ జీవితపు క్లిష్టతనుండే ఈ తర్కం రాబట్టటం కద్దు. ప్రకృతిలోని వివేచనావిధానం ఎలా పనిచేస్తున్నదో గ్రహించి ఈ సమస్యను పరిష్కరించడం జరిగింది. జీవితంలో సంప్రదాయబద్ధ విధానానికి ప్రజ్ఞాపూరితంగానూ, నైతికంగానూ, ఆమోదముద్రవేస్తుంది వివేచనావాదం. సంప్రదాయబద్ధమైన జీవితధోరణిపై తిరుగుబాటు జరిపేది ఉద్వేగవిధానం. కనుక అది వివేచనారహితం. వివేచనలో మతరహిత ధోరణిని, జీవితానికి ఏదో ప్రయోజనం వుందనే మతధోరణితో కలిపేసి గందరగోళపరిచే తర్కం యిందులో వున్నది. సెక్యులర్ వివేచన మానవుడి ప్రజ్ఞకు చెందినది గనుక యిచ్ఛకు వ్యతిరేకం కాదు. అంటే వివేచనకు ఉద్వేగానికి జీవితంలో విరుద్ధత్వం లేదన్నమాట. విప్లవభావంలో ఇవి రెండూ మిళితమయ్యాయి. సాంప్రదాయాన్ని ఛేదించడానికి ఉద్వేగం అనేది మానవుడిలో పిపాస అయితే, సనాత సత్యాన్ని ప్రయోజనవాద వివేచనను వ్యతిరేకించేదైతే, విప్లవానికి అంతకంటే ప్రోత్సాహకారి మరొకటి లేదు.

ఉద్వేగ జీవనధోరణి వ్యక్తిగతం. మానవుడే ప్రపంచానికి కర్త అనే విమోచన సిద్ధాంతానికి ఇది దారితీస్తుంది. వికో నుండి మార్క్స్ వరకూ చరిత్రలో ఈ భావం పెంపొందినది. వాస్తవానికి ఇది ఇంకా ముందే జనించింది. మతపరమైన నీతివిధానానికి, ప్రయోజనవాదంలోని నిరంకుశత్వానికి ఎదురు తిరిగిన పునర్వికాస మానవుడితోనే ఈ భావం వచ్చింది. సెక్యులర్ వివేచనావాదం ఆధునిక విజ్ఞానం ఆధారంగా ఏర్పరచిన జీవనదృక్పథం. ఇది బాహ్యసత్యం. నియమబద్ధ ప్రకృతినుంచి

వచ్చిన పరిణామక్రమంలో మానవుడిని కేంద్రస్థానంలో వుంచే విధానం ఇది. ప్రకృతి నియమాలకు లోబడి, వాటిని క్రమంగా తన అదుపులోనికి తెచ్చుకుంటూ మానవుడు సాగిపోతుంటాడు. జీవితంలో ఈ రెండు దృక్పథాలకు అట్టే తేడా లేదు. వ్యక్తిగతం, బాహ్యసత్యం అనే విచక్షణను ఆధునిక మనోవిజ్ఞానం తొలగించింది. ప్రత్యక్షజ్ఞానం అనే పాతసమస్యను పరిష్కరించి, జ్ఞానవాద విషవలయం నుంచి తత్వాన్ని తప్పించింది ఆధునిక విజ్ఞానం.

వివేచన, ఉద్వేగ జీవితదృక్పథాలలో పైకి కనిపించే విరుద్ధత్వాల సమన్వయీకరణె మార్క్సిస్టు ప్రయత్నం. తన తత్వంలోని ఈ దృక్పథం బహుశ మార్క్సు కూడా గ్రహించలేదేమో. అందుకే మార్క్సిజంలో తప్పులు దొర్లాయి. పిడివాదనలతోనూ, తప్పుడు భాష్యాలతో మాత్రమే వాటిని సమర్ధించగలం. జీవితతత్వంలో సమగ్రవిధానానికి లోగడ వున్న ఆలోచనాస్రవంతులను కలిపి ఒక దారికి తీసుకురావాలి. అయితే, కొత్త విరుద్ధత్వాలు తలెత్తుతాయి. తత్వచరిత్ర సమాజం అనంతంగా సాగిపోతూనే ఉంటుంది. అది భౌతిక నైరూప్యతలలోకి, అభూత కల్పనలలోకి మానవుడిని లాగకుండా, అనంత అవకాశాలు కల్పించే తత్వమే మానవుడికి ఉత్తమోత్తమమైనది.

✦ ✦ ✦

# మానవస్వభావము

మానవజాతి ఆవిర్భవించి 250 వేల సంవత్సరాలు దాటిపోయింది. ఇది కూడా సుమారుగా అంచనా వేయడమే. మానవ శాస్త్రం ఒకే వంశీయపుట్టుక భావాన్ని త్రోసిరాజన్నది. భూమిపై మానవజీవితాన్ని గురించి చరిత్రలోకి వచ్చిన కాలం బహుస్వల్పం. మిగిలిందంతా ఇతిహాసాలు, కథలు, గాథలు పురాణాలతో ఉన్నది. ఇటీవలే వీటి మూఢనమ్మకాల, కవితల, ఊహల, చారిత్రక ప్రాధాన్యతను గుర్తిస్తున్నారు. ఆవిధంగా చరిత్రను యింకా వెనక్కు విస్తరించవచ్చు. అయినప్పటికీ మానవుల ఆవిర్భావం చరిత్రకు పూర్వకాలంలోనే చాలా వరకు వుండిపోతుంది. ఆసమయంలోనే మానవ స్వభావంలో స్థిరమైన లక్షణాలు ఏర్పడ్డాయి. మానవుడి మానసిక పరిణామంలోని దాగిన గర్భిత విషయాల్ని వెలికి తీయటానికి మానవశాస్త్రం ఆకాలాన్ని అన్వేషించాలి.

మానవుడి బాల్య, కౌమార దశలు జీవపరిణామంతో కాకతాళీయంగా కలసిపోతాయి. కనుకనే ఉత్తరోత్తరా నాగరికత చరిత్రను జీవపరిణామ విధానంగా పరిగణించాలి. అట్లా భావిస్తేనే వివేచనాత్మకంగా వివరించవచ్చు. జీవపరిణామంలో మానవుని బాల్య, కౌమారదశల చరిత్రను జీవశాస్త్రంగా పునర్నిర్మించవచ్చు. చరిత్రకు పూర్వపు ఆదిమానవుడి చరిత్ర చిరకాలంగా వస్తున్న మానవసమస్యపై వెలుగు వెదజిమ్ముతుంది.

మానవారోహణ జ్ఞానం సృష్టి సిద్ధాంతానికి తావులేకుండా చేసింది. భూమిపై మానవుడు తలెత్తటానికి ఒక కొత్త జీవి రావడం తప్ప మరే కారణం లేనందున, జీవపరిణామ సూత్రాలకు భిన్నంగా మానవజాతి అభివృద్ధి నియమాలు ప్రాయికంగా భిన్నరీతిలో వుండే వీల్లేదు. మానవ స్వభావం ఆ నియమాలచే నిర్ధారితమైంది. పరిణామక్రమానికి లోబడిన యీ స్వభావం మారనిదేమీకాదు. మానవస్వభావం ఎన్నడూ మారదనటం వాడుక మాత్రమే. వాస్తవం భిన్నంగా వున్నది. మారడమే మానవస్వభావము. లేకుంటే నాగరికత చరిత్రను పరిణామ విధానంగా చూడడంలో అర్థంలేదు.

జీవపరిణామ విధానమంతటిలో ప్రాణం ఆధారమైనట్లే, "మానవత" కూడా అంతర్లీనంగా యీ విధానం మార్పులో వున్నది. జంతువుల నుండి ఆదిమ మానవుడి

గుర్తించని కాలంలోనే యీ "మానవత" లక్షణం వున్నది. మానవ పుట్టుకకు ముందే మానవత లక్షణాలున్నాయన్నమాట. మానవుడి ఆవిర్భావానికి తార్కికమైన సిద్ధాంతమిది. కొత్త జీవి తలెత్తడం పరిణామక్రమంలో ఒక హఠాత్పరిణామం. గుణాత్మక మార్పు కృత్రిమంగా పనిచేస్తుంది. ఈ విధానంలోని జీవరూపంలో మాత్రం ప్రధానమైన మార్పేదీ వుండదు. శారీరక నిర్మాణంలోగాని అంగనిర్మాణంలోగాని ఆదిమమానవుడి మెదడు నిర్మాణంలోగాని, పరిమాణంలోగాని మనుష్యునితో పోలిన కోతి మెదడుకు భిన్నంగా వుండదు. మానవతకు ఆధారమైన మానసిక, ఉద్వేగ సాధన సంపత్తి అంతా ఒకదాన్నుంచి మరొకటి సంక్రమింప జేసుకున్నందున, జీవపదార్థం ఆవిర్భవించి నప్పటినుంచి జీవపరిణామక్రమంలోనే మానవత పుట్టిందన్నమాటే.

నిర్జీవ జీవప్రపంచం మధ్యగల అఖాతాన్ని విజ్ఞానశాస్త్రం తొలగించింది. ఈ రంగంలో ఎన్ని మూర్ఖపు సందేహాలున్నప్పటికీ, నిర్జీవపదార్థం నుండే జీవం పెరిగింది. రెండింటికీ కార్యాకారణ సంబంధం ఉంది.

ఆ రంగంలో వున్న సందేహాన్ని తొలగించటం ఈ గ్రంథలక్ష్యం కాదు. సృష్టి సిద్ధాంతం అనవసర భావన అనీ, విజ్ఞానం దాన్ని త్రోసిరాజన్నదనీ చెప్పటం వరకే యిక్కడ ముఖ్యం. భౌతిక ప్రపంచమే యీ జగత్తు. నియమబద్ధమైన జగత్తులో జీవస్వభావం ఒక భాగము. తార్కికంగా చూస్తే-జీవపరిణామము నిర్ధారితమైందే. డార్విన్, వాలేస్ పరిశోధనలు ఈ తార్కికభావనలోని ప్రాపంచికానుభవంతో సరిపోతున్నవి. పరిణామ సిద్ధాంతానికి తావిచ్చిన యీ అనుభవాల జీవస్వభావంలో వివేచనను కనుగొన్నాయి. "పదార్థ రసాయన శాస్త్రాలు అధ్యయనం చేస్తే ప్రకృతి రీతులలో జోక్యం లేదని శారీరకశాస్త్రం చెబుతున్నది. అలాగే వివేచనకు లొంగని సాధారణ జీవితానుభవాలకు తెలియని సూత్రాలేవీ పరిణామంలో లేవు."

నియమబద్ధ భౌతిక విశ్వంలో జరిగే జీవపరిణామం కూడా హేతురీతే. జీవితమనేది సహజ జ్ఞానం వలె వివరించలేనిదేమీ కాదు. అందులో మార్మికమైన ప్రయోజనతృష్ణ కూడా లేదు. అదొక నిర్ధారితరీతి. అది భౌతిక పదజాలంలో చెప్పాలంటే ప్రకృతిలోని హేతువును పొరలు తిప్పటమన్నమాట. దైవరహస్యాలు బయటపెట్టామన్న మతాల నిర్హేతుకత్వాన్ని హేతుబద్ధం చేయవలసి వచ్చేటంతవరకూ ఈ అవసరం రాలేదు. అప్పుడు తాత్కాలికంగా దైవసిద్ధాంతంతో హేతువును కలిపేశారు. ఆదిమానవుడి అర్థరహితమైన దైవభావాన్ని సమర్థించుకోవటానికి దైవభావాన్ని, ఈశ్వరసిద్ధాంతాన్ని మత జ్ఞాన తత్వంలో యిమిడేటట్లు చేయటానికి యిట్లా చేశారు. జంతువుల నుండి ఆదిమ ప్రేరణగా మానవజాతికి సంక్రమించిన హేతువు ప్రభావంలో యుగాలుగా

ఈ ఆలోచన పెంపొందింది.

వివేచన సాధారణమైన ప్రేరణాత్మక భావన. వస్తుగత అనుభవం మరో వస్తుగత అనుభవంతో సంబంధం కలిగి వుంటుందనేది యిందులో ముఖ్యాంశము. ఈ అనుభవం లోగడ వుండొచ్చు. వుండకపోవచ్చును. అయితే వీటి సంబంధాలవలన ప్రపంచానికి సంబంధించిన అనుభవం విదితమౌతున్నది. ఆకారణంగా సంబంధాలున్నాయని భావించడం కద్దు. ఇక్కడ నమ్మకం అంటే వాస్తవాలకు సంబంధించిననే నిర్వచించాలి. ఆదిమానవుడి మంత్రజాలం, తాయెత్తు, విద్య అన్ని పదార్థాలలో ఆత్మవిశ్వాసం సహజమత భావన ఆలోచనలన్నిటిని ఈ కార్యాకారణ భావనరీత్యా చూడాలి. జంతుప్రపంచంలో చైతన్యత ప్రాణానికి చెందినది. అంటే పరిసరాలను తెలియుట అన్నమాట. సాధారణంగా తెలియటం ద్వారా పరిసరాలకు జీవి స్పందిస్తుంది. ఆ పరిణామ దశనుండి నాడీమండలం పెంపొంది పరిసరాలకు శరీరానికి గల పరస్పర సంబంధాలకు తోడ్పడుతుంది. ఆ విధంగా పెంపొంది మెదడుతో పరాకాష్ఠకు చేరుకున్నది. అదే మనస్సు, చిత్తప్రవృత్తికి, ఆలోచనకు మామూలుగా పరిసరాలను తెలుసుకోవడానికి అత్యున్నత రూపకల్పనే మనస్సు. ఇది జీవిత సొత్తు. పరిసరాలను తెలుసుకొనే మనోపరిధి క్రమంగా ప్రకృతినంతటినీ తెలుసుకునేటంత వరకూ, విస్తరిస్తుంది. నియమబద్ధమైన ప్రకృతి విధానాన్ని తెలుసుకున్న మానవ మనస్సు తప్పనిసరిగా ప్రాయికంగా వివేచనాత్మకమైనదే.

వివేచనలోని ప్రేరణాత్మక దశవలన ఆదిమానవుడి విజ్ఞానానికి కట్టుబడిపోయింది. జీవపరిణామంలో మానవుడికి ముందు ఆవిర్భవించినది గనుకనే యిది ప్రేరణ అయింది. "వస్తువును పోలిన వస్తువును కలిపి చూసుకునే అనుభవం పశువులకు ఉన్నది. అట్లా చేయలేకపోతే అవి ఒక్కరోజు కూడా బ్రతకలేవు."

డార్విన్ ఉత్తరోత్తరా తన రచనలలో మానవుడి మానసిక రీతులన్నీ జంతు మనస్తత్వానికి ప్రస్తావించవచ్చునన్నాడు. తరువాత, మానవ శాస్త్రజ్ఞులు సాంస్కృతిక చరిత్రకారులంతా ఈ భావాన్ని పెంపొందించారు. ఉదాహరణకు 1927 లో రాబర్టు బ్రిఫాల్ట్ వ్రాస్తూ "జంతు ప్రవర్తనకు పోలిన ప్రేరణలు జీవులన్నిటికీ సాధారణంగా వర్తించే ఆదిప్రేరణల ప్రాతిపదికగానే వైజ్ఞానిక మనస్తత్వ శాస్త్రాభివృద్ధి సాధ్యపడిందన్నారు."

అటవిక మానవుడికి మనిషి పోలిన కోతికి తేడా చూపటానికి భావాలోచనే ప్రధానం. అక్కడ కూడా అంగనిర్మాణంలో అట్టే తేడా లేదు. భావాలోచన భాషపై ఆధారపడుతుంది. ఖచ్చితమైన భావాలను వెల్లడించడానికి మాటల్ని ఉపయోగించిన

తరవాతనే మానవుడిని జంతుకోటి నుండి వేరుగా భావించడం సాధ్యపడింది. అంతమాత్రాన, జంతుజాలంలో వస్తువులను సంఘటనలను కలిపి చూచుకోటం, ప్రవర్తన ద్వారా ఉద్రేకాలను వ్యక్తపరచటం బొత్తిగా లేవనుకోరాదు. కొన్ని శబ్దాల ద్వారా అవి కూడా ఉద్రేకాలను తెలియజేస్తాయి. చింపాంజీలపై కోస్లర్ పరిశోధనలు యీ సందర్భంలో ఉపకరిస్తాయి. వాటికి "ఉన్నతమైన తెలివి" వున్నదనీ, రోజూ ఎదుర్కొనే సమస్యలను పరిష్కరిస్తాయని అతను నిర్ణయించాడు. అయితే వాటి దృష్టిలోబడే వస్తువుల ప్రేరణపైనే ఫలితాన్నిచ్చే ఆచరణ వుంటుందన్నాడు.

నాటి మానసిక స్థితి నుండి మానవుని ఆలోచనా శక్తి గల స్థాయికి చేరుకోవటానికి చాలా కాలం పట్టింది. ఏమైనా మానసిక పరిణామంలో కార్యకారణ సంబంధం తెగిపోలేదు. భావాలోచనకు ఆధారం జ్ఞాపకమే. అది జంతువులకున్నది. వాటి ప్రవర్తన పరిశీలిస్తే యీ విషయం స్పష్టమౌతుంది. జంతువుల నుండి వచ్చిన జ్ఞాపకశక్తికి ఆదిమానవుడు మాటలు తగిలించాడు. కనుక గతానుభవాల్ని సులభంగా గుర్తుంచుకోగలిగాడు. వస్తుగత అనుభవాలను ఒకదాన్నుండి మరొకటి వేరుచేయగలిగాడు. తత్ఫలితమే భావాలోచన ఆలోచన మానసిక ఊహల్ని ప్రేరేపించింది.

నమ్మటమే మానవస్వభావమని చిరకాలంగా వాడుక వున్నది. ఆదిమ మానవుల మానసిక, ఉద్వేగ జీవితాల్ని బాగా పరిశీలిస్తే యీ భావాన్ని తృణీకరించాల్సిందే. మానవుడి పరిణామంలో బాల్య, యవ్వన దశల్లో యీ నమ్మకం కొనసాగింది. ఆదిమ మానవుడు ఆలోచించకుండా మూఢనమ్మకాల్ని ఒప్పేసుకున్న రీతి నేటి నాగరిక సమాజంలోనూ కొద్దిగా మిగిలివున్నది. సత్యాన్ని బయటపెట్టాయన్న మతాల నిర్హేతుకాల్ని నమ్మించటానికే యిది తోడ్పడింది. మానవుడి స్వభావంలో లక్షణాన్ని మరోవిధంగా చెప్పవచ్చు. మానవుడు సహజంగా మూఢనమ్మకాలతో కూడినవాడు. మూఢనమ్మకం అజ్ఞానం వలన వచ్చింది. అంటే అజ్ఞానమే మానవుడి సహజస్థితి అన్నమాట. దీన్నే సంప్రదాయకంగా సామెతగా "అజ్ఞానమే చిదానందం" అన్నారు.

ఆదిమానవుడి ప్రేరణాత్మక వివేచనలోని మూఢనమ్మకాలను పరిశీలించిన మానవ శాస్త్రజ్ఞులు, సాంస్కృతిక చతరిత్రకారులు శూన్యం నుండి ఏదో రాదని ప్రతిదానికీ కారణం ఉందనీ చెప్పారు. ఆదిమ మానవుడికి యిది స్పష్టంగా మనస్సులో లేదు. అందుకే యిది ప్రేరణ. అదొక జీవ విధానం. భౌతిక ప్రపంచంతో కార్యకారణ సంబంధం యీ ప్రేరణకు వుంది. ప్రేరణాత్మక వివేచన ఆదిమమానవునిలో అస్పష్ట భావనగా వుండేది. ఈ తొలి ప్రేరణలు శారీరక స్పందనలుగా వాటంతట అవి పని చేసేవి. ప్రేరణాత్మక వివేచన అలౌకికంలో నమ్మకాన్ని కాదంటుంది. మానవుడు

ప్రకృతిలో భాగం. మాతృమూర్తి అయిన ప్రకృతికి అంటిపెట్టుకుని వున్నంతవరకు, ప్రకృతికి అతీతంగా అతని మనస్సు వూహించలేదు. ఆదిమమానవుడికి దైవాలోచనగాని, ప్రకృతికి అతీతమైన తీరుగాని లేదు. ఆదిమానవుడి మానసిక లక్షణం"నాస్తికత్వం" లబ్బక్ వంటి నాగరికత మూల పరిశోధకులు నిర్ణయించారు. "అంటే దైవాన్ని కాదన్నాడని అర్థం చేసుకోరాదు. అసలా విషయమే అతని మనసులో లేదు. వీరే యింకో చోట స్పష్టం చేస్తూ– ఆదిజాతులకు మతం లేదు. మతం అనబడేది తలెత్తేసరికి నేడు మనం చూస్తున్న మతానికీ దానికీ చాలా తేడా వుంది. అది యీ ప్రపంచ సంబంధమైందిగాని మరొక దానికి చెందినది కాదు. దేవతలంతా మానవులే, మరణాతీతులు కారు. వారంతా ప్రకృతిలో భాగమే. ప్రకృతి కర్తలు కారు." ఇంకొకచోట అదే గ్రంథంలో యిట్లా అన్నారు."ఉన్నతజాతులు అలౌకిక విషయాలకై ఉపయోగించే పదజాలమంతా తొలుత పదార్థ సంబంధమైన అర్థంతో కూడినదే." టేలర్, ఫ్రేజర్ ఈ ఆధారాల్ని అంగీకరించారు. ప్రపంచవ్యాప్తంగా ఆదిమ జాతులపై పరిశోధన గావించి కష్టపడి సేకరించిన విస్తృత ఆధారాల వలన యిట్లా చెప్పగలిగారు.

జీవసంపద ద్వారా వచ్చిన వివేచనే మానవతకు ఆధారం. ఇంకోవిధంగా చెప్పాలంటే నమ్మటమే మానవ స్వభావం కాదు. స్వేచ్ఛా, పోరాటం, సత్యాన్వేషణ మానవ స్వభావాలు. ఆదిమానవుడిలో కూడా సత్యాన్వేషణ ఉన్నది. ఈ తేడా ప్రధానమైనది. అలౌకిక జీవులపై నమ్మకం వుంచినా, మార్మిక అధిభౌతిక శక్తుల్ని నమ్మినా మానవ స్వభావంలో ప్రధాన లక్షణాన్ని లొంగదీయటమే. అలాగైతే, ఆదిమదశ నుండి మానవుడు పైకి రాగలిగే వాడే కాదు. మానవుడి శరీరం ఆలోచనా జీవిగా మారగానే మనస్సు, చింతనలు జీవపరిణామంలో నిర్ధారితాలైనవి. నియమబద్ధ భౌతిక ప్రపంచం నుండి వచ్చినవి గనుకనే యివి కూడా హేతురీతులే. కనుక ఉత్తరోత్తరా మానవుడి వైజ్ఞానిక, ఉద్వేగాభివృద్ధి అంతా వివేచనాత్మకమే.

ప్రకృతిని దేవుళ్ళమయం చేయాలని మానవుడు ఊహించక పూర్వం, ప్రార్థనలు, బలులు యిచ్చి శాంతింప చేయాలనుకొనక ముందు ఈ ఫలితాలనే మంత్రజాలం ద్వారా సాధించవచ్చని ఆదిమానవుడు భావించాడు. "మన జాతి పరిణామంలో మతానికంటె ముందు మంత్రజాలం తలెత్తింది. ప్రార్థనలు, బలులు ద్వారా దైవాన్ని లొంగదీసుకోవాలనే ప్రయత్నానికి పూర్వం, తన అభిరుచుల కనుగుణంగా ప్రకృతిని లొంగదీసుకునే ప్రయత్నాన్ని మంత్రతంత్రాల ద్వారా చేశాడు."

ప్రపంచానికి సంబంధించిన భావాలలో మంత్రానికి, విజ్ఞానానికి సన్నిహిత పోలికవుందని ఫ్రేజర్ చూపారు. మారటానికి వీల్లేని నియమాలననుసరించి యీ

రెండూ కూడా కార్యకారణ సంఘటనల్ని భావిస్తాయి. వీటి పనితీరు ముందే చూడొచ్చు. కనుకనే జరగబోయేవాటిని వూహించవచ్చు.

“ఏ శక్తి జోక్యం అవసరం లేకుండానే ప్రకృతిలో సంఘటనలన్నీ తప్పనిసరిగా ఒక దాన్ననుసరించి మరొకటి వుంటుందని మంత్రం భావిస్తుంది. ఈ విధంగా చూస్తే, యిందలి ప్రాతిపదిక ఆధునిక విజ్ఞానంతో పోలినదే. ప్రాయికంగా నమ్మకం అంతర్లీనంగా వున్నా గట్టిగా, స్థిరంగా వున్నది. ప్రకృతి సమరీతికి, క్రమత్వానికి అది అవసరం. ఒకే కారణాలు ఒకే సంఘటనకు దారితీస్తాయనటంలో మాంత్రికుడికి సందేహం లేదు. నమ్మకానికి మంత్రం విరుద్ధం. సహజ మతంలో సైతం సహజ సంఘటనల్ని మానవుడి ఆశల కనుగుణంగా దేవతలు నడుపుతారని ఆశించారు. అందుకూ మంత్రం వ్యతిరేకమే. అయినా ఒకదశలో ప్రకృతి, మంత్రమూ, మతమూ సన్నిహితంగా పెనవేసుకున్నాయి. ప్రకృతి మతం కూడా మానవస్వభావంలోని వివేచన వ్యక్తీకరణకు సూచన అని నిదర్శనగా చూపుతుంది. మానవుడి వివేచనలో యిదొక సాధన.

మంత్రజాలం బాహాటంగానూ, సహజమతం అంతర్లీనంగానూ, ప్రకృతి క్రూరశక్తుల అధిపత్యం నుండి విముక్తిచెందే అవకాశం మానవుడికి వున్నదని భావించాయి. వశీకరణ మంత్రాలద్వారా చేయవచ్చునని ఒకటి అనుకుంటే, మనిషికి మించిన శక్తిమంతులైన దేవుళ్ళను సంతృప్తిపరచటం ద్వారా పరోక్షంగా ప్రభావితం చేయగలమని మరొకటి తలచింది. అనుభవంలో మాంత్రికునిశక్తి పరిమితమని తెలిసినప్పుడు మతానికి చెందిన దేవుళ్ళవైపు చూచారు. ఆ దేవుళ్ళను అలౌకిక అమరజీవులుగా కాక, ప్రకృతిలో భాగంగా వివిధ సంఘటనలకు కారకులుగా, అదుపులో వుంచేవారుగా భావించారు. శక్తికి వ్యక్తిత్వరూపాన్ని, స్వేచ్ఛకు మూర్తిత్వాన్ని యిచ్చిన పద్ధతులవి. స్వేచ్ఛకు అధికారం సాధనగా చూచారు. మానవుడి ఆదర్శాన్ని వారు ప్రతిబింబించారు.

ప్రకృతిలో ఆత్మ వున్నదన్న ఆదిమానవుడు ప్రేరణాత్మకంగా అలౌకికశక్తుల్ని నమ్మాడు. ఈ వాదాన్ని సమర్థించేవారు, మంత్రంకంటె ప్రకృతిలో దైవవాదం ముందున్నదని అదే మతానికి మూలమని వాదిస్తారు. ఆత్మను ఆదిమానవుడు పదార్థం కానిదిగా, ఆధ్యాత్మికంగా చూచాడనే దానిపై వీరివాదం ఆధారపడివుంది. పదార్థరహితమైన ఆత్మ, మతానికి మూలసిద్ధాంతమైంది. ప్రకృతిలోని ఆత్మ నుండి యిది జనించిందంటారు. మానవశాస్త్రరీత్యా ప్రకృతిలో ఆత్మవాదం ముందా, మంత్రవాదం ముందా అనేది ముఖ్యం. తాత్వికంగా ఏదైనా ఒకటే.

ఒకవేళ ప్రకృతికి ఆత్మ వున్నదనే వాదనముందేనని ఒప్పుకున్నా మానవుడి

స్వభావం నమ్మటమేనన్న వారివాదన బలపడదు.

ప్రకృతిలో ఆత్మవాదం నుండే ఆత్మసిద్ధాంతం వచ్చింది. ఆవిధంగా ఆదిమానవుడు ప్రకృతిలోని ప్రతిచర్య ప్రయోజకత్వంతో కూడినదని నమ్మేదానికి ఆధారం యిక్కడ మొదలైందని తాత్వికంగా చెప్పవచ్చు. కాని, ఆత్మ శరీరం నుండి వేరుకాదు. అది "ఆవిరిరూపంలో వున్న పదార్థం" వూపిరిగా భావించబడింది. ఇట్లా భావించారనటానికి కావలసినంత తాత్వికాధారాలున్నాయి. హీబ్రూ, సంస్కృతం, గ్రీక్, రోమన్, స్లావోనిక్, అరబిక్ భాషలలో ఆత్మను "ఊపిరి" అనే అర్థంలోనే వాడారు. ఊపిరి శరీరపు సొత్తు. ప్రకృతిలో ఆత్మవాదం ఆత్మను శరీరంలో అట్టిపెట్టింది. "ఒక వస్తువుకు ఆదిమచైతన్యత వున్నదనటం వేరు. చైతన్యత స్వతంత్రించి వుంటుందనీ, దానియిష్టం వచ్చినట్లుపోతూ, నాశనం కాకుండా వుంటుందనటం వేరు. చనిపోయిన తరువాత మానవుడు మరో జీవితంలోకి ప్రవేశిస్తాడని, లేదా జంతుప్రవృత్తిని అవలంబిస్తాడని గాని నాడు నమ్మలేదు. ఆత్మ అంటే జీవితమని అర్థం. ప్రకృతిలో ఆత్మ అనేది జీవసంబంధమైన భావన. అది కేవలం నమ్మకం కాక అనుభవజనితం. "తమకు సరైనదని, కంటితో చూచిన జీవసూత్రాన్ని ఆధారంగా, "ప్రకృతిలో ఆత్మసిద్ధాంతం చెప్పాడు ఆదిమానవుడు. ఆదిమానవుడి తర్కాన్ని గురించి చెప్పాడు టేలర్. ఆదిమానవుడి వివేచనకు ప్రకృతిలో ఆత్మసిద్ధాంతం ఒక వ్యక్తీకరణ అని అధికారికంగా చెప్పవచ్చు. ఇందులో మతవాదన లున్నాయంటేనే మతం సైతం ప్రాయికంగా వివేచనతో కూడినదన్నమాట.

ప్రకృతిలో ఆత్మ వున్నదనే సిద్ధాంతం ప్రకృతి బయట శక్తుల్ని నమ్మలేదు. ప్రకృతిలో సంఘటనలకు, అనుభవాలకు ఆదిమానవుడు వివేచనతో యిచ్చే వివరణే సహజమతం సృష్టికర్త, సర్వశక్తివంతుడైన దైవం లేదా విశ్వశక్తివాదం. గనుక నాగరికత తొలిరోజుల్లో ప్రబలివుంటే సహజసంఘటనలకు కారణాలుగా వర్షం, తుఫాను, తారల చలనం వంటివి ఆదిమానవుడు వెదికేవాడే కాదు. ఈ అన్వేషణే ప్రకృతి దైవాలను కనుగొనేటట్లు చేసింది. ఈ అన్వేషణ అతనిలోని వివేచనకు వ్యక్తీకరణ. ప్రతిదానికి కారణం వుండాలి అనటం, దేవుళ్ళంతా గొప్ప మాంత్రికులనీ, వారి యిచ్ఛముందు ప్రకృతి లొంగుతుందనీ, ప్రకృతి నియమాలు మాంత్రికులకు తెలుసుననే అజ్ఞానమే వారికి దైవశక్తిని తెచ్చిపెట్టిందని భావించారు.

మానవవివేచనతో, అలౌకిక సహాయం వరప్రసాదం లేకుండా కనుగొన్న సిద్ధాంతమే సహజమతం. కొన్ని శతాబ్దాల క్రితం థామస్, అక్వినాస్‌కు యిట్లాంటి అభిప్రాయమే వుండేది. "కొన్ని మతసత్యాలకు మానవవివేచన అవసరం లేకపోగా, అలౌకిక విషయాలు తెలుసుకోటానికి కొన్ని చోట్ల యీ వివేచన అవసరమైంది."

క్రైస్తవేతరుల సహజ మతవాదంతో సమన్వయం కోసం మధ్యయుగాల్లోని క్రైస్తవమత శాస్త్రజ్ఞులు యిట్లాంటి సిద్ధాంతం లేవనెత్తారు. మతాల మార్మికవాదానికి భిన్నంగా దైవం వున్నాడనటం వివేచన ధోరణిగా అంగీకరించవలసి వచ్చింది.

మతానికి ముందు మంత్రయుగం వున్నదని నిర్ధారణకు వచ్చిన అనంతరం, మానవాళిని మరొకదిక్కుగా నడపటానికి ప్రేరేపించిన కారణాలకై ఫ్రేజర్ అన్వేషణ గావించాడు. ప్రకృతికి సరైన సిద్ధాంతాన్ని అన్వేషించే జిజ్ఞాస, ఫలప్రదమైన పద్ధతి అనుసరించే విధానం వున్నదన్నాడు.

ఇన్నాళ్ళు తమ అదుపులో వున్నాయనుకొన్న కొన్ని ప్రకృతిశక్తుల్ని తమ అభీష్టానుసారం మలచలేమని మానవుడు తొలిసారి గ్రహించాడు. పాత ఆలోచనలకు స్వస్తి జరిగింది. సందేహాలు, అస్థిరత్వాలు జనించాయి. ఆదిమ తత్వవేత్త గందర గోళపడ్డాడు. తనతోగాని తనతోటివారితోగాని నిమిత్తం లేకుండా ప్రపంచం సాగిపోతుంటే, తనకంటే శక్తిమంతులైన అదృశ్యశక్తులేవో దీన్ని నడిపిస్తుండాలి. తన మంత్రశక్తిపై ఇన్నాళ్ళు ఆధారపడి వున్నాయనుకొన్న సంఘటనలకు మరేదో కారణం వుండి తీరాలనుకున్నాడు.

మతంతో నీతికి సన్నిహితసంబంధం వున్నదన్న నమ్మకం చారిత్రక పరిశోధనా ఫలితం కాదు. దైవభావంగల ఆదిమానవుడికి మంచిచెడ్డల గురించి గట్టి అభిప్రాయం వున్నది. అయితే అది అతనికి ప్రేరణాత్మకం. అంతరాత్మ వలనగాని, దేవుండంటే భయంతో వచ్చింది కానీకాదు. నీతి ప్రాయికంగా వివేచనాత్మకం "అటవిక నియమం" అనే సూత్రం మానవుడి దురహంకార జనితమే. ఉన్నతదశలోని జంతువులకు ప్రవర్తనా నియమావళి వున్నది. అవే మానవ ప్రేరణలోకి వచ్చాయి. మానవస్వభావం గల జీవసంపదే అది. మానవునిలో అవినీతి విధానాలుగా బయటపడుతుంటయ్. అనుభవం వలన మంచిచెడ్డలను మానవుడు గ్రహిస్తాడు. తనకు మంచిదైతే అందరికీ మంచిదని, తనకు చెడ్డదైతే అందరికీ అంతేననీ చెప్పేస్తాడు. నీతికి అదేమూలం.

ఆదిమానవుడి మంత్రం, ప్రకృతిలో ఆత్మ, తాయెత్తులు, అటవికుని కల్తీ పవిత్రతను పరిగణనలోకి తీసుకుంటే తమ స్వార్థానికై దేవుళ్ళకు చేసిన శాంతిని గమనిస్తే, ఇదంతా మతంలో భాగంగా స్వీకరించకపోతే, మతం తత్వం ముందున్నదని ఆధునిక చారిత్రక పరిశోధన రుజువు చేసింది. తాత్విక ఆలోచనకు వివేచన చుక్కాని వంటిది, గనుక మానవస్వభావం ప్రాయికంగా వివేచనాత్మకమని యీ విషయం రుజువు చేస్తున్నది. తొలి తత్వాలన్నీ సహజ సంఘటనలకు అలౌకిక శక్తులను అన్వేషించకుండా భౌతికంగా వివరించటానికి చేసిన మానవ ప్రయత్నాన్ని చూపాయి.

ప్రకృతి, వివేచనతో, నియమబద్ధంగా వుందని యీ ప్రయత్నాల సారాంశం. అధిభౌతిక వూహలతో, గందరగోళపడకుండా, మతపరమైన వూహలకు ఆకర్షించ బడకుండా, మానవమేథస్సు ప్రకృతికి పొందికగా ఆలోచింపగలిగిందానాడు. తత్వానికీ, మతానికీ వివేచనకూ విశ్వాసానికి గల సంబంధాన్ని పాశ్చాత్య తత్వచరిత్రలో చూడవచ్చు. ప్రకృతిని యధేచ్ఛగా అన్వేషించిన విజ్ఞానం మంచి జీవితాన్ని సాధించటంలో వివేచనాత్మక పథకాన్ని చూపే తత్వాన్ని, క్రైస్తవమతం తలెత్తకముందు శతాబ్దాలకు పూర్వమే గ్రీకులు అభివృద్ధి చేశారు. వైజ్ఞానిక అన్వేషణకు, తాత్వికాలోచనకు ముందున్న ప్రకృతి మతాలు మిడి మిడి మతశాస్త్రాలే. అయితే వీటిని మానవ వివేచనే సృష్టించింది. వారిమతం కల్తీ. వారి దేవుళ్ళు మనుషుల సృష్టి. తమకు ప్రతిరూపంగా మానవులు చేసిన దేవుళ్ళే వారు. వారు నివసించింది ప్రకృతిలో.

ఇతర దేశాల ప్రాచీన నాగరికతా చరిత్రలు యింకా పునర్నిర్మించాలి. ఇప్పటికే మతం ఉత్తరోత్తరా పెంపొందిందనటానికి కావలసినంత ఆధారముంది. ఇండియాలో వేదకాలపు ప్రకృతి మతానంతరం వివేచనాత్మక అన్వేషణలు బయలుదేరాయి. వీటిని ఉపనిషత్తులో సూచనప్రాయంగా చూడొచ్చు. వాటి నుండే దర్శనాలు తలెత్తాయి. వేదాంతం, గీత ప్రవచించిన హిందూమతం తరువాత వచ్చింది. వీటి క్రమంలో స్పష్టతలేదు. హిందూమతం దివ్యదర్శనం కాదు గనుక అభివృద్ధిలో కనిపిస్తున్న తికమకలు ఖాళీలు స్పష్టపడటంలేదు. ఇండియా నుండి దిగజారిపోయిన బౌద్ధమతం చైనా చేరేవరకూ అక్కడ మతం లేదు. ప్రాచీన చైనాతత్వాలలో కన్ఫూషియనిజం వివేచనాత్మకమైనది. టోయిజం సహజమైనది.

విశ్వచరిత్ర వ్రాయటం మాట అట్లావుంచి, ప్రస్తుత ప్రపంచ చరిత్రదశలో పాశ్చాత్యదేశాల ఆలోచనా పరిణామాన్ని నమూనాగా స్వీకరించవచ్చు. క్రైస్తవమతం తలెత్తటానికి ఆరువందల సంవత్సరాలకు ముందు ఆధునిక నాగరికతకు తాత్వికప్రాతిపదికలు వేసిన విజ్ఞాన జీవితం గ్రీసులో పెంపొందింది. వ్యవస్థాపితమతం వెయ్యేళ్ళు పైగా ఐరోపా భావనారంగంపై అధిపత్యం వహించింది. కాని, నాటి గ్రీకుల ఆలోచన వివేచనాత్మకం ఫలితంగా తొలితత్వం పదార్థవాదంగా వున్నది. "తత్వవేత్తలు తలెత్తక ముందే, విశ్వాన్ని గురించి వికాసవంతమైన స్వేచ్ఛతో కూడిన భావన సమాజ ఉన్నత వర్గాలలో వ్యాపించి ఉండేది.

ప్రకృతి బయటకు పోకుండానే థేల్స్ మొదలు అనేకమంది తత్వవేత్తలు విశ్వాన్ని గురించి వివరణ యిచ్చారు. "కారణం లేకుండా ఏదీరాదనే"ది వారి వాదన. అనాక్సగోరస్ "ప్రపంచాన్నేర్పరచే వివేచన" గురించి ప్రస్తావించాడు. రెండువేల

సంవత్సరాల అనంతరం హేతువాదప్రవక్త ఫ్రెంచివిప్లవకారుల్ని ఉత్తేజపరిచాడు. తుదకు రాబస్‌పిర్ వివేచనను దేవత గావించేటంతవరకూ పోయాడు. అపోలోనియాకు చెందిన డయోజనిస్ ప్రపంచం వివేచనాక్రమంలో నడుస్తున్నదంటూ, అదే గాలి అన్నాడు. అణువుల కదలికకు ఆధారమైన యాంత్రిక నియమమే 'లాగోస్' అన్నాడు. లెకిపోస్, పదార్థ శాస్త్రానికి పితామహుడైన డెమొక్రటిస్ ప్రాచీన తత్వవేత్తల భావాల సారాంశాన్ని పిండాడు. అన్ని వస్తువుల ఆవశ్యకతా అనే సూత్రమే ప్రకృతి పరిశీలనకు అవసరమని, ప్రకృతికి సంబంధించిన వివేచనాత్మక జ్ఞానానికి కూడా యీ సూత్రం అవశ్యమనీ పేర్కొన్నాడు. మూలపదార్థాల శాశ్వతసొత్తుగా వివేచనను పరిగణించాడు ఎంపిడోక్లిస్. ఎలియాటిక్ శాఖ పితామహుడు. క్సెనోఫిన్స్ కూడా హేతువాదే.

విషాన్ని పుచ్చుకున్నది సోక్రటీస్ ఒక్కడేకాదు. ఉత్తరోత్తరా క్రైస్తవమత జ్ఞానానికి దివ్యరుషిగా పరిగణించబడిన అరిస్టాటిల్ సైతం సోక్రటీసు గతి పట్టకుండా వుండటానికి ఏథెన్స్ నుండి పారిపోవలసి వచ్చింది. ప్రొటొగొరస్ రచనలన్నీ ధ్వసం చేశారు. ప్రకృతి మతస్థుల ఆగ్రహావేశాలకు ఆహుతి కాకుండా ఆయనా తప్పించుకున్నాడు. అనాక్సగేరస్‌ను బంధించారు. ఎట్లాగో తప్పించుకొని, తనను రక్షించుకొన్నాడు. నాస్థికుడని డైగొనిస్‌ను హింసించారు. పతనమౌతున్న ప్రకృతిమతాన్ని , శక్తివంతమైన క్రైస్తవమత దెబ్బను తట్టుకొని తొలి తత్వవేత్తల వివేచన బయటపడింది. నాస్తికుడైన అరిస్టాటిల్ ప్రమాణాన్ని క్రైస్తవమత శాస్త్రం అంగీకరించటమంటే, ప్రకృతి పగదీర్చుకున్నదన్నమాటే.

అనేక నిర్వచనాలు రావటం, వివేచనాత్మకత లోపించటంతో, స్వేచ్ఛ, సత్యం అనే భావాలు అధిభౌతిక వూహలని ఆచరణవాదులు త్రోసిపుచ్చారు. అయినా జీవపరిణామంలో మానవుడి తేడా, స్వేచ్ఛాపిపాసలోనే కనపడుతుంది. ఇది మానవ తృష్ణ అయితే యిది చైతన్యస్థాయి అడుగున కప్పబడిపోయి చాలావరకు ఉంటున్నది. అసలు ఈ ఉత్సాహమే జీవసంపద. మానవుడికి ముందు జీవపరిణామదశలో స్వేచ్ఛకోసం ఉత్సాహపడటమనే దానికి పదార్థగత అర్థం వస్తుంది. అది మనుగడ పోరాటంగా వ్యక్తమౌతుంది. మృత్యుప్రాయమైన ప్రకృతి శక్తుల ప్రభావాన్ని తట్టుకోగలగటమే బ్రతకటం. బ్రతకటానికి నిర్జీవ ప్రకృతి సంకెళ్ళనుండి జీవులు విమోచన పొందటమేగాక, జీవితపు ఇతర వ్యక్తీకరణలను కూడా తట్టుకోవాలి. కనుక, మనుగడకై జరిగే జీవనపోరాట విజయాలన్నీ స్వేచ్ఛను జయించినట్లే.

ఉన్నత తాత్విక రంగానికి, నైతికభావనకు, చెందిన సత్యమనేదాన్ని మానవస్వభావంలోకి జాడలు తీయటం చాలా కష్టంగా వుంది. సత్యం కేవలం

అధిభౌతికాంశం కాదా? అయితే, మానవ స్వభావంతో దీనికేమీ సంబంధం ఉండదు. మానవస్వభావం భౌతికంగా నిర్ధారితమైంది. పదార్థప్రకృతిలో జీవపరిణామం గర్భితమైనదిగదా, కాని, తత్వాన్ని చెప్పే మానవుడు తలెత్తక పూర్వం, ప్రకృతిని అలౌకిక దేవతలతో నింపకముందు, ప్రకృతికి అతీతంగా విశ్వశక్తి లేదా యిచ్ఛను వూహించక మునుపు, నైతిక విలువలు రాకముందు భావనారంగమంతా శూన్యం కాదు. మానవులకు ముందున్నవాటిలోనూ మానవలక్షణాలున్నవి. మానసలక్షణం మార్మికం కాదు. మానవుడికి మరణం లేని ప్రపంచశక్తికీ ఇదొక లంకె కాదు. ఇదొక జీవసంపద. మనస్సులోని ఉప చైతన్యభాగం. జంతువుల అనుభవాలు, ఆదిమానవుని అనుభవాల కేంద్రమిది. మనోవిజ్ఞాన విషయంగా భౌతిక-రసాయనిక భాగంగా మానవలక్షణాన్ని అధ్యయనం చేయవచ్చు. గనుకనే యిది మార్మికం కాదు. తద్వారా పదార్థ శాస్త్రానికి మానసిక శాస్త్రానికి గల అఖాతానికి తత్వం వారధి నిర్మించవచ్చు. ప్రకృతికీ అన్ని భావనాశక్తులుగల మానవుడికీ బంధంగా మానసలక్షణం పనిచేస్తున్నది. మానవుడు సృష్టించిన అధిభౌతిక భావనలు, నైతికవిలువలు కూడా భౌతికంగా నిర్ధారితమైనవి. ప్రకృతిమాతకు మానసలక్షణం ఒక బిడ్డే.

సత్యం అధిభౌతిక భావన కాదు. అదొక మానవ అనుభవం. అది వాస్తవం. బయటి వాస్తవానికి పోలి సత్యం ఉంటుంది. రెండు వస్తు అనుభవాల సంబంధమిది. కనుక జ్ఞానవిషయంగా సత్యం ఉంటుంది. జ్ఞానమేశక్తి అన్న నానుడి వట్టిమాటలు కావు. మానవ అనుభవ సారాంశమిది. జీవకోటి మనుగడ పోరాటం గుడ్డిగా సాగింది. ప్రకృతి జ్ఞానాన్ని ఆధారంగా, ప్రకృతి శక్తుల నిరంకుశత్వాన్నుండి విమోచనకై మానవుడు పోరాడుతాడు. జ్ఞానం ఎక్కువయ్యేకొద్దీ విమోచనపోరాటం ఫలప్రదమౌతూ వుంటుంది. ఆదిమానవుడిలో జీవసంపదగా వచ్చిన స్వేచ్ఛాపిపాస, జ్ఞానార్జనకు దారితీసింది. జ్ఞానం శక్తినివ్వగా ప్రకృతి శక్తులపై పోరాటం సాగించ వీలైంది కనుక, సత్యాన్వేషణ స్వేచ్ఛాపిపాసతో ముడిపడివుంది.

# నియమబద్ధ ప్రకృతి

తత్వచరిత్రలో పేర్కొనదగిన వాస్తవమేమంటే థామస్ అక్వినాస్, ఆల్ బర్టస్ మాగ్నస్, డన్స్ స్కోటస్, ఓటమ్ మొదలైన క్రైస్తవమత శాస్త్రజ్ఞులు, పండితులు, నియమబద్ధ విశ్వభావాన్ని రూపొందించి, పెంపొందించారు. ఈ ధోరణి గియర్కానో, బ్రూనోక్యూసా, కోపర్నికస్, గలీలియో వంటివారిని ప్రోత్సాహపరచి ఆధునిక విజ్ఞానానికి పునాదులు వేయటానికి తోడ్పడింది. ఈ భావన లేకుంటే విజ్ఞానం సాధ్యమయ్యేదికాదు. అంధకారబంధురమైన యీ మధ్య శతాబ్దాలలో ఆధునిక విజ్ఞాన బీజాలు నాటుకొని పెరిగాయి. ఆ మధ్యకాలంలో దివ్యదర్శన మతసంబంధమైన మార్మికవాదం బాగా అధిపత్యం వహించింది. యుగాలుగా జరిగిన పోరాటంలో విశ్వాసంపై వివేచన జయించింది.

అయితే క్రైస్తవశకపు తొలి వెయ్యేళ్ళలో కూడా కేవలం విశ్వాసమే వివేచనను కప్పిపుచ్చలేకపోయింది. ప్రాచీన సాంఘికవ్యవస్థ విచ్ఛిన్నం గావటంతో ఆధ్యాత్మిక గందరగోళం అలముకొన్నది. ఫ్రాయిడ్ పేర్కొన్న బుద్ధి జాడ్యజనితోన్మాదులు (Paranoiacs)తమ భ్రమల్ని వాస్తవాలు గావించడం ద్వారా ప్రపంచాన్ని సక్రమం గావించాలని తలచిన రోజులవి. బాధామయమైన వాస్తవాలను సంస్కరించి ఆనందపూరితం చేయాలనే జనభ్రాంతి వ్యాపించింది. చాలామంది బుద్ధిజాడ్య జనితోన్మాదుల కలయిక యిందుకు తోడ్పడింది. కాని ఈ వైకల్పికాలను తొలగించి వివేచనతో కూడిన మానవ స్వభావం సర్వశక్తివంతుడైన భగవంతునిపైనా అతనికంటె శక్తిస్వరూపులైన అతని వంధిమాగధులపైన తిరుగుబాటు గావించింది. వాస్తవానికి దివ్యదర్శన మతాలకు చెందిన మార్మికవాదం కూడా మానవస్వభావంలోని వివేచనకు చెందిన వక్రమార్గరూపమే. ప్రకృతిలో క్రమత్వాన్ని మార్మికవాదం త్రోసెయ్యదు. కాగా పరిశీలనకు వీలుగాని దైవేచ్ఛకు ఆపాదిస్తుంది. మానవ మేధస్సుకు అందని గొప్ప పథకం అది. "జీవితపు విలువల్ని మతం కించపరుస్తున్నది. వాస్తవ ప్రపంచదృష్టిని మార్చేసి అభూతకల్పన చేస్తుంది. మేధస్సును ముందుగా చిత్రహింస చేస్తుంది. మానసిక శైశవదశను బలవంతంగా నిర్ధారించి జనం నమ్మేరీతుల్లో జొప్పించడం ద్వారా చాలామందికి నాడీరుగ్మత రాకుండా మతం కాపాడుతున్నది. కనుక అస్తికత్వపు

సముద్రంలో కొట్టుమిట్టాడుతూ బాధపడే ఆత్మకు మార్మికమతం ఒక ఓదార్పు అన్నమాట. ఇది తాత్కాలిక అవస్థ. మతపుట్టుక చరిత్ర కూడా మానసిక సమస్యలతో కూడినదే. మానవ మేధస్సులో అవి గర్భితంగా వున్నాయి. "మానవస్వభావం నమ్మటమే" అంటూ సమస్యల్ని పరిష్కరించబూనటంగాక, స్పష్టమైన ప్రాథమిక ప్రశ్నలతో సమస్య పరిష్కరించాలి.

"మానవులు ఈ అభిప్రాయాలకు ఎందుకు వచ్చారు, ఎలా వచ్చారు? ప్రకృతిలో స్పష్టమైన సాక్ష్యాధారాలు లేకున్నాసరే, అలౌకిక శక్తులవంటి అమూర్తభావాలను రూపొందించే పరిస్థితులు ఆదిమానవుడికి ఏమున్నాయి? దైవమనే అగోచర భావన తొలుత మానవుడికి ఎట్లా తోచింది? అనేక దేవతలనుండి ఒకే దైవం, అపారమైన దైవభావన మానవుడి మస్థిష్కానికి ఎట్లావచ్చింది? దేవుళ్ళున్నారని మానవుడు ఎందుకు తలచాడు? అందులోనూ భిన్న దేవుళ్ళనుండి ఒకే దేవుడు ఎట్లా పయనించాడు? మానవజాతి వైజ్ఞానికాభివృద్ధిని తాత్వికంగా పరిశీలిస్తే యీ ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయి. ఈ అన్వేషణ వలన ఆదిమానవుడు గందరగోళపడిన హేతువాదం నుండి మతం జనించిందని గ్రహించవచ్చు. విజ్ఞాన, తత్త్వపితామహులకు ముందున్న ప్రాచీన జిజ్ఞాసువులు ప్రకృతిని హేతుబద్ధంగా వివరించటానికి నాడు ప్రత్యక్షజ్ఞానం లేక, ఆ పరిస్థితుల్లో అట్లాంటి జ్ఞానం పొందవీల్లేక, ఊహకు ఉపక్రమించాడు. పిచ్చివాడి కలలకు భిన్నంగా కొంతమంది ఊహలతో కూడిన ఆలోచనా సోపానాల్ని ఆరోహించారు. నాగరికత చిగురిస్తున్న రోజులలో, మానవుడి జిజ్ఞాసను సహజమతం శాశ్వతంగా తృప్తిపరచలేకపోయింది. బాల్యావస్థగాక, యవ్వనదశలో అడుగిడిన మానవమేధస్సుకు తృప్తిపరచగల వివరణ అవసరమైంది. "భౌతిక, అధిభౌతిక, నైతికవిషయాన్నింటినీ మానవసమాజ సామ్యాలనాధారంగా ఊహలతో, ప్రతీకలతో వివరించబూనిన ఫలితంగా మతం జనించింది. అదొక విశ్వసామాజిక సోపాధికం. ఆకృతిలో మార్మికత వున్నది. సరిగా చెప్పాలంటే ఇదొక వైజ్ఞానిక ప్రతిపాదన (సోపాధికం) ప్రతిదానికి కారణమున్నదంటూ సహజంగా నమ్మే మానవుడు తన అనుభవ వస్తువులకు కారణం కనుగొనలేకపోతే, వూహించాలి. భిన్న సంఘటనల వూహాకారణాలు తుది కారణానికి దారితీస్తాయి. మతచరిత్రయొక్క ఆధునిక విజ్ఞాన ఫలితాల సారాంశాన్ని ప్రస్తావిస్తూ నిరసన తెలియపరిచే ఒక సమర్థుడు యిట్లా అన్నాడు. "సరిగా అవగాహన కాని అనుభవం వలన దోషపూరిత వివేచన చేసిన ఫలితంగా దైవభావన ఆత్మభావన జనించాయి.

ఈ విషయమై ప్రామాణికమైన వ్యక్తులిచ్చిన మత నిర్వచనాలు, మతాల ఆలోచనా పరిణామం, మూలాన్ని గురించిన తార్కికభావన కూడా సరిపోతున్నవి. ఈ

నిర్వచనాలన్నిటినీ "వైజ్ఞానిక" "ప్రభావితం" అనే శీర్షికల కింద వర్గీకరించవచ్చు. "వ్యాఖ్యానానికై వత్తిడి కలిగిస్తున్న మార్మికదృష్టినే మతంగా గుర్తిస్తున్నట్లు" హెర్బర్ట్ స్పెన్సర్ చేసిన నిర్వచనం వైజ్ఞానికం కిందకు వస్తుంది.

మార్మికం, వ్యాఖ్యానం అనేవి కీలకమైన మాటలు. నాగరికత తలెత్తినప్పటి నుండి మానవుడు ప్రకృతి మర్మాలను వ్యాఖ్యానించ ప్రయత్నిస్తున్నాడు. అంటే ఈ ప్రయత్నంలో మర్మాలకు భాష్యం చెప్పవచ్చని భావన వున్నది. ప్రేరణాత్మక హేతువాదం ఈ భావనకు ఆధారం. ఈ అర్థంలో సైన్సుకూడా ప్రకృతి మర్మాన్ని వివరించ బూనుకుంటుంది. కనుక, మతానికి విజ్ఞానానికి అట్టే తేడా లేదు. అయితే మర్మాలనేవి యింకా కనుగొనవలసిన, తెలియని సంబంధాలతో కూడిన, ప్రకృతి ధర్మాలుగా సైన్సు భావిస్తుంది. వివరణ అనేది సోపాధికం గావచ్చు. ప్రాపంచికానుభవంతో కూడినది కావచ్చు. కాని ప్రకృతి మర్మాల గురించి సమతభాష్యం వూహలతో కూడినది. సహజమతాల దేవుళ్ళు ఏకేశ్వరారాధన లోని పరమాత్మ అనేది విజ్ఞాన సోపాధికానికి పోలివుంటుంది. ఇట్లాచూస్తే, మానవుడి సత్యాన్వేషణలో సైన్సుకంటె వెనుకబడిన భూమికగా మతం ఉన్నది. ప్రాయికంగా ప్రత్యక్షజ్ఞానం పరిమితంగా వున్న ఫలితంగా వచ్చిన హేతువిధానంగా కనిపిస్తుంది. రుజువు పరచటానికి వీల్లేని ప్రతిపాదన చేసినప్పుడు అంటే తగినంత జ్ఞానం లేనప్పుడు, మానవుడు యీ అన్వేషణలో వూహపై ఆధారపడతాడు. ఫలితమే మతం మతానికి సంబంధించిన ఈ దృష్టిని సమర్థులైన పరిశీలకులు యింకా పెంపొందించారు. ఆపదలో వున్న ఆత్మ తన గతి అంతా మార్మికశక్తులపై ఆధారపడి వున్నట్లు భావిస్తుంది. దానికిగల వాణిజ్యపరమైన ఐచ్ఛికసంబంధమైన విధానాన్ని మతంగా శాబిటర్ పేర్కొన్నాడు. గందరగోళంతోవున్న అటవికుడి హేతువాదమే మతం అని పైన పేర్కొన్న భావానికి యిది సరిపోతున్నది. తెలియని ప్రకృతి సంబంధాలు, తీరుతెన్నులన్నీ మానవమేధస్సుకు అతీతమైనవన్నారు. ఊహించిన శక్తులేవో వాటిని నిర్ధారిస్తాయన్నారు. అవి మానవుడి కంటె ప్రాయికంగా భిన్నం కాదు. మానవుడితో వాటికి పొత్తు వున్నది. ప్రకృతి విధానాలన్నీ, మానవ వునికితో సహా నిర్ధారితాలు. ఇదెట్లాగో మానవుడికి తెలియదు. ప్రపంచాన్ని నడిపించే శక్తులపై మానవుడు ఆధారపడాలన్నారు. శాబిటర్ వచ్చిన నిర్ణయాలే ఫ్రాయిడ్ చెప్పిన మతమనస్తత్వాన్ని వెల్లడి చేస్తున్నవి.

జాతుల ఆదిమదశను మానవశాస్త్రం అధ్యయనం చేస్తుంది. అయినా ఫ్రేజర్ చేసిన మత నిర్వచనం సాధారణంగా అన్వయించవచ్చు. అతను మతాన్నిలా నిర్వచించాడు. "మానవుడి కంటే అధిక్యతగలిగి ప్రకృతిపైనా మానవజీవితంపైనా

అదుపుపెట్టి మార్గగాములుగా వున్నట్లు నమ్మబడుతున్న శక్తులను ప్రీతిపరచటం లేదా వాటితో రాజీగా వ్యవహరించటమే మతం. ప్రకృతి మత దేవుళ్ళను బలులతో తృప్తి పరచేవారు. ఉన్నత మతాలలో ప్రార్థన కూడా యీ ప్రయోజనాన్నే చేకూర్చుతుంది. బహుదేవతలుగాని ఏకేశ్వరారాధనగాని మతపరమైన ఆలోచన అతంటికీ నియమబద్ధ ప్రకృతి అనేది ప్రాతిపదికగా ఉన్నది. ఆ నియమాలు ఉన్నత శక్తులేర్పరిచినవే గావచ్చు. అవి మానవజీవితాన్ని నడిపినంతవరకు, ప్రకృతికి చుక్కానిగా వ్యవహరించినంతవరకు వాటిని కనుగొనవచ్చు. అందుకే "ఆలోచనా విభాగంగా" మాక్స్‌ముల్లర్ నిర్వచించాడు. నమ్మకం, ఆలోచన మానవుడి మెదడులో ఒకేపని చేసేవికావు. ఆలోచన హేతువిధానం.

ష్లెర్ మకర్ చేసిన మతనిర్వచనం చాలా ప్రాతినిధ్యంతో కూడినది. "కేవలం దైవంపై ఆధారపడే భావనే మతం. "శాబిటర్ చేసిన వైజ్ఞానిక నిర్వచనంలో పోలిక యిక్కడ స్పష్టం. భావన ఎట్లా పెంపొందుతుంది? సర్వశక్తిమంతుడైన దైవభావన ఎట్లా భావించారు? ఈ భావన కూడా హేతువిధానమే. సహజ సంఘటనలకు కారణాన్ని అన్వేషించటంలో దైవభావన పరిణామం ఆరంభమైంది. ప్రకృతిలో వివిధ సంఘటనల్ని వివిధ అలౌకికశక్తులు అదుపులో పెడతాయన్న ఆలోచన చివరకు ఒకే ఉన్నతశక్తికి దారితీసింది. తుది కారణమనే అధిభౌతిక భావన కూడా హేతురీతే. అందులో అద్భుతాలకు తావులేదు. శూన్యం నుండి ఏదో వస్తుంది అనే ఆలోచనలేదు. అవన్నీ మతనమ్మకాలకు లక్షణాలు. మానవుడు ప్రకృతిని ప్రభావితం చేయజాలడని వాటి నియమాలతో అవి నడుస్తుంటాయనే అనుభవం నుండి మానవుడు పూర్తిగా ఆధారపడటం అనే భావన జనించింది. ఆ నిస్సహాయస్థితిలో, మానవుడు, ఒక పారమార్థిక దైవాన్ని సృష్టికర్తగా, ప్రపంచాన్ని పాలించేవాడుగా వూహించాడు. అట్లా తుది కారణాన్ని వూహించి మార్మికంగానైతేనేమి దాని ప్రభావాలను మానవుడు లోబరచుకున్నాడు. నిగూఢమైన విశ్వాసానికి మానవుడు లొంగిపోలేదు. తనలోని హేతువాదానికి లొంగాడు.

ష్లెర్ మకర్ చేసిన మత నిర్వచన ఫలితం గమనార్హమైంది. "మతభావన ఆధారపడేటట్లు చేసేభావనే. ఈ ఆధారభావన మతాన్ని జనింపచేయటానికి, విమోచన కోర్కెను కలిగించాలి." ష్లెర్ మకర్ నిర్వచన ఫలితాన్ని ఒక నాస్తికమత చరిత్రకారుడు చూపాడు. ఆధారపడటమనే భావన మతంలో రాలేదు. అది ముందే వుండి, మతాన్ని సృష్టించింది. అల్పజీవి (మానవుడు) ప్రకృతి నియమాలపై ఆధారపడి వున్నాడనేది మతాతీత హేతుభావనే. అదే మతానికి విజ్ఞానానికీ సంబంధం. అదొక కార్యకారణ సంబంధం. ప్రకృతి సంబంధాలు పనిచేసే తీరు గురించి జ్ఞానం పెరిగేకొద్దీ యీ భావనలో తీవ్రత తగ్గుతుంటుంది. ఆ జ్ఞానం లేనప్పుడు, అనుభవరీత్యా, ఆధారభావన

మనస్సును బంధిస్తుంది. తన సృష్టిలో కల్పించిన రక్షకునకు తనకుతానే పూర్తిగా లొంగిపోయి మానవుడు చావు అనే భావన నుండి తప్పించుకుంటున్నాడు.

ష్లెర్ మకర్ హేతువాది. సమర్ధన ఫలితమేమంటే కేవలం భగవంతునిపై ఆధారపడటమనేది స్వేచ్ఛాపిపాసను చూపుతుంది. మానవుడు ప్రకృతిని తెలుసుకోవాలను కుంటున్నాడు. జ్ఞానం వలన అతనికి శక్తి లభించి, ప్రకృతి నిరంకుశత్వం నుండి స్వేచ్ఛ పొందుతాడు. ఈ మతాతీత లక్ష్యం సాధించడంలో విఫలుడై విజ్ఞానయుగానికి ముందు మానవుడు, సర్వశక్తిమంతుడైన దైవానికి లొంగిపోయాడు. అతని సహాయంతో, కరుణతో తనకు విమోచన లభిస్తుందని ఆశించాడు. ప్రకృతిపై మానవుడి పోరాటం మతంగా వ్యక్తమైంది. అందులో అలౌకికం లేదు.

విలియం జేమ్స్ తుదకు సమర్ధవంతమైన నిర్వచనం చేశాడు. "అదృశ్యనియమం ఉన్నదనే నమ్మకమే మతజీవితం. దానితో మనం పొందికగా సరిపెట్టుకోవటంలోనే అత్యున్నత మంచితనం వున్నది. కరడుగట్టిన హేతువాది సైతం మతాలోచన ప్రాయికంగా హేతుబద్ధమంటున్నాడు. విడమరిచి వివరించలేని మార్మికతలో ప్రపంచం కప్పిపుచ్చ బడలేదు. ప్రపంచంలో నియమం వున్నది. ఈ క్రమత్వం హేతుభావన కనుక మానవమేధస్సుకు అందుబాటులో ఉంటుంది. తీవ్రధోరణిలోని మార్మికవాదం సైతం మానవుని వివేచనకు విజ్ఞప్తి చేయాలంటే ప్రపంచం నియమబద్ధమనే భావన నుండి తప్పించుకోలేదు. మానవజీవితం ప్రపంచంలో భాగమే గనుక వివేచనతో వుంటుందనేది కూడా యిందలి అంశమే. అంటే, మతం జీవశాస్త్రం నుండి విడిపోజాలదు. కనుక, క్రైస్తవమతం తన తొలి మార్మికవాదం నుండి బయటపడి హేతుబద్ధమైన మతజ్ఞానంలో తేలాల్సిందే. ఆధునిక విజ్ఞానాన్ని కూడా యిదే ప్రేరేపించింది. విశ్వనియమబద్ధత మతాలోచనలో గర్భితంగా వుండి కాలానుగుణంగా మతాలకు అర్హత తెచ్చిపెట్టేదిగా యీ భావన ఉపకరించింది. భావచైతన్యగతి తార్కికమిది.

19 వ శతాబ్దంలో మతవిమర్శ, మతతత్వ విమర్శ అంతా "విజ్ఞానవాదం" "ఐచ్ఛికవాదం" మధ్య చప్పటి వివాదంగా వున్నది. ఈ వివాదంలో తలెత్తిన మనోవిజ్ఞాన సమస్యలు పరిష్కరించటానికి తగిన జీవశాస్త్ర జ్ఞానం వాటికి లేదు గనుక అది నిర్జీవంగా పరిణమించింది. తాత్వికంగా ఈ వివాదం వృధా అయింది. తెలివికి యిచ్ఛకు ప్రధాన తేడాలేదని అరిస్టాటిల్‌కు తెలుసు. మానవుడికి "ఆలోచనాపరమైన కోరిక" గా అతను చిత్రించాడు. మతభావన అంతర్లీనంగా వున్న పిపాస కోరికేగాని లొంగుబాటు కాదు. విమోచనదృష్టి దైవానికి లొంగుబాటు భావనకు దారితీసింది. 19 వ శతాబ్దిలో కొందరు తత్వవేత్తలు తెలివికి యిచ్ఛకు గల సంబంధాన్ని గుర్తించారు. "ఇచ్ఛ అనేది

అప్పుడప్పుడు చైతన్యతకు ఒనగూడుతూ, కొన్నిసార్లు లేకుండా పోయేదికాదు. చైతన్యతలో ఇచ్ఛ అంతర్భాగమే." ఇచ్ఛ వివేచనారహిత ప్రేరణకాదు. దైవానికి కేవలం లొంగుబాటు అనేది తెలివితో కూడిన చర్యే. అనుకున్న ఫలితాలేవో జనిస్తాయనే ఉద్దేశంతో యీ చర్యకు పూనుకుంటారు.

ఏకేశ్వరారాధనతో కూడిన మతాలు తలెత్తేసరికి, మార్మికవాదాల ఆధ్యాత్మిక ఆగమ్యతనుండి మానవుడు బయటపడనారంభించాడు. మానవత్వారోపణతోగల ఏకేశ్వరారాధనను హేతబద్ధం గావించే నిమిత్తం మతవిజ్ఞానం ఒక తార్కిక విధానమైంది. ఏకేశ్వరారాధనే ఒక వివేచానాత్మక భావన. ఆదిమమానవుడి వివేచన. ప్రతిసంఘటనకూ అదృశ్యశక్తి కారణంగా వున్నదనే సహజనమ్మకం వలన అనేకమంది ప్రకృతి దేవుళ్ళతో భూమి నిండిపోయింది. ఆదిమ వివేచనాత్మక భావన ఫలితంగా ఏకేశ్వరారాధన జనించింది. ప్రకృతి మత దేవుళ్ళకూ ఒక కారణం అన్వేషించవలసి వచ్చింది. ఆ అన్వేషణలో సర్వశక్తిమంతుడైన దైవభావన ఏర్పడింది. బహుదేవతలారాధన నుండి, యీ ప్రపంచానికి కర్త అయిన ఒకే దైవభావం జనించడమనేది మతపరమైన తర్కంలో అంతర్లీనంగా వున్నది.

దేవాదిదేవుడు తార్కికంగా రాబట్టిన భావన గనుక, అదే "విశ్వవివేచన" గా తలచవచ్చు. క్రైస్తవ ఏకేశ్వరారాధనకు దారితీసిన పితామహులు సోక్రటీస్, ప్లేటోలు సరిగా యిదే చేశారు. వారి అనంతరం అరిస్టాటిల్ అధిభౌతికంలోనూ, అంతా బ్రహ్మమే అనే స్టాయిక్స్ వాదంలోనూ పరమార్థభావన పెంపొందినది. సృష్టికర్తలో విశ్వాసానికి వీరిరువురూ వ్యతిరేకులే. క్రైస్తవ దైవభావనలో మానవత్వారోపణ వున్నది. ఈ భావనలోని అసంగతాన్ని అమాయకత్వాన్ని మార్మికతలో కప్పిపుచ్చారు. దివ్యత్వమనేది మార్మిక ఆచారమే కదా! లేకుంటే మానవత్వారోపణతో సూటిగా మర్మం లేకుండా ఉండే ఏకేశ్వరారాధన ప్రవాహం వలె కొట్టుకువచ్చే వివేచనకు అవకాశమిస్తుంది. కరడుగట్టిన ఇస్లాం ఏకేశ్వరారాధనలో యీ ఫలితాన్ని గమనించవచ్చు. ఉన్నత దైవభావమనే వివేచనాత్మక ధోరణిపై క్రైస్తవ మతశాస్త్రం ఆధారపడినప్పటికీ "విశ్వవివేచన అని చెప్పినప్పటికీ, వారి త్రిమూర్తిత్వ పిడివాదం వలన ఏకేశ్వరారాధన గందరగోళం గానే ఉంటుంది. అరబిక్ చింతన ఐరోపాలో పాండిత్యప్రకర్షపై ప్రభావం చూపెట్టే వరకూ ఈ గందరగోళం తొలగలేదు. క్రైస్తవమత జ్ఞానం మార్మికతను తొలగించుకొని ఏకేశ్వరారాధనకు నిలబడినపుడు ప్రకృతి నియమబద్ధమనే సూత్రాన్ని చెప్పి ఆధునిక విజ్ఞానానికి నాంది పలికింది. మానవజాతి చరిత్రలో అంతర్లీనంగా వస్తున్న మానవ ఆలోచన గమనార్హమైంది.

అటవిక దశ మానవుడి వైజ్ఞానిక బాల్యదశ. ఆ స్థితిలో ప్రకృతి భిన్న

సంఘటనలవెనుక అదృశ్య ఉన్నతశక్తుల సంకల్పంపై నమ్మకం ఉంచటంతో ఆదిమ వివేచన రూపురేఖలు దిద్దుకుంటుంది. కాలానుగుణంగా అనుభవం వివేచనకు అండగా నిలవగా, మానవుడు మానసికంగా యవ్వనదశకు చేరుకుంటాడు. తన పరిసరాలలో, ప్రత్యక్షానుభవంలో రాళ్ళు కిందపడటం, నీటి ప్రవాహం, ఆకులు గలగల, నీడల కదలిక యిత్యాదులన్నీ భౌతిక కారణాల వలన అని గ్రహించి, అటవిక మానవుడు అన్నిటిలో ఆత్మ వున్నదనే నమ్మినదాన్నుంచి బయటపడతాడు. అదృశ్యశక్తులలో నిరంకుశ సంకల్పం వున్నదనే బాల్యావస్థ విశ్వాసాన్ని క్రమంగా వదిలివేసి, దైవభావన, నియమం వైపుకు ఆదిమమానవుడి మతం పయనిస్తుంది. ఈ మానసిక పురోగమనం ఏకేశ్వరారాధన వైపుకుపోతుంది. అంటే సర్వశక్తిమంతుడు వివేచనతో నియమబద్ధంగా ప్రపంచాన్ని నడిపిస్తున్నాడని అర్థం. అంటే ఏకేశ్వరారాధన మతం మానవుడి వివేచన ఫలితమే.

బహుదేవతారాధనతో కూడిన సహజ మతం నుండి సూటిగా ఏకేశ్వరారాధన జనించలేదు. తొలుత విజ్ఞానం, తత్వం చేసిన విఫల ప్రయత్నాల అనంతరం, అధిభౌతిక నైతిక ఆలోచనలు ఏకేశ్వరారాధన మతాల్ని, ముఖ్యంగా క్రైస్తవమతాన్ని రూపొందించాయి. కనుక అంధకార మధ్యయుగాలలో సైతం గుడ్డినమ్మకం అనేది వివేచనకు పూర్తిగా వూపిరాడకుండా చేయలేకపోయింది. క్రైస్తవమత శాస్త్రజ్ఞుల పాండిత్య ప్రకర్షలో వివేచన నిలదొక్కుకున్నది. వారే విజ్ఞాన, తాత్విక పునర్వికాసాన్ని ఎలుగెత్తి చాటారు. తమ సిద్ధాంతాలకూ గ్రీకుఆలోచనకూ గల కలయికను క్రైస్తవమత పితామహులు సగర్వంగా చూపారు. విశ్వాసం వివేచన పరస్పరం వేరుకాదని వారు గట్టిగా చెప్పారు. శతాబ్దాల అనంతరం పాండిత్యవాదం యీ సిద్ధాంతాన్నే నియమబద్ధ ప్రకృతి భావనగా పెంపొందించినది.

ప్రాచీన ప్రకృతి పరికల్పనలు విఫలం గావటంతో ప్రత్యక్ష జ్ఞానావకాశాలపై సందేహం కలిగింది. ఒకవైపు ప్రకృతి మతదేవుళ్ళపై నమ్మకాలన్నీ, తాత్వికవేత్తల పరికల్పన వలన సడలిపోయాయి. సందేహవాదం, మేధస్సు కుదురుకొనకపోవటం అనే పరిస్థితుల్లో చింతనాపరుడి దృష్టి మానవజీవిత సమస్యలపై ప్రసరించింది. అవి ప్రత్యక్షపరిశీలనకు అందుబాటులో వున్నాయి. గ్రీసు చింతనారంగంలో నాడు “వివేచనా పరులనబడే” సోఫిస్టులు అధిపత్యం వహించారు. ఈ శాఖ వ్యవస్థాపకుడైన ప్రొటొగొరస్ మానవుడే విషయాలకు కొలమానం'' అని ప్రవచించినాడు. ఆ తరువాత మానవవాదానికి అదే మార్గగామి అయింది. సంప్రదాయంగా వస్తున్న విశ్వాసాలలో దోషాల్ని, అసంభవాలను సోఫిస్టు ఆలోచన బట్టబయలు చేసి మానవ జీవిత సమస్యల

గురించి దీర్ఘంగా ఆలోచింపజేసేట్టు చింతనాపరుల్ని వత్తిడి గావించింది. సోక్రటీస్ సోఫిస్టు. పవిత్ర ఏథీనియన్ పౌరుడుకూడా. అయినప్పటికీ మతగురువుల ఆగ్రహానికి గురయ్యాడు. ఏకేశ్వరారాధన మతశాస్త్రానికి పునాదులు వేసిన ఫలితంగా, అమరత్వం పొందడానికి మళ్ళీ కిరీటాన్ని ధరించక తప్పలేదు సోక్రటీస్‌కు. అన్నిటికన్నా అతడు వివేచనాపరుడు. దేవుడు, వివేచన అనే పదాల్ని పరస్పరం మార్చుకోవచ్చున్నట్లు అతడు ప్రయోగించాడు. బయోనియన్ తత్వవేత్తలనుండి భేదించి, మానవుడు అనుభవంతో ఆరంభించి నియమాలను రాబట్ట నారంభించాడు. ప్రొటోగొరస్ మానవత్వ సిద్ధాంతాన్ని అతడు యింకోవిధంగా చెప్పాడు.

“మానవుడి నుండి ప్రపంచం వివరించబడింది. ప్రకృతి నియమాల వలన మానవుడు వివరించబడలేదన్నాడు. మానవవివేచన నమూనాలోనే ప్రపంచదృష్టికి సంబంధించిన విశ్వవివేచనను భావించవచ్చునన్నాడు. సోక్రటీస్ చెప్పిన వివేచనాత్మక మానవవాదం నుండి ఇంకో అడుగేస్తే మానవత్వారోపణతో కూడిన ఏకేశ్వరారాధన వస్తుంది. ప్రపంచకర్త అనే భావనను సోక్రటీస్ ప్రతిపాదించి ఆ భావనను హేతుబద్ధం చేయనారంభించాడు. అక్కడ నుండి ప్లేటో అందుకొని క్రీస్తుకు కొన్ని వందల సంవత్సరాలకు ముందే క్రైస్తవ మత జ్ఞానానికి ప్రాతిపదిక సిద్ధాంతాల్ని విపులీకరించాడు. కనుక, తొలి క్రైస్తవమతం బానిస తిరుగుబాటు సిద్ధాంతంకాదు. ఉత్తరోత్తరా రోమన్ సామ్రాజ్యవాద ఫలితమూ కాదు. ప్రాచీనకాలంలో చింతనాధోరణిలో గ్రీకు సైన్సు తత్వాలకు తగిలిన ఎదురు దెబ్బల ఫలితంగా క్రైస్తవ ఆలోచన జనించింది ప్రత్యక్ష జ్ఞానార్జనకు అది హద్దుల్ని ఏర్పరచింది.

సోక్రటీస్ నైతికత్వాన్ని ప్లేటో పెంపొందించి ఒకే దైవభావనలో అందుకు మద్ధతు కనుగొన్నాడు. ఇంద్రియ గోచరం కంటె వివేచనకు అధికస్థానం యిచ్చి, సోక్రటీస్ హేతువాదాన్నుండి దారిమళ్ళాడు. ప్లేటో వివేచన మార్మికభావన అయింది. ఆ విధంగా విశ్వానికి ప్రయోజక వాదాన్ని సమకూర్చగా క్రైస్తవమతజ్ఞానం దాన్ని స్వీకరించింది. అయినప్పటికీ, యాంత్రికంగా, ప్రయోజనాత్మకంగా విశ్వం హాస్యసంబంధం గలదిగా ప్లేటో చిత్రించాడు. ప్రకృతి నియమాల ప్రతినిధులుగా భావాలున్నవి. దేవుణ్ణి విశ్వవివేచనగా ప్లేటో పేర్కొని పదార్థం కంటె ముందుగాక పదార్థంతో పాటే యిదీ ఉనికిలో వున్నట్లు తేల్చాడు. మార్మికపదజాలంతో నిండిన ఈ సిద్ధాంతాలన్నీ పదార్థతత్వంలో కూడా యిమడవచ్చు. అయినప్పటికీ క్రైస్తవమత జ్ఞానానికి యివి తాత్విక పునాదుల్ని సమకూర్చిపెట్టాయి.

ప్రకృతి వస్తువులలో గల “తెలివి పథకం” రుజువులుగా, విశ్వాసానికి

ప్రయోజకవాదాన్ని వూహించాడు ప్లేటో. "ప్రపంచంలోని అన్నీ మిగిలిన వాటికోసం ఉద్దేశించబడినవే. సంపూర్ణతను అట్టిపెట్టడానికి, గుణాధిక్యతను కాపాడటానికే విడిభాగాలు వున్నవి. కనుక దైవవివేచన నుండే అన్ని వస్తువులు వచ్చాయి. ప్రపంచనియమబద్ధ భావనకు యిదొక రూపకల్పన. తుదికారణంతో కూడిన ప్రయోజకవాదం కూడా హేతువిధానమే.

ప్లేటో ప్రయోజకతావాదం ఇంకా స్పష్టంగా అరిస్టాటిల్ "ఆకృతి-పదార్థం" సిద్ధాంతంలో వున్నా, అతను సరైన విజ్ఞాన శాస్త్రాలకు స్థాపకుడు. తనగురువు మార్మికవాదాన్ని నిరాకరించి, ప్లేటో మార్మికవాద ప్రభావానికి లోనైంది. కాని, ఏకేశ్వరారాధన మత విజయానికి హేతుబద్ధమైన మతవిజయానికి హేతుబద్ధమైన మతవిజ్ఞానం అవసరమైంది. కనుక ప్రాచ్యఆచారాల నుండి బయట పడింది. ఆ సమయంలో అరిస్టాటిల్ తర్కం అధిభౌతికవాదం క్రైస్తవమత జ్ఞానానికి ప్రాతిపదిక అయినవి. అతని అధిభౌతికవాదం, నాలుగు కారణాల సిద్ధాంతం కలసి మతతత్వానికి అవకాశం సమకూర్చి పెట్టాయి. పరమాత్మను అత్యున్నతంగా భావించిన అరిస్టాటిల్ పదార్థంలో దేవుణ్ణి ప్రవేశపెట్టాడు. ఆ విధంగా విశ్వాసానికి సంబంధించిన హేతుభావనతో విశ్వాసానికి సమన్వయం చేశాడు. అనుభవం జ్ఞానానికి ఆధారమనే తన సూత్రానికి భిన్నంగా తొలిసూత్రం లేదా తుది కారణం అనుభవేద్యమన్నాడు. ప్రాపంచికానుభవంతో ఆరంభించి, మొండి వూహల్లోకి దిగజారాడు. అదే మధ్యయుగాల మనస్తత్వాలకు వూతాన్నిచ్చింది. అతని భౌతికజ్ఞానం అధిభౌతికమైంది. వస్తువుల వాటి సంబంధాల సరైనజ్ఞానం ప్రాపంచికంగా పొందటానికి తగిన పదార్థతత్వం లేనందున ఆకృతి (భావం) పరిశోధనాంశమైంది. అదే తర్కానికి సాధన. అట్లాంటి వైజ్ఞానికదశలో, చక్కగా ఆలోచించేవారిలో సైతం సందేహవాదాన్ని సృష్టించే రీతిలో తత్వం వూహాపోహల్లోకి దిగజారింది. ఆ వైజ్ఞానిక గందరగోళంలో ప్రాచీన రుషి చాటిన కొత్త విశ్వాసం పట్ల సాధారణ మానవుడు ఆకర్షితుడయ్యాడు. సందేహవాదాన్ని అధిగమించే నిమిత్తం ఊహాతత్వం ఉన్నత మతానికి తావిచ్చి క్రైస్తవ ఏకేశ్వరాధనకు దారితీసింది. అరిస్టాటిల్ హేతువాదం క్రైస్తవమతజ్ఞానానికి పునాది అయ్యింది. హేతువాదాన్ని వక్రంగా అన్వయించిన ఫలితమది. దైవభావన ప్లేటోకు తాత్కాలిక ఆలోచన. కవి వూహజనితం. వాస్తవానికి అదొక ప్రతిపాదన. అరిస్టాటిల్ దాన్ని ప్రాపంచికానుభవంతో నింపి దైవభావాన్ని హేతుబద్ధం గావించాడు.

ఆధ్యాత్మిక సంక్షోభంతో ప్రాచీన సమాజంలోని వైజ్ఞానిక జీవితం గడిచింది. దీన్ని ఆపటానికి సోక్రటీస్ నైతికతత్వాన్ని ప్రవేశపెట్టాడు. కానీ, అధికారికమద్ధతు

లేకపోవటంతో సందేహవాద ఉప్పెనకు అతను నిలబడలేకపోయాడు. సోఫిస్టుల సాపేక్షతా నీతివాదం ఎక్కువగా ఆకర్షించింది. సోక్రటీస్ నైతికతత్వానికి అలౌకిక ఆధారాన్ని కల్పించాడు ప్లేటో. అతని''భావాలు'' మార్మికంగా వుండటంతో సందేహవాదుల్ని ఆకర్షించలేకపోయాయి. ఆధ్యాత్మిక జీవనం స్థిరపడటానికి అరిస్టాటిల్ తుదికారణం తోడ్పడింది. ఏకేశ్వరారాధన మతానికి హేతుబద్ధమైన మతవిజ్ఞానం లభించింది. తొలిసూత్రం– అంటే దైవం నుండి నీతిని రాబట్టాడు. అరిస్టాటిల్ మంచితనం సత్యం కూడా యిదేనన్నాడు. అరిస్టాటిల్ నీతిశాస్త్రాన్ని స్వీకరించిన స్టాయిక్‌లు అతనితోపాటు ప్లేటో తత్వంలోని వూహాపోహల్ని మాత్రం తృణీకరించారు. హెబ్రూ ఏకేశ్వరారాధన స్టాయిక్ నైతిక విధాన మిళితమే తొలి క్రైస్తవ మతంగా ఉన్నది.

సందేహవాదాన్ని స్టాయిక్‌లు ఎదుర్కొన్నారు. వివేచన కానిదంతా ప్రమాదకరం. దేహపు సుఖదుఃఖాలు పరిగణనలోకి తీసుకోరాదు. మానవుడి మేధస్సు సంతోషాన్ని, బాధని మాత్రమే స్వీకరించాలి. తన కోర్కెలతో మానవుడు బానిస అవుతున్నాడు. వివేచన అతన్ని విముక్తుణ్ణి గావిస్తుంది. తన యింద్రియాల్ని అధిగమించి, కోర్కెల్ని తృణీకరించటం మానవుడి కర్తవ్యం. ఆ విధంగా మానవుడు స్వేచ్ఛాజీవిగా, ధర్మప్రవర్తనతో వుంటాడన్నారు.

రోమన్ నిరంకుశత్వంపై తిరుగుబాటుగా తొలి క్రైస్తవమతం వ్యాపించింది. నాడు అవసరమైన మేధస్సును తృప్తిపరచటానికి నైతిక పిపాసకొరకు అది తలెత్తింది. రోమన్ ప్రజలందరికీ ఒక దురదృష్టం పట్టింది. భక్తులకు తోడ్పడేటందుకు అనువుగా ఏమీ చేయలేనందున, సహజమతంలో దేవుళ్ళపై వారి విశ్వాసం సడలింది. ఏ నమ్మకమూ లేనప్పుడు, దిగజారుడుతనం వ్యాపించింది. ఆ నిరాశకాలంలో మనుషులంతా దేవుని ముందు సమానమని క్రైస్తవమతం ప్రకటించింది. రోమన్ ప్రజలు సహజంగా దీన్ని ఆహ్వానించారు. ప్రజాజీవితంలో యిది చొచ్చుకుపోయింది. కనుక శిక్షించటం విఫలంకాగా, కాన్‌స్టాంటిన్ ప్రభువు కొత్తమతాన్ని స్వీకరించాడు. విజ్ఞానం, తత్వం పట్ల తొలిక్రైస్తవమతం జుగుప్స చూపింది. అయితే త్వరలోనే, ప్లేటో స్టాయిక్ ప్రభావానికి గురైనాడు. మర్మవాదం, గ్రీక్ హేతువాదం మిళితమైనట్లు క్రైస్తవ పితామహుల సాహిత్యంలో గమనించవచ్చు. తొలి క్రైస్తవ మతగురువులు ముఖ్యంగా అగస్టిన్ క్రైస్తవమత స్వీకరణకు పూర్వం నాస్తికులుగా ప్రారంభించారు. అయినా కాలానుగుణంగా, తొలి మతగురువులు అవలంబించిన ప్లేటో మతవిజ్ఞాన వివేచన స్థానంలో మార్మిక సంప్రదాయమైన త్రిమూర్తివాదన వచ్చిపడింది. బహుదేవతారాధన గల చోట క్రైస్తవ ఏకేశ్వరారాధన స్థిరంగా నిలదొక్కుకోవటానికి గాను కొంత

రాజీపడటంతో యిట్లా వెనక్కు తగ్గాల్సివచ్చింది.

నేటికీ నమ్ముతున్నట్లుగా అంధకారయుగాలు ఎక్కువకాలం సాగలేదు. ఉత్తరాది నుంచి వచ్చిపడిన అటవికులు, ఆ తరువాత రెండువందల సంవత్సరాలకు తలెత్తి విచిత్రంగా వ్యాపించిన ఇస్లాం సామ్రాజ్యం కూడా అద్భుతాలపైన, విగ్రహారాధన పైనా, చావుదెబ్బ తీసింది. రెండు శతాబ్దాల పవిత్రత అనంతరం క్రైస్తవమతం దిగజారి, అవలంబించిన విగ్రహారాధనకు ఆ గతి పట్టింది. ఉత్తరాది నుండి వచ్చిన వారినుండి రోమ్‌ను కాపాడటానికి అద్భుతాలేవీ అడ్డుపడలేదు. అట్లాంటిక్ తీరం వరకూ అత్యద్భుతంగా వ్యాపించిన ఇస్లాంను క్రైస్తవ రుషులు ఆపజాలకపోయారు. అప్పుడు రోమన్ మేధావులు, విజ్ఞులు, క్రైస్తవాన్ని పవిత్రం చేయాల్సిన ఆవశ్యకతను గుర్తించారు.

ఎనిమిదవ శతాబ్దపు పూర్వార్థంలో విగ్రహారాధన వ్యతిరేకుడైన ప్రభువు, ఇసారియన్‌కు చెందిన లియోకాన్‌స్టాంట్‌నోపిల్ గద్దెనెక్కాడు. విగ్రహారాధన నిషేధిస్తూ అతను చేసిన ప్రయత్నంతో క్రైస్తవమతాన్ని శుద్ధిగావించి, ఏకేశ్వరారాధన మతంగా రూపొందించే ప్రయత్నానికి నాంది పలికింది. అంతటితో బైజాంటీన్ మత విజ్ఞానం ఆరంభమైంది. నమ్మకం ద్వారానూ, వివేచనద్వారా సత్యాన్ని తెలుసుకోవచ్చుననే రెండు మార్గాల పద్ధతి వచ్చింది. ఏకేశ్వరారాధన శక్తివంతమైన మతమని చక్రవర్తి లియోకు నచ్చజెప్పారు. ఇద్దరు యూదు సలహాదారుల ననుసరించి అతను పరిపాలించాడని తెలుస్తున్నది. సనాతనులు అతన్ని మహమ్మదీయునిగా, యూదుగా ఖండించారు. యూదు ఇస్లాం ఏకేశ్వరారాధన మతప్రభావాల వలన బైజాంటిన్ మతవిజ్ఞానం తలెత్తినట్లు దీన్నిబట్టి అవగాహన చేసుకోవచ్చు. లియో భావచ్ఛేదనను మతగురువులు వ్యతిరేకించారు. 125 సంవత్సరాలుగా ఆరుగురు చక్రవర్తులు విగ్రహారాధన వ్యతిరేక ఉద్యమాన్ని కొనసాగిస్తూ పోయారు. ఈ సంస్కరణకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన మతగురువులు సఫలీకృతులయ్యారు. అజ్ఞానంలో మూఢనమ్మకాలలో మునిగివున్న ప్రజల్ని వీరు ఆకట్టుకున్నారు.

విగ్రహారాధన వ్యతిరేకత తూర్పుదేశాల్లో ఓడిపోయింది. పశ్చిమప్రపంచంలో విజయభేరి మోగించింది. క్రైస్తవమతాన్ని భ్రష్టుపట్టించడం పట్ల మతగురువులు ఆగ్రహావేశపరులయ్యారు. అంధకారయుగంలో మఠాలేవిద్యకు ఆటపట్లయినాయి. అరబ్బులు స్పెయిన్‌లో వ్యవస్థాపితమైనప్పుడు, ప్రాచీనగ్రీకుతత్వం, ముఖ్యంగా అరిస్టాటిల్ రచనలు, పశ్చిమఐరోపాలో చొచ్చుకపోయి పాండత్యప్రకర్షకు హేతుబద్ధమత విజ్ఞానానికి ప్రేరేపణలైనాయి. 12 వ శతాబ్దంలో పశ్చిమఐరోపా నూతనమేధావి జీవనంలో బాగా ప్రకోపించింది. అరబ్బు దండయాత్రీకులు స్పెయిన్‌లో స్థాపించిన విశ్వవిద్యాలయాల

ద్వారా ప్రాచీన గ్రీకుతత్వం, అలెగ్జాండ్రియన్ విజ్ఞానం ఐరోపాలో వ్యాపించినవి. మారుమూల మఠాల్లో పవిత్ర మత పండితులు అర్థంపర్థంలేని క్రైస్తవ పిడివాదాన్ని వివేచనతో ఎట్లా పదును పెట్టాలి అని ఆలోచించారు. మతాన్ని వివేచన పరీక్షకు గురిచెయ్యాలని క్రైస్తవమతాధిపతులు భావించక పోలేదు. వివేచన, తత్వం అట్లా వ్యాపించటంతో రోమ్ కలవరపాటు చెందింది. ఈ పాండిత్యప్రకర్షణంతా తమ అధ్యర్యంలో వుంచుకోవటం మంచిదని పోప్‌హిల్డ్ బ్రాండ్ తలచాడు. విద్యాకేంద్రాల స్థాపకులలో ఒకడైన గెర్బర్డ్‌పోప్‌గా గద్దెనెక్కి రెండవ సిల్వెస్టర్‌గా చలామణి అయ్యాడు. అతను అరబ్బుల శిష్యుడు కార్డొవాలో విద్యాభ్యాసం చేసాడు.

12 వ శతాబ్దానికి ముందే పునర్వికాస పునర్జీవన ప్రభావాన్ని పశ్చిమఐరోపా చవిచూసింది. విధివాదాన్ని 9వశతాబ్దంలోనే గ్రీకుసన్యాసి గోట్‌షాక్ ప్రశ్నించాడు. ఆ వివాదంలో అధికారికతపై వివేచన తిరుగుబాటు స్పష్టంగా కనపడుతున్నది. స్కాటస్ ఎరిజెనా, ఆ కాలంలోనే నివశించాడు. తత్వాన్ని మతంతో మిళితం చేయాలని అతడు ప్రతిపాదించి, ప్లేటో అరిస్టాటిల్ పుట్టిన స్థలాలకు యాత్రచేశాడు. పదార్థం శాశ్వతమనీ, దైవంతోపాటే వున్నదని, ఎరిజెనా వాదించాడు.“ప్రకృతిలో ముందు వివేచన. ఆ తరువాత కాలానుగుణంగా అధికారికత వచ్చాయి. కాలంతోపాటే ప్రకృతిసృష్టి జరిగినా, అధికారికత వాటితోపాటే ఉనికిలోకి రాలేదు. కాని వివేచన మాత్రం ప్రకృతి కాలంతోపాటే ఆది నుండీ ఉన్నది. వివేచనే ఈ విషయాన్ని చెబుతుంది. వివేచన నుండే అధికారికత వచ్చింది. కాని వివేచన మాత్రం అధికారికత నుండి జనించలేదు. వాస్తవవివేచన ఆమోదించని అధికారికత లోపభూయిష్టంగానే వున్నది. అయితే వాస్తవవివేచన దృఢంగా, స్థిరంగావుంటూ దాని ధర్మాలతో తనను కాపాడుకుంటూ పోతుంది. గనుక, ఎట్లాంటి అధికారికత కూడా దానికి అవసరంలేదు..

నిసియా తొలిమండలి స్థాపించిన త్రిమూర్తిత్వ సిద్ధాంతం క్రైస్తవమతాన్ని ఏకేశ్వరారాధన వైపుకు పెంపొందకుండా ఆపింది. ఆ పిడివాదాన్ని ప్రశ్నించేసరికి, మార్మికవాదం నుండి క్రైస్తవమతం బయటపడింది. ఆలోచనారంగంలో మార్మికమతం వివేచనతో తలపడాల్సి వచ్చింది. సనాతన గురువులు, ముఖ్యంగా ఇటలీవారు వివేచనవ్యాప్తిని ఆపటానికి ప్రయత్నించారు.

విశ్వాసాన్ని హేతుబద్ధం చేసే నిమిత్తం ఎరిజెనా తత్వం స్వీకరించి అరిస్టాటిల్ అధిభౌతికం, స్టాయిక్‌ల బహుదేవతారాధన కలిపేసి ఈ వింతసమ్మేళనానికి పవిత్ర మతగ్రంథాల దీవెనలు అందజేశారు. పాండిత్య మతవిజ్ఞానం అట్లా తలెత్తింది. కాని ఈ పన్నుగడ పనిచేయలేదు. సనాతనమతాన్ని గురించిన సందేహాలు బాగా

వ్యాపించినందున వాటిని అణచలేకపోయారు. క్రమబద్ధమైన ఆలోచనకై వత్తిడి అధికమైంది. విశ్వాసానికి వివేచనకు తేడా చూపటం ఆకర్షణీయ పద్ధతిగా మారింది. వివేచనాత్మక ఆలోచనకు బాగా అవకాశం యివ్వాల్సివచ్చింది. మతం సవతిప్రేమ కింద మతాలలోనూ వివేచనతోకూడిన ఆలోచన వ్యాపించింది. డ్రేపర్ యిట్లా వ్రాశాడు. "పాశ్చాత్యలోకంలో చైతన్యవంతమైన మేధస్సు నిస్సందేహంగా ముందుకు చొచ్చుకుపోయే లక్షణాలను కనబరుస్తున్నది. ఈ పురోగమన మార్గాన్ని మళ్ళించటం అసంభవం. భూమి, ఆకారం స్థానం గురించి తలెత్తిన మొదటి ప్రశ్న చివరివరకూ ప్రమాదకరమైనదే. విశ్వంలో మానవుడి స్థానాన్ని నిర్ధారించే విషయం కూడా అందులోనే వున్నది. దీంతో మతవిజ్ఞానానికి తిరుగులేని దెబ్బతాకింది. తత్వానికి మతజ్ఞానానికి సిగపట్లు తప్ప యింకేమీ లేకుండాపోయింది..

11 వ శతాబ్దం నుంచీ పారిస్ యూనివర్సిటీ పాండిత్యతత్వానికి ఆస్థానమైంది. చారిత్రకంగా విశ్వాసానికి వివేచనకూ జరుగుతున్న ద్వంద్వయుద్ధం."వాస్తవవాదాని"కి "నామమాత్రపు వాదాని"కి మధ్య వివాదంగా పరిణమించింది. సాహసోపేతులైన చింతనాపరులు ఎరిజెనా తత్వాన్ని పెంపొందించారు. వారిలో రోసిల్లినస్, పీటర్ ఎబెలార్డ్ ప్రముఖులు. తొలి మత గురువులు ప్లేటో "విశ్వజనీనాల" వాస్తవికతను మొదటి రోసిల్లినస్ ప్రశ్నించాడు. అవి కేవలం పేర్లు మాత్రమేనన్నాడు. ప్లేటో సిద్ధాంతాన్ని తృణీకరించి అరిస్టాటిల్‌ను ఆధారంగా చేసుకోవటమే అందుకు కారణం. వాస్తవ ఉనికిలో ఐక్యతకూ క్రైస్తవ త్రిమూర్తిత్వానికే పొత్తు కుదరదని రోనల్లినస్ ధైర్యంగా చాటాడు. అతన్ని మతభ్రష్టుడన్నారు. స్వేచ్ఛ, పురోగమనాలకై అతడు కీర్తిశేషుడయ్యాడు.

కాని, చింతనా ప్రభంజనం అడ్డులేకుండా సాగింది. క్రమంగా సనాతనత్వ పీఠాన్ని వదులుకోవలసి వచ్చింది. అనుకోని చోట్లనుండి మద్దతు వచ్చింది. పారిస్ యూనివర్సిటి వారి "నామమాత్రపు తత్వవేత్తల"(నామినలిస్ట్లు) మతభ్రష్టత్వాన్ని ఎదుర్కొనే నిమిత్తం కౌంటర్ బరీ ఆర్చ్ బిషప్ ఏన్సలం, జై జాంటైన్ తర్కంపై ఆధారపడ్డాడు. ఇది రెండువైపులా పదునుగల కత్తి. "వివేచనకూ విశ్వాసానికీ పొందిక చూపటం ద్వారా వివేచనకుగల అవకాశాల్ని పోగొట్టాడు."

పొందిక నిమిత్తం, రెండూ సమానస్థాయిలో వుండాల్సిన పనిలేదని వాదిస్తూ, వివేచనకు ద్వితీయస్థానం కల్పించాడు. ఏన్సలం అయితే విశ్వాసానికి, వివేచనకూ గల సంబంధాల విషయంలో మానవుడి మేధస్సును సంప్రదించాలని అంగీకరించాడు. ఇందులో ఉద్దేశం మంచిదైనా కాకున్నా పునర్జీవన పొందుతున్న వివేచనా జ్వాలకు యీ వాదం వలన గాలి తోడైనట్లయింది. అయినా అనేక శతాబ్దాల వరకు

వివేచనమాత్రం విశ్వాసం కిందే వుండిపోయింది. (పాండిత్యతత్వం కూడా మతతత్వమే). కాని దివ్యదర్శన మతపెత్తనాన్ని తగ్గించి, భావనాస్వేచ్ఛకు కొత్తదారులు చూపింది.

నామప్రధాన తత్వానికి వేదంవంటి సిక్ఎట్‌గాన్ అనేది ఎబెలార్డ్ ప్రసిద్ధ గ్రంథం. పాండిత్యతత్వపు మౌలికసిద్ధాంతాన్ని డొంకతిరుగుడుగా, సూచనాప్రాయంగా యీ గ్రంథం పేర్కొంటున్నది. మతగురువుల పరస్పర విరుద్ధభావాల్ని చూపుతూ, వారి సిద్ధాంతాలన్నీ దోషపూరితాలని, వివేచన విజ్ఞాన పరీక్షలకు నిలువజాలవని ఎబలార్డ్ రుజువు చేశాడు. ప్రతివారూ తమకు తోచినట్లు వూహించారని, యీ వూహావిషయాలలో సిద్ధాంతపరంగా ఎన్నో అసంగతాలున్నాయనీ అన్యాపదేశంగా అతను చూపాడు. అంతకుముందు మరోగ్రంథంలో విశ్వాససిద్ధాంతాలను, మతమార్మికతనూ, నిరాఘాటంగా చర్చించాడు. అతని సూక్ష్మవిమర్శకు పవిత్రతగాని, రహస్యంగాని అడ్డు రాలేకపోయాయి. త్రిమూర్తిత్వాన్ని ఖండించినందుకుగాక వివేచనకు అగ్రపీఠం యిచ్చినందుకు మతపీఠాధిపతులు అతన్ని ఖండించారు. పెత్తందారీ విధానంపై స్పష్టమైన తిరుగుబాటును వారు గమనించారు. కింది మతగురువుల ధోరణిపై అతను రోమ్‌కు విజ్ఞప్తి చేసుకున్నాడు. కాని మానవవివేచనలో దైవస్వభావాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నించి క్రైస్తవమత విశ్వాసాన్ని వమ్ము చేస్తున్నాడు. అతను స్వర్గంలోకి వెళతాడు. నరకంలోకి తొంగిచూస్తాడు. అతనికి ఆటంకం లేదు. అత్యున్నత స్థాయిలోనూ అథఃపాతాళంలోనూ అతనికి అవధులు లేవు. అతని శాఖలు భూమి అంతా వ్యాపించాయి. రోమ్‌లోనే తనకు శిష్యులున్నారని గొప్పలు చెప్పుకుంటారు. కార్డినల్స్ కళాశాలలోనే తనవారున్నారంటాడు. మతాధికారంతో అతన్ని నోరు మూయించటానికి సమయం ఆసన్నమైంది.' అన్నారు. ఇస్లాం రాజ్యమైన స్పెయిన్‌కు పారిపోవటంద్వారా ఎబెలార్డ్ అమరజీవి కాకుండా తప్పించుకోగలిగాడు.

11వ శతాబ్దంలో రోసిల్లినస్ బోధించిన "నామప్రధానతత్వం" కేవలం వాదనకంటె లోతైనది. అంధకారయుగాన్ని ఛేదించుకొనివచ్చిన తాత్వికకాంతి పుంజమది. మధ్యకాలాల మనస్తత్వాన్ని ఆవరించిన మూఢనమ్మకం పెత్తందారీ తనానికి వ్యతిరేకంగా నిలదొక్కుకున్న సందేహవాదమది. మతంలోని నిమ్నోన్నతాలపైనా, మార్మికమత విజ్ఞానంతో కూడిన మేధాప్రపంచంపైనా గట్టిదెబ్బ కొట్టింది. నామప్రధాన తత్వానికి జన్మస్థానమైన పారిస్ విశ్వవిద్యాలయంలోనే "దైవానికి భిన్నంగా శాశ్వతసత్యాలు చాలా వున్నాయనే" విచ్ఛేదకర సిద్ధాంతాలు తలెత్తాయి. ఈ సిద్ధాంతకర్తయిన జాడిబ్రెస్కను నిలదీయగా, అది మతపరంగాగాక తాత్వికంగా సరైనదన్నాడు. ఈ సూక్ష్మవాదన వలన "మతవిజ్ఞానానికి మించి క్రైస్తవమతం మనల్ని

ఏదీ నేర్చుకోనివ్వటం లేద”నీ, ప్రపంచంలో వివేచనాపరులు తాత్వికులు మాత్రమే” నని మతవిజ్ఞాన బోధనలు కట్టుకథలపై ఆధారపడ్డా”యనే వ్యాఖ్యానాలు బయటకొచ్చాయి.

పశ్చిమ ఐరోపాలో మేధస్సు పునరుజ్జీవనాన్ని త్వరితం చేసినందుకు అరబ్ తత్వవేత్తలకు ధన్యవాదాలు సమర్పించాలి. ప్లేటో మార్మికవాదం, అరిస్టాటిల్ తర్కం, అధిభౌతికంలో కొన్నిభాగాలు మాత్రం క్రైస్తవమతజ్ఞానం స్వీకరించగా ప్రాచీన శిధిలాలనుండి పురాతన గ్రీస్‌విజ్ఞాన, తాత్విక చింతనను త్రవ్వితీసి కాపాడినవారు అరబ్బులే. దాన్ని భద్రంగా అట్టిపెట్టి విస్తృతపరచినవారు అనేకమంది తత్వవేత్తలే. ఇది సాధ్యపరచటానికి ఇస్లాం ఏకేశ్వరారాధన తోడ్పడింది. సర్వశక్తివంతుడైన ఏకేశ్వరారాధన మతదేవుడు శూన్యం నుండి సృష్టిస్తాడు. తరువాత ప్రపంచం తనదారిన అదిపోవటానికి వదిలేస్తాడు. ప్రపంచ సెక్యులర్ వ్యవహారాలలో జోక్యం చేసుకున్నప్పుడు తనస్థితితో రాజీపడతాడు. హిందూకర్మ సిద్ధాంతం కూడా యిట్లాగే జరిపేదేమో కాని హైందవమతం ఎన్నడూ ఏకేశ్వరారాధన కాదుకదా. కనుక, హిందూమత సిద్ధాంతాలు, బౌద్ధమత పతనానంతరం మార్మికవాదలోకంలో నిలిచిపోయి సెక్యులర్ విధానాన్ని, హేతువాద ఆలోచనల్ని పెంపొందించలేదు.

అరిస్టాటిల్ విజ్ఞానరచనల ఆధారంగా పాండిత్య హేతువాదం పెంపొందింది. ఆ రోజుల్లో బాగా ప్రచారంలో వున్న నానుడిబట్టి, అరబ్ తత్వవేత్తలు వైజ్ఞానిక ఉద్యమానికి ప్రోదిచేసారో తెలుస్తుంది. “అరిస్టాటిల్ ప్రకృతికి భాష్యం చెప్పాడు. అరిస్టాటిల్‌కు అవరోజ్ భాష్యం చెప్పాడు. అరబ్ తత్వవేత్తల్లో అత్యున్నతుడు అవరోజ్. వివేచన విశ్వాసాలకు, నియంతృత్వ అజ్ఞానం స్వేచ్ఛాచింతనకు మధ్య సంఘర్షణలో అవరోజ్ సిద్ధాంతం పరాకాష్టనందుకున్నది. ఈ సంఘర్షణ 9 వ శతాబ్దంలోనే ఆరంభమైంది. అప్పుడే మతవిజ్ఞానానికి దీటుగా తత్వాన్ని ప్రవేశపెట్టాడు. ఎరిజెనా, ఎవరోస్‌కు ముందు అంత ధైర్యశాలురు, మేధావులైన చింతనాపరులున్నారు. ఉదాహరణకు ఒకటి రెండు మచ్చుతునకలు పేర్కొనవచ్చు. అవరోజ్‌కు తొలుత సమకాలీనుడు అల్ ఘజాలి. ప్రాచీన గ్రీకులనుండి సందేహవాదాన్ని నేర్చుకున్నాడతడు. మతంతో తృప్తిపడక, చివరకు ఆల్ ఘజాలి “మతాధికారాన్ని తృణీకరించ నిర్ణయించాడు. “విషయాల వాస్తవాన్ని తెలుసుకోవటం నా లక్ష్యం. ఏది జ్ఞానమో నిర్ధారించటం తప్పనిసరి. కొంతజ్ఞానం వలన వస్తునిర్ధారణని సందేహంగా చెప్పవచ్చు. భవిష్యత్తులో దానికి సంబంధించి దోషంగాని , వూహలకుగాని తావువుండదు. 10 అనేది 3 కంటె ఎక్కువని గుర్తిస్తే, ఆ నిర్ధారణను నొక్కి చెప్పటానికి కర్రను పాముగా మార్చాలి. ఆ

మార్పు జరిగితే అది చేసినవాని దోషాన్ని గురించిన నా నమ్మకం మారదు. అతని హస్త లాఘవాన్ని మెచ్చుకుంటానేగాని, నా జ్ఞానాన్ని సందేహించను.” గణితశాస్త్ర పునర్ధారణ జ్ఞానానికి వుండదని, ఇంద్రియజ్ఞానంతో పొందిన జ్ఞానానికే అది సాధ్యమని ఆల్‌ఘజాలి చెప్పాడు. ఇంద్రియజ్ఞానం సరైనదని చెప్పటానికి వివేచన మాత్రమే ఆధారమని అతడు భావించాడు.

కోపర్నికస్‌కు మూడువందల సంవత్సరాలముందు టాలేమీ జగత్తుకు భూమే కేంద్రం అన్నాడు. అండలూషియాకు చెందిన అబూబకర్ ఆ వాదనను తృణీకరించాడు. అతను “ఖగోళవిధానాన్ని , ఆకాశంలో నక్షత్రాల చలనాన్ని గురించి కృషిచేసినట్లు ఆధారాలున్నాయి. అతను గావించిన గ్రహతారల చలనం సరిగా వున్నట్లు తేలింది. దోషాలేవీ కనబడలేదు” అబూబకర్ అనంతరం అతని శిష్యుడు అల్‌పెట్రాగస్ గురువుగారి సిద్ధాంతాలను విపులీకరిస్తూ గ్రంథం వ్రాశాడు. కోపర్నికస్ విప్లవాత్మక పరిశోధనకు ఆ గ్రంథం తోడ్పడింది. ఖగోళ పరిశోధనకు అబూబకర్ సిద్ధాంతం ఎనలేని విలువ సమకూర్చింది. భిన్నతత్వాలకు చెందిన పాండితీవిజ్ఞానులు అల్బర్టస్ మాగ్నస్, రోజర్ బేకన్‌లు కూడా అల్‌పెట్రాగస్ గ్రంథంపై ఆధారపడినవారే.

సైన్సుతత్వంలోనేగాక, మతచింతనలో సైతం అరబ్బుల పాండితీప్రభావం ఐరోపాపై వున్నది. తొలిదశలో, యూదులు, అస్సిరియన్, పర్షియన్, ఈజిప్షియన్, గ్రీక్ వంటి వివిధజాతీయ సంస్కృతుల సమ్మిళితం వలన ముస్లిం లోకమంతా విశ్వజనీకంగా వుండేది. వేరుగా వున్నంతకాలం మరొకరి మతాన్ని అసంభవాల పుట్టగా చూచేవారు. సన్నిహిత సంబంధం వలన అజ్ఞానపు అడ్డుగోడలు తొలగి, పరస్పర అవగాహన గౌరవం సాధ్యపడతాయి. అరబ్బు తత్వవేత్తలు మొదటిసారి అన్ని మతాలకు ఒకే దైవాధారాన్ని, ప్రకృతి నియమబద్ధతను భావించారు. అస్సిరియన్లు, ఈజిప్సియన్లు, గ్రీకులనుండి నేర్చిన అరబ్బు శాస్త్రవేత్తలు శతాబ్దాలపాటు ఖగోళశాస్త్రాన్ని పెంపొందించారు. ఆకాశాన్ని అధ్యయనం చేయటంతో ప్రపంచమంతా జగత్తు అని తార్కికంగా సూచించారు. ఏకేశ్వరారాధన మతభావానికి యీ సూచన విరుద్ధం కాదు. మానవత్వారోపణతో కూడిన దేవుడు విశ్వమంతా వ్యాపించి, తన యిష్టమొచ్చినప్పుడు జీవితంలో ఎట్లాబడితే అట్లా జోక్యం చేసుకోజాలడు. వ్యక్తిపరమైన దైవం తన సృష్టిని పరిశీలిస్తాడు. దాన్ని గురించి తలచుకుంటాడు. తుది తీర్పునాడే ప్రపంచజీవులు అతని అధ్వర్యంలోకి వస్తారు. అప్పటి వరకు జీవులంతా అనుభవించే స్వేచ్ఛను వారు అనుభవిస్తారు.

జీవితం ప్రకృతిలోని మర్మాలను పరిష్కరించే మానవమేధస్సుకు మతాలు

ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు అరబ్బు తత్వవేత్తలు ధైర్యంగా పేర్కొన్నారు. ఏకేశ్వర వాదనవలన జనించిన విశ్వజనీనత ఫలితంగా ఈ అవకాశం వారికి కలిగింది.

ప్రపంచాన్ని గురించిన భావనలో సమూలమార్పు 12 వ శతాబ్దం నాటికే ఆరంభమైంది. ప్రకృతిని గురించి జ్ఞానం విస్తరించటంతో అలౌకిక శక్తులపై నమ్మకం సడలింది. ప్రకృతి నియమబద్ధ జ్ఞానం సూచించింది. విజ్ఞానంపై ప్రాచీన కాలంలో ఏర్పడిన విశ్వాసం పునరుద్ధరించబడింది. క్రైస్తవ మూర్ఖంత్వం వలన, అలెగ్జాండ్రియా పతనానంతరం తెగిపోయిన ప్రకృతి పనిచేసే తీరు పరిశీలించే విధానాలు మళ్ళీ మొదలయ్యాయి. ఐరోపా మేధస్సు, పాండితి వాటిని అందుకున్నాయి. సందేహాలు పిడివాదాన్ని సవాలు చేసాయి. వివేచన మేధస్సులు విశ్వాసాన్ని ప్రశ్నించాయి. అవగాహనకు, వివరణకు అందకుండా నిరంకుశంగా పనిచేస్తున్నదన్న దైవేచ్ఛస్థానే పరిశీలనార్హమైన ప్రకృతి నియమాలు వచ్చాయి. ఇస్లాం లోకం, ముఖ్యంగా స్పెయిన్ విశ్వవిద్యాలయాలు వెదజల్లిన కాంతి పుంజాల వలన, విజ్ఞాన పాండితీ ప్రభావంతోనూ, ఐరోపాలో చిగురించిన జిజ్ఞాస వైజ్ఞానిక పిపాస వలన మతజ్ఞానం హేతుబద్ధమై మతాన్ని కాపాడింది. దైవేచ్ఛభావాన్ని ప్రయోజక సిద్ధాంతం ప్రకృతి నియమాలను చట్టబద్ధం గావించటంద్వారా, విజ్ఞానపరిశీలనలు తలెత్తటానికి తోడ్పడింది. మానవత్వారోపణలుగల దైవం స్థానే వైజ్ఞానిక దృక్పథంతో కూడిన ఉన్నతదైవం తొలిసూత్రం, తుదికారణం వంటివి ప్రవేశపెట్టి, ప్రకృతి నియమాలకు దైవేచ్ఛకు తాదాత్మ్యతను చూపింది. పాండిత్య తత్వం, ప్రకృతినియమాలను పరిశీలించిన వాస్తవాల ద్వారా రాబట్టవచ్చు. పరిశోధనలద్వారా రుజువుపరచవచ్చు. దైవభావన మాత్రం కేవలం ప్రతిపాదనే. కనుక ప్రకృతి నియమాలను అధ్యయనం చేయటానికే మానవమేధస్సు ఆకర్షితమైంది.

అంధకార మధ్యయుగాల చిత్రహింస అనుభవాలనుండి ఐరోపాకు భావవిమోచన గాంచిన ప్రవక్తలుగా రోజర్, బేకన్, థామస్, అక్వినాస్, డన్స్‌స్టాటస్, అల్బర్డస్ మాగ్నస్ విలియం ఓఖంలను చరిత్ర గౌరవించింది. తత్వం విజ్ఞానంపై ఆధారపడాలని, ప్రకృతి నియమాల గురించి, మరుగుతున్న జ్ఞానంపై ఆధారపడాలని తొలుత గ్రహించినవాడు బేకన్. మతం గౌరవించిన థామస్, అక్వినాస్, అరిస్టాటిల్ విధానానికి చెందిన అధిభౌతికవాది మత విజ్ఞానానికి భిన్నంగా ప్రయోజకతావాదంపై అతను నొక్కువుంచాడు. దేవుడు ప్రకృతికి కొంతవరకు స్వతంత్రప్రతిపత్తి కల్పించాడని అతడు బోధించాడు. అంటే ప్రకృతికి దాని నియమాలున్నాయన్నమాట. ఎట్లాంటి అలౌకికశక్తి జోక్యం లేకుండా అవి పనిచేస్తున్నాయి. కనుక అల్బర్డన్ మాగ్నస్‌తోపాటు యితను తత్వాన్ని

ప్రకృతిజ్ఞానాన్ని మతసంరక్షణ కింద వుంచనక్కరలేదన్నాడు. తొలి క్రైస్తవ మతగురువులలో ఆకర్షణీయమైన వ్యక్తి అగస్టన్. దైవస్వరూపం వల్లనే జ్ఞానం వస్తుందన్నాడతడు. ఇందుకు వ్యతిరేకంగా అక్వినాస్, జ్ఞానం ఇంద్రియ గోచరమన్నాడు. "పదార్థం ఆలోచిస్తుందా?" అనే ప్రశ్న ధైర్యంగా వేసి నాటి ప్రపంచాన్ని దిగ్భ్రాంతి గావించాడు డన్స్‌స్కటస్. పాండిత్యతత్వవేత్తలలో ప్రముఖుడైన అల్బర్టస్ మాగ్నస్, ప్రకృతి నియమాలు పనిచేసే తీరు ప్రదర్శించాడు. మతం అతన్ని ఖండించింది. అజ్ఞానులు అతన్ని మంత్రగాడన్నారు. భయపడ్డారు. సహజజ్ఞానానికి, మతజ్ఞానానికి గిరిగీసి చూపాడతను. ఓఖమ్ స్వేచ్ఛాలోచనపరుడు. తత్వానికి, విశ్వాసానికి ఖచ్చితంగా వేర్పాటు చూపాడు. వివేచనలో జోక్యం చేసుకోకుండా మతాన్ని దూరంగా అట్టి పెట్టాడు. విశ్వానికి సంబంధించిన ప్రయోజకతావాదాన్ని గురించి కూడా అతను సందేహం వ్యక్తపరచాడు. "ఉనికిలో తొలికారణమైన దైవజ్ఞానాన్ని గురించి తత్వవేత్తగా నాకేమీ తెలియదు. కారణాలకు కారణమైనది ఎట్లా పనిచేస్తుందో మనకు అనుభవంలేదు. దైవపవిత్రతలో చొచ్చుకుపోయే హక్కుగాని శక్తిగాని వివేచనకు లేదు." అని ప్రకటించాడు.

ప్రపంచం అద్భుతం కాదు. అదొక నియమబద్ధ విధానం. ఈ ఆలోచన క్రైస్తవ మతజ్ఞానం నుండి పాండిత్యతత్వంనుండి జనించింది. నాటి నియమభావన చాల వరకు ప్రయోజకతతో కూడినదే. అదొక దైవేచ్ఛగా భావించారు. కాని, వివేచన నిలదొక్కుకున్నందున దైవనియమాలు ప్రకృతిలో పనిచేసే తీరు కేవలం అంధవిశ్వాసానికి చెందకుండా పోయాయి. ఈ నియమాలు ఎట్లా పనిచేస్తాయో తెలుసుకోవాలనే కుతూహలం పెరిగింది. ఆ దృష్టిని మతం ఆగ్రహంతో చూచింది. అయినా ఆ దృష్టిని పూర్తిగా అణచటం సాధ్యం కాదు. ఆ కుతూహలమే ఆధునిక విజ్ఞానం తలెత్తటానికి తోడ్పడింది.

కాన్‌స్టాటిన్ నుండి కొలంబస్ వరకూ గడచిన వెయ్యిసంవత్సరాలు మేధస్సులో వృధాగా వుండలేదు. మధ్యయుగాంతంలో చిగురించిన మేధస్సును బూర్జువా తలెత్తటానికి సూటిగా సంబంధం వున్నదనలేము. భావాల ఉద్యమంతో మేధస్సుకు సంబంధం ఉన్నది. ఐహికాముష్మిక ప్రభువులపై పోరాడిన బూర్జువాలకు పూర్వమే భావసంచలనం జరిగింది. ఐరోపా ఆర్థిక జీవనంలో అధిపత్యం వహించటానికి యీ ప్రభువులు తమలోతాము కలహించుకున్నారు. ఐరోపా ఆర్థికజీవనం స్థంభించిపోయింది. కాని భావసంచలనం ఆగలేదు. పైగా క్రైస్తవం వ్యాపించటమే భావసంచలనబలాన్ని సూచిస్తున్నది. దీనివలన అటవికులైన అల్లరిమూకల్ని రానున్న నాగరికతలోకి

ప్రవేశపెట్టటం జరిగింది. ఆర్థిక ప్రతిష్టంభనలోనే ఇస్లాం తలెత్తి ప్రకాశించింది. అయినా భావసాహసాలను మానవచరిత్ర గొప్పగా చూపలేదు. వెనిస్ సమీపంలో పాడా వుండగా, అనాగరిక ఫ్యూడల్ సామ్రాజ్యానికి పారిస్ రాజధాని అయింది. అక్కడనుండే తిరుగుబాటు సిద్ధాంతాలు కాంతిపుంజాలను వెదజల్లాయి. హేతుబద్ధమైన క్రైస్తవమతజ్ఞాన వాతావరణంలో గియర్దానో బ్రూనో, కోపర్నికస్, గెలీలియో కెప్లర్ చివరకు దేకార్డ్ సైతం పుట్టిపెరిగారు. ప్రయోజక సిద్ధాంతరీత్యా యీ మతజ్ఞానం విశ్వాన్ని నియమబద్ధంగా భావించింది. వారికి ముందు వెయ్యేళ్ళక్రితం వున్న యూక్లిడ్, ఆర్కిమిడీస్, హిప్పార్కాస్, స్టార్కాస్, ఇంకా అలెగ్జాండ్రియా సైంటిస్టులతో వారికిగల సంబంధాలను స్పష్టంగా నిర్ధారించవచ్చు. వాస్కోడిగామా ప్రపంచాన్ని చుట్టిరావటం, కొత్తప్రపంచాన్ని కొలంబస్ కనుగొనటం, తూర్పు దేశాలలో వాణిజ్యదారులు రావటంతో ఈ ఫ్రెంచి తత్వవేత్తల సంబంధం అట్టేలేదు. ఆధునిక విజ్ఞానం, తత్వం రావటానికి బూర్జువా వర్గం ఆవిర్భవించటానికి కార్యకారణ సంబంధం మానవుడు చిరకాలంగా స్వేచ్ఛాపిపాస, సత్యాన్వేషణ ఫలితంగా విజ్ఞానం తత్వం తలెత్తాయి. తరువాత, బూర్జువా వర్గం వాటిని పోషించింది. వారి అవసరాలకై అక్కరకు రావటమే ఇందుకు కారణం. ఈ సంబంధం అనుకోకుండా వచ్చిందేకాని,కార్యకారణత మాత్రంలేదు.

✦ ✦ ✦

# మానవుడి తిరుగుబాటు

మూఢనమ్మకాలపై విజ్ఞానం, విశ్వాసాలపై వివేచన క్రమంగా విజయం పొందడం ఆధునిక నాగరికతలోని విశిష్ట లక్షణం. చరిత్రాది నుంచీ యీ పోరాటం సాగుతూనే వున్నది. ప్రాచీన గ్రీకులు సాధించిన విజ్ఞానాన్ని యించుమించు మరచిపోయిన మధ్యయుగాలలో సైతం క్రైస్తవమత జ్ఞానరూపేణా వివేచన నిలదొక్కుకుని ప్రకృతి నియమబద్ధం అనే గొప్పభావాన్ని ఆలోచించి, విజ్ఞాన పునరుద్ధరణకు తోడ్పడింది. "మధ్యయుగాలలో సాధించిన యీ సంపద సమాజాన్ని మార్చుడానికి ప్రధాన కారణమైంది."(1)

మధ్యయుగాలలోని ప్రయోజక క్రమం జైలులోని పద్ధతివంటిదే. ప్రపంచం ఒక అద్భుతం కాదు. అందులో ప్రతిదీ దైవాన్ననుసరించి ముందే నిర్ధారించడం వలన, మతాధికారుల ఆజ్ఞానుసారం ప్రపంచవ్యవహారాలు సాగవలసిందే. ఆ పెత్తందారీ విధానానికి ఎదురుతిరగడం, స్వేచ్ఛగా ఆలోచన, ఆచరణ, యిచ్ఛ కోరుకునే మానవుడికి అవసరమైంది. అంతేగాదు తన చిత్తాన్ని "దైవాంశ"గా వినదలచిన వారికి సైతం ఎదురు తిరగడం తప్పలేదు.

పునర్వికాసంగా పేర్కొంటున్న మానవుడి తిరుగుబాటు ఆధునిక నాగరికతకు స్వాగతం పలికింది. 14 వ శతాబ్దం మధ్య నుంచి 16 వ శతాబ్దం వరకు రెండువందల సంవత్సరాలపాటు యీ తిరుగుబాటు సాగింది. వాస్తవానికి యింకా ఎక్కువకాలం కొనసాగింది కూడా. విజ్ఞానాన్ని తిరగదోయడం ఒక శతాబ్దానంతరం, రోజర్‌బేకన్, అల్బర్టన్ మాగ్నస్‌తోగాని ప్రారంభం కాలేదు. రోంను జెన్సరిక్(2) రాజు జయించినప్పటి నుంచి షార్లెమన్(3) మళ్ళీ పాశ్చాత్య ప్రపంచాన్ని పునరుద్ధరించే వరకూ నాలుగు వందల ఏళ్ళపాటు ఐరోపా అంతా అంధకారంలో మునిగితేలింది. అటువంటి సమయంలో అరబ్బు పండితులు విజ్ఞానేష్వణను కాపాడుతూపోయారు. వారివలన బేకన్, మాగ్నస్‌లు ఉత్తేజితులయ్యారు.

---

1) లార్డ్ యాక్టన్, లెక్చర్స్ ఇన్ మోడ్రన్ హిస్టరీ
2) క్రీ.త. 390-477 ఉత్తర ఆఫ్రికాను, ఇటలీని జయించిన వాండర్స్ ప్రభువు.
3) క్రీ.త. 742-814 పవిత్ర రోమన్ సామ్రాజ్యాధిపతి. ఫ్రాన్స్‌కు రాజు.

విజ్ఞానాన్ని పునరిద్ధరించడమే పునర్వికాసానికి ప్రత్యేకత కాదు. విజ్ఞానం విప్పారడానికి అనువైన వాతావరణాన్ని పునర్వికాసం సృష్టించింది. ప్రపంచానికి ఏదో కారణం వున్నదనే విశ్వాసాన్ని సడలించి, ప్రపంచం యాంత్రికంగా నడుస్తున్నదనే వాదం ప్రబలింది. అప్పుడు ఆధునిక విజ్ఞానం జనించడానికి వీలుగా ప్రకృతి నియమబద్ధమైనదనే భావం వచ్చింది. మతాధిపతుల పెత్తనాన్ని ప్రశ్నించడం మొదలైంది. దేవుడు తనరూపంలో మానవుడిని సృష్టించాడని, మానవుడి అంతరాత్మలోనే దైవం ప్రతిధ్వనిస్తుందని, మానవుడి సార్వభౌమాధికారంలోనే దేవుడి సర్వశక్తి ప్రతిబింబిస్తుందని నాటి మానవుడు భావించాడు. అట్లాగే మానవుడి సృజనాత్మకత గౌరవంలోనే దైవశక్తి యిమిడి వున్నదన్నారు. దైవరూపంలో జనించిన మానవుడు దైవంవలె ఉండక తప్పదుగదా "మతాధిపతుల పెత్తనాన్ని తృణీకరించే ఆధునిక లక్షణం పరోక్షమైనదైనా ముందు మొదలైంది. విజ్ఞానాధిక్యతను ఆమోదించడం నేటి ప్రత్యక్ష లక్షణం.(1)

క్రీ.శ. 800 సంవత్సరంలో, హరూన్ అల్-రషీద్(2) అల్మగెస్ట్ అనే టాలమీ(3) రచనను కాపాడాడు. అప్పటినుండి అరబ్ శాస్త్రవేత్తలు క్రమానుగతంగా యీ రచనను పునరుద్ధరిస్తూ పోయారు. కోపర్నికస్ తన రచనతో నవయుగాన్ని సృష్టించకముందే, కొన్ని శతాబ్దాలకు పూర్వం కొత్తవిజ్ఞానం ఐరోపాకు అందుబాటులో వున్నది. అయినా మతాధిపతుల పెత్తనాన్ని చూచి వెరచిన కొందరువ్యక్తులకే విజ్ఞానం పరిమితమైంది. వారు రహస్యంగా, సంకేతభాషలో తప్ప మాట్లాడేవారుకాదు.

రోజర్ బేకన్‌కు కోపర్నికస్‌కు మధ్య మూడు శతాబ్దాలు ఎడం వున్నది. ఆ సమయంలోనే మతాధిపతుల పెత్తనం నుంచి ఐరోపాలో ఆలోచనాపరులు విమోచన పొందారు. వైజ్ఞానిక స్వేచ్ఛకై జయప్రదంగా పోరాటం సలిపిన వాతావరణంలోనే, విజ్ఞానం పునరుద్ధరించడానికి తగిన స్థితిగతులు కూడా సమకూడినాయి. విశ్వానికి సూర్యుడు కేంద్రం అనే వాదనవలన యాంత్రిక ప్రపంచవాదానికి పునాదులు ఏర్పడినాయి. ఐరోపాలోని వైజ్ఞానికుల దృక్పథంలో గణనీయమైన మార్పుకు యిది దారి తీసింది.

"మధ్యయుగాలలో సాధారణ వ్యక్తులు వ్రాసిన అనేక భాష్యాలు, పదకోశాలను త్రోసిరాజని, వీటిని యిక యేమాత్రం సహించలేక, ఐరోపా ముందుకు సాగింది.

---

1) బెర్ట్రాండ్ రస్సెల్- హిస్టరీ ఆఫ్ వెస్టర్న్ ఫిలాసఫీ

2) క్రీ.త.764-809 అరేబియన్ నైట్స్‌లో ప్రసిద్ధ పురుషుడుగా యితని ఖ్యాతి వ్యాపించింది.

3) క్రీ.త. 127-151 గ్రీక్ గణిత, ఖగోళ, భూగోళ శాస్త్రజ్ఞుడు.

జ్ఞానం పట్ల కొత్త దృక్పథం మనుషులకు అలవడింది. పెత్తందారీతనాన్ని ప్రశ్నించకుండా వుండలేకపోయారు. గతాన్ని అధిక్యతతో చూడడంలేదు. అనంత అద్భుతాలు గోళంలో బయటపడుతుండగా, అవన్నీ ప్రాచీన పవిత్ర గ్రంథాలలో వున్నాయని భావించక, కాలగర్భంనుంచి కనుగొనవలసిన రహస్యాలని ప్రజలు ముందుకొచ్చారు.(1)

నవ్యప్రపంచాన్ని కనుగొనడంలో అంధకారయుగాల నుంచి ఐరోపా బయట పడిందన్నారు. కోపర్నికస్ కనుగొన్న ఖగోళరహస్యాలు ఇంకా విప్లవాత్మకమైనవి. చాలా ఫలితాలను అందించినవికూడా. గతాన్ని కనుగొనడం వలన బహుశ అన్ని కాలాల్లోనూ గణనీయమైన గొప్ప విప్లవాన్ని కోపర్నికస్ సాధించగలిగాడు. పెట్రార్క్–ఎరాస్మస్‌ల మధ్య 150 సంవత్సరాల కాలంలో అనేకమంది కవులు, చిత్రకారులు, విమర్శకులు, రచయితలు, చరిత్రకారులు, తత్వవేత్తలు– వీరంతా మానవతావాదులే– గతాన్ని కనుగొనే గొప్ప ప్రయత్నం చేశారు. దైవానికి ప్రపంచంలో వారసులమని చెప్పుకునే నిరంకుశు లకు, కొన్ని పర్యాయాలు దైవానికి కూడా ఎదురు తిరిగిన వీరు మతరహితంగా వున్న ప్రాచీనతను అన్వేషించారు. వారి దృష్టిలో "ప్రపంచం దుఃఖపూరితం కాదు. మరొక లోకానికి దారితీసే బాధామయమైన తీర్థయాత్ర అంతకంటే కాదు. ప్రపంచం ఆనందాలకు, కీర్తికి, రమణీయతకు, సాహసాలకు అవకాశం కల్పించే చోటు మాత్రమే. కళ, కవిత్వం, ఆనందాల మధ్య శతాబ్దాలుగా కొనసాగిన సన్యసత్వాన్ని వీరు హాయిగా మరచిపోయారు.(2)

ప్లేటో అనంతరం కొందరు తత్వవేత్తలు ప్రపంచానికి ఆధారభూతమైన సూత్రం వున్నదంటూ, దానికి విశ్వసూత్రం అని నామకరణం గావించారు. గ్రీకు క్రైస్తవ మతాధిపతులు ఆ సూత్రాన్నే క్రైస్తవమత విజ్ఞానానికి తాత్విక ప్రాతిపదికగా స్వీకరించారు. బైబిల్‌లో మొండిగా పేర్కొన్న సృష్టివాదం బహుశా ఉత్తరోత్తరా చేర్చినదే అయివుండవచ్చు. ఆ సృష్టివాదానికి ప్లేటోవాదానికి సమన్వయం సాధ్యపడలేదు. ప్లేటో మాత్రమేకాదు, సర్వసాధారణంగా గ్రీకులు శూన్యం నుంచి సృష్టి అసంభవమనే తలపోశారు. సృష్టి అంటే దేవుడి మహిమకు నిదర్శనంగా వారు అనుకున్నారు. దేవుడు ప్రపంచాన్ని సృష్టించడానికి వాడిన పదార్థం దేవునివలె శాశ్వతమైనది. క్రైస్తవమతజ్ఞానం ఆమోదించిన ప్లేటో సంప్రదాయాలను అగస్టిన్ తృణీకరించాడు. అరిస్టాటిల్ ఆధారంగా కేవలం విశ్వాసం పైనే పునాదులను నిర్మించాడు. పాండిత్యప్రకర్షతో గూడిన వివేచనావాదం ప్రపంచానికి ప్రయోజనం వుందనే అభిప్రాయాన్ని ధృవీకరించింది.

---

1) హెచ్.ఎ.ఎల్.ఫిషర్, హిస్టరీ ఆఫ్ మోడ్రన్ యూరోప్

2) బెట్రాండ్ రస్సెల్, హిస్టరీ ఆప్ వెస్టర్న్ హిస్టరీ.

దీనివలన నియమబద్ధమైన ప్రకృతిలో మానవుడు కేవలం చక్రంలో ఆకువలె మారిపోయాడు.

ఈ దిగజారుడు విధానాన్ని పునర్వికాసకర్తలు ఎదిరించారు. ప్లేటో, ఎపిక్యూరస్ సూచించిన జీవనసరళిని వీరు ప్రస్తుతించారు. అంతరాత్మ దైవాంశంగా నమ్మిన వీరు, తమ అంతరాత్మ ననుసరించి నడుచుకునే స్వేచ్ఛ వుండాలన్నారు. ఏ పని చేయాలన్నా ముందు యిచ్ఛ వుండాలి గనుక, ఇచ్ఛకూడా స్వేచ్ఛగా వుండాలన్నారు. మానవుడు దైవసృష్టిలో అత్యున్నతమైతే, దైవత్వం మానవుడిలో వున్నది. సృష్టి రమణీయతలను అనుభవించడానికి, స్వేచ్ఛగా సృష్టించడానికి పనిచేయడానికి, భావించడానికి మానవుడికి స్వాతంత్ర్యం వున్నదన్నారు.

పెట్రోర్క్‌తో(1) కొత్త నమూనా మనిషి బయలుదేరాడు. ఎవరి ఆదర్శాలు వారే ఎన్నుకోవడం, తమ విషయాలు తామేమిటో ఆలోచించుకోవడం, తమ మనస్సులను మలచుకోవడం వీరి ప్రత్యేకత. మధ్యయుగాల పద్ధతులు వీరిని మరణానికి సన్నిహితులను గావించవచ్చు. కాని అదృష్టరేఖలు గమనించి వీరు, జీవితంలో కష్టాలను చూడగలిగారు. ప్రాచీన ప్రపంచంలోని వైజ్ఞానిక సంపదపై ఆధారపడుతూ, అందుబాటులోగల వివేచన సహాయంతో అన్నివిధాలా అభివృద్ధి కావాలని ఉపక్రమించారు.(2)

అయితే యిదంతా గుడ్డిగా తిరగతోడటంగాని, బానిసలుగా అనుకరించడంగాని జరగలేదు. ఇతిహాసాలు, అలంకారాల ముసుగులో దాగిన విషయాలను కనుగొనే పద్ధతులను పెట్రార్క్ రూపొందించాడు. పాండిత్య ప్రకర్షతో కూడిన తర్కం, మతవిషయాల బంధాలను తెంచుకొని, వివేచన ఆధారంగా ప్రాచీన గ్రంథాలను పరిశీలించాలని పెట్రార్క్ ఉద్దేశించాడు. ఆవిధంగా వ్యాఖ్యానిస్తే, ప్రాచీన సంస్కృతిలో మానవుని పట్ల గౌరవం మానవుడి వివేచన వైజ్ఞానిక, నైతిక స్వేచ్ఛావాతావరణంలో ఎట్లా వికసించాయో బోధపడింది. "వైజ్ఞానిక స్వేచ్ఛ" ఆలోచనా సంస్కృతివలన పునర్వికాసం ప్రభావితమైంది. అవి లేకుంటే ఆధునిక ప్రపంచ నాగరికత అసంభవమయ్యేదే. గ్రీక్ అధ్యయనం అంటే విమర్శ, సామ్యం, పరిశోధనతో కూడినదే. అజ్ఞానం, మూఢనమ్మకంపై ఆధారపడిన వ్యవస్థలను నాశనం చేశారు. కొత్తదారులు ఏర్పడినవి. మతగురువులు కలలుగన్న జగత్తుకు మించిపోయి, గ్రీక్ అధ్యయనం వలన కొత్త తాత్విక మార్గాలు బయటపడినాయి. విజ్ఞానానికి బీజాంకురం జరిగింది. ఖగోళశాస్త్రంలో కొత్త

1) పెట్రార్క్ 1304-1374 ఇటలీకవి

2) లార్డ్‌యాక్టన్ లెక్చర్స్ ఆన్ మోడ్రన్ హిస్టరీ

ప్రతిపాదనలు వచ్చాయి. ఇదంతా పరోక్షంగా అమెరికాను కనుగొనడానికి ఉపకరించింది. కళల సాహిత్యంలో రమణీయకతను పునరుద్ధరించడానికి గ్రీక్ అధ్యయనం తోడ్పడింది.(1)

వివిధ చరిత్రకారులు పునర్వికాస బాధ్యతను భిన్నరీతులలో అంచనావేశారు. "పురోహితుల నిరంకుశత్వ శకంతో పోల్చిచూస్తే విమోచన పొందిన వివేచన కాంతిపుంజాలను వెదజల్లినదిగా" వోల్టేర్ చిత్రించాడు. సాహిత్యం, కళ, మానవవాదం ప్రాచీనతలో పునర్వికాసానికి వారసులమని పేర్కొన్న 18 వ శతాబ్దపు హేతువాదుల భావాలకు వోల్టేర్ ప్రతినిధి పునర్వికాసం అనే పదం తొలుత ఉపయోగించినది. మెషలో (2) మధ్యయుగాలలో మతపరమైన సనాతనత్వం, మతతత్వం, గోతిక్, వాస్తుకళకు భిన్నంగా, ప్రాచీన వివేచనకు పునర్వికాసం మళ్ళీ గట్టిగా చెప్పినదని హాలం(3) మెష్‌లాలు భావించారు. ఐరోపా సంస్కృతికి ప్రేరేపణగా పునర్వికాసం కొనసాగింది. ఫ్రెంచివిప్లవానంతరం కాథలిక్ మతతత్వధోరణి తిరగబెట్టేవరకు యిది అట్లాగే వున్నది.

మతాన్ని తిరగదోడిన ఫ్రాన్సిస్(4) ధోరణిలోనే పునర్వికాసపు వేర్లు వున్నాయని మరొక అభిప్రాయం వున్నది. తదనుగుణంగా మధ్యయుగాలలో గల మార్మికవాదం నుంచి వ్యక్తివాదం, సృజనాత్మకత విశిష్ట లక్షణాలుగా, పునర్వికాస సంస్కృతిగా ఆవిర్భవించాయంటారు. మధ్యయుగాలలో జర్మనీసంస్కృతి నుంచి పునర్వికాసం పుట్టిందనేంచవరకు వీరు వెళ్ళారు. ఇంకా పరిశోధించి చూడగా, 10 వ శతాబ్దం నుంచి చింతన జరుగుతున్నట్లు నిర్ధారణగా కనిపించింది. మధ్యయుగాలలో ఐరోపా మేధావుల అభివృద్ధికి పూర్తిగా ఆటంకం ఏర్పడలేదు. నాగరికత ఆవిర్భవించినప్పటి నుంచి అభివృద్ధి అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్నది.

1880లో "ఇటలీ పునర్వికాస నాగరికత" అనే గ్రంథాన్ని బర్క్‌హార్డ్(5) వెలువరించాడు. మధ్యయుగాల క్రైస్తవసంస్కృతిలో మంచి లక్షణాలు అందులో బాగా అవగతమయినాయి. ఇప్పటికీ ఆ విషయంలో యిదే ప్రామాణిక గ్రంథంగా నిలిచింది. పునర్వికాసం అంటే ప్రజలలో సర్వసాధారణమైన మేల్కొలుపుగాను, మేధస్సు

---

1) జె.ఎ.సైమండ్స్, ది హిస్టరీ ఆఫ్ ది రినైజాన్స్

2) జూల్ మిష్‌లా 1798-1874 ఫ్రెంచి చరిత్రకారుడు.

3) హెన్రీ హాలం 1777-1859 బ్రిటిష్ చరిత్రకారుడు

4) సెయింట్ ఫ్రాన్సిస్ 13 వ శతాబ్దంలో మతగురువుల వ్యవస్థ నొకదానిని స్థాపించాడు.

5) హోర్ట్, రినైజాన్స్

పునర్జీవంగానూ వ్యక్తివికాసంగానూ అతను పేర్కొన్నాడు. పాండిత్యప్రకర్షకు అలౌకిక ఆధారం వున్నదనేవాదాన్ని త్రోసిపుచ్చి క్రైస్తవులకు ముందున్న గ్రీక్ వివేచనాత్మక వైజ్ఞానిక చింతనకు అనుకూలంగా వాతావరణం మారింది. "ప్రాశ్చాత్యదేశాలను ఐక్యంగా అట్టిపెట్టిన క్రైస్తవమతం ప్రక్కనే కొత్త చింతనాప్రభావం తలెత్తి ఐరోపాలో మేధావులకు వూపిరినిచ్చింది. మానవాళి తర్కం ప్రాచీనమైనదైనా, ఆ భావం యిప్పుడు వాస్తవమైంది."(1)

మధ్యయుగాలలో చదువంతా మతాలకు, ఆశ్రమాలకు అంటిపెట్టుకొని, మతపోషణలో ఉంటుండేది. ఆ వైజ్ఞానిక గుత్తాధిపత్యాన్ని పునర్వికాసకర్తలు సవాల్ చేశారు. ప్రాచీనగ్రంథాల ఆధారంగా స్వతంత్రించి నిర్ణయాలకు రాగలమనే ధీమా మానవవాదులకు వుండేది. మత సంప్రదాయాలను కూడా వివేచనాత్మకంగా స్వేచ్ఛగా అవగాహన చేసుకున్నామని మానవవాదులు చెప్పారు. వారిలో ఉక్కుపిండం వంటి పికొడెల్లా మిరండొలా'(2) యిట్లా అన్నాడు.

"సృష్టి అంతంలో దేవుడు, విశ్వనియమాలను తెలుసుకొని, దాని రమణీయతను ప్రేమించి, గొప్పదనాన్ని అభినందించే నిమిత్తం మానవుడిని సృష్టించాడు. అతనికి ఒక నిర్ణీతస్థలం అంటూ లేకుండా చేశాడు. ఒకవిధమైన పని అంటూ చెప్పలేదు. అవసరం కొద్దీకాక, మానవుడికి యధేచ్ఛగా తిరుగాడే స్వేచ్ఛను కూడా దేవుడు యిచ్చాడు. నిన్ను స్వేచ్ఛగా వుంచానని సృష్టికర్త ఆదంతో అంటాడు. ప్రపంచంలో వున్నదంతా చూడటానికి అనువుగా యిట్లా చేశానంటాడు. మానవుడు కేవలం ఇహలోకవాసిగా గాక, శాశ్వత అశాశ్వతజీవిగా గాక, నిన్ను నువ్వు స్వేచ్ఛగా దిద్దుకొని, నిన్ను నువ్వు అధిగమించేవాడినిగా చేశానంటాడు. నువ్వు మృగజాతిలో కలిసేటంత దిగజారవచ్చు. మళ్ళీ దైవానికి ప్రీతిపాత్రమయ్యేటంతగా జన్మించవచ్చు. స్వేచ్ఛపై ఆధారపడి వికసించే అవకాశం నీ ఒక్కడికే దక్కింది. విశ్వంలోని జీవలక్షణాలు నీలో వున్నాయి."

పునర్వికాసపు ప్రాధాన్యత విప్లవాత్మకమైనది. భావాలు, విలువల పరిధిలో గల యీ విప్లవం, ఫ్యూడల్ వ్యవస్థకు గల నైతికమద్ధతును నాశనం చేసేసింది. తత్ఫలితంగా, ఉత్తరోత్తరా శతాబ్దాల తరబడి సామాజిక, రాజకీయ, ఒడిదుడుకులకు ప్రాతిపదికలు ఏర్పడినవి. వాణిజ్యవర్గం తలెత్తడం పునర్వికాసం యించుమించు ఒకేసారి కలిసిరావడం వలన బూర్జువా సిద్ధాంతాలకు వ్యక్తివాదం, మానవవాదం సూత్రాలని అనుకున్నారు. చారిత్రకంగా యిది వాస్తవం కాదు. మానవవాదాన్ని తిరగతోడడమే

---

1) యాకోబ్ బర్క్ హార్ట్ 1818-97 స్విస్ చరిత్రకారుడు.

2) పికొడెల్లా మిరాండొలా (1463-94) ఇటలీ రచయిత, మానవతావాది.

పునర్వికాసం. ప్రాచీన గ్రీక్, రోమన్ మతేతర సంస్కృతిలో గల మానవ సంప్రదాయాలను పునర్వికాసం ఆరాధించింది. వ్యక్తివాదం కూడా ఉదారవాదానికి సంబంధించిన ప్రాచీనభావనే. సోఫిస్టులు, ఎపిక్యూరియనులు, స్టాయిక్‌లు, యింకా తొలి క్రైస్తవమతవాదాలు ఆధారంగా వ్యక్తి హుందాతనాన్ని, సార్వభౌమత్వాన్ని చాటిచెప్పింది పునర్వికాసం. పునర్వికాసానికి వాణిజ్యవర్గం తలెత్తడానికి కార్యకారణ సంబంధంలేదని మధ్యయుగాలలోని తొలిరోజులలో ఆర్థికస్థితిగతులు జాగ్రత్తగా పరిశీలిస్తే స్పష్టపడుతుంది.

మానవతతో కూడిన వ్యక్తివాదం ఏ ఒక్క ఆర్థికవ్యవస్థ మీద రుద్ధబడిన పైపై నిర్మాణం కాదు. ఏ ఆర్థికవ్యవస్థనూ యిది సమర్ధిస్తూ వాదించదు.

జన్సరిక్ అధ్వర్యాన బార్బేరియన్లు 5వ శతాబ్ది మధ్యలో రోమ్‌ను ఆక్రమించుకున్నప్పటినుంచి, 9వ శతాబ్దిలో షాల్లెమన్– ప్రభువు తలెత్తినప్పటి వరకు, నాలుగు వందల ఏళ్ళు ఐరోపా వైజ్ఞానిక మైకంలో అంధకారయుగంలో మునిగిపోయింది. రోమన్ సామ్రాజ్యం పతనమవుతుండగానే, ఇస్లాం, మధ్యధరాప్రాంతాలపై అధిపత్యం వహించి, స్పెయిన్‌ను జయించింది. అదేకాలంలో, ఉత్తర పశ్చిమతీరాలను నార్మన్ దండయాత్రికులు ప్రతిష్టంబింపజేశారు. 9వ శతాబ్దంలో సముద్రమార్గాలు లేక, భూమికే పరిమితమైన ఐరోపా వ్యవసాయ ఆర్థికవ్యవస్థలోకి పోయింది. ఫినిషనుల కాలంనుంచీ ఐరోపా వర్తకానికి మధ్యధరాప్రాంతం కూడలిగా వుండేది. అరబ్బులు ఆ కూడలిని పనిచేయనివ్వకపోవడంతో ఐరోపా వాణిజ్య కార్యకలాపాలు బాగా తగ్గిపోయాయి. "వాణిజ్యంలో ఆటంకం ఏర్పడటం వలన వర్తకులు అదృశ్యం కాగా నగరజీవితం విచ్ఛిన్నమైంది."(1)

11వ శతాబ్దంలో జరిగిన తొలిమతయుద్ధం వరకూ పరిస్థితి స్థంభించి పోయిందనే భావించారు. అప్పటి వరకూ ఐరోపావాణిజ్యానికి మధ్యధరాసముద్రం అనుకూలం కాకుండా పోయింది. అరబ్బుల అధిపత్యంలో సముద్రతీరం ఉన్నప్పటికీ ఏడ్రియాటిక్, ఏజియన్ సముద్రాల ద్వారా పరిమితంగా ఇటలీ తీరప్రాంతంలో పరిమిత రాకపోకలు సాగించడానికి అనువుగా బైజాంటిన్ సైన్యం అనుకూలపరిచింది. ఇస్లాం వ్యాప్తిని నిరోధించిన వెనిస్ వర్తకులు బైజాంటిన్ సామ్రాజ్యరక్షణ కింద 9వ శతాబ్దం చివరలో ఆఫ్రికా సిరియాలకు రాకపోకలు సాగించారు. టైరియన్ సముద్రంపై అధిపత్యం కోసం పిసా, జెనోవా వర్తకులు అరబ్బులతో పెనుగులాడారు. 11వ శతాబ్దారంభంలో జెనోజ్‌వారు సార్డీనియాను ఆక్రమించుకోగా మెస్సీనా అఖాతంలో

---

1) హెన్రీ పెరెన్, ఎకనమిక్ అండ్ సోషల్ హిస్టరీ ఆఫ్ మిడివల్ యూరోప్

అరబ్బులను పిసాసైన్యం ఓడించింది. ఆ శతాబ్దం మధ్యలో పాలుర్మో రేవులో పిసావారు ప్రవేశించగా, జెనోజ్‌వారు ఆఫ్రికాతీరంలో కనిపించారు.

మధ్యధరాప్రాంతం నుంచి ఇటలీ వర్తకులను అట్టేకాలం దూరంగా అట్టిపెట్ట లేకపోయినట్లే, ఉత్తరతీరంలో ప్రతిష్టంభన కూడా త్వరలోనే తొలగిపోయింది. 9వ శతాబ్దాంతానికి "ఐరోపా వ్యవసాయ ఆర్థికవిధానానికి భిన్నంగా నావికా, వాణిజ్య కార్యకలాపాలు కొట్టొచ్చినట్లు కనిపించాయి. సముద్ర బందిపోట్లుగా వైకింగులు బయలుదేరారు. వాణిజ్యానికి అది తొలిదశ. 9వ శతాబ్దాంతానికి వారి బందిపోటు చర్యలు సమసిపోయి వారంతా వర్తకులయ్యారు. మరొకవైపు ప్రాచీనగ్రీకులు బాల్టిక్ సముద్రం ద్వారా ఎర్రచందనం తీసుకెళ్ళిన వాణిజ్య మార్గాలలోనే, స్వీడన్‌వారు తూర్పుగా పయనించి 9వ శతాబ్దం మధ్యలో నల్లసముద్రం చేరగలిగారు. అక్కడ తోళ్ళు, తేనె, బానిసల వ్యాపారం చురుకుగా సాగింది. పది పదకొండవ శతాబ్దాలలో బాల్టిక్ ఉత్తర సముద్రాలపై వాణిజ్య నౌకాయానం నిర్విరామంగావుండే దృశ్యాలు కనిపించాయి. విస్చుల(1) ఎల్బె(2) ముఖతీరప్రాంతాలలో అనేక వాణిజ్యకేంద్రాలు నెలకొల్పారు. అందులో హాంబర్గ్(3) రేవుకూడా ఒకటి. ఆ రేవులోనుంచి డేనిష్ నౌకలు బ్రిటన్‌తో వాణిజ్యం చేశాయి. థేమ్స్, రైన్ నదులనుంచి తూర్పుతీరాన బాల్టిక్ సముద్రం బోత్నియా అఖాతం వరకు వాణిజ్యసంబంధాలు కెన్యూట్(4) ప్రభువుకాలంలో (11వ శతాబ్దం తొలిభాగం) వున్నాయని, బాల్టిక్ బేసిన్‌లో కనుగొన్న ఆంగ్ల, ఫ్లెమిష్ జర్మన్ పాతనాణాల వలన రుజువు అవుతున్నది.

12వ శతాబ్దంలో, ఫ్లాండర్జ్ బ్రాలెంట్(5) అనేవి ఐరోపాలో బాగా పారిశ్రామికంగా విలసిల్లిన దేశాలు. ఆ కాలంలో ఉత్తరాది వెనిస్‌గా పేరొందిన బ్రూజ్ నగరం(6) మిగిలిన నగరాలన్నింటికంటె వాణిజ్యంలో ప్రఖ్యాతి వహించింది. కాని చరిత్రకారుడు పెరిన్ భిన్నాభిప్రాయం వెల్లడిస్తూ "ఫ్లెమిష్ రేవుకుగల విశిష్టత, అంతర్జాతీయ ప్రాధాన్యత, వెనిస్‌కు ఎన్నడూ లేదన్నాడు." (చూడు పెరిన్)

ఫ్లాండర్జ్- ఇటలీ మధ్య వాణిజ్యమంతా 14వ శతాబ్దం వరకు భూమిపై

---

1) విస్చులనది పోలెండ్‌లో వున్నది. బాల్టిక్ సముద్రంలో కలుస్తుంది.

2) మధ్య ఐరోపాలో యీ నది ఉత్తరసముద్రంలో కలుస్తుంది.

3) పశ్చిమజర్మనీలో ఎల్బినదిపైగల నగరం.

4) క్రీ.త.994-1035 వరకు కెన్యూట్ ప్రభువు వరుసగా ఇంగ్లండ్, డెన్మార్క్, నార్వే దేశాలను పరిపాలించాడు.

5) పశ్చిమ ఐరోపాలో వుండేది. ప్రస్తుతం నెదర్లాండ్స్, బెల్జియం మధ్య చీలిపోయింది.

6) బెల్జియంలో యీ నగరాన్ని కాలువతో సముద్రరేవుకు కలిపారు.

కొనసాగింది. జెనీవా, వెనిస్ నగరాలతో బ్రూజ్ నావికుడు నావికాసంబంధం ఏర్పడేవరకూ పరిస్థితి యింతే వున్నది. ఫ్లాండర్జ్ అంధకారయుగాలలో ఐరోపా కేవలం భూమిపై వ్యాపారం చేయవలసి వచ్చినపుడు కూడా ఇటలీ–ఫ్లాండర్జ్ మధ్యసంబంధాలు నెలకొల్పిన వర్తకులు వుండేవుండాలి. వ్యాపారగిల్డులుగా చలామణి అయిన హన్సనగరాలన్నీ వాణిజ్యపరంగా విలసిల్లినవే. ఈ గిల్డు వలన వాణిజ్యం బలపడడమే కాక, ఆ నగరాలలోనూ చుట్టుపట్ల రాజకీయ జీవనంలో అధిపత్యం వహించారు. ట్యూటానిక్ సైనికులు(1) స్లావ్ (2) దేశాలను జయించక పూర్వం బాల్టిక్ సముద్రంపై దక్షిణ, తూర్పుతీరాలలో జర్మనీ మధ్యతరగతి వాణిజ్య వర్గాలు తమ వలసలను ఏర్పరచుకున్నారు. 12వ శతాబ్దం మధ్యలోనే లండన్ ఉక్కు కర్మాగారాలకు నిజ్నినోవొగొరాడ్ సంతలమధ్య హన్సలీగ్ వస్తుమార్పిడి కేంద్రంగా పనిచేసింది.

"వెనిస్, జెనీవా, బ్రగ్స్ వంటి రేవులు లెవంత్‌వంటి ఇటలీకాలనీలు, హన్స్ నగరాలలోని ఓడలు షాంపేన్ సంతలు గమనిస్తే మధ్యయుగాల్లో వాణిజ్యం తదనుగుణంగా ఆర్థిక కార్యకలాపాలు ద్యోచకమౌతాయి. పునర్వికాసానికి ముందు ఐరోపాలో పెట్టుబడిదారీవర్తకుల, వర్గంలేదు గనుక మధ్యయుగాలలో వాణిజ్యానికి ప్రాధాన్యతలేదని ఆర్థిక శాస్త్రవేత్తలు తమ వాదనను సమర్థించుకుంటున్నారు. అయితే ఇటలీ సంస్థలపట్ల వీరు తమవాదానికి మినహాయింపు యిస్తున్నారు. ఆ మినహాయింపే నియమాన్ని రుజువుపరుస్తుంది. నగరాలలోని పెట్టి బూర్జువాల మధ్య చిన్నవర్తకులు చాలామంది వుండొచ్చుగాని, బాంకర్లను ఎగుమతిదార్లను వీరిస్థాయికి దిగజార్చడం విడ్డూరంగా వుంటుంది. ముందే ఏర్పరుచుకున్న సిద్ధాంతాల వలన కళ్ళుకప్పిన వారైతేనే, వాణిజ్య పెట్టుబడిదారీ ప్రాధాన్యత ప్రభావాలను ఆర్థిక పునర్వికాసారంభంలో చూడజాలరు. పెట్టుబడిదారీ విధానం 12వ శతాబ్దంలో వున్నట్లు మధ్యయుగాల ఆధారాలు నిస్సందేహంగా సూచిస్తున్నవి.(3)

అంతకుముందు రెండు శతాబ్దాలలో కూడా ఉత్తరదక్షిణాదులలో కొంత వాణిజ్యం కొనసాగుతూనే వున్నది. "సారసిన్లు(4) ఆటంకపరచిన పరిశ్రమాభివృద్ధి 12వ శతాబ్దారంభంలో మళ్ళీ కోలుకొన్నది. సముద్రవాణిజ్యం వలన నాశనమైన రోమన్ సామ్రాజ్య నగరాల జనాభా మళ్ళీ కోలుకొని, సంపదను జనసంఖ్యను పెంచుకోగలిగినవి.

---

1) 1190లో జర్మనీ మతసైనికులు ఏర్పరచిన వ్యవస్థ.

2) ఐరోపాలో ఈ జాతులు అనేక దేశాలలో ప్రబలివుండేవి.

3) చూడు పెరిన్ గ్రంథం.

4) సిరియా సరిహద్దులలో సంచారదళాలుగా రోమన్ సామ్రాజ్యకాలంలో వుండేవారు.

గ్రామాలు సంరక్షిత నగరాలుగా మారాయి. శివార్లలోని వర్తకులు చేతివృత్తులవారు కోటలచెంతకు విస్తరించారు. వీరంతా గిల్డులుగా ఏర్పడి, డబ్బు భద్రతకు కావలసిన పరిస్థితులు ఏర్పరచవలసిందిగా వత్తిడి తెచ్చారు. వారి పొలాలకు రక్షణ, పన్నులు స్వయంగా రూపొందించడం, తమ కలహాలను తామే పరిష్కరించుకోవడం, తమ అధికార్లను తామే నిర్ణయించుకోవడం జరిగింది. నగరంలో ఒక ఏడాదిపాటు నివశించిన వ్యక్తిని స్వేచ్ఛాపరుడుగా పరిగణించారు.(1)

బూర్జువావర్గం ఆవిర్భవించడానికి పునర్వికాసానికి సామాజిక ప్రాతిపదిక కల్పించడానికి, ఆర్థికశక్తి రూపొందించడానికి అనువైన పరిస్థితులే పైన పేర్కొన్నవన్నీ. ఇది కేవలం ఇటలీకే పరిమితం కాలేదు. బూర్జువా విప్లవంగా నామకరణం గావించిన, పెల్లుబికిన సాంఘిక పరిస్థితులు, పశ్చిమఐరోపా అంతటా ప్రబలినాయి. ఇటలీ వెలుపల వాణిజ్యవర్గం పారిశ్రామిక ఉత్పత్తిరంగంలో అడుగిడింది. ఐరోపాలో ఫ్లాండర్జ్, బ్రాబంట్, ఆర్థికంగా విలసిల్లిన దేశాలు అయినప్పటికీ, తలెత్తుతున్న బూర్జువావర్గ సిద్ధాంతానికి రూపకల్పన గావించిన అవకాశం ఇటలీకే దక్కింది. పునర్వికాస సంస్కృతి అక్కడ విప్పారింది. దేవుడిపైనా, ప్రపంచంలో అతడి ఏజెంట్లుపైనా మానవుడు తిరుగుబాటు గావించిన చారిత్రక దృశ్యం ఇటలీలో మొదలైంది. మిగిలిన ఐరోపాలో మతం, బయటనుంచి వచ్చినదన్నట్లుగా చాలాకాలం ఉండిపోయింది. వాస్తవజీవితంలో అహం, ఇంద్రియలోలత్వం, ఒకవైపున భక్తి, పశ్చాత్తాపం మరొకవైపునా ఒకదానివెంట ఒకటి ఆచరణలో వుండేవి.(2)

ఇతర ఐరోపా దేశాలలోని సాంస్కృతిక వాతావరణం గమనిస్తే, పవిత్రత పేరిట నటన, కపటవర్తన అనేవి పునర్వికాస ధోరణికి వ్యతిరేకంగా సాగుతుండేవి. “వైజ్ఞానిక మేధావులు, పునర్వికాస ప్రతినిధులుగా తమ యువక స్వభావానికి తగ్గట్లు మాత్రమే మతాన్ని పరిగణించేవారు. మంచిచెడ్డలను విడమరచి చూడగల వీరికి పాపం అంటే భీతిలేదు. వారి అంతర్ముఖ స్వభావంలో గందరగోళం ఏర్పడినప్పుడు, తమ స్వభావానుగుణంగా మారేవారు గనుక, వారిలో పశ్చాత్తాపం వుండేదిగాదు. ముక్తి అవసరం తగ్గిపోయింది. వైజ్ఞానికరంగంలో ఔత్సాహికులు మాత్రం భవిష్యత్తును గురించిన ఆలోచనలవైపుకు దృష్టిపోనిచ్చేవారుకాదు, లేదా పిడివాదానికి అతీతంగా కవిత్వధోరణిలో పోయేవారు.(3)

---

1) ఫిషర్ ః హిస్టరీ ఆఫ్ మోడ్రన్ యూరోప్

2) బర్క్‌హార్డ్, రినైజాన్స్

3) బర్క్‌హార్డ్, రినైజాన్స్

బూర్జువావర్గం ఆవిర్భవించడానికి, పునర్వికాసానికీ, కార్యకారణసంబంధం ఏదీలేదనేది స్పష్టం. వాణిజ్యానికి, బ్యాంకింగ్‌కు కేంద్రంగా వున్న ఫ్లారెన్స్ పునర్వికాస సంస్కృతిలో కళలవిభాగానికి, కాణాచిగా వుండడం వాస్తవమే. మెడిషిన్‌లు(1) మధ్యయుగాల సంపన్నవర్గాలకేగాని అప్పుడు తలెత్తిన బూర్జువావర్గాలకు చెందదు. వీరంతా వాటికన్ కాథలిక్ పెత్తందారీ వ్యవస్థకు చెందినవారు గావడం వలన, వ్యవస్థాపితమైన ఆ వ్యవస్థను రద్దుచేయాలని కోరలేదు. జెనీవా, వెనిస్‌లు మరింత బూర్జువాలుగా వుండేవి. పునర్వికాసానికి యివే మతంగా తోడ్పడలేదు. హేయమైన భౌతిక పదార్థవాదానికి వెనిస్ పెట్టిందిపేరు. వెనిస్ పాలకులు జీవితాన్ని అనుభవించి, ఇంద్రియసుఖాలు పొందడానికి ప్రయత్నించారు. విలాసవంతమైన భోగాలతో కూడిన పరిశ్రమలు సృష్టించి, సముద్రాలపై వర్తకం సాగించి, బాగా డబ్బు ఆర్జించే ప్రయత్నం చేశారు. మధ్యయుగాలలో వున్న డోజ్(2) రిపబ్లిక్ సైతం సాంస్కృతిక చరిత్రలో గౌరవస్థానాన్ని ఆర్జించలేదు. రామణీయకత విలువలో దీనికి ప్రథమస్థానం లేదు.

"సాహిత్యాభిరుచిగాని ప్రాచీన సాహిత్యంపై ఉత్సాహంగాని అంతగా లేదిక్కడ" (3) కొత్త ఆలోచనలకు వెనిస్ యిచ్చిందేమీలేదు. సాహిత్యం పట్ల యిక్కడ ఉదాసీనతేగాని పోషణలేదు. పెట్రాన్ కవిత్వాలకు 16వ శతాబ్దంలోని వెనిస్‌లో గుర్తింపు రాలేదు. కాని అప్పటికే అశ్రద్ధవలన వెనిస్ చాలా కోల్పోయి, పెట్రార్క్ రచనల ప్రతిష్టనుంచి పొందవలసిన కీర్తిని పోగొట్టుకున్నది. వాణిజ్యరంగంలో వున్న యువరాజులు 15వ శతాబ్దం వరకు మానవతా సంస్కృతికి ప్రతీకలుగా లేకపోయారు. వెనిస్ సంస్కృతిలో సొంతమనదగినదేమీలేదు. పునర్వికాసకాలంలో గొప్పవారనదగిన వారొక్కరూ ఆ వాణిజ్యం నగరంవారు కారు. "వాణిజ్యం రాజకీయాలలోగల అభిరుచికన్నా తత్వంలో వెనిస్ నగరవాసులకు తక్కువ యిష్టం వున్నదనజాలం. కాని ఈ అభిరుచి వారిలో పెంపొందలేదు. కొత్తవారికీ ఉపయోగపడలేదు. ఇటలీలో ఇతరచోట్ల పోల్చిచూస్తే యిదీ పరిస్థితి"(4) ఇటలీలో ఇతరచోట్ల నిరంకుశపాలకులతో పోల్చిచూస్తే, యీ తొలిబూర్జువా రిపబ్లిక్‌లో మేధస్సులో వెనుకబడినతనం సాధారణంగా కనిపించింది.

ఈ దారుణస్థితికి కేవలం మతం కారణం కాదు. వెనిస్‌లో మతగురువులంతా ప్రభుత్వాధిపత్యంలోనే వున్నారు. అయినప్పటికీ, క్రైస్తవ రుషుల అవశేషాలపై అటవిక నమ్మకం కుదురుకుపోయింది. మతవిజ్ఞానం ఈ రాజ్యంలో కొట్టొచ్చినట్లుండేది.

---

1) ఇటలీలో సంపన్న వంశస్థులు, బాంకర్లుగా, కళలు సాహిత్యపోషకులుగా వీరికి పేరుండేది. ఇందులో 7 గురు ప్రధానంగా చరిత్రకెక్కారు.

2) ఇటలీలో రాజ్యాల పేరు

3) బర్క్‌హార్డ్ పుస్తకం చూడండి.

4) సాబెల్లికో

కొంతవరకు మత గురువుల స్థాయితో డోగెరాజ్యం వుండేది.

ఇందుకు భిన్నంగా దక్షిణాది ఇటలీలో నిరంకుశ ఫ్యూడల్ ప్రభువులు పునర్వికాస కర్తలను ఆదరించారు. తరువాత పోప్ ఆశీర్వచనాలు కూడా వీరికి లభించకపోలేదు. అందులో ఇద్దరు పోప్‌స్థానాన్ని ఆక్రమించగా "పునర్వికాస పోప్"ల పరంపర ఆరంభమైంది.

మధ్యయుగాలలో విశేషంగా పేర్కొనదగిన రెండవ ఫ్రెడరిక్ చక్రవర్తిగాక అరగాన్‌కు చెందిన నేపిల్స్‌రాజు ఆల్ఫోన్స్ పునర్వికాసాన్ని పెంపొందింపజేసాడు. నేపిల్స్ రాజు కొలువులో ట్రెబిజాండ్(2)కు చెందిన జార్జిగాక అనేక గ్రీకు పండితులు, లారెంజోతోపాటు అనేకమంది మానవవాదులు వుంటుండేవారు. వారందరికీ సమృద్ధిగా పారితోషికాలు లభించేవి. అయినా రాజు యిలా అనేవాడు. "నా నగరాలలో బాగా విలసిల్లిన వాటినిచ్చినా మీకు యిచ్చినట్లుగాదు. కనుక మీకు వేతనాలిస్తున్నట్లు భావించవద్దు. కాలానుగుణంగా మిమ్ములను సంతృప్తి పరచగలననుకుంటున్నాను." అల్ఫన్సొ తన కార్యదర్శిగా గియానొజొ మనెట్టిని నియమిస్తూ "నా చివరి సంపదతో సహా నీతో భాగం పంచుకుంటా"నన్నాడు. ఇటలీకి ఆల్ఫన్సొ రాజు కాబోతున్నట్లు సూచనలు వచ్చినపుడు, ఉత్తరోత్తరా పోప్ అయిన తొలి మానవవాది అనస్ సిల్విస్ యిట్లా వ్రాశాడు. "స్వేచ్ఛాపూరిత నగరాలకంటె, యితని పాలన క్రింద ఇటలీ శాంతిని స్థాపించాలని అభిలషిస్తున్నాను. "పునర్వికాసాన్ని పోషించిన మరొక యువరాజు అర్చినోడ్యూక్ ఫెడరిగొ, ఇతను గొప్ప పండితుడు. విజ్ఞానాభిలాషి. ఆ కాలపు విజ్ఞానం గురించి ఆకళింపు చేసుకోవడమే గాక అన్వయించాలని అభిలషించాడు. ఫాన్‌చెస్కో డొలిక్ స్ఫోర్టాలు మేధస్సుకు సంబంధించిన విషయాలలో శ్రద్ధాసక్తి కనబరచడమే గాక, తమ పిల్లలకు మానవతా సంస్కృతీ విద్య గరిపించారు.

స్వేచ్ఛకోసం మానవుడు చిరకాలంగా సాగిస్తున్న పోరాటంలో పునర్వికాసం ఒకదశ. స్వేచ్ఛ ఒక ఆదర్శ భావన. మానవసాంస్కృతిక చరిత్రలో అదొక అధ్యాయం. దానికి ఒక తర్కం, గమనం ఉన్నది. మధ్యయుగాలలో వాణిజ్యవర్గపు రాజకీయ, ఆర్థిక ఆసక్తుల వలనగాక, మానవతా హేతుపూరిత, వైజ్ఞానిక భావాలతో కూడిన ప్రాచీన గ్రీకు నాగరికతవలన పునర్వికాసం ఉత్తేజాన్ని పొందినది.

11వ శతాబ్దం నుండే వివేచన, పరిశీలనాధోరణి ఐరోపా విద్యాలయాలలో చొచ్చుకుపోనారంభించింది. షార్లెమన్ పాలనలో ప్రారంభమై, ఫ్రెంచి విశ్వవిద్యాలయం గా, రూపొంది 12 వ శతాబ్దారంభంలోనే వాస్తవవాదానికి నాడు ప్రధానసిద్ధాంతానికి మధ్య వాదోపవాద కేంద్రమైంది. మతపరమైన సనాతనత్వానికి, మతదురహంకార వాదానికి వ్యతిరేకంగా మేధావులలో వచ్చిన ధోరణికి యీ వివాదం నిదర్శనం.

రోజలినస్, అబెలార్డ్,(4) యాన్సలం,(5) ఓకం(6) వంటి సుప్రసిద్ధ నామినలిస్టులందరూ పునర్వికాస మానవతా వాదానికి పితామహులే. అబెలార్డ్ మత భ్రష్టుడని మతాధికారులు ఖండించారు. అతని శిష్యుడు బెస్రా(7) నగరానికి చెందిన ఆర్నాల్డ్, రోంలో తిరుగుబాటు ప్రమాణాలను ఉన్నతదశకు తొలుత తీసుకెళ్ళాడు. ఆనాడు వారంతా మతగురువులకు చెందినవారు. మత విజ్ఞానార్జనలో పెరిగినవారు. వారికి ఏ కోశానా బూర్జువాలతో సంబంధం లేదు. తరువాత రెండు శతాబ్దాలకుగాని బూర్జువావర్గం తలెత్తలేదు. పారిస్‌లో చదివిన కొందరు పండితులు 12వ శతాబ్దాంతంలో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. వెన్వెంటనే ఫ్రాన్స్, ఇటలీ, ఇంగ్లండ్ దేశాలలో అనేక విద్యాకేంద్రాలు వెలిశాయి. "అవన్నీ మతాధిపత్యం కింద, వారి మార్గదర్శకత్వాన ప్రజల కోరికననుసరించి వెలసిన విద్యాకేంద్రాలే". (8) మధ్యయుగాలలోని అవిద్యా కేంద్రాలలో పునర్వికాస భావాలకు అంకురార్పణ జరిగి, భావవిచ్ఛేదన ఆరంభమైంది.

13వ శతాబ్దారంభంలో అల్బర్టస్ మాగ్నస్, రోజర్ బేకన్ నివసించారు. ఒకరు మంత్రజాలంలో గొప్పవాడైతే, తత్వంలో యింకా గొప్పవాడు. మతవిజ్ఞానంలో అందరికీ మించినవాడని చరిత్ర చెబుతున్నది. ఇంకొకడు అభినందించదగిన డాక్టరు. వివేచనకు నాంది పలికినవాడు. విజ్ఞానాన్ని తిరగదోడిన వాడుగా పేరొందాడు. బేకన్ కూడా మంత్రజాలం ప్రయోగించాడని నిందలు పొందాడు. విజ్ఞానాన్ని ప్రదర్శిస్తేనే, ఆ రోజుల్లో మంత్రజాలవిద్యగా భావించేవారు. రసాయనిక పరిశోధనలు గావించినందుకూ, మొక్కలను కుండీలలో పెంచి పరిశీలించినందుకూ అల్బర్టస్ మాగ్నస్, రసవాది అనీ, గొప్ప మాంత్రికుడనీ అన్నారు. అరిస్టాటిల్ తరువాత పునర్వికాసం వరకు ప్రకృతి చరిత్రకు సంబంధించి అతను మొక్కలపై వ్రాసిన సిద్ధాంతమే అత్యుత్తమమైనది.

క్రైస్తవమతంలో తొలుతగల రెండు ప్రాతిపదికలలో మానవుడి భావనకు మధ్యయుగాలలో దైవభావం వలన గ్రహణం పట్టింది. అప్పుడు కొందరు విద్యావంతులు మతవిజ్ఞానంలో తలమునకలుగా కొట్టుకలాడారు. గ్రీక్‌తత్వం, రోమన్ సామ్రాజ్య

1) మిలన్ నగరానికి డ్యూక్ 1401–66
2) మిలన్ నగర డ్యూక్ 1451–1508
3) ఇటలీలో ఫాసిస్ట్ వ్యతిరేక రాజ్యపాలకులు
4) ఫ్రెంచి తత్వవేత్త 1079–1142 కేంటర్‌బరి ఆర్చ్‌బిషప్ 1033–1109
5) ఆంగ్ల తత్వవేత్త 1349లో మరణించాడు.
6) రూపంలేని సాధారణ పేర్లు, బాహ్యసత్యానికి నిలువజాలవని, వ్యక్తిగతమైన వాటికి పెట్టిన పేర్లకే విలువ, అర్థంవున్నదని మధ్యయుగాలలో యీ తత్వవేత్తలు భావించారు.
7) ఉత్తర ఇటలీలోని లొంబార్డాలో ఒక నగరం
8) ఫిషర్, హిస్టరీ ఆఫ్ మోడరన్ యూరప్.

సంప్రదాయం క్రైస్తవమతం అనే మూడు ఆలోచనా ప్రవంతులు ఐరోపా సంస్కృతికి పోషకాలుగా వుండేవి. రోం పతనానంతరం, కొత్తగా వచ్చిన క్రైస్తవమతం అధిపత్యం వహించింది. కొన్ని శతాబ్దాల అనంతరం, ఐరోపాలో పునర్వికాసం, మళ్ళీ రోమన్ సంప్రదాయాలను తిరగదోడింది. నాటి పండితుల వలన యిది స్పష్టం. క్రైస్తవమతంలో రెండవభావన– మానవుడు, అతనికి, దైవానికి గల సంబంధం– మత మార్మికవాదం నుంచి తలెత్తనారంభించింది. ఇంకాముందు శతాబ్దాలలో లాటిన్ నేర్చినవారు సైతం, ప్రాచీన మానవతావాదానికి ప్రతీకలైన వర్జిల్, సిసిరోలను స్ఫురణకు తెచ్చుకున్నారు. కాని, రోమన్ సామ్రాజ్యపు సాంస్కృతిక సంప్రదాయమంతా గ్రీస్ ఔన్నత్యానికి ప్రతిబింబమే కనుక, సృజనాత్మకత ప్రేరేపణకు, ఐరోపా మేధావులు పుట్టుకస్థానమైన గ్రీస్‌కు వెళ్ళవలసి వచ్చింది. ప్రాచీన గ్రీక్‌విద్యాసంపద ఒక వైపున అలెగ్జాండర్ కాలంలో సాధించిన వైజ్ఞానిక విజయాలలోనూ, మరొకప్రక్క ఎపిక్యూరస్, స్టాయిక్‌ల నైతికభావాలలోనూ ప్రస్ఫుటమైనాయి. ఇదే తరువాత రోమన్ సంప్రదాయంలోకి ప్రవహించింది.

తత్వాన్ని భౌతికశాస్త్రంగా నైతికశాస్త్రంగా విభజించిన ఎపిక్యురస్, నీతికి లొంగేటట్లు పదార్ధశాస్త్రాన్ని అట్టిపెట్టాడు. అయితే వ్యక్తిస్వేచ్ఛకు అధిభౌతిక ప్రమాణాన్ని కూడా ఎపిక్యూరస్ భౌతికశాస్త్రం కల్పించింది. అతని నీతిశాస్త్రం మానవతతో కూడినది. జీవితాన్ని అనుభవించే కళే అతని తత్వం. చావన్నా, దైవశక్తులన్నా, యీ తత్వం పట్టించుకోదు. వాటిని భ్రమలంటుంది. భవిష్యత్తును గమనించదు. ఎందుకంటే మరణానంతరం వ్యక్తికి ఏమీ వుండదుగనుక. ఆత్మ అంటే అణువుల సముదాయం. దాని భాగాలలో అది లీనమౌతుంది.

మార్మికవాదం మాట అట్లా అట్టిపెడితే, స్టాయిక్‌లు మానవతతో కూడిన నైతిక భావాలను పెంపొందించారు. వివేచన ప్రకారం బ్రతుకు ప్రపంచ పదార్ధంతోనూ దైవంతోనూ చేయబడింది. ప్రపంచానికి వివేచన అంటే దైవమే. ప్రకృతితో పొందికగా మనుగడ సాగించు ప్రకృతిలో వివేచన అత్యున్నతంగానే వుండివుండాలి. మన ఉనికి మేధోసంపత్తితో ఉండాలి. దేహసంబంధమైన కష్టసుఖాలను యీసడించాలి. మానవేచ్ఛకు విశ్వవివేచనకు సమన్వయమే ధర్మం ఇదీ స్టాయిక్‌ల బోధన.

స్టాయిక్, ఎపిక్యూరస్ తత్వాలు ప్రత్యక్షంగానూ, వివేచనవిజ్ఞానాలు అరబ్బుల ద్వారానూ ఇటలీ చేరాయి. అందుకే ఐరోపాలో పునర్వికాసం అక్కడ పరాకాష్టకు అందుకున్నది. ఐరోపాలో మిగిలినచోట్ల పునర్వికాసం అక్కడక్కడా వెలుగులు వెదజల్లుతూ, మతేతర ఉద్యమరూపంలో కొంత వ్యాపిస్తూ తుదకు లూథర్ చెప్పిన కొత్తరకపు పిడివాదంలోకి, కాల్విన్ బోధించిన ఆనందరహిత సంస్కరణవాదంలో

స్థంభించి, సంస్కరణవాదంలో తేలింది.

వివేచనాత్మక పండితుల బోధనలవలన తొలిక్రైస్తవమత బోధనలలో మానవతా ధోరణి రోంలో మతరహిత సంస్కృతి ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులలో కదలికను తెచ్చాయి. మతసంస్కరణ జరగాలని, మతగురువుల పెత్తనంలో మార్పురావాలని, పిడివాదపు ఛాందసత్వం సడలాలని వత్తిడి వచ్చింది. స్పెయిన్‌లో ఇస్లాం ప్రభావం వలన దక్షిణఫ్రాన్స్‌లో మతేతర ఉద్యమంగా వ్యాపించి, ఇంగ్లండ్, బొహిమియాలకు యివి ప్రాకాయి. ఫ్రాన్స్‌లో యిది లాంగ్‌డాక్(1) ఉద్యమరూపం దాల్చింది. మతభ్రష్టులని పేరొందిన వైక్లిఫ్, హస్, జెరోం, ఆర్నాల్డ్ మొదలైనవారు, ఆ నెపంతో అమరులైనారు. ఇటలీలో పునర్వికాసానికి ధ్వజమెత్తారు. మతభ్రష్టత్వాన్ని అణచివేయాలనే దృష్టితో మఠాలు స్థాపించినందున మతసంస్కరణకు అవకాశం లేకుండాపోయింది.

యూదులదైవం నిరంకుశత్వానికి, రోం సామ్రాజ్యపు కర్కశత్వానికి, వ్యతిరేకంగా మానవుడు చేసిన తిరుగుబాటును క్రైస్తవమతం ప్రతిబింబించింది. మానవుడి ఊహలో అత్యున్నతమైన నైతికాధర్మాలు కొండపై జరిగిన బోధనలో యిమిడివున్నాయి. గ్రీక్ రుషులు భావించిన నైతికక్రమాన్ని క్రైస్తవమతం స్థాపించదలచింది. ప్లేటో మతవిజ్ఞానం, స్టాయిక్‌తత్వం, అనుసరించిన తొలి క్రైస్తవ గురువులు యీ విశ్వాసాన్ని బలపరచారు. వెయ్యేళ్ళపాటు భక్తుల ఆధ్యాత్మికావసరాలను క్రైస్తవమతం సంతృప్తి పరచింది. అధ్యయనానికి, సంస్కృతికి ఆశ్రయంగా క్రైస్తవమతం నిలచింది.

క్రమంగా క్రైస్తవమత గురువులు యీ నమ్మకాన్ని వమ్ముచేశారు. దేవుళ్ళు మానవుడి వ్యవహారాలను జాగ్రత్తగా చూస్తున్నట్లు ప్రకృతి స్వాభావికమైన మతం నచ్చచెప్పింది. కాని, క్రైస్తవఏకేశ్వరారాధన యీ నమ్మకాన్ని కొనసాగించలేదు. దేవుడిమార్గాలు మార్మికాలన్నది. ప్లేటో అనంతర ప్రభావం వలన, మధ్యయుగం ప్రారంభమౌతున్న రోజుల్లో, ప్రాచ్యదేశాలలో మార్మికవాద ప్రభావానికి క్రైస్తవమతం లోనైంది. మనుష్యరూపంలోని దేవుడి అలౌకికశక్తిని కాపాడాలని సామాన్యవ్యక్తి భావించాడు. ఆ అవసరం తీరడానికిగాను, సహజత్వానికి తిలోదకాలిచ్చిన క్రైస్తవ మతం మార్మికవాదాన్ని స్వీకరించడంతో బాటు, దైవమార్గాలను వివరించేటందుకు మతవిజ్ఞానాన్ని విపులీకరించింది. దేవుడికి మానవుని వ్యవహారాల్లో ఆసక్తి వున్నదని చూపడానికి యిదంతా చేశారు. దేవుడికి మానవుడికి మధ్య దళారీలుగా పురోహిత వర్గం(మతగురువులు) పెంపొందింది. భక్తులను సంపూర్ణంగా మతగురువులకు లోబడేటట్లు మార్మికమైన కర్మకాండ క్రతువు, పూజాపునస్కారాలన్నీ మతగురువు

---

1) రొమాంటిక్ భాషోద్యమం.

మాత్రం చేయగలడని పేర్కొన్నారు. మతగురువుకు ఈ శక్తి అంతా దేవుడు ప్రసాదించాడనే సిద్ధాంతాన్ని థామస్ అక్వినాస్ ప్రతిపాదించాడు. క్రీస్తుపక్షాన వ్యవహరించడానికి, క్రీస్తుశరీరంతో తాదాత్మ్యం చెందడానికి మతగురువుకే హక్కు వున్నదన్నారు. దీని ఫలితంగానే పోప్‌ను మానవాతీత అలౌకికస్థితికి తీసుకెళ్ళారు. క్రైస్తవమతంలో మార్మికవాదానికి, శక్తివంతమైన మతాచార్యుల పద్ధతికి పరాకాష్ఠగా పోప్ రూపొందాడు.

మొదట్లో రోంకు బిషప్‌గా వుంటున్న వారికి ఉన్నతస్థానం కట్టబెట్టి దైవాంశ సంభూతుడన్నారు. పవిత్రగ్రంథాల ఆధారంగా పోప్‌కు క్రైస్తవస్థానం యిచ్చి మతంలో క్రైస్తు చనిపోయినవారికి సజీవులకు స్వర్గనరకాలను ప్రాతినిధ్యం వహించినట్లే, పోప్‌కు ఈ లోకంలో స్థానం వున్నదన్నారు. మనిషికి ముక్తి ప్రసాదించే హామీ యిచ్చింది. క్రైస్తవమతం మతాధికారులు పెత్తనానికి రావడంతో మనిషికి మరణం మాత్రమే మిగిలింది. పునర్జన్మ అంటే మతరహిత విధానానికి పోవడమే.

మతంలో దిగజారుడు విధానాన్ని బర్క్‌హార్ట్ యిట్లా వ్రాశాడు. "ఏం చేసినా ఫర్వాలేదనే దృష్టితో చాలా దుష్ప్రవర్తన ప్రబలింది. చిత్తశుద్ధి, మేధస్సులపై చావుదెబ్బలు కొట్టి, మహోన్నత వ్యక్తులను నిరాశ అపనమ్మకంలోకి మతం నెట్టేసింది." అంతర్ముఖంగా అట్లావచ్చిన వైమనస్యత ఫలితమే పునర్వికాసం. నిరాశ వలన మానవుడు మతేతరం వైపు దృష్టి సారించాడు. జీవితాన్ని మనఃపూర్వకంగా అనుభవించడమే పునర్వికాసం. క్రైస్తవులు నమ్ముతున్నట్లు ప్రపంచం త్వరలో నాశనం చెందదని అంతా విచారకరంకాదని, ప్రపంచంలో ఆనందం ఉన్నదని పునర్వికాసం చెబుతున్నది. మధ్యయుగాలలో క్రైస్తవసంస్కృతికి వ్యతిరేకంగా పునర్వికాస మానవవాదం తిరుగుబాటు చేసింది. అదొక కొత్త జీవనం. మతపరంగా కలహాలు, మతాధిపతుల నిరంకుశత్వం, మతగురువుల దురహంకారాలకు భిన్నంగా పునర్వికాసం వేరోచోట ఉత్తేజానికై అన్వేషించింది.

క్రైస్తవుల ఆత్మకు మతగురువు కాపలాదారన్నమాట. పునర్వికాస వ్యక్తులందరూ గుంపుగా తమను మతగురువులు మళ్ళెయ్యడానికి అంగీకరించలేదు. తన స్వవిషయం తానే చూసుకుంటానన్నాడు. నీటివూటలు, పర్వతాలు, అరణ్యాలు దయ్యాలకు నిలయాలని క్రైస్తవమతం ఆనాడు మానవులకు బోధించింది. మత గురువుల భయాన్ని పునర్వికాసం పోగొట్టింది. తిరుగుబాటు చేసిన మానవుడు ప్రకృతిని ప్రేమించాడు. దాని రామణీయకతలను ఆనందించాడు. అతనిలో యివన్నీ గాఢంగా వ్యక్తమైనవి. నాటి లాటిన్ కవితలు "క్లెరిసివ గాన్‌టెస్"లో యీ కొత్త సంస్కృతి బాగా వ్యక్తమైంది.

ఫ్రెంచిలో రొమాంటిక్ కవుల సెక్యులర్, మతవ్యతిరేక సంప్రదాయాలను పుణికి పుచ్చుకున్న ధోరణి యీ కవితలలో వుండేది. వీటిని అజ్ఞాతకవులు పేరు తెలియని మతగురువులు వ్రాశారు. బర్క్‌హార్ట్ యిలా వ్రాశాడు."ఒకవైపున కాటోస్, సిపియోస్ వంటివారు క్రైస్తవనాయకులుగా రుషులుగా వుండగా మరొకప్రక్క జీవితాన్ని పూర్తిగా ఆనందిస్తూ అనుభవించే ధోరణి కవితలలో ప్రవహించింది. 12వ శతాబ్దంలో యీ లాటిన్ కవితలు స్వల్పమైనవేగాని, ఇందులో ఐరోపా అంతటికి భాగం వున్నది. ప్రాచీన జీవనవిధానమంతా వీటిలో మళ్ళీ కనిపించింది. ఉనికిలో అస్థిరత్వం, జీవితం పట్ల స్వేచ్ఛగా అభిప్రాయాలు వెల్లడించడం, మతరహిత ధోరణి కవిత్వంలో బాగా వెల్లడైంది."

ఆధ్యాత్మికంగా తిరుగుబాటు చేయడం, ఉద్వేగాన్ని త్యజించడంతో, పునర్వికాసం అందాన్ని ఆరాధించి జీవితానందం పట్ల మొగ్గుచూపింది. "సన్యసత్వానికి వ్యతిరేకంగా రామణీయకతను" వరించింది అని నాటి ధోరణిని లార్డ్‌యాక్టన్ వర్ణించాడు. ఇతర విషయాలలో అభిప్రాయభేదాలు ఎట్లా వున్నప్పటికీ, చరిత్రకారులందరూ పునర్వికాస కళను ప్రస్తుతించారు. అయితే మానవవాదం నీతి పట్ల ఉదాసీనంగా, నిర్లిప్తంగా, వ్యతిరేకధోరణిలో వున్నదని విమర్శ వచ్చింది. నీతికి రామణీయతకుగల సంబంధం గురించి ఆచరణలో ఎదుర్కొంటున్న సమస్యలను మానవుడి నిర్ణయాలలోని దోషాలను ధైర్యంగా ప్రస్తావించడం పునర్వికాస సంస్కృతిలో విశిష్టలక్షణం. ఇది కొత్తసమస్యేమీ కాదు. నీతి పట్ల ఉదాసీనంగా వుంటున్న మనుషులు సృష్టించిన విషయం అనటానికి వీల్లేదు. ఈ సమస్య తత్వంతోపాటే వస్తున్నది. కనుక మానవసంస్కృతి చరిత్ర ఆరంభమైనప్పటి నుంచి యిది చూడవచ్చు. గ్రీకులు ఈ సమస్యను పట్టించుకొని, అనేక పరిష్కార మార్గాలు సూచించారు. ఇందులో ప్లేటో, పెరిక్లిన్, ఎపిక్యూరస్, స్టాయిన్ మార్గాలున్నవి. క్రైస్తవ సంస్కృతి వెయ్యేళ్ళ అనుభవం తరువాత ఆధ్మాత్మిక సంక్షోభం ఏర్పడి మళ్ళీ సమస్య ఏర్పడి యీ సమస్య మళ్ళీ జనించింది. పునర్వికాస మానవతావాదులు యీ సమస్యను ధైర్యంగా ఎదుర్కొన్నారు. వారి మార్గం ఆచరణయుక్తమైంది. నీతికి రామణీయతకూ గల సంబంధాన్ని గురించి వారు సిద్ధాంతీకరించలేదు. ఈ సమస్యకు పరిష్కారమార్గం సూచించే విధంగా వారు జీవితాన్ని గడిపారు. సన్యసత్వానికి రామణీయతకు సంఘర్షణగా వారీ సమస్యను ఎదుర్కొన్నారు.

మధ్యయుగాల క్రైస్తవసంస్కృతి, స్టాయిక్ సంప్రదాయాల ఆధారంగా, సన్యసత్వమే ధర్మం అని భావించింది. ప్రపంచం దుఃఖపూరితం. అందులోనిదంతా పాపభూయిష్టమని తలచారు. జీవితాకర్షణలకు దూరమైతే, దైవానికి సన్నిహితుడౌతారని ముక్తికి అవకాశాలు ఎక్కువగా వుంటాయని తలచారు. మనిషిగా బ్రతకడానికి తగిన ప్రోత్సాహమంతా యీ విధానంలో నశించింది. రుషిగా ఉండడం ఆదర్శప్రాయం.

అది సాధించలేనందున, కనీసం గౌరవప్రదంగా ఆ మార్గాన్ని అనుసరించనందున సాధారణ మానవుడు, కపటానికి, ధర్మం అనే ముసుగు కప్పేశాడు. దివ్యసత్వం అనేది ఆదర్శంగా పెట్టుకొని, వాస్తవజీవితంలో కల్లకపటపు జీవితాన్ని గడపడం నాటి క్రైస్తవులకు పరిపాటి అయింది. కపట రుషులతో ప్రపంచం నిండిపోయింది. సహజమైనది. మానవతకు చెందినదంతా పవిత్రత పేరిట నిషిద్ధమైపోయింది. రుషులు దేవతలు కావాలని చిత్తశుద్ధిగానో, కపటంగానో ప్రయత్నించేవారితో క్రైస్తవప్రపంచమంతా వెర్రివాళ్ళ వింత ప్రదర్శనశాలగా మారకుండా వుండాలంటే, అసత్యం కపటంతో పరిశోధనాలయంగా మారకుండా అట్టిపెట్టాలంటే ధర్మం నీతి పేరిట జరిగే దానిపై తిరుగుబాటు జరపడం అత్యవసరమైనది. ప్రొటెస్టెంట్ చరిత్రకారుడు కూడా ఉత్తరోత్తరా యిది అంగీకరించాడు. "మంచి అవగాహనవున్న వ్యక్తిగాని, అద్భుతాల వలన ప్రభావితుడు కాని వ్యక్తిగాని, ఐరోపాలో వున్న పరిస్థితులు మారకుండా వుండాలనుకోడు. వాస్తవాన్ని చిత్తశుద్ధితో గ్రహించాలనుకునే వ్యక్తి ఎవరూ వీటి ప్రభావాలకు లోనుగాడు. అదీగాక మానవజాతి సంక్షేమానికి సంతోషానికి యిదొక్కటే ఏకైకమార్గం ఎలా అవుతుందో అర్థంగాకుండా వున్నది."

అటువంటి ఆధ్యాత్మిక సంక్షోభాన్ని ఎదుర్కోడానికి మానవవాదం తలెత్తింది. మధ్యకాలాల్లోని క్రైస్తవ సంస్కృతి చెప్పే అలౌకికవాదం సహజవాదానికి వ్యతిరేకం. దేవుడు తన రూపంలో మానవుడిని సృష్టిస్తే, మానవుడి మాంసం అపవిత్రం కాదు. అతని కోర్కెలు పాపభరితం కాజాలవు. అవి తీర్చుకోవడం అవినీతికరం కాబోదు. మానవవాదం అవినీతికరం కాదు. ధర్మాన్ని సన్యసత్వంతో సమానం చేసి చూచిన నీతిని మానవవాదం తృణీకరిస్తుంది. రుషి కావాలనే వృథా అన్వేషణలో మానవత్వాన్ని చంపడాన్ని అది అంగీకరించదు. కొత్తనైతిక ప్రమాణం ఏర్పరచబడింది. అదే సహజవాదం. మానవుడు ప్రకృతిలో భాగం కనుక, ప్రకృతి సంపదను ప్రకృతి నియమాలననుసరించి అనుభవించటం ధర్మం. లేకుంటే అధర్మం. రామణీయకతకూ, సహజస్వభావంతో కూడిన నైతిక శాస్త్రానికి గల సంబంధం స్పష్టం. సాంస్కృతిక చరిత్రలో చిరకాలంగా వున్న సమస్యకు ఆచరణయుక్తమైన పరిష్కారమార్గాన్ని సూచించి, కళాభివృద్ధికి పునర్వికాస మానవవాదం తోడ్పడింది.

ప్రస్తుతం ప్రసిద్ధ గ్రంథంగా పేర్కొంటున్న నోట్‌బుక్‌లో లెనార్డొవించె యిట్లా వ్రాశాడు. "ప్రథమ సూత్రాలకై నేను అన్వేషించాను. ప్రకృతి దానంతట అదే ఎలా పనిచేస్తున్నది. దానిని సమీపించడం ఎలా తెలుసుకోగలుగుతున్నాం. మనదృష్టి ఎలా పనిచేస్తున్నది. దృష్టిద్వారా రూపాలు ఎలా వస్తాయి. శిల్పం చిత్రం ఏవిధంగా రూపొందించాలి."

ప్రకృతిని వైజ్ఞానికంగా పరిశీలించడం పునర్వికాస కళకు ప్రాతిపదికగా వున్నది. ధర్మాన్ని సన్యసత్వంతో తాదాత్మ్యం చేసిన క్రైస్తవ నీతికి దీనికి పొందికలేదు. సహజమైన కోర్కెలను అణచివేయాలని క్రైస్తవనీతి వృధాప్రయత్నం చేసింది. ప్రకృతిలో మనం భాగమని, దాని నియమాలకు మనం కట్టుబడాలని, ప్రకృతి రమణీయతలను ఆనందించాలంటే జీవితానుభవమే అర్హత సంపాదించి పెట్టిందని గ్రహించాలి. లేకుంటే ప్రకృతి నియమాలను పాటించలేం. ప్రకృతి దృశ్యాలను ఆనందించలేం. ఆ రమణీయతలకు ఉద్వేగపూరితంగా స్పందిస్తే తప్ప కళలలో అది ప్రతిబింబించదు కూడా. మానవవాదులకు కళ అంటే నైతిక సత్యపు చిహ్నమన్నమాట. "నైతిక దృక్పధానికి అదొక రూపాలంకారంగా భావించబడుతుంది." పునర్వికాస కళ కేవలం ప్రకృతి అనుసరణ కాదు. అదొక వాస్తవ పరిశోధన. మానవవాదానికి అదే నైతిక సత్యం.

పరిణామక్రమాన్ని జాగ్రత్తగా అనుసరించకపోతే మానవవాద రమణీయకతలోని నైతిక ప్రాధాన్యత గ్రహించడం కష్టం. తొలి పునర్వికాస కళాకారులు చాలావరకు సన్యాసులే. డాంటే సైతం మధ్యకాలపు అలౌకికవాదానికి ప్రతినిధే తప్ప, ఉదయిస్తున్న మానవవాద సహజత్వానికి ప్రతీకకాదు. అయినా అతను సృష్టించిన బీట్రిస్‌పాత్ర దుఃఖమయ ప్రపంచానికి" చెందిన రక్తమాంసాలుగల స్త్రీ గానే వున్నదిగాని, దేవతగా మాత్రం కాదు. అలాగే తొలి పునర్వికాస కళాకారుల చిత్రాలుగూడా మానవజీవితానికి చేరువగా వున్నాయి. క్రైస్తవుల సన్యసత్వ భావంతో ఆదర్శప్రాయం చేసిన 'పవిత్రమాత'కు టిషెన్(5) చిత్రించిన మెడోనాకు సామ్యం లేదు. లినార్డొ చిత్రించిన మొనాలిసా కూడా కుటిలం గాకున్నా సమ్మోహనం గావించే చిరునవ్వు చిందిస్తుంటుంది.

ప్రకృతిలో కళాకారుడు కలిసిపోవాలని లినార్డొ చిత్రకళ గురించి వ్రాస్తూ పేర్కొన్నాడు. అప్పుడుగాని ప్రయోజనాన్ని గ్రహింపజాలడని, వస్తుచలనంలోని ఉద్వేగాన్ని పరికింపజాలడని అతను అంటాడు. ప్రకృతి వెనుక అలౌకిక మర్మవాదనేదో వున్నదని నమ్మని సహజవాదం పునర్వికాస కళకు ప్రేరేపణ అయ్యింది. సన్యసత్వమే ధర్మానికి కొలమానం అనడాన్ని త్రోసిపుచ్చిన సహజవాదం నైతిక దృక్పథంతో కూడినదే "మానవవాదుల స్వయం నిర్ణయం బహిరంగమైనది. సిగ్గుపడవలసినది కాదు. పందెపు గుర్రంవలె మానవుడు స్వయంగా శిక్షణ పొందాలి. పుష్పంవలె పోషించుకోవాలి. అప్పుడే శరీరం ఆత్మసంపూర్ణతకు చేరుకోగలవు. అందులో నీతి యిమిడివుంది."

పునర్వికాస మానవవాదులు నీతిని పట్టించుకోకుండా వుండలేదు. వ్యసనాన్ని ధర్మంగా ఆచరించడాన్ని వారు తృణీకరించారు. నైతికశాస్త్రానికి కొత్త ప్రమాణాన్ని యేర్పరచి, కళలలో నూతన నైతిక విలువలను సృష్టించారు. అయినప్పటికీ పైపైన గమనించేవారికి తొలిమానవవాది నైతిక సమస్యలపట్ల వ్యతిరేకదృష్టి చూపి

నట్లనిపిస్తుంది. అలోకిక ఆధారం కోరిన పాతప్రమాణాలను వారు కాదన్నారు. నీతికి వేరే ఆధారం కావాలని భావించలేదు. నైతికశాస్త్రంలో గందరగోళం సృష్టించకుండా వుండడానికి మతం లేదా అలౌకిక వాదం నుంచి నీతిని విడదీయలేదు. నీతికి సెక్యులర్ ఆధారం ఏర్పడినంత వరకూ యిలా సాగింది. నైతిక గందరగోళాన్ని మానవతావాదం సృష్టించినదనే భావన కలుగకపోలేదు. తలవని తలపుగా సెక్యులర్ నీతి సిద్ధాంతాన్ని పునర్వికాస కళ సూచించింది. తరువాత తెలిసివచ్చిన జీవశాస్త్రం ఆధారంగా యీ సిద్ధాంతాన్ని విపులీకరించ సాధ్యపడింది. ఈ విషయంలో కూడా మూడు శతాబ్దాలు ముందుగానే లినార్డో ఊహించగలిగాడు. ప్రకృతి నియమబద్ధమనేగాక మానవుడు ఆ నియమాలను కనుగొనవచ్చని, ఉన్నతజీవులలో'మనోనియమం'గా యివి పనిచేస్తాయని లినార్డో వ్రాశాడు.

11వ శతాబ్దంలో పశ్చిమ ఐరోపా అంతటా మేధావుల చైతన్యత స్పష్టపడినా ఇటలీలోనే అది పరాకాష్టకు చేరడానికి కారణం ఏమిటి? ఐరోపా యావత్తూ హాయిగా నిద్రిస్తున్న సమయంలో 1350-1550 మధ్య ఇటలీ కళల్ని, పాండిత్యాన్ని, సాహిత్యాన్ని ఏథెన్స్ అనంతరం ప్రపంచంలో ఎక్కడా లేనంతగా సృష్టించడంతో "యీ సమస్య మరీచిక్కుగా కనిపిస్తుంది. మేధాసంపత్తిలో 15వ శతాబ్దం మరీ ఒట్టిపోయింది. ఇంగ్లండులోనే కాక ఫ్రాన్స్‌లో పరిస్థితిగూడా అంతే. పాశవిక గతాన్నుండి బయట పడడానికి జర్మనీ పెనుగులాడుతున్నది. చరిత్రకారులు ఈ సమస్యను మధించగా భిన్న సమాధానాలు వచ్చినాయి.

అయితే ఒక విషయాన్ని అంతగా గమనించలేదు. ఐరోపా సంస్కృతిలో సువర్ణయుగం అనదగిన ఆ రెండు శతాబ్దాలలో జాతీయరాజ్యాలు తలెత్తుతూ పశ్చిమ ఐరోపాలో నిలదొక్కుకొనడం మొదలెట్టాయి. ఇటలీలో రాజకీయ గందరగోళం వున్నది. సంస్కృతికి జాతీయవాదానికి గల సంబంధం దీనినిబట్టి తెలుసుకోవచ్చు. జాతీయ వాదానికి ప్రవక్తగా పేరొందిన మైకవెల్లి(1) ఇటలీ పునర్వికాసంలో ఆవిర్భవించినవాడే. కాని పునర్వికాసపు వ్యక్తిగా మైకవెల్లి ఇంకా గొప్పవాడు. అతను మానవవాది కూడా. ఆవిధంగా అతడు విశ్వజనీనుడు. పునర్వికాస సంస్కృతిలో మానవవాదం, విశ్వజనీనత తార్కికంగా కలసిపోయినాయి. 13వ శతాబ్దాంతానికి ఫ్లారెన్సులో జాతీయవాదం వంటిది పెంపొందక పోలేదు. పునర్వికాస మానవవాదం వలన కొత్తగా తలెత్తిన జాతీయసంస్కృతి కలుషితమైనదనే చరిత్రకారులు కొందరున్నారు. జాతీయవాద కవిగాను డాంటేను పేర్కొంటారు. కాని మతేతర ప్రాచీనత నుంచి ఉత్తేజం పొందినవారిలో అతను ప్రథముడు. అది జాతీయవాదం మాత్రం కాజాలదు. గ్రీస్ జాతీయ దేవతలలో నమ్మకం లేనందుననే సోక్రటీస్(2) అమరజీవి కావలసి వచ్చింది. ప్లేటో(3) ఉత్తమ

పౌరుడు కాదు. జెనెఫన్(4) అయితే మంచివాడు కాదనేది స్పష్టం. డైజినజ్ (5) యిల్లులేకుండా సంచారిగా ఆనందించాడు. ప్రాచీన మానవతావాదుల విశ్వజనీనతలో ఓలలాడిన డాంటే యిలా గానం చేశాడు. "నా దేశమే సర్వప్రపంచం" "పండితుడు ఎన్నుకొన్న ప్రదేశమే అతని నివాసం"అని పెట్రార్క్ చెప్పాడంటారు. విశ్వజనీనత అనేది ఆత్మ ప్రశాంతతకు వ్యక్తీకరణగా పెట్రార్క్ అన్నాడు. దేశభక్తిపూరితంగా వున్నవారి నెదుర్కొనే కష్టాలపట్ల వీరు పట్టించుకొనరు. రాజకీయాసక్తి లేకుండా, వ్యక్తిగత అభిరుచితో సర్వజన సంక్షేమాన్ని కోరే లక్షణం, లేదా రాజకీయేతర దృష్టిని అవలంబించే ధోరణి, మానవతా మేధావులకు అలవాటైపోయింది. గిబెర్టి(6) యిలా అన్నాడు. "అన్నీ నేర్చినవాడు ఎక్కడా పరాయివాడు కాజాలడు. అతని సంపద పోయినా, స్నేహితులు లేకున్నా ప్రతిదేశంలో అతను పౌరుడే. మారేసంపదలను అతను నిర్భయంగా ఈసడించగలడు. "గలీలస్ మార్షస్ మత దండననుండి లారెంజొమెడిసి (7) చే తప్పించబడినవాడే. అతనిలా వ్రాశాడు. "ఏ జాతికి చెందినవాడైనా సరే, తలెత్తుక తిరగగలిగితే, సహజనియమానుసారం నడిస్తే, స్వర్గానికి పోతాడు." పునర్వికాస కర్తల భావాలు యిందులో ప్రతిధ్వనిస్తున్నవి.(8)

మానవవాదం నుంచి సార్వజనీనత తార్కికంగా వస్తుంది. అదట్లావుంచి పునర్వికాస సంస్కృతి వ్యక్తికి ప్రాధాన్యత యిస్తుంది. ఆ విధంగా ఉత్తరోత్తరా ఉదారవాద ఉద్యమాలకు యిది ప్రేరణ యిచ్చింది. "కావాలనుకుంటే మానవులు అన్నీ చేయగల"రనేదే ఆల్బెర్టి నానుడి తరువాత తరాల వారికిది సుప్రసిద్ధమైంది. ప్రాచీన సాహిత్య ప్రభావ ఫలితంగా పునర్వికాస సంస్కృతిలో పేర్కొనదగిన లక్షణాలన్ని జనించాయి. వ్యక్తిగౌరవం మానవుడి సృజనాత్మక శక్తిలో విశ్వాసం, యథేచ్ఛగా వ్యవహరించడాన్ని సమర్థించడమనేవి యీ లక్షణాలే. "వ్యక్తి ఉన్నతాభివృద్ధికి యీ కాలంలో అవకాశం కలిగింది. తరువాత అన్ని పరిస్థితులలో అన్ని కోణాలనుంచి వ్యక్తి తననుతాను అధ్యయనం చేసే పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రభావంతో మానవస్వభావాన్ని వ్యక్తిస్వభావాన్ని నిర్వచించడం సాధ్యపడింది."

పునర్వికాస సంస్కృతి గురించి మిషెలా యిదే విధమైన నిర్ణయానికి వచ్చాడు.

---

1) 1469-1527 ఇటలీలో రాజకీయ తత్వవేత్త.
2) క్రీ.పూ. 469-399 ఏథెన్స్‌లో తత్వవేత్త
3) క్రీ.పూ. 427-347 గ్రీక్ తత్వవేత్త
5) క్రీ.పూ. 412-323 గ్రీస్‌లో నిరాశావాద తత్వవేత్త
6) 1378-1455 ఫ్లొరెంటెన్‌లో శిల్పి, చరిత్రకారుడు.
7) 1449-92 వదవలియో తండ్రి, ఫ్లొరెన్స్ పాలకుడు కళాపోషకుడు.
8) సార్వజనీన మానవతావాదాన్ని ఎలుగెత్తి చాటినవాడు ఎరాస్మన్.

"మానవుడి సంపూర్ణ స్వభావాన్ని వెలుగులోకి తీసుకురావడంతో పునర్వికాసం, ప్రపంచంలో కనుగొంటున్న అనేక కొత్త విషయాలకు మరొకటి జోడించింది."

ఈ విధంగా చూస్తే, యిదంతా ఇటలీ జాతీయ సంస్కృతి ప్రతిబింబమని గాని, బూర్జువా సిద్ధాంతమనిగాని చెప్పడానికి వీల్లేదు. ఇది మానవుడి తిరుగుబాటు. మతాల సంకెళ్ళు తెంచుకొన్న విశ్వమానవుడు, మానవ సంస్కృతీ సంపదకు వారసుడిగా, జాతీయ హద్దులుదాటి తన దృక్పథాన్ని సృజనాత్మకతను విప్పారజేసుకున్నాడు. డాంటే, పెట్రార్క్, బొకాషియె లెనార్డ్గో, రాఫెల్, మైకెలాంజెలో, ఆల్బెర్టి, అరెటినొ యిత్యాది మానవ మేధావుల సముదాయం కలిస్తే, పునర్వికాస మానవుడు, విశ్వజనీనమైన మానవుడు స్వేచ్ఛా మానవాళికి ప్రతినిధిగా ఆవిర్భవించాడు. ఆ మానవుడు ఏ దేశానికి, ఏ జాతికి, ఏ యుగానికి పరిమితం కాదు. గతంలోని సంస్కృతిని పుణికి పుచ్చుకొని, ఆవిర్భవించనున్న భవిష్యత్తుకై కొత్త సంస్కృతిని వారు సృష్టించారు.

ఈ విశిష్ట సంఘటన జరగడానికి ఇటలీలో 14వ శతాబ్దం అనుకూలంగా వుంది. సమిష్టి తత్వం పేరిట సజీవమానవుడిని బలియిచ్చేశక్తి యేదీ అక్కడ తలెత్తే అవకాశం లేదు. క్రైస్తవమతం అపనిందల పాలయ్యింది. తన కుటిలత్వం వలన మన వాటికన్ అధికారం బలహీనపడింది. జాతీయ రాజ్యం అంటూ ఏదీలేదు. వ్యవస్థకు నాయకత్వం వహిస్తామనే ఒక వర్గం లేదు. విమోచకుడు పాలించడానికి కొత్త వ్యవస్థ లేదు.

14వ శతాబ్దంలో రెండవ ఫ్రెడరిక్ మరణానంతరం ఇటలీ అనేక నగర రాజ్యాలుగా చీలిపోయింది. దక్షిణాది అంతా సంపన్న సైనికుల నిరంకుశ పాలన క్రిందకు పోయింది. తమ స్థితిని కట్టుదిట్టంగావించుకునే నిమిత్తం, షార్లె మాగ్నెను అనుకరిస్తూ, ప్రతిభావంతులను కూడాగట్టుకోనారంభించారు. కొలువులలో అలంకరించిన కవులు, పండితులు, శాస్త్రజ్ఞులు, కొత్తగా వచ్చేవారికి వారసత్వం కట్టబెట్టేవారు. చాలామంది ఉత్తరాది నుంచి మిలన్, ఫ్లొరెన్స్, వెనిస్, బూర్జువాలు ఆవిర్భవిస్తున్న చోటు నుంచి ప్రవాసం వచ్చారు. అందులో డాంటే ఒకడు. దక్షిణ ఇటలీ నిరంకుశ ప్రభువులలో ఒకరైన గ్రాండ్ డెల్లా స్కాలా(వెరోనా) ఆదరణలో డాంటేతో పాటు జోటో(1) కూడా పాలుపంచుకున్నాడు."ఇటలీ నిరంకుశత్వాలు మానవుడి స్వేచ్ఛకు అడ్డురాలేదు. బానిసత్వాన్ని ప్రవేశపెట్టలేదు."(2)

ఆ వాతావరణంలో పుట్టుకకు ప్రాధాన్యలేదు. ప్రతిభనే పరిగణించేవారు.

1) 1266-1337 ఫ్లొరెంటైన్ శిల్పి, చిత్రకారుడు.

2) ఫిషర్, హిస్టరీ ఆఫ్ యూరోప్

సంపన్నమైన, మతపరమైన చైనా మధ్యయుగాల సమాజం కులవ్యవస్థతో వుండేది. ఉన్నతవంశంలో పుట్టినవారికే గౌరవస్థానం లభించేది. 14 వ శతాబ్దపు ఇటలీలో కులభేదాలు అదృశ్యమయ్యాయి. పాండిత్యం, ప్రతిభ సమాజంలో అత్యున్నత స్థానం ఆక్రమించాయి. "ఔన్నత్యం ప్రతిభ ననుసరించి, సంక్రమించిన సంపదను బట్టి వుంటుందని" అరిస్టాటిల్ అన్నాడు. ఈ మధ్యయుగాల సంస్కృతికి తత్వవేత్తగా వున్న అరిస్టోటిల్‌ను సరిదిద్ది డాంటే "వ్యక్తి ప్రతిభ అతని పూర్వీకులపైన ఆధారపడి ఔన్నత్యం వుంటుందన్నాడు. స్వర్గంలోని తమ పూర్వీకులతో మాట్లాడుతూ డాంటే యిలా వాదించాడు." ఔన్నత్యం అనేది నిరంతరంగ కాంతిపుంజం. కాలం అందులో ఎప్పుడు కొంత హరించి వేస్తుంటుంది. మనం నిత్యం కొత్తగా జోడిస్తేతప్ప (3) నైతిక మేధావ్యుత్పన్నతనే ఔన్నత్య లక్షణంగా డాంటే తరువాత పేర్కొన్నాడు.

పునర్వికాస మానవవాదానికి అది ప్రారంభదశ. కొత్త విలువలు సృష్టించబడినవి. మానవుడి మంచి చెడ్డలు పుట్టుకను బట్టి వుండవన్నది పోగియో(4) యెలుగెత్తి చాటాడు. "వ్యక్తిగత ప్రతిభకు మించిన ఔన్నత్యం లేదు." మిగిలిన మానవవాదులు అతనితో ఏకీభవించారు. మధ్యయుగాలలో జాతి, ప్రజ, కుటుంబం, గిల్డ్ సభ్యుడుగానే గుర్తింపు ఉండేది. అతని వ్యక్తిత్వాన్ని పునర్వికాసం గుర్తింపజేసింది. సమిష్టి ఉనికికి వ్యక్తి మూలం. "మానవుడు చింతనాజీవి. " (1)

అరబ్బు పండితుల వివేచనాత్మక, వైజ్ఞానిక ఆలోచన ప్రభావం వలన ఇటలీలో పునర్వికాసం విజయవంతమైంది. ప్రాచీన నాగరికత పతనమైన తరువాత, దాని ఫలితాలు–విజ్ఞానం, వివేచన – అరబ్బులు స్వీకరించారు. తొలి క్రైస్తవమతం, ముఖ్యంగా ఆఫ్రికాకు చెందినవారు, విజ్ఞానం తత్వం పట్ల జుగుప్స చూపారు. అలెగ్జాండ్రియా గ్రంథాలయాలను నాశనం చేశారు. బిషప్ థియోఫిలస్ ఆజ్ఞానుసారం హైపాషను(2) చంపేశారు. ముస్లింలు యీ ప్రాచీన విద్యాకేంద్రాన్ని ఆక్రమించుకొనక పూర్వం 300 సంవత్సరాల ముందే యిదంతా జరిగింది. 6 వ శతాబ్దారంభంలో, ఏథెన్సులోని విద్యాలయాలన్నిటినీ జస్టినియన్(3) చక్రవర్తి మూసేయించాడు. అక్కడి అధ్యాపకులను తరిమేయగా, వారంతా సిరియా, మెసపటొమియా, పర్షియాలకు పారిపోయారు. స్పెయిన్, ఇటలీ ద్వారా ప్రాచీన సంస్కృతి సంపద ఐరోపాకు చేరింది. ప్రాచీన నాగరికత

3) డివైన్ కామెడి
4) ఇటలీ హ్యూమనిస్టు, 1382- 1459.

1) బర్క్ హార్ట్, రినైజాన్స్
2) 370-415 గ్రీక్ తత్వవేత్త. అందగత్తెగా ప్రసిద్ధి.
3) 483-565 బైజాంటిన్ చక్రవర్తి

క్రైస్తవుల మత ద్వేషానికి గురికాగా, అరబ్బులు గ్రీక్ చదువులను త్రవ్వి వెలికితీసి కాపాడారు. అదంతా ఐరోపా చేరి కొత్త సాంస్కృతిక, నవనాగరికతకు నాంది పలికేలోపుగా, అరబ్బు పండితులు, తత్వవేత్తలు యీ సంపదకు యింకా జోడించారు. పారిస్ విశ్వవిద్యాలయానికి చెందిన నామినిలిస్ట్ తత్వవేత్తలు క్రైస్తవ సనాతనాన్ని తొలుత భేదించారు. సార్వత్రిక సూత్రాలకు విశేష సూత్రాలకు గల సంబంధం గురించి మొదట ప్రశ్నించిన అరబ్ తత్వవేత్త అవిసెన్నను(4) పారిస్ నామినిస్టులు ప్రతిధ్వనించారు. అరబ్ తత్వవేత్తలు సాధారణంగా అనుభవవాదం వైపు మొగ్గు చూపారు. కనుకనే గ్రీకులనుంచి తెచ్చుకున్న విజ్ఞానానికి చాలా జోడించ గలిగారు. 9 వ శతాబ్దానికి, విజ్ఞానానికి సంబంధించిన ప్రముఖ గ్రీక్ గ్రంథాలయాలన్నిటినీ అరబిక్‌లోకి అనువదించారు. అరిస్టోటిల్ పై ప్రమాణ భాష్యకారుడుగా మధ్య యుగాలలో అరబ్ చింతనాపరుడు అవరోజ్‌ను(5) గుర్తించారు. మానవుడి మెదడుతో పాటు ఆత్మ నాశనమౌతుందని, వివేచన శాశ్వతమని, కనుక వివేచన సాధన ద్వారా విశ్వసూత్రాలతో, అమరమైన వాటితో సంబంధం పెట్టుకోవచ్చని అవరోజ్ చెప్పాడు. అవరోజ్ వివేచనవాదం వలన అరబ్ తత్వం స్పెయిన్ గుండా ఐరోపాను ప్రభావితం గావించింది.

ఈ అరబ్ పండితునికి రోజర్ బేకన్, అల్బర్టస్ మాగ్నస్ రెండో ఫ్రెడరిక్ చక్రవర్తి శిష్యులు. వీరు ముగ్గురూ మధ్యయుగాలలో తలమానికమైన వ్యక్తులు. మత భ్రష్టత్వానికి మూలంగా అవరోజ్‌తత్వాన్ని క్రైస్తవ సనాతనులు ఖండించారు. వివేచనాత్మక పాండిత్యవాదం, మతరహిత ఉద్యమాలు పునర్వికాసానికి స్వాగతం పలకడమే గాక, ఇసుకలోకి ప్రవహించే సెలయేర్ల వంటివి.

అరబ్ తత్వ ప్రభావం ఇటలీలో చైతన్యవంతమైంది. భావచ్ఛేద, శాస్త్రీయ దృక్పథాల ప్రభావం ఐరోపా ఆలోచనాపరులపై ఎట్లా చూపెట్టిందో యిక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. 13 వ శతాబ్దంలో ఉత్తర ఇటలీలో పాజూ విశ్వవిద్యాలయం మేధావుల కేంద్రంగా ఉన్నది. పాండిత్యవాద వివేచన ప్రభావం క్రింద మధ్యయుగాలలో యీ విద్యాకేంద్రం "అటవికతకు కోటగా నిలచి, 17వ శతాబ్దం వరకు మానవవాదానికి వ్యతిరేకంగా పెనుగులాడింది."

వెనిస్ వాణిజ్య ప్రభువులు పాజూ విశ్వవిద్యాలయాన్ని పోషించడం విశేషం. తలెత్తుతున్న బూర్జువా వర్గానికి పునర్వికాసానికి గల సంబంధం ఇందులో తెలుస్తుంది. క్రైస్తవసనాతనత్వపు బంధాలు తెంచుకోడానికి పాండిత్య వివేచనావాదం తోడ్పడినప్పటికీ,

---

4)980-1037 ఇస్లాం తత్వవేత్త ........

5) 1126-98 స్పెయిన్‌లో అరబ్ తత్వవేత్త

అవరోజ్ భాష్యం చెప్పిన అరిస్టాటిల్ తత్వపు కొత్త సంకెళ్ళను వేసింది. మతగురువుల బంధం నుంచి మానవుడి ఆత్మను విమోచన గావించారు. కాని అతని మనస్సు మాత్రం యింకా పెత్తందారీ విధానాల బంధంలోనే చిక్కుకుపోయింది. ఆచరణకుస్వేచ్ఛ వుంటే తప్ప యిచ్ఛకు స్వేచ్ఛ అనడంలో అర్థం లేదు. మానవుడి సార్వభౌమత్వం, సృజనాత్మకతకు హద్దులు లేవు. మానవుడు ఈ విషయాలను గ్రహిస్తేనే నిజమైన మానసిక విమోచన పొందినట్లు అవుతుంది. ప్రాచీన సంస్కృతీ సంపద మానవుడి అభివృద్ధి దశకు తోడ్పడాలంటే వివేచనకు మానవవాదం జోడించాలి. పాజూలో పదార్థ విజ్ఞానితో వివేచనావాది పోరాటం సలిపాడు. మానవవాది పెట్రార్క్ తీవ్ర ప్రతిఘటనతో పాండిత్యవాదం విచ్ఛిన్నమయ్యేవరకు యిట్లా సాగింది. మధ్యయుగాల నుంచి ఆధునికతకు గల సంధి కాలానికి  డాంటే ప్రాతినిధ్యం వహించాడు. అతను తొలి ఉద్వేగవాది. తమ భవిష్యత్తు తమ చేతుల్లో వున్నదని, తాము నివసించే ప్రపంచాన్ని తామే సరిదిద్దుకోగలమని ధైర్యంగా పునర్వికాస కర్తలు చాటారు గనుకనే వారంతా ఉద్వేగవాదులు.

దక్షిణ ఇటలీ నుంచి పునర్వికాసానికి బాగా ఊతం లభించింది. అరబ్ పండితులు పెంపొందించిన గ్రీక్ విజ్ఞానం అటునుంచే ఐరోపాకు చేరింది. పాండిత్య వివేచనా వాదానికి పాజూ కేంద్రం కాగా, విజ్ఞానబోధనకు సాలార్నో (1) కూడలి అయింది. 17వ శతాబ్దం వరకూ ఐరోపా అంతటి నుంచీ వైద్యవిద్యార్థులు అక్కడచేరి, అరబ్బులు పరిశోధించి పెంపొందించిన హిపోక్రిటజ్,(2) గాలెన్(3) బోధనలు నేర్చారు. అరబ్బు ప్రవక్త చేసిన శక్తివంతమైన బోధనలలో పరిచయం వలన సదవకాశాలు గల క్రైస్తవజాతి ఔన్నత్య భావన బలహీనపడింది. విప్లవాత్మకమైన యీ ప్రభావం దక్షిణ ఇటలీపై బాగా పడింది.

"మత దండయాత్రల కాలం నుంచి ఇస్లాం సాధించిన నాగరికత, జ్ఞానప్రభావం ఇటలీపై విశేషంగా వున్నది. సగం మహమ్మదీయ ప్రభుత్వాలుగా వున్న ఇటలీ యువరాజుల పోషణ, తూర్పుదక్షిణ మధ్యధరా తీరాలతో వాణిజ్య సంబంధాలవలన యిది సాధ్యపడింది. 13వ శతాబ్దంలో, మహమ్మదీయ  ఉన్నతాదర్శం, వ్యక్తిగౌరవం, గర్వాన్ని ఇటలీవారు గుర్తించారు."(4)

జర్మనీలో ఉత్తరాదిన తనకు పడని వాతావరణం వదిలేసి రెండో ఫ్రెడరిక్ చక్రవర్తి

1) దక్షిణ ఇటలీలో రేవు పట్టణం.

2) క్రీ.పూ. 460-360 గ్రీక్ వైద్యశాస్త్రవేత్త.

3) క్రీ.పూ. 130-200 గ్రీక్ వైద్య శాస్త్ర రచయిత.

4) బర్క్ హార్ట్ రినైజాన్స్.

ఆలివ్ చెట్లమధ్య దక్షిణ ఇటలీ సిసిలీకి వచ్చాడు. పునర్వికాసానికి అతను పెంపుడు తండ్రి, సంస్కృతి వుట్టిపడే వ్యక్తిగా అతను వికాసవంతుడైన సార్‌సెన్‌ల(5) తో స్నేహపాత్రుడై, విద్యార్జనను, విజ్ఞానాధ్యయనాన్ని కాపాడాడు. పాలెర్మో(6)లో అతని కొలువు కూటమి దక్షిణ ఇటలీ నిరంకుశ ప్రభువులకు ఆదర్శప్రాయమైంది. గొప్ప మానవవాదులు ఆ కొలువునలంకరించారు. పేరు పొందిన తన తాత బార్బరోసా (7) సంప్రదాయాన్ననుసరించి, రెండో ఫ్రెడరిక్ నిరంతరం పోప్‌పై యుద్ధం ప్రకటించి, వాటికన్ పెత్తనాన్ని ధిక్కరించవలసిందిగా ఇటలీ యువరాజులను పురికొల్పాడు.

తమ ధిక్కారానికి సూచనగా సెక్యులర్ విద్యను నేర్చి, మానవవాదాన్ని యువరాజులు పెంపొందించారు. "ఐరోపాలో తొలుత దక్షిణ ఇటలీలోనే స్వేచ్ఛ తలెత్తింది. ఇటలీ దక్షిణభాగం, ముఖ్యంగా సిసిలీ వివేచనాత్మకులకు జన్మభూమిగా సహనానికి కాణాచిగా వుండేది"

వివేచనాత్మక పాండిత్యవాదానికి వ్యతిరేకంగా జరిపిన పోరాటంలో మానవ వాదులు ప్లేటో వైపునకు పయనించారు. పాండిత్యవాదులు అరిస్టాటిల్‌ను ఆశ్రయించారు. మానవవాదులు ఎపిక్యూరియన్లు కూడా. ఎపిక్యూరియన్, స్టొయిక్ సంప్రదాయాలపై వీరి వ్యక్తిత్వవాదం ఆధారపడివున్నది. అరబ్ పండితులు, చింతనా పరుల ద్వారా ప్లేటో మానవవాదం, గ్రీకుల విజ్ఞానం ఇటలీ చేరుకోగా, ఎపిక్యూరియన్ వాదం, స్టొయిక్ వాదనలు సరాసరి శతాబ్దాల క్రితమే ఇటలీ చేరి, క్రైస్తవుల రాక పూర్వమే రోంలో మేధావులను ప్రభావితం చేసింది. జర్మనీ నుంచి పాశవికులు దండెత్తి రోంను అణచివేసిన అంధకారయుగంలో ఎపిక్యూరస్ రచనలన్నీ నాశనం చేశారు. కాని సిసిరో రచనలు, బాక్రిషన్ నీతికావ్యం క్రైస్తవుల పవిత్ర ఆగ్రహానికి గురికాలేదు. అరబ్బు శాస్త్రజ్ఞుల తత్వవేత్తల ద్వారా ప్రాచీన గ్రీకుల సందేశాలను ఆహ్వానించడమేకాక, పునర్వికాస మానవవాదులు ప్రాచీన మతేతర సంప్రదాయాలను కూడా స్వీకరించారు. సిసిరో, లూక్రిషన్ ద్వారా దైవరహిత విశ్వం గురించి ఎపిక్యూరస్ దృక్పథాన్ని, ధర్మాన్ని ఆధారంగా ఆనందం రాబట్టే తీరును కూడా వీరు గ్రహించారు. 12వ శతాబ్దంలో ఎపిక్యూరస్ వాదం క్రైస్తవ మతానికి కొరకరానికొయ్య అయింది. అది మత భ్రష్టమని ఇటలీ అంతటా ఖండించారు.

1115లోను 1617 లోను ఫ్లారెన్స్ చాలావరకు తగలబడినప్పుడు, "ఎపిక్యూరస్

---

5) ఇటలీపై దాడిచేసిన అరబ్బు వర్తకులు.

6) సిసిలీ రాజధాని, రేవుపట్టణం.

7) 1126- 90.

మతరహిత విధానానికి, విలాసజీవితంపైన దైవం చూపిన ఆగ్రహం" గా చిత్రించారు. పెట్రార్క్ సమకాలీనుడు లారెంజొవల్లా ఆనందసిద్ధాంతం వ్రాసి మత గురువుల కపటవర్తనం, వాటికన్ దైవదూషణ పద్ధతులను బట్టబయలు చేశాడు. తిరుగుబాటు ధోరణిగల యువరాజులు ఆయా కొలువులలో ఆ రచనను శ్రద్ధగా చదివారు. 12,13 శతాబ్దాలలో ఇటలీ సాంస్కృతిక జీవనంపై ఎపిక్యూరస్ భావ ప్రభావం బాగా వున్నట్లు డాంటే పేర్కొన్నాడు. ఇల్‌ఫెర్నో(1)లో మతభ్రష్టులు, ఎపిక్యూరియన్లు ఉన్నారు. సిసిరో, సెన్‌కుక్ రచనలతో 14వ శతాబ్దపు మహోన్నత మానవవాదులు (పెట్రార్క్, బొకాషియో) వల్ల బాగా ప్రభావితులైనారు.

మానవ జీవనవిధానంపైనా, పునర్వికాస సంస్కృతిపైనా ఎపిక్యూరస్ ముద్ర స్పష్టంగా వున్నది. అయినప్పటికీ, వివేచన, మతరహిత విధానానికి వ్యతిరేకంగా క్రైస్తవ సనాతనత్వాన్ని మత పెత్తనాన్ని కాపాడడానికి కృషి చేశారు. ఇందులో క్రైస్తవమతానికి చెందిన కొందరు కొత్త రుషులు, మతాధిపతులు వున్నారు. ఆ విధంగా పునర్వికాస ధోరణి అంతా మానవతా దృక్పథంతో కూడినదే. సార్వజనీన సంస్కృతిని అది చాటింది. అందులో స్వార్థపూరిత వర్గ భావనలేదు. ఒక దేశపు ప్రత్యేక గొప్పదనం కూడా ఇందులో లేదు.

గ్రీక్ – రోమన్ (2)సంస్కృతీ సంప్రదాయం, అరబ్బుల పాండిత్యంతో పాటు, పోప్ 5వ నికొలస్ కూడా పునర్వికాసానికి తోడ్పడినట్లు నిష్ణాతులైన చరిత్రకారులు పేర్కొన్నారు. "కొత్త విజ్ఞానం పవిత్ర సముద్రాలను ఆవరిస్తుండగా, పునర్వికాసానికి కేంద్రంగా రోంను పరిగణించారు. "అందరికీ పరిచయం కాని మతగురువుగా వున్న రోజులలో, కొత్త పోప్ గ్రీక్ వ్రాత ప్రతులను సేకరించడానికి అప్పులపాలయ్యాడని చెప్పారు. అతను వాటికన్ చేరిన తరువాత ప్రాచీన విజ్ఞాన సంపదలో గర్భితంగా వున్న వాటి కొరకు ప్రపంచంలో సగభాగం పోప్ శిష్యులు అన్వేషించారు. గ్రీక్ నాటకాలను అనువదించడానికి అనేకమంది పండితులను వాటికన్‌లో నియమించారు. 5వేల ప్రాచీన వ్రాత ప్రతులు, సెక్యులర్ విషయాలకు సంబంధించినవి, వాటికన్ గ్రంథాలయంలో అట్టిపెట్టారు.

'పునర్వికాస' పోప్‌గా చరిత్ర ప్రసిద్ధి చెందిన 5వ నికొలస్ అనంతరం, రెండో పయస్ పోప్‌గా మానవతా చరిత్రకారుడు ఐనియస్ సిల్వియస్ మత గద్దె నలంకరించాడు. పునర్వికాసంలో అతనొక విలక్షణ వ్యక్తి. "కపటత్వానికి, మూఢ

.1) డాంటే వ్రాసిన డివైన్ కామెడిలోని మూడుభాగాలలో ఇన్‌ఫెర్నో ఒకభాగం, నరకాన్ని గురించి యిందులో చిత్రణ వున్నది.

2) క్రీ.పూ. 4 క్రీ.శ. 65 రోమన్ తత్వవేత్త, విషాందాంత రచనలకు ప్రసిద్ధి. 1397–1455.

నమ్మకానికి విరోధి అని ధైర్యశాలి, క్రమవర్తన గలవా"దని యితన్ని గురించి చెబుతారు. పవిత్ర మత గ్రంథాలపై విమర్శను అనుమతించి, చరిత్రలో వినూత్న లక్షణాలను సృష్టించాడు. "క్రైస్తవమతాన్ని అద్భుతాల వలన ఆమోదించకపోయినా, దాని నైతికత వలన అంగీకరించ వచ్చ"ని అతను వాదించాడు. క్రైస్తవ మతంలో మానవతా దృక్పథం అట్లా ఆరంభమైంది. మధ్యయుగాలలో అత్యంత అధునాతన పోప్ పాలన కింద, మతవ్యతిరేక నేరానికి కొద్దిలో శిక్ష తప్పించుకొన్న లారెంజో వల్లా, వాటికన్ పాలనలో ఉన్నతస్థానాన్ని ఆక్రమించాడు. భద్రమైన స్థానంలో వుంటూ "డొనేషన్ ఆఫ్ కాన్ స్టాంటైన్" అనే సుప్రసిద్ధ గ్రంథాన్ని నవల రూపంలో వ్రాశాడు. పాశ్చాత్య సామ్రాజ్యంలో లౌకికాధికారానికి అధిపత్యం యివ్వడమనేది యీ గ్రంథాన్ని అనుమతించడం ద్వారా పోప్ నిరూపించాడు. "చరిత్రలో వాక్స్వాతంత్ర్యానికి పునాదులు వేసిన వాడితడే. తన కాలంలోని చరిత్రను అతను ప్రచురించవలసి వచ్చినప్పుడు, తన దేశీయులకు, తోటి మతవ్యక్తులకు హాని చేసే అనేక పుటల్ని దాచవలసి వచ్చింది. తరువాత అవి ప్రచురించబడినాయి. ఇటలీలో కపటత్వం అంతా నిగ్గు తేల్చి, 50 పుటల్లో యిది వెలువడింది. (1)

10వ లియో పోప్(2) ప్రాచీన రోంను పునరుద్ధరించే నిమిత్తం రాఫెల్(3)ను ఆహ్వానించాడు. అతని అధ్వర్యాన, వాటికన్ సంగీత సాహిత్యాలతో మారుమ్రోగింది. చుట్టుపక్కల ఈ ఆనందధ్వనులు వినిపించాయి.(4) 10వ లియో అధ్వర్యాన వాటికన్ సాంస్కృతిక కేంద్రంగా, మెడిసిన్ నాటి ఫ్లారెన్స్ కంటే బాగా పెంపొందినట్లు రోంలో పెర్రెరా రాయబారి, మానవవాది అరియొస్టో(5) ఆధారపూరితంగా వ్రాశాడు. పవిత్రనగరంలో బిబ్బినా సుఖాంత రచనలను శ్లాఘించారు. 15 వ శతాబ్దాంతంలో, పునర్వికాసం ఉచ్ఛదశలో వుండగా, రోంలో వున్న స్వేచ్ఛ మరెక్కడా లేదని ఫెసినో వ్రాశాడు. ఫిలెల్ ఫో వ్యంగ్య రచనలకు ఉదారంగా బహూకరించాడు పోప్ 5వ నికొలస్. అనుకరణలో ప్రసిద్ధిగాంచిన పోగియో, మత గురువులను తీవ్రంగా విమర్శించి, దాదాపు అర్ధశతాబ్దం పాటు వాటికన్ ఆదరణకు పాత్రుడయ్యాడు. బాండెలో కూడా ఒక డొమినికన్(6) మతగురువు 1515లో రోంను సందర్శించిన ఎరాస్మస్

1) లార్డ్ యాక్టన్ లెక్చర్స్ ఆన్ మాడ్రన్ హిస్టరీ
2)1475- 1521
3)1483- 1520 ఇటలీ చిత్రకారుడు
4) బర్క్ హార్ట్, రినైజాన్స్
5) 1474-1533 ఇటలీ కవి.
6) డొమినికన్ స్థాపించిన క్రైస్తవ మతాచార్యుల శాఖ.

వెలుగు, స్వేచ్ఛను చూచి శ్లాఘించాడు.

అన్యాయం, దారుణ జీవన పరిస్థితులు సర్వత్రా వ్యాపించి వుండగా క్రైస్తవులు చెప్పే దేవుని సామ్రాజ్యంపై నమ్మకం నశించింది. అందుకనే, మతాన్ని అనుసరించే డాంటే సైతం ప్రపంచంలోని సంపన్న చాంచల్యాలకు తల వొగ్గాడు. వృద్ధాప్యంలో పోగియో సైతం "మానవ పరిస్థితుల దారుణత్వం" పై గ్రంథం వ్రాశాడు. ప్రపంచం దుఃఖమయమనీ, మానవుడికి ఆనందం లభించడం సందేహాస్పదమనీ అందులో వ్రాశాడు. మానవవాదులలో యీ నైరాశ్యత సాధారణంగా ఉండేది. హింస, దుష్పరిపాలన ప్రబలివుండగా వీరు ఉదాశీనభావం వహించారు. దైవభావాన్ని తృణీకరిస్తూ, అదృష్టచక్రాన్ని గురించి సూచనప్రాయంగా వీరు ప్రస్తావించేవారు. కాని ప్రాచీన విశ్వాసమైన జ్యోతిష్యం వైపు తిరిగి, విధివాదంలో మునిగిపోకుండా తప్పించుకున్నారు. గోళాల చలనంతో మానవజీవితం నిర్ధారితమౌతుందన్నారు. గోళాలు కూడా భౌతిక విధానంలో భాగమే. జ్యోతిష్యాన్ని అభ్యసించడమంటే తన విధిని తన చేతుల్లోకి తీసుకోడానికి మానవుడు సిద్ధపడకపోతే, భవిష్యత్తు జీవనాన్ని గురించి తెలుసుకోగోరుతున్నాడన్నమాట. అందువలన భవిష్యత్తును నిర్ధారించడానికి అందులోకి తొంగిచూడడమే, జ్యోతిషంలో నమ్మకం అంటే.

మానవవాదులలో ఉన్నత వ్యక్తులంతా మూఢనమ్మకాలకు అతీతులే. జ్యోతిష్యమంటే పెట్రార్క్‌కు జుగుప్స. వారి విధానాలలో అబద్ధాలను యితడు తన నవలలో బట్టబయలు చేశాడు. జియావన్ని విల్లని యిట్లా వ్రాశాడు. "మానవుడి స్వేచ్ఛాపూరితమైన యిచ్ఛ ఏ గోళాల కలయికా ఏమి చేయలేదు. "జ్యోతిషం ఒక వ్యసనమని మాటియో విల్లని ఖండించాడు. అన్ని అపవిత్రాలకు, అవినీతులకు ఆధారంగా జ్యోతిషాన్ని చూపాడు మిరాండొలా. తన ఆగ్రహాన్ని అతనిలా వ్యక్తపరిచాడు. "స్వేచ్ఛాన్వేషణను చేపట్టని అంధకారయుగాలు, పిడివాదాలను మనుషులపై రుద్దే హక్కులేదు.(1)

మతపరమైన వ్యక్తిగా గుర్తించబడిన బర్క్ హార్ట్ సైతం పునర్వికాస కర్తలను క్రైస్తవులుగా చూపడానికి ఉవ్విళ్ళూరాడు. వారి మానవవాదం మతేతరమైనది. 15వ శతాబ్దంలో యిదింకా గట్టిపడింది. దీని ప్రతినిధులు, అచంచల వ్యక్తి వాదులుగా, తమ మతం పట్ల ఉదాశీనత వహించాడు. వారికి నాస్తికులని పేరు వచ్చింది. మతానికి వ్యతిరేకంగా స్వేచ్ఛగా వీరు మాట్లాడేవారు.(2)

---

1) మిరాండొలా, డిస్కోర్స్ ఆన్ ది డిగ్నిటి ఆఫ్ మేన్

2) బర్క్‌హార్ట్, రినైజాన్స్

మానవవాదులు తమ మతేతర దృష్టితో మతాన్నే మానవతకు మళ్ళించారు. బొలొన్య(1) విశ్వవిద్యాలయంలోని కోడ్రస్ ఉర్సిన్ మతానికి, మతగురువులకు వ్యతిరేకంగా దూషణగా వ్రాశాడు. జీసస్ క్రైస్ట్ నిజమైన భగవంతుని అనుచరుడని కూడా భక్తి పురస్సరంగా పేర్కొన్నాడు. అయినప్పటికీ 'ఆధ్యాత్మిక పోలీసులు' అతని ఇంటిని, రచనలను తగులబెట్టారు. అది గమనించి, కోపంతో నిరాశతో ఆ వృద్ధపండితుడు వీధుల్లోకి పరుగెత్తి, మడొనా విగ్రహం ఎదుట నిలిచి యిట్లా అరిచాడు. "నేను చెప్పేది వినండి, నేను పిచ్చివాడిని కాదు. నేను అంతా తెలిసే చెబుతున్నాను. చనిపోబోయేటప్పుడు పిలిస్తే మీరెవరూ వినద్దు. మీలో కలుపుకొనవద్దు. నేను శాశ్వతంగా దయ్యాలమధ్య గడుపుతాను."

క్రైస్తవులకు స్వర్గంలో నమ్మకం, గొప్పదనం, కీర్తిపై ధ్యాస ఉండగా, మానవ వాదులు వాటిని మార్చేశారు. రాబోయే లోకాలకోసం గాక, జీవితకాలంలోనే గౌరవ అర్హతల కోసం, చరిత్రలో శాశ్వతకీర్తి కోసం ధర్మాన్ని పాటించాలన్నారు. శాశ్వతత్వానికి కొత్త అర్థాన్ని చెప్పాడు. దేవుని అనుగ్రహంతో సాధించే ఆదర్శంగా గాక, స్వయంశక్తితో తెచ్చుకోవలసినదిగా వ్యాఖ్యానం చేశారు. మానవుని సృజనాత్మక మేధస్సు వలన మానవసంస్కృతిని కొనసాగించడం వలన  అమరత్వాన్ని సాధించవచ్చు. సిసిరో, రిపబ్లిక్(ఆరవ గ్రంథం) లోని 'సిపియో స్వప్నం' లో యీ ఉన్నతాదర్శం ఉన్నది. మరణానంతరము గొప్పవ్యక్తుల జీవితాన్ని ఆసక్తికరంగా వర్ణించాడు. మతేతరులకు అదొక స్వర్గం. డివైన్ కామెడీలో డాంటే కూడా 'సిపియో' కలవంటిది చిత్రించి మానవవాద ఆదర్శాన్ని, చారిత్రక గొప్పదనాన్ని నమూనాగా చూపాడు.

13వ శతాబ్దారంభంలో స్పెయిన్ ద్వారా అరబ్బులు తాము గ్రీక్‌లనుంచి నేర్చిన విజ్ఞాన్వేషణ విధానాన్ని పశ్చిమఐరోపాకు చేరవేశారు. కాని పారిస్ విశ్వ విద్యాలయం వంటి విద్యాకేంద్రాలన్నీ మత సంబంధమైన అధిభౌతిక ఊహలకు సంబంధించిన కలహాలతో కాలక్షేపం చేస్తున్నవి. ప్రాపంచిక అనుభవం, విజ్ఞాన పద్ధతి కేవలం అల్బర్టస్ మాగ్నస్ రోజర్ బేకన్, రైమ్స్‌కు చెందిన గెర్బర్ట్ వంటివారికి పరిమితమైంది. కనుక, 12 వ శతాబ్దపు పునర్వికాసం పశ్చిమ ఐరోపా మధ్యయుగాలవెనుకబడిన తనాన్ని ఓడించజాలకపోయింది. రెండువందల సంవత్సరాల అనంతరం ఇటలీ పునర్వికాసం ఆపని చేయగలిగింది.

ప్రకృతిని సహజంగా వివరించడంలో గ్రీక్‌తత్వవేత్తలు విఫలమైనందున, ప్లేటో

---

1) ఉత్తర ఇటలీలో ఉన్నది.

మార్మికవాదం వచ్చి, క్రైస్తవమతానికి ప్రాతిపదికలు వేసింది.(1) మానవుడితో ఇమిడివున్న హేతువు వలన, అన్నిటికి కారణం తెలుసుకోవాలనే కాంక్ష వలన మతం పుట్టినప్పటికీ, ఆధ్యాత్మిక అసంపూర్తి పూరించడానికి మతం పూనుకున్నది. వెయ్యేళ్ళపాటు ఐరోపా ఆలోచన అంతా మతపరమైంది. థేల్స్, పైథాగరస్, డెమొక్రటిస్, హిపొక్రటిస్, యుక్లిడ్, ఆర్కిమిడిస్, అరిస్టార్కస్, హిప్పార్కస్, గాలెన్ యిత్యాది విజ్ఞానులు వలేసిన చింతన భిన్నాభిన్నంగా పడివుండగా, అరబ్బు పండితులు అతికష్టంగా వాటిని స్వీకరించారు. ఖలేద్, బెన్, యోజిద్, బెన్‌ముసా, జెబర్, ఇరువురు అలిహెజెన్‌లు అలిసెన్న అవరో ప్రభృతులు యీ సంపదనంతా సమీకరించి సమన్వయించి, వివరించి, కలిపి మానవసంపదకు యింకా ఎనలేని సేవచేశారు. అది ఎట్టకేలకు ఐరోపా చేరగా, స్వేచ్ఛ సత్యాన్వేషణ పోరాటానికి తోడ్పడింది. ఆ పోరాట ఫలితంగా సామాజిక రాజకీయ స్వేచ్ఛ విస్తరించి ఆధునిక నాగరికతగా రూపొందినది.(2) మానవుడి మానసికాభివృద్ధిలో విజ్ఞానం చివరిమెట్టు. ఇది ఉన్నతోన్నతమే గాక మానవ సంస్కృతిలో ఎన్నదగిన సాధన అనవచ్చు. ప్రత్యేక పరిస్థితులలో తప్ప యిది సాధ్యపడదు గనుక చాల ఆలస్యంగా వచ్చింది. ప్రత్యేక అర్థంలో సైతం, సైన్స్ భావన, గ్రీకు ఆలోచన పరులకు పూర్వం లేదు. పైథాగరిస్, అణువాదులు, ప్లేటో, అరిస్టాటిల్‌కు ముందు సైన్స్ లేదు. ఈ ప్రథమభావన విస్మరించారు. ఉత్తరోత్తరా శతాబ్దాలుగా యీ విషయానికి గ్రహణం పట్టింది. అది తిరిగి కనుగొనవలసి వచ్చింది. పునర్వికాస కాలంలో యిది మళ్ళీ పునరుద్ధరించడం సంభవించింది.

జెనీవాలో సంపన్న వర్తకులు, వెనిస్‌లో శక్తివంతమైన వర్తక యువరాజులు, ఫ్లారెన్స్‌లో సంపన్న బాంకర్లు అధికార రాజకీయాలతో, కొలువు కలహాలతో సతమతమౌతుండగా, సైనికులతో కలహాలకు సిద్ధపడగా, ప్రజలందరికీ సంబంధించిన సాధారణ రాజకీయ సమస్యల పట్ల ఉదాసీనత వహించారు. కాని రోంలో కోలాడె రెంజె(3) రిపబ్లిక్ ప్రభుత్వాన్ని స్థాపించి, స్వేచ్ఛ, న్యాయం, శాంతి అని చాటాడు. పెట్రార్క్ నాటి పాలక వ్యవస్థకు స్నేహితుడుగా, తత్వవేత్తగా, మార్గదర్శిగా వున్నాడు. అయితే సాంస్కృతిక రంగంలో పునర్వికాస మానవవాదం విప్లవాత్మక మార్పు తీసుకురాక పూర్వం యిదంతా జరిగింది.

అజ్ఞానం, మూఢనమ్మకంతో వున్న రోమన్ ప్రజలపై క్రైస్తవ మత గురువుల

---

1) బి.ఫారింగ్టన్, సైన్స్ ఇన్ యాంటిక్విటి గ్రీక్ విజ్ఞానం చావలేదు, నాశనం చేయబడింది. దాని పరిధిలో సాధ్యమైనంత వరకు అది విస్తరించి ఆగింది.

2) ఎర్నెస్ట్ కాసెరర్, ఏన్ ఎసే అన్‌మెన్

3) కొలాడె రెంజె 1313-54 రోమన్‌వక్త.

ప్రభావం బాగా వున్నది. రెంజె పాలకుడుగా గుర్తించబడిన కొద్ది కాలానికే వారతనికి ఎదురు తిరిగారు. "రెంజె రాజకీయ పథకం విఫలమైంది. కాని ఆలోచనారంగంలో, పరిపాలనా వ్యవహారాలలో అతని ఆలోచన చాలా ప్రభావాన్ని చూపెట్టింది. ఆనాడు గొప్ప రచయితగా గుర్తించబడిన వ్యక్తి రెంజె భావాలను అనుసరించాడు. వేలాది సంవత్సరాలు ప్రజల స్ఫురణలో వుంచుకునే విధంగా, గద్యంలో యీ భావాలను పెట్రార్క్ చరిత్రలోకి ఎక్కించాడు. దేశభక్తి పూరితమైన పరిపాలనా వ్యవస్థను, వక్తను కలిపి నూతన ప్రపంచంలో సువర్ణయుగారంభంగా చిత్రించాడు." (1)

ప్రాచీన విజ్ఞానంలో చాలాభాగం ఇటలీకి చేరినందున, ప్రాపంచిక అనుభవం, విజ్ఞాన పరిశీలన తిరగదోడి బాగా వ్యాప్తిలోకి వచ్చినందునా, మానసిక స్వేచ్ఛకై ఇటలీలో జయప్రదమైన పోరాటం చేపట్టారు. నాగరీకులలో, ఏ కాలాన్ని చూచిన రోజర్ బేకన్, జేర్బర్ట్ వంటి వ్యక్తులు కనిపిస్తారు. వారు ఆ కాలంలో లభించే జ్ఞానాన్ని ఔపోశన పట్టినవారు. ఇతరదేశాలు ఉదాశీనంగా వున్న సమయంలో, ఒకదేశంలోని ప్రజలంతా ప్రకృతి పరిశీలన, పరిశోధనలో ఆనందాన్ని వ్యక్తపరచడం విశేషం. పరిశోధకులకు బెదిరింపులు లేకుండా వుండడమో, అతన్ని పట్టించుకోక పోవడమో జరిగినప్పుడు, అనుకూల వాతావరణంలో స్నేహితులు మద్ధతు యిచ్చినపుడు యిది సాధ్యపడుతుంది. ఇటలీలో యిటువంటి వాతావరణం వున్నదనడంలో సందేహం లేదు. (2)

ఇటలీలో పునర్వికాసం కళల్ని, సాహిత్యాన్ని తిరగదోడిందని భాష్యం చెబుతారు. ఆ కాలంలో విజ్ఞాన కృషిని విస్మరించడమేగాక, విజ్ఞానానికి పునర్వికాసం చేసింది చెప్పుకోదగినట్లుగా లేదనేవరకూ కొందరు చరిత్రకారులు వ్యాఖ్యానించారు. పునర్వికాసం సృష్టించిన కళలు, సాహిత్యాన్ని చూచి చరిత్రకారులు ఆశ్చర్యపడినమాట వాస్తవమే. ఆ విధంగా వారు యితర విషయాలు విస్మరించారు. డాంటేతో మొదలెట్టి చాలామంది ప్రముఖులు విజ్ఞానాన్ని అధ్యయనం చేయడమేగాక, యీనాటికీ అధిగమించని కృషి చేశారు. ఈనాటి సాంకేతిక విషయాలలో చాలావాటిని లినార్డో డవించె చెప్పగలిగాడు. డాంటే ప్రకృతిని పరిశీలించాడు. పెట్రార్క్ భూగోళ శాస్త్రజ్ఞుడే కాదు. ప్రకృతి దృక్పథాలు అనే గ్రంథం రచించాడు. జోటో ప్రకృతి శాస్త్రజ్ఞుడు ఫ్లారెన్స్ అకాడమీ ఉద్యానవనాల్లో వృక్ష, జంతు శాస్త్రాలను అధ్యయనం చేశారు. థీప్రేటస్ (3) రెండువేల సంవత్సరాల

1) లార్డ్ యాక్టన్, లెక్చర్స్ ఆన్ మోడ్రన్ హిస్టరీ
2) బర్క్ హార్ట్, రినైజాన్స్.
3) క్రీ.పూ. 372-287 గ్రీక్ ప్రకృతి శాస్త్రజ్ఞుడు.

క్రితం అధ్యయనం చేసి వదిలేసిన దగ్గర నుంచి మొక్కల నిర్మాణం, వాటి వర్గీకరణ, మళ్ళీ చేపట్టారు. అరిస్టోటిల్ ప్రారంభించిన జంతుప్రపంచ అధ్యయనం కూడా తిరిగి మొదలెట్టారు. ఏనస్ సిల్వియస్ భూగోళ శాస్త్రజ్ఞుడే కాదు, చరిత్రకారుడు కూడా. వైద్యశాస్త్రాధ్యయనానికి సాలెర్నో, బొలానా ముఖ్యకేంద్రాలు. రోగాలను నయం చేయడానికి, రసవాదం స్థానే, జబ్బును మాన్పే రసాయన శాస్త్రం అభివృద్ధి చెందినది. "పునర్వికాస కాలంలో కొత్త రసాయనిక శాస్త్ర ఆలోచనలు ఆరంభమైనవి. ఇయాట్రో కెమిస్ట్రీ సంస్థలలో జీవ, వైద్య అధ్యయనం బాగా పెంపొందినది"(1) ప్రకృతిని కనుగొనడం కంటే, పునర్వికాసకాలంలో మానవుడిని కనుగొనడం విశేషమని సుప్రసిద్ధ చరిత్రకారుడు మిషెలా అన్నాడు. నాడు చిత్రకారులు, శిల్పులు, శరీరనిర్మాణ శాస్త్రాన్ని అధ్యయనం చేయడం తెలిసి అతనీవిధంగా వ్యాఖ్యానించాడు. ప్రకృతి పరిశీలన ఆసక్తితో నిశితంగా ఆధునికులలో ఇటలీ ప్రజలు ప్రధములు.(2)

చిత్రకళ, శిల్పం వాస్తవంగా వుండడానికి శరీరనిర్మాణం, అంగవిభాగం గురించి కనీసజ్ఞానం, నేత్రజ్ఞానం అవసరం. కోపర్నికస్ ప్రసిద్ధ రచనతోబాటు ఆండ్రిస్ వాసిలస్ "మానవ శరీరం" పై సిద్ధాంతగ్రంథం కూడా ప్రచురితమైంది. పాజూ, బొలొన్ కేంద్రాలలో శరీరనిర్మాణంపై జరిపిన పరిశోధనల ఆధారంగా యీ రచన జరిగింది. 13వ శతాబ్దాంతానికే మోండి నొడజుజ్జి అంగ నిర్మాణంపై పాఠ్యగ్రంథం వెలువరించాడు. లినార్డొడవించె పేర్కొన్నట్లు, పునర్వికాస కళాకారులు ప్రకృతి దృష్ట్యా ప్రపంచాన్ని తిలకించారు. అందుకోసం ప్రకృతిని, మానవశరీరాన్ని సూక్ష్మంగా పరిశీలించారు. "అందు నిమిత్తం పది మానవుల కళేబరాలను కోసి మాంసమంతా జాగ్రత్తగా తొలగించి, రక్తం చిందకుండా, నరాలను చూచాను. ఒక శరీరం ఎక్కువకాలం అధ్యయనం చేయజాలనందున అంచెల వారీగా అనేక శరీరాలను పరిశీలిస్తేగాని, జ్ఞానార్జన పూర్తిగాలేదు. తేడాలను కనుగొనే నిమిత్తం పరిశీలనలన్నీ రెండు పర్యాయాలు చేయవలసి వచ్చింది."(3)

పునర్వికాస కాలంలో లినార్డొ వంటి శాస్త్రజ్ఞుడు మాత్రమేగాక, అతనితో దీటుగా తోస్కనెల్లి, పాసియోలి వున్నారు. 15వ శతాబ్దంలో వీరు ముగ్గురూ గణితం, ప్రకృతి శాస్త్రాలు సాంకేతిక జ్ఞానంలో సిద్ధహస్తులు. కోపర్నికస్‌కు ముందే టాలమా "అల్మాగెస్ట్(4)ను లినార్డొ తృణీకరించాడు. కోపర్నికస్ తాను లినార్డొ శిష్యుడనని

1) ఎర్నెస్ట్ కాస్సైర్, ఏన్ ఏస్సే ఆన్ మేన్

2) హంబోల్ట్, కాస్మాస్

3) ఇ.మెకర్డీ, ది మైండ్ ఆఫ్ లినార్డొడవించి గ్రంథంలో ఉదహరించినవి

4) 2 వ శతాబ్దంలో అలెగ్జాండ్రియాలో నివశించిన టాలమీ వ్రాసిన గ్రంథం పేరు.

యధేచ్ఛగా చెప్పుకున్నాడు. పునర్వికాసకారులంతా విశ్వమానవులు "బహుముఖ ప్రజ్ఞాశాలురు ఎక్కువగా వుండేవారు. చిత్రకళ నుంచి శిల్పానికి, శిల్పం నుంచి వాస్తుశాస్త్రానికి, భవన నిర్మాణానికి, వాటినుంచి కవిత్వానికి, తత్వానికి, ప్రకృతి శాస్త్రాలకు తమ ఆసక్తులను మార్చుతూవుండేవారు. మైకేల్ఏంజలో, లినార్డో డవించె, ఆల్బర్టిలలో యీ సర్వజ్ఞత్వం ఉండేది."(1) రాఫెల్ భవన నిర్మాణకారుడు కూడా. ఫారెన్స్ కోటలను మైకేల్ఏంజలో నిర్మించాడు. తనకాలానికి రెండు శతాబ్దాల ముందుచూపుతో సాంకేతిక జ్ఞానాన్ని లినార్డో చూపాడు. పాజూలో ఖగోళశాస్త్రం బోధిస్తూ యింకా గలీలియో వెలుగులోకి రాకపూర్వమే, 20వ శతాబ్దపు సాంకేతిక విజ్ఞానాన్ని లినార్డో వూహించడమేగాక, నమూనా విమానం నిర్మించి, గాలిలో ఎగరడానికి ప్రయత్నించాడు. విశ్వజనీన మేధస్సులో అరిస్టోటిల్తోనూ, భౌతిక విజ్ఞానంలో ఆర్కిమెడిస్ తోనూ పోల్చదగిన వ్యక్తిగా లినార్డోను చిత్రిస్తారు. "చిత్రకారుడు, శిల్పి, ఇంజనీరు, భవననిర్మాణకర్త, వైద్యుడు, జీవశాస్త్రజ్ఞుడు, తత్వవేత్తగా లినార్డో ఏ రంగానికి ఆ రంగంలోనే అధిక్యత వహించాడు. బహుశ ప్రపంచచరిత్రలో యిటువంటి వ్యక్తిలేడేమొ. అతను సాధించినవి గొప్పవేకాని అతను ప్రారంభించిన కొత్తమార్గాలు, మౌలికసూత్రాలు గ్రహించడంలో చూపిన నిశిత బుద్ధి, అన్వేషణలో కనబరచిన గ్రహణ, ధారణశక్తి అపారం."(2) రేఖా గణితంపై చిత్రకళ ఆధారపడిందని నమ్మిన లినార్డో, ఆ శాస్త్రాన్ని బాగా అవగాహన చేసుకున్నాడు. అందు నిమిత్తం గణితాన్ని విస్తారంగా అభ్యసించాడు. చిత్రకళలోగాని, శిల్పంలోగాని మానవశరీరాన్ని సరిగా చూపడానికి వీలుగా అంగ నిర్మాణం తెలుసుకోదలచి, మానవశరీరాలను కోసి చూచాడు. కంటి విషయం గ్రహించడానికి మనుషుల కళ్ళనిర్మాణం అధ్యయనం చేశాడు.(3)

18వ శతాబ్దపు ప్రసిద్ధ శస్త్రచికిత్సకారుడు విలియం హంటర్ యిట్లా వ్యక్తం చేశాడు. "ఆ కాలంలో లినార్డో, అంగ నిర్మాణం తెలిసిన వ్యక్తిగా ప్రపంచంలో అత్యున్నత స్థాయికి చెందినవాడు. అంగనిర్మాణం చిత్రాలుగా గీసే అభ్యాసం చేసిన ప్రథముడతడు." భూగర్భ శాస్త్రానికి సంబంధించి, హట్టన్, వైల్ చెప్పదలచిన విషయాలను వూహించి, మూడు వందల ఏళ్ళ తరవాత రాబోయే ఒకే తీరు సిద్ధాంతానికి ప్రాతిపదికలు

---

1) ఫిషర్, హిస్టరీ ఆఫ్ యూరోప్
2) వాదం, హిస్టరీ ఆఫ్ సైన్స్
3) జె.పి. రిచ్టర్, ది లిటరరీ వర్క్స్ ఆఫ్ లినార్డో డవించె

వేశాడు. బైబిల్ చెప్పే జలప్రళయం ప్రపంచవ్యాప్తంగా రాదని వాదించాడు. భూమిపైన కొండలపైన కనిపించే అవశేషాలు బైబిల్ పేర్కొన్న వరద వలన వచ్చినవి కాదన్నాడు. వర్షం, నదులు, సముద్రం, మేఘాలు యీ క్రమంలో నీరు మారుతుంటుందని గ్రహించాడు. ప్రాచీనకాలంలో సముద్రగర్భం పర్వతాలుగా మారడం, పర్వతాలు వర్షంలో కొట్టుకుపోవడం తెలుసుకున్నాడు. విజ్ఞాన సిద్ధాంతాల ఆధారంగా అనేక విషయాలను లినార్డో వూహించినప్పటికీ, ఆచరణలో మాత్రం, పరిశోధన పరిశీలనపై మాత్రమే ఆధారపడేవాడు.

"మన ఇంద్రియాలకు గోచరించేవన్నీ పరిశోధనా ఫలితాలపై వుండే వాస్తవ విజ్ఞానాలే. వివేచన లేనిచోట సందడి ఎక్కువ. నిర్ధారణగా వున్నచోట యిందుకు తావులేదు. కనుక కలహాలున్న చోట వాస్తవజ్ఞానం లేదు. విజ్ఞానానికి దారి ఒక్కటే."(1) మతపరమైన వాదోపవాదాలు తన మార్గానికి ఉపకరించవని అతను వాటి జోలికి పోలేదు. మనోవిజ్ఞానం అధ్యయనం చేసినపుడు మాత్రం ఆత్మ సమస్య వచ్చింది. ఆత్మ మానవ వునికిలో భాగంగా ప్రకటించాడు. "ఆత్మకు సంబంధించి మిగిలిన నిర్వచనాన్ని దేవదూతల ఊహలకు వదిలేస్తున్నాను. ప్రేరేపణ వలన వారికి అన్ని రహస్యాలు తెలుస్తాయి. "కావాలని సమస్యను దాట వేస్తున్నట్లు అగుపించినా, యిందులో వ్యంగపు పొర స్పష్టంగానే కనిపిస్తున్నది. ముగింపుకు "పునర్వికాస కాలమంతటికి ఒకే ఒక ప్రతినిధిని ఎన్నుకోవలసి వస్తే, రాచఠీవిగల లినార్డొడవించిని చూపవచ్చు.(2)

పునర్వికాస కాలంలో ఇతర విజ్ఞానవేత్తల కీర్తి అంతా లినార్డొ ఘనత ముందు గ్రహణం పట్టింది. ఉదాహరణకు, గాలెన్‌లో దోషం కనుగొని, అంతవరకు వైద్యశాస్త్రంగా చలామణి అవుతున్నదంతా మోసం అని విమర్శించిన వ్యక్తి పారనెల్సస్ (3) రసవాదంలోని మార్మిక విషయాలను త్రోసిరాజని, రసాయనిక శాస్త్రవిషయాలను వైద్యసేవలకు వినియోగించాడు కూడా. పాజూకు చెందిన వాసలిన్ అంగ నిర్మాణ శాస్త్రం బోధిస్తూ, శరీరాన్ని కోసి చూడడం ఎట్లాగో చెప్పారు. మానవశరీరం గురించి గాలెన్ సిద్ధాంతాన్ని యితను విమర్శించాడు. వాసలిన్‌ను అనుసరించిన వారిలో ఫాబ్రియస్ వున్నాడు. నరాల కవాటాల గురించి యితని నుంచే హార్వే నేర్చాడు. టెలిసియో ప్రకృతి అధ్యయన కేంద్రాన్ని నేపిల్స్‌లో నెలకొల్పాడు.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాభివృద్ధికై విజ్ఞానపునరుద్ధరణ జరగలేదు.

---

1) జె.పి. రిచ్‌టర్ లిటరరీ వర్క్ ఆఫ్ లినార్డొడవించెలో పేర్కొన్న విషయం
2) వాధమ్ హిస్టరీ ఆఫ్ సైన్స్
3) 1493–1541 స్విస్ వైద్య శాస్త్రజ్ఞుడు, రసాయనవాది.

తలెత్తుతున్న బూర్జువా వర్గంతో లినార్డొకు, కోపర్నికస్‌కు, గలీలియోకు ఎలాంటి సంబంధమూ లేదు. లినార్డొ సంపన్న మేధావి వర్గానికి చెందినవాడు. చరిత్రలో భౌతిక వాదాన్ననుసరించి పునర్వికాసం యీ వర్గాన్ని సృష్టించింది. మిగిలిన యిరువురు క్రైస్తవులు, ఇటలీ నగరాలలోని వర్తకులు, వడ్డీ వ్యాపారస్తులు విజ్ఞాన పోషకులు కాదు. నీచమైన స్వార్థపరులుగా, భౌతిక దృక్పథం కలవారుగా మాత్రమే వారికి పేరున్నది. తన స్వస్థలమైన జెనేవాలో కొలంబస్‌కు ఆదరణ లభించలేదు. తన యాత్రాన్వేషణకై ఆర్థిక సహాయం చేయమని స్పెయిన్‌లోని ఫ్యూడల్ కొలువును ప్రాధేయపడవలసి వచ్చింది. పునర్వికాసానికి వెనిస్ తోడ్పాటు అసలేలేదు. వాటికన్‌తో పోరాటంలో నిమగ్నుడైన మెడిసిన్, విద్య, సాహిత్యం, కళల పోషణలో పునర్వికాస పోప్‌లను అధిగమించదలచినందున ఫ్లారెన్స్ పాత్ర వున్నది.

ఆవిర్భవిస్తున్న బూర్జువా వర్గానికి పునర్వికాసానికీ కార్యకారణ సంబంధం లేదని ఇటీవల అధ్యయనం వలన ఆధునిక సామాజిక శాస్త్రజ్ఞుడు, మార్క్సిస్టు దృక్పథంగల వ్యక్తి కూడా అంగీకరించక తప్పలేదు. "మఠాలలో గాక నగరాలలో ఏర్పడిన నూతన చింతనాదృష్టి, నగరదృష్టికి వ్యతిరేకధోరణి అవలంబించింది. నిత్య కార్యకలాపాలలో నిమగ్నులైన బూర్జువాలకు దూరంగా వుండాలని పెట్రార్క్, పోగియో, సాడొరెటో నిర్ణయించారు.(1) ఈ అధ్యయనం వలన బూర్జువా వర్గం కూడా పునర్వికాసం పట్ల ఉదాశీనతతో వున్నట్లు రుజువైంది. విజ్ఞానం, విద్య, సాహిత్యం, కళల పునరుద్ధరణ వలన నైచ్యమైన వర్తకవర్గం సాంస్కృతిక ప్రభావానికి లోనైనట్లు అంగీకరించారు. "నిత్య కార్యకలాపాలలో, ముఖ్యంగా వాణిజ్యంలో నిమగ్నమైన బూర్జువా వర్గం కేవలం విద్యాభ్యాసం గావించే వారిని నిత్యజీవితపు అంచులవద్దే అట్టిపెట్టింది. ఈలోగా బూర్జువావర్గం తమ స్వభావానికి తామే కపటవర్తనులయ్యారు. అంతటితో అంచునవున్న వారి ప్రభావం పడి, ఆర్థికాభివృద్ధిపై సంస్కృతి ముద్ర వేసింది. మేధావుల వైజ్ఞానిక సాంస్కృతిక ప్రభావంతో సామాజిక రంగంలో మార్పులు రాసాగాయి. బూర్జువా వర్గాన్ని మారవలసిందిగా సాహితీపరులు ప్రోత్సహించారు." (2) కనుక కొత్త సంస్కృతి వలన ప్రభావితులు గావడం బూర్జువా స్వభావానికి వ్యతిరేకం. తలెత్తుతున్న బూర్జువా వర్గ సిద్ధాంతం పునర్వికాస మానవవాదానిది కాదు.

నాగరికత ఉదయించినప్పుడు సత్యాన్వేషణ, స్వేచ్ఛా పిపాసకై మానవుడి పోరాటం ఆరంభమైంది. కాని వేయి సంవత్సరాలకు పైగా అధికృతతో వున్న మతపరమైన

---

1) ఆల్ఫ్రెడ్ వాన్ మార్టిన్, సోషియాలజీ ఆఫ్ ది రినైజాన్స్
2) పైనపేర్కొన్న గ్రంథంలో.

ఆలోచన వలన గందరగోళం ప్రబలి, యీ పోరాటానికి కొంత ఆటంకం ఏర్పడింది. పునర్వికాసం మళ్ళీ ఆ పోరాటాన్ని పునరుద్ధరించింది. పునర్వికాసం ఏ ఒక్క వర్గం తలెత్తడానికి తోడ్పడలేదు. అది మానవుడి తిరుగుబాటు. సంపన్న ప్యూడల్ వర్గం, క్రైస్తవమతం, అప్పుడే తలెత్తుతున్న వాణిజ్యవర్గం, అందులో మితవాదులు, ప్రాచీనవాదులు మొదలైన వారందరిలోగల స్వేచ్ఛాపిపాసకు ప్రోత్సాహం, పోషణ లభించడమే పునర్వికాసం. ఇందుకు భిన్నంగా ఉద్వేగ మానవవాదులు, మానవుడి సృజనలో నమ్మకాన్ని, యిచ్ఛలో స్వేచ్ఛను ప్రకటించారు. ప్రపంచానికి ప్రయోజనం వున్నదనే వాదంలోని భారం నుంచి వివేచనకు విమోచన కలిగింది. నియమబద్ధమైన ప్రకృతి స్వేచ్ఛా పిపాసి అయిన మానవుడు తెచ్చే విప్లవాలకు ఆటంకం కాదని స్పష్టపరిచింది. మానవుడి భావస్వేచ్ఛను ప్రకటించి ఆధునిక నాగరికతకు నాంది పలికింది. మానవ కార్యకలాపాల విస్తరణకు అదెంతగానో తోడ్పడింది. ప్రకృతిని గురించి జ్ఞానం విస్తరిస్తుండగా, మానవుడి శక్తి కూడా పెరిగి, స్వేచ్ఛాపోరాటం మున్నెన్నడూ లేనంత శక్తివంతంగా జరపటానికి వీలైంది.

✦ ✦ ✦

# ఎదురు తిరిగిన దేవతలు

పునర్వికాస మానవతా సంస్కృతీ స్వభావాన్ని పరిశీలిస్తే, ఆ కాలంలో చదువుకొన్న కొద్దిమందికే అది పరిమితమని తెలుస్తుంది. ఆవిర్భవించనున్న కొత్త నాగరికతకు పునర్వికాసం నాంది పలికింది. కొత్తభావాలు తలపోయడం, కొత్త ఆదర్శాలు చిత్రించడం తద్వారా కొత్త కార్యకలాపాలకు ప్రేరణ కలిగించడం, ఇంకా కొత్త మానవ ప్రయత్నాలకు పురిగొల్పడం జరిగింది. భవిష్యత్తులో ఏమి వున్నప్పటికీ, పునర్వికాస మానవవాదం నాటి మేధాసంపత్తితో, ఉద్వేగాలతో, సాంస్కృతిక వాతావరణంలో యిమిడిపోవలసి వచ్చింది. "చదువు లేనందున, సునిశిత రచనలను చాలామంది అవగాహన చేసుకోలేకపోయారు. సంస్కృతి లేనివారంతా కేవలం కింది తరగతులకే పరిమితంగాక, సంపన్నుల ఉన్నత కుటుంబీకులలో అధిక సంఖ్యాకులు కూడా అందులోనే చేరిపోయారు."(1)

సామాన్యుల మనస్సంతా మతంతోనే కరడుగట్టుకపోయింది. మతం పైనుంచి రుద్దిన నిర్మాణం కాదు. మానవుడి మస్తిష్కంలో నుండే మతం సృష్టి జరిగింది. పాతకంటే వున్నతంగా, కాంతివంతంగా వుండగల దానిని సృష్టించేంతవరకు మానవుడు తన సృష్టిని కాదని పోజాలడు. అలౌకిక వాదాన్ని తొలగించ గలిగింది మానవవాదం ఒక్కటే. కాని ఇది సుదీర్ఘమైన, శ్రమతో కూడిన విధానం. ఈలోగా మతం, అలౌకికంలో నమ్మకం, మానవుడి మనస్సును ఆక్రమించేసింది. ఐరోపా సాంస్కృతిక చరిత్ర అంతా మతచరిత్రతో మిళితమైంది. మానవుడి నైతిక, మేధా సంబంధమైన జీవితమంతా, తనకూ దేవుడికీ గల సంబంధం గురించి పట్టించు కోవడంతోనే సరిపోయింది.

రెండు అనుభవాల ఆధారంగా వున్న క్రైస్తవ మతవిశ్వాసం మనిషిపై గట్టి ముద్రవేసింది. ప్రాచీన సాంఘిక వ్యవస్థ చిన్నాభిన్నం చూచి, చెదిరిపోయిన మానవుడికి, జీవితానంతరం క్రైస్తవమతం ఆశ చూపెట్టింది. రోమన్ సామ్రాజ్యం పతనమైన తరువాత ఏర్పడిన గందరగోళం నుండి క్రైస్తవలోకం తట్టుకొని నిలబడడానికి క్రైస్తవమత సంఘాలలో నమ్మకం ప్రధానకారణం. మరణానంతరం

---

1. ఛార్లెస్ సైనోబోస్, ది రైజ్ ఆఫ్ యూరోపియన్ సివిలిజేషన్

ఆశ కలిగించడం, ప్రపంచంలో తక్షణమే రక్షణ చూపడంతో క్రైస్తవమతం ఐరోపా జీవితంలో చుక్కానిగానూ, మతాలు దీనికి ప్రతీకగానూ కన్పించాయి.

"మేధస్సుకు సంబంధించిన సంస్కృతిలో నెమ్మదిగా, నిరంతరంగా యుగాల తరబడి గర్భితంగా పురోగమనం కనిపించింది. మానవ సంస్కృతికి చెందిన ఉత్పత్తి విధానాలన్నీ ఏకమై కలసిపోయాయి. సమాజాభివృద్ధి స్వాభావికంగానూ, క్రమంగానూ సాగింది. విజ్ఞానం కళలకోసం ఆసక్తి కనబడింది. కొత్త ప్రేరణలు వచ్చాయి. అవి బాగా వికసించాయి. పౌరస్వేచ్ఛ గట్టి ప్రాతిపదికలపై ఏర్పరచబడింది. పరస్పర వైరాల మధ్య రాజకీయ చట్రాలు కట్టుదిట్టంగా రూపొందినవి. పౌరజీవితావసరాల నిమిత్తం భౌతిక సంపదలన్నీ సమకూర్చి పెంపొందించడం జరిగింది. మానవుడి వ్యవహారాలపై దైవనియమాలు పనిచేస్తున్నాయనే భావన యధేచ్ఛగా, ప్రశాంతంగా పనిచేయసాగింది. పతనమైంది వుంటే అది కాస్తా కూలిపోయింది. అదృశ్యమైంది. కొత్త జీవనం చిగుర్చి, వికసించింది. వివేచనాపరులు, ధైర్యశాలురు, నాగరికజాతులు ఐరోపాలో ఐకమత్యంతో కొత్తదనాన్ని చాటాయి."(1) ఐరోపా దురభిమాని వూహించి, మధ్యయుగాల గురించి ఆదర్శవంతంగా చిత్రించిన విషయంగా దీనిని భావించరాదు. ఐరోపా జీవితంలో క్రైస్తవమతం కేంద్రస్థానం ఆక్రమించినదనే వరకూ యిదంతా వాస్తవమే. మధ్యయుగాలు అంతమయ్యేటంతవరకూ సమాజాన్ని కలిపివుంచినది క్రైస్తవమతమే.

మతం సంప్రదాయంతో పూర్తిగ తెగతెంపులు గావించుకొనాలని పునర్వికాసం కోరింది. మానవవాదాన్ని వ్యతిరేకించే అలౌకికవాదాన్ని కాదని, స్వర్గంలో సుఖాలకంటె జీవితానికి అధిక ప్రాధాన్యతను యిచ్చింది. కాని తరువాత వచ్చిన సంస్కరణవాదం, పాత సంప్రదాయాలనే పాటించింది. కనుక, పునర్వికాసం కంటె సంస్కరణవాద కాలం జనబాహుళ్యం పొంది, ఎక్కువమందిని ఆకర్షించినట్లు కనిపించింది. సంప్రదాయంగా వస్తున్న జడత్వం, క్రమత్వం, క్రైస్తవమత సార్వజనీనత పేరిట అలముకొన్న అంధకారంలో ఎక్కడినుండో హఠాత్తుగా మెరుపు మెరిసి, మళ్ళీ అంధకారంలో కలిసినట్లయింది.

పునర్వికాసం ఒక విప్లవం. సంస్కరణవాదం. ప్రతి సంస్కరణవాదం వచ్చి వీటిని ఆటంకపరిచాయి. మానవుడి తిరుగుబాటుకు వ్యతిరేకంగా ప్రతి సంస్కరణవాదం ఒక కొలమానం. జర్మనీలో సంస్కరణవాదం రాకముందు, స్పెయిన్‌లో ఫెర్డినాండ్, ఇజబెల్లాల పోషణలో సంస్కరణ వ్యతిరేకవాదం వున్నది. ఇటలీని స్పెయిన్ జయించి 5వ ఛార్లెస్ రోంను పట్టుకున్న అనంతరం, ఆ దేశ రాజకీయ పరిస్థితి

1. రాంకె, హిస్టరీ ఆఫ్ రిఫర్మేషన్ ఇన్ జర్మనీ

మారింది. ఆటుపోటులలో పునర్వికాసం చిక్కుకున్నది. ఈ లోపుగా, ఆల్ప్ పర్వతాలు దాటిన మానవతావాదం, ఉత్తరాదికి వెలుగు నిచ్చింది. కాని అక్కడకూడా సంస్కరణవాద ఉప్పెనవచ్చి పునర్వికాసాన్ని వెనక్కు నెట్టివేసింది. దేవతల తిరుగుబాటు గాలి వెనక్కు మళ్ళేవరకూ మానవుడి పునరుజ్జీవన ఆగవలసి వచ్చింది.

పునర్వికాసాన్ని బర్క్‌హార్ట్ యిట్లా మదింపుచేశాడు. "సంస్కరణ, ప్రతి సంస్కరణ రాకుంటే, ఫ్రాన్ సిస్కన్, డొమినికన్ వ్యవస్థలను పునర్వికాసం నాశనం చేసేదే. వారి రుషులు, మతబోధకులు కాపాడగలిగేవారేకాదు. సంస్కరణవాద రక్షణే లేకుంటే, మత గురువుల గతి ఏమయ్యేదో ఎవరు చెప్పగలరు." సంస్కరణ వాదపు చారిత్రక ప్రాధాన్యత గురించి సరైన నిర్ణయం యిదే.

దేవాలయ పవిత్రతను భగ్నం చేయడాన్ని వ్యతిరేకిస్తూ, మత పవిత్రతను కాపాడాలని జరిగిన తిరుగుబాటు పునర్వికాస చివరిదశలో ఇటలీలోనే వాస్తవంగా మొదలైంది. 15వ శతాబ్దాంతంలో ఫ్లారెన్స్‌లో తిరుగుబాటు ప్రమాణాన్ని శావనొరొలా(1) ఉన్నత ప్రమాణంలో అట్టిపెట్టాడు. ఫ్లారెన్స్ అప్పుడే ఆవిర్భవిస్తున్న బూర్జువా వర్గానికి జన్మస్థలమనీ, తమ వర్గ ఆదర్శంగా వారు పునర్వికాస మానవవాదాన్ని సృష్టించారని అనుకున్నారు కూడా. నాస్తికతను, అవినీతిని యధేచ్ఛగా వ్యతిరేకిస్తూ, పునర్వికాసపు సెక్యులర్ సంస్కృతిని తృణీకరించిన శావొనారొలా ఆదిమ క్రైస్తవ ధర్మానికి తిరిగి వెళ్ళాలని గట్టిగా వాదించాడు. బూర్జువాలతో కూడిన లంచగొండి ప్రభుత్వాన్ని వ్యతిరేకించమని ఫ్లారెంటైన్ ప్రజాస్వామికులను విజయవంతంగా పురికొల్పాడు. మానవవాదులు, దిగజారిన మతాన్ని, అవినీతికరమైన దేవాలయ వ్యవస్థను బయటపెట్టగా, ప్రజల దృష్టిని మళ్ళించే ఉద్దేశంతో, శావొనారొలా పాలకుల వ్యసనాలను, దోపిడిని, విలాసాలను, ఆనందాలను, అవినీతిని బట్టబయలు చేశాడు. ఆదిమ క్రైస్తవ సమిష్టి వ్యవస్థ పేరిట పేదల దృష్టిని ఆకర్షించిన యితను, కరుణామయుడైన దేవుని ముందు మోకరిల్లాలని ప్రజలకు బోధించాడు. ఫ్లారెన్స్‌లో మతరాజ్యం స్థాపించాలనే లక్ష్యాన్ని అతను సాధించాడు. "అదృశ్యశక్తి ఎదుట మానవులంతా వినయపూర్వకంగా తలవంచాల"న్నాడు. అతడు సంస్కరణ వాదానికి దారిచూపినవాడూ కాదు. మధ్య యుగాలలో పరంపరగా వచ్చిన మతభ్రష్టులలో వాడూ కాదు. పోప్ అధిపత్యాన్ని యితను కాదనలేదు. మతగురువుల ఆధ్యాత్మిక కపటాన్ని యితడు ప్రశ్నించనూ లేదు. సంస్కారవాద వ్యతిరేక ఉద్యమానికి యితను ప్రాతినిధ్యం వహించాడు. ఆ విధంగా, పునర్వికాస కాంతిపుంజం వెదజల్లడానికి ఆటంకంగా నిలిచాడు.

---

1. 1452–98 ఇటలీ సంస్కరణవాది, మతగురువు.

మధ్యయుగాల చివరిదశలో ఐరోపాను ఆవరించిన రెండు సాంస్కృతిక సంప్రదాయాల ప్రవాహాలకు ఘర్షణ వాటిల్లినది. వివేచన, మతం అనే ఈ రెండు ధోరణులు క్రైస్తవమతానికి ముందు నుంచీ వచ్చినవే. తెలుసుకోవాలని, స్వేచ్ఛగా వుండాలనే మానవుడి కోర్కెనే యీ రెండు ధోరణులు వ్యక్తపరచినవి. కాలానుగుణంగా, మతం దాని స్వతఃసిద్ధ ధోరణి విడనాడింది. వివేచనకు ప్రతివాదంగా విశ్వాసం నిలిచింది. ఐరోపా సంస్కృతిలో అంతర్గతంగా వచ్చిన యీ సంఘర్షణతో మధ్యయుగాలు అంతమయ్యాయి. ఆధునిక నాగరికతకు నాంది పలికింది. పునర్వికాసానికి ప్రేరణ యిచ్చిన క్రైస్తవ మతానికి పూర్వపు మేధాసంపద సావొనారొలా ధోరణిలో బాగా వ్యక్తమైంది. మానవతావాదులను అతను ఎదుర్కొంటూ ఇలా వర్ణించాడు.

మతభ్రష్టులకు వ్యతిరేకంగా ప్రయోగించే నిమిత్తం మనకు ఉపయోగించే అనేక వాదనలను ప్లేటో, అరిస్టాటిల్ తేవడం ఒక్కటే వారు చేసిన మంచిపని. అయినా వారూ యితర తత్త్వవేత్తలూ నరకంలో వున్నారు. ప్లేటో కంటె ముసలమ్మకు విశ్వాసం గురించి ఎక్కువగా తెలుసు. ఉపయోగకరంగా కనిపించే చాలా పుస్తకాలను నాశనం గావిస్తే మతానికి మంచిది. ఎక్కువ గ్రంథాలు లేనప్పుడు, ఎక్కువ వాదనలు రానప్పుడు మతం త్వరితగతిన విస్తరించింది.(1) " తీవ్రవాది అయిన యీ మతగురువు విజ్ఞానాన్ని ఖండిస్తూ, దీనివలన మానవుడి దృష్టి దైవం నుంచి సెక్యులర్ విషయాలవైపుకు మళ్ళిందన్నాడు. కాని అదే సమయంలో, జ్ఞానాన్ని, విద్యను భ్రష్టపరచవలసిన ఆవశ్యకత కూడా ఆయన గ్రహించాడు. సైన్సు శని పన్నే వలగా వర్ణించాడు. అయినా మతభ్రష్టుల వాదనలు ఎదుర్కొనడానికి వీలుగా "మేధావులు ఎవరూ లేరనే అపభ్రంశ రాకుండా" కొందరు సైన్సు నేర్వాలన్నాడు.

వెయ్యి సంవత్సరాలపాటు మానవుడి మేధస్సు మతపరమైన ఆలోచనకు అలవాటు పడింది. చింతనారంగంలో జడప్రాయంగా వున్న వ్యవస్థపై మానవుడు తిరుగుబాటు చేయడానికి కొత్త దారులు ఏర్పడినా, ఆ కూపం నుంచి బయటపడడం అంత సులభం కాదు. మతం మానసిక అభ్యాసం గావటమే అందుకు కారణం. ఆధ్యాత్మిక అవసరం లేకున్నా మతం చాలాకాలం అంటిపెట్టుకొనే ఉంటున్నది. ఆ విధంగా సాంస్కృతిక, మేధారంగంలో పెద్దలను అనుకరించే ధోరణి సంస్కరణ వాదంలో కనిపించింది. పునర్వికాసానికి గ్రహణం పట్టినట్లనిపించింది.

అయినా మానవతావాదం చచ్చిపుట్టలేదు. ఇటలీలో అనుకూల వాతావరణంలో విలాసంగా విస్తరించిన యీ వాదం, ఐరోపాలోని ఇతర స్వేచ్ఛా పిపాసువులను

1. విల్లరి, లైఫ్ అండ్ టైమ్స్ ఆఫ్ గిరిలొమొ సావొనారొలా

ఆకర్షించింది. 15వ శతాబ్దం మధ్యలో అగ్రికాలా,(1) రాయ్‌క్లాన్ (2) వంటి జర్మన్ పండితులు ఇటలీ సందర్శించారు. మానవవాద సందేశాన్ని వారే ఆల్ఫ్ పర్వతాల అవతలకు గొంపోయారు. "ఇటలీ వెలుగు జర్మనీలో ప్రభావం చూపెట్టింది. ఇటలీతో నిరంతర సంబంధం వలన, మతపరమైన వ్యవహారాల వలన , ఇటలీ వారు తమ అధిక్యతలో ఉన్నట్లు జర్మనులు గ్రహించారు. ఇటలీ వ్యాకరణ అలంకార శాస్త్ర పండితులకు శిష్యులుగా వున్నవారే జర్మనీ వారని ఈసడించడం, తమ వ్యావహారికంలో కర్కశత్వాన్ని లిఖితపూరిత భాషా లోపాలను జర్మనులు గ్రహించి సిగ్గుపడడం సంభవించింది. అందువలన ఇటలీ నుంచి లాటిన్ నేర్వాలని యువతరం నిర్ధారించింది. ఆ కాలానికి ప్రతినిధిగా ఎన్నదగిన వ్యక్తిగా అగ్రికోలా- రూడోల్ఫ్ హస్మన్ ఆవిర్భవించాడు. అతని పాండిత్యాన్ని అందరూ శ్లాఘించారు. అతన్ని రెండో వర్జిల్‌గా, పాఠశాలల్లో రోమన్‌గా ప్రస్తుతించారు."

అయితే, పాండిత్య వివేచనా వాదానికి ఆయువుపట్టు అయిన ఉత్తరాది దేశాల విశ్వవిద్యాలయాలలో  యీ సందేహానికి తగిన ప్రోత్సాహం లభించక పోవడంలో ఆశ్చర్యం లేదు. మత పెత్తందారీ తనానికి, మత సనాతనత్వానికి శక్తివంతమైన సిద్ధాంతంగా పాండిత్య వివేచన కొనసాగిందక్కడ. విశ్వాసాన్ని వివేచన పూరితం గావించాలని ఆత్రుత చూపారు. స్థంభించిపోయిన మతంలో ఆదిమదశలోని వివేచన జొప్పించాలని ఆ విధంగా పునరుజ్జీవనం తీసుకురావాలని ప్రయత్నించారు. కాని మతాన్ని కూకటివేళ్ళ వద్ద కొట్టింది మానవవాదం. దీనివలన స్వల్పమైన కంపనం వచ్చింది. పాండిత్యవాద కేంద్రమైన పాజూ విశ్వవిద్యాలయం ఇటలీలో పునర్వికాస సంస్కృతిని అడ్డుకున్నట్లే, ఉత్తరాది విద్యాకేంద్రాలు సంప్రదాయంలోగాని, పాతవ్యవస్థను అట్టిపెట్టడంలోగాని పాజూకు తీసిపోలేదు. జాతీయ రాజ్య కేంద్రంగా ఫ్రాన్స్ పరిణమించింది. అక్కడ కాథలిక్ మతం అధికార మతంగా గుర్తించారు. పునర్వికాస సంస్కృతిని  చివరివరకూ తీవ్రంగా నిరసించిందిక్కడే. రోమన్ మతశాఖ చీలకుండానూ, భిన్నమతాలు ప్రబలకుండానూ కాపాడింది. రోం విశ్వవ్యాప్తికి వ్యతిరేకంగా జర్మనీ యువరాజులు, చక్రవర్తి కూడా నిరంతర పోరాటం సాగించారు. అయినా, కొన్ని మినహాయింపులు తప్ప, మానవవాదం పట్ల జర్మనీ విశ్వవిద్యాలయాలు సానుభూతి చూపనేలేదు. అదొక కొత్త రోమన్ అధిపత్యంగా వారు భావించారు. "విదేశీ లక్షణాన్ని దిగుమతి చేసుకోవడం, పాత శత్రువును తెచ్చుకోవడం, జర్మన్‌లు ఆలరిక్,(3) థియోడొరిక్(4) అధ్వర్యాన త్రోసి చేసిన దానిని మళ్ళీ పునరుద్ధరించడంగా

1. 1494-1555 జర్మనీలో గనుల శాస్త్రాన్ని ప్రారంభించినవాడు, చరిత్రకారుడు.
2. 1455-1522 జర్మనీలో మానవతావాది.
3. క్రీ.శ.370-410 రోంను 410లో ఆక్రమించిన విసిగాత్స్ ప్రభువు.
4. క్రీ.శ.454-526 అస్ట్రోగోతిక్ సామ్రాజ్య స్థాపకుడు. ఇటలీని 493-526లో పాలించాడు.

భావించారు. మతేతర ధోరణి, క్రైస్తవుల అసహనం ఒకరిద్దరు జర్మన్లలోనే కనిపించింది."(1) వారి నమ్మకాలను వారు కాపాడుకొన్నారు. అయినప్పటికీ, పునర్వికాస ధోరణిని జర్మనీకి దూరంగా అట్టిపెట్టజాలక పోయారు. వాస్తవానికి, సంస్కరణవాదానికి ముందే పునర్వికాసం బయలుదేరి, ఒకవిధంగా సంస్కరణకు ప్రాతిపదిక వేసింది. మానవవాదం ఉత్తరాదికి వెళ్ళడానికి ఎరాస్మస్ కారణభూతుడు. మత అవినీతిపై తిరుగుబాటు చేసేవరకూ సంస్కరణవాదాన్ని అతను ఆహ్వానించాడు. మానవవాదానికి జర్మనీలో ముద్రణాయంత్రం కనుగొనడం కొంతవరకు తోడ్పడింది. ఇటలీ నుండి ఆగ్రికోల, రెబలిన్, వాన్‌హటెన్ తెచ్చిన పునర్వికాస సాహిత్యం జర్మనీలో సామాన్య పాఠకుడికి కూడా అందుబాటు అయింది. విశ్వవిద్యాలయాలు బహిష్కరించినంత మాత్రాన కొత్త చదువు వ్యాప్తి ఆగలేదు. ఎరాస్మస్ రచనల ప్రచురణతో జర్మనీలో పునర్వికాసం ప్రారంభమైంది. "పాండిత్య ప్రకర్షగల సాహిత్యాన్ని ప్రజాబాహుళ్యంలోకి తీసుకెళ్ళడంలో ఎరాస్మస్ గొప్ప పాత్ర వహించాడు. అతని లక్ష్యం ఉన్నతమైంది. చాలా ప్రాంతాలలో అతని ప్రభావం గాఢ ముద్ర వేసింది. ఉత్తరాదిలో సరైన సమయంలో అతని రచన వచ్చింది. బీడు వేసిపోయిన భూములను సారవంతం చేయడానికి మంచి శక్తి కావాలి. అట్లాగే ఎక్కడికక్కడ సత్ఫలితాలు రాబట్టడానికి ఆయా విధానాలు ఉపకరించాలి."(2)

ఐరోపావాసుల్లో ఏ కాలాన్ని చూచినా ఎరాస్మస్ విశిష్టమైన వ్యక్తిగా, పునర్వికాసంలో వికాసవంతుడుగా, మానవవాదులలో మహోన్నతుడుగా పరిగణిస్తున్నారు. ఈ విషయమై అభిప్రాయాలు భేదించవచ్చు. కాని తన కాలపు సంస్కృతి లక్షణాలు స్పష్టంగా, విశ్వాసపాత్రంగా అతనిలో మూర్తీభవించినవి. ఆనాడు మతపరమైన ఆలోచనకు అసంతృప్తికీ మధ్య సంఘర్షణ సాగుతుండగా ధైర్యశాలురందరూ తమ స్వశక్తిపై ఆధారపడినారు. మతాన్ని సంస్కరించి, నాడు ఆధ్యాత్మికరంగంలో ఐరోపావాసులు ఎదుర్కొంటున్న సంక్షోభం నుంచి సంస్కృతీ పరులు కొట్టుకుపోకుండా ఆపే ప్రయత్నం జరిగింది. ఉన్నత తత్త్వవేత్తలతో ఒకరుగా ఎరాస్మస్‌ని పరిగణించరు. ఆలోచనారంగంలో ఒక క్రమమైన విధానాన్ని అతను సృష్టించలేదు. కాని ఉన్నత తాత్త్విక జీవనాన్ని గడిపాడు. అతనిలో కవిత్వ ప్రతిభలేదు. అతని కళాభిరుచి ఉన్నతస్థాయిలో లేదు. సహనానికి ప్రవక్తగా అతడు పేరుగాంచాడు. మానవ విద్యావ్యాప్తి గావించాడు. తన కాలంలో అతన్ని విద్యాబోధకుడు అనవచ్చు. లేఖావళిలో అతడు సిద్ధహస్తుడు.(3) భావాలను ప్రసారం చేయడానికి వ్యక్తిగతమైన

1. లార్డ్ యాక్టన్, లెక్చర్స్ ఆఫ్ మోడ్రన్ హిస్టరీ
2. కేంబ్రిడ్జి మోడ్రన్ హిస్టరీ
3. పి.ఎస్. హెచ్.ఎం. ఎలెన్ పరిష్కరించి ప్రచురించారు.

ఉత్తరాలే అతని ప్రధాన సాధనాలు. పోప్‌లు, చక్రవర్తులు, రాజులు, పండితులు, రాజకీయవేత్తలు ప్రభృతులతో ఉత్తరప్రత్యుత్తరాలు జరిపాడు. వారంతా అతన్ని గౌరవించారు. అనేక సమస్యలను ప్రస్తావిస్తూ ఎన్నో గ్రంథాలు వెలువరించాడు. డైలాగ్‌లుగాక, ప్రైజ్ ఆఫ్ ఫాలీ వ్రాశాడు.(1) ఇందులో అతని వ్యంగధోరణి బాగా ప్రస్ఫుట మౌతుంది.

పికొడెల్లా మిరాండొలా, లారెంజొవల్లా, పోగియో, పివెల్లో తదితరుల రచనల పునర్వికాస సాహితీముద్ర పడిన ఎరాస్మస్, బహుళ ప్రచారం పొందిన రచన వలన తన కాలపు సంస్కృతి, మేధావులపై గాఢ ప్రభావం చూపెట్టాడు. "ఈ చిన్న గ్రంథం వలన ప్రపంచంలో అప్పటికే ప్రచారంలో గల విషయాలను ప్రతిభావంతంగానూ, సంక్షిప్తంగానూ ప్రస్తావించి, నాటి అభిరుచికి విమర్శకు సంతృప్తికరంగా ఉండేటట్లు ఆ కాలపు రీతులు తప్పకుండానూ చేశాడు. వర్ణనాతీత ప్రభావం ఆ పుస్తకం వలన వచ్చింది. అతని కాలంలో 27 ముద్రణలు చూచిన యీ గ్రంథం అన్ని భాషలలోకి అనువదించబడి మతగురువుల వ్యతిరేక ధోరణికి తోడ్పడింది."(2)

సంప్రదాయబద్ధమైన ప్రామాణిక గ్రంథాలు ప్రచురించే గౌరవనీయ ప్రచురణకర్తలు ఎరాస్మస్ రచనల సంకలనం నుంచి యీ గ్రంథాన్ని తొలగించడం సహజం గనుక, యిందలి విషయాలు సంక్షిప్తంగా ప్రస్తావించడం మంచిది. నేటికీ యీ గ్రంథాన్ని చదివి ఉపయోగం పొందవచ్చు. మానవ జీవితంలో అవివేకం ఏ మేరకు చలాయిస్తుందో చూపడం ప్రధానం. ఒక కట్టుకథ ఆధారంగా భావాన్ని స్వీకరించాడు. ఆనంద దీవులలో ఒక రాజకుమారి అవివేకానికి ప్రతిరూపం. ఆమె తండ్రి రాజు. త్రాగుడు మొరటుతనం అలవాటైంది. ఒక సామ్రాజ్యానికి ఆమె మహారాణి అయ్యింది. మతగురువులు ఆమె శ్రద్ధాసక్తులు చూపుతారు. అయినా వారు తమ విధులను నిర్వర్తించడం లేదంటుంది. తాను వారికి అనుకూలంగా వున్నప్పటికీ యిట్లా జరుగుతున్నదంటుంది. ఊహాసౌధాలలో మత శాస్త్రజ్ఞులు విహరిస్తున్నందుకు వారిపట్ల జాలి వహిస్తుంది. మతాన్ని తమ భుజస్కంధాలపై మోసేవారి ప్రయత్నాన్ని అవహేళన చేస్తుంది. తరువాత మతగురువుల అటవిక బోధనా పద్ధతులు అపహాస్యం పాలయ్యే వారి మత ప్రచారవిధానాలు, వారి అవహేళనా పద్ధతులు అజ్ఞానం చూసి గర్విస్తుంది. విశ్వాసపాత్రుల ఆత్మలకు ఉపశాంతిని చేకూర్చవలసిన బిషప్పులు బంగారం కోసం తాపత్రయపడడం చూసి

1) 1509లో వ్రాశాడు. సర్ థామస్ మోర్ సూచనపై రచన చేశాడు. మత శాస్త్రజ్ఞులపైన, మతాధికారులను దృష్టిలో పెట్టుకొని దాడిచేశాడు. డచ్ హ్యూమనిస్టుగా పేరొందిన ఎరాస్మస్ అనేక పర్యాయాలు ఇంగ్లండ్ వచ్చి ఉపన్యాసాలిచ్చాడు.
2) రాంకె, హిస్టరీ ఆఫ్ ది రిఫర్మేషన్.

విమర్శిస్తుంది. రోం కొలువు, పోప్ ఆమెకు స్వాగతం పలుకుతారు. జాతిగర్వం, వృత్తికావట్యాన్ని అపహాస్యం చేస్తుంది. ఆమె లేకుంటే మానవజాతి మరణిస్తుందని ఫాలీ నిర్ధారించి ముగిస్తుంది. అవివేకం లేకుండా వివాహమాడేదెవరు? పొగడ్త ఆత్మస్తుతి లేకుండా ఎవరు సంతోషంగా వుంటారు? అయినా అట్లాంటి సంతోషం అవివేకం కాదా? అదంతా భ్రమపై ఆధారపడింది. వాస్తవంగా రాజుగావడం కంటె రాజుగా ఊహించుకోవడం సులభం. వివేచన లేశమైనా లేనివారు, పశువులకు సమీపంలో ఆలోచించేవారు మాత్రమే అత్యంత సంతోషంగా వున్నామనుకొంటారు. మధ్యయుగాల జీవితంపై దెబ్బకొట్టే యీ వ్యంగరచన కొట్టొచ్చినట్టుగా కనిపించడానికి జర్మనీ పునర్వికాసంలో గణనీయమైన చిత్రకారుడు హేన్స్‌హాల్బిన్(1) చిత్రాలు ఉపకరించాయి.

ఇటలీలో పునర్వికాసం పట్ల తొలుత వున్న ఉత్సాహం సన్నగిల్లి, విస్తృత పరిధిలో యిది వ్యాపించినట్లు, యీ పుస్తకాన్ని ఆనాడు చాలామంది చదవడం వలన రుజువైంది. కపటం, అవివేకం, పేరాశలను యింత ఘాటుగా విమర్శించిన ఫలితమది. “ఉత్తర ఐరోపాలో వివేచన వ్యాపించడంతో రోంలో ఆధ్యాత్మిక చింతన పట్ల ఆసక్తి సన్నగిల్లింది.”(2) 15వ శతాబ్దపు ఉత్తరార్థంలో మానవ వివేచనలోని అన్ని రంగాలలో కొత్త జీవనరీతులు కన్పించాయి. వాన్‌హట్టన్ యిలా అన్నాడు. “విద్య వికసిస్తున్నది. మానవుడి మేధస్సు మేల్కొన్నది. ఏం కాలం ! బ్రతకడం ఎంత ఆనందదాయకం !” ఇంగ్లండ్‌లో థామస్‌మోర్(3) ఫ్రాన్స్‌లో రాబెల్‌జ్(4) యీ సందేశాన్ని ప్రసారం చేశారు. “సంస్కరణవాదానికి పునర్వికాసం దారితీసినప్పటికీ, ఎరాస్మస్ పెట్టిన గుడ్డును లూథర్ పొదిగాడు.”(5) లూథర్ అసహనం, పిడివాదాన్ని ఉత్తరాది పునర్వికాసకర్తలు వ్యతిరేకించారు. ఇచ్ఛ స్వేచ్ఛగా ఉండాలనే అంశంపై ఎరాస్మస్, లూథర్‌తో విడిపోయినప్పుడే యిది జరిగింది. ఆ వాదనలో, మెలాంగ్‌తన్(6) కూడా ఎరాస్మస్‌ను సమర్థించాడు. లూథర్ వివాదాన్ని సమర్థిస్తున్నట్లు మెలాంగ్‌తన్ దూషించాడు. “ఉత్తరాది దేశాలలో ఇటలీ కంటె ఆలశ్యంగా ఆరంభమైన పునర్వికాసం త్వరలోనే సంస్కరణవాదంతో మేళవించింది. 16వ శతాబ్దారంభంలో కొంతకాలం

---

1. 1465–1524 ఇతని కుమారుడు కూడా ఇంగ్లండ్‌లో చిత్రకారుడుగా పనిచేశాడు.
2. ఫిషర్, హిస్టరీ ఆఫ్ యూరోప్
3. 1478–1535 మానవతావాది
4. ఫ్రాంకొ రాబెలెజ్ 1494–1553 ఫ్రెంచి మానవతావాది, వ్యంగ రచయిత, వైద్య శాస్త్రజ్ఞుడు, మార్మికవాదంపై దాడి చేసినందుకు ఫ్రాన్స్ వదలవలసి వచ్చింది.
5. లార్డ్ యాక్టన్, లెక్చర్చ్ ఆన్ మోడ్రన్ హిస్టరీ
6. 1497–1560 విటెన్‌బర్క్ యూనివర్సిటీలో గ్రీక్ ప్రొఫెసర్, సంస్కరణవాది, మానవతావాది.

ఫ్రాన్స్, ఇంగ్లండ్, జర్మనీలో మత వాదోపవాదాలు లేకుండా కొత్త విద్య పట్టుదలగా ప్రచారమైంది."(1)

జర్మనీతో పోల్చిచూస్తే ఇటలీలో మానవవాదం వ్యాపించడానికి గట్టి కారణాలు వున్నాయి. క్రైస్తవులు పేర్కొనే వ్యక్తిరూపంలో దైవం,- అలౌకికంలో విశ్వాసం- సామాన్యుల మనస్సులను ఆకట్టుకున్నది. చదువుకున్నవారు సైతం మతజ్ఞానంలో నిమగ్నులైనారు. దైవస్వభావం, ఆత్మస్వరూపం, వీటి సంబంధం గురించి పండితులు విద్యాకేంద్రాలలో సిగపట్లు పట్టుకోవడంలోనే సరిపోయింది. మేధావుల జీవితం ఎక్కువగా మతపరమైన ఆలోచనతో గడచిపోయింది. మత గురువుల జ్ఞానబోధన, వారికిగల సదవకాశాలకు వ్యతిరేకత వుండేది. మత గురువుల మతాల అవినీతి పట్ల విసుగెత్తింది. అయినా తిరుగుబాటు మతంపైన దేవుడిపైనా మళ్ళలేదు."ఇటలీ కంటే వ్యతిరేకత బలంగా ఇక్కడ వున్నప్పటికీ, అదంతా క్రైస్తవమతం మీద గాక, కాథలిక్ వ్యవస్థపైనే వున్నది."(2) ఆ సమయంలో భావవిచ్ఛేదనతో కూడిన సెక్యులర్ దృక్పథంగల పునర్వికాసం తగ్గివుండవలసి వచ్చింది. మతపాలనలో సంస్కరణ, మతగురువుల అవినీతిని అణచడం వంటి సంస్కరణకు ప్రాధాన్యత హెచ్చింది. "బైబిల్‌కు ప్రమాణపూరిత పాండిత్యం అన్వయించాలని, ప్రమాణగ్రంథం రావాలని" ఉత్తరాదిలో పునర్వికాసం ఆసక్తి కనబరచింది.(3) ఈ ధోరణిని ఎరాస్మస్ సైతం ప్రోత్సహించాడు. కలుషితంగాని మానవవాదం, మానవుడి తిరుగుబాటు వ్యంగరచనతో, రాబెల్‌వలె ఎరాస్మస్ బోధించాడు. ఇతర రచనలలో దేవాలయపాలన సంస్కరించాలని, మత సిద్ధాంతం పవిత్రంగానూ, విశ్వాసం సాధారణమైనదిగానూ వుండాలన్నాడు. క్రైస్తవ విశ్వాసంలో తొలుత వున్న పవిత్రత తిరిగి తీసుకురావాలని ఉత్తరాది పునర్వికాస కర్తలలో ఎక్కువమంది ఆలోచించారు. మతానికి వివేచనాత్మక ప్రాతిపదిక ఉండాలనే వాదనను పాండిత్యవాదం బలపరచింది. ఉత్తర ఐరోపాలో పాండిత్య విద్య ప్రభావం చదువుకున్న వర్గాలపై అధికంగా వుండేది. అందువలన అక్కడ మానవతావాదానికి చాలాకాలం ప్రతిఘటన జయప్రదంగా సాగింది. మానవవాదం గందరగోళంతో, అవినీతితో- అవినీతికాకున్నా- కొందరు వ్యక్తులు విశ్వంలో క్రమానికి వ్యతిరేకంగా వున్నారని మానవవాదులను అన్నారు. "మతేతర పునర్వికాసం అధిపత్యం వహించిన ఇటలీలో సంస్కరణవాదం ప్రారంభం కాలేదు. మత భావన గాఢంగా నాటుకుపోయిన ప్రజలలో యిది మొదలైంది."(4) ఇందులో

---

1. బెర్ట్రాండ్ రస్సెల్, హిస్టరీ ఆఫ్ వెస్టర్న్ ఫిలాసఫీ
2. లార్డ్ యాక్టన్, లెక్చర్స్ ఆన్ మోడ్రన్ హిస్టరీ
3) రస్సెల్, హిస్టరీ ఆఫ్ వెస్టర్న్ ఫిలాసఫీ
4) సైనోబోస్, ది రైజ్ ఆఫ్ యూరోపియన్ సివిలిజేషన్

ఇంగ్లండ్‌ను కూడా చేర్చవచ్చు. "పూర్తిగా భిన్నరూపానికి చెందిన మేధావుల ఉద్యమం"గా సంస్కరణవాదాన్ని రాంకే చిత్రించాడు. ఉత్తర మధ్య ఐరోపాలలో చదువుకున్నవారి సాంస్కృతిక అవసరాలు, మేధాసంబంధమైన వత్తిడులు, ఆధ్యాత్మిక ఆసక్తులు తృప్తి పరచడానికి తగిన వివేచనాత్మక క్రైస్తవమతం కావాలని సంస్కరణ వాదం బోధించింది.

ఆదిమ వివేచనావాద పుణ్యమా అంటూ మతం కాలానుగతంగా మానసిక అభ్యాసం అయి కూర్చున్నది. అయినా, మతపరమైన ఆలోచన చలనరహితం కాదు. భావచైతన్యతకు అదీ గురికాక తప్పలేదు. విశ్వాసానికి పవిత్రత ఆదర్శం. ఆ ఆదర్శం కోసం తాపత్రయపడుతూ మతం, ఆధ్యాత్మికాభివృద్ధి అవకాశాలన్నిటినీ పూర్తిగావించింది. పవిత్రతను మళ్ళీ సమకూర్చుకొనాలనే విశ్వాసం గూడా మతానికి పుష్టిని యిస్తుంది. ఇటువంటిదే మరొకటి సందేహవాదం. తార్కికంగా వచ్చే ఆ పరిణామం నుంచి బయటపడే నిమిత్తం మతం తప్పనిసరిగా సంస్థాగతమౌతుంది. ఆదిమ వివేచనా క్రమంగా వివేచనారహిత సిద్ధాంతాలు, పిడివాదనలు, కర్మకాండలు, ఛాందసులు చెప్పే ఆచారాలలో కప్పిపుచ్చుకుంటుంది. స్వేచ్ఛాపిపాస, సత్యాన్వేషణ కోరే మానవుడు విశ్వాసపు సంకెళ్ళను తెంచుకొని బయటపడతాడు. కనుకనే, మతాన్ని సంస్కరించాలని ఆదర్శమైన స్వప్నంగా అనుకుంటారు. వాస్తవానికి మతాన్ని సంస్కరించడం సాధ్యపడదు. మతం సంస్థాగతం చేయాలి. అంటే అధికారాన్ని కేంద్రీకరించడమన్నమాట. అధికారం దుర్వినియోగమౌతుంది. స్వేచ్ఛకు హద్దులు ఏర్పరుస్తారు. బాల్యావస్థనుండి మానవుడి మనస్సు బయటపడితే, అంటే ఆదిమ మతం మానవుడి ఆధ్యాత్మిక అవసరాలు సంతృప్తి పరచే స్థితి పూర్తయిన తరవాత, అలౌకికంలోనో, బహు దేవతలలోనో, ఏకేశ్వరునిలోనో, నిరీశ్వరునిలోనో విశ్వాసం వుంచడంతో, మానవుడి మనో వికాసానికి సంకెళ్ళు పడినట్లే. మానసిక వికాసానికి, నైతిక పెంపుదలకు, భావవికాసానికి కట్టలు తెంచుకొని మనిషి బయటకు రావాల్సిందే. పునర్వికాస ప్రయోజనం అదే. అందుకే మానవవాదానికి ఎదురుగా అలౌకికవాదం అట్టిపెట్టారు. మానవుడు తన భవిష్యత్తును తానే తీర్చిదిద్దుకోవాలని, మానవుడి యిచ్ఛకు నియమబద్ధ ప్రకృతి అడ్డుపడదని మానవవాదం చాటింది. ఇందుకు విరుద్ధంగా సంస్కరణవాదం, మత ఉద్యమం, దివ్యత్వపు పవిత్రతను అట్టిపెట్టాలని దీని లక్ష్యం జర్మనీ యీ మహత్తర కార్యాన్ని తలపెట్టింది. "కాని యిది సాధించడం అసంభవం. రోంకు వ్యతిరేకంగా సంస్కరణకై అనేక సంఘటనలు జరగడానికి జర్మనీని సంసిద్ధం చేసినప్పటికీ యిది అయ్యే పనికాదు."(1)

1. రాంకె, హిస్టరీ ఆఫ్ ది రిఫర్మేషన్

జర్మనీలో సంస్కరణవాదాన్ని ప్రోత్సహించిన పరిస్థితులను సమీక్షించాము. విశ్వాసాన్ని ప్రక్షాళనం గావించాలనే తొలుతగల భావనలో రోం అధిపత్యాన్ని వ్యతిరేకించినప్పటికీ, రాను రాను సెక్యులర్ విషయాలు ప్రాధాన్యతలోకి వచ్చాయి. ఒక విధమైన సంస్థాగత క్రైస్తవమతాన్ని వ్యతిరేకిస్తూ మరొక విధమైన సంస్థాగత మతం ప్రత్యామ్నాయంగా తలెత్తింది. విశ్వాసం ప్రక్షాళనం గాలేదు. అదింకా నగిషీలు తొడిగింది. కుతర్క వివేచనావాదంతో సిద్ధాంతగతమైన కొత్తవిధానాన్ని సమర్ధించారు. “సంస్కరణవాదం ప్రతి సంస్కరణవాదం ఒకే విధంగా, ఇటలీ జ్ఞానాధిపత్యంపై, అంతగా నాగరికత చెందిన దేశాల తిరుగుబాటు అనవచ్చు. సంస్కరణవాదపు తిరుగుబాటు రాజకీయ, మతజ్ఞానపరమైనది. పోప్ అధిపత్యాన్ని తృణీకరించారు. స్వర్గద్వారాలను తెరిచే తాళాలు పోప్ దగ్గర వుంటాయనడాన్ని కాదన్నారు. ప్రతి సంస్కరణవాదానికి సంబంధించి తిరుగుబాటంతా ఇటలీ పునర్వికాసంలోని జ్ఞాననైతిక స్వేచ్ఛలపై జరిగింది.(1)

లూథర్ అధ్వర్యాన సంస్కరణ వాదం తొలుత చిత్తశుద్ధితో జరిగిన మతోద్యమమైనప్పటికి, తరువాత చాలావరకు అధికృత కోసం జరిగిన పోరాటమే. మధ్య యుగాలలోని మతేతరులు పునర్వికాసాన్ని , సంస్కరణ ఉద్యమాన్ని ఆహ్వానించారు. థామస్ అక్వినాస్(2) పెత్తనంలో వున్న నామినలిస్టుల పాండిత్యవాదాన్ని ఎదిరించి అగస్టిన్(3) కరుణ సిద్ధాంతాన్ని తిరగదోడే ఉద్దేశంతో సంస్కరణోద్యమం ఆరంభమైంది. ప్రాచీన విద్యను పునరుద్ధరించే విషయంలో శతాబ్దాలుగా సాగుతున్న మతపరమైన చర్యలో యిది భాగం. థామస్ మతజ్ఞానానికి వ్యతిరేకంగా, కేవల విశ్వాసం కోసం పోరాడిన ఉద్యమానికి డొమినకనే(4) రుషి జాన్ డ వెసాలియ సారధ్యం వహించాడు. లూథర్‌కు చాలాకాలం ముందే యిదంతా జరిగింది. 14వ శతాబ్దం మధ్యలోనే మధ్య ఐరోపాలో అంతట చిత్తశుద్ధి మత సంస్కరణ కావాలన్న విక్లిఫ్(5) భావాలు వ్యాపించినవి. ఇతని ప్రచార ప్రభావంతో బొహిమియాలో హస్సైట్ ఉద్యమం, దక్షిణ జర్మనీలో మత రహిత ఉద్యమం వచ్చాయి.

---

1.రాంకె, హిస్టరీ ఆఫ్ ది రిఫర్మేషన్

2.1225-74 రోమన్ కాథలిక్ మతానికి నాడు సిద్ధాంతకర్త.

3. క్రీ.త.345-430 ఉత్తర ఆఫ్రికాలో హిప్పో బిషప్‌గా, క్రైస్తవలలోకి చాలామందిని మార్చాడు. అంతా ముందే నిర్ధారించబడిందని కరుణ ప్రధాన బోధనలు చేశాడు.

4. 1215లో స్పానిష్ రుషిడొమినిక్ స్థాపించిన మత గురువుల వ్యవస్థ. వీరు నల్లని దుస్తులు ధరించేవారు.

5.1320-84 మత ఆస్తులను వ్యతిరేకించి మతగురువులు పేదరికంతో వూండాలన్నాడు. కరుణ ప్రధానంగా రాజుల, పోప్ అధికారాన్ని వ్యతిరేకించగా, పోప్ యితన్ని బహిష్కరించాడు. బైబిల్‌ను ఇంగ్లీషులోకి అనువదించాడు.

ఆదిమ క్రైస్తవ మత పవిత్రతను, నిరాడంబరతను ఐరోపా మత భ్రష్టులనబడే వారు కావాలన్నారు. యాదృచ్ఛికంగా లూథర్ యీ కారణం స్వీకరించి ధీరోదత్తుడయ్యాడు.

కాని అదంతా పైకి కనిపించేదే. ఇతర కారణాల వలన లూథర్ ఆ స్థితికి నెట్టబడ్డాడు. వివేచనను సంతృప్తి పరచే విశ్వాసం కోసం అన్వేషించే తత్వవేత్తలుగా లూథర్, కాల్విన్(1) రాలేదు. మత గ్రంథాన్ని తమ వ్యాఖ్యానాల ఆధారంగా భాష్యం చెప్పే సిద్ధాంతకర్తలు వీరు. మధ్యయుగాల మానవుడివలె గాక, ఎవరికివారు తమ మతాన్ని యధేచ్ఛగా ఎన్నుకునే విధంగా, స్వేచ్ఛాయుత పరిశీలనకు–అంగీకరించే ఉద్దేశం వారికిలేదు."(2)

అయినప్పటికీ, క్రైస్తవమత చరిత్ర ఫలితంగానే సంస్కరణ వాదోద్యమం వచ్చింది. కొత్తవర్గం తలెత్తినందుకు యిది రాలేదు. క్రైస్తవమత చరిత్రలోనే యిందుకు కారణం వున్నది. క్రైస్తవమత సారాంశాన్ని మతజ్ఞానం పూర్తిగా కప్పిపుచ్చలేక పోయింది. వ్యక్తి తన విమోచనకై ప్రయత్నించడం అందులో ప్రధానాంశం. క్రైస్తవమత సంస్థాగతమైన తరువాత ముక్తికి మత సంస్థ ఏకైక సాధనమని విశ్వాసపాత్రులు గుర్తించారు. విశ్వాసం–మతాచారం, ఇవి రెండూ రెండు మార్గాలు. జీసస్ చెప్పిన ప్రకారం యిందులో ఏది సరైనది? మత గ్రంథాలను వ్యాఖ్యానించడం ఒక్కటే మార్గంగా తోచింది. సంప్రదాయబద్ధంగా బోధించే మత సంస్థ వుండనే వున్నది. అయితే వ్యక్తులు తాముగా పవిత్ర గ్రంథాన్ని చదవడానికి, తద్వారా దైవమార్గం కనుగొనడానికి మతపరంగా నిషేధం ఎన్నడూ లేదు. క్రీస్తును నమ్మడం ఒక్కటే ముక్తిమార్గమని, పాల్ ఆధారంగా అగస్టిన్ పేర్కొన్నాడు. ఉత్తరోత్తరా, అగస్టిన్ చెప్పినదానిని కాదనకపోయినప్పటికీ, మత సంస్థ ఆచారాలకు, సంస్కారానికి చాల విలువ ఆపాదించింది. 10వ శతాబ్దం నుంచి, వేలాది భక్తుల అనుభవం దృష్ట్యా మత పవిత్ర గ్రంథాల సహాయంతో ముక్తి సాధించవచ్చుననే వారున్నారు. వారిని మతభ్రష్టులని ఖండించారు. విక్లిఫ్, హూస్(3)కు ముందే వారున్నారు. వారు చిత్తశుద్ధిగల మత వ్యక్తులు వివేచన వలన తమ విశ్వాసానికి సంతృప్తి కలగాలని వీరంటారు.

లూథర్ నడిపిన ఉద్యమంలో ఉత్తరోత్తరా మత, రాజకీయోద్దేశాలేవైనప్పటికీ, తొలుతమాత్రం కేవలం మతపరంగానే అతను ప్రారంభించాడనడంలో సందేహం

---

1. 1509–64 ఫ్రెంచి మత జ్ఞాని. స్విట్జర్లండ్‌లో ఇతని అనుచరులను కాల్వనిస్టులంటారు.

2. సైనొబాస్, ది రైజ్ ఆఫ్ యూరోపియన్ సివిలిజేషన్

3. జాన్‌హస్ 1373–1415 బొహీమియా(జెకోస్లోవేకియా) మత ప్రచారకుడు. సంస్కరణ కావాలన్నందుకు యితన్ని సజీవదహనం చేశారు. ఇతని అనుచరులను హూస్ వాదులంటారు.

లేదు. దివ్యసందేశం పొంది నాడీరుగ్మతగల లూథర్, ముక్తి మార్గాన్వేషణలో వ్యక్తిగతంగా చాలామంది క్రైస్తవులు అనుభవించే చిత్రహింసను అతను గ్రహించాడు. క్రీస్తు ప్రతిభ గురించి పాల్ ప్రవచించిన తిరుగులేని విశ్వాసం లూథర్ తన జీవితారంభంలో పొందాడు. దీనినే అగస్టిన్, ముక్తిమార్గానికి కరుణ సిద్ధాంతంగా విపులీకరించాడు. కాని పాల్‌ను అధిగమించే సాహసపరిస్థితులవలన లూథర్ ముందుకు సాగాడు.(1)

సంస్థాగత క్రైస్తవ మతాన్ని అగస్టిన్ ముక్తి సిద్ధాంతం తార్కికంగా ప్రశ్నించింది. ముక్తి పొందడానికి కర్మకాండ అవసరం లేదంటే, మతగురువుల, మతపాలన, తారతమ్యాలుగల మతాధిపతులు కృత్రిమం మాత్రమే. థామస్‌కు వ్యతిరేకంగా అగస్టిన్ చెప్పింది అంగీకరించిన లూథర్, దీనిలో గర్భితంగా యిమిడివున్న ఫలితాలను కూడా ఒప్పుకొనక తప్పిందిగాదు. మతభ్రష్టులుగా పరిగణించినవారు, ఎరాస్మస్ భావాలకు చెందిన మానవతావాదులు కూడా యిదే పరిస్థితిని సృష్టించారు. రోంకు వ్యతిరేకంగా సంస్కరణోద్యమం వచ్చింది. క్రైస్తవమతపాలనలో ఉన్నత స్థానాలన్నీ ఇటలీవారు ఆక్రమించినందున కినుక వహించిన జర్మన్ మతగురువులు, సెక్యులర్ అధికారాలకై ఎదురుచూస్తున్న జర్మన్ యువరాజులు సంస్కరణోద్యమాన్ని పోషణ చేశారు.

విధి నిర్ణయ సిద్ధాంతం కూడా లూథర్ చేపట్టిన తొలి మత ఉద్యమంలో వున్నది. ఆత్మకు ముక్తిగలగడానికి మతాచారాలు, ప్రతిభలు, ప్రయోజనం చేకూర్చవుగనుక, భవిష్యత్తును దైవం ముందే నిర్ధారించి వుండాలి. దీని తార్కిక ఫలితంగా యిచ్ఛకు స్వేచ్ఛలేదు. ఆ సమస్యపై, లూథర్ సంస్కరణోద్యమంతో ఎరాస్మస్, ఇతర మానవవాదులు తెగతెంపులు చేసుకున్నారు. మతభ్రష్టులనే వారితో కూడా బంధాలు తెగిపోవడంతో సంస్కరణోద్యమానికి మత ప్రాధాన్యత పోయి జర్మన్ యువరాజుల సెక్యులర్ ప్రభావం క్రిందకు వచ్చింది. విశ్వవ్యాప్తంగా మతాధికారంపై జర్మనీలో క్రైస్తవమతం తిరుగుబాటు చేయడం సంస్కరణోద్యమంలో కనిపిస్తుంది, కాని లూథర్ మతపరంగా పిడివాదం ప్రవేశపెట్టేసరికి, తొలుత అనుకున్న మత ప్రాధాన్యత పోయింది. జాతీయ సంకుచిత తత్వానికి సిద్ధాంతంగా లూథర్ వాదం పరిణమించింది. "దేవుని ప్రత్యేక ఆజ్ఞవలన, జర్మనీ జాతిద్వారా ప్రపంచమంతటా క్రైస్తవజీవనం వ్యాపిస్తుందనే ప్రచారం జరిగింది. ఒకప్పుడు జూడాను గురించి యిట్లాగే అన్నారు."(2)

---

1. మాచ్యూ ఆర్నాల్డ్, సెయింట్ పాల్ అండ్ ప్రొటెస్టాంటిజమ్
2. రాంకె, హిస్టరీ ఆఫ్ ది రిఫర్మేషన్

సంస్కరణోద్యమం జాతీయోద్యమమే. దాని వెనుక ఉన్నది కొత్తగా తలెత్తిన బూర్జువావర్గం మాత్రం కాదు. పోప్‌కూ జర్మనీ చక్రవర్తికీ చిరకాలంగా జరుగుతున్న పోరాటం రోమన్ మతాధిపత్యంపై తిరుగుబాటు వచ్చింది. కొత్తగా చక్రవర్తి అయిన ఐదవ ఛార్లెస్ దీనికి నాయకుడయ్యాడు. స్వతంత్ర ప్రతిపత్తి పొందనున్న జర్మనీ మత వ్యవస్థకు సిద్ధాంతకర్తగా, ప్రచారకుడుగా లూథర్ ఉన్నాడు. చక్రవర్తి మతపరమైన సలహాదారులను తొలగించి యువరాజుల మతేతర వ్యక్తులతో పరిపాలించాలని, ప్రజా వ్యవహారాలన్నీ ఉన్నత పరిశీలకులకు అప్పగించి మతాధికారులను తీసెయ్యాలని లూథర్, అతని అనుచరులు విజ్ఞప్తి చేశారు. అప్పుడు చక్రవర్తి జాతి అభిప్రాయానికి ప్రతిబింబమౌతాడు. పోప్, కార్డినల్స్ ఆశీర్వచనాలు చక్రవర్తికి అనవసరం. పైగా మతాధిపతులకే చక్రవర్తి ఆమోదముద్ర కావాలి. “అప్పుడు శక్తివంతమైన జర్మన్‌జాతి ఉవ్వెత్తుగా లేచి, చక్రవర్తి ననుసరించి, రోంకు పయనించి ఇటలీని సామంత రాజ్యంగా మార్చేస్తుంది. అప్పుడు జర్మనీ చక్రవర్తి రాజాధిరాజౌతాడు.”

ఆధునిక ప్రజాస్వామ్యానికి ప్రాతిపదిక వేసిన బూర్జువావర్గపు వాణి మాత్రం యిదికాదు. మతపరమైన సామ్రాజ్యాన్ని మధ్యయుగాలలో ఓటో(1) నమూనాలో జర్మనీజాతిని రూపొందించడమే అసలు లక్ష్యం. షార్లెమాన్ పట్టాభిషేక సందర్భంగా లాంఛనప్రాయంగా కొలువు నుద్దేశించి మధ్యయుగాల పాలకులను ప్రభువు స్తుతించాడు.“సామ్రాజ్యాలు, దేశాలు, సామంతరాజ్యాల సహాయంతో, దైవానుగ్రహం వలన మళ్ళీ ప్రాచీన ఔన్నత్యాన్ని పొందడం సాధ్యమేనని ఆశించాడు.” (2) లూథర్‌ను అనుసరించి తిరుగుబాటు చేసిన జర్మనీ మతగురువులు– తిరుగుబాటు దేవతలు– తన సామ్రాజ్యాధికారం పోరాటంతో తోడ్పడే నిమిత్తం దైవం పంపిన వారుగా చక్రవర్తి వారిని ఆహ్వానించాడు.

పవిత్ర రోమన్ సామ్రాజ్య రాజ్యాంగం, జర్మన్ ఫ్యూడల్ రాజ్యాలు – సంస్కరణోద్యమాన్ని ప్రభావితం గావించినట్లు, అధికారిక చరిత్రకారుడు రాంకె(3) పేర్కొన్నాడు. పునరుద్ధరించబడిన రోమన్ సామ్రాజ్యానికి షార్లెమాన్‌ను పోప్ పట్టాభిషిక్తుడిని గావించినప్పటినుంచీ ఆధ్యాత్మిక లౌకిక శక్తులమధ్య అధిపత్యం కోసం నిరంతర పోరాటం సాగింది.

సైనిక–మతరాజ్యంగా వున్న పవిత్ర రోమన్ సామ్రాజ్య రాజ్యాంగంలోనే అంతర్లీనంగా యీ పోరాటం వున్నది. ఎన్నికైన జర్మనీ యువరాజులు తమను రోమన్

---

1) 912–973 జర్మనీని, రోమన్ సామ్రాజ్యాన్ని పాలించాడు.

2) రాంకె, హిస్టరీ ఆఫ్ ది రిఫర్మేషన్

3) లాపోల్ట్ ఫెన్‌రాంకె 1795–1886 జర్మనీ చరిత్రకారుడు.

సెనేటర్లుగా భావించుకున్నారు. కనుక, పోప్, చక్రవర్తి అనంతరం రాజ్యాంగంలో వీరు ప్రధానపాత్ర వహించారు. మరొకవైపు ఇటలీ నుంచి ఎక్కువగా వున్న మతాధికారులు, స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థగా, రాజ్యంలో రాజ్యంగా వుంటూ వచ్చాడు. చివరకు లౌకిక, మత ప్రభువుల పోరాటం సంస్కరణోద్యమంగా పెల్లుబికింది. ఏడువందల సంవత్సరాల క్రితం షార్లెమన్ యిదే ధ్వనించాడు.

లౌకికాధికారాలు కాజేయడానికి తలపడిన మత గురువుల ధోరణి పట్ల కలవరం చెందిన చక్రవర్తి, వారిని గర్హిస్తూ, సెక్యులర్ వ్యవహారాలలో వారు జోక్యం చేసుకోవడం ఎలా సమర్ధనీయం? అని ప్రశ్నించాడు. ప్రపంచాన్ని త్యజించడమంటే ఏమిటి? అజ్ఞానులు తమ వస్తువులను దానం యిస్తుండగా యీ మత గురువులు అనేకమంది పరివారాన్ని పెట్టుకొనడం సబబా? దేవాలయాల నిర్మాణం కంటె నీతి ప్రచారం మంచిదికాదా? ఈ ప్రశ్నలు శతాబ్దాలుగా అడుగుతుండగా, చివరకు అదే సంస్కరణోద్యమానికి ప్రేరేపణగా మారింది.

సామ్రాజ్యంలో రాజ్యాంగాన్ని మార్చవలసిన అవసరం వున్నట్లు యీ ప్రశ్నలు సూచించాయి. ఓటో ప్రభువుల అధ్వర్యాన, కొద్దికాలంపాటు, లౌకిక రాజులు అధికృత వహించారు. ట్యూటానిక్ సైనికాధికారులైన జర్మన్ ప్రభువులు వాటికన్‌లో జర్మన్ పోప్‌లను అట్టిపెట్టగలిగారు. "మతాధికారుల తృష్ణను అదుపులో పెడుతున్న లౌకిక నిరంకుశ రాజ్యం, తన అధిపత్యాన్ని సామ్రాజ్యమంతటా గుర్తించేటట్లు చేయ గలిగింది." (1)

11వ శతాబ్దాంతానికి యీ సంబంధం మారింది. విశ్వవ్యాప్తంగా వాటికన్ అధికృత వ్యవస్థాపితమైంది. అన్ని విధాలా, పవిత్ర రోమన్ సామ్రాజ్యం మత రాజ్యమైంది. రాజ్యాంగాన్ని మార్చకుండా వున్న వ్యవస్థ మార్చడం కుదరదు. మతరాజ్యంపై లౌకిక రాజ్యాధిపత్యం వుండాలనేదే యీ మార్పులో ఉద్దేశం. మత గురువులు తప్పు చేయరని, మానవ దైవ సంబంధాలలో మతాధికారం జోక్యం చేసుకోవచ్చని, మత గురువులకు అవకాశాలుండాలని, మత గురువుల అంతస్థుల తేడాలు అట్టిపెట్టాలని ఆచారంగా వస్తున్న విషయాలపై లూథర్ తిరుగుబాటు చేసినప్పుడు, జర్మనీ ప్రభువులు ఆ ఉద్యమానికి మద్ధతు నివ్వడానికి తలపడ్డారు.

రాజ్యాంగాన్ని తిరగరాయాలనే ప్రతిపాదన వందేళ్ళ క్రితం నికలజ్‌వాన్‌కస్(2) నాటిబెజెల్(3) కొలువు ముందు చేశాడు. రాజ్యాంగ సవరణ జరగకుండా మత

---

1) రాంకె, హిస్టరీ ఆఫ్ ది రిఫర్మేషన్

2) 1401-1464 జర్మనీ కార్డినల్, గణిత శాస్త్రజ్ఞుడు, తాత్వికుడు.

3) రైన్ నదీ తీరాన స్విట్జర్లాండ్‌లో నగరం.

వ్యవస్థను సంస్కరించడం అసంభవమని, ఆలోచనలో సైతం సామ్రాజ్యాన్ని మతాన్ని విడదీసి చూడడం దుర్లభమని యితడు మతగురువు హోదాలో చెప్పాడు. మతాధికారుల ద్వందపాలన నుండి లౌకిక అధికారాన్ని విమోచన గావించాలన్నాడు. పోప్ తన ఇష్టం వచ్చినవారికి తరచు సామ్రాజ్యాన్ని కట్టబెట్టడాన్ని యితడు వ్యతిరేకించాడు. దేవునితో, క్రీస్తుతో సామ్రాజ్యానికి మార్మికమైన సంబంధం చూపి, మత పాలనలో జోక్యం చేసుకునే హక్కు, విధి కూడా సామ్రాజ్యానికి వున్నదన్నాడు. మతాధిపత్యం నుంచి బయటపడిన సామ్రాజ్యానికి నిరంకుశాధికారాలు లేకుండా అదుపాజ్ఞలుండాలన్నాడు. తమ అధికారాన్ని లవకేశమైన అదుపులో పెట్టడానికి లౌకిక ప్రభువులు అంగీకరించలేదు. వాటికన్ ప్రతిపాదన వీగిపోయింది. అటువంటి ప్రతిపాదనే మాక్సిమిల్సన్(1) చక్రవర్తి కాలంలో వచ్చినా నిష్ప్రయోజనమైంది. అయితే, ప్రాచీన సైనిక-మత చట్రం అట్టిపెడుతూనే, జర్మనీలో రాజకీయ ఐక్యత తీసుకువచ్చేందుకు 1495లో నాటి జర్మనీ శాసనసభ కొన్ని చర్యలు గైకొన్నది. కాని, చక్రవర్తి, యువరాజులు, కొలువులో ప్రధానుల మధ్య అంతఃకలహాలు పరిష్కారం కాలేదు. ఫలితంగా, మతాధిపత్యం కొనసాగింది. తుదకు, సంస్కరణోద్యమంలో పోటీ మతవ్యవస్థను కొత్తపిడివాదాన్ని, మత పెత్తందారీ విధానాన్నీ, మత గురువుల అంతస్థులను స్థాపించి సమస్య పరిష్కరించారు. కాని సామ్రాజ్య రాజ్యాంగం సవరించలేదు. రోమన్ మత వ్యవస్థను సవరించలేకపోయారు. "విశ్వవ్యాప్తంగా వున్న మతాధిపత్యపు ఐక్యతను విచ్ఛేదం గావించడం లూథర్ కాల్విన్ ఉద్దేశం కాదు. క్రైస్తవులందరినీ దేవాలయానికి రప్పించడంతో సంస్కరణ తెచ్చామని వారనుకున్నారు. వారిదృష్టిలో అదే సరైనది. పోప్ అధిపత్యానగల మతవ్యవస్థ శని దేవాలయం అన్నారు. అందులో వుండేవారు ఖండితులన్నారు."(2)

సంస్థాగతమైన క్రైస్తవమతంలోని దిగజారుడు విధానం, లోపాలను చూచి అసంతృప్తి చెందిన జర్మనీ, ఇటలీ మాదిరిగా భావఛేదన, విప్లవాత్మక ఫలితాలను సాధించలేకపోయింది. తమ వివేచనను సంతృప్తి పరచగల విశ్వాసం, మతం కోసం ఎదురుచూచిన వారితోనే యింకా కలసి వుండడమే యిందుకు కారణం.

మధ్యయుగాలు అంతమౌతున్న కాలంలో జర్మనీ ముద్రణకు జన్మస్థానమేగాక, అనేక కళలకు, వృత్తులకు కాణాచిగా వున్నది. బాగా నైపుణ్యంగల కార్మిక వర్గాలకు అవకాశం కల్పించింది. సంపన్న వాణిజ్య వర్గాలకు అవకాశన్నిచ్చింది. గోథిక్ శిల్పంతో

---

1) 1459-1519 ఇతడు పవిత్ర రోమన్ సామ్రాజ్యాధిపతిగా 1492 నుంచి 1519 వరకూ వున్నాడు.

2) సైనోబోస్, ది రైజ్ ఆఫ్ యూరోపియన్ సివిలిజేషన్

దేవాలయాలు నిర్మించిన సిద్ధహస్తులైన శిల్పులు వున్నారు. చెక్కపైన, ఇత్తడిపైన చెక్కడాలు, లోహపు పనివాళ్ళు, చిత్రకారులు మొదలైన వారితో ఐరోపా అంతటా జర్మనీ పేరు మారుమ్రోగింది. ఆ రోజులలో వ్యక్తులకు ప్రాధాన్యత లేదు. శాశ్వత కళాఖండాలు సృష్టించిన వందల, వేల సృష్టికారులెవరో వారి కుటుంబాలనుంచి, కులాలు, వంశాలు, గిల్డుల నుంచి తేడా తెలియకుండా పోయింది. మధ్యయుగాల సమిష్టివాద సంధ్య వెలుగులో గొప్ప కళాకారులు కొందరే బయటకు తెలిపారు. ఆల్బర్ట్ డ్యూరర్, పీటర్ విషర్, హేన్స్ హొల్బెన్ వంటి వారిపేర్లు చరిత్రలో గుర్తింపు తెచ్చుకోగలిగారు. ఇందులో హొల్బెన్ గొప్ప చరిత్రకారుడుగా అంతర్జాతీయ ఖ్యాతినార్జించడానికి ఇంగ్లండ్ పారిపోవలసి వచ్చింది.

15వ శతాబ్దం చివరలో, జర్మనీకి ఫ్లొరెన్స్ వంటిది న్యూరెంబర్గ్. తలెత్తుతున్న బూర్జువా వర్గానికి నిర్విరామంగా వాణిజ్య, పారిశ్రామిక వర్గాలకు కేంద్రంగా వుండేది. ఉన్నత ఆర్థిక కేంద్రంగా అగ్స్‌బర్గ్(1), లొంబార్డ్(2) కు ప్రత్యర్థిగా వుండేది. చక్రవర్తులు, పోప్‌లు, బాగా అప్పులపాలయ్యేటట్లు చేసిన బాంకింగ్ కేంద్రం పూగర్స్ (3) ఇక్కడే వుండేది. అయినా, కళకు సాహిత్యానికీ కనీసం యీ మధ్యకాలంలోని జర్మనీ నగరం ఏదీ పోషణ చెయ్యలేదు. దేశంలో యితర చోట్లవలె, విద్యావంతులు, సంపన్నులు మత మనస్తత్వాన్నుండి యిక్కడా బయటపడలేదు. "సంస్కరణోద్యమంలో శిల్పులకు చరిత్రకారులకు చెడ్డరోజులొచ్చాయి. మత సామాజిక అరాచకత్వం తీవ్రతరమై జర్మనీ ప్రజలను యితర రంగాలకు మళ్ళించింది. కళగాక, మతం ప్రజలను ఆకట్టుకున్నది. జర్మనీలో చిత్రకారుడికి తావులేదని కనుగొన్న హొల్బెన్, ఇంగ్లండ్ కొలువు శరణుజొచ్చాడు."(4)

ఎరాస్మస్, యితర మానవవాదులు వదిసేసిన లూథర్ వాదం, తలెత్తుతున్న బూర్జువావాద సిద్ధాంతంగా పెంపొంది, వ్యాపించలేదు. సెక్యులర్ అధికారం కోసం తాపత్రయ పడుతున్న ప్యూడల్ యువరాజుల పోషణకు అది నోచుకున్నది. లూథర్‌ను తొలిదశలోనే పోప్, చక్రవర్తి నిషేధించగా శాక్జనీ ప్రతినిధులు అతన్ని కాపాడారు. ఒక ఏడాదిపాటు అతన్ని దాచి కాపాడారు. ఆ సమయంలోనే ప్రొటస్టంట్ వాదానికి తుదిరూపులు దిద్దుకున్నది. మానవుడి ఆత్మకు విమోచన కలిగించాలనే దృష్టితో చిత్తశుద్ధిగా యీ వాదం ఆరంభమైంది. సంస్కరణవాదం ప్రజాబాహుళ్యంలో

---

1) బవేరియా (జర్మనీలో) ఒక నగరం

2) ఇటలీలో ఒకప్రాంతం, ఒకప్పుడు చిన్నరాజ్యం కూడా.

3) 1459-1525 జర్మనీలో బాంకింగ్ వ్యాపారం చేసిన సుప్రసిద్ధ కుటుంబం.

4) ఫిషర్, హిస్టరీ ఆఫ్ యూరోప్

జాతీయోద్యమంగా రూపొందలేకపోయింది. లేకుంటే, జర్మనీకి 30 సంవత్సరాల యుద్ధం ప్రాప్తించేదికాదు. రాజకీయంగా, ఆర్థికంగా రెండుశతాబ్దాల వెనక్కు జర్మనీ వెళ్ళిపోయింది. సంస్కరించబడిన మతానికి యువరాజుల ప్రోత్సాహం లభించడమేకాక, కేవలం వారి ఆదరంపైనే ఆధారపడింది కూడా. అందుకే రైతుల తిరుగుబాటును లూథర్ తీవ్రంగా వ్యతిరేకించాడు. బూర్జువా విప్లవానికి స్వాగతం పలికిన రైతుల తిరుగుబాటు(5) అట్లా అయింది.

మతభ్రష్టులనేవారు బోధించిన తొలి క్రైస్తవ మతభావాలు, సంస్కరణవాదులు చెప్పిన విషయాలు, సహజంగానే రైతులను ఆకర్షించినవి. తొలుత లూథర్ కూడా అందరం భగవంతుని బిడ్డలమని, క్రైస్తు రక్తాన్ని అందరం సమంగా పంచుకుంటామని బోధించాడు. చిరకాలంగా అజ్ఞానంలో వున్న రైతులు చిత్తశుద్ధితో మతాన్ని పాటించారు. లూథర్ యిచ్చిన విమోచన సందేశాన్ని నమ్మారు. "సంపదలో, స్థితిలో అసమానత వుండరాదని" నిర్ధారించుకున్నారు. కాని తన తొలి మతబోధన నుండి లూథర్ చాలా దూరం జరిగాడు. సంస్కరణవాదం కాస్తా రాజకీయ, మత ఉద్యమంగా మారింది. మధ్యయుగాల వీరులు తలపెట్టిన రైతు ఉద్యమాన్ని జికింగన్ బలపరచగా, రైతుల విశ్వాసం పట్ల అతని హృదయం కదలిపోయింది. కాని తన మతబోధనలవల్ల రెచ్చిపోయి తిరుగుబాటు చేస్తే, బూర్జువా విప్లవానికి సిద్ధాంతపరంగా నాంది పలికిన వ్యక్తి, యీ తిరుగుబాటు "జర్మనీజాతికి మతనియమానికి విరుద్ధమని" ఖండించాడు.

పవిత్రగ్రంథం ఆత్మకు స్వేచ్ఛ యిచ్చిందన్న లూథర్ "శరీరానికి కొన్ని హద్దులున్నాయని, ఆస్తికి కొన్ని నియమాలున్నాయని చెప్పాడు. రైతులు వత్తిడికి కించిత్తయినా లొంగేకంటే, పవిత్రుడైన క్రైస్తవుడు వంద పర్యాయాలు మరణించడం మేలన్నాడు. ప్రభుత్వానికి దయ వుండరాదు. ఆగ్రహంతో, కత్తి ప్రయోగించే రోజు వస్తున్నది. శక్తి వున్నంతవరకూ దైవసేవలో చేతనైనంత గట్టిగా కొట్టాల్సిందే. అందులో ఎవరు నశించినా, అతడు క్రీస్తుకు అమరుడౌతాడు. ఆధ్యాత్మికతను వ్యతిరేకించినంత గట్టిగా, లౌకిక వ్యవహారాలను లూథర్ సమర్థించాడు."

మతోద్యమంగా సంస్కరణవాదం ప్రజాస్వామికమూ, ఉదారవాద భరితం కూడా. కాని లూథర్ దీనిని మతపరమైన వివాదంలోకి దింపేసరికి స్వతహాగా

---

5) 1524-1526 మధ్య తిరుగుబాటు చేసిన రైతులు, జర్మనీలో లూథర్ మద్దతు చేకూర్చుకోలేకపోయారు.

వున్న స్వభావం కోల్పోయింది. "మతం పేరిట వున్న ఆస్తులపై సెక్యులర్ యువరాజులకు ఆశ పుట్టడం" లూథర్ పోప్‌తో కలహించడం ఒకేసారి కలసివచ్చాయి.

మతభ్రష్ట ఉద్యమ సూత్రాలను కాలానుగుణంగా గౌరవం పొందిన ఆదర్శాలను వ్యతిరేకించడంలో సంస్కరణవాదం సఫలత పొందింది. లూథర్ మూర్ఖంగా మతపరమైనవాడైనా, మతాలోచన జడంగదా. సమానత్వం సహనంలో అతను నమ్మకం చూపలేదు. అన్ని సమస్యలకూ బైబిల్‌లో పరిష్కారం లభిస్తుందని గట్టిగా నమ్మాడు. దేవుని ముందు మానవుడు నిస్సహాయుడు. తన విధిని మార్చడంలో మానవుడేమీ చేయజాలడు. మానవుడు అంతర్గతంగా కపటి అయినప్పటికీ, అతని ఆత్మరక్షణ పొందాలంటే దైవానికి పూర్తిగా లొంగిపోవాలి. దైవకటాక్షంలో విశ్వాసం వుంచాలి. మానవవాది అయిన 10వ లియోపోప్‌ను లూథర్ ఖండిస్తూ, అతను "క్రైస్తు వ్యతిరేకి" అన్నాడు. వాస్తవానికి లూథర్ మానవతకు వ్యతిరేకి. "కనుక ఐరోపాలో ఉదారవాద, వివేచనోద్యమాలకు పితామహుడు లూథర్ కాదు."

ప్రొటెస్టంట్ ఉద్యమం చాలా శాఖలుగా చీలినప్పటికీ, లూథర్ సంస్కరణ వాదంలోని మానవ వ్యతిరేక ధోరణి కాల్విన్ వాదంలో బాగా ప్రస్ఫుటమైంది. జెనీవా నియంత సంస్కరణ మత సూత్రాలను సంస్థాగతం చేశాడు. "సహజసిద్ధ ప్రతిభలకోసం మానవుడిలో అన్వేషిస్తే ఆపాదమస్తకం మంచితనం ఎక్కడా కానరాదు. మాంసంలోని అపరిశుభ్రత వలన మనలో జనించే అత్యుత్తమ విషయం కూడా కలుషితమైతుంది. అది మురికిలో కలుస్తుంది." పాల్ ప్రవచించిన పవిత్ర గ్రంథాన్ని ఏకపక్షంగా చదివిన లూథర్, విధివాదం గురించి పిడిసిద్ధాంతం చెప్పాడు. కరుణ గురించి అగస్టిన్ అతిగా వ్యాఖ్యానించాడు. కాల్విన్ మత సంస్కరణకు యివే ప్రాతిపదికలైనవి. అనంతంగా ముక్తికై దేవుడు కొందరినే ఎన్నుకున్నాడు. ఆ కొద్దిమంది ప్రతిభకూ దేవుని కరుణతో నిమిత్తం లేదు. ఒకడు దయ్యం అవతారంగా కనిపించవచ్చు. కాని ఎన్నుకోబడిన కొద్దిమందిలో అతడొకడు కావచ్చు. కాల్విన్ కాపట్యం నుంచి బయటపడడానికే యీ అతి వ్యాఖ్యానం చేశాడనవచ్చు. "ఎన్నుకోబడినవారు మానవుడిని అతని మానాన వదిలేస్తే అతని ఆత్మ దోషానికే దారి తీస్తుంది." కనుక మానవుడికి స్వేచ్ఛ వుండరాదు. అతను ఆ అవకాశాన్ని సద్వినియోగం చేయజాలడు. కాల్విన్ చెప్పే సంస్కరణమతం కారాగారవాసం వంటిదే. ప్రతి మానవుడు ప్రాయకంగా చెడు చేస్తాడు. కనుక అతడు పాపాత్ముడు. కనుక అతడిని గట్టి పర్యవేక్షణలో ఉంచాలి. "దైవాన్ని ప్రపంచానికి అతీతంగా పైకి తీసుకెళ్ళదలచిన కాల్విన్ ప్రపంచాన్ని అథఃపాతాళానికి తొక్కేసాడు. దైవభావానికి అత్యున్నత గౌరవం ఆపాదించదలచి

మానవుడిని హీనపరచాడు."(1) మైగల్ సర్విటస్(2) వంటి సమకాలీన మానవ వాదులకు, సెబస్తియన్ కాస్టలొకు "బుసకొట్టే పాము" అనీ, "అరిచే కుక్క" అనీ "సైతాన్ పిల్ల" అనీ కాల్విన్ పేరు పెట్టాడు. మైగల్‌ను ఉరికంబం ఎక్కించాడు.

సంస్కరణమతం చేతుల్లో 16వ శతాబ్దపు ఐరోపా అమానుష హింసకు గురి అయింది. ప్రతి సంస్కరణవాదులైన జెసూట్ సంస్థ(3) సనాతనులను చిత్రహింసలకు గురిచేశారు. ఒక శతాబ్దం క్రితం వెలుగుచూపిన మానవవాదం పూర్తిగా కాకున్నా యించుమించు ఆరిపోయే స్థితికి వచ్చింది. అయితే యిది వాస్తవం కాదు. సంస్కరణవాదానంతరం ఐరోపాలో మేధావుల ప్రజ్ఞవున్నట్లు రుజువైంది. మతజ్ఞానం వెనుక, ఆధ్యాత్మిక దిగజారుడుతనం, అజ్ఞానాల ప్రక్కనే అంతర్లీనంగా మానవుడి పునరుజ్జీవనం కొనసాగింది. లూథర్‌వాదంగాని, కాల్విన్‌వర్గం నుంచిగాని ఒక్క మేధావి కూడా రాలేదు. బహుశ మెలాంగ్తన్(4) ఒక్కరే యీ అర్హతకు పాత్రుడేమో. కాని అతను స్వింగ్లీ(5) కూడా మానవవాదులుగా ఆరంభమైనవారే. లూథర్‌తో మెలాంచతన్‌కు రాను రాను పొసగలేదు. ఇచ్ఛకు స్వేచ్ఛ ఉండాలనే విషయమై లూథర్ భావాలతో యితను జుగుప్స చెందాడు.

కాల్విన్ స్టొయిక్ నీతివాదానికి సమకాలీనులలో చాలామందివలె సెబస్తియన్ కాస్టెలొ కూడా ఆకర్షితుడైనాడు. కాని మానవవాదులవలె, నిరాశ చెందగా, జెనీవా మత ప్రచారకుడు అతన్ని హింసించాడు. సర్విటస్‌ను కాల్విన్ చంపినందుకు 1551లో 'సహనానికి ప్రణాళిక' ను కాస్టెలొ ప్రచురించాడు మానవవాది ప్రమాణపత్రంగా అది చాలామందిని కదిలించివేసింది. సంస్కరణవాదం 'క్రైస్తవులకు స్వేచ్ఛ'ను సమకూర్చుతుందనే లూథర్ ప్రకటనను కాల్విన్ అబద్ధమని, సర్విటస్‌ను ఉరికంబానికి ఎక్కించి రుజువు పరచాడని కాస్టెలొ ఆరోపించాడు. కాస్టెలొ వ్రాస్తూ, సత్యాన్వేషణ, నిజమని నమ్మిన దానిని చెప్పడం, నేరం కాదన్నాడు. దేనినీ నమ్మమని ఎవరినీ వత్తిడి చేయరాదు. నమ్మకం స్వేచ్ఛగా వుండాలి."

పునర్వికాస ప్రభావం ఐరోపా అంతటా విస్తరించినట్లు ఇగ్నీషియన్ లయోలా(3)

---

1) స్టీఫన్‌వైగ్, ది రైట్ టు హియర్సే

2) స్పానిష్ వైద్య శాస్త్రజ్ఞుడు. క్రైస్తవ త్రిమూర్తిత్వాన్ని ఖండించాడు. ఫ్రాన్స్‌లో యితనికి ఉరిశిక్ష వేయగా, ఇటలీ పారిపోడానికి ప్రయత్నించగా, జెనీవాలో కాల్విన్ అరెస్టు చేయించి ఉరి తీయించాడు.

3) 1534 లో ఇగ్నేషియస్ లయోలా రోమన్ కాథలిక్ మతంలో ఒక భాగంగా యీ సంస్థను నెలకొల్పారు.

4) 1497- 1560 జర్మన్ ప్రొటెస్టంట్ సంస్కర్త

5) 1484- 1531 స్విస్ ప్రొటెస్టంట్ సంస్కర్త

స్థాపించిన జెసూట్ వ్యవస్థ సూచిస్తున్నది. మతాన్ని సంస్కరించడం అసంభవమని సంస్కరణవాదం రుజువు పరచింది. ఆదిమ క్రైస్తవమతం బోధించిన నిరాడంబరత, పవిత్ర విధానానికి తిరిగి వెళ్ళడం సాధ్యపడదని తేలిపోయింది. దీనివలన నిరాశ ప్రబలి, మానవవాద వ్యాప్తికి కొత్త వాతావరణం ఏర్పడుతుందని పోప్, అతని మత గురువులు భయపడ్డారు. నాస్తిక, ఎపిక్యూరస్ జీవిత విధానాన్ని తుడిచి పెట్టడం అసాధ్యం. ఎదురు తిరిగిన దేవతలను చూచి ఐరోపా విస్తుపోయింది. మధ్యయుగాల సమాజ వ్యవస్థలోని, క్రైస్తవసంస్కృతిలోని, ఆధ్యాత్మిక ప్రాతిపదికలను మానవవాదం కదిలించడాన్ని గమనించిన ఐరోపా విభ్రాంతి చెందినది. విద్యాసంస్థలలో చొచ్చుక పోయిన యీ భావాలు యువతరాన్ని ప్రభావితం చేశాయి. 16వ శతాబ్దంలో ఎరాస్మస్‌ను ప్రధాన బోధకుడుగా గుర్తించారంటే వూరికేకాదు మరి.

పునర్వికాసకర్తలు విశ్వవిద్యాలయాలు, మతాల నుంచి విద్యను విమోచన గావించారు. అక్కడ విద్య సెక్యులర్‌గా లేదు. మతజ్ఞానంతో విద్య అంతా వ్యాప్తిలో వుండేది. ప్రతిభావంతుడుగా గుర్తింపు పొందిన రోజర్ బేకన్ సైతం, మత జ్ఞానాన్ని ఉన్నత శాస్త్రంగా పేర్కొన్నాడు. 15వ శతాబ్దారంభంలో మానవ విద్యను బోధించే పద్ధతులను విట్టోరినో డఫెల్ ట్రే కనిపెట్టాడు. అన్ని విషయాలలో పౌరులను సుశిక్షితుల గావించే సెక్యులర్ పాఠశాలలు నెలకొల్పారు. మనస్సు, దేహం పొందికగా అభివృద్ధి చెందాలనే గ్రీక్ భావన ఆధారంగా యీ విధానం పెంపొందించారు. “మన అపవిత్ర దేహాలు” అనే క్రైస్తవ సన్యాసి భావాన్ని నిరాకరించినందుకు, అనవసరంగా మానవవాదులను అవినీతిపరులని, సంప్రదాయ నీతి సూత్రాలను పట్టించుకోరని దూషించారు. దేహంతోపాటు మనస్సు కూడా అభివృద్ధి చెందాలని మానవ వాదులన్నారు. అందువలన చిత్రకళ, శిల్పం వారి చేతులలో మహోన్నతస్థాయి నందుకున్నవి. పునర్వికాస కళను పరిశీలించడానికి మానవశరీరాన్ని అంగ నిర్మాణాన్ని శ్రద్ధాసక్తులతో గమనించడం అవసరం. సంప్రదాయ నైతికభావాలు తృణీకరించడంతో కొత్త రామణీయకత విలువలు సృష్టించబడినవి. ఐరోపా అంతటా మానవవాద విద్య వ్యాపించింది. ఎరాస్మస్ వంటి వ్యక్తులు యిందుకు బాధ్యులు. “ప్రపంచంలో ఉదార సంస్కృతికి ఫలితాలు, మానవ భావాల ఆధారంగా నాటి ఇటలీ పునర్వికాసంలో కనిపించాయి.” “నాలుగు శతాబ్దాలుగా ఐరోపాలో వ్యాపించివున్న విద్యావిధానానికి నాడు పునాదులు పడినవి. వివిధ దేశాలకు సంబంధించిన వారికి ఒక సాధారణ పాఠ్యప్రణాళికను ఏర్పరచి, ప్రజలలో మేధావులకు సంబంధించిన అంతర్లీన భావ ఐక్యత తెచ్చారు.” (జె.ఎ. సైమండ్స్, రినైజాన్స్ ఇన్ ఇటలీ).

మానవవాద విద్యలో ప్రమాదాన్ని గ్రహించిన నిశిత పరిశీలకుడు లయోలా,

కొత్త విలువలు, ప్రమాణాలు రావడం గ్రహించాడు. పరిశీలనను ప్రోత్సహించడం, సందేహవాదాన్ని లేవనెత్తడం, మతజ్ఞానం కంటె సెక్యులర్ విద్యకు ప్రాధాన్యత ఏర్పడడం, పిడివాదం వివేచనకు లొంగిపోవడం చూచాడు. మానవవాద వ్యాప్తిని అరికట్టడానికి విద్యాసంస్థలను స్థాపించాలని లయోలా నాయకత్వాన జెసూట్ మత వ్యవస్థ పూనుకున్నది. ఐరోపా యువతరం వారి ఆత్మలను ఆకర్షించడానికి మానవవాద ఉపాధ్యాయులతో పోరాటానికి తలపడ్డారు. దీర్ఘకాలిక పథకంతో, ఆచరణ దృష్ట్యా ప్రవాహంతో బాటు ఈదదలచాడు లయోలా. "స్పెయిన్ పితామహులు" స్థాపించిన కళాశాలలో, బడులలో అత్యుత్తమ విద్యను బోధించారు. ప్రాచీన భాషలతోబాటు, విజ్ఞానాన్ని కూడా చెప్పారు. దీనితో లయోలా అనుసరించిన మార్గం అతని లక్ష్యాన్ని ఓడించింది. ఆధునిక విద్యావ్యాప్తికి, విజ్ఞానాభివృద్ధికి, జెసూట్ విద్యాసంస్థలు తోడ్పడినవి. అచిరకాలంలో మంచి ఉపాధ్యాయులను ఖ్యాతిని ఆర్జించిన జెసూట్ ఫాదర్లను ప్రాచీన విశ్వవిద్యాలయాలలో ప్రముఖస్థానాలకు ఆహ్వానించారు.

అదే సమయంలో శక్తివంతమైన మత ఆలోచన కూడా అమలులో వున్నది. కోపర్నికస్‌ను పరాసిల్‌సస్ అనుసరించాడు. అర్ధశతాబ్ది అనంతరం, భూమి దాని యిరుసుపై తిరుగుతున్నట్లు నికొలస్ క్యూనమూస్ (1) నిర్ధారించాడు. ఖగోళశాస్త్రం పెంపొందడానికి డెకోబ్రాహె (2) నిర్మించినారు. డోల్ఫిన్ పట్టికలు ఎంతో తోడ్పడినవి. వృధాగా వున్న 16వ శతాబ్దాంతంలో గలీలియో(3) కెప్లర్‌లు(4) తమ అధ్యయనాలు ఆరంభించారు. సూక్ష్మదర్శిని పరికరాన్ని జాన్‌సన్(5) కనుగొన్నాడు. ప్రకృతిని వాల్ హెల్ మాంట్ పరిశీలించాడు. భూమ్యాకర్షణ, విద్యుత్‌రాపిడిని గిల్బర్ట్(6) కనుగొన్నాడు. బ్రూనో(7)ను అమరజీవిని గావించడంలో ఆ శతాబ్దం ముగిసింది. పునర్వికాసం వలన వచ్చిన ప్రోత్సాహంతో తొలిసారి మానవుడు విజ్ఞానం ఆధారంగా ప్రకృతి నియమంతో తాను పొందికగా ఉండగలనని, ఎక్కడో వున్న విధి చేతిలో తాను నిస్సహాయంగా మెసలేవాడిని కాదని, ఇదంతా దైవకృప అని ఆమోదించనక్కర లేదని ఆత్మ స్థయిర్యాన్ని పొందాడు. సృజనశక్తి కొందరికే పరిమితమైనప్పటికీ, ఆ కొందరే గతానికి సంబంధించిన అంధకారాన్ని ఛేదించి, జీవరహితంగా వున్న

1) 1401-1464 జర్మనీ గణిత శాస్త్రజ్ఞుడు, తత్వవేత్త, కార్డినల్
2) 1546-1601 డేనిష్ ఖగోళ శాస్త్రజ్ఞుడు.
3) 1564-1642 ఇటలీ ఖగోళ శాస్త్రజ్ఞుడు
4) 1571-1630 జర్మనీ ఖగోళ శాస్త్రజ్ఞుడు
5) 1585-1638 డచ్ రోమన్ కాథలిక్ మత శాస్త్రజ్ఞుడు
6) 1540-1603 ఇంగ్లండ్‌లో శాస్త్రజ్ఞుడు
7) 1548-1600 ఇటలీ తత్వవేత్త. 1600లో ఇతన్ని తన తత్వశాస్త్రం చెప్పినందుకు ఉరి తీసారు. కాథలిక్‌లు, ప్రొటెస్టంట్‌లు యిద్దరూ యితన్ని బహిష్కరించారు.

వర్తమానం నుంచి, ఆశలు రేకెత్తించే భవిష్యత్తులోకి పోడానికి కొత్తమార్గాలు వేశాడు.

ఐరోపా మానవాళి చరిత్రలో ఎదురు తిరిగిన దేవతల వైఫల్యంతో విశ్వాస యుగం అంతమైంది. మానవుడి తిరుగుబాటు సమర్ధనీయమని రుజువైంది. అదింకా అవసరమని సూచించింది. దేవుడా మనిషా తేల్చుకోవలసి వచ్చింది. మతాన్ని సంస్కరించడం జరిగే పనికాదు. ఆదిమ విశ్వాసంలోకి, నిరాడంబర పవిత్ర మతంలోకి పోవడం దుస్సాధ్యమైన ఆదర్శమని గందరగోళం చెందిన కొందరు వ్యక్తుల ప్రయత్నమని తేలింది. క్లిష్ట సమాజంపై అదుపు వుండాలంటే మతం సంస్థాగతం కావాలి. ఆదిమ మానవుడిని సంతృప్తి పరచిన సాధారణ విశ్వాసం ఆకర్షణ తరువాత వచ్చిన పిడివాదంలో సంస్థాగత మత సిద్ధాంతాలలో కానరావు. కనుక స్వార్థం నుంచి మానవుడిని మతం పైకి తీసుకుపోలేదు. నైచ్యం నుంచి మనిషిని తీసుకెళ్ళి, వూహించే దైవంతో తాదాత్మ్యం చేయించడం మతం వలన కాదు. మత గురువుకు బానిసగానూ, విధిలో నమ్మకస్తునిగానూ, దైవ నిరంకుశత్వాన్ని వదలేసిన గడ్డిపోచగానూ మతం మానవుడిని మార్చేసింది. గత్యంతరం, మానవుడు తిరుగుబాటు చేయడమే. దైవబంధాన్ని వదిలేయడమే. తన కాళ్ళపై నిలబడి, తన విధిని తన చేతులలోకి తీసుకోవడమే మానవుడు చేయాల్సింది.

పునర్వికాసం మానవుడి తిరుగుబాటుకు నాంది పలికింది. విశ్వజనీన క్రైస్తవ ధర్మాన్ని సంస్కరణవాదం హరించివేసింది. ప్రపంచంలో అధికారాన్ని గుత్తకు తీసుకోవాలని దైవప్రతినిధులు చేసిన ప్రయత్నం తుదకు ఓడిపోయింది. మానవుడు స్వేచ్ఛకై పోరాటం చేపట్టడానికి యిది ప్రోత్సాహకారి అయింది. పవిత్ర మత సామ్రాజ్యం జాతీయ రాజ్యాలుగా విచ్ఛిన్నమైంది. దానితోపాటే చారిత్రక ప్రాధాన్యత గల సమాంతరాభివృద్ధి జరిగింది. లౌకికధర్మాలు వచ్చి మతధర్మాల స్థానే చోటు చేసుకున్నవి. వాటిని మానవుడే తీర్చిదిద్దాడు. మతధర్మం విచ్ఛిన్నం గావడంతో, మతరహిత, అలౌకిక రహిత, నైతికవ్యవస్థ మానవాదర్శమైంది. తరువాత రెండు శతాబ్దాలలో యీ కొత్త ఆదర్శం కోసం మేధస్సును ఉపయోగించడం, సాంస్కృతికంగా సాధించడం, సామాజికంగా జైత్రయాత్ర జరపడం ప్రధానమై పోయింది.

✦ ✦ ✦

# ప్రకృతి నియమము

సంస్కరణోద్యమానంతరం మేధావులలో కనిపించిన ప్రతిష్టంభన వాస్తవం కాదు. లూథర్ హింసాధోరణి, కాల్విన్ మత దురభిమానం వలన, అప్పటి వరకు మత జ్ఞానార్జనను గౌరవప్రదంగా భావిస్తున్న సునిశిత మనస్సులలో జుగుప్స కలిగింది. 16వ శతాబ్దాంతంలో లలితకళలు, సాహిత్యరంగంలో పేర్కొనదగిన గ్రంథమేదీ లేదు. అయితే విజ్ఞానం ప్రశాంతంగా ముందుకు సాగుతూ, కొత్తయుగానికి దారితీసింది. ఆ శతాబ్దం ముగిసేలోగా, ఆలోచనారంగంలో విశ్వానికి సూర్యుడు కేంద్రమనే ఖగోళశాస్త్రం బాగా నిలదొక్కుకున్నది. కోపర్నికస్, టైకొబ్రాహె, కెప్లర్, గలీలియో యిత్యాది ఆధునిక విజ్ఞాన పితామహులందరూ 16వ శతాబ్దంలో వున్నవారే. 17వ శతాబ్దారంభంలో, లిప్పర్ షె అనే డచ్ పదార్థ శాస్త్రజ్ఞుడు తొలి దూరదర్శిని తయారుచేశాడు. ఈ కొత్త పరికరపు ప్రాధాన్యతను వెంటనే గ్రహించిన గలీలియో తానే స్వయంగా అంతకంటే ఉత్తమ పరికరాన్ని తయారుగావించాడు. అప్పటికది ఆదిమదశ పరికరమైనా, ఆకాశాన్ని తిలకించడానికి, సూర్యుడు విశ్వానికి కేంద్రమనే సిద్ధాంతానికి గట్టి ప్రాతిపదికలు నిర్మించడానికి తోడ్పడింది. తాత్వికంగా చూస్తే గలీలియో కనుగొన్న దానివలన చాలా కదలిక వచ్చింది. అరిస్టోటిల్ అధికారిక సంప్రదాయం కంపించిపోయింది. భూమి విశ్వానికి కేంద్రమనే టాలమీ సిద్ధాంతాన్ని సమర్థించిన అరిస్టోటిల్ తాత్త్విక ప్రతినిధి "సింప్లిషియో"(1)ను కేవలం మూర్ఖుడుగా భావించడానికి, గెలీలియో(2) విశ్వానికి సూర్యుడు కేంద్రమని క్రమబద్ధంగా వాదించడమే కారణం. ఇతను వ్రాసిన "ఎ డైలాగ్ ఆఫ్ ది సిస్టమ్స్ ఆఫ్ ది వరల్డ్" అనే గ్రంథం వలన వృద్ధ జ్ఞాని మరణించే వరకూ కారాగార ప్రాప్తి అయింది. ఆధునిక ఖగోళశాస్త్రాన్ని స్థాపించడమేగాక, ఉత్తరోత్తరా డేకార్ట్, న్యూటన్‌లు పెంపొందించిన పదార్థ విజ్ఞానానికి కూడా యితను పునాది వేశాడు.

భూగోళమంతా మెకలన్ చుట్టిరావడంతో అంతకుముందు అమెరికాను కనుగొనడానికి ప్రాధాన్యత యినుమడించడమేగాక, భూమి గుండ్రంగా వున్నదని అనుభవరీత్యా రుజువైంది. బైబిల్ కట్టుకథలకు ఇది మరొక చావుదెబ్బ. శతాబ్దాలుగా

1) గలీలియో వ్రాసిన గ్రంథంలో పాత్ర

2) 1564 లో పిసాలో జన్మించి 1642లో చనిపోయాడు.

విజ్ఞానానికి రాణిగా చలామణి అవుతూ ఆశ్చర్యమగ్నులను గావిస్తుండగా, కొత్త పరిశోధనలవలన పరిణామాలు వేరుగా వచ్చాయి. 15వ శతాబ్దారంభంలో గూటెన్‌బర్గ్(1) ముద్రణాయంత్రం కనుగొనడంతో విప్లవాత్మక మార్పులు సంభవించాయి. సాంకేతిక సంబంధమైన బాహ్యారిష్టాలు గడచిన అనంతరం, ఐరోపా అంతటా ముద్రణ వ్యాపించగా, విద్యార్జనకు అదొక సాధనమైంది. 16వ శతాబ్దం నాటికి, ఐరోపాలోని నాగరిక దేశాలన్నిటిల్లో భారీయెత్తున పుస్తకాల ముద్రణ పరిశ్రమగా రూపొందినది.

మతపరమైన ఆలోచనా సంప్రదాయాల నుండి మానవుడు విమోచన పొందడానికి, విశ్వమంతా యాంత్రికంగా నడుస్తున్నదనే సిద్ధాంతం ప్రాతిపదికలు వేసింది. స్వేచ్ఛాసందేశాన్ని మారుమూలలకు వ్యాపింపజేయడంలో ముద్రణాయంత్రం తోడ్పడింది. ఈ కొత్త ప్రవాహంలో, ఐరోపాలో నాడు చదువుకున్న వారంతా చిక్కుకున్నారు. ఫలితంగా మతపరమైన విశ్వంపై నమ్మకం చలించింది. ప్రకృతి నియమాధారంగా ప్రపంచాన్ని గమనించే కొత్త సాంస్కృతిక వాతావరణం ప్రబలింది.

ఈలోపుగా, మానవవాద విద్య వ్యాపిస్తున్నది. భావవిచ్ఛేదనతో కూడిన విజ్ఞానాన్ని స్వీకరిస్తూ అందలి విమోచన స్వభావానికి సంస్కృతీ పరులందరూ ఆకర్షితులైనారు. "ప్రాచీన కాలంలో మానవ గౌరవం ప్రధాన నైతిక సూత్రంగా వుండేది. మధ్యయుగాలలో పాపభావన ప్రబలింది. చదువు బాగా అభివృద్ధి చెందిన తరువాతగాని మానవుడిలో ధీరోదాత్తపాత్ర ఔన్నత్యం గురించి ఆలోచన రాలేదు. అప్పుడు ప్రప్రథమంగా, మతం మరుగునబడి, కొత్త ప్రమాణం, అభిరుచి బయటకు వచ్చాయి. ప్రజల ఉత్సాహం, కొత్తమార్గాలు అవలంబించింది. రాజకీయ స్వేచ్ఛ సాధించాలనే భావన మొదలై తీవ్రతరమైంది."(2)

కొత్త మనిషి కొత్త యుగానికి  స్వాగతం పలికాడు. దేవుడితో మానవుడి సంబంధం గురించి అతడు గందరగోళపడడం మానేశాడు. లౌకిక వ్యవహారాలే పట్టించుకున్నాడు. మతపరంగా గాక, మానవుడి ఉనికికి వివేచన, నీతి దృక్పథాలను ఆలోచించాడు. దైవం అనే కట్టుకథను పక్కను నెట్టేశాక, మానవుడి వ్యవహారాలకు లౌకిక అధిపత్యం కోసం అన్వేషించారు. శతాబ్దాల తరబడి, ఆలోచనాపరులు సైతం, దేవుడితో మానవుడి సంబంధం, ఆత్మ విమోచన, లౌకిక వ్యవహారాలలో దేవుడు జోక్యం చేసుకొని శాసనాలు చేయడం, యీ ధోరణిలోనే చూచారు. కొత్తయుగానికి బాటలు వేసినవారు, మానవ సంబంధాలను పొందికగా వుండేటట్లు లౌకిక విధానాలు

1) 1400-68 జర్మనీ ముద్రణకర్త.

2) డబ్ల్యు.ఇ.హెచ్. లెకీ ది రైజ్ ఆఫ్ రేషనలిజం ఇన్ యూరప్.

ఆలోచించారు. కాలాన్ని గురించి వారిలా భావించారు. "మానవుడి అభివృద్ధికి తోడ్పడే మానవాధికారాన్ని కనుగొనాలి. మానవుడి సంక్షేమం జరుగుతుందనుకున్న అనంతరం అతని గౌరవం అధికారం విస్తరించిన తరువాత, అతను ప్రపంచాన్ని అవగాహన చేసుకున్న దానినిబట్టి ఇదంతా జరుగుతుంటే, అతని ప్రయోజనార్థం భౌతికశక్తులను వాడే రీతులు చూడాలి."

రాజకీయాలను మత రహితం గావించడం కొత్తయుగంలో పేర్కొనదగిన అంశం. మతాధిపత్యం నుంచి రాజకీయ, ఆర్థిక సిద్ధాంతాలను వేరుచేశారు. ప్రపంచ వ్యవహారాల దృష్ట్యా రాజకీయాలను, మానవసంక్షేమం దృష్టిలో వుంచుకుని ఆర్థిక సిద్ధాంతాలను రూపొందించారు. రాజులు దైవాంశసంభూతులనే మధ్యయుగాల సిద్ధాంతాన్ని త్రోసిరజని రాజకీయాలను లౌకికం గావించారు. రాజకీయ పరిపాలనకు, సాంఘికవ్యవస్థకు ఆధారంగా ప్రకృతి నియమాలు, సామాజిక ఒడంబడిక తోడ్పడగా, యివే సెక్యులర్ అధికారానికి ప్రోత్సాహాన్ని యిచ్చినవి. 16వ శతాబ్దంలో రోమన్ మత విశ్వజనీనత విచ్ఛిన్నమైంది. పవిత్ర మత సామ్రాజ్యం వెన్వెంటనే అదృశ్యమైంది. ప్రపంచ క్రైస్తవ వ్యవస్థకు ఒకవైపు పోప్, మరొకపక్క చక్రవర్తి ద్వందాధిపత్యం వహించడం షార్లెమన్ కాలం నుంచీ వస్తున్నది. పరస్పర అధిపత్యం కోసం ఆరువందల ఏళ్ళు పెనుగులాడిన అనంతరం, ఈ రెండు శక్తులూ ఛాయా మాతృకలైనవి. ఇంగ్లండ్, ఫ్రాన్స్ క్రమంగా ఇతర దేశాలలో జాతీయ ప్రభుత్వాలు ఏర్పడడంతో చక్రవర్తి దర్పం అణగిపోయింది. విశ్వవ్యాప్తంగా అధికారం చలాయించాలనే రోమన్ కాథలిక్ మతం సంస్కరణోద్యమంతో చల్లబడింది. పవిత్ర సామ్రాజ్యానికి లాంఛనప్రాయంగా వుండే స్థాయి గూడా పోయింది. క్రైస్తవ మతరాజ్యం ఆ విధంగా అంతమైంది. విశ్వాసం స్థానే విజ్ఞానం వచ్చే కొత్త పద్ధతి ఏర్పడాలి. రాజకీయ సమాజాలు, పౌరులు, లౌకికంగా తమ వ్యవహారాలు చక్కబెట్టుకునే మానవ నియమాలు రావాలి.

ఐరోపాలో అప్పటి పురోహితులు, మతగురువులు, పోప్‌లు, యువరాజులు పెత్తనం వహించారు. వారిస్థానే సందేహవాదులు, విమర్శకులు, పచ్చినాస్తికులు, భౌతికవాదులు, బాధ్యత నెత్తిన వేసుకున్నారు. వీరే కొత్త నమూనా మనుషులు. బోడిన్, మాంటేన్, డేకార్ట్, బేలి, గసెండి, హాబ్స్, బేకన్ వంటి వారెందరో యీ కోవకు చెందారు. 16వ శతాబ్దంలో పైకి కనిపించిన మేధారంగంలోని ప్రతిష్ఠంభన స్థానే చింతనారంగ, ప్రవాహ హోరుతో వచ్చి పడింది. మధ్యయుగాల చింతనా, సాంస్కృతిక రంగమంతా ముగ్గురు వ్యక్తులు, మూడు విధానాలైన దెబ్బలకు చితికిపోయింది. మోంటాన్ తన సందేహవాదంతో పరిసర సంస్థలను పరిశీలించాడు.

ప్రపంచంలో సునిశిత మనస్కులు చెప్పిన అభిప్రాయాలను సాంప్రదాయ దృష్టి నుంచి చూచాడు. కేవలం కాలానుగుణంగా వస్తున్న వాటిని, వెర్రి అభిమానంతో స్వీకరించలేదు. సామాన్యుడి వివేచనను ఆకర్షించిన మోంటాన్ విమర్శ కూడా తీవ్రమైన దెబ్బతీసింది. మతజ్ఞానాన్ని కూకటివేళ్ళ దగ్గర నరికేశాడు దేకార్ట్(1). శతాబ్దాల తరబడి ఎందరో వ్యక్తులను స్థబ్ధులను గావించిన మతజ్ఞానం కాస్తా అట్లా దెబ్బతిన్నది. స్వయంగా అనుభవ సత్యంతో నిర్ణయానికి వస్తే తప్ప మిగిలిన గౌరవప్రదమైన సిద్ధాంతాలన్నిటినీ సందేహించమని దేకార్ట్ చెప్పాడు. మానవవాదానికి చక్కని తాత్విక ప్రాతిపదికను దేకార్ట్ చూపాడు. ఒక పండితుడి సందేహవాదం వలె వుంటుంది బాల్(2) పద్ధతి. వోల్తేర్ వలె యితడూ తన రచనల ప్రభావాన్ని కనబరచినా, తరచు హుందాగానే మనుషులపై అపనమ్మకాన్ని వ్యక్త పరచేవాడు. సందేహవాది అయిన బాల్ ఆధునిక విమర్శకు పునాదులు వేశాడు. ప్రాచీన విధానాలను పరిశీలించి వాటి తార్కిక దోషాలను, అసంభవాలను బట్టబయలు చేస్తూండేవాడు. వాదనా పటిమలో చావుదెబ్బ కొట్టే విధానమతనిది. ఈ మూడు విధానాలైన దెబ్బలు తగలకముందే, మధ్యయుగాల పద్ధతులు పతనావస్థలో వున్నవి. అంధవిశ్వాసం వలన మతపరమైన ఆలోచన చిన్నాభిన్నమైంది. మార్మికమైన మతజ్ఞానం, అపసవ్య ప్రేమవలన వివేచన సిగ్గుతో కుంగిపోయింది. సాంస్కృతిక కృత్రిమత్వం, విద్యలో పసలేకపోవడంతో ప్రాచీన చదువు ఎందుకూ కొరగానిదై పోయింది. స్వేచ్ఛా వాయువులను పీల్చే మేధావులకు వైజ్ఞానిక రంగం స్పష్టంగా వున్నది. కొత్త నియమాలు రూపొందించే అవకాశం లభించింది. నూతన రాజకీయ సిద్ధాంతాలకు సమయం ఆసన్నమైంది. సాంఘిక పరిణామానికి కొత్త ఆదర్శాలు కనిపించసాగాయి. కొత్త సాంస్కృతిక నమూనాలు రావడానికి అవకాశం లభించింది. మతమనే మహమ్మారికి, ప్రపంచానికి ప్రయోజనం వుందనే వాదానికి మానవుడు ఎదురు తిరిగాడు. ఇదంతా బాలారిష్టపు వివేచన వలన జనించింది. విజ్ఞానాన్ని పునరుద్ధరించే అవకాశం వచ్చింది. అనంతశక్తులతో ఆధునిక నాగరికత విప్పారుతున్నది. మంచిచెడుల మేలి కలయిక రానున్న శతాబ్దాలలో పడుగు పేకలవలె మేళవించనున్నవి.

1625లో ది లా ఆఫ్ వార్ అండ్ పీస్ అనే గ్రంథాన్ని గ్రోషెస్(3) ప్రచురించాడు. ఐరోపాలో ఆధునిక రాజకీయ విధానానికి అదే ఆరంభం అని భావించాడు. మధ్య యుగాంతంలో ఐరోపా చిన్నాభిన్నంగా వున్నది. అందరూ అందరిపైనా యుద్ధం

---

1) 1596-1650 ఫ్రెంచి తత్వవేత్త. గణిత శాస్త్రజ్ఞుడు.

2) పెర్రిబాల్ 1647-1706 ఫ్రెంచి విమర్శకుడు, తత్వవేత్త

3) డచ్ న్యాయమూర్తి, రాజనీతిజ్ఞుడు 1583-1645.

గావించిన పరిస్థితి అది. షార్లెమన్ స్థాపించిన సైనిక-మత వ్యవస్థ అంతర్గత కారణాలు పురస్కరించుకొని విచ్ఛిన్నమైంది. తరువాత హింస మినహా ఎవరి పెత్తనమూ లేదు. ఛాందసం సనాతనత్వం రాజ్యం చేశాయంతే. మానసిక స్వేచ్ఛ, వ్యక్తి నిర్ణయ హక్కు వుండాలనే వారివలన మత ప్రభుత్వాల శాసనాల పెత్తనం పోయింది. సాహసించిన వారంతా చక్రవర్తి శాసనాలను అధిగమించారు. మధ్యకాలపు పతనావస్థ నుండి బయటపడిన పునర్వికాసపు ఐరోపాకు వివేచనాత్మకమైన, మతేతరమైన, నైతికనియమం అవసరమైంది. ఆ అవసరాన్ని గ్రోషెస్ తీర్చాడు. ప్రకృతి నియమంలో తగిన ప్రమాణం లభించింది. ప్రొటెస్టంట్‌లకూ, కాథలిక్కులకూ సమంగా యీ నియమం నచ్చింది. ప్రకృతి నియమాన్ని "దైవం బయటపెట్టని నియమం"గా కాథలిక్కులు స్వీకరించారు. థామస్ అక్వినాస్ యిందుకు వారికి ప్రమాణమైనాడు. ఈ ప్రమాణాన్ని ప్రొటెస్టంటులు అంగీకరించలేదు. కాని రోమన్ న్యాయమూర్తుల ప్రత్యక్షవాదాన్ని వీరు గౌరవించారు. గ్రోషెస్ గ్రంథం "ఐరోపా మన్నన లందుకున్నది"(1) "నైతిక, న్యాయ విషయాలకు పునాదులు వేసిన గ్రంథాన్ని విజ్ఞులంతా ఉచితరీతిని ఆదరించారు. సామాన్యులు దీనిని అసంభవంగా భావించలేదు."(2) పాండిత్యవిద్యలో మానవవాది గ్రోషెస్, మత సంబంధమైన తాత్విక న్యాయమూర్తులు, సిసిరో వలన ప్రేరణ పొందిన పునర్వికాస న్యాయవాదులు శ్లాఘించే విధంగా అతను న్యాయశాస్త్రాన్ని రూపొందించ గలిగాడు.

మధ్యయుగాలలో న్యాయ శాస్త్రానికి దైవమూలం వుండాలనేవారు. 16వ శతాబ్దాంతంలో వ్యక్తిత్వానికి యిచ్చిన ప్రాధాన్యత వలన చట్టం గురించి చాలా మార్పు వచ్చింది. మానవుడికి స్వతంత్ర ప్రతిపత్తి, గౌరవం వుండాలనడంలో చాలా పరిణామాలు వచ్చాయి. "ఈ ప్రతిపాదన నుంచి చాలా నిర్ణయాలు రాబట్టారు. వ్యక్తి చేసే పనులు, అతని అంగీకరించే విధులు చేర్చవలసి వచ్చింది. వివేచన ప్రకృతి సహజమని- అంటే దైవికమని -ఒప్పుకున్నారు. మానవుడు ఏర్పరచిన చట్టబద్ధ సంస్థలకు యిది ప్రాతిపదిక అయింది. నీతి సూత్రాలతో దీనికి సూటిగా సంబంధం ఏర్పడింది. తుదకు మానవాళికంతటికీ ఒకే వ్యవస్థను, సమాజాన్ని రూపొందించే ఆదర్శమైంది."

గణనీయమైన యీ మార్పు వలన, దైవాధికారం నుంచి ప్రకృతి నియమానికి విమోచన లభించింది. మానవుడి వివేచనను ప్రస్తావించ వలసి వచ్చింది. ఈ కొత్త ప్రకృతి నియమాన్ని గ్రోషెస్ పెంపొందించాడు. అతనిట్లా నిర్వచించాడు. "ప్రకృతి

---

1) హెన్రీమైన్, ఏన్షెంట్ లాస్

2) కేంబ్రిడ్జ్ మోడ్రన్ హిస్టరీ

నియమం సరైన వివేచన. వివేచనా స్వభావంతో ఏ చర్య అయినా పొందికగా వుంటుందా వుండదా అని నిర్ధారిస్తారు. ఇందులో నైతిక నైచ్యంగాని నైతిక ఆవశ్యకత గాని ఉంటుంది. ఫలితంగా, ప్రకృతి కర్త అయిన దేవుడు యీ నియమాన్ని నిషేధించడు. ఆనందించడు." సారాంశమేమంటే, గతానుభవం దృష్ట్యా, అందలి ప్రత్యక్షాంశాలను స్వీకరించి, సరికొత్త పరిస్థితికి తగినట్లుగా, నెదర్‌లాండ్స్‌కు చెందిన అడ్వొకేట్ జనరల్ (గ్రోషెస్) నియమావళి రూపొందించాడు. గ్రోషెస్ ప్రొటెస్టంట్. ఎరాస్మస్‌కు సహచరుడు. సంస్కరణ వాదోద్యమంలో ఇతనూ మొఖం మొత్తినవాడే. "అంతా చూస్తే సంస్కరణవాదం మంచి కంటె హాని ఎక్కువ చేసిందన్నాడు." అనుభవం వలన మతసంస్థను సంస్కరించడం సాధ్యపడదని తేలింది. అభ్యుదయ భావాలు, ఉద్యమాలు మతపరమైన ఆలోచనను అధిగమించవలసిందే. "అభిప్రాయ భేదాన్ని చూపిన వారిపట్ల రోమ్ పగసాధించిన తీరుకూ, సర్వెటస్‌ను పట్టి తగలబెట్టించిన కాల్విన్‌కు తేడా ఏమిటి? ఈ విషయం తెలిసినప్పుడు ఐరోపాలో దిగ్భ్రాంతి చెందని పవిత్రుడు, ఆలోచనాపరుడు లేడు."

గ్రోషెస్ పునర్వికాస కర్త. ఐరోపాలో మేధావుల ప్రతిష్టంభన ఏర్పడినప్పుడు, ఇతడు మానవతా ధోరణిని, విద్యను వ్యాపింపజేశాడు. అదే సమయంలో సంస్కరణ వాదంలోని ప్రత్యాక్షాంశాలకు కూడా ప్రాతినిధ్యం వహించాడు. పెత్తందారీతనంపై తిరుగుబాటు, వ్యక్తిగతంగా పరిశీలన, నిర్ణయం యిందులో ప్రధానాంశాలు, కేథలిక్కుల విశ్వజనీనతలో వ్యక్తి ఆధ్యాత్మిక బానిసత్వంలో మ్రగ్గవలసిందే. సంస్థాగతమైన ఏకరూప నిర్మాణాన్ని విచ్ఛిన్నం చేసేటంతవరకూ సంస్కరణవాదం వ్యక్తి స్వేచ్ఛకు తోడ్పడింది. కాని ప్రత్యామ్నాయంగా మరొక నియంతృత్వాన్ని యిది తెచ్చిపెట్టింది. అయితే ఒక పర్యాయం మత ప్రభావాన్ని ఛేదించిన తర్వాత, మళ్ళీ అది స్థాపించడం దుర్లభం. విమర్శనాస్వేచ్ఛ, మనస్సుననుసరించి పోవడం అంగీకరించని అనేక భిన్నధోరణులపై ప్రొటెస్టిజం విజయం సాధించింది. బలవంతంగా ఐక్యంగావడం అదృశ్యమయ్యేసరికి స్వేచ్ఛ పెంపొందింది. సంస్కరణవాదంలో సత్ఫలితం అదే. గ్రోషెస్ యీ సంప్రదాయాన్ని మెచ్చుకున్న మానవవాది.

మానవుడి స్వేచ్ఛాపోరాట చరిత్రలో ప్రకృతి నియమ భావన ఒక మలుపు. అలౌకికం వూహాజనితం. అందువలన అది అవగాహన కాదు. అధిగమించలేదు కూడా. అటువంటి అలోకికంలో విశ్వాసం నుంచి మానవుడిని విమోచన గావించడం విశేషం. ప్రకృతి నియమం యీ లోకానికి సంబంధించినది. కనుక అవెలా ప్రవర్తిస్తున్నదీ అర్థం చేసుకొని, దానితో పొందికగా మానవుడు వుండగలడు. ప్రకృతి నియమం ప్రాపంచిక అనుభవరీత్యా రాబట్టినది. అందులో మార్మికంలేదు. ప్రకృతిలో క్రమం

అనేది మానవుడి అనుభవంలోని విషయం. మానవుడిలో గల వివేచన ఫలితంగా ప్రకృతి నియమభావన వచ్చింది. మతం కూడా అలా వచ్చినదే. మానవుడి మేధస్సు పెంపొందుతుంటే అది భిన్నరూపాలలో కనిపించింది. అది మానవ సంపద. ఆ విధంగా విస్తరిస్తున్న విజ్ఞాన సహాయంతో, ఆధునిక నాగరికతలో ఆదర్శాలలోకి ప్రవేశించింది.

ప్రాచీన గ్రీసులో సహజ చింతనాపరులు, విజ్ఞానానికి తత్వానికి పితామహులైన వారితో జనించిన ప్రకృతి నియమభావన , ఆధునిక నాగరికతా యుగంలో మేధావుల జీవితాలకు ఆదర్శప్రాయమైంది. సహజ సంఘటనలకు, తాత్త్విక చింతనకు తొలుత ఆలోచన రేకెత్తించిన విజ్ఞానం పునరిద్ధరించడంలో ప్రకృతి నియమం కూడా పునరుద్ధరించడమైంది. గ్రీక్ పురాణ గాథలలో, యితిహాసాలలో దేవుళ్ళకంటె విధికి ఎక్కువ ప్రాధాన్యత వున్నది. దేవుళ్ళు సైతం విధికి లొంగి వుండవలసిందే. విధిగాని, దేవుళ్ళుగాని అలౌకిక శక్తులుకాదు. ప్రకృతే పరమసత్యం. దానిని మించి యింకేదీ లేదు. ప్రకృతి నియమాలననుసరించే దేవుళ్ళు నడచుకోవాలి. "గ్రీక్ చింతనలో విధి ప్రభావం చాలా వున్నది. బహుశ దీనినుండే ప్రేరణ పొంది విజ్ఞానం కూడా ప్రకృతి నియమంలో విశ్వాసాన్ని వెల్లడించింది."

నియతి వాదానికి ఆదిమ రూపమే విధి భావన. ప్రకృతిలో గందరగోళంతో ఘర్షణ పడే సంఘటనలు లేవు. నిరంకుశ దైవశక్తులు ప్రకృతిని అదుపులో పెట్టడం లేదు. ప్రకృతి నియమబద్ధ విధానం, థేల్స్, అనాగ్జిమాండర్, హెరాక్లిటస్ మొదలైన సహజచింతనాపరులు ప్రతీదీ ఒక మూలపదార్థం నుంచి వచ్చాయని తలచారు. అది శాశ్వతం, అనంతం అన్నారు. ఈ మూలపదార్థాన్ని థేల్స్ నీళ్ళుగా భావిస్తే, నిప్పుగా హెరాక్లిటస్ తలపోశాడు. కాని మూలపదార్థం భిన్న పదార్థాలుగా, పరస్పరం మార్పిడి చెందేవిగా పరిణమిస్తూ, తుదకు మూలానికి పోతాయన్నారు. ప్రకృతి నియమం వలన ఈ విధమైన ఉనికి, మార్పు జరుగుతుందన్నారు. ఇదే ప్రాచీన గ్రీక్ చింతనలో"న్యాయం"గా పేర్కొన్నారు. ఉనికిలోని భిన్నరంగాలలో తులనాత్మకతను అట్టిపెట్టడం న్యాయం. ప్రకృతి నియమంతో పొందికగా వుండడమే న్యాయంగా వుండడం, న్యాయాన్ని ధర్మంతో కూడా కలిపేశారు. పదార్థవిజ్ఞానం నుంచి నీతిశాస్త్రాన్ని రాబట్టారు. మానవుడు ప్రకృతిలో భాగం గావడమే యిందుకు కారణం.

ఈ ఆసక్తికరమైన తాత్విక భావాన్ని తరువాత ఎపిక్యూరస్ విస్తరించాడు. నేటి తత్వం కూడా యింకా పూర్తిగా యీ విషయాన్ని గ్రహించవలసి వుంది. పదార్థ నియతివాదంలో విశ్వాసం ప్రకృతి నియమ భావనలో కనిపిస్తుంది. ప్రకృతిలో వివేచన అంటే యిదే. నైతిక మూలసూత్రం కూడా యిదే. "కాని యీ శక్తి వ్యక్తిగతం

కాదు. అనంతదైవం కాదు." ఎపిక్యూరియనులేగాక, అరిస్టోటల్, స్టాయిన్‌లు కూడా ప్రకృతి నియమ భావనలోని తాత్వికభావాన్ని పెంపొందించారు.

ప్రకృతి నియమభావన న్యాయసమ్మతమైనదిగా పరిగణించిన అరిస్టోటిల్, రాజ్యానికి యిది అవశ్యమన్నాడు. అయితే 'సంప్రదాయ న్యాయానికి' 'ప్రకృతి న్యాయానికి' తేడాను చూపాడు. వివేచన, అనుకూల్యత ఆధారంగా వుండే సంప్రదాయ న్యాయం కొన్ని సూత్రాలను రూపొందిస్తుంది. ప్రకృతి న్యాయం మన అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా, అన్ని పరిస్థితులలోనూ నాగరిక జీవితానికి ఆదర్శప్రాయంగా ఉంటుంది. ప్రకృతి నియమభావన ప్రకారం ఒక పథకం వున్నట్లు అరిస్టోటిల్ తాత్వికంగా భావించాడు. మానవుడు చేసే నియమాలు, అతని ప్రవర్తన యీ వివేచనాత్మక పథకంతో సరిపోవాలంటాడు. జీవితంలో న్యాయం, ధర్మం ఆ విధంగా సాధించవచ్చు.

స్టాయిక్‌లు ప్రకృతి నియమభావాన్ని నైతిక విధానంగా రూపొందించారు. వివేచన నుండి నీతిని రాబట్టి, ప్రకృతి నియమంలో దీనికి మూలం చూచారు. "ప్రతి జీవికి దాని స్వభావం వున్నది. దాని చర్యలు వున్నవి. పౌరుడుగా వుండవలసిన మానవుడికి ప్రకృతి నియమాలనేవి మానవ స్వభావంలోనే యిమిడి వున్నవి. అతని వివేచనాత్మక, సామాజిక గుణానికి తగినట్లుగా అతని ప్రవర్తన నిర్ధారితమౌతుంది." అంటారు స్టాయిక్‌లు. మానవులంతా స్వేచ్ఛాయుతులు, సమానులని స్టాయిక్‌లన్నారు. ప్రకృతి నియమం అన్నిటికంటె ప్రాధాన్యత గలది, శాశ్వతమైనది. మానవాధికారాలకు సంబంధించిన వాటన్నిటికీ యిది ప్రాతిపదిక. సర్వాంతర్యామి అయిన వివేచనకు మతం లొంగి వుంటుంది. సిసిరో కాలం నుంచి రోమన్ న్యాయమూర్తులు ప్రకృతి నియమాన్ని గురించి స్టాయిక్‌లు చెప్పినదాని ఆధారంగానే తమ సిద్ధాంతాలు ప్రవచించారు."సహజమైన రాజ్యం" అనే స్టాయిక్‌ల ఆదర్శానికి చేరువగా రోమన్ రిపబ్లిక్ వున్నట్లు సిసిరో ప్రకటించాడు. రిపబ్లిక్ నియమాలన్నీ ప్రకృతి నియమాలతో పొందికగా వున్నవి.

ప్రకృతి నియమ భావన తాత్విక కల్పన కాదు. శాసనాలకు అది భౌతిక ఆధారం సమకూర్చిన ప్రకృతి నియమం నుంచి, నైతిక అధికారాన్ని రాజ్యం రాబట్టగలుగుతోంది. మధ్యయుగాలలో రాజకీయ సిద్ధాంతాలు ఏర్పరచడంలో యిక్కడే ప్రకృతి నియమం దారి మళ్ళించింది. గ్రీకుల ఆలోచనను సవరించిన రోమన్ న్యాయమూర్తులు వ్యవస్థాపిత సాంఘిక రాజకీయ విధానానికి అనుకూలంగా వుండడానికి ఉద్దేశించారు. సమానత, స్వేచ్ఛ, ప్రకృతి నియమంలో ముఖ్యం అని స్టాయిక్‌లన్నారు. రోమన్ న్యాయవాదులు సమానత తొలగించి ప్రకృతి నియమంలో

అందరూ స్వేచ్ఛాపరులన్నారు. మధ్యయుగాలలో యీ రెండు గౌరవ సూత్రాలు అందరికీ తెలుసు. ప్రకృతి నియమంలోని సమానత్వం, స్వేచ్ఛ సిద్ధాంతాల ప్రేరణతో మత వ్యతిరేక ఉద్యమాలు వచ్చాయి. ఆదిమ క్రైస్తవ మతాచార్యులు కూడా యీ సిద్ధాంతాలను ఆమోదించారు. ఉదాహరణకు రోమన్ న్యాయవాదుల నిర్వచనానికి భిన్నంగా, గ్రీకుల భాష్యాన్ని ఆంబ్రోజ్(1) రుషి సమర్ధించాడు. "ప్రకృతిలో ప్రైవేట్ ఆస్తి ఒక సంస్థగా లేదు. అందరి ఆస్తే ప్రకృతిలో ఉన్నది. దోపిడి, పేరాశ వలన ప్రైవేట్ ఆస్తి నియమాలు వచ్చాయి" అన్నాడతడు. కొన్ని శతాబ్దాల క్రితం సిసిరో చాటిన దానికి యిది ప్రతిధ్వని. "జాతులు, రాజులు, చట్టాలు చెయ్యవచ్చు. మూలనియమం నుంచి రాబట్టక పోతే యీ చట్టాలకు సరైన స్వభావం లేనట్టే. రాజ్యాల స్థాపనకు ముందే సహజ నియమం ఉంది. ప్రకృతిలో ప్రైవేట్ ఆస్తిలేదు."(2) "సరైన వివేచనతో సరిపడే నియమం వుంది. అది ప్రకృతితో పొందికగా వుంటుంది. అది శాశ్వతం. ఎదుర్కొనడానికి వీల్లేనిది. దైవాధికారం యిందులో వ్యక్తమౌ తుంటుంది."(3)

వాస్తవానికి, రోమన్ సామ్రాజ్యంలో ప్రత్యక్ష నియమాలు రూపొందించేవరకూ, క్రైస్తవమత జ్ఞానమంతా ప్రకృతి నియమ సిద్ధాంతంపైనే ఆధారపడింది. తొలుత స్వర్ణయుగం వున్నది. (స్వాభావిక స్థితి) నైతిక సంక్షోభం వలన మానవుడు పతనం చెందగా, వేయి సంవత్సరాలపాటు పాపపంకిలంతో, కన్నీటిమయంగా అది కొనసాగింది. తరువాత పశ్చాత్తాపం వస్తుంది. ప్రకృతి నియమం వివేచనగా పనిచేసి, నైతిక సంక్షోభాన్ని అధిగమించడంలో మానవుడికి తోడ్పడి, కరుణను ప్రసాదిస్తుంది. వివేచన మానవుడిలో దోషాలను అరికడుతుంది. కాలానుగుణంగా, ఆరవ శతాబ్దంలో సెవెల్‌కు చెందిన ఇజిడోర్ రుషి (4) రూపొందించిన మత నియమాలు అధికృత వహించాయి. ఈ నియమాలకు కూడా ప్రకృతి నియమాల ఆధారం వున్నదన్నారు. రోమన్ మతరాజ్యంలో వీటిని దైవం "బహిర్గతపరచని" నియమాలుగా గుర్తించారు. తుదకు రోమన్ చట్టం ప్రత్యక్ష నియమంగా వచ్చి, జీవన పరిస్థితులను సమర్ధించింది. బైబిల్‌లో మానవుడికి వచ్చే ముక్తికీ యీ పరిస్థితులకూ పొత్తులేదు.

సంపన్నుల నుండి పేదలను, బలశాలుర నుండి బడుగు వారిని కాపాడడానికి ప్రత్యక్ష నియమం ఉద్దేశించారు. ప్రైవేట్ ఆస్తిని చట్టబద్ధం చేశారు. అయితే పేదలకు, బలహీనులకు రక్షణ చూపారు. అందరిపైనా అందరూ యుద్ధం చేయడాన్ని ఆపాలని

1) 340–397 మిలన్ బిషప్

2) సిసిరో, ద రిపబ్లిక్

3) పై గ్రంథంలో

4) 570–636 స్పెయిన్‌లో విజ్ఞాన సర్వస్వం వెలువరించిన చరిత్రకారుడు, ఆర్చ్‌బిషప్

తలపెట్టారు. శ్రమఫలితాన్ని దోపిడి నుంచి అరికట్టాలని భావించారు. రోమన్ న్యాయవేత్తలననుసరించి అందరి సౌకర్యార్థం రాజ్యం వున్నది. అత్యవసర వస్తువులు అందరికీ లేనంతకాలం ఎవరూ విలాసాలకు పోరాదని స్పష్టపరచారు. మానవుడు రూపొందించిన యీ చట్టం ప్రకృతి నియమానికి అనుగుణంగా వున్నది. తొలి గ్రీక్ తత్వవేత్తలు "న్యాయం" పేరిట పేర్కొన్న ప్రకృతి నియయమాలు, తరువాత స్టాయిక్‌లు స్వేచ్ఛసమానతలతో పేర్కొన్నవి యీ నియమాలే. న్యాయం, సమానత్వం వలన రోమన్ చట్టాన్ని ఐరోపా సాంస్కృతిక సంపదలో ప్రధానాంశంగా స్వీకరించారు. ఆధునిక రాజకీయ సిద్ధాంత కర్తలకు యిదే తుదకు చక్కని ప్రాతిపదిక సమకూర్చిపెట్టింది.

రోమన్ సామ్రాజ్యానికి క్రైస్తవ మతం అధికారిక మతంగా మారేసరికి ప్రాచీన నాగరికత పతనం వలన ఏర్పడిన గందరగోళం స్థానే ఒక క్రమత్వాన్ని స్థాపించినప్పటికీ, మతగురువులు బైబిల్ పేర్కొన్న విమోచనను విస్మరించారు. విధి నిర్ణయానుసారం ప్రపంచం అంతంగాకపోగా, ప్రపంచం చిరకాలం కొనసాగే లక్షణాలు కనిపించాయి. ఫలితంగా, గందరగోళ పరిస్థితుల వలన వచ్చిన నిరాశావాదం బదులు, మార్గాంతరాలు అన్వేషించవలసి వచ్చింది. ప్రకృతి నియమానికి ప్రత్యక్ష నియమానికీ రాజీ అవసరమైంది. ఆంబ్రోజ్ తన భావాలను యిలా వెల్లడించారు. "ప్రైవేట్ ఆస్తి చెడ్డదని భావించరాదు. ప్రకృతి నియమానుసారం సంపన్నులు పేదలను పోషించాలి. తొలుత అందరి ఆస్తి అయిన సంపద నుంచి కొంత పేదలకు ఇవ్వాలి." అగస్టిన్ సైతం యీ ప్రత్యక్ష నియమాన్ని సమర్థిస్తూ మనేకీసుల (1) విమర్శను ఎదుర్కొనవలసి వచ్చింది. "ప్రైవేట్ ఆస్తి దానంతటకది దోషపూరితం కాదు. కాని సంపన్నతకోసం అర్రులు చాచడంలో చెడువున్నది. సత్యం, న్యాయం, వివేచన, విశ్వాసం, దైవంలో మానవునిలో ప్రేమ లేకుండా ఆస్తిని సమకూర్చడం, ఆదర్శ ధర్మాల కంటె ఆస్తికి ఎక్కువ విలువ యివ్వడం కూడదు.(1) ప్రకృతి నియమాధారంగా ప్రత్యక్ష నియమాన్ని సమర్థించడంలోని చారిత్రక ప్రాధాన్యత- "దైవం బహిర్గతం చేయని నియమం"లో విశిష్టత, 15 వందల సంవత్సరాల అనంతరం, ఆధునిక కమ్యూనిస్టు ప్రవక్త బయలుదేరి, పసలేని తత్వం అంటూ గ్రంథం వ్రాసి,"ప్రైవేటు ఆస్తి చౌర్యం"(2) అనే సిద్ధాంతాన్ని నిరాకరించి నప్పుడు గాని బయటపడలేదు.

---

1) అన్నీ వెలుగునీడల కలయిక అంటూ, క్రైస్తవ, బౌద్ధ, జోరాష్ట్రియన్ యిత్యాది మతాల సిద్ధాంతాలను కలగలుపుగా పేర్కొనే మనేకీస్ విధానం.

2) సెయింట్ అగస్టిన్, సిటీ ఆఫ్ గాడ్

ప్రకృతి నియమం, మత నియమం, ప్రత్యక్షనియమం, మధ్య సంబంధం గురించి సందేహం 13వ శతాబ్దం వరకూ పండితులను గందరగోళపరచింది. ఇసిడోర్‌లోని పరస్పర విరుద్ధాలన్నిటినీ గ్రేషిన్ స్పష్టపరచే వరకూ యిదే పరిస్థితి వున్నది. గ్రీకుల భాష్యాన్ని రోమన్ న్యాయవేత్తల వ్యాఖ్యానాన్ని కలిపేసి, ప్రకృతి నియమానికి తప్పుత్రోవ పట్టించే అర్థాన్ని ఇసిడోర్ యివ్వడంతో యీ చిక్కు వచ్చింది. నేటి మార్క్సిస్టు దృక్పథాన్ని గ్రేషెన్ చేపట్టాడు. చారిత్రకవాదంలో గతి తార్కికతను హెగెల్ తన శిష్యుడికి అందించడానికి శతాబ్దాల పూర్వమే యిది జరిగింది. "ప్రైవేట్ ఆస్తి పాపభరితమని, అయితే అది అవసరమని కనుక, అవసరమైన మేరకు యాజమాన్యాన్ని అదుపులో పెట్టాలని'' మధ్యయుగాల గతి తార్కికుడు అభిప్రాయపడినాడు. హెగెల్ ప్రత్యక్షవాదం కంటె యిది మెరుగు. మనకాలంలో హెగెల్‌వాదం విప్లవాత్మక సాంఘికత్వంపై అధిపత్యం వహిస్తున్నదిగదా. హెగెల్ సూత్రం ప్రకారం–మార్క్సిజం చేపట్టిన మేరకు– న్యాయ ప్రయోగంలో మూడవదశ– "కనుక, ప్రైవేట్ ఆస్తి మంచిదే" అని వుండాలి. ఏది అవసరమో అది న్యాయసమ్మతం. గనుక మంచిది కూడా.

రోమన్ సామ్రాజ్యపు విపర్యాలకు తట్టుకొని ప్రకృతి నియమ భావన నిలబడింది. ఈలోగా, ఆదిమ క్రైస్తవ గురువుల గ్రీక్ ధోరణి స్థానే క్రైస్తవ మతజ్ఞానం చోటు చేసుకున్నది. ఎట్లాంటి అధికారిక మద్దతు లేకుండా వివేచనకు విజ్ఞప్తి చేస్తే సరిపెట్టుకునే రోజులు పోయాయి. అయితే, అరిస్టోటిల్ అధ్యయనం పాండిత్యవిద్యలో ప్రధానబాగమైంది. తత్త్వవేత్త ప్రమాణంతో బాటు, సిసిరో వలన ప్రకృతి నియమానికి ప్రాధాన్యత హెచ్చింది. కనుక, క్రైస్తవ విశ్వాసంలో దీనిని యిమడ్చవలసి వచ్చింది. గ్రేషెస్ మత గురువు. కాని ధర్మాధర్మ విచారకుని కంటె ప్రామాణికుడు. ప్రకృతి నియమం "సాక్షాత్కరించని దైవనియమం"గా థామస్ అక్వినాస్ ప్రకటించాడు. కనుక మిగిలిన నియమాలన్నిటికంటె అధిక్యత గలది, మారనిది, వివేచనావాది ఓకం(1) కూడా దీనికి ఆమోదముద్ర వేయడంతో, ప్రకృతి నియమానికి థామస్ నిర్వచనం మధ్యయుగాల ఆలోచనలో ప్రధానమై, ఉత్తరోత్తరా ఆధునిక రాజకీయ సిద్ధాంత కర్తలకు సూచనప్రాయమైంది. వాస్తవానికి, తిరుగుబాటుకు పవిత్రహక్కు థామస్ అక్వినాస్ పేర్కొన్న దానిలోనే వున్నది. "అక్రమ పరులు, దోపిడీదారులైన పాలకులకు విధేయులుగా ప్రజలు ఉండనక్కరలేదని"(2) అతను స్పష్టంగా చెప్పాడు.

1) 1349లో మరణించాడంటారు. ఇంగ్లీషు తత్వవేత్త.

2) సెయింట్ థామస్ అక్వినాస్, సమ్మా థియాలాజి.

గ్రోషెస్ తన న్యా విధానానికి కొత్త రాజకీయ విధానానికి ప్రాతిపదికగా, ప్రాచీన మధ్యయుగాలలోని మానవహక్కులు, వాటిని కాపాడే నియమాలను ఆధారం చేసుకున్నాడు. "16,17,18 శతాబ్దాలలో కనిపించిన సహజహక్కుల సిద్ధాంతం స్టాయిక్ సిద్ధాంతాన్ని తిరగదోడడమే. అయితే కొన్ని ముఖ్యమైన మార్పులు చేశారు. ప్రథమసూత్రాల సాధారణ జ్ఞానాధారంగా ప్రకృతి నియమాన్ని రాబట్టారు. మానవులంతా స్వాభావికంగా సమానులని స్టాయిక్‌లు తలచారు. మిగిలిన దానితో యిది కూడా క్రైస్తవమతం స్వీకరించింది. చివరకు 17వ శతాబ్దంలో నిరంకుశత్వాన్ని ఎదుర్కొనవలసి వచ్చినప్పుడు స్టాయిక్‌ల ప్రకృతి నియమ సిద్ధాంతం, సమానత్వం, క్రైస్తవవేషధారణలో రాజకీయశక్తిగా పరిణమించి, ప్రాచీనకాలంలో చక్రవర్తి సైతం యివ్వలేని బలాన్ని సమకూర్చింది"(1) మార్కస్ ఓరిలస్(2) సమానహక్కు, సమాన స్వేచ్ఛలను ప్రకృతి నియమాలననుసరించి ఆచరణలో పెట్టడానికి విఫల ప్రయత్నం గావించాడు.

ఇప్పుడు గ్రోషెస్ పూర్వాపరాలు పరిశీలించడం అవసరం. డచ్ రిపబ్లిక్‌తో బూర్జువావర్గం ఆవిర్భవించడాన్ని సమర్థిస్తూ అతను కొత్త సిద్ధాంతం రూపొందించలేదా? అతను వ్రాసిన లా ఆఫ్ వార్ అండ్ పీస్‌కు యీ సంఘటనకు సంబంధం వున్నట్లు ఎక్కడా సాక్ష్యాధారాలు లేవు. ఒకవేళ వున్నా, దానిపై నొక్కు పెట్టడం అర్థరహితం. నెదర్లండ్‌లోని స్పానిష్ రాష్ట్రాలలో వాణిజ్య, పారిశ్రామిక వర్గాలు తిరుగుబాటులో వహించిన పాత్ర ప్రధానమైన అంశం. డచ్ రిపబ్లిక్ బూరుజవా వర్గం సృష్టించినదికాదు.

స్పానిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు మొదలుకాలేదు. రెండో ఫిలిఫ్ ప్రభువు స్పెయిన్‌కు వెళ్ళిపోగా, నెదర్లండ్ ప్రభుత్వాన్ని పార్మా యువరాణికి అప్పగించారు. 5వ ఛార్లెస్ చక్రవర్తికి అతని ఫ్లెమిష్ భార్యకు జన్మించిందీమె. ఉన్నత వంశీకుల పాలన కొనసాగనిస్తే, ఆమెను చట్టబద్ధపాలకురాలుగా అంగీకరించేవారే. ఆ పని జరగలేదు. రాజు పక్షాన పాలన సాగించడానికి కార్డినల్ గ్రాన్‌విల్ అధ్వర్యాన ముగ్గురితో కూడిన ఒక మండలి నియమించారు. తమకు చెందవలసిన సహజమైన హక్కును కోల్పోయినట్లు స్థానిక ఉన్నత వంశీకులు తలచారు. వారు గ్రాన్‌విల్‌పై తిరుగుబాటు చేశారేగాని, స్పానిష్ ప్రభుత్వంపైగాదు. ఆ సంఘటనతో అప్పుడు తలెత్తుతున్న బూర్జువావర్గానికి ఏమి సంబంధం లేదు. డచ్ రిపబ్లిక్ ఏర్పడడానికి ఆ సంఘటన కారణమయింది. "5వ ఛార్లెస్ కింద రాజ్య

1) బెర్ట్రాండ్ రస్సెల్, ఎ హిస్టరీ ఆఫ్ వెస్టన్ ఫిలాసఫీ

2) క్రీ.శ.121-180 స్టాయిక్ తత్వవేత్త, రోమన్ చక్రవర్తి.

సేవ చేసిన ఉన్నత వంశీకులు, కార్డినల్ అతని సహచరుల అధ్వర్యాన తమకు ప్రభుత్వంలో భాగం లేకపోవడం ఎన్నాళ్ళని, తమకు కూడా అవకాశం ఎప్పుడు వస్తుందని ఆగ్రహావేశులై అడిగారు."(1) రాజకీయాధికారుల కోసం ఆవిర్భవించిన కొత్తవర్గం కాదది. "ఇటీవల గందరగోళంలో శాంతిభద్రతలు కాపాడడంలో తోడ్పడిన ముగ్గురు"(2) సైనికుడు ఎగ్మాంట్, హూన్‌ప్రభువు,ఆరెంజ్(3) యువరాజు విలియం నానూ(4) తిరుగుబాటు నడిపారు.

మత వ్యతిరేకత అలవాటుపడినవారు, తిరుగుబాటుకు మరొక కారణంకాగా, ట్రెంట్(5) మండలివారి కేథలిక్ సిద్ధాంతాలను నెదర్లండ్ ప్రజలు ఆమోదించాలనేది మరొక కారణం. ఆరెంజ్ యువరాజు స్వయంగా రూపొందించిన మతహింసను అభ్యంతరపెడుతూ ఎగ్మంట్ స్వయంగా రాజును సందర్శించడానికి వెళ్ళాడు. కాని తన ప్రయత్నంలో విఫలం కాగా, అతనితోబాటు ఉన్నత వంశీకులలో యువతరం, కాల్విన్ మక మూర్కత్వానికి గురైన మార్నిక్స్, బ్రెడరోడ్ వంటి మానవతా కాథలిక్‌లు తిరుగుబాటులో చేరారు. రాజద్రోహులుగా ఎగ్మంట్, హూన్‌లను బహిరంగంగా వురి తీయడంతో తిరుగుబాటు కాస్తా కార్చిచ్చుగా మారింది. అల్వా(6) సైనికులకు చెల్లించే నిమిత్తం పన్ను విధించిన తరువాత గాని వాణిజ్యవర్గాలు తిరుగుబాటులో చేరలేదు. 1572లో ప్రజాస్వామిక రాజ్యాంగంతో డచ్ రిపబ్లిక్ స్థాపించిన అనంతరం, వర్తక, పారిశ్రామిక వర్గాలు తమ ద్రవ్యాన్ని బిగదీశారు. ఆరెంజ్ యువరాజు అధ్వర్యంలో రిపబ్లిక్ సైన్యానికి సరిగా చెల్లించనందున, ఓటమి వెంట ఓటమి తటస్థించింది. అతని ఖజానా ఖాళీ అయింది. ప్రెషన్ రైతులు యూట్రెక్ట్ సైన్యం, గెల్డర్‌లండ్ ఉన్నత వంశీకులు రిపబ్లిక్‌కు మూలాధారంకాగా, అల్వా అనంతరం పార్మా ప్రభువు సింహాసనం అధిష్టించే వరకు బ్రాబంట్, ప్లాండర్స్ నగర సంపన్న వర్తకులు చేతులు కలపలేదు. ఆరెంజ్ యువరాజు స్థాపించిన రిపబ్లిక్‌ను గుర్తించవలసిందిగా రాజుకు పార్మాప్రభువు సలహాయిచ్చిన తరవాతనే యిది సంభవించింది.

---

1) హెచ్.ఎ.ఎల్. ఫిషర్, హిస్టరీ ఆఫ్ యూరోప్

2) పై గ్రంథంలో

3) నెదర్లండ్‌ను, ఇంగ్లండ్‌ను పాలించిన రాచకుటుంబం

4) నెదర్లండ్స్‌లో ఒక పర్వతమయ రాష్ట్రం

5) ఉత్తర ఇటలీలో ఒక నగరం. మతాచార్యులు తరచూ యిక్కడ సమావేశమై నియమాలు రూపొందిస్తుండేవారు.

6) 1508–1582 తిరుగుబాటును అణచిన స్పానిష్ జనరల్.

మతేతరంగా ఆధునిక రాజకీయ సిద్ధాంతాన్ని రూపొందించినవారిలో గ్రోషెస్ ప్రధముడు కాదు. 1324లోనే పాజూకు చెందిన మార్స్గ్లియె, రాజ్యసిద్ధాంతంలో అరిస్టోటిల్‌కు మెరుగులు దిద్దాడు. అతని కాలానికి చాలా ముందున్నట్లే భావించవచ్చు. అతని సిద్ధాంతం ప్రాచీన వివేకంపై ఆధారపడినా, అతన్ని "మధ్యయుగాల వారందరిలో అత్యంత ఆధునికుడన్నారు." అన్ని రకాల అధికారిక ప్రమాణాలను తృణీకరిస్తూ, తన రాజకీయ సిద్ధాంతాన్ని వాస్తవాల ఆధారంగా మార్సిగ్లియో పెంపొందించాడు. చట్టానికి దైవాంశ సంభూతపాలకులుగాని, వివేచనాపరుల ఆలోచనగాని ఆధారం కాదని, పౌరులందరి జ్ఞానమే యిందుకు మూలమని స్పష్టపరిచాడు. "చట్టాన్ని రూపొందించిన అరిస్టోటిల్ అభిప్రాయాన్ననుసరించి, సత్యాన్ననుసరించి, ప్రజలే చట్టానికి ఆధారం, ప్రమాణం. పౌరులందరూ సమావేశమై బహిరంగంగా స్వేచ్ఛగా ప్రకటించి, పౌర విషయాలలో ఏది చెయ్యాలో ఏది చెయ్యరాదో నిర్ణయించాలి. దీనికి శిక్షకూడా లౌకికంగానే ఉంటుంది. పౌరులందరూ తమ ప్రజ్ఞను ఉపయోగించినప్పుడు సమాజానికి ఉపయోగవైన విషయాలు పరిగణనలోకి స్వీకరిస్తారు." మధ్యయుగాల న్యాయశాస్త్రవేత్త, ఎంతో ముందు కాలాలకు పనికివచ్చే పార్లమెంటరీ ప్రజాస్వామిక పద్ధతికి సూత్రాలు పొందుపరచాడు. అప్పటికి బూర్జువావర్గం యింకా కౌపీన వస్త్రాలను విడనాడలేదు. పోప్ అధిపత్యాన్ని చక్రవర్తి తెలిసినట్లుగా నటించే వాటిని మార్స్గ్లియె పట్టించుకోలేదు. ప్రపంచానికి సంబంధించిన చట్టం సెక్యులర్ ప్రమాణంతో వుండాలన్నాడు. ప్రజలకున్న అధికారాన్ననుసరించి, ప్రకృతి నియమం ప్రకారం చట్టం పెంపొందాలన్నాడు. "ప్రకృతి నియమాన్ని వివేచనాత్మకంగా అన్వయించడాన్నే ప్రత్యక్ష నియమంగా అతను వాదించాడు."

అరిస్టోటిల్ పోలిటిక్స్ గ్రంథానికి తన గ్రంథం అనుబంధమని మార్సిగ్లియె ఉపోద్ఘాతంలో పేర్కొన్నాడు. అరిస్టోటిల్ సూత్రాలను లాంఛనప్రాయంగా అనుకరిస్తూనే, అతని భాష్యకారులకు అయిష్టత కలిగించే నిర్ధారణలు చేశాడు. అవరోజ్‌వాదంలోని వివేచన, సహజ సిద్ధాంతాల ప్రభావం మార్సిగ్లియె నిర్ణయాలపై స్పష్టంగా వున్నది. అరబ్ తత్వవేత్తల ప్రమాణాలతో వివేచనకు విశ్వాసానికి ముడిపెట్టే ప్రయత్నం పారిస్ విశ్వవిద్యాలయంలో నామమాత్రవాదులు తమ భాష్యం ఆధారంగా చేసినా మార్సిగ్లియె వాదన యిందుకు భిన్నంగా వున్నది. వివేచనతో కలిపేసి విశ్వాసాన్ని దిగజార్చరాదని మార్సిగ్లియె వాదించాడు. ఇందులో ఒకటి జీవితానికి సంబంధించినది కాగా మరొకటి జీవితానంతర విషయం. ఆత్మ విమోచనకు విశ్వాసం ఉపయోగపడవచ్చు. కాని ప్రపంచ వ్యవహారాలకది అనవసరం. విశ్వాసంతో నిమిత్తం

లేకుండా వివేచనతోనే సెక్యులర్ సమస్యలు పరిష్కరించాలని డొంక తిరుగుడుగా చెప్పడమన్నమాట. వివేచన, విశ్వాసం వేరు చేయడం వలన మార్సిగ్లియొ వాదం మతంలో సందేహవాదానికి, రాజకీయాలలో లౌకికవాదానికి దారితీస్తుందనేది స్పష్టం. "పౌరులందరి అజ్ఞానుసారం మానవ చట్టం ఉంటుంది. చట్టం చేయడానికి అర్హులైనవారు రూపొందించిన నియమ ఫలితమే యిది. ప్రపంచంలో చేయదగిన, చేయగూడని పనులు, ఉత్తమలక్ష్యసాధనకు ఉపకరించడం, మానవుడికి అభిలషణీయమైన వాటికోసం చట్టం ఉద్దేశించారు. వీటిని పాటించనివారిపై శిక్ష విధించడం కూడా లౌకిక వ్యవహారమే."(1)

గ్రోషెస్‌కు ముందు 16వ శతాబ్దంలో, తమ కాల పరిస్థితుల ఆధారంగా రోమన్ చట్టాన్ని కొత్తగా పరిశీలించడానికి అనేకమంది న్యాయవాదులు పూనుకున్నారు. వారిలో నికలస్(క్యూబాకు చెందిన), జాన్ జెర్సన్, జోనెస్ అల్థూసియస్, జీన్ బోడిన్ సుప్రసిద్ధులు.

అల్థూసియస్(2) కాల్వినిస్టు, అయినా, మత జ్ఞానానికి ప్రకృతి నియమానికి గల సంబంధాన్ని తన గ్రంథంలో చాలా అస్పష్టంగా అట్టిపెట్టాడు. మానవుల చేరిక సహజమైందనీ, అది మానవస్వభావంలో భాగమనీ అన్నాడు. దీనికి సామాజిక ఒడంబడిక వంటిదేమీ అవసరం లేదన్నాడు.(3) అంటే సమాజం దైవసృష్టికాదు. ప్రకృతి నియమం వలన పరిణమించిందని అర్థం.

అరిస్టోటిల్ అనంతరం సంపూర్ణంగా క్రమబద్ధంగా వ్రాసిన బృహత్తర గ్రంథం బోడిన్ రిపబ్లిక్ అంటారు. మార్సిగియొ సంప్రదాయాన్ననుసరించి, బోడిన్ కూడా, ప్రత్యక్షనియమానికి అణకువగా మతశక్తి ఉండాలన్నాడు. సార్వభౌమత్వం గురించి చర్చిస్తూ(ఆనాటి సార్వభౌమత్వ పరిస్థితిని బట్టి) ఏకచ్ఛత్రాధిపత్యంతో యిది హరించిపోనారంభించిందన్నాడు బోడిన్. రాజుకు నిరంకుశుడికి అరిస్టోటిల్ చూపిన తేడాను యితడు నిరాకరిస్తూ, ప్రకృతి నియమానసారం పాలించేవాడు రాజుకాగా, దుర్వినియోగ పరిచేవాడు నిరంకుశుడన్నాడు. చట్టం, సార్వభౌమత్వం, పరిపాలనకు సంబంధించిన భావాలన్నీ బాగా చర్చకు వచ్చాయి. నాడు సమగ్ర రాజకీయతత్వం అవసరమైంది. ప్రకృతి నియమం అన్నిటికీ మూలాధారమనేది వూతగా లభించింది.

అయితే రాజ్యం ఎట్లా వచ్చినట్లు? మతేతర అధికారంతో ప్రకృతి నియమం ఎలా పనిచేస్తుంది? అధిభౌతిక వూహాలోకం నుంచి ప్రకృతి నియమాన్ని లోకంలోకి

---

1) పై గ్రంథంలో

2) 1557-1638 గైర్కే అనే అతడు యితని ప్రతిభను కనుగొని బయటపెట్టాడు.

3) ఒట్టోవాన్ గిర్క్, జోహానెస్ ఆల్ థూసియస్

తెచ్చి, సెక్యులర్‌గా మార్చడం ఎట్లా? "ఈ ప్రశ్నలకు తాత్విక పరిశీలన గావించిన న్యాయవాదులు ప్రభుత్వమూలాన్ని తమ దృక్పథంలో నుంచి మత జ్ఞానులవలె, వీరూ ఆలోచించారు."(1) గ్రోషెస్‌కు ముందున్న వారు వారినియమాన్ని గురించి చెబుతూ రెండు సిద్ధాంతాలను కలిపేశారు. గ్రోషెస్ యీ గందరగోళాన్ని స్పష్టపరిచాడు. మానవుడి హక్కులు, కార్యకలాపాలు, పరిమితం గావించడం నియమం కాదు. మానవుడు తన సొంతబాధ్యతపై చర్య గైకొనడమే చట్టం ఉద్దేశ్యం. మధ్యయుగాలలో నియమాన్ని గురించిన భావనతో యిది భేదిస్తున్నది. ఆ కాలంలో మానవుడి సృజనను స్థంబింపజేసి, బాధ్యతను అరికట్టిన నియమం వేరు. మానవుడిలో అంతర్లీనంగా వున్న కొన్ని గుణాల వలన ప్రకృతి నియమం గుర్తించబడినట్లు గ్రోషెస్ పేర్కొన్నాడు.(2) "ప్రకృతి నియమానికి మానవ స్వభావమే మాతృక, ఏదిలేకున్నా, మానవ స్వభావం వలననే సమాజంలో పరస్పర సంబంధాలు ఏర్పరచుకుంటాం. అదే ప్రకృతి నియమానికి మాతృమూర్తి. మానవుడి ప్రత్యేక లక్షణాలలో సమాజం కావాలనుకోవడం, ప్రశాంతంగా వివేచనాత్మకంగా జీవితం గడపాలనుకోవడం వున్నాయి. ఎవరి విషయం వారు చూచుకుంటారనేది స్వభావసిద్ధం కాదు. సమాజాన్ని అట్టిపెట్టే స్వభావమే ప్రకృతి నియమానికి ఆధారం. దేవుడు లేకున్నా ప్రకృతి నియమం వుంటుంది."(3)

దైవేచ్ఛ అనేది ప్రకృతి స్వభావంగాక అదనంగా వున్నదనేటంత వరకూ గ్రోషెస్ వెళ్ళాడు. దైవేచ్ఛ ప్రకృతి నియమాన్ని వ్యతిరేకించదు. "రెండు రెళ్ళు నాలుగు కాకుండా దైవం చేయనట్లే, అంతర్గతంగా చెడ్డకాని దానిని చెడుగా చేయలేదు కూడా." మానవుడి సాంఘిక, వివేచనాత్మక స్వభావంపై గ్రోషెస్ ప్రధానంగా ప్రస్తావన చేశాడు. పరోపకారం చేయాలనే ఆదిమ ప్రవృత్తి, మానవుడి వివేచనాత్మక స్వభావం ఆధారంగా ప్రకృతి నియమం వున్నది. అంటే స్వభావసిద్ధంగా కొన్ని మంచివి. కొన్ని చెడ్డవి. దైవేచ్ఛతో నిమిత్తం లేదు వీటికి. వివేచనపై ఆధారపడి ప్రకృతి నియమం వుంటూ వచ్చింది. ఇది మానవ మేధస్సుకు చెందినది. మార్మిక, అలౌకిక విషయాల నుంచి వివేచనను తప్పించేశాడు గ్రోషెస్. ఆవిధంగా యితను విస్తరించి చెప్పిన ప్రాచీన ప్రకృతి నియమం, సమాజంలో రాజకీయ వ్యవస్థకు వివేచనాత్మక చట్టాలు నిర్మించేదిగా గుర్తించబడింది.

చిరకాలంగా స్వేచ్ఛాన్వేషణ పోరాటం వలన ఎట్టకేలకు మత జ్ఞానానికి

---

1) డబ్ల్యు.ఇ.హెచ్.లెకె, ది రైజ్ ఆఫ్ రేషనలిజమ్ ఇన్ యూరోప్

2) రోస్కోపౌండ్, ది స్పిరిట్ ఆఫ్ ది కామన్ లా

3) హ్యూగో గ్రోషెస్, ది జ్యూర్ బెల్లి ఎట్ పాసిన్

గ్రహణం పట్టగా, మతాధికారానికి గౌరవం పోయింది. రాజకీయ స్వేచ్ఛాన్వేషణ కావాలనడం పోరాటంలో కొత్త ఉత్సాహాన్ని చూపింది. "ఐచ్ఛిక దాస్యం" పై పెద్ద తిరుగుబాటు రావాలి. ఈ శీర్షికతో మాంటేన్(1) ఒక గ్రంథాన్ని ప్రచురించాడు. లాబోటి(2) దీని రచయిత. 32 ఏళ్ళకే అతను చనిపోయాడు. ఆకాలపు ధోరణి యీ కింద ఉదహరించిన గ్రంథ భాగంవలన తెలుస్తుంది.

"దిక్కుమాలిన అవివేకులారా, మీ దరిద్రాన్ని చూచి మీరే భ్రమిస్తూ, మీ ఆసక్తులను విస్మరిస్తున్నారు. మీ ఆస్తిని కొల్లగొడుతుంటే బాధపడుతున్నారు. మీ పొలాలు నాశనమౌతున్నవి. మీ ఇళ్ళలో వస్తువులు ఎత్తుకుపోతున్నారు. ఇదంతా మీరు అధికారం యిచ్చి పంపిన వ్యక్తే చేస్తున్నాడు. మీ ప్రాణాలతో ఎవరి గౌరవాన్ని కాపాడుతారు? మీ చర్యల్ని మీరే అనుమానిస్తారు. చేజేతుల హానిగావించు కుంటున్నారు. మిమ్మల్ని పాదధూళిలో కలిపేస్తున్నారు. ఇదంతా మీరిచ్చిన అధికారమే. పశువులు కూడా యీ అవమానాలను భరించవు. మీరు తలచకుంటే స్వేచ్ఛాపరు లౌతారు. రెండువేల ఏళ్ళక్రితం జరిగినా, నిన్న మొన్న జరిగినట్లున్న, మిల్టిడెజ్(3) లియోనిడస్(4) లెమిసిక్విజ్(5) జరిపిన యుద్ధాలను ఒక్కసారి స్ఫురణకు తెచ్చుకోండి. అవి గ్రీస్ వారు గెలిచిన యుద్ధాలు కావు. స్వేచ్ఛకు విజయపరంపరలవి. వస్తుసేకరణకై మనుషులు శ్రమిస్తారు. కాని స్వేచ్ఛ పట్ల ఉదాశీనులుగా వున్నారు. అయినా, మనందరం ఒక తానులో గుడ్డలమే. అన్నదమ్ములుగా స్వేచ్ఛాపరులుగా జన్మించాం. మనదోషాలు తప్ప మరేదీ చెరపజాలని స్వేచ్ఛాపిపాసువులుగా పుట్టాం"

కాథలిక్, ప్రొటెస్టంట్ క్రైస్తవులకు యీ తిరుగుబాటు తత్వం పొసగనిది కాదు. ఏ మతం విషయంలోనైనా యిది అంతే. మానవుడు తన విధికి తానే నిర్ణీత. తమ విధిపై ఏ అలౌకిక శక్తి అధిపత్యం వహించడం లేదు. మానవుడి పురోగమనానికి నిరంకుశపాలనను ఎదిరించే హక్కుండాలని గుర్తించడం అవసరం. కనుక, గ్రోషెస్, ఇతరులు కలసి స్వేచ్ఛకూ విశ్వాసానికీ మధ్య క్రైస్తవులు తేల్చుకోవాలన్నారు. విశ్వాసపాత్రులు స్వేచ్ఛను గురించి ఆ త్యాగం చేయాలి. ఫలితం స్పష్టం. స్వేచ్ఛాన్వేషణలో మానవుడు విశ్వాసయుగాన్ని వదలేయాలి. మతపరమైన ఆలోచన తృణీకరించి, వివేచనాత్మక, విజ్ఞానపూరిత ఆలోచన అనుసరిస్తే మానవుడి పురోగమనం సాగుతుంది.

---

1) 1533–1592
2)1530–63 ఫ్రెంచ్ మానవతావాది, రచయిచ.
3) 540–488 క్రీ.త. ఏథెన్స్ సైన్యాధికారి
4) స్పార్టా రాజు క్రీ.పూ. 480లో మరణించాడు.
5) క్రీ.పూ. 527– 460 ఏథెన్స్ రాజ్య నిపుణుడు.

అప్పటికి విజ్ఞానదశ వచ్చింది. ప్రత్యక్ష జ్ఞానాధారంగా వూహతో కూడిన ఆలోచనను ప్రక్కకు నెట్టడం సాధ్యపడింది. కొత్తతత్త్వానికి డెకార్ట్ పునాదులు నిర్మించాడు. "వివేచనను సరిగా నిర్వహించి, విజ్ఞానంలో సత్యాన్ని చూడటం" అనే పద్ధతిని అతను పెంపొందించాడు. డెకార్ట్ తత్వంలోని కొత్త స్వభావమంతా అతని సుప్రసిద్ధ గ్రంథం 'మెథడ్'లో స్పష్టపడింది. ఎట్టకేలకు యాంత్రిక విశ్వశాస్త్రానికి గణిత శాస్త్రాధార పరికల్పన వచ్చింది. వివేచనలోని ఆగమనపద్ధతి, అనుభవం నుంచి విశేషాలనుంచి పెంపొందించిన కొత్తతత్వం ఫ్రాన్సిస్ బేకన్‌ది. వైజ్ఞానిక పరిశోధనల వలన ప్రకృతి శక్తులపై అధిపత్యం పొందడమే తత్వలక్ష్యంగా ఆయన ప్రకటించాడు. "జ్ఞానమేశక్తి" అనే నానుడి అతను ప్రయోగించినదే. సంప్రదాయబద్ధంగా అరిస్టోటిల్‌కు యిస్తున్న గౌరవాన్ని బేకన్ కూడా యిచ్చినా, పదార్థవాద పితామహుడు డెమొక్రిటస్ ప్రాచీన తాత్వికులలో మహోన్నతుడని అతను చాటాడు. ప్రాచీన పదార్థవాదం నుంచి సులువును ఆధునిక జ్ఞానం గ్రహించాలి. మధ్యలో మతం తెచ్చిన అవరోధాలను చరిత్ర భాండాగారాలలో భద్రంగా దాచిపెట్టాలి.

హాబ్స్ తత్వం కేవలం మతేతరం. అధిభౌతిక వివేచనావాదంతోనూ అతనికి ప్రయోజనం లేదు. అతను పూర్తిగా పదార్థవాది. అతని దృష్టిలో ప్రకృతి నియమం తాత్వికంగా నైరూప్యమైనదిగాదు. మానవ సమాజాన్ని రూపొందించిన వారంతా వివేకం గల తాత్వికులు కారు. సంస్కృతిలేని పశుతుల్యులు వారంతా. ఆత్మ రక్షణార్థం ప్రేరణాత్మకంగా వారు ప్రవర్తించారు. ఈ ప్రేరణే వారిని దగ్గరకు చేర్చి, సమాజానికి ప్రాతిపదికలు వేసింది. మానవుడు దేవుని దయకు దూరం గావడం కాదిది. మానవుడి జీవితాన్ని మలచడానికి ప్రకృతి నియమం అట్లా మొదలెట్టింది. అటవికత నుంచి నాగరికతకు మానవ సమాజాభివృద్ధి అట్లా పరిణమించింది.

మతం, మతజ్ఞానంతో ఆలోచన అంతా కలిసిపోయిన చరిత్ర కాలాన్ని ప్రక్కకుబెట్టి, ఎపిక్యూరస్ సంప్రదాయానికి వెళ్ళాడు హాబ్స్. మతేతర తత్వానికి స్థిరమైన ప్రాతిపదిక కోసం అతను అట్లా వెనక్కువెళ్ళాడు. పారిస్‌లో కౌందిశీకుడుగా వుంటూ గసెండీని కలిశాడు హాబ్స్. ప్రాచీన గ్రీకు నాగరికతలో అధునాతన, ప్రత్యక్ష విషయాలను తిరగదోడడం గసెండీ కృషిలో ప్రధానం. క్రైస్తవ మతజ్ఞానం అరిస్టోటిల్ తత్వాన్ని సొంతం చేసుకోగా, ఎపిక్యూరస్‌ను విస్మరించారు. గసెండి పదార్థ శాస్త్రజ్ఞుడు, భౌతిక తత్వంతో బాగా పరిచయం వున్న వాడు. ప్రాచీన గ్రీస్‌లో పెంపొందిన యీ విషయాలు కూడా అతనికి యితనికి సుపరిచితం. కనుకనే "ఆధునిక కాలానికి ఏది ఉత్తమమో, తన కాలానికి ప్రాపంచిక అనుభవం ధోరణి ఎలా సరిపడుతుందో" అదే హెూబ్స్ వర్ణించాడు.

ప్రాచీన అణువాదాన్ని కాపాడటమేకాక, ఎపిక్యూరస్ క్రైస్తవేతరుడైనా (అరిస్టోటిల్ కూడా అంతే) ప్రాచీన తత్వవేత్తలందరిలో నైతికవ్యక్తి అని నిరూపించాడు. ఎపిక్యూరస్ సంప్రదాయాన్ని తిరగదోడడం దుర్లభ విషయం. ఇంచుమించు ఎపిక్యూరస్ రచనలన్నీ నాశనం చేశారు. శతాబ్దాలుగా అతనికి తప్పుడు వ్యాఖ్యానాలు చేశారు. లజ్జారహితంగా అతనిపై నిందారోపణలు ప్రచారం గావించారు. క్రీస్తుకు పూర్వం లూక్రిషన్ వ్రాసిన సుప్రసిద్ధ కవిత ఆధారంగా ఎపిక్యూరస్ తత్వమంతా మళ్ళీ పునర్నిర్మించవలసి వుంటుంది. డిరేరం నేటురా అనేది కావ్యం పేరు. తన సమకాలీన పండితులకు లూక్రిషన్‌ను గసెండి పరిచయం చేశాడు. రోంలో అంతర్యుద్ధం జరుగుతున్నప్పుడు పుట్టిన లూక్రిషన్, అంతా అస్తవ్యస్తంగా చిన్నాభిన్నంగా వుండడం కనుగొని, జీవితానికి అర్థాన్ని ఎపిక్యూరస్ తత్వంలో కనుగొన్నాడు. కావ్యారంభంలోనే ఎపిక్యూరస్ తత్వసారాన్ని చెప్పాడు.

భూమిపై మానవ జీవితం నికృష్టంగా వుండగా, మతభారంతో కృంగి పోతుండగా, స్వర్గంలో నుంచి మానవులను అపహాస్యంగా ఎవరో తొంగి చూస్తుండగా, గ్రీస్ నుంచి సాహసించి ఒక మానవుడు తలెత్తి దేవత ముఖంలో ముఖంబెట్టి ఎక్కిరిస్తూ నిలువగలిగాడు. దేవుళ్ళ కథలు, ఉరుములు, స్వర్గం పేరిట బెదిరింపు గర్జనలు అతన్ని భయపెట్టలేక పోయాయి. ప్రకృతి కవాటాలు తెరచి మానవుడికి మార్గం చూపాలని అతని ఆత్మ ధైర్యంగా ఆశించింది.”

గ్రీక్ తత్వం తొలిపదార్థ విజ్ఞానులతో ఆరంభమై, అది భౌతికాభివృద్ధి దశలెన్నో చూచి, ఎపిక్యూరస్ పదార్థవాదానికి చేరుకున్నది. దిగజార్చే మత ప్రభావం నుంచి మానవుడిని విముక్తిడిని గావించడం తత్వలక్ష్యమని అతడు చాటాడు. కనుక, మానవుడు స్వేచ్ఛాన్వేషణకై దేవుడికి ఎదురు తిరిగినప్పుడు, ఎపిక్యూరస్ తత్వంలోనే ప్రేరణ కనిపించింది. ఇందులో ప్రాచీన సహజవాదంపై అభివృద్ధి వున్నది. నియమబద్ధమైన ప్రకృతిలో వ్యక్తికి స్వేచ్ఛ వున్నది. అది భౌతికావసరం లేకుండానే నీతికి చోటు చేసిపెట్టింది. ఆదిమ స్థితి నుంచి మానవుడి పరిణామాన్ని గురించి ఎపిక్యూరస్ భావాలను లూక్రిషన్ యిట్లా చిత్రించాడు.

“ఎండవానలకు గట్టిపడి, వ్యవసాయ కళలేక, జంతువులవలె మానవులు బ్రతికారు. సారవంతమైన నేలలో వారికి నీటి ప్రవాహాలు, సెలయేళ్ళు లభించాయి. నీతినియమం లేకుండా అడవులలో గుహలలో నివసించారు. నిప్పు ఉపయోగం తెలియదు. శరీరాన్ని కప్పుకొనడం ఎరుగరు. అడవి మృగాలతో పోరాటంలో సాధారణంగా గెలుపు సాధించేవారు. కొందరే యిది పట్టుదలగా కొనసాగించారు. క్రమంగా గుడిసెలు వేసుకోవడం నేర్చారు. నేలను పంటలకు సిద్ధం చేశారు.

మనుషులు సౌమ్యులయ్యారు. పొరుగువారితో స్నేహం ప్రబలింది. స్త్రీల పట్ల దయ, పిల్లలమీద ఆదరం మొదలైంది. పూర్తి సమన్వయం సాధించకపోయినా చాల వరకు శాంతిగా బ్రతికారు."

ఇది మానవ సమాజ ఆదిమ వ్యవస్థ. హాబ్జ్ రాజకీయ తత్వానికి యిది ప్రాతిపదిక అయింది. తాత్వికంగా పదార్థవాది అయిన హాబ్జ్ రాజ్య ప్రారంభం గురించి యిట్లా వాదించాడు.

"దైవం సృష్టించిన ప్రకృతిలో కృత్రిమ పశువును చేయగలనని మానవుడు తలచాడు. అంగాల కదలికే జీవితం అయినప్పుడు, యాంత్రికమైన వాటన్నిటికీ కృత్రిమ జీవితం ఎందుకు ఉండరాదు? హృదయం అంటే స్ప్రింగ్ గాక మరేమిటి? నరాలన్నీ దారాల వంటివే. శరీరంలో కలయికలన్నీ చక్రాల వంటివి. ఇవి శరీరానికి చలనం ఇస్తున్నవి. ప్రకృతిలో అత్యద్భుతమైన మానవుడిని కళ అనుకరిస్తున్నది. సంక్షేమరాజ్యం యీ కళ వలననే సృష్టి అయింది. ఇదొక కృత్రిమ మానవుడిని పోలినదే. సహజమైన దానికంటె స్థాయిలో, శక్తిలో యిది మిన్న. సార్వభౌమత్వం ఒక కృత్రిమ ఆత్మ. ఇదే శరీరానికి జీవనాన్ని, చలనాన్ని యిస్తున్నది."(1)

మానవుడి సహజస్థితి వర్ణన పరస్పర విరుద్ధత్వానికి దారితీస్తుంది. శరీరం మనస్సులో మానవుడికి సమాన శక్తిని ప్రకృతి యిచ్చింది. "ఈ సమాన శక్తి నుంచి మన లక్ష్యసాధనకు సమానత్వం సాధించవచ్చనే ఆశ జనిస్తున్నది. ఇద్దరు వ్యక్తులు ఒకే వస్తువును కోరుకుంటే ఇద్దరూ దాన్ని అనుభవించలేరు. వారు శత్రువులుగా మారతారు. లక్ష్యసాధనలో ఒకరిని ఒకరు నాశనం చేసే ప్రయత్నం చేస్తారు." మానవుడి సమానత్వం గురించి యీ నిరాశావాద ఫలితాలను రాబట్టడంలో దోషం వున్నది. నియమాల ఆవశ్యకతను వివరించడానికి, సమాజ రాజకీయ వ్యవస్థను చెప్పడానికి యిట్లా చెప్పడం తటస్థించింది. ప్రకృతి నియమం అన్వయించడం ద్వారా కృత్రిమంగా సృష్టించిన సమస్యకు హాబ్జ్ పరిష్కారాన్ని కనుగొన్నాడు. "భయం, చావు వలన మనుషులు శాంతి నవలంబిస్తారు. బ్రతకడానికి తగిన వస్తువులను అభిలషించడం, పరిశ్రమించి వాటిని పొందడం, అవసరం. మనుషులు అంగీకారానికి రావడానికి తగిన శాంతి పరికరాలను వివేచన సూచిస్తుంది. వీటినే ప్రకృతి నియమాలంటాము."

హాబ్జ్ యింకా వివరణ యిచ్చాడు. సహజమైన హక్కు అంటే తన జీవితాన్ని కాపాడుకోడానికి మానవుడు వాడే శక్తి మాత్రమే. అతను చేయగలిగింది కూడా

---

1) హాబ్జ్, లెవిథియన్

చేయకుండా ఆటంకాలు తొలగిపోవడమే స్వేచ్ఛ అంటే. “తన జీవితానికి వినాశకారి అయినది చేయకుండా వుండేది కూడా ప్రకృతి ధర్మం సూచిస్తుంది.” తార్కికంగా క్రమాన్ని పాటించిన హాబ్జ్ తత్వంలో ఒకదోషం ఉంది. యాంత్రిక జీవితంతో ఇచ్ఛకు గల స్వేచ్ఛను సమన్వయం గావించలేకపోయాడు. ఎపిక్యూరస్‌ను అనుసరించి హాబ్జ్ కూడా చూపాడు. సమాజం మానవుడి సృష్టి. ఏ దైవ ప్రయోజనాన్ని సాధించడానికీ దేవుడు మానవుడిని సృష్టించలేదు. మానవుడే సృష్టికర్త. సృజనశక్తిలోనే అన్నీ యిమిడివున్నావి. అయితే అంతవరకూ విజ్ఞానం ముందుకు పోలేదు. ఖగోళశాస్త్రం, పదార్థశాస్త్రం, యాంత్రిక విశ్వశాస్త్రానికి అవసరమైన పరికల్పనలు రూపొందించినవి. మానవుడు అందులో “యాంత్రికమే.” కాని అత్యున్నత జీవి చర్యలను వివరించగల మానవ విజ్ఞానం యింకా రావలసి వున్నది. మనో విజ్ఞానాన్ని జీవశాస్త్రానికి జోడించే వరకూ సార్వభౌమాధికారం గల మానవశక్తులను అవగాహన చేసుకోలేదు. అప్పుడు ఇచ్ఛకు, వివేచనకు గల సంబంధం తెలియలేదు. తరువాత లోప రహిత పదార్థవాద తత్వం సాధ్యపడింది.

17వ శతాబ్దంలో, ఆధునిక నాగరికతకు సిద్ధాంత ప్రాతిపదికలు వేసినప్పుడు, ఎపిక్యూరస్ సంప్రదాయంలో మానవతావాదానికి, పదార్థవాద విశ్వశాస్త్రానికి పొందిక లభించింది. అణువాదంలో తొలుత వున్న బాల్యారిష్టం పోగొట్టి, నియమబద్ధ ప్రకృతిలో వ్యక్తి స్వేచ్ఛకు ఎపిక్యూరస్ అవకాశం కల్పించాడు. భౌతిక ప్రపంచంలో ప్రకృతి సిద్ధ ఎంపిక అనే సిద్ధాంతాన్ని ఎపిక్యూరస్ ముందే వూహించినట్లు లూక్రిషస్ వర్ణన వల్ల తెలుస్తుంది.

“ఆది నుంచి ఆయా వస్తువులు తగినచోట వుండడంలో పథకం ఏదీ లేదు. ఏది ఎట్లా కదలాలో ముందే బేరమాడి స్వీకరించలేదు. అనంత వస్తువులు అనేక కోణాలలో అనంత కాలం నుంచీ చలనంతో వున్నవి. అనేక కదలికలను ప్రయత్నించిన అనంతరం, ఏదొక రూపాన్ని ఏర్పరచుకుంటవి. ఆ స్థితిలో చాలకాలం కొనసాగుతవి. చలనస్థితి నిర్ధారణ అయిన తరువాత సముద్రాలలోకి నదీ ప్రవాహాలు చేరతవి. సూర్యరశ్మి వలన భూమి ఏటా ఉత్పత్తి నిస్తుంది. ప్రాణికోటి పుంఖానుపుంఖాలుగా వచ్చి పోటీపడి నివశిస్తుంది.(1)

గతంలో మానవుడు ఎదుర్కొన్న సమస్యలే ఆధునిక మానవుడు వునికి చలనంకు సంబంధించిన వాటిని భౌతికంగా సామాజికంగా తన పరిసరాలలో

---

.1) లూక్రిషన్ గ్రంథంలో

ఎదుర్కొంటున్నాడు. తన స్థితికి ప్రాతిపదిక ఏమిటో అవగాహన చేసుకోలేని మానవుడు సహజ ప్రకృతిని తన ప్రయోజనార్థం వినియోగించుకోలేడు. ఉనికి పోరాటంలో సఫలం పొందలేడు. ప్రకృతిని జయించడానికి వీలుగా జ్ఞానార్జన ఎట్లా సాధ్యం? ఉనికి పోరాటానికి సృష్టించిన సమాజం, రాజ్యం మానవుడి సహజ స్వేచ్ఛను హరించగూడదు. మానవుడు యంత్రంగా మారకుండా, స్వేచ్ఛను అంచెలవారీగా పెంచడానికి సామాజిక, రాజకీయ సంబంధాలను మానవుడు క్రమబద్ధం చేయడం ఎట్లా? సహజమైన మతానికి ఎదురు తిరిగిన ఎపిక్యూరస్ తత్వంలో ప్రాచీన ప్రజ్ఞా జీవితం పరాకాష్ట నందుకున్నది. పునర్వికాసంగా తరువాత మానవుడు చేసిన తిరుగుబాటు ఆ మానసిక సంప్రదాయం నుంచే ఉత్తేజాన్ని పొందినది. అప్పుడు భావసాహసం వైజ్ఞానికాభివృద్ధి ఆరంభమైంది. తుదకు కాథలిక్, ప్రొటెస్టంట్ పేరిటగల సంస్థాగత క్రైస్తవ మతానికి కొత్త విజ్ఞాన సహజవాదం తిరగదోడటంతో, గ్రహణం పట్టింది. ప్రకృతి నియమం అందుకు ప్రోత్సాహాన్నిచ్చింది. సృష్టికర్తలో నమ్మకం పోగొట్టడానికి, సృష్టికి ప్రయోజనం వున్నదనే విశ్వాసం సడలడానికి యీ నియమమే కారణం. ప్రకృతి నియమాలు కనుగొనవచ్చు. అవగాహన చేసుకోనూవచ్చు. మానవుడి శక్తికి మించిన అలౌకిక శక్తులకు ఆపాదించవలసిన అవసరం ఏ మాత్రం లేదు. సమాజం మానవుడి సృష్టి. అది మానవుడి ప్రయోజనార్థం కృషి చేయాలి. స్వేచ్ఛను సాధించడమే ఆ ప్రయోజనం.

✦ ✦ ✦

# ఆధునిక తత్వం పుట్టుక

12వ శతాబ్దంలో మేధావుల పునర్వికాసం వచ్చినప్పటినుంచి, పాండిత్య వివేచనావాదం మతజ్ఞానాన్ని చిన్నచూపు చూచింది. అయితే, యాంత్రిక విశ్వశాస్త్రం వచ్చిన తరువాతగాని మతజ్ఞాన సౌధం కూలడం మొదలుకాలేదు. అల్బర్టన్ మాగ్నస్, అతని శిష్యుడు థామస్ అక్వినాస్ తమ ప్రజ్ఞవలన, అధిభౌతిక వివేచనావాదాన్ని పూర్తిగా దైవజ్ఞానంలో కలిపేశారు. 13వ శతాబ్దారంభంలో మత జ్ఞానాన్ని మించి పోవడానికి, స్వేచ్ఛాపూరిత ఆలోచనకు కాణాచి అయిన పారిస్ విశ్వవిద్యాలయం ఉపక్రమించింది. పునర్వికాసానికి ముందుగా స్వాగతం పలికిన పీటర్ అబెలార్డ్, క్రైస్తవమత త్రిమూర్తిత్వ మార్మికతను వివరించడానికి సాహసించడమేగాక, యిహపరలోక విషయాలన్నిటినీ మానవుడి వివేచనా పరీక్షకు పెట్టదలచాడు. తరువాత, మతజ్ఞానం నుంచి పాండిత్య వివేచనావాదం యింకా దూరంగా జరిగిపోయింది. మతేతరంగా వున్న అరబ్ మేధావులు పశ్చిమ ఐరోపాలో 'కొత్త అరిస్టోటిల్' తత్వప్రభావం చూపగా తత్ఫలితంగా పాండిత్య వివేచనా వాదం తత్వానికి సమీపంగా వచ్చింది. అవరొ "తత్వవేత్త" కు యిచ్చిన వ్యాఖ్యానం రెండు శతాబ్దాల పాటు పాశ్చాత్య విద్యారంగాన్ని ప్రభావితం గావించింది. అతని బోధనలలో క్రైస్తవ వ్యతిరేక లక్షణాలపై దృష్టిపెట్టి పెంపొందించారు. ఇందులో పేర్కొనదగినవి, పదార్థం శాశ్వతమని, చైతన్యవంతమైన మేధస్సు ఐక్యత, వ్యక్తి అమరత్వాన్ని వ్యతిరేకించడం వున్నవి. సంప్రదాయబద్ధంగా అధ్యయనం చేసే తర్కశాస్త్రం స్థానే, పదార్థవిజ్ఞానం, అధిభౌతిక శాస్త్రభాగాలు, డియానిమా వున్నవి. అలౌకిక వాదపు కోటలలోకి సహజవాదం చొచ్చుకపోయి, మత జ్ఞానాధిక్యతను ప్రశ్నించింది.

క్రైస్తవ ముసుగులో, అరిస్టోటిల్ ప్రమాణంతో "అవరోమ రహిత విషయాలను" అల్బర్టన్ మాగ్నస్ ప్రవేశపెట్టేవరకూ, సనాతనులు అరేబియన్ అరిస్టోటిల్‌కు వ్యతిరేకంగా విఫల పోరాటం జరుపుతూనే వున్నారు. అరబ్ వివేచనాత్మక చింతనా ప్రభావంలో ఐరోపా మేధావులు మునిగిపోయారు. థామస్ అక్వినాస్ సైతం మతజ్ఞానం నుంచి తత్వాన్ని వేరుచేసి చూడవలసి వచ్చింది. దీనివలన, మతవ్యతిరేకి అబెలార్డ్ ధోరణి సరైనదని రుజువుచేశాడు. మధ్యయుగాలలో మహోన్నతులైన యిరువురు

పండితులు, ఆలోచనాపరుల ప్రమాణం ఆధారంగా పాండిత్య వివేచనా వాదానికి సనాతనత్వపు ముద్ర లభించింది. సాక్షాత్కరించిన దివ్య మతానికి, సహజమతానికీ స్పష్టమైన గిరిగీశారు. అట్లాగే మానవుడి వివేచన ఆధారంగా చెప్పదగిన సత్యానికి దైవకృప వలన సాక్షాత్కరించే అలౌకిక సత్యానికి ఎల్లలు ఏర్పరచారు. ప్రామాణికతలో పరస్పర విరుద్ధత్వం లేకుండా వున్నదో లేదో పరీక్షించేటంత వరకూ అలౌకిక వాదాన్ని వివేచన పరిశీలనకు గురిచేయటం విశేషం. మానవ చింతనలో ఆ మేరకు పెద్ద విప్లవమే.

"ఇంతవరకు తత్వం గర్భ శత్రువుగానో, ప్రమాదభరితమైన అనుమానా స్పదమైన స్నేహితుడుగానో వున్నది. అల్బర్టస్ మాగ్నస్, థామస్ అక్వినాస్ వంటి డొమినికన్ మేధావుల ప్రజ్ఞ వలన, గర్భితంగా క్రైస్తవ మతానికి అక్కరకొచ్చేదానినీ, క్రైస్తవ మతానికి వ్యతిరేకం కాని దానిని అరిస్టోటిల్ తత్వం నుంచి స్వీకరించి, కాథలిక్ మతానికి పనికొచ్చే మతజ్ఞానంగా అల్లేశారు. క్రైస్తవేతర తాత్వికుని రచనలన్నీ, చివరకు నీతిశాస్త్రంతో సహా మతజ్ఞానంగా రూపొందించారు. మతం వివేచనాత్మకం. వివేచన దైవికం. ఏ ఆధారంగా వచ్చినాసరే జ్ఞానం, సత్యం పొందికగా యిమడాలి. క్రైస్తవ మతాన్ని వివేచనాత్మకం గావించడానికి యీ విశ్వాసం చాలా తోడ్పడింది.(1)

ఆధునిక తత్వం ఒకనాడు పుట్టలేదు. గిరిగీసి చూపడానికి ఒకకాలంలోనూ జనించలేదు. తలెత్తుతున్న వర్గపు సిద్ధాంతంగా యిది ఒక కాలంలో ఆరంభం కాలేదు. గతితార్కిక విధానంలో యిది పెంపొందినది. యాంత్రికంగా గాక, చైతన్యవంతంగా, బాహ్య ప్రభావం వలన గాక, అంతర్గత చైతన్యత వలన యిది వచ్చింది. ప్రజ్ఞ విప్పారే యీ విధానం నిరంతరమైనది. అక్కడక్కడా అవరోధాలున్నప్పటికీ ఆగలేదు. క్రైస్తవుల మత ద్వేషం చూపిన అంధకారయుగంలో సైతం, మానవ మేధస్సు నుంచి జనించిన వివేచన, సహజవాదం అంతం కాలేదు. తరువాత భయంకర మత జ్ఞానం ప్రబలిన మధ్యయుగాల విద్యావిధానంలో పరిణతి చెంది, వికసించాయి. 12వ శతాబ్దపు పునర్వికాస ప్రవాహంలో ఒకటి మానవవాద పునరుజ్జీవనంలో మరొకటి అభివృద్ధి అయ్యాయి. పైకి పరస్పర విరుద్ధంగా కనిపించిన మానవ చింతనా ధోరణులు చివరకు ఆధునిక తత్వంలో మిళితమయ్యాయి.

---

1) డీన్ హేస్టింగ్స్ రాష్‌డాల్, ది యూనివర్సిటీస్ ఆఫ్ మిడీవల్ యూరోప్, వాల్యూం1.సంపుటి3 6 8-9, ఉదాహరణకు మన కాలంలోని కొత్త థామస్ వాదం చూడవచ్చు. "మానవ విజ్ఞానాలలో తత్వం అత్యున్నతమైంది. అంటే సహజమైన వివేచన కాంతివలన విషయాలను తెలుసుకొనే విజ్ఞానమన్ననమాట. దీనికి మించిన విజ్ఞానం వున్నది. అదే మత విజ్ఞానం. మత విజ్ఞానం అంటే దైవజ్ఞానం అన్నమాట." జాక్ మారిటైన్, ఏన్ ఇంట్రడక్షన్ టు ఫిలాసఫీ.

..........................................................................................

మధ్యయుగాలలో అజ్ఞాత పండితులెందరో విశ్వజ్ఞానం, ఖగోళశాస్త్రం, పదార్థ గణిత శాస్త్రాలను పట్టుదలగా అధ్యయనం చేశారు.(1) నాటి మేధావుల జీవితం, చిరకాలంగా జరుగుతున్న అనవసరపు చర్చల మధ్య కొందరు మేధావులు క్రమబద్ధంగా జరిపిన వాదనలు కానేకావు. ఒక పద్ధతిలో వివేకంతో జరిగిన అభివృద్ధి నాడున్నది. ఎరాస్మస్, లూథర్ రాకతో ఈ పద్ధతి హఠాత్తుగా ఆగలేదు. కాలదోషం పట్టిన పాఠశాలలో నిష్ప్రయోజనంగా యిది కొనసాగలేదు. ఆధునిక తత్వాన్ని ప్రభావితం చేసిన భావాలు, ఆలోచనలు నాడు జనించాయి. 12వ శతాబ్దంలో ఫ్రాన్స్ పాఠశాలలో జరిగిన మార్పు మేధావుల పునర్వికాసంలో మిళితమైంది. ఐరోపా నాగరికతలో సంస్కరణవాదం, ఫ్రెంచి విప్లవానికి తీసిపోని చారిత్రక సంఘటనగా దీనిని పరిగణించాలి.(2)

మేధస్సు ఆ విధంగా నిరంతరం విప్పారుతూ పోగా, మధ్యకాలాల అధిభౌతిక వివేచనా వాదాన్ని ప్రాతిపదికగా చేసుకొని, భిన్న పరిస్థితులలో ఆధునిక తత్వం, అంతర్గతంగా యీ విధానాన్ని కొనసాగించింది. కోపర్నికస్, కెప్లర్, గలీలియో పరిశోధనా ఫలితాల వలన, మత జ్ఞాన పెత్తనం నుంచి తత్వాన్ని విమోచన గావించడంలో డేకార్డ్ సఫలీకృతుడయ్యాడు.(3) విజ్ఞాన(యాంత్రిక) సహజవాదంలో పితామహులు బయలుదేరేసరికి పునర్వికాసానికి స్వతంత్ర ప్రతిపత్తి వచ్చింది. ప్రాచీన సంప్రదాయాల ఆధారంగానే నాటి మానవతావాదులు కొత్తయుగానికి స్వాగతం పలికారు. కొత్తయుగం వాస్తవంగా కొత్తదే. వివేచనావాద సంప్రదాయం, ఆధునిక విజ్ఞానంలో నొక్కి చెప్పబడిన సహజవాదం కలసి యీ కొత్త తత్వానికి ప్రేరణ కల్పించాయి. "చరిత్రలో 16వ శతాబ్దం విప్లవాల శతాబ్దంగా చోటు చేసుకున్నది. ఐరోపాకు రోంతో గల బంధం తెగగొట్టింది గాక, తత్వానికి పాండిత్య వాదానికి గల సంకెళ్ళు కూడా అప్పుడే తెగాయి. మానవ వివేచన విముక్తి పొందింది. ఆలోచన, ఆచరణకు స్వేచ్ఛ ప్రకటించింది 16వ శతాబ్దంలోనే.

మత పిడివాదం నుంచి, మతజ్ఞాన అధికారికత నుంచి మానవుడి ఆలోచనను ప్రకృతి నియమ సిద్ధాంతం విముక్తి గావించింది. అస్తవ్యస్త పరిస్థితి నుంచి తొలుత

---

1) లిన్ థాండైక్, ఎ హిస్టరీ ఆఫ్ మాజిక్ అండ్ ఎక్స్‌పరిమెంటల్ సైన్స్, ఛార్లస్ హెచ్. హాస్కిన్స్, స్టడీస్ ఇన్ ది హిస్టరీ ఆఫ్ మిడీవల్ సైన్స్, విలియం సి.డి. డాంపియర్, ఎ హిస్టరీ ఆఫ్ సైన్స్.

2) రాష్‌డాల్, ది యూనివర్సిటీస్ ఆఫ్ మిడీవల్ యూరోప్

3) 17వ శతాబ్దంలో, మతజ్ఞానం నుంచి తత్వాన్ని వేరుపరచడంలో కార్టీజియన్ సంస్కరణ సఫలమైంది. మతజ్ఞానానికి హక్కు వున్నదనే వాదనను త్రోసి పుచ్చింది. తత్వంపై పరోక్షంగా మతజ్ఞానపు అజమాయిషీ ఆవిధంగా పోయింది. మారిటైన్, ఇన్‌ట్రడక్షన్ టు ఫిలాసఫీ.

విశ్వాన్ని సృష్టించినట్లు చెబుతున్న క్రైస్తవ మతజ్ఞానంలోని నియమబద్ధత, ప్రయోజనవాదం కూడా అలౌకిక నియమాలననుసరించే వున్నవి. మధ్యయుగాంతంలో దేవుడి స్థానే ప్రకృతి చోటు చేసుకున్నది. కాని లోగడ మతం ఇచ్చిన పరిమిత స్వేచ్ఛ కూడా ప్రకృతి నియమంలో మానవుడికి లేకుండా పోయింది. దైవాంశే మానవుడి ఆత్మ. మానవుడికి క్రైస్తవ మతంలో స్వేచ్ఛ వున్నది. అయితే ఆ స్వేచ్ఛ పాపం చేయడానికే. అప్పుడు దేవుడు అనుగ్రహించి ఆత్మ విమోచన గావిస్తాడు. బేకన్, హాబ్జ్, డేకార్ట్‌లతో ఒక దారికి వచ్చిన ఆధునిక తత్వం కొన్ని సమస్యలను ఎదుర్కొన్నది. వివేచనాత్మక అధిభౌతిక వాదంతో యాంత్రిక విశ్వజ్ఞానం సమన్వయించ వలసి వచ్చింది. భౌతిక ప్రపంచంతో మానవుడి వివేచనను పొందుపరచ వలసి వచ్చింది. మరొకప్రక్క స్వేచ్ఛా భావానికి ఆవశ్యకతకు సమన్వయీకరణ జరపవలసి వచ్చింది. పునర్వికాస కాలంలో సహజ మానవవాదం, విజ్ఞానానికి చెందిన యాంత్రిక భౌతికవాదంతో ఘర్షణ పడినట్లనిపించింది. మరొక వైపున మానవుడి వివేచన సర్వస్వతంత్రమైతే, అతని యిచ్ఛకు స్వేచ్ఛ వుంటే, విజ్ఞానం పేర్కొనే యాంత్రిక సహజవాదంతో ఎట్లా పొసుగుతుంది అనే సమస్య వచ్చింది. మరొక విధంగా చెప్పాలంటే, మానవుడి వివేచన, యిచ్ఛ అనేవి భౌతిక నియతివాదంతో ఎట్లా పొసగడం అనేవి చర్చనీయాంశాలైనాయి.

ఈ గందరగోళం నుంచి బయటపడాలంటే, ప్రతిదీ సందేహించాలనే కార్టీసియన్ పద్ధతి ఒక్కటే మార్గం. ఆవిధంగా, ఆధునిక తత్వానికి డేకార్ట్ పితామహుడు. ఇంకా విశ్లేషిస్తే బేకన్ ప్రాపంచికానుభవవాదం(ఆగమనతర్కం), బాబ్జ్ నియతివాదం కొత్త యుగాన్ని బాగా ప్రతిబింబిస్తాయి. ఏమైనా వీరి ముగ్గురి ప్రజ్ఞవలన, తత్వానికి స్వతంత్ర ప్రతిపత్తి వచ్చింది. ప్రకృతి, దానితో మానవుడి సంబంధం, మానవ జ్ఞానవిధానం అనేవి ఒక స్థాయికి వచ్చాయి. అలౌకిక వాదం నుంచి బయటపడి, ఆధునిక తత్వశాస్త్రం మానవుడి ఆలోచనకు విమోచన కలిగించింది. స్వేచ్ఛగా ఆలోచించగల మానవుడు, భావసాహసంతో కొత్త దారులు అన్వేషించ గలిగాడు.

తత్వశాస్త్రం పుట్టినప్పటినుంచి ఆలోచనకు అస్తిత్వానికి గల సంబంధం ప్రధాన సమస్యగా తయారైంది. ఆధునిక తత్వాన్ని కూడా యిదే సమస్య పట్టుకున్నది. మానవ సహజవాదం రాకముందు కూడా, 12,13వ శతాబ్దాలలో మతజ్ఞానాన్ని వివేచనను సమన్వయ పరచదలచిన వారికి యీ సమస్యే ఎదురైంది. రాను రాను యీ సమస్యనే ఇంకో విధంగా ప్రస్తావించారు. ప్రపంచానికి, ప్రపంచాన్ని గురించి మానవుడి ఆలోచనకు గల సంబంధం ఏమిటన్నారు. మానవుడి మనస్సు ప్రపంచాన్ని నిజంగా

తెలుసుకోగలదా? మానవుడి భావనలు, దృష్టి వాస్తవాన్ని ప్రతిబింబిస్తుందా? విశ్వ వాస్తవికతకే ప్రాచీన సహజభావం పరిమితమైంది. భౌతిక ప్రపంచాన్ని , మానవుడి మనస్సును విశ్లేషించడాన్ని కలిపేశాడు డేకార్ట్. పదార్థవిజ్ఞానం, మనో విజ్ఞానంపై ఆధునిక తత్వం ఆధారపడాల్సిందే.

"ఆలోచనకు ఉనికికీ, భావానికి ప్రకృతికి గల సంబంధం తత్వంలో అత్యున్నతమైంది. ఆదిమ మానవుడి అజ్ఞాన భావనలో మతానికి వెళ్తున్నట్లే, దీనికి ప్రాతిపదికలున్నవి. అయితే, ఐరోపా ప్రజలు మధ్యయుగాల క్రైస్తవమత మత్తు నుంచి మేల్కొన్న తరువాతగాని యీ సమస్య ప్రాధాన్యతను గుర్తించి సునిశితంగా యీ ప్రశ్నను వేసుకోలేదు" ద్వందవాద దోషాన్ని సరైన దృక్పథంలో చెప్పారిక్కడ. ఆధునిక తత్వం పుట్టుక గురించి కూడా సరిగా భావించాడు. అయితే దీన్ని యిట్లా తిరగవ్రాయవలసి వుంటుంది. ఆధునిక విజ్ఞానం ఆవిర్భవించిన తరువాత లేదా, విజ్ఞానం పునరుజ్జీవనం పొందిన తర్వాత అనాలి.

వాస్తవానికి, కార్టిసియస్ తత్వం ద్వందవాద దోషంతో వున్నది. గణితం, భౌతిక, ఖగోళ శాస్త్రాలు ముందుకు పోతుండగా, మనస్సు జీవితానికి సంబంధించిన విజ్ఞానం కుంటుతున్నది. రెండు సత్యాలున్నాయనే వాదం 17వ శతాబ్దంలో తత్వాన్ని గందరగోళ పరచింది. విజ్ఞానం అన్ని కోణాలలో సమంగా అభివృద్ధి కానందున యిట్లా జరిగింది. పదార్థం, మనస్సుకు సంబంధించిన ఈ వైవిధ్యం, స్పినోజా ఏకత్వ విధానంలో తుదకు పరిష్కారమైంది. అయితే అధిభౌతిక వివేచన వాదంతోనే యిది జరిగింది.

వివేచన యింకా మానవతలోకి రాలేదు. మానవుడి అవగాహనకు అందుబాటులో వుండే భౌతిక విజ్ఞానంలోకి వివేచనను యింకా స్వీకరించలేదు. హార్టేలే(1), ఎరాస్మస్ డార్విన్(2), డిట్రేసీ(3), కాబినిస్(4) జీవ, పదార్థ పరిశీలనలు చేసి రాబట్టిన మనో విజ్ఞాన సిద్ధాంతాల వలన ఆధునిక తత్వం యీ సమస్యను మళ్ళీ పరిష్కరించ బూనింది. అలౌకికవాదం నుంచి, మత జ్ఞాన నిరంకుశత్వం నుంచి ఆధునికత్వం బయటపడినప్పటికీ, యింకా ఒక చిక్కు విడనేలేదు. దేవుడి స్థానంలో ప్రకృతి వచ్చి, ప్రకృతి నియమం మానవుడి స్వేచ్ఛను పోగొట్టిందనే లోపాన్ని తొలగించింది. స్పినోజా వివేచనావాదంలో గణితపద్ధతి (నిగమనపద్ధతి) మానవుడిని,

---

1) 1705-57 ఇంగ్లీషు తత్వవేత్త, పదార్త విజ్ఞాని.

2) 1731-1802 ఇంగ్లీషు ప్రకృతి శాస్త్రజ్ఞుడు, కవి,

3) ఫ్రెంచి విజ్ఞాని, మనో విజ్ఞానాన్ని యాంత్రిక సూత్రాలకు అన్వయించాడు.

4) 1757- 1808 ఫ్రెంచి భౌతిక శాస్త్రజ్ఞుడు.

అతని మనస్సుతో సహా, సిద్ధాంతరీత్యా, ప్రకృతి ఏకీకరణ విధానంలో యిమిడ్చింది. అతని ఏకత్వ విధానంలో. ప్రకృతి నియమానికి మానవేచ్ఛకు గల విరుద్ధత్వం అదృశ్యమైంది. రెండింటికీ మూలాధారం ఒకటే గనక చిక్కు తొలగింది.

అతి త్వరలోనే ప్రకృతిలో మానవుడి సంబంధం మనో విజ్ఞాన పరిశీలనల ఆధారంగా ప్రాపంచిక అనుభవంతో రుజువు చేశారు. శారీరక పరిశోధనలు కూడా యిందుకు ఉపకరించినవి. మానవుడు ప్రకృతిలో భాగం గనక అతడు తన యిచ్ఛను స్వేచ్ఛగా ఉపయోగించుకోవడమనేది ప్రకృతి నియమంలో భాగంగా పరిగణించారు. వివేచనకూ యిచ్ఛకూ విరుద్ధత్వం లేదు. వివేచనాత్మక అధిభౌతికవాదం, యాంత్రిక విశ్వసిద్ధాంతం కలిపి ఏకత్వ తాత్విక విధానంగా రూపొందించవచ్చు. ప్రకృతిలో వివేచన మానవుడిలోనూ వివేచనగా కొనసాగుతున్నది. ఇది ప్రకృతి నియమం. ఇందులో అధిభౌతిక అలౌకికత్వ భావన ఏదీలేదు. భౌతిక విధానం నిర్ధారితమైందని అనుభవరీత్యా చూపడమే కనపడుతిందక్కడ. ఆవశ్యకతకు, స్వేచ్ఛాపిపాసకు ఒడంబడిక కుదిరిందన్నమాట. జీవ ప్రపంచంలో స్వేచ్ఛాపిపాస అనేది ఒక విశిష్ట ప్రకృతి నియమం. అజ్ఞానం అనే తొలిపాపం, మధ్యయుగాలలోని మూఢవిశ్వాసం పోయి, మానవ స్వభావంలోని వివేచన కాస్తా ఉద్వేగంలో తేలింది. తనలోతాను నమ్మకం చూపటం, మానవుడి అనంత సృజన శక్తులలో విశ్వాసం ఉండడం అన్నమాట.

ద్వంద దోషంతో సహా, కార్టీసియన్ తత్వంలో ఎన్ని లోపాలున్నప్పటికీ, మానవుడి ఆలోచన ఆచరణలో స్వేచ్ఛ వైపుకే అది సాగింది. అందువలన ఆధునిక తత్వశాస్త్రం పితామహుడుగా డేకార్ట్ చరిత్ర ప్రసిద్ధి గాంచాడు. పునర్వికాసంలో సహజ మానవతా సిద్ధాంతం చూపిన కొత్త దారులకు ఇతని తత్వంలో పరిపక్వత వచ్చింది. "సాధారణంగా రెనెడెకార్టెను ఆధునిక తత్వ శాస్త్రానికి పితామహుడంటారు. అది సరైనదే. నూతన పదార్థ, ఖగోళశాస్త్రాల వలన ప్రభావితుడై, ఉన్నత తాత్విక దృష్టిగల తొలివ్యక్తి అతడు. పాండిత్యవాదంలో చాలా భాగం అతడు అట్టిపెట్టడం వాస్తవమేగాని, తన ముందు వారు వేసిన ప్రాతిపదికలను అతడు ఆమోదించలేదు. తాత్విక సౌధాలను పూర్తిగా తానే నిర్మించ యత్నించాడు. అరిస్టోటల్ తరవాత యిలా జరగలేదు. విజ్ఞానాభివృద్ధి వలన వచ్చిన ఆత్మవిశ్వాస ఫలితమిది. ప్లేటో అనంతరం మరే తత్వవేత్తలోనూ కనిపించని కొత్తధోరణి ఇతనిలో ఉన్నది."

"ఆధునిక భావాలకు ప్రతినిధిగా" డేకార్ట్‌ను చిత్రిస్తారు. పునర్వికాసం, సంస్కరణవాదాల నుంచి అతడు ఆవిర్భవించాడు. ఎరాస్మస్, బేకన్, లూథర్ వంటి విభిన్నతత్వాలు గల వ్యక్తిత్వాల ధోరణులు డేకార్ట్‌లో కలిసి, కనిపిస్తాయి." డేకార్ట్ చారిత్రక సంపద, సాంస్కృతిక ప్రాతిపదికను అంచనా వేయడంలో, అంతకు

ముందున్న ఆలోచనా స్రవంతులను సరిగా అవగాహన చేసుకోకపోవడం వలన, దోషాలు దొర్లాయి. ఎరాస్మస్, లూథర్ ఉమ్మడిగా సంప్రదాయాలను సృష్టించలేదు గనక వాటిని డేకార్ట్ పుణికిపుచ్చుకునే సమస్యే లేదు. వారిరువురిలో ఎవరికీ అతడు వారసుడు కాలేదు కూడా. అయినా మతేతరంగా డేకార్ట్, ఆధునిక తత్వశాస్త్రానికి పితామహుడయ్యాడు.

ఆధునిక భావ ధోరణికి డేకార్ట్ ప్రతీక. గతంలోని దోషపూరిత భావనలతో ఇతడు పూర్తిగా తెగతెంపులు చేసుకున్నాడు.(1) కాని అతడు గుర్తించిన దానికంటె చాలా దూరం భవిష్యత్తులోకి చొచ్చుకుపోయాడు. ఈనాటికీ సంప్రదాయబద్ధంగా భాష్యం చెప్పే వారికి అతడు అందకుండా పోయాడు.

తత్వం విశ్వ విజ్ఞానంగా డేకార్ట్ భావించాడు. విజ్ఞానానికి పునాది పదార్థ విజ్ఞానం- అతని దృష్టిలో పదార్థ విజ్ఞానాన్ని గణితంలో సమన్వయించి, పదార్థ విజ్ఞానాన్ని శారీరక శాస్త్రానికి అన్వయించాడు. ప్రకృతిలో మానవుడి సంబంధం గురించిన సమస్యకు, మానవుడు తనను తాను తెలుసుకునే దానికి ఈ ధోరణి చాలా ఉపయుక్తమైనది. డేకార్ట్ వివేచనాత్మక అధిభౌతిక ఊహలలో పూర్వీకులను మించి పోలేకపోయాడు. కాని, విజ్ఞాన దృక్పథంలో, ధైర్యంగా మానవుడు ప్రకృతిలో అంతర్భాగమన్నాడు. మానవుడి ఉనికి, చైతన్యతకు సంబంధించిన జ్ఞానం ఆ విధంగానే పొందగలడన్నాడు. భౌతిక ప్రపంచనియమాలు- నిర్జీవ ప్రపంచానికి చెందినవి- జీవకోటికి అన్వయించగలిగితే, జీవ అజీవ పదార్థాల మధ్య అఖాతం ఉండదు. కార్టీసియన్ మనోవిజ్ఞాన-భౌతిక సమాంతర వాదం ఎట్లా వచ్చిందంటే, "వివేచన పూరిత ఆత్మ"ను నిరంకుశంగా మానవుడి యాంత్రిక విధానంపై అంటగట్టడం వలననే. ఆ మేరకు పాండిత్యవాద భూతం ఇంకా ఆధునిక తత్వశాస్త్ర పితామహుడిని వెంటాడుతూనే ఉన్నది. అయినా, అరిస్టోటిల్ సహజవాదం కంటె కార్టీసియన్ తత్వంలో ఆత్మ మరీ పదార్థరహితం కాదు. వివేచనాత్మకమనే విశేషణం ఇక్కడ చాలా ప్రధానం. అయినప్పటికీ, వివేచనకు మార్మిక ముసుగు ఉన్నంతవరకూ అస్పష్టత పోలేదన్నమాటే. ఆ విషయంలోనూ, ముసుగులోకి దూసుకపోయే భావకిరణాలు డేకార్ట్‌లో ఉన్నవి.

కార్టీసియన్ పద్ధతిలో ప్రకృతి నియమంలోని నైరూప్యం, భౌతిక ప్రపంచ

---

1) నా యౌవనదశలో చాలా తప్పుడు భావాలను సరైనవిగా అంగీకరించానని తెలుసుకొని చాలాకాలం గడిచింది. ఆ సూత్రాలపై ఆధారపడి చెప్పినవి సందేహాస్పదాలు. అప్పటినుంచి నేను అనుసరించిన అభిప్రాయాలన్నిటినీ వదులుకోవాల్సిన అవసరం ఉన్నదని భావించాను. పునాదుల నుంచి మళ్ళీ మొదలెత్తుకోవాలనుకున్నాను.(మెడిటేషన్స్‌లో)

సంబంధాల పొందిక, వ్యక్తీకరణగా మూర్తిత్వాన్ని పొందాయి. అధిభౌతిక భావంగా వున్న వివేచనకు మానవత సమకూడింది. వివేచనాత్మక అధిభౌతికం, భౌతికంగా నిర్ధారణ అయిన సహజవాదం సమన్వయించి, డేకార్ట్ కొత్త తత్వం ఆవిర్భవించడానికి ప్రాతిపదికలు వేశాడు. ఆలోచనా పరిణామంలో ఇదొక గంతు. దీనితో మానవుడి దృష్టి మారింది. ప్రపంచం విశ్వక్రమం. దేవుడు ఏదో ప్రయోజనం కోసం, మనకు తెలియని విధంగా సృష్టించినది కాదు. ప్రకృతి పనిచేసే తీరు తెలుసుకునే శక్తి మానవుడికి ఉన్నది. అతను వివేచనాత్ముడు. ప్రకృతితో తన సంబంధం గ్రహిస్తాడు. క్రమంగా ప్రకృతిని గురించిన జ్ఞానం వృద్ధి అవుతుంటే, తన ఇచ్ఛకు అనుకూలంగా ప్రపంచాన్ని మార్చుకుంటాడు. తన విధిని తన హస్తగతం చేసుకుంటాడు(1) జీవితం పట్ల యిది ఉద్వేగ దృక్పథం. మార్పులో మానవుడు భాగం. ప్రకృతి స్వయం సంపూర్ణతగల, స్వయం పాలనగల విధానం. అందులో మానవుడు కేంద్రస్థానంలో ఉంటూ, కొత్త ప్రపంచాలను సృష్టిస్తూ ఉంటాడు. ప్రకృతిలో లభించే వాటి ఆధారంగా సామాజిక భావరంగాలలో ఈ కొత్త ప్రపంచాలు ఉంటాయి. ఇది ఉద్వేగవాదం. ఇందులో మార్మికం లేదు. కలలు లేవు. వైజ్ఞానిక దృక్పథంలో ఇది సహజస్థితి.

తత్వాన్ని విశ్వవిజ్ఞానంగా రూపొందించడానికి, తన కాలానికి వున్న విజ్ఞానభావాన్ని విప్లవాత్మకం చేయవలసి వచ్చింది డేకార్ట్. అప్పటికి విజ్ఞానం తత్వంతో తాదాత్మ్యం పొందేటంతగా అభివృద్ధి కాలేదు. ప్రాపంచిక అనుభవ ప్రతిపాదనల నుంచి గణితరూపంలో రాబట్టే విధంగా నైరూప్య సిద్ధాంతంగానూ, విజ్ఞానం వికసించలేదు. ప్రకృతిలోని భిన్న దృక్పథాలకు సంబంధించిన జ్ఞానాన్ని అనుభవం ద్వారా సంపాదించడం, పరిశీలన పరిశోధన పద్ధతులతో, ఆధునికుడు ఓపికగా చేయవలసి వచ్చింది. కనక డేకార్ట్ కృషికి పరిపక్వదశ రాలేదు. ప్రపంచ అనుభవం కంటె గణితబద్ధమైన వివేచన మంచిదనుకున్నాడు(2) ఇతని పద్ధతి బాహ్యాజ్ఞానానికి, తాత్విక ప్రాధాన్యం గల సిద్ధాంత ప్రాతిపదికలను, నమ్మదగిన గట్టి పునాదికి అవసరమైనదే. ఉత్తేజపూరితమైన తన స్వప్నాన్ని డేకార్ట్ తొందరపడి మానవుడి మేధస్సుకు అందించాడు. విజ్ఞానాన్ని అతడొక చెట్టుకు పోల్చాడు. అధిభౌతికం వేరుగానూ, పదార్థ జ్ఞానం బోదెగానూ, యాంత్రీకరణ, వైద్యం, నీతి ముఖ్యమైన కొమ్మలుగానూ, పోల్చాడు. మానవుడి శరీరం, ప్రవర్తన, ప్రకృతికి సంబంధించిన

---

1) ఆధునిక తత్వానికి సహనిర్మాత, ఫ్రాన్సిస్ బేకన్, తొలిసారి, 'జ్ఞానమే శక్తి' అని ప్రయోగించాడు.

2) పరిశీలన, పరిశోధన పద్ధతులను డేకార్ట్ పూర్తిగా విస్మరించలేదు. ఊహ, జ్ఞాపకం, భౌతిక విధానాలని రుజువు పరచడానికి శరీర నిర్మాణం పైనా, వక్రీభవం పైనా కష్టించి కృషి చేశాడు. తాను శస్త్రంతో కోసిన జంతువుల తలలు చూపి, అవి పుస్తకాలకంటె ముఖ్యమని వచ్చిన వారికి చెబుతుండేవాడు.

మానవుడి జ్ఞానాన్ని అట్లా డేకార్ట్ అన్వయించాడు.

డేకార్ట్ మూడు ప్రధాన గ్రంథాలలో, విజ్ఞాన భావాలు గల ది ప్రిన్సిపిల్స్ ఆఫ్ ఫిలాసఫీ చివర వెలువడింది. అయితే ముందు వ్రాసింది అదే. డిస్కోర్స్, మెడిటేషన్స్ ప్రచురించక ముందే, 1637లో స్థూలంగా, ఈ గ్రంథ విషయాలను ప్రచురించాడు. "ప్రపంచం మానవుడి గురించి తగిన భావాలకు బీజాలు నాటవచ్చునని తలచి, సాధారణ విషయాల పేరిట, ఈ పరిశీలనలు వెలువరించాడు. "ఫిలాసాఫికల్ ఎస్సేస్" అనే శీర్షికన రచయిత పేరులేకుండా ఇది ప్రచురించాడు. ఉప శీర్షికలో విషయాన్ని సూచించాడు. "అత్యున్నత పూర్ణదశకు మన అవగాహన తీసుకెళ్ళే విశ్వ విజ్ఞానపథకం, విశ్వవిజ్ఞాన నిరూపణకు రచయిత నిర్ణయించిన రుజువులు, చదువుకోని వ్యక్తి కూడా అవగాహన చేసుకునే రీతిలో రాయడమైంది."

ప్రజాస్వామిక యుగంలో, విజ్ఞానం తత్వాలను కూడా ప్రజాస్వామికీకరణ చేయడమనేది ఆధునీకరణలో ఇమిడి వున్నది.(1) తరువాత విజ్ఞానం అపారంగా విస్తరించినందున, డేకార్ట్ ప్రజాస్వామిక పథకాన్ని విస్మరించారు. అనుభవం ఆధారంగా పరిశోధన, సిద్ధాంతాల విపులీకరణ వలన, తప్పనిసరిగా విశేష నైపుణ్యం పెరిగిపోగా, సాధారణ వ్యక్తులు విజ్ఞానంలో భాగం పంచుకోలేక పోయారు. తాత్వికీకరణగూడా కొందరు మేధావులకే పరిమితమైంది. డేకార్ట్ అభిలషించినదానికి భిన్నంగా, కొంతమేరకు, ప్రత్యేక నైపుణ్యం తప్పదు కూడా. అయినప్పటికీ,వికాస యుగాలలో, విజ్ఞానసాధనలో శాస్త్రజ్ఞులు, తత్వవేత్తలు తలచుకుంటే, మేధావి రంగాన్ని ప్రజాస్వామికీకరణ చేసి, డేకార్ట్ కోరిక సాధించడం కష్టమయ్యేదికాదు. విజ్ఞానం, తాత్వికచింతన ప్రచారంలోకి వచ్చి ప్రజాస్వామ్యం వాస్తవికం అయ్యేదే. అన్నివిధాలా సాంఘికాభివృద్ధి సాధించడానికి, డేకార్ట్ అభిలాష ఇంకా అమలు పరచవలసివున్నది. జ్ఞానాన్ని, వివేచనను ప్రజాస్వామికీకరణ చేస్తే తప్ప, ప్రజాస్వామ్యం సాధ్యంకాదు.

పాండిత్యానికి భిన్నంగా ప్రజ్ఞ ఎలా సాధ్యం? అనే ప్రశ్నకు డేకార్ట్ పద్ధతి సమాధానమిస్తుంది. పాండిత్య భేషజాన్ని ఎదుర్కొనడానికి అతడు నిరంతరం కృషిచేశాడు. "మానవుడి జ్ఞానం అంటే ఏమిటి, అదెంతవరకు విస్తరించగలదు అనేది తెలిసికొనడం కన్నా మించినది లేదు. ముందు ప్రజ్ఞ అంటే ఏమిటో తెలియాలి

---

1) డేకార్ట్ రచనలో గల అపార విలువ అలావుంచి, అంతకుముందు ఏ రచయితా చేయనంతగా, తత్వాన్ని పాండిత్య శైలి నుంచి ఎడబాటు గావించి, సాధారణ వ్యక్తుల వివేచనకు ఆకర్షణగా ఉండేటట్లు చేశాడు. తత్వంలో ప్రజాస్వామిక స్వభావాన్ని ఏ రచయితా చేయనంతగా ఇతడు ప్రవేశపెట్టడం, ఇతని ప్రతిభా వ్యుత్పన్నతలలో తక్కువేమీ కాదు. డబ్ల్యు. ఇ. ఆర్. లెకీ, ది రైజ్ ఆఫ్ రేషనలిజం ఇన్ యూరోప్.

2) డిస్కోర్స్

ఇతర విషయాలకు సంబంధించిన జ్ఞానమంతా దీనిపై ఆధారపడింది."(2) ఊహ, జ్ఞాపకం అనేవి జ్ఞానానికి ఇతర ఆధారాలు. ఇంద్రియ జ్ఞానమే జ్ఞాపకం అని డేకార్ట్ తరచూ తాదాత్మ్యం చేసి చెబుతుండేవాడు. కాని వీటి ఆధారంగా సేకరించిన జ్ఞానం స్పష్టంగాదు. పూర్తిగానూ ఉండదు. పొందికగానూ లభించదు. కనక పక్కదారులు పట్టించే అవకాశం వుంది. వీటి వలన వచ్చిన సమాచారాన్ని ప్రజ్ఞ పరీక్షకు పెట్టాలి. సత్యానికి దోషానికి తేడా చూడగలిగింది ప్రజ్ఞ లేదా మేధ మాత్రమే. కార్టీసియన్ ప్రజ్ఞ అంటే వివేచన మాత్రమే.

సంప్రదాయం, పెత్తందారీతనం వల్ల స్థంభించిపోయిన బంధం నుంచి మానవుడి ప్రజ్ఞ విముక్తి పొందాలంటే డేకార్ట్ చూపిన అతి సందేహవాదం చాలా ఉపయోగకారి. నేను ఆలోచిస్తున్నాను కనక నేను ఉన్నాను అనే దోషపూరిత సూత్రం వ్యక్తిపరమైన ఆదర్శవాదానికి దారితీసి, మానవుడి దృష్టిని మరుగున పరచింది. ఆధునిక తత్వం పుడుతుండగా ఇట్లా జరిగింది. దీనివలన బర్కిలీ వంటివారు మతాన్ని తిరగదోడడానికి మనో వైజ్ఞానిక వాతావరణం సృష్టించింది. ఇందుమూలంగా చాలాకాలం తత్వం గందరగోళంలో పడింది. అదింకా వెన్నాడుతూనే వున్నది. నేటికీ మబ్బులు కమ్ముకొని, మానవుడి సృజనకు, స్వేచ్ఛకు అడ్డు వస్తున్నది గనక ఇది తొలగించాలి. భవిష్యత్తును ఆవరించనున్న చీకట్లను చీల్చడానికి కూడా ఇది అవసరం.

నేను ఆలోచిస్తున్నాను కనక నేను ఉన్నాను అనే సూత్రం మానవతా సూత్రంగానూ వ్యాఖ్యానించవచ్చు. మానవ వివేచనకు, నిర్ణయానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ఈ సూత్రం మానవుడిని ప్రపంచానికి కేంద్రస్థానంలో అట్టి పెడుతున్నది. మానవుడు తనపై తాను ఆధారపడేటట్లు చేస్తున్నది. తనలోని మార్పులను తానే అదుపులో పెట్టడానికి, మలచుకోవడానికి శక్తినిస్తున్నది. తన విధికి తానే యజమాని అవుతున్నాడు మానవుడు. కార్టీసియన్ వివేచనావాదాన్ని వెనువెంటనే వచ్చిన స్పినోజా, ఫ్రెంచ్ విజ్ఞాన సర్వస్వకారులు, తరవాత వచ్చిన తత్వవేత్తలు ఇంకా అభివృద్ధి చేశారు.

విశ్లేషణాత్మక రేఖాగణితం, పరిభ్రమణ సిద్ధాంతం ద్వారా డేకార్ట్, యాంత్రిక విశ్వసిద్ధాంతాన్ని ధ్రువపరిచాడు. దూరాన చర్య సంభవమనే దోషపూరిత ప్రతిపాదనను ఇది తృణీకరిస్తుంది. ప్రాచీన అణువాదంలో కూడా అకతాయితనంగా ఈ సమస్య పరిష్కరించబడింది. కార్టీసియన్ పదార్థ విజ్ఞాన తాత్విక ఫలితాలు చాలా దూరం తీసుకుపోతుండగా, విజ్ఞాన పరిశోధనలో సైతం చాలా అవకాశాలకు ఇది అవకాశాన్నిచ్చింది. బహుశ డేకార్ట్ కూడా గుర్తించని 20వ శతాబ్దపు పదార్థ విజ్ఞాన విషయాలను అది ఊహించింది. ప్రదేశం భిన్న కోణాలతో ఉంటుందని,

సర్వాంతర్యామిగా ద్రవ్యం ఉంటుందని చెప్పింది. పొడవు, వెడల్పు, లోతు వలె, బరువు, త్వరణం(వేగం+ దిక్కు) కూడా పదార్థపు పరిమితులేనని డేకార్ట్ భావించాడు. "కేవలం కొలతకు అక్కర వచ్చేదే పరిమితి కాదు. పొడవు, వెడల్పు, లోతు మాత్రమేగాక, బరువు కూడా పరిమితే. ఒక వస్తువును అంచనా వేయడంలో బరువు చూస్తాం. అట్లాగే చలనంలో వేగం దిక్కు కలిపిన త్వరణం ఒక పరిమితే. ఇట్లాంటి ఉదాహరణలు అనంతంగా వున్నవి."(1)

కార్టీసియస్ విశ్లేషణాత్మక రేఖాగణితం, యాక్లిడ్ చెప్పని ప్రదేశాన్ని, చలనపు సాపేక్షికతను గుర్తించింది. "చలనం అంటే ఒక వస్తువు ఒక చోటనుంచి మరొక చోటుకు కదలడం అనే హీనభావాన్ని " డేకార్ట్ తృణీకరించాడు. "చలనం అంటే ఒక పదార్థభాగం లేదా ఒక వస్తువు ఒక పరిధి నుంచి, దానితో తక్షణ సంబంధం గల వాటి పరిధి- అవి స్థిరంగా వున్నాయని మనం అనుకుంటాం-లోకి పోవడం" అని డేకార్ట్ నిర్వచించాడు.

ఐన్‌స్టీన్ సాపేక్షతా సూత్రాలలోని పదార్థం గురించి ఇక్కడ నిర్వచనం బీజప్రాయంగా వున్నది. డేకార్ట్ ఇంకా ముందుకుపోయి, పదార్థ జ్ఞానానికి స్థిరమైన చోటు ఉండటం తప్పనిసరి అనే భావాన్ని నిరాకరించాడు. ఒక బిందువు స్థిరంగా ఉండటమంటే, తత్తుల్యమైన మరొకదానితో సాపేక్షికంగా మాత్రమే అలా చెప్పగలం. చలనం, ప్రదేశం బదులు కాలం, ఆకాశం అని చేర్చితే, మన కాలానికి డేకార్ట్ రేఖాగణితం, పదార్థ విజ్ఞాన భావాలు ఎంత సమీపంగా ఉన్నాయో గ్రహించగలం. "టైకొకంటె వాస్తవంగానూ, కోపర్నికస్ కంటె జాగ్రత్తగానూ భూమి చలనాన్ని నేను నిరాకరిస్తాను" అని డేకార్ట్ ప్రకటించాడు.(2) ఐన్‌స్టీన్‌తో అంగీకరిస్తున్న డేకార్ట్, ఆధునిక పదార్థ విజ్ఞానంతో, ఖగోళ శాస్త్రజ్ఞులతో భేదించాడు. మతాధికారుల కబంధ హస్తాలను తప్పించుకోడానికి కూడా అతడు నర్మగర్భితంగా ప్రకటించి ఉంటాడు. అయినా అందులో చాలా సత్యం ఉన్నది. 20వ శతాబ్దారంభం వరకూ ఇది గ్రహించనేలేదు. ఇతర వస్తువులతో సాపేక్షికంగా తప్ప, ఏ వస్తువూ స్థిరంగా లేదు. సూర్యునితో పోల్చి చూస్తే భూమి కదులుతున్నది. కాని భూమి చుట్టూ వున్న వస్తువులతో పోల్చిచూస్తే, భూమి స్థిరంగా ఉన్నట్లుంటుంది.

డేకార్ట్ "ప్రథమ పదార్థం" సర్వాంతర్యామి. అంటే ఈథర్ వలెనన్నమాట. గలీలియో పేర్కొన్న "శక్తి" "ఆకర్షణ" కెప్లర్ "చైతన్యశక్తి" వంటి అధిభౌతిక భావాలతో నిమిత్తం లేకుండా ఇతడు తన సిద్ధాంతాన్ని పెంపొందించాడు. సాపేక్షతా చలనం

1) ప్రిన్సిపల్స్ ఆఫ్ ఫిలాసఫీ

2) ప్రిన్సిపల్స్

నుంచి వచ్చే అనుభవం నుంచి ఈ భావన జనించింది.

అణువాదాన్ని తృణీకరించిన డేకార్ట్, ప్రదేశమంతా పూర్తిగా నిండివున్నట్లు భావించాడు. దూరాన చర్య సంభవం అనే దోషపూరిత భావనకు ఆయన ఇది పరిష్కారమార్గంగా సూచించాడు. ప్రదేశం(ఆకాశం) పరమార్థ విషయంగా సంప్రదాయం ఊహించింది. అది ఇక్కడ అదృశ్యమైంది. భౌతిక ప్రదేశం, విశ్లేషణాత్మక రేఖాగణిత ప్రదేశం-సర్వాంతర్యామి అయిన "ప్రథమ పదార్థం"తో సమానమవుతుంది. ఇది కొలవడానికి వీలైనట్టిదే. ఖాళీ ప్రదేశం అనే భావాన్ని డేకార్ట్ నిరాకరించాడు. ద్రవ్యం విస్తరిస్తుంది. విస్తరణ ఉన్నచోట ద్రవ్యం (పదార్థం) ఉన్నది. ధైర్యంగా ఆలోచించడం వల్ల ఒక్క దెబ్బతో దూరాన చర్య అనే సమస్యను పరిష్కరించాడు.

ప్రదేశాన్ని ఆవరించిన పదార్థమంతా భిన్నకోణాకార అణువుల సమేతంగా ఉన్నది. పదార్థ ద్రవ్యరాశి చలనంలో వున్నది. భిన్న కోణాకార అణువులు, గోళాకారంలో భూమిపైకి వస్తాయి. ఈ విధానంలో జరిగే రాపిడి వల్ల సూక్ష్మపదార్థం ఏర్పడుతుంది. ఇందులో మొదటి రకపు పదార్థం సూర్యుడు, నక్షత్రాల వంటి కాంతి వంతమైనవిగా మారతాయి. మూడో విధమైన స్థూలపదార్థం, చలనంలో అంతగా ఇమడదు. భూమి, గోళాలవంటి కాంతి రహిత పదార్థాలుగా ఈ పదార్థం రూపొందుతుంది. ఆకాశంలో పారదర్శకంగా ఉండే పదార్థం రెండో రకానికి చెందినది. పదార్థ చలనం సుడివలె ఉంటుంది. డేకార్ట్ పరిభ్రమణ సిద్ధాంతం అట్లా జనించింది. స్థూలపదార్థం పరిభ్రమణలో కేంద్రస్థానానికి చేరుకోగా, మిగిలిన సూక్ష్మపదార్థం చుట్టూ ఉంటుంది. కేంద్రం నుంచి చలనం కాంతి వెదజల్లుతూ వస్తుంది. సూర్యుడి చుట్టూ గోళాలు సుడి తిరుగుతూ ఉంటాయి.

అణువాదం బదులు, యాంత్రిక సిద్ధాంతంలో డేకార్ట్ పరిభ్రమణ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు. అమాయకంగా, తాత్కాలికంగా చేసిన డేకార్ట్ ఊహలు ప్రధానమైన ఫలితాలకు దారితీసేవిగా తయారైనాయి. ఉదాహరణకు పరిభ్రమణ ఏర్పడటం, ఆదిమ దశలో ద్రవ్యం భిన్నదశలుగా రూపొందడం అనే సిద్ధాంతం, నూతన తేజం కణ సిద్ధాంతంలోని "తరంగ సముదాయాన్ని" పోలివున్నది. ఇది చలన ప్రకంపనం క్షేత్రంలో దట్టమైన తరంగాల వలె కనిపించే ఎలక్ట్రాన్‌లన్నమాట. సర్వాంతర్యామి అయిన పదార్థం స్వయం చలనం గలది గనక బయట నుంచి తొలుత కదిలించే శక్తిని ఊహించనవసరం లేకపోయింది. అణువాదంలో స్పష్టంగా వున్న దోషాలన్నీ సర్వాంతర్యామి అయిన పదార్థంలో తొలగిపోయాయి. అణువాదంలో అనంతభావం అంగీకరిస్తే తెలియనిది, తెలుసుకోలేనిది వున్నదని ఒప్పుకోవడమన్నమాట. విశ్వసిద్ధాంతంలో ఈ విధంగానే మార్మికవాదం ప్రవేశించింది. సహజతత్వం

మార్మికమై, అధిభౌతికంగా మారుతుంది. ఒక్కొక్కసారి మతపరమౌతుంది. స్వయంగా చలనం ఉండి, సర్వాంతర్యామి అయిన పదార్థం, అనంతంగా విస్తరించగలదు. దీనిని కదలించడానికి బయటశక్తిగాని, ప్రేరణగాని అవసరం లేదు.

కనక తుది కారణంగా దేవుడిని డేకార్ట్ పేర్కొనడం కేవలం ధర్మపరాయణతే, న్యూటన్ సూచించిన సమస్యలు పరిష్కరించే దైవం ఎంత అవసరమో, డేకార్ట్ దేవుడు కూడా అతని పదార్థ విజ్ఞాన సిద్ధాంత తర్కంలో అసలే ఇమడడు. "యాంత్రిక నియమం వలన వస్తువులు, అణువులు వాటి వాహకం వలన చలిస్తుంటాయని డేకార్ట్ వివరించాడు. వస్తువులన్నీ ఒక విధమైన చలనానికి గురౌతవి. జీవ, నిర్జీవ పదార్థం అనే భేదం లేకుండా, వాహక చలనం వలన అన్ని వస్తువులు కదులుతవి. దీనివలన ప్రకృతికి మార్మికమైన వివరణలేదు."(1)

ఆచరణలో తన విశ్వసిద్ధాంత ప్రతిపాదన ఆమోదం పొందగలదని డేకార్ట్‌కు తెలిసినప్పటికీ, ప్రాపంచిక అనుభవంలో అపనమ్మకం వలన, అధిభౌతిక సమస్యలకు వివేచనాత్మక పరిష్కారాలు వుండాలని అతను భావించాడు. అక్కడకూడా, పాండిత్య వాదంలో తన పూర్వీకులనే డేకార్ట్ అనుసరించాడు. పాండిత్య వాదాన్ని ఎదుర్కొనాలని డేకార్ట్ తలపోసి, పాండిత్యంతోనే ఈపని చేయాలని ఎత్తుగడ వేశాడు. ఇదంతా ఆచరణాత్మక ఆలోచన కాదు. ప్రాయికంగా వివేచనా పరుడైన డేకార్ట్, తన కొత్త తత్వం కట్టుదిట్టమైన అధిభౌతిక ప్రాతిపదికపై ఉండాలనుకున్నాడు. అధిభౌతిక వివేచనావాద దోషం ఏమిటో అతని ప్రయత్నంలో బయటపడింది. భౌతికవాద తత్వాన్ని రూపొందించాలని అతను ఉపక్రమించాడు. మనస్సుకు ప్రాధాన్యత ఇచ్చి కూడా, దానిని శరీరంలో మిళితం చేశాడు.(2) "విస్తరణలోగాని, పరిమితిలోగాని మనస్సుకు ప్రాధాన్యత లేదు. అది చోటు ఆక్రమించదు. అయినా అది దేహమంతా జతగూడి ఉన్నది. దేహంలో ఏ ఒక్క భాగంలోనూ మనస్సు ఉన్నట్లు చెప్పజాలం. జంతు ప్రేరణలు, నరాలు, రక్తం ద్వారా మనస్సు శరీరంలో ప్రకాశిస్తుంది."(3) భౌతికవాద తత్వం అంత స్పష్టంగా చెప్పిన డేకార్ట్, తుదకు దేవుడికి మొరబెట్టుకోవడం అతని కాలానికి తగనిదే. అతని వ్యక్తిగత నమ్మకాలకు యిచ్చిన ప్రాధాన్యత అని చెప్పుకోవచ్చునేమో. డేకార్ట్‌లోని ఈ బలహీన ధోరణిని, పాండిత్యవాదులైన అతని శిష్యులు, ముఖ్యంగా మాల్‌బ్రాన్ష(4) ఆధునిక భావవాదానికి నాందిగా స్వీకరించాడు.

మతానికి బలిగాదలచని డేకార్ట్, విజ్ఞానభావాలు గల తన గ్రంథ ప్రచురణను

---

1) ఎ.లాంజ్, హిస్టరీ ఆఫ్ మెటీరియలిజం

2) అయిష్టంగా మనస్సుకు ఇచ్చిన స్థానం చాలా స్వల్పం గావడమనేది ఉత్తరోత్తరా పెంపొందిన తత్వం, విజ్ఞానాల దృష్ట్యా చాలా ముఖ్యం. ఇ.ఎ.బర్ట్, ది మెటఫిజికల్ ఫౌండేషన్స్ ఆఫ్ మోడ్రన్‌సైన్స్

3) ప్రిన్సిపల్స్, 4)1638-1715 ఫ్రెంచి తత్వవేత్త.

ఆపాదనుకోవలసి వస్తున్నది. అనవసరమైనవి, అసంబద్ధవిషయాలు తన తత్వంలో చేర్చడం వలన, డేకార్ట్ విధానంలో పొందిక, సమన్వయం దెబ్బతిన్నవి. విజ్ఞానిగా ప్రారంభించిన డేకార్ట్, తన పూర్వీకుల కృషిని పూర్తిచేశాడు. తార్కికంగా యాంత్రికమైన విశ్వసిద్ధాంతాన్ని నిర్మించాడు. కుంగిపోతున్న మతానికి యిది సరైన సమాధానం. ది వరల్డ్ అనే తొలి ప్రధాన గ్రంథంలో అతని వైజ్ఞానిక భావాలున్నాయి. గలీలియో విషాదాంత గాథ తెలిసేసరికి, తన గ్రంథప్రచురణను డేకార్ట్ ఆపాడు. పారిస్‌లో తన గ్రంథప్రచురణకు ఏర్పాట్లు చేస్తున్న మార్సెన్‌కు వ్రాసిన లేఖవలన ఈ విషయం తెలుస్తున్నది. డేకార్ట్ మరణానంతరం తొలిగ్రంథంలోని కొన్ని భాగాలు ప్రచురితమయ్యాయి. “మానవుడు-ఒక యంత్రం” అనే శీర్షికన డలమిత్రి వ్రాసిన పుస్తకం వలన గాని డేకార్ట్ భావాల ప్రాధాన్యత పూర్తిగా బయటపడలేదు. డలమిత్రి తన గురువుకు ఋణపడినట్లు యధేచ్ఛగా పేర్కొన్నాడు. పదార్థవాదానికి చెందిన కార్టీసియన్‌గా, డలమిత్రి వ్యాఖ్యానిస్తూ “మత గురువుల నిమిత్తం తన సిద్ధాంతంలో ఆత్మను అతికించి, అనవసరమనిపించాడని, కపటతాత్వికుడని” అన్నాడు డేకార్ట్ గురించి.

డలమిత్రి దేవషభావాన్ని మనం అంగీకరించకపోవచ్చు. కాని డేకార్ట్ మరణానంతరం ప్రచురితమైన అతని “ప్రిన్సిపల్స్ ఆఫ్ ఫిలాసఫీ” మాత్రం వివేచనాత్మక తత్వంగా కీర్తి గడించింది. అందలి పీఠికలో జాగ్రత్తగా కొన్ని ప్రకటనలు చేశారు. ప్రపంచాన్ని పరిపక్వ దశలలో దేవుడు సృష్టించాడు. “అయినా, మొక్కలు, మనుషుల స్వభావాన్ని అవగాహన చేసుకోవాలంటే, అవి బీజప్రాయం నుంచి ఎట్లా అంచెలవారీగా పెంపొందాయో తెలుసుకోవడం ఉత్తమం. ప్రపంచం పుట్టినపుడు ఇవన్నీ దేవుడు ఎట్లా సృష్టించాడోనని భావించడం కంటె ఇది మంచిది. సాధారణ సూత్రాలతో ప్రారంభిస్తే, నక్షత్రాలు, భూమి, కనిపించేదంతా ఎట్లా ప్రారంభమైందో తెలుసుకోవచ్చు. అయితే అవి ఆవిధంగా ప్రారంభం కాలేదని మనకు తెలుసు. ఇప్పుడున్న రూపం కంటే పైవిధంగా వాటి స్వభావాన్ని బాగా అవగాహన చేసుకోవచ్చు. “ఏదో ప్రయోజనం ఉందనే అలౌకిక తుది కారణంతో విజ్ఞానానికి నిమిత్తం లేదు. అందుకే అటువంటి వృధాపూరిత, జీవరహిత పరిశోధనకు విజ్ఞానం పూనుకోదు. అయితే కేవలం ఒక సంఘటనను వర్ణిస్తే చాలదు. ప్రకృతిలో దానికి మూలకారణం తెలుసుకోవాలి. తత్వం విశ్వజనీనంగా ఉండడానికి తగిన పునాదులతో విజ్ఞానం ఉండాలి. విశ్వజనీనమైన విజ్ఞానానికి కూడా తగిన తత్వం ఉండాలి.

ప్రిన్సిపల్స్ అనే గ్రంథపీఠికలో డేకార్ట్ అతి మెలకువతో పేర్కొన్నదానికి, సరిగా వ్యతిరేకమైన ప్రకటన గ్రంథంలో ఉన్నది. “దేవుడి ఉద్దేశం తెలుసుకోవడం అసంభవం”

మరో సందర్భంలో వ్యాఖ్యానిస్తూ "పదార్థం చలనం ఇవ్వండి, విశ్వాన్ని నిర్మిస్తాను" అన్నాడు. అతని విశ్వతత్వంలో పదార్థం, చలనం ఉన్నవి. దేవుడు వాటితో ఏం చేస్తాడో, మానవుడు అదే చేయగలడు.

మనిషి కంటె శక్తివంతుడుగాని దేవుడివలన ప్రయోజనం ఏమిటి? ఏ కారణం వలన చేసినాసరేగాని, అంత మరీ నిష్ప్రయోజనమైన దేవుడిని ప్రవేశపెడితే, డేకార్ట్ తత్వం బాహ్యభౌతిక విశ్వాసానికి వివేచనాత్మక పునాదులు వేసినట్లే.

అటువంటి తత్వాన్ని ప్లేటో తొలుత ప్రయత్నించాడు. ఈలోగా పాండిత్య మత జ్ఞానం వివేచనా భావాన్ని కాజేసింది. వివేచనాత్మక అధిభౌతికం కాస్తా మత జ్ఞానాన్ని వివేచనాత్మకం గావించేదైంది. వివేచనకు పునరావాసం కల్పించవలసి వచ్చింది. మానవత సమకూర్చవలసి వచ్చింది. భౌతిక ప్రపంచానికి సంబంధించిన వివేచనాత్మక అధిభౌతిక తత్వం నిర్మించే ముందు ఈ పని జరగాలి. ప్రపంచ అనుభవరీత్యా, డేకార్ట్ కాలంలో అది సంభవం కాలేదు. కనుక, గణిత సహాయంతో సిద్ధాంతపరంగా అతడు కొంతవరకు చేయగలిగాడు. ఆ తరువాత శతాబ్దాలలో, వివేచనకు సంబంధించిన భావనలో మర్మాన్ని తొలగించడానికి విజ్ఞానం చాలా చేసింది. భౌతిక విశ్వంలో వివేచనకు తగిన స్థానం కల్పించింది. ప్రకృతిలోని వివేచన మానవుడిలోనూ వివేచనగా కొనసాగుతున్నదని కనుగొన్నారు. జీవ ప్రపంచంలోని ఉన్నతదశలో ప్రకృతి నియమం పనిచేస్తున్నది. భౌతికమైన ప్రపంచంలో మానవుడి వివేచనకు మూలం చూడవచ్చు. నేటి వైజ్ఞానిక విశ్వాసంలో ఇది సర్వసాధారణమై పోయింది. అందుకని విజ్ఞానవేత్తలలో అగ్రగామి ఒకరు ఈ విషయాన్ని అంగీకరిస్తూ ఇట్లా అన్నారు. "20వ శతాబ్దపు పదార్థ విజ్ఞాన సిద్ధాంతాలను కావాలని తాత్విక భాష్యం చేస్తూ, జ్ఞాన సిద్ధాంతంలో గందరగోళం సృష్టించే విషయమై, ఇకముందు వెలుగు ప్రసరించవచ్చు.మన వివేచన ప్రకృతిలో భాగమేగాక, ఏదో ఒక రూపేణా ప్రకృతికి వివేచనతో సంబంధం వున్నదని తెలుసుకున్నప్పుడు యీ విషయం స్పష్టపడుతుంది"(1)

మానవుడి మనోవికాసాభివృద్ధికి స్వాగతం పలికే కాలంలో డేకార్ట్ వున్నప్పటికీ ఆ కాలం సంధియుగం కూడా. కనుక, అతని తత్వంలో రెండు ధోరణులు స్పష్టంగా వున్నా, కలసిపోయాయి. 18,19 శతాబ్దాలలోని తాత్విక చరిత్రలో ఈ రెండు ధోరణులు చూచాయగా చూడవచ్చు. సహజమైన మానవతా విజ్ఞాన ధోరణి మళ్ళీ రెండు మార్గాలవలంభించింది. ఫ్రెంచి వికాసం, స్పినోజా ద్వారా హెర్డర్, గెటె,

---

1) జె. వింటర్‌నిట్జ్, ది థీరి ఆఫ్ రెలెటివిటి అండ్ ఎ పిస్టిమాలజి.

షిల్లర్‌ల జర్మనీ ఉద్వేగవాదం, రూసో ఉద్వేగవాదం, తరువాత ఫ్రెంచి విప్లవానికి ప్రేరణ కల్పించింది. అదీ కార్టీసియన్ మానవతా వివేచన ఫలితంగా జనించినదే. డేకార్ట్ తత్వంలోని అధిభౌతికత, ద్వంద విధానం, అనేక దశలలో, క్రమబద్ధంగాగాక, హెగెల్ ఏకత్వ భావవాదంతో తేలింది. డేకార్ట్ భావాలు, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆధునిక తాత్విక ధోరణులన్నిటినీ ప్రభావితం చేశాయంటే అతిశయోక్తికాదు. చివరకు మనో విజ్ఞాన-భౌతిక సమాంతరవాదం గందరగోళపరచినా, అతడు తొలుత వెల్లడించిన భావాలే ఈ సమస్యను పరిష్కరించాయి.

"డేకార్ట్ అధిభౌతిక మత జ్ఞానం అతని దృష్టిలో ఎంతఅవశ్యకమైనా, మానవుడు విశ్వం గురించిన అతని సిద్ధాంత నిర్మాణానికే అవి భూమికలుగా ఉపయోగించినాయి. అతని ప్రధాన ప్రాతిపదికననుసరించి చివరకు అన్ని శక్తులూ దేవుడికే ఆపాదించాడు, కనక, యాంత్రిక విధానానికి, రేఖాగణితానికి ప్రపంచంలో స్వేచ్ఛ ఏర్పడింది. విస్తరణ భావంతో అతడు ప్రారంభించి, రూపానికి చలనానికి అవకాశం కల్పించాడు. అన్నిటికీ వివరణ యిచ్చే గణితనియమాలు చూపాడు. భౌతిక సంఘటనకు వివరణ అనేది డేకార్ట్ ప్రధాన సమస్య. ఒకప్పుడు మనస్సుకు పరిమితమనుకున్న రంగంలోకి కూడా ఇవి చొచ్చుకపోయాయి. మనం ఆలోచనా జీవులమనే నిర్ధారణతో డేకార్ట్ ఆరంభించాడు. ఆ పరిధి అంతవరకూ ఎవరూ తాకలేదు. కాని సరిహద్దుల వరకు, ప్రకృతి యాంత్రిక వివరణ అడ్డులేకుండా సాగింది."(1)

మానవులకు జంతువులకు డేకార్ట్ చూపిన తేడా నిరంకుశమైనదే. మానవుడు గాక జంతువులన్నీ యాంత్రికమైనవే. జీవిగా మానవుడు కూడా యంత్రమే. డలమిత్రి రాబట్టిన తీరుననుసరించి జీవ అజీవ ప్రపంచానికి డేకార్ట్ దృష్టిలో తేడాలేదు. "డేకార్ట్ మూలంగా జీవితంలో శారీరక, వైజ్ఞానిక చర్యలన్నీ యాంత్రిక మార్పులుగా పరిగణించబడినాయి."(2) అయినా అతను ఆత్మభావాన్ని అంటిపెట్టుకునే వున్నాడు. అందరూ ఖండిస్తున్న రోజులలో హార్వే చెప్పిన రక్తప్రసార సిద్ధాంతాన్ని ఇతడు శ్లాఘించాడు.(3) "జీవశక్తులు" అనే భావాన్ని హార్వే కనుగొన్న సిద్ధాంతం బద్దలు చేసింది. అరిస్టోటిల్, గాలెన్ కాలం నుంచి మనోవిజ్ఞానాన్ని ఈ "జీవశక్తుల" భావన ఆవరించింది. హార్వే విప్లవాత్మక పరిశోధనను ఆమోదించిన తరవాత కూడా, కేవలం నమ్మించడానికి అన్నట్లు ఆత్మభావనను డేకార్ట్ అట్టిపెట్టాడు. డేకార్ట్ జీవితకాలంలో జంతు మనోవిజ్ఞానంలో పరిశోధకులు, జంతువులు యంత్రాలైనా అవి ఆలోచిస్తాయని

---

1) ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా, 13వ ఎడిషన్.

2) లాంగ్, హిస్టరీ ఆఫ్ మెటీరియలిజం

3) విలియం హార్వే 1578-1657 ఇంగ్లీషు శాస్త్రజ్ఞుడు.

గుర్తించేటట్లు చేశారు.(1) మానవుడికి ఉన్నదంటున్న అధిపత్యం పోయింది. ఆ కాలంలో మేధావిరంగంలో అధిపత్యం వహిస్తున్న మోంటాన్, (2) తన విపరీత శైలి ద్వారా, జంతువులు సైతం మానవుడంతగానూ, కొన్నిసార్లు ఎక్కువ వివేచన చూపుతాయని, సమస్యను తేల్చాడు. "వివేచన పూరిత ఆత్మ" అనే కార్టీజియస్ భావన కూడా నిలవదన్నమాట. జంతువులు ఆలోచించడమే కాదు, వివేచనా త్మకమైనవి కూడా, అవి జీవయంత్రాలైతే, పై అంతస్తు కోరడానికి మానవునిలో ఏమున్నది?

సంప్రదాయ భావ బంధంనుంచి మానవుడిని తప్పించి, విశ్వాసానికి కేంద్రంగా అతడిని అట్టిపెట్టాలని డేకార్ట్ ఉద్దేశించాడు. ఆ ఉద్దేశంతో, మానవుడికి ఆత్మలుంటాయన్నాడు. బాహ్యప్రపంచంలో ఉన్నతస్థానానికి ఈ స్థితి వలన హామీ ఉంటుందనుకున్నాడు. ప్రకృతిలో వివేచనకు మానవుడిలో వివేచనకు సంబంధం వున్నదని ప్రాపంచిక అనుభవం ద్వారా కనుగొన్నప్పుడు ఊహించిన చుక్కాని అవసరం లేకపోయింది. వివేచనా విధానపు మార్పులో మానవుడు అత్యున్నత కేంద్రస్థానాన్ని ఆక్రమిస్తున్నాడు.

డేకార్ట్‌కు సమకాలీనుడైన ఫ్రాన్సిస్ బేకన్ ఆలోచన కూడా ఆధునికతత్వం ఆవిర్భవించడానికి తోడ్పడింది. పాండిత తత్వంపట్ల వీరిరువురూ విమర్శనాత్మక దృక్పథాన్నే అవలంబించారు. అన్నివిధాలా సందేహవాదం అనేది వారిరువురిలోనూ కనిపించిన సామాన్యవిషయం. అంతటితోనే వారి సామాన్య లక్షణం అంతమైంది. వారి భావాలను వెల్లడించడంలో, పూర్తిగా భిన్నమైన ధోరణి అవలంబించారు. ఫలితం ఒక్కటే. ఆధునిక మానవుడికి తత్వం యిచ్చారు. చిత్తప్రవృత్తి ఆధారంగానే తన సందేహవాదాన్ని పరీక్షకు పెట్టిన డేకార్ట్, గణిత సంబంధమైన వివేచనావాదాన్ని రూపొందించాడు. ఇందుకు భిన్నంగా, బేకన్, ప్రాపంచిక అనుభవానికి ప్రవక్త అయ్యాడు. నైరూప్య వివేచనావాదం కంటే ఆధునిక తత్వాభివృద్ధికి ఇతడే ఎక్కువ ప్రోదిచేశాడు. ఏమైనా ప్రకృతి శాస్త్రాల సాధనగా ఆగమన పద్ధతి నిలిచింది. బాహ్యా అనుభవాల ద్వారానే సత్యాన్ని కనుగొనవచ్చని బేకన్ చెప్పింది వాస్తవమని, సాధించిన విజయాలు తెల్పుతున్నవి. " యుగాలుగా, సహజతత్వంపై మానవుడు చేసిన శ్రమ చాలా స్వల్పం. ఇది విజ్ఞానానికి మాతృస్థానం అని తెలిసినా ఇట్లా జరిగింది. ప్రకృతి

1) దేహానికి ఆత్మకు మధ్య డేకార్ట్ గిరిగీసి చూపడం, జంతువుల గురించి అతని సిద్ధాంతాన్ని వివరిస్తున్నది. ఆత్మకు ఆలోచన ముఖ్యం అన్నాడు. జీవితం, స్పందన వంటి ఆలోచనగానివి దేహసంబంధాలు. పశువులకు ఆత్మలుండవని నిరాకరించడంతో వాటికి ఆలోచన వుండదని డేకార్ట్ అన్నాడు. లెకె, ది రైజ్ ఆఫ్ రేషనలిజం

2) మెషల్ మోంటన్ 1533-92 ఫ్రెంచి రచయిత.

తత్వాన్ని అన్వయించనిదే విజ్ఞానాభివృద్ధి జరగదు. అట్లాగే, విజ్ఞాన శాఖలు ప్రకృతి తత్వానికి ప్రోదిచేయాలి."

బేకన్ ప్రాపంచిక అనుభవవాదం, అధిభౌతిక వాదాన్ని కాదనలేదు. కాని అనుభవం వలన ప్రకృతిని గురించిన ప్రత్యక్షజ్ఞానంపై సాధారణీకరించేదిగానే అధిభౌతికం వుండాలని అతడు నొక్కి చెప్పాడు. కేవలం ఊహించడాన్ని బేకన్ వ్యతిరేకించాడు. తొలుత సహజవాదంలో వున్న అస్పష్టతను ప్రస్తావించి, అది ప్రకృతి వలన వచ్చింది కాదని, ప్రకృతి నిలకడ క్రమత్వం గణనీయమైనవని సూచించాడు. కనక, సరైన నిర్ధారితమైన జ్ఞానానికి ప్రకృతి ఆధారం అన్నాడు. "జ్ఞానంలో అస్పష్టత, మార్మికమైన సహజవాదం" అనేవి, ఊహాపూరిత ఆలోచనలో లోపం వలన, వక్రీకరించడం వలన వస్తాయన్నాడు. తమ భావాల నుండే ప్రపంచాన్ని రూపొందించాలని, తాము ఉపయోగించేవన్నీ తమ మనస్సు నుండే వినియోగించాలని మానవులు ప్రయత్నించారు. అట్లాకాక, పరిశీలన, అనుభవంపై ఆధారపడితే, అభిప్రాయాల బదులు వాస్తవాలు వచ్చేవి. అప్పుడు భౌతిక ప్రపంచాన్ని నడిపించే నియమాల గురించి తెలిసేది.

శారీరక శాస్త్రాన్ని భౌతిక నియమాల పరిధిలోకి డేకార్ట్ తెచ్చాడు. అంతటితో ఆగిపోయాడు. ఆ తరవాత మానవుడి మనస్సు, ఆత్మలను తెచ్చాడు. పాండిత్యవాద తత్వంపై అతని తిరుగుబాటు స్నానజలంతో బాటు పసిబిడ్డను పారేసినట్లయింది. ప్రాణం, మనస్సు ఒకే వస్తువు స్వరూపాలని చెప్పిన అరిస్టాటిల్ సిద్ధాంతాన్నే థామస్ అక్వినాస్ స్వీకరించాడు. "దేవుని వూపిరి"నే ప్రాణంగా థామస్ మతజ్ఞానం పేర్కొన్నది. ఫలితంగా మనస్సు కూడా పదార్థంగాని ఆధ్యాత్మిక విషయంగా, వివేచనకు స్థానంగా పరిగణించారు. అలౌకిక నిరంకుశత్వం నుంచి జీవితాన్ని విముక్తి గావించాలని పునర్వికాస సహజ తత్వవేత్తలు తలచారు. అది ఏకపక్ష తిరుగుబాటు. ఇది డేకార్ట్ ద్వందవాదంలో తేలింది. బేకన్ తిరుగుబాటు సంపూర్ణమైంది. అతను ఇట్లా చెప్పాడు. "నిర్ధారణను క్రమంగా అంచెలవారిగా- చూపాలని నా ఉద్దేశం. ఇంద్రియసాక్ష్యం కొంతవరకు అట్టిపెడతాను. దాని ఫలితంగా జరిగే మానసిక చర్యను చాలావరకు నిరాకరిస్తాను. మనస్సుకు కొత్తదారి చూపుతాను. జ్ఞానేంద్రియాల ప్రత్యక్షజ్ఞానంతో ఆరంభించి, మనస్సును ఆదారి వెంట పోనిస్తాను."

ఇందులో భాషాపరమైన అతిశయోక్తి ఉన్నది. మానసిక రీతులను బేకన్ పూర్తిగా తృణీకరించలేదు. ఇంద్రియాలకు మనస్సును అఖాతం ఉన్నదనడాన్ని అతడు నిరాకరించాడు. జీవితం, మనస్సు ఒకటేనన్న అరిస్టాటిల్ సిద్ధాంతాన్ని ఇతడు పునరుద్ధరించి కాపాడాడు. థామస్ మతజ్ఞానంలో ఇది కొంత వక్రీకరణ పొందింది.

జీవితానికి పునాది మనస్సు అనడం థామస్‌లో జరిగింది. మనో విజ్ఞానానికి శారీరక శాస్త్రానికి గల సంబంధం అనుభవరీత్యా కనుగొన్నందున, అలౌకిక మార్మికత ఏది మనస్సుకు లేదని స్పష్టపడింది. జీవితం ఊహాజనితమైన ధోరణిలో మనస్సుకు దూరమైంది. అట్లాగైతే రెండింటికీ సంబంధం కుదరదు. కేవలం వివేచన వలన ప్రత్యక్ష్యజ్ఞానం లభించదు. జ్ఞానాన్ని ఇంద్రియ గోచరం ద్వారా పొందాలంటే మనస్సు దిగిరావాలి. కార్టీసియన్ ద్వందవాదానికి మార్గాంతరంగా బేకన్ అనుభవవాదం, భౌతిక తత్వం వచ్చింది. అనుభవపూరిత వివేచనావాదం, వివేచనావాదంతో సరిచేయబడిన అనుభవవాదం అనేవి వాస్తవ తత్వానికి భాగస్వాములు.

బేకన్ శిష్యుడు, డేకార్ట్ విమర్శకుడు థామస్ హాబ్స్, ఆధునిక తత్వాభివృద్ధికి చెప్పుకోదగినంత కృషిచేశాడు. భిన్న ఆలోచనలను సమన్వయీకరించాడు. అనుభవవాదంలో రాజీపడని హాబ్స్, ప్రకృతి జ్ఞానంతో తత్వాన్ని కలిపేసే విధంగా నిర్వచించాడు. 17వ శతాబ్దారంభంలో ఐరోపా పర్యటిస్తూ, తాను ఆక్స్‌ఫర్డ్‌లో నేర్చిన పాండిత్య తత్వం మేధావులలో అపఖ్యాతి పొందినట్లు తెలుసుకున్నాడు. వైజ్ఞానిక, నిశిత ఆలోచన చోటు చేసుకోవడం గ్రహించాడు. పాండిత్య అస్పష్టవాదంలోకి పయనించినట్లు డేకార్ట్ అధిభౌతికవాదాన్ని విమర్శిస్తూ, హాబ్స్ తానుమాత్రం బేకన్ అంతదూరం పోలేకపోయాడు. ఇంద్రియచర్యను మానసిక చర్యలు అనుసరిస్తా యనడాన్ని బేకన్ ఒప్పుకోలేదు గదా. డేకార్ట్ పద్ధతివైపు మొగ్గిన హాబ్స్, అనుభవమే ఏ ప్రతిపాదనకైనా సరైన ఆధారం అన్నాడు.(1) వైజ్ఞానికమైనంత వరకూ డేకార్ట్ పద్ధతినే హాబ్స్ అనుసరించి పెంపొందించాడు. విజ్ఞానం పూర్తిగా అనుభవవాదం కాదు. బేకన్ ఖండించిన మానసిక రీతులున్నాయే అవి, బాహ్యసత్యాన్ని గురించి జ్ఞానం పొందడంలో ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తాయి. వ్యక్తిగత, బాహ్య సంబంధాలు గుర్తించకపోవడం వలన ద్వందదోషం లోగడ వచ్చింది. ఇప్పటికీ జ్ఞానం పరిధిలో అనేక సమస్యలు ఊహించుకొనడం జరుగుతున్నది. వైజ్ఞానిక పద్ధతికి ఈ గుర్తింపు ముఖ్యం. వైజ్ఞానిక పద్ధతికి డేకార్ట్ పితామహుడు. వివేచనావాదానికి అనుభవవాదానికి సమన్వయిస్తే వచ్చే ఫలితాల ప్రభావం అతను గ్రహించలేదు. కార్టీసియన్ పద్ధతిలోని ప్రతిభను హాబ్స్ గుర్తించి, ఇంకా అభివృద్ధి చేశాడు. సహజమైన వివేచన ఆధారంగా తత్వం ఉండాలని అతడు కోరాడు. ఆ విధంగా, సంప్రదాయబద్ధమైన అధిభౌతికం నుంచి వివేచనవాదాన్ని తప్పించి, భౌతిక ప్రపంచంలో సరైన స్థానం కల్పించాడు.

---

1) డేకార్ట్ సైతం తన తొలి రచనలలో అధిభౌతిక ఊహలకంటె, భౌతిక సిద్ధాంతాలకే ప్రాధాన్యతనిచ్చాడు. భౌతిక సిద్ధాంతాలకు బాహ్య విలువ ఉండగా, అధిభౌతికమైన ఊహలకు అది ఉండదన్నాడు.

డేకార్ట్, స్పినోజా స్థాయిలో హాబ్జ్‌ను సంప్రదాయబద్ధంగా పరిగణించారు. కాని, ఆ కాలంలో ప్రకృతి, మానవుడు, రాజ్యం గురించి పరిశీలిస్తూ, విశ్వజనీనతత్వాన్ని పెంపొందించిన వ్యక్తి హాబ్జ్ మాత్రమే. ఇందులో అధిభౌతికాన్ని తొలగించినట్లు అనిపిస్తుంది, కాని వాస్తవంగా అట్లాకాదు. ప్రపంచానుభవవాదిగా, అధిభౌతిక వ్యతిరేకతతో ఆరంభించడానికి హాబ్జ్ అంగీకరించలేదు. ప్రకృతితత్వానికి సందర్భోచితమైన అధిభౌతిక సమస్యలను మాత్రమే అతడు ప్రాపంచికానుభవంతో స్వీకరించాడు.(1) సాధారణంగా అధిభౌతిక సమస్యలుగా పరిగణించే వివేచన చిత్తప్రవృత్తి, నీతివంటి సమస్యలకు ప్రాపంచికానుభవ దృక్పథాన్ని పాటించి, పదార్థ విజ్ఞానం, మనోవిజ్ఞానాలలో శాస్త్రీయ పరిశీలన ప్రవేశపెట్టాడు. ఆధునిక మనోవిజ్ఞానానికి నాంది పలికిన తత్వవేత్త హాబ్స్, ఇంద్రియజ్ఞానవాది లాక్, అతని అనుచరులు దీనిని పెంపొందించారు. 18వ శతాబ్దంలోని ఫ్రెంచి మేధావుల జీవితంపై, కాండియాక్ ద్వారా, లాక్ చాలా ప్రభావం చూపెట్టిన విషయం స్ఫురణలో వుంచుకున్నప్పటికీ, తత్వచరిత్రలో హాబ్స్ స్థానం సరిగానే అవగాహన చేసుకున్నారు.

డేకార్ట్ తత్వంలో అటుఇటుకాని పాండిత్య అధిభౌతిక వాదాన్ని, కేవలం ద్వందవాదాన్ని విమర్శిస్తూ, హాబ్జ్ ప్రాధాన్యత పొందాడు. అయితే అన్ని రంగాలను ఆవరించిన అతని తత్వం స్వతంత్రంగానే అభివృద్ధి చేశాడు. "అంతర్గతభావాలు" అనే సిద్ధాంతాన్ని తృణీకరించి డేకార్ట్‌కు ఎదురుతిరిగాడు. ఏదైనా చర్యగాని, మార్పుగాని చలనం అంటారు. ఆలోచన ఒక విధమైన చర్య. కనక అది కూడా చలనంలో భాగమే. కనక జీవరాశిలో అదొక చలన విధానం. ఆలోచనారీతుల సముదాయమే మనస్సు, శరీరానికి భిన్నంగా మనసు వున్నదనడం పాండిత్యవాదుల గుప్తవిద్యగా విమర్శించాడు. ద్వందవిధానంపై అతడు ధ్వజమెత్తి, అధిభౌతిక వివేచనా వాదాన్ని విమర్శిస్తూ, మానసిక రీతిలో వివేచనను కూడా దుయ్యబట్టాడు.

"ట్రీ టైజ్ ఆన్ హ్యూమన్ నేచర్" అనే గ్రంథంలో మానవుడి మనస్సుకు సంబంధించిన కొత్త సిద్ధాంతాన్ని విపులీకరించాడు. ప్రకృతిలో వివేచనకు మానవునిలో వివేచనతో సంబంధాన్ని చూపాడు. ప్రకృతి నియమభావానికి మానవతను సమకూర్చిన హాబ్జ్, క్రైస్తవమతజ్ఞానంలోని దైవాన్ని తొలగించాడు. మానవుడిని యంత్రం కింద మార్చేయడానికి ఉపక్రమించిన స్థితిని అతడు తప్పించాడు.

---

1) బయట ప్రకృతికన్నా, సామాజిక జీవనంపై బాబ్జ్‌కు ఆసక్తి ఎక్కువ. రాజకీయ విప్లవయుగంలో అవి గాఢ ముద్రను వేస్తూ కనబడేవి. కొత్త యాంత్రిక తత్వాన్ని రూపొందించిన వారెవరూచేయని ప్రయత్నం హాబ్జ్ చేశాడు. సమాజాన్ని, మానవుడిని, (పదార్థాన్ని, సంఘనిర్మాతను) విజ్ఞాన వివరణ పరిధిలోనికి తెచ్చాడు. ప్రకృతికి అన్వయించిన సూత్రాలనే ఇక్కడ ప్రవేశపెట్టాడు. ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా, 13వ ఎడిషన్.

1) గణిత బద్ధమైన అణువుల దృష్ట్యా మనో విజ్ఞానాన్ని హాబ్జ్ పెంపొందించ లేకపోయాడు. అయితే అవసరానికి మించి అతడు ఆ విధానంలో పక్కకు పోలేదు. మనస్సు కొన్ని మౌలిక భాగాల సమిశ్రితమని, జీవ అంగాల చలనం వలన ఇది ఏర్పడుతుందని, సాధారణ నియమాల మేళనం వలన ఇవి కలుస్తాయని అన్నాడు. ప్రయోజనం, వివేచన అంగీకరిస్తూ, అవి అంతిమ సూత్రాలుకావన్నాడు. పాండిత్యవాద మనోవిజ్ఞానులకే అవి ముఖ్యం. ఇవన్నీ మానసిక చిత్రణలే. ఆధునిక మనో విజ్ఞానాభివృద్ధికి ఈ ధోరణి అనవాయితీ అయింది. తరువాత వచ్చిన మనోవిజ్ఞాని లాక్, కూడా హాబ్జ్ పద్ధతినే ఇంకా స్పష్టంగా విపులంగా అనుసరించిన ఫలితంగా మనో విజ్ఞానాన్ని గురించి భావవాది మాత్రమే ఏదైనా వ్రాయడానికి సాహసించాడు. బర్ట్, ది మెటఫిజికల్ ఫౌండేషన్స్ ఆఫ్ మోడ్రన్ సైన్స్.

2) 1715-80 ఫ్రెంచి తత్వవేత్త. ఒకవైపు డేకార్ట్ పాండిత్య అధిభౌతిక వాదాన్ని ఎదుర్కొంటూనే, ట్రీ టైజ్ ఆన్ హ్యూమన్ నేచర్‌లో న్యూటన్ పేర్కొన్న గణితబద్ధ అధిభౌతికానికి హాబ్జ్ పునాదులు నిర్మించాడు. ఇది ప్రకృతి తత్వం. రెండువందల సంవత్సరాలపాటు ఐరోపా వైజ్ఞానిక ప్రగతికి, మేధావుల పురోగమనానికి బాటలు నిర్మించిన ధోరణి అది. ప్రకృతి విజ్ఞానంలో కూడా, హాబ్జ్ ప్రాపంచిక అనుభవవాదం నాటి మేధావుల ధోరణికి సరిపడావున్నది. గలీలియోకు మించి అతడు చెప్పిందేమీ లేదు. కాని అతడి మనోవిజ్ఞానానికి తీవ్రవ్యతిరేకత వచ్చింది. మనుష్య ద్వేషభావంతో ఉన్నట్లనిపించే అతడి సామాజిక సిద్ధాంతాలు ఇంకా రెచ్చగొట్టాయి. 17వ శతాబ్దంలో మేధావులు సత్యాన్వేషణ నిర్విరామంగా సాగించారు. కనక, మనస్సు, వివేచనకు సంబంధించిన అతడి అనుభవాధార సిద్ధాంతాలు, మానవుడి చర్యల గురించిన పరిశీలనకు దారితీశాయి. సోక్రటీస్, స్టాయిక్‌ల కాలంనుంచి ఆగివున్న నైతిక ఊహలు మళ్ళీ పైకిరాగా ఇంద్రియానుభూతితో కూడిన మనోవిజ్ఞానం ప్రబలింది. బేకన్, హాబ్జ్, కార్టీసియన్ అనుచరులలో పదార్థ వాదులు పెంపొందించిన కొత్త తత్వం, పునర్వికాస ధోరణిని తమకుకాదన్నట్లు చూచారు. మనిషి దేవుడిపై తిరుగుబాటు చేసింది ప్రకృతికి బానిసకావడానికా? కాదని రూసో ఉద్వేగవాదం స్పష్టంగా చెప్పింది.

ఇంద్రియజ్ఞాన సిద్ధాంతం కూడా అధిభౌతిక వివేచనవాదానికి వ్యతిరేకంగా వచ్చిన, పదార్థవాదానికి సమీపంలో ఉన్నవాదమే. దేవుడిని పునఃప్రతిష్ఠించకుండా కేవల సత్యాన్ని గురించిన జ్ఞానానికి వివేచన ఆధారం కాజాలదు. వివేచనావాదం దేవుడిని పదవీభ్రష్టుడినిగావించింది. డేకార్ట్ మతజ్ఞానంలోకి పోవడంలో పై ధోరణి కనిపించింది. కనక మతజ్ఞానం చెప్పేది అణచివేయాలి. ఆ పని ఇంద్రియజ్ఞాన వాదం చేపట్టింది. లాక్ ఇట్లా వాదించాడు. నీ అవగాహన పరిమితులు తెలుసుకో,

వాటికి మించి పోవడం ఉన్మత్తతే. అయితే, ఆ పరిమితులలో మార్మికత, అంధకారాన్ని చోటు చేసుకోనివ్వడం దోషపూరితమే. పైకి కనిపించే విషయాల వెనుక ఉన్నవాటి పట్ల మనదృష్టిని సారించాలి. ఇంతవరకు బాగానే ఉన్నది. కేవలం వివేచన, అధిభౌతిక విషయాలు ఊహామాత్రుకాలని నిరాకరించవచ్చు. హాబ్జ్ పదార్థవాదాన్ని పూర్తిగా అంగీకరించబోతూ లాక్ కాస్త వెనుకంజ వేసి, భావానికి ప్రాధాన్యతను నిరాకరించాడు. డేకార్ట్ మనోవిజ్ఞాన దృక్పథాన్ని హాబ్జ్ విపులీకరించగా, లాక్ తత్వానికి వచ్చాడు. ఫ్రెంచి విప్లవాన్ని ఉత్తేజపరచిన తత్వంగదా అది. అనుభవవాదం కాస్తా పదార్థతత్వంలో మిళితమైంది. మతవిజ్ఞానం నుంచి విడిపోయిన వివేచనతో పదార్థతత్వం రాజీ పడింది. ప్రకృతి ప్రసాదించిన అనంతశక్తులుగల మానవుడి సార్వభౌమత్వాన్ని ఈ తత్వం ఎలుగెత్తి చాటింది. దేవుడికి ఎదురు తిరిగిన మానవుడి కృషి వృధాకాలేదు. అలౌకిక వాదంపై జయప్రదంగా జరిపిన తిరుగుబాటు వలన, ప్రకృతిని కూడా జయించగలనని మనిషికి గుర్తింపు వచ్చింది. వివేచనావాదం వలన ఉద్వేగవాదం జనించింది. విజ్ఞానం ప్రపంచాన్ని మార్చేసి అనూహ్యమైన విప్లవభావాలు, ఆదర్శాలతో మానవుడు వున్న సమయంలో ఈ తత్వం వచ్చింది.

డేకార్ట్ తత్వంలో కేవల వివేచనాత్మక(ఊహాజనిత) వాదం రెండు దిక్కులలో పయనించింది. మాల్ బ్రాన్ష్(1) నవ్యపాండిత్యవాదం, స్పినోజా జగదభిన్న నైతిక విశ్వవాదం. ఈ రెండో మార్గం వలన, కార్టీసియస్ వివేచనావాదం ఇరోపా తత్వంలో రెండు ప్రధాన ధోరణులను ప్రభావితం చేసింది. భావవాదం, పదార్థవాదం ప్రభావితంగావడమేగాక, జర్మనీలో ఆలశ్యమైన పునర్వికాసాన్ని ఉత్తేజపరచింది. హర్డర్,(2) గెటె (3) షిలర్ (4) ప్రభృతుల ఉద్వేగభావాన్ని ప్రభావితంగావించింది.(5)

మానవుడి ఆత్మసిద్ధాంతం, జీవశక్తులతో దాని సంబంధం, దేహానికి ఆత్మకుగల అన్యోన్యత గురించి డేకార్ట్ చెప్పిన కట్టుకథ ఆశ్చర్యపరచక మానదు. మెదడులోని కేంద్రస్థానంలో ఉండే ఆత్మ జీవశక్తుల చలనగతిని మార్చగలదు. తద్వారా పరోక్షంగా దేహగతికి మార్గదర్శకత్వం వహిస్తుంది. కాని అది మాత్రం వీటివలన ప్రభావితంకాదు.

---

1) 1638-1715 ఫ్రెంచ్ తత్వవేత్త

2) 1744-1803 జర్మనీ తత్వవేత్త, కవి.

3) 1749 - 1832 జర్మనీ కవి, నాటకకర్త, నవలాకారుడు.

4) 1759 - 1805 జర్మనీ చరిత్రకారుడు, కవి.

5) బేకన్, డేకార్ట్, లాక్ స్థాపించిన ఆధునిక తత్వం తలెత్తుతున్న బూర్జువా వర్గపు సిద్ధాంతంకాదు. స్పినోజా ద్వారా కార్టీసియస్ భావవాదం హెగెల్ ప్రష్యన్‌వాద తత్వంలోకి, మార్క్సిస్టు పదార్థవాదానికి ప్రవహించడం గమనిస్తే, ఒక పథకం ప్రకారం చెప్పే చారిత్రక వాదం అసంభవమనిపిస్తుంది. మార్క్స్‌ను "ఎర్రని ప్రష్యన్" గా చిత్రించడంలో ఆశ్చర్యం లేదు.

..........

డేకార్ట్ చెప్పిన ఊహాజనిత మనోవిజ్ఞానం విజ్ఞానపరిశోధనలవలన పటాపంచలు అయింది. ఏమార్గంలోనైనా చలనం స్థిరంగా ఉంటుంది. కనక మార్చడానికి వీల్లేదని విజ్ఞానం తెలుసుకున్నది. కార్టీసియన్ ద్వందవాదానికి కాలదోషం పట్టింది. దేహ ప్రవర్తనను ఆత్మప్రభావితం చేయజాలదు, కనక మనోవిజ్ఞానంలో ఇదొక అనవసర ప్రతిపాదన. డేకార్ట్ కలను మాల్‌బ్రాన్ష్, స్పినోజాలు విసర్జించారు. మాల్ బ్రాన్ష్ పాండిత్య సంప్రదాయానుసారం మత ప్రాతిపదికపై ద్వందవాదాన్ని అట్టిపెట్టాడు. స్పినోజా ద్వంద వాదాన్ని కాదని, ఏకత్వ తత్వాన్ని పెంపొందించాడు. దీనిని భౌతికంగానూ, జగదభిన్న దైవవాదంగానూ వ్యాఖ్యానించవచ్చు.

డేకార్ట్ వలె స్పినోజా కూడా స్పష్టంగా నిర్వచించిన, నిర్దుష్టంగా తెలిసిన సూత్రాలతో ప్రారంభించాలని తలపెట్టాడు. అతనిది కూడా గణితబద్ధమైన వివేచనతో కూడినదే. అతని పద్ధతి అంతా రేఖాగణిత విధానంలో, తార్కికనమూనాలో, కేవలం వివేచనాదర్శంతో సృష్టించినదే. కాని స్పినోజా ప్రధమసూత్రాలు చిత్తంలో అనుభవానికి పూర్వమే వున్న జ్ఞానం మాత్రంకాదు. ప్రకృతిలో వివేచన ఫలితంగా జనించిన సూత్రాలే ఇవి. విశ్వ వివేచన బహిర్గతమయ్యేది కనక మానవుడు వీటిని గ్రహించగలడు. ఏ సంఘటన అవగాహన కావాలన్నా దాని కారణం తెలియాలి. స్పినోజా స్పష్టమైన భావాలు వాటంతట అవి పుట్టలేదు. అవి స్పష్టమైనవి. వాస్తవమైనవి. బాహ్య వాస్తవానికి ప్రాతినిధ్యం వహించేవి. ప్రకృతిలోని వివేచనతో పొందికగా వున్నందున, ఉనికిలో మౌలిక సూత్రాలు గ్రహించడం మానవ వివేచనకు సాధ్యమే. స్పినోజా పద్ధతి నిగమనం గనక అతడు వివేచనాపరుడే. అతని పద్ధతిలో వివేచన అధిభౌతిక విషయంగాక, మూల సత్యసంబంధమైనదిగా ఉన్నది.

స్పినోజా తత్వంలో ప్రధాన సూత్రాలు : 1) ఉనికిలో ఉన్నవాటి ఐక్యత 2) ఆనందాన్ని క్రమబద్ధం చేయడం 3) ప్రకృతి, భావం ఐక్యత. దేవుడి పేరిట ద్వందవాద పీటముడిని విప్పేశాడు స్పినోజా. అదే అతని సమన్వయీకరణం. సంప్రదాయబద్ధమైన దేవుడి లక్షణాలేవీ స్పినోజా దేవునికి ఉండవు. ఇతని దేవుడిలో అస్పష్టత గమనించి కొందరు స్పినోజాను నాస్తికుడని ఖండించారు. స్వచ్ఛమైన మతానికి మూర్తీభవంగా మరికొందరు భావించారు. యూదుల దేవాలయం నుంచి అతన్ని బహిష్కరించగా, జర్మనీ ఉద్వేగవాదుల ప్రతినిధిగా నోవాలిన్ అతన్ని "దైవం మత్తెక్కిన" వానిగా చిత్రించాడు. అతన్ని అభిమానించే ఉద్వేగవాదులకంటె, యూదుమత గురువులే స్పినోజా తత్వాన్ని బాగా అర్థం చేసుకున్నారంటారు. వివేచనాత్మక ప్రకృతి, స్పినోజా దేవుడు ఒక్కడేనంటారు.(1) మానవుడి వివేచనకు ఇదే ఆదర్శప్రాయం అన్నారు. మత పవిత్ర గ్రంథాలు ఆదిమ మానవుడి వివేచన వలన సృష్టించబడినవి గనక,

నాగరికుడు వాటిని సాక్షాత్కరించిన వివేకం అనిగాక, కవితగా స్వీకరించాలన్నాడు. సంప్రదాయబద్ధమైన అభిప్రాయాలకు, విజ్ఞాన విషయాలకు సమన్వయీకరణ చేయలేనంతగా సంఘర్షణ వస్తుండటం స్పినోజా గమనించి, తన అభిప్రాయాలను సమర్థించుకున్నాడు. వివేచనాత్మక జ్ఞానానికి సాక్షాత్కరించిన వివేకానికి పొత్తు కుదర్చాలని శతాబ్దాలుగా చేసిన ప్రయత్నం వృధా అయిందన్నాడు. మానవుడి వివేచన స్వతంత్రమైనదని స్పినోజా తత్వం చాటడం యిందలి ప్రధానాంశం.

స్పినోజా సమన్వయీకరణలో ఉన్న మూల సూత్రానికి విస్తరణ, ఆలోచన అనేవి రెండు లక్షణాలు. అవి రెండూ కలిసి తత్వసారంగా ఉన్నది. సమన్వయంలో ద్వందవాదదోషం పరిష్కారం కానందున స్పినోజా మరొక అడుగు ముందుకు పోయాడు. సూక్ష్మత్వంలో తుదిస్థాయి యింకా రాలేదు. సమన్వయం ఒక మిశ్రమ లక్షణం, విస్తరణ ప్రధాన ఉనికి. అందులోనుంచి అనేక రూపాలు వెల్లడౌతుంటాయి. ఇదే పదార్థం, మనస్సు. ఉనికిలో లేని దానినుంచి ఉనికి రావడం సృష్టికాదు. రెండు పరస్పరం స్వతంత్రంగా వుండేవాటిని కలపడం సృష్టికాదు. ఉదాహరణకు మనస్సు, పదార్థం. "రెండింటి మధ్య సామాన్య లక్షణం ఏదీ లేకుంటే అవి పరస్పరం ప్రభావితం కాజాలవు." అనే వాదన ఆధారంగా సూత్రీకరణ జరిగింది. చైతన్యం నుండి సృష్టి జరిగి, అది పదార్థంపై పనిచేస్తుంటే, వాటి మధ్య సాధారణమైనదేదో ఉండిఉండాలి. సారంలో అవి రెండు ఒకటే. ఆ విధంగా ద్రవ్యం ఒకటే అనే భావానికి వచ్చాడు స్పినోజా.

ప్రథమశక్తి నుంచి సృష్టి ప్రవహించింది. ఉనికి స్వయంకారణానికి అవసరమైన చర్య అది. ప్రతిదీ మూలద్రవ్యం నుంచి వచ్చింది. దీని ఫలితంగా, మనోవిజ్ఞాన – పదార్థ సమాంతరవాదం రద్దు అవుతుంది. అంటే డేకార్ట్ వాదంలోని విశ్వభావం పోతుంది. దేహం, ఆత్మ,(పదార్థం,చైతన్యం) రెండూ వాస్తవమేనంటాడు స్పినోజా. అవి స్వతంత్ర ప్రతిపత్తి గలవికావు. సంబంధంగల లక్షణాలున్న ద్రవ్యమే ఇందులో ఉన్నది. దేవుడు, ప్రకృతి, మనస్సు, పదార్థం, ఆత్మ, దేహం, అన్నీ సామాన్యమైన మూలద్రవ్యం నుంచి రాబట్టినవే. ఈ పరమార్థసూత్రం కేవలం చైతన్యం కాజాలదు. అలాగయితే, సృష్టి ఉండదు. కనక, విస్తరణ గల ద్రవ్యం అది. అందులో చలనం వున్నది. మనస్సు పెంపొందగల పదార్థ ద్రవ్యమే అది.

ద్వందవాదం నుంచి విశ్వసిద్ధాంతం, అధిభౌతికం విమోచన పొందాయి. లోగడ దీనివలన తత్వం పోయి మార్మికమైన మతజ్ఞానంలో కలిసింది. మానవుడిలో

---

1) ఐన్‌స్టీన్ ప్రకృతి పట్ల అవలంబించిన కవిత్వ ధోరణి స్పినోజాను పోలివుండడం వలన, అతన్ని కూడా మతపరమైన మర్మవాది అన్నారు.

మనోవిజ్ఞాన పదార్థ సమాంతరత అదృశ్యమయ్యేసరికి, అతనితో ప్రకృతికి గల సంబంధం స్పష్టంగా రాబట్టారు. మానవుడి దేహం, మనస్సు(ఆత్మ) కూడా ప్రకృతిలోని విస్తరణ, చలనంతో సంబంధంగల లక్షణాలని స్పష్టపడింది. మానవుడు యావత్తు– అతని శరీరం, మనస్సు, ప్రకృతిలో భాగం. మూలద్రవ్యానికి గల సారమే ఇదంతా. ప్రకృతి నుంచి మానవుడు ఆవిర్భవించడానికి అలౌకిక శక్తి జోక్యం అవసరం లేదు. అట్లాగే విశ్వంలో సృష్టికి దైవసృష్టి అవసరంలేదు. మానవుడి ఉనికి మార్పు ప్రకృతిలో భాగం. ప్రకృతి నియమానుసారం ఇవి ఉంటాయి. ప్రకృతి నియమం పనిచేసేతీరును గణితంలో చెప్పగలిగినట్లే, అదే నియమానికి లోనైన మానవుడి శారీరక మానసిక శాస్త్రం గురించి కూడా అట్లాగే చూడొచ్చు. ఆ విధంగా అన్ని మార్మిక విషయాల నుంచి మానవుడు విముక్తి చెందాడు. మానవుడికి ప్రకృతితోగల సంబంధం స్పష్ట పడినందున, మానవుడిని అవగాహన చేసుకోడానికేగాక మానవుడు–ప్రకృతి సంబంధాలు కూడా ఇంకా బాగా అవగాహనకు వచ్చాయి.

స్పినోజా తత్వం పూర్తిగా నియతివాదం. ప్రకృతి వాదానికి భిన్నంగా వుండే అధిభౌతికాలు ఇంతే. ప్రకృతి ప్రయోజనం గురించి తెలిసిన అనంతరం, ఇక దైవలీల తెలుసుకోలేమనే భావం నుంచి విమోచన లభించింది. మానవుడు ప్రకృతిలో భాగం. ప్రకృతిలో ప్రయోజనం ఏదీలేదు, ఉండదు. మానవుడికి కూడా ప్రయోజనం ఏదీ లేదనే గదా సారాంశం? వాస్తవానికి, మానవుడిని యంత్రంగా పరిగణించే హాబ్జ్ సామాజిక పరిణామ వాదాన్ని స్పినోజా ఆమోదించాడు. మానవుడికి స్వతంత్ర వ్యక్తిత్వం పోయింది. అనంత ఉనికిలో, అనంత ప్రవాహంలో మానవుడు ఒక బుడగ మాత్రమే. బాధ్యతారహిత వ్యక్తిత్వం వలన నైతిక నియమావళి అంతా అర్థరహిత మౌతున్నది. కార్యకారణత్వంలో స్వతంత్రత కరిగిపోయింది.(1) ఇచ్ఛ, ప్రజ్ఞలేని దేవుడికి సైతం స్వేచ్ఛలేదు. కనక దైవేచ్ఛగాని, విశ్వప్రయోజనంగాని ఉండవు. విశ్వంలో ఇచ్ఛ ఆధారంగా మానవుడిలో ఇచ్ఛ అనే భావం కనుగొన్నారు. క్రైస్తవులు చెప్పిన స్వేచ్ఛాయుతమైన యిచ్ఛను స్పినోజా నిరాకరించాడు. ప్రయోజనంతో కూడిన దైవేచ్ఛకు మానవేచ్ఛ ప్రతిబింబమనడాన్ని, పాపం చేసే స్వేచ్ఛను కాదన్నాడు. ఇది స్వేచ్ఛాపత్రం కాదు. ఐచ్ఛికబంధం. మానవేచ్ఛ ఒక కోరిక. ప్రతి కోరికలోని చర్యకు ఒక కారణం వుంటుంది. కారణం లేకుండా స్వేచ్ఛగా వుండే మానవేచ్ఛ లేదు. అనేక కోర్కెల వలన చేసిన చర్యల నుంచి నిర్ధారణ లేని కేవల యిచ్ఛను రాబడితే,

1) ఈ నగరం సత్యాన్ని హెగెల్ పట్టుకొని, ఆవశ్యకతను గ్రహించడమే స్వేచ్ఛ అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. స్పినోజా సగం సత్యానికి హెగెల్ చేసిన వ్యాఖ్యానాన్ని సామాజిక పరిణామానికి మార్క్స్ అన్వయించాడు. దీని ఆధారంగా చారిత్రక నియతివాదం చెప్పాడు. దీనివలన నైతిక ద్వేషం విప్లవధర్మం అయింది.

స్వేచ్ఛా పూరిత యిచ్ఛ అనేది ఊహాజనితమన్నమాట. వాస్తవానికి సంబంధం లేదన్నమాట. గాలిలో పడుతున్న రాయి ఊహించగలిగితే, తన యిచ్ఛ వలననే పడుతున్నానని భావించినట్లే ఉంటుంది.

స్పినోజా నియతివాదం విధివాదానికి చాలాదూరం. వివేచనాత్మక, విజ్ఞానయుత నిర్ధారణకు వ్యతిరేకంగా ముందే నిర్ధారణ అయినట్లు చెప్పబడే ప్రయోజనవాద అభ్యంతరాలు చెల్లవు. ప్రకృతికి సంబంధం లేకుండా ఉనికి అంతాన్ని నిర్ధారించడం విధివాదంలో కనబడుతుంది. వివేచనాత్మక నిర్ధారణ సహజమైంది. మానవుడి జీవితాంతం ప్రకృతితో సరిపడి ఉంటుంది గనక ప్రకృతి నిర్ధారిస్తుంది. ప్రయోజనంతో కూడిన విధి నిర్ణయానికి భిన్నంగా, సహజ నియతివాదం మానవుడి ఇతరశక్తులను, యిచ్ఛను చేర్చి ఉంచుతుంది. మానవుడి ఉనికిలో అంతమనేది ప్రకృతిలో భాగం గనుక, మానవుడు స్వేచ్ఛాజీవి అని స్పినోజా అనేక పర్యాయాలు పేర్కొన్నాడు. ఆ విధంగా నియతివాదం, స్వయం నియతివాదమే. మానవుడి జీవితం బాహ్య కారణాల వలన నిర్ధారణ అయినమేరకు అతను బంధంలో ఉన్నాడు. స్వయం నిర్ణయం మేరకు అతను స్వేచ్ఛాపరుడు.

స్పినోజా నీతిశాస్త్రం అతని తత్వంలో అత్యంత ప్రధానమైనది. ఆవశ్యకత, స్వేచ్ఛల పొందికపై ఇది ఆధారపడింది. "మానవుడు నిమిత్తకారణం అయిన మేరకు అన్నీ మంచివే. బాహ్య కారణాల వలన తప్ప మానవుడిలో చెడు లేదు." నీతి ఐచ్ఛికం. నీతి శాస్త్రంలో ఇచ్ఛకు కల స్వేచ్ఛ అవధులు లేనిది. అక్కడే స్వేచ్ఛ నిజంగా పరిగణించవలసి ఉంది. జీవ విధానం పనిచేసే నిర్ధారణలో నైతికతకు మూలం చూచాడు. స్పినోజా మానవ ప్రవర్తనలో తనను తాను కాపాడుకోవడమనే లక్షణం ఉన్నది. "తనను తాను అట్టిపెట్టుకోవాలనే ప్రయత్నానికి ముందు ఏ ధర్మము ఊహించలేం." పరిణామ విధానంలో నైతికతకు మతేతర ప్రాతిపదికలు వేశాడు స్పినోజా. కాని సెక్యులర్ నీతిని అపఖ్యాతి పాలుజేసిన ప్రయోజనవాద వ్యాఖ్యానానికి అవకాశం కూడా ఇందులో లేకపోలేదు. మార్క్సు భౌతిక తత్వంలో నైతిక శూన్యవాదానికి తావిచ్చింది ఉపయోగతావాదుల నైతిక సాపేక్షతా ధోరణే. ఈలోగా స్పినోజా మానవతా నైతిక సిద్ధాంతం ఉద్వేగపు తిరుగుబాటు(జర్మనీ పునర్వికాసం)కు ప్రేరణ ఇచ్చింది. ఆధునిక తత్వంలో వివేచనాత్మక భౌతికవాదానికి వ్యతిరేకంగా ఇది సంభవించింది.

హెర్డర్, లెసింగ్, గెటె, షిలర్ వంటి జర్మన్ భావవాద ప్రముఖులందరూ 18వ శతాబ్దంలో స్పినోజా అనుచరులే. మానవుడిని యంత్రంగా స్పినోజా తత్వం మార్చేసివుంటే యీ మహానుభావులంతా వుత్సాహంగా అతని తత్వానికి స్వాగతం పలికేవారే కాదు. పునర్వికాసంలోని మానవుడి సార్వభౌమత్వానికి సహజమైన

ఉద్వేగవాదం ప్రమాదకారి అయిందని వారు తలచారు. అయినా వారంతా మానవవాదులు గావడంవలన ప్రకృతి విజ్ఞానం సాధించిన విప్లవాత్మక విజయాలను కాదనలేకపోయారు. వీటిలో కొన్నిటిని గెటె సాధించాడు. తాత్వికంగా వారంతా భౌతికవాదం వైపు మొగ్గు చూపినవారే. మానవుడి ఉద్వేగాల నిమిత్తం "సజీవమతం" కావాలని కోరారు. మానవుడి వ్యవహారాలలో జోక్యం చేసుకోని దేవుడు, వారికి స్పినోజా తత్వంలో కనిపించాడు. జగత్తే దైవం అనే స్పినోజా వాదాన్ని గెటె, షిలర్ కవితలలో బాగా పెంపొందించారు. ఫ్రెంచి వికాసానికి జర్మనీ పునర్వికాసానికి సంఘర్షణగా ఐరోపా మేధావుల జీవితం పరిణమించింది.

డేకార్ట్ విశ్వ సిద్ధాంతం, స్పినోజా ఏకత్వ సిద్ధాంతం ప్రాతిపదికగా ఫ్రెంచి వికాసంలో భౌతికవాదం విప్పారింది. హోల్‌బాష్(1) అద్భుతంగా వ్రాసిన సిస్టం ఆఫ్ నేచర్‌లో యిది స్పష్టపడింది. 18వ శతాబ్దపు ఆధునిక తత్వధోరణి అందులో కొట్టొచ్చినట్లుంటుంది. కాని, అది గెటెను పురికొల్పగా, అతనిలా ప్రవచించాడు.

"తత్వం అధిభౌతికం పట్ల మనం మనసారా అయిష్టతను పెంచుకొన్నాం. ఈ పుస్తకం ఏమైనా నష్టం చేసిందంటే అదే. కాని అనుభవం, ఆచరణ, కవిత్వం వంటి సజీవ జ్ఞానంలో మనం నిమగ్నమయ్యాం."

అది ఉద్వేగ స్వభావం, వివేచనకు వ్యతిరేకంగాగాక, దాని వలననే యీధోరణి అభివృద్ధి చెందింది. వివేచనాత్మక సహజవాదానికి బైబిల్ వంటి గ్రంథం ఎట్లాంటి హాని చెయ్యలేదు. కాగా, ప్రాచీన పాండిత్య ధోరణి పోగొట్టుకోవడంలో జర్మనీ పునర్వికాసానికి యిది తోడ్పడింది. విజ్ఞానం, సమాజం, సంస్కృతి వంటి మానవ సృజన శక్తులపట్ల యిష్టత ఇనుమడించడానికి ఈ గ్రంథం ఉపకరించింది. జర్మనీలో మతం పేరిట ఉన్నదంతా, గెటె చెప్పిన "సజీవజ్ఞానం"తో తుడిచిపెట్టుకపోయింది. లెబ్నిజ్ వైజ్ఞానిక మతశాస్త్రం దెబ్బకు స్పినోజా తత్వం తట్టుకొని నిలవగలిగింది. "పదార్థం ఆలోచించలేదు" అంటూ పాండిత్య పిడివాదంతో లెబ్నిజ్ చెప్పిన దానిని, "సజీవజ్ఞానం" తృణీకరించడం విశేషం. పాండిత్య అధిభౌతికతకు, మతజ్ఞానానికి ఆఖరుదెబ్బ తీసాడు కాంట్. ఉత్తేజానికై వెనక్కు చూడొద్దని గతంతో పూర్తిగా తెంచుకోమని, మెఫిన్(2) ప్రచారం ద్వారా గెటె చెప్పాడు. "అన్నీ అదృశ్యమౌతాయి గనుకనే ప్రతీదీ విలువైనది."

---

1) పాల్ హెన్రీ హోల్ బాష్ 1723-89

2) జర్మనీ గాథలననుసరించి ఇదొక భూతం, దోషాలకు ప్రతిరూపం. గెటె సృష్టించిన పాత్ర కూడా.

ఆధునిక తత్వాన్ని వైజ్ఞానిక మానవతా వాదంతో స్పినోజా ప్రారంభించాడు. బేకన్, హాబ్జ్, డేకార్ట్ వెలిగించిన యీ దీపం, స్పినోజా జగత్తే దైవం సిద్ధాంతంలో మాసిపోదు. లెబ్నిజ్, కాంట్, ఫిషె, షెలింగ్‌ల అలౌకిక భావవాద వూబిలోనూ ఇది కూరుకుపోదు. మూడు దిశలలో విస్తరించి, ప్రభావితం చేసింది మానవవాదం, 1) జర్మనీ పునర్వికాసంలోని ప్రాచీన ఉద్వేగ వాదం, 2) ఫ్రెంచి వికాసం 3) హెగెల్, ఫ్యూయర్ బాహ్ ద్వారా మార్క్స్ గతితార్కిక భౌతికవాదం, ఆధునిక తత్వం ఏ ఒక్క వర్గ సిద్ధాంతం కాదు. అది మానవసృష్టి కనక మానవసంపద.

✦ ✦ ✦

# కొత్త విజ్ఞానం

క్రైస్తవేతర నాగరికత తాకిడి నుంచి గ్రీస్– రోంలు తట్టుకొని నిలబడడానికి క్రైస్తవమతం బోధించిన దైవానుగ్రహ విమోచన ఆశ ఉపయోగపడింది. మానవాళికి చిట్టచివరలో రానున్న విముక్తి అట్లా వుంచి, ఈ లోపుగా ప్రపంచంలో మానవుడి ఆత్మను పరమాత్ముడు జాగ్రత్తగా కాపాడుతుంటాడని కొత్తమతం హామీ ఇచ్చింది. క్రైస్తవమతం వ్యాపించడంతో దేవునితో మానవునికి గల సంబంధం ఐరోపా సాంస్కృతిక జీవనంలో ఒక చుక్కాని వలె పరిణమించింది. బైబిల్ ప్రస్తావించిన ప్రపంచపు అంతం అనుకున్న సమయానికి రాకపోయేసరికి, జనించిన నిరాశావాదం నుంచి క్రైస్తవమతం బయటపడింది. దేవునితో మానవునికి గల సంబంధం ఆధారంగా ఐరోపా అంధకార యుగం నుంచి ఆశావహ దృక్పథంతో ముందుకు పయనించింది. తొలుత అనుకున్నట్లు, స్వర్గసామ్రాజ్యం రాకపోవడానికి, ప్రతి క్రైస్తవుడు ప్రార్థన వలన తన జీవితంలో ప్రతిక్షణము దేవునితోగల సంబంధాన్ని గ్రహించడమే కారణం. కనిపించకుండానే, దైవభావం మారింది. ఫలితంగా, తొలిక్రైస్తవ మత గురువుల మానవత్వారోపణ స్థానే, పాండిత్యమత జ్ఞానంలో మార్మికవాదం చోటు చేసుకున్నది.

ఎంత వివేచనాత్మకం చేసినా, మార్మికం గావించినా, విశ్వాసాన్ననుసరించి మానవాలోచనాతర్కం పయనించదు. పాండిత్య మతజ్ఞానాన్ని వివేచనాత్మకం చేసేసరికి క్రైస్తవమతంలో మూల విశ్వాసం సడలింది. అలౌకికవాద శక్తి తగ్గిపోయింది. మతపరమైన ఆలోచనకు అలౌకికవాదమే గదా మూలం. సహజమైన అజ్ఞానం వలన తొలిసారి పాపం నుంచి విముక్తిచెందిన మానవుడు, మత హద్దులు అధిగమించి, విజ్ఞానం, తత్వంతో తన నమ్మకాన్ని పునరుద్ధరించాడు.

కొన్ని శతాబ్దాల పోరాట ఫలితంగా, దేవునితో తనకుగల సంబంధం గురించిన భ్రమనుండి ఐరోపాలో మేధావులు బయటపడ్డారు. అధిభౌతిక ఊహలకు అలౌకికవాదం బదులు సహజవాదం మూలసూత్రమై కూర్చున్నది. దైవస్థానంలో ప్రకృతి రాగా, అంతవరకు అత్యున్నత విజ్ఞానంగా ఉంటున్న మతజ్ఞానం పదవీభ్రష్టత పొందింది. ప్రకృతి రహస్యాలు తెలుసుకోడానికి ప్రజ్ఞాశాలురు ప్రయత్నాలు చేశారు. మానవుడి ఉనికి, మార్పు అనే సమస్యను ఎదుర్కొంటున్న ఐరోపావారికి, సహజతత్వంలో పరిష్కారమార్గం కనిపించింది. ప్రకృతిని గురించిన జ్ఞానం వృద్ధి చెందుతుండగా అధిభౌతికాలోచన కూడా

విస్తరించింది. మానవుడికీ మానవుడికీ గల సంబంధం, సామాజిక ప్రపంచంలో మానవుడి ఉనికి మార్పులకు సంబంధించిన సమస్య వెనుక సూత్రాలను కనుగొనవలసి వుంది. మతేతర అధికారకతను ప్రకృతి నియమం ఎట్లా సమకూర్చుతుంది? ఇవి రెండూ ఒకే సమస్యకు సంబంధించిన రెండు దృక్పథాలేగాని, రెండు వేరే సమస్యలు కావు. దైవంతో మానవ సంబంధం అనే భ్రమలేకుండా, మానవుడి ఉనికి, మార్పుకు సంబంధించిన సమస్యలు, ప్రకృతి తత్వంతోపాటు సామాజిక తత్వం జోడించాలి. రెండిటినీ సమన్వయ పరచి చూస్తే ఉనికి మొత్తం వివరించడానికి తోడ్పడుతుంది.

అలౌకికవాదం, మతజ్ఞాన నిరంకుశత్వం నుంచి విమోచన చెందిన మానవుడి దృష్టి వూహలవలన ప్రజ్ఞాశాలుర ప్రయత్నాలలో ఉత్సాహం కనిపించింది. డేకార్ట్, స్పినోజా, లెబ్నిజ్ వంటి మహోన్నత తత్వవేత్తల విధానాలలో కొత్త తత్వం వికసించింది. తాత్విక రంగంలో వ్యక్తి తత్వవాదం నిలదొక్కుకున్నది.

రేఖాగణిత నిర్దుష్టత, గణిత తర్కం వలన కొత్త విశ్వజనీనతత్వం, అసందర్భ విషయాలకు అనవసర వూహలకు పోకుండా కాపాడబడింది. అయితే, గణిత కొలబద్దకు లొంగని విషయాలుంటాయనే విషయాన్ని వీరంతా విస్మరించి తప్పుచేశారు. సమాజంలో మానవ సంబంధాల పడుగుపేకలే యీ విషయాలు. మనోవిజ్ఞానం, మానవ సంబంధాల చైతన్యత రీతులు అవగాహనతో తప్ప సాంఘిక తత్వం సాధ్యం కాదు. పదార్థ విజ్ఞానానికి మనోవిజ్ఞానానికి సంబంధం స్థాపించడానికి డేకార్ట్ ప్రయత్నించాడు. విశ్లేషణాత్మక రేఖాగణితం ఆధారంగా శారీరక రీతులను వ్యాఖ్యానించే కృషి అతనిది. జీవ విధానాల గురించి సరైన జ్ఞానం లభిస్తే, యీ పద్ధతి ఉపయోగకారి కావచ్చు. కాని, మనస్సు, ఆలోచన, ఉద్వేగాలకు యీ పద్ధతి అన్వయించడం కుదరదు. విశ్లేషణాత్మక రేఖాగణిత బద్ధంగా వివరించిన పదార్థవిజ్ఞాన నియమాలవలె అధిభౌతిక మనోవిజ్ఞానానికి అన్వయించి చెప్పడం వీలుకానిపని. ఈ వైఫల్యం వల్లనే మనో విజ్ఞాన-పదార్థజ్ఞాన సమాంతరదోషం వాటిల్లింది. కార్టీసియన్ ద్వందవాద దోషం నుండి సహజతత్వం బయటపడి, ముఖ్యంగా మానవసంబంధాలు, జీవప్రవృత్తికి యిది అన్వయించ నంతవరకు యిది సందేహాస్పదంగానే ఉంది. కేవల పిడివాదం ఒక్కటే దీనికి మార్గాంతం.

సహజతత్వాన్ని సరైన పునాదుల మీద నిలబెట్టింది గణితం, అంకెల శాస్త్రంగా, ప్రతిపాదనలను రాశిలో పేర్కొనడంలో, గణితానికి పరిమితులున్నాయని సహజవాదులు గ్రహించలేకపోయారు. బాహ్యసత్యంలో కొన్ని దృక్పథాలు అంకెలతో వర్ణించలేమని, డేకార్ట్ గ్రహించలేదు. ప్రాథమిక ద్వితీయ లక్షణాలనే తేడా చూపి తప్పుదారి పట్టించాడు. ద్వితీయ లక్షణాలన్నవి మూలద్రవ్యానికి చెందిన ప్రాథమిక లక్షణాలే. ఆ తరువాత పెంపొందిన పదార్థవిజ్ఞానం వలన కొన్ని ద్వితీయ పదార్థ లక్షణాలను గణితరంగంలోకి

స్వీకరించడం జరిగింది. అయినా గణితం సర్వశక్తివంతం కాదనడానికి యింకా వివరించవలసిన విషయం మిగిలేఉంది.

ప్రకృతి రహస్యాలలోకి మానవుడు పోతున్నకొద్దీ, గణితం కూడా ఆ వేగాన్ని అందుకోవలసి ఉంది. ఆ విధానంలో కొంతదూరం వెళ్ళేసరికి గణితం కాస్తా తర్కంలో మిళితమౌతున్నది. అప్పుడు నిర్దుష్టత లెక్కల వలన గాక తార్కికంగా వున్నదా లేదా అని చూడవలసివున్నది. గణిత తర్క సంజ్ఞలకు రాశి విలువ వుండనక్కరలేదు. 17వ శతాబ్దంలో, కొంత కాలం వరకూ, నైరూప్య వివేచన చేయగలిగిన స్థాయికి గణితం చేరలేదు. అప్పటికది సంఖ్యాశాస్త్రంగానే వున్నది. కనక ఉనికిలోని భిన్న దృక్పథాలను వివరించగల స్థితిలో లేదు. ఫలితంగా, నాటి ప్రకృతి తత్వం ప్రకృతినంతటినీ ఆవరించలేకపోయింది. మానవ సంబంధాలకు వేరే దృక్పథం కనుగొనవలసి వచ్చింది. కొత్త విజ్ఞానం యింకా జనించవలసి వుంది. మానవాభివృద్ధిలో కొత్తదశకై మానవమేధస్సు దీటుగా నిలచింది.

అరిస్టాటిల్ చెప్పిన "సహజన్యాయం" అనే భావన అన్ని పరిస్థితులలోనూ సాంఘిక ఉనికి సామరస్యంగా వుండడానికి మార్గదర్శకంగా వుండగలదనే ఉద్దేశంతో, సామాజిక సంబంధాల విశ్లేషణ విచారణ జరిగింది. అందులో బోడిన్ వ్రాసిన రిపబ్లిక్ తొలిప్రయత్నంగా పేర్కొనవచ్చు. అరిస్టాటిల్ అనంతరం రాజకీయశాస్త్రంగా క్రమబద్ధంగా వ్రాసిన సంపూర్ణ సిద్ధాంత గ్రంథమది. విసుగుపుట్టించే సుదీర్ఘయాత్రలో సిటీ ఆఫ్ గాడ్ గ్రంథం ఒకమైలురాయి. దీని రచయిత క్రైస్తవభక్తుడుగా మారక ముందు క్రైస్తవేతర పండితుడు కూడా. మానవత్వారోపణ గల దైవం స్థానే మతజ్ఞానం చోటు చేసుకునేసరికి ప్రాయికమైన మతంలో జిగిబిగి సడలింది. అన్ని దృక్పథాలను ప్రస్తావించిన థామస్ అక్వినాస్ విధానంలో మానవసంబంధాలు వుండవు. మతవివేచన వాటిని ముందే నిర్ధారించింది గనుక అనవసరం అని తలచారు. అయినప్పటికీ, సంప్రదాయబద్ధమైన రోమన్ చట్టంలో సహజన్యాయ భావన అట్టిపెట్టారు. మధ్యయుగాల సమాజాన్ని పాలించడానికి రూపొందించిన మతశాసనంతో దీనికి పొత్తు వుండడమే యిందుకు కారణం. ఈ భావన ఆధారంగా "సహజహక్కు" భావనను పునర్వికాస న్యాయవేత్తలు పునరుద్ధరించారు. మధ్యయుగాంతంలో రాజకీయ ఆలోచనకు అదే ప్రాతిపదిక వేసింది. అట్లా ఆరంభించి, రాజకీయ ప్రభుత్వానికి కావలసిన కొన్ని సూత్రాలు, పౌరన్యాయ విధానం ఏర్పరచారు. సహజనియమ భావనలోని అధిభౌతికత దీనికి ఆధారమైంది.

సంధికాలంలో, సనాతన సంప్రదాయం, అసూయ, భయం వలన గందరగోళం ప్రబలిఉంది. సంప్రదాయ భావాల వలన మతేతర అధికారాన్వేషణకు ఆటంకం వాటిల్లింది. మతగ్రంథాల ప్రమాణాన్ని ప్రక్కనబెట్టి, మతం వెలుపల పౌరహక్కులకోసం, సమాజం ప్రభుత్వానికి చట్టబద్ధత కోసం ప్రయత్నించినవాడు గ్రేషెస్. అయినా అతని

గ్రంథంలో మతానికి, చట్టానికి, ప్రజానీతికి విచక్షణ స్పష్టంగా లేదు. అతని తరువాత వారు గ్రహించడానికి వీలుగా గ్రోషెస్ కొన్ని సూత్రాలు రూపొందించాడు. ప్రకృతి నియమం అధిగమించరానిది. దేవుడుకూడా దీనిని మార్చజాలడు. గణితసూత్రాన్ని దేవుడు ఎంతవరకు మార్చగలడో ఇదీ అంతే. సాంఘికజీవిగా మానవుని స్వభావంలో చట్టం ఇమిడివున్నది. సహజన్యాయాన్ననుసరించి ప్రపంచంలోని ప్రభుత్వాలకు ఈ సూత్రం సరిపోతుంది. దేవుడు తన సృష్టిలోని మానవుల సంక్షేమాన్ని పట్టించుకున్నా, లేకున్నా ఇది జరిగిపోతుంది.

ఇంతవరకు స్పష్టం. కాని ఒక ప్రశ్న మిగిలింది. ప్రకృతి నియమం మానవుల ద్వారా ఎట్లా పనిచేస్తుంది. సమాజ వ్యవస్థలో వారిని ఎట్లా సన్నిహితులను చేస్తుంది. తరువాత మతేతరు అధికారికతను ఎట్లా చూపుతుంది? సమాజం, రాజ్యం ఎక్కడ మొదలయ్యాయనేది ప్రశ్న మానవుడి చర్యవలన సమాజం వచ్చిందని రుజువు పరిస్తే తప్ప సెక్యులర్ అధిపత్యపు స్వతంత్ర ప్రతిపత్తిని నిర్ధారణగా చూపడానికి వీల్లేదు. దీనికి మానవత చేకూర్చడం సాధ్యపడదు. సమాజానికి పరిణామ దృక్పథం రావాలి. చారిత్రక పరిశోధనలో కొత్త పద్ధతులు రావాలి. అప్పుడుగాని మానవ సంబంధాలు సాఫీగా సాగేందుకు అనువైన మంచి సూత్రాలు రూపొందించడం, సమానత్వాన్ని చూపే రాజకీయ పరిపాలన సాధ్యం కావు.

రూసో అన్నాడు, "మానవజాతిని అండదశలో చూడగలిగితే, పెద్దదైన తరువాత కూడా ప్రధానాంశాలు గమనించవచ్చు."

జొవానా బాటిస్తా వికొ(1)నుంచి రూపోయీ భావాన్ని తెచ్చుకొన్నాడు. భాషాశాస్త్రం, మానవ దృక్పథం నుంచి చారిత్రక పరిశోధన తొలుత ప్రారంభించిన వ్యక్తి వికొ. ఆదిమానవుడి స్థితిని గురించి తెలిస్తే, నాగరిక సమాజ సమస్యలపై వెలుగు ప్రసరిస్తుందనే భావనలో మానవ చరిత్రకు పరిణామ దృష్టి వున్నది.

పునర్వికాసం నుండి చరిత్ర అధ్యయనానికి మంచి ప్రోత్సాహం లభించింది. మానవ విద్యలో చరిత్ర, తత్వ సంబంధాలు చాలా ముఖ్య విషయాలు. తత్వ సూత్రాలకు భిన్నంగా, ఉదాహరణలతో, అనుభవాలతో చరిత్రను బోధిస్తారు. విద్య సంస్కృతిలో తత్వానికి గాక చరిత్రకు ప్రాధాన్యత రావడం బేకన్ వ్రాసిన అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ లెర్నింగ్‌లో చూడవచ్చు. 'చరిత్ర ఆధారంకాగా జ్ఞానం సౌధం వంటిది' సోదాహరణంగా బోధించే తత్వమే చరిత్ర అన్న బోలింగ్ బ్రొక్ సుప్రసిద్ధసూత్రం, మానవవిద్యా సిద్ధాంతాన్ని సూచిస్తున్న సంస్కరణవాదంలో కూడా చారిత్రక పరిశోధనకు మంచి ప్రోత్సాహం లభించింది. చారిత్రక సత్యాన్వేషణ బాగా పెంపొందినది. వర్తమానానికి వ్యతిరేకంగా గతాన్ని అధ్యయనం చేయడానికి లూథర్ ప్రోత్సహించాడు. చిరకాలంగా గ్రంథాలయాలలో

నిద్రాణమైవున్న దైవిక, మానవ గ్రంథాలన్నిటినీ చదవడం, వాటి చుట్టూ పరిభ్రమించడం ఆరంభమైంది."(2)సంస్కరణ వాదులను వారి ఆయుధాలతోనే ఎదుర్కొనే నిమిత్తం, జెసూట్ మతగురువులు నిర్దుష్టంగా తీవ్రంగా చారిత్రక పరిశోధన గావించారు. నేపిల్స్ సంస్కరణకు వ్యతిరేక కేంద్రం అక్కడ పుట్టి, చదివి, న్యూసైన్స్‌ను అభివృద్ధి చేశాడు వికొ.(3)

ఐరోపా మేధావుల ఉద్యమానికి మార్గగామిగా, 17వ శతాబ్దంలో, ఫ్రాన్స్, ఇంగ్లండ్ నిలిచాయి. భౌతికంగా అభివృద్ధిలోగాని, రాజకీయ ఔన్నత్యంలోగాని మిగిలిన దేశాలకంటే ఇవి చాలా ముందున్నవి. పునర్వికాసానికి ఉయ్యాలగా, బూర్జువా వర్గానికి జన్మస్థలంగా లినార్డొ, గలీలియో, కంపెనెల్ల, బ్రూనోల స్థావరంగా పేరొందిన ఇటలీ చరిత్ర అడుగునకు పోయింది. మతగురువులు అధిపత్యం వహించారు. సంస్కరణ వ్యతిరేకత చెలరేగింది. అటువంటి తిరోగమన కాలంలో మానవాళికి కొత్త విజ్ఞానం పుట్టింది. తననుతాను సృష్టించుకునే మానవాళే చరిత్ర అని చాటిన విప్లవ భావం అప్పుడు జనించింది. వికొ న్యూసైన్సులో అదే మూలభావం.(4)

"మానవాళి చరిత్రకారుడు" గా వికొ, హెర్డర్‌తో బాటు జత చేర్చిన బోస్వే,(5) వికొకు తొలిరోజులలో సమకాలీనుడు. ఇతడు కాథలిక్ సంప్రదాయంలో మునిగి తేలినవాడు. థామస్ అక్వినాస్ మతతత్వానికి భిన్నంగా, అగస్టిన్ మానవత్వారోపణ నుంచి ఉత్తేజం పొందాడు. చరిత్రకు తాత్విక భాష్యం చెప్పిన కొద్దిమంది ప్రథములలో యితడొకడు. చరిత్ర దానిలో అంతర్గతంగా వున్న కారణాలచే నిర్ధారితమైనదని భాష్యం చెప్పడం యితని విశేషం. "దేవుడు ద్వితీయ కారణాల ద్వారా ప్రభావితం చేస్తాడని, గతకాలంలో ప్రతియుగానికి ప్రాతిపదికలు వుండాలనేది దైవేచ్ఛ" అని యితడు అభిప్రాయపడ్డాడు.(6) ప్రయోజన భావన తార్కిక ఫలితంగా చరిత్రలో నియతివాదం వచ్చినట్లు బోస్వే వ్రాయడం గమనార్హం. నియమబద్ధ విశ్వం గురించి మతజ్ఞానం

---

1) 1668–1744 ఇటలీ తత్వవేత్త, న్యాయవత్త

2) బేకన్, అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ లెర్నింగ్

3) 1725లో నేపిల్స్‌లో ప్రచురితమైన జువానా బాటిస్టావికొ రచన ప్రిన్సిపల్స్ ఆఫ్ ఎ న్యూసైన్స్ ఆఫ్ ది నేచర్ ఆఫ్ నేషన్స్–ఇందులో నుండే, న్యూ ప్రిన్సిపల్స్ ఆఫ్ ది నాచురల్ లా ఆఫ్ ప్యూపుల్స్ స్వీకరించారు.

4) చరిత్ర మానవసృష్టి అని, అభివృద్ధిలో పతనంలో తమ పరిసరాలను దిద్దుకునే మానవ స్వభావం అందులో ఉన్నదని వికొ గొప్పగా ఊహించడం ఇందలి విశేషం. అంతేగాక ప్రజలపాత్ర, జాతి అచేతన వివేచన కూడా చరిత్రలో ఉన్నట్లు ఇతడు పేర్కొన్నాడు. ఎమ్రినెఫ్, ది పొయిట్రీ ఆఫ్ హిస్టరీ.

5) 1627–1704 ఫ్రెంచి రచయిత, వక్త, భిషప్.

6) డిస్కోర్స్ నర్ల హిస్టరి యూనివర్సల్

పేర్కొనేదాని నుండి, ప్రకృతిలోని భౌతికరీతుల యాంత్రీకీకరణ కూడా వచ్చింది.

వికొ సమకాలీనులలో మరొకడైన మాంటెస్క్యూ(1)తో, మత సంప్రదాయం నుండి చరిత్ర తత్వం వేరైంది. ప్రకృతి నియమం గురించి అధిభౌతిక, సెక్యులర్ భావాన్ని ఇతడు స్పష్టంగా చెప్పాడు. చరిత్ర తత్వంపై యితని తొలి గ్రంథం చాలా ముఖ్యమైనది.

యివి, యింకా అనేక గ్రంథాలు చారిత్రక పరిశోధనపై వెలువడి, చరిత్ర పరిణామ భావానికి ప్రోదిచేసి, కొత్త విజ్ఞానానికి తోడ్పడినవి. చారిత్రక పిడివాదంలో కలవరపరచే సమస్య(మార్క్సిస్ట్ చారిత్రక భౌతికవాదం) ఏమంటే, దాని పుట్టుకను, కర్తను వివరించడం చారిత్రాత్మక పరిశోధనలో ఆదిమ మానవుడు, భాషాశాస్త్ర ధోరణులను వికొ ఉపయోగించి, చారిత్రకనియతి వాదాన్ని, పరిణామ దృక్పథాన్ని వెల్లడించాడు. వర్గపోరాట దృష్ట్యా చారిత్రక సంఘటనలకు భాష్యం చెప్పిన తొలివ్యక్తి కూడా యీతడే.(2) అయినా, కార్మికుడి విప్లవ సిద్ధాంతాన్ని"చాటినవాడు చిత్తశుద్ధిగల మతవ్యక్తి. అతన్ని రోమన్ మతాధికారులే కాక, స్పెయిన్‌లో తిరోగమన ధోరణిగల రాజుల ఆదరాభిమానాలకు పాత్రుడయ్యాడు. మధ్యయుగాలకు వ్యతిరేకంగా తలెత్తిన బూర్జువా వర్గాలకు, విప్లవాత్మకమైన కొత్త విజ్ఞానానికి ఎట్లాంటి సంబంధము లేదు. మధ్యయుగాల మనస్తత్వంలో నుండే ఇది జనించింది.

బోస్వే వలె వికొ కూడా క్రైస్తవమత గురువులలో మహోన్నతుడైన వ్యక్తి నుంచే ఉత్తేజాన్ని పొందాడు. తొలుత ఆ వ్యక్తి కూడా క్రైస్తవేతరుడే. సిటి ఆఫ్ గాడ్ లోని ఒక భాగం వలన కాథలిక్ విశ్వాసానికి, తన నాయకత్వానికి గల సంఘర్షణ పరిష్కారమైనట్లు భావించాడు. తన తత్వం మత వ్యతిరేకంగాకున్నా మతేతరంగా మాత్రం వున్నది. ఎపిక్యూరస్ నుంచి హాబ్జ్ వరకు అనేకమంది చింతనాపరుల లోపభూయిష్టమైన తత్వం చెప్పగా, దానిని ఆధారం చేసుకొని "సహజమతజ్ఞానం" వ్యవస్థాపితమైంది. భౌతికశాస్త్రాలు తిరగదోడిన తరువాత కూడా యీ ధోరణే బలపడింది. దీనిస్థానే, "వివేచనాత్మక పేరు మతజ్ఞానం" స్థాపించాలని వికొ ఉద్దేశం. అగస్టిన్ సుప్రసిద్ధ గ్రంథం పఠించిన అనంతరం "చరిత్రలో దైవచర్యను తిరిగి భాష్యం చెప్పడం ద్వారా తన ప్రయోజనం సాధించినట్లేనని వికొ భావించినాడు. మౌలికమైన మనస్తత్వం ఈ భాష్యంలో కనిపిస్తుంది. సృష్టి సిద్ధాంతానికి ఇదొక కొత్త వ్యాఖ్యానం. చరిత్రకు ముందుకాలంలో బైబిల్ సిద్ధాంతాన్ని హిబ్రూలకు మాత్రమే అన్వయించవచ్చు. మిగిలిన మానవజాతిని, మతేతరులుగా, "దైవం సాధారణంగా" చూచేది.(ఎన్నుకున్న ప్రజలకు ప్రత్యేక కరుణ వుండేది) ఇది ప్రకృతి

1) 1689–1755 ఫ్రెంచి తాత్విక రచయిత

2) మానవుడు వివేచనాత్మక మానవుడుగా ఉండటం చారిత్రక విధానం. వివేచన సాధించిన విధానం కూడా ఇదే. వర్గాల గతి తార్కిక వ్యతిరేకత ఈ విధానంలో ప్రధానం– వికొ ఆటో బయోగ్రఫీకి రాసిన ఉపోద్ఘాతంలో ఎం.హెచ్.ఫీష్, టి.జి.బెర్గిన్.

ద్వారానూ బోస్వే చెప్పిన "ద్వితీయ కారణాల వలననూ అమలు జరిగేది. ఆ విధంగా, "దైవం యొక్క వివేచనాత్మక పౌర మతజ్ఞానం" ను వికొ రూపొందించాడు. పాతబైబిల్ నిబంధన నుండి బయటపడిన హిబ్రూలతో సహా, మానవజాతికి స్వేచ్ఛ ఎంపిక చేసుకునే విధానాన్ని చూపినందున అంతవరకు అది వివేచనాత్మకం, పౌరసంబంధం అనవచ్చు. న్యూసైన్స్‌లో చెప్పినది మతజ్ఞానమే. ఆదిమానవుడి సృజనలో సమాజం ఆవిర్భవించినట్లు పేర్కొంటూ, తరువాత దానంతట అది నడిచే సమాజపు తీరు "దైవికం" అంటుంది. కనుక వ్యక్తులు ఎంచుకునే స్వేచ్ఛ సమిష్టిత్వానికి ప్రయోజనకారి. సమాజం యావత్తూ నాగరికత వైపుకు పయనిస్తుంది.

అగస్టిన్ నుండి ప్రేరణ పొందిన వికొ, తన న్యూసైన్స్‌కు కొత్త భాష్యం వచ్చిందనుకొన్నాడు. మధ్యయుగంలోని మత మనస్తత్వం వలన ఇలా జరిగింది. కాని వాస్తవానికి, ఎవరి దోషాలను తాను సరిదిద్దుతున్నానని వికొ భావించాడో, అటువంటి గ్రోషేన్, హాబ్జ్, సెల్డన్, (1) పఫెన్ డార్ఫ్ వంటి సహజధర్మ సిద్ధాంత కర్తలు చేసిన కృషిపైనే ఇతని సిద్ధాంతం ఆధారపడింది. తత్వాన్ని, భాషాశాస్త్రాన్ని మిళితం చేసి విశ్వనియమం రూపొందించవచ్చునేది గ్రోషేన్ నుంచి వికొ నేర్చాడు. న్యూసైన్స్‌లో వున్న మానవ జ్ఞాన సిద్ధాంతం హాబ్జ్ లోగడ సూచనప్రాయంగా పేర్కొన్నాడు.

"కళలలో కొన్ని ప్రదర్శనీయాలు, కొన్ని కావు. ప్రదర్శనీయమైనవి కలాకారుని చేతుల్లో ఉన్నవి. అతను చేయగలిగిందల్లా తన కళ ఆధారంగా ఫలితాలను రాబట్టడమే. విజ్ఞానం రాబట్టడానికి కారణాలు, నిర్మాణాలు గుర్తించాలి. కారణాలు తెలిస్తే ప్రదర్శనీయమౌతుంది. రేఖాగణితం ప్రదర్శనీయం, రేఖలు, క్షేత్రాలు మనమే గీస్తాం. వాటినుండే వివేచన పెంపొందిస్తాం. పౌరతత్వం కూడా ప్రదర్శనీయమే. సంక్షేమరాజ్యాన్ని మనమే రూపొందిస్తాం, గనుక ఇది సాధ్యం.(2)

హాబ్జ్ పౌరసత్వం 17వ శతాబ్దపు యాంత్రిక సహజతత్వం వలన జనించింది. దీని ఆధారంగా, మానవాళి తనను తానే సృష్టించుకుంటుంది. గనుక అదే చరిత్ర అన్న న్యూసైన్స్ ప్రధానసూత్రం వికొ పెంపొందించాడు. మానవసమాజారంభం నుండే ఈ సూత్రం చరిత్రలో చూపదలచాడు వికొ. గ్రీస్, రోంలు "ఆదర్శరాజ్యాలని" బేకన్ భావించాడు. వివేకవంతులైన శాసనకారులు, అజ్ఞాత తత్వవేత్తలు వీటిని స్థాపించారు. ఈ ఆదర్శ రాజ్యాల చరిత్రలో గాథలు, కట్టుకథలు, పుక్కిటిపురాణాలు వున్నాయని వికొ చూపాడు. గ్రీక్, రోం ప్రాచీనత మాత్రమేగాక, చరిత్రకు పూర్వం కూడా వున్న విషయాలను తెలుసుకోవడానికి ఆదిమ మానవుడు, భాషాధ్యయనం పరిశీలించాలని, పురాణగాథల

---

1) 1584-1654 ఇంగ్లీషు చరిత్రకారుడు, రాజకీయవేత్త,ప్రాచ్య శాస్త్రజ్ఞుడు.

2) హాబ్జ్, డె.సి.వి.

పోలికను బట్టి కూడా మానవుడి "అధిభౌతిక మనస్తత్వం" ఆధారంగా చరిత్రను పునర్నిర్మాణం చేయడం సాధ్యమని వికొ సిద్ధాంతీకరించాడు.

"ప్రాచీనతను అలముకొని దట్టంగా వున్న అంధకారంలో, శాశ్వతంగా రూపుమాయని సత్య వెలుగు ఉన్నది. మానవసమాజాన్ని మానవుడే రూపొందించాడు. మన మనస్తత్వాన్ని మార్చడం వలన దీని సూత్రాలను కనుగొనవచ్చు."(1)

గ్రోషెస్, వూఫెన్ డార్ఫ్, అందరికీ మించి హాబ్జ్ నుంచి మానవచరిత్ర సమస్యలకు పరిష్కార మార్గాలను నేర్చాడు వికొ. మధ్యయుగాలలో ఏకాకి అయిన ఈ పండితుడు అతికష్టంగా పరిశోధించి కనుగొన్నాడు. "తొలి పౌరసంఘాన్ని ఏర్పరచింది వివేకవంతులైన తత్వవేత్తలుకాదు. సంస్కృతి, మానవత లోపించిన మానవుడే, కాని తమజాతిని కాపాడుకోవాలనే వాంఛవలన ఇట్లా చేసాడు. తరువాత సమాజం పొందికగా, నాగరికతకు పునాదులు వేసింది."(2) తన పూర్వీకుల నుండి ప్రేరణాత్మక విషయాన్ని వికొ నేర్చాడు. మతజ్ఞానానికి, జీవితంలో ప్రయోజన వాదానికి, ఎదురుతిరిగి ప్రాచీన ప్రకృతి ధర్మాన్ని వారు తిరగదోడారు. లూక్రిషన్ కావ్యంలో సమాజమూలం గురించి చదివింది స్ఫురణకు వచ్చింది వికొకు. మతశిక్ష వెన్నాడుతుండగా రహస్యసంఘాలుగా నేపిల్స్‌లో విలసిల్లిన వారి కొత్తతత్వం ప్రభావం వికొపై పడింది. ఇటలీలో ఎపిక్యూరియన్ వాదానికి ప్రాచీన కాలంలో నేపిల్స్ కేంద్రంగా ఉండేది. ఈ "కొత్తతత్వం" ప్రాచీన సంప్రదాయానన్నుసరించి బ్రూనో, కంపనెల్ల ప్రభావం వలన, ఎపిక్యూరియన్‌గానూ, నాస్తికంగానూ ఉండేది. ఆడంకు పూర్వం, జంతువులవలె, అణువులతో కూడిన మనుషులు ఉండేవారు. వారిలో చురుకైనవారు ఇళ్ళు నిర్మించారు. నగరాలు, కోటలు, తోటలు నిర్మించారు. అనే అభిప్రాయాలు వెల్లడించినవారు క్రైస్తవమత విచారణకు, శిక్షకు గురయ్యారు. వీరిలో వికొ స్నేహితులున్నారు.(3) వికొ కూడా లూక్రిషన్ శైలిలో ఎపిక్యూరస్ ధోరణి ఉన్నప్పుడు కావ్యం రాశాడు.(4) భక్తుడైన క్రైస్తవుడు చేయవలసిన పనికాదది. జీవితంలో ఉత్తరోత్తరా అగస్టిన్ నుంచి ఉత్తేజం పొంది, లూక్రిషన్ న్యూనతశైలిని వదిలేశాడు. అంతటితో ఆగలేదు. ఎపిక్యూరస్ నుండి హాబ్జ్ వరకు ఏ తత్వవేత్తకూ సంబంధం లేకుండా న్యూసైన్స్‌ను పెంపొందించినట్లు చెప్పుకున్నాడు. ఏకాకి అయిన పండితుడు, విద్యారంగంలో కోర్కెలు తీరనివాడు, ఆమాత్రం ఆడంబరం కనబరిచినా క్షమించవచ్చు.

---

1) న్యూసైన్స్

2) వికొ ఆటో బయాగ్రఫీకి ఫిష్, బెర్గిన్ పీఠిక

1) పై గ్రంథంలో చూడండి

2) ది లైఫ్ అండ్ రైటింగ్స్ ఆఫ్ వికొ, హెచ్.పి. ఏడమ్స్, నేపిల్స్ నేషనల్ లైబ్రరీ రికార్డుల నుంచి ఉదహరించారు.

పశ్చిమ ఐరోపాలో ఎపిక్యూరస్ సంప్రదాయాన్ని గసెండి పునరుద్ధరించాడు. ఆధునిక తత్వంలో దీనినే హాబ్జ్ చేర్చాడు. హాబ్జ్, గ్రోషెస్ నుంచి వికొ అందుకొని, చరిత్ర సమాజానికి సంబంధించిన విషయాలను న్యూసైన్స్‌లో ప్రవేశపెట్టాడు. ప్రకృతి నియమభావాన్ని వికొ విమర్శించండంలో సరిదిద్దాలనే ఉద్దేశం లేదు. అందులో ఇమిడిన విషయాలు బహిర్గత పరచాడు. నైరూప్య తాత్విక చింతనగా ఉన్నంతవరకూ ప్రకృతి నియమం మానవ జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో చూపడం కష్టం. "తాత్వికుల ప్రకృతి నియమానికి" వ్యతిరేకంగా "ప్రజల ప్రకృతి నియమాన్ని" సిద్ధాంతీకరించిన వికొ, సమాజంతో పాటే సహజంగా విశ్వనియమం పెంపొందినట్లు తన పరిశీలనాపద్ధతి ననుసరించి చూపాడు. కనుక, వ్యక్తికైనా, సమిష్టికైనా ప్రకృతి నియమం ఒక్కటేనన్నాడు. భౌతిక ప్రపంచంలోని యాంత్రిక విధానంలో మానవసమాజాన్ని సరైన స్థానంలో వికొ అట్టిపెట్టాడు.

మానవ మేధస్సులో నియమాలకు మూలం చూపిన వికొ, మానవుడి మనో పరిణామాన్ననుసరించి చారిత్రక మార్పులను వివరించాడు. అదే సహజ విధానం, సహజసంఘటన అధ్యయనం చేయడం ద్వారా భౌతిక శాస్త్రజ్ఞులు ప్రకృతి నియమాలు కనుగొంటుంటే, తాత్వికులు మానవ జీవితంలో, సామాజిక పరిణామంలోని చారిత్రక మార్పులలో నియమాలు చూడాలన్నాడు. మానవుడి మనస్సు పనిచేసే తీరును అవగాహన చేసుకొనడంలో కూడా నియమాలు చూడవచ్చు. మానవజాతి చిత్తప్రవృత్తిలో నియమాలు పుట్టాయి. సామాజిక పరిణామ తొలిదశలో వీటినే మతకర్మకాండగా, నియమావళిగా భావించారు. నైరూప్యభావాలు ఆదిమ మానవుడికి అవగాహనగాక పోవడం వలన ఇట్లా జరిగింది. కాలానుగుణంగా నియమంలో అస్పష్టత తొలగింది. స్పష్టమైన నిర్వచనం వచ్చింది. ఇది మానవుడి మేధస్సు ననుసరించి వచ్చిన పరిణామం. చివరకు, మతాల నుంచి నైరూప్య నియమాలు రాబట్టారు. వివేచనాత్మక తాత్వికసూత్రాలు వాటి స్థానంలో వచ్చినవే. ప్రకృతి నియమంలో అధిభౌతిక సిద్ధాంతాన్ని వికొ విమర్శించడంలో గ్రోషెస్‌కు సమీపంగా వచ్చాడు. కాగా, ఇతడు విశ్లేషణాత్మకంగా ఈ నిర్ణయానికి రాగలిగాడు. గ్రోషెస్ దృష్టిలో ప్రకృతి నియమం సోపాధికం. వికొ దృష్టిలో అనుభవ సత్యం ఒకే మార్గంలోనైనా ఇది చాలా పురోగమనమే.

వికొ ననుసరించి, దైవిక(మత), వీరోచిత(ఇతిహాసాలు) మానవ(పౌర) దశలుగా నియమం వస్తుంది. మానవజాతి పితామహులు వూహించిన న్యాయం, సహకారం, సమన్వయానికి నైరూప్య తాత్విక వ్యక్తికారణాలు మాత్రమే, చివరిదశ. విశ్వనియమసూత్రం అంతర్లీనంగా వస్తున్నట్లు వికొ తన న్యూసైన్స్‌లో వెల్లడించాడు. "జాతులు స్వభావం చూస్తే, మానవాళి(నాగరికత) అందులో నుంచే వచ్చింది. మతంతో ఆరంభమై విజ్ఞానంతో

ఇవి పూర్తి అవుతుంటాయి."(1) తన ముందువారికి తాను కనుగొన్నదానికి సంబంధాన్ని వికొ చూపాడు. "హాబ్జ్ పేర్కొన్న విచ్చలవిడిగా హింసాయుత మానవులు గ్రోషెస్ చూపిన ఏకాకులు, బలహీనులు అవసరం వున్న అమాయకులు, పుఫెన్ డార్ఫ్ చెప్పిన తిరుగుబోతులు అందరూ దైవసహాయం లేకుండానే ఈ ప్రపంచంలోకి తోసెయ్యబడ్డారు. వారి నుంచే జాతులు ఆవిర్భవించాయి.

ఆదిమ మానవుడు, నాగరికుడి మధ్య రెండు దశలలో మానవుల ఉనికికి గల సంబంధాన్ని నిర్ధారించడంలో గల జటిలతను న్యూసైన్స్ పరిష్కరించింది. అదే పెద్ద ఘనవిజయం. తన ముందువారి కంటే పురోగమించిగాక, తన తొలి ఎపిక్యూరియస్ స్థితి వలన, వికొ సాధించగలిగాడు. న్యూసైన్స్‌లో తార్కికంగా ఇది రాబట్టడం గమనించవచ్చు. "దైవేచ్ఛతో కూడిన పౌర మత విజ్ఞాన" మనే కాలదోషం పట్టిన సిద్ధాంతానికి పోయాడు. వివేచనాత్మకమైన ప్రయోజనవాదాన్ని ప్రవేశపెట్టినందువలన, వికొ న్యాయచరిత్రకు సంబంధించిన తత్వంలో ప్రాధాన్యత కోల్పోలేదు. కాని అసందర్భమైన విషయాలను జొప్పించడం వలన, న్యూసైన్స్‌కు విరుద్ధమైన వ్యాఖ్యానాలు, తిరోగమనంతో కూడినవి వచ్చాయి.

ప్రకృతి నియమం, ప్రత్యక్షనియమం సమాంతరంగా పెంపొందాయనే రోమన్ భావాన్ని అంటిపెట్టుకొని ఉండటం గ్రోషెస్ విధానంలో లోపం. ప్రత్యక్ష నియమం మానవుడు రూపొందించినది. దీనికి అధికారికత ఏమిటి? మానవజాతికి, సమాజానికి దైవమూలం వున్నదనే విషయాన్ని ప్రశ్నించిన గ్రోషెస్, ప్రత్యక్ష నియమాన్ని గాలికి వదిలి వేశాడు. ఆ విధంగా ప్రకృతి నియమానికి, ప్రత్యక్ష నియమానికి అఖాతం అలాగే ఉండిపోయింది. "చరిత్ర అంతటా, అన్ని జాతుల ప్రత్యక్ష నియమం కూడా నిరంతరం పురోగమిస్తూ, నాగరికతాభివృద్ధితో బాటు సాగిపోయింది. మానవుడి వివేచన, స్వభావం ఆధారంగా ఏర్పరచిన ప్రకృతి నియమంలోని తాత్వికధోరణికి సమీపంగా ఇది గమనిస్తున్నది." మానవ జీవితానుభవాల నుంచి రాబట్టి, నైరూప్యంగా మార్చినదే విశ్వవ్యాప్తమైన ప్రకృతి నియమం. అందుకే మానవ చిత్తప్రవృత్తిలో నియమం ఆరంభమైనదని వికొ ప్రతిపాదించాడు,

మానవాళి, తనను తానే సృష్టించుకుంటుందనేది న్యూసైన్స్‌లో కనుగొన్న ప్రధానాంశం. ప్రకృతి నిమంలోని తాత్విక భావన సంప్రదాయం నుంచే తాను ఛేదించానని వికొ అన్నప్పటికీ దానికి ఆధారం లేదు. వివేచనవాదంపై ఇదొక తిరుగుబాటుగా మాత్రం 19వ శతాబ్దంలో విప్లవానంతర ఉద్వేగవాదులు శ్లాఘించారు. వారి కొత్త క్రైస్తవ మార్మిక

---

1) వికొ రచనలో

సిద్ధాంతాన్ని వైజ్ఞానికంగా సమర్ధించుకోడానికి దీనిని ఉపయోగించుకున్నారు. "తొలి మతేతర మానవులు కవిత్వ పాత్రల ప్రస్తావన చేసిన కవులని" వికొ కనుగొన్నాడు. దీని ఆధారంగా సమాజం, నాగరికతలను పునర్నిర్మించడం సాధ్యమైంది. అది ఆధారం చేసుకొని వికొ తత్వాన్ని పై విధంగా తమకు అనుకూల ధోరణిలో వ్యాఖ్యానం చేశారు. వికొ తాను కనుగొన్న విషయం మౌలికం అన్నాడు. దీని ఆధారంగా నిర్ణయానికి వచ్చేశారు. "వికొ మనస్సులో వివేచనావాదం నుండి చారిత్రక వాదానికి జరిగిన మార్పు స్పష్టంగా గమనించవచ్చు. వికొ అనంతరం ఐరోపా ఆలోచన ఇట్లా ఉండేది."(1)

ఈ నిర్ణయంలో కృత్రిమత స్పష్టం, సామాజిక పరిణామాన్ని నిర్ధారిత విధానంగా చారిత్రక వాదం చెప్పాలి. చరిత్ర అధ్యయనానికి వివేచనావాదాన్ని అన్వయించ డమన్నమాట. వికొ అదే చేశాడు. అయినా, వివేచనావాదానికి ఎదురు తిరిగినవానిగా అతన్ని శ్లాఘించారు.

"లూక్రిషస్, బేకన్, ఇతర ప్రకృతి నియమ సిద్ధాంతకర్తలనుండి సూచనలను వికొ స్వీకరించాడు. ప్రజ్ఞావాద సంకెళ్ళ నుండి బయటపడాలనే దృక్పథం యిదంతా. నాగరికతకు పునాదులు వేసిన వారు వివేకులుగాదు, పశుతుల్యులు. ప్రాయికంగా అవగాహనకు తోడ్పడింది వివేచనగాక ప్రేరణ, సంవేదన, అంతర్బుద్ధి అనడం, విజ్ఞాన, తత్వాలస్థానే సాధారణీకరణం చేసింది కవిత అనీ చెప్పగలగడమంటే, డేకార్ట్ నుండి విమోచన పొందడమే. హీనగ్రహణ శక్తులపై ఆధారపడినట్లు తాత్విక చారిత్రక విషయాలను గురించి చెప్పిన వాటికి వికొ కొత్త గౌరవం ఆపాదించాడు."

ప్రేరణ, సంవేదన, అంతర్బుద్ధికి భిన్నంగా వివేచనను వేరుచేసి చూడడం, వివేచన అను అధిభౌతికమనీ, మిగిలినవి స్పష్టమైన మానవ లక్షణాలనీ వికొ కాలంలో భావించి ఉండొచ్చు. వైజ్ఞానికంగా నేడీ స్థితి కుదరదు. కొందరు తత్వవేత్తలు ఇంకా తాము నిర్మించుకున్న అస్పష్టవాదాలతో నివశించాలనుకుంటున్నారనుకోండి. అధిభౌతిక వివేచనా వాదాన్ని అంటే మానవ వివేచనను వికొ విస్మరించాడు. ఆ తరువాత, అసందర్భంగా దైవం జోక్యం చేసుకుంటుందనే ప్రస్తావన వదిలేస్తే, న్యూసైన్స్ అంతా వివేచనాత్మకమే. సమాజం ఆవిర్భవించడాన్ని, తరువాత పెంపొందడాన్ని కార్యకారణ నిర్ధారణగా భాష్యం చెప్పాడు. అందుకే చారిత్రక వాదానికి అతడు పితామహుడు. దీన్నే, ఏక పక్షంగా, వికొ అనంతరం వందయేళ్ళకు, కార్ల్‌మార్క్స్ చారిత్రక పదార్థవాదంగా లేదా చరిత్రగతి తర్కంగా విపులీకరించాడు.

"అధిభౌతికతను దెబ్బకొట్టడానికి వికొ ధైర్యంగా ప్రయత్నించాడు. అతడు

1) వికొ స్వీయచరిత్ర పీఠిక, ఫిష్, బెర్గిన్

కుంటుపడినా, దేశాల ధర్మాల విషయమై(డిడరో) ఆలోచించడానికి బాగా అవకాశంగల (మాంటెస్క్యూ) చింతనాపరుడికి ప్రాతిపదికలు వేశాడు." వీరులు, గొప్పవారు వారి కాలాలను బట్టి జనిస్తారు. అంతకుముందు కాలాన్ని చూస్తే ఈ విషయం అర్థమౌతుంది. "ఆదిమ చరిత్రలోని వీరోచిత, దైవిక మూర్తులను భావాలు ప్రతీకలుగా అతడు వ్యాఖ్యానించాడు. (మిష్‌లా) "మానవాళి చరిత్రకారులలో" ఒకడుగా వికొను శ్లాఘిస్తూ (బాస్వే హెర్డర్‌తో సమానంగా) విక్టర్ కజిన్ ఇట్లా అన్నాడు. న్యూసైన్స్‌లో కేవలం మానవలక్షణం ప్రవేశపెట్టడం చరిత్రకు అతడు యిచ్చిన ముఖ్యవిషయం."

ఇట్లాంటి వ్యాఖ్యానాలెన్నో చేర్చవచ్చు. అధికారికంగా చేసిన ఈ ప్రకటనలవలన వికొ తత్వాన్ని సరిగా అంచనా వేశారనుకోవాలి. ఆధునిక ఐరోపాలో, చరిత్రలో అతని స్థానం బాగా నిర్ణయించారు. వివేచనావాదంతో మానవతావాదాన్ని సమన్వయీకరించి నందున, మానవుడి సృజనలో విశ్వాసం కలిగించిన మేధావుల ఉద్యమానికి నాంది పలికాడనవచ్చు. వివేచనావాద అధిభౌతికతను యాంత్రిక సహజవాదాన్ని సక్రమమార్గంలోకి తెచ్చిన ఉద్యమం అది. రూసో విప్లవాత్మక ఉద్వేగవాదం, జర్మనీ పునర్వికాసపు రామణీయకతలోని మానవత పునరుజ్జీవనానికి వికొ ప్రోది చేశాడు.

మధ్యయుగాలలో ఉన్న వికొ తన న్యూసైన్స్‌లో అసందర్భమైన, పూర్వీకుల మాటలను చేర్చినందున, ఉద్దేశపూర్వకంగా వ్యాఖ్యానించేవారు వాటినే ఏరి, అనవసర ప్రాధాన్యత ఇచ్చారు. ఐరోపా అభివృద్ధికి ఉపయోగించిన చింతనలతో సంబంధం లేనిచోట, వికొ తన జీవితమంతా గడిపాడు. కనక చరిత్ర సృష్టించిన వికొ గ్రంథంగాని అతనుగాని స్వదేశంలో మినహా బయట ప్రపంచానికి తెలియనే లేదు,(2) 18వ శతాబ్దాంతంలో గెటె, హెర్డర్‌లు ఇటలీ సందర్శించి, వికొ రచన గురించి తెలుసుకున్నారు. అదే కాలంలో నెబూర్(1) సావిగ్నె(2)లు రోమ్ సందర్శించి వికొ విషయం తెలుసుకున్నారు. పిమ్మట వికొ భావాలు జర్మనీలో వ్యాపించాయి. అందులో సందేహాస్పద విషయాలు కాంట్ అనంతర తత్వాన్ని , హెగెల్ న్యాయ చరిత్ర తత్వాలను ప్రభావితం చేసింది. హెగెల్ ద్వారా, చారిత్రక జీవదృక్పథం, మార్క్సిస్టు చారిత్రక భౌతికవాదంపై ప్రభావం చూపింది. తరువాత ఫాసిస్టు నియంతృత్వ వాదానికి వైజ్ఞానిక ప్రాతిపదికలు వేసింది.(3) కాంట్ నుండి జర్మనీ చింతనకు వికొ ఒక దూత అయ్యాడు. వికొ భావాల విస్తరణే గనుక హెగెల్‌వాదం ఇటలీలో బహుళ ప్రచారం పొందింది.(4)

---

1) 1776-1831 జర్మనీ చరిత్రకారుడు
2) మధ్యయుగాలలో రోమన్ లా చరిత్ర రాశాడు. బెర్లిన్‌లో ఉపాధ్యాయుడు.
3) ఫాసిజానికి వికొ, మజినీలు పితామహులు - మరియు పాల్మైరి, ది ఫిలాసఫీ ఆఫ్ ఫాసిజం
4) బెట్రాండో స్పావెంటో, ఇటాలియన్ ఫిలాసఫీ ఇన్ ఇట్స్ రిలేషన్ టు యూరోపియన్ ఫిలాసఫీ

వెక్టర్ కూజాన్(5) అతని శిష్యుడు మిష్‌లా వలన ఐరోపాలో వికొను అతని రచనకు గుర్తింపు వచ్చింది. ఇటలీ తర్వాత ఫ్రాన్స్‌లో వలె మరెక్కడా వికొను సానుభూతితో అధ్యయనం చేయలేదు. అతనికి ఐరోపాలో వున్న ఖ్యాతి అంతా మిష్‌లా వలననే.(6) మిష్‌లా, మార్క్స్ వంటి విప్లవ భావుకులు వికొ తత్వాన్ని శ్లాఘించగా, పవిత్ర క్రైస్తవ మతగురువులు, వివేచనకు వ్యతిరేకులైనవారు కూడా ఇతన్ని మెచ్చుకున్నారు. జోసఫ్ డ మిత్ర్ (7) ప్రవేశపెట్టిన నూతన కాథలిక్ విధానానికి కూడా వికొ తత్వం మంచిదన్నారు.

ఇతడిని విప్లవానంతర ఉద్వేగవాద ప్రవక్తగా భావించారు. ఇది 20వ శతాబ్దంలో ఫాసిజానికి అనుబంధంగా మారింది. "విప్లవానికి ముందు, వికొ రచన నుండి ఏదో ఒక దృక్పథాన్ని స్వీకరించిన "దుని" గాని, మరెవరైనాగాని, నాటి వివేచనావాద ప్రభావం నుండి పూర్తిగా విముక్తులుగాలేకపోయారు. వికొ భావాలను సమగ్రంగా చూడలేదు. సజీవ ఆలోచనారీతికి అతన్ని కీలకస్థానంలోనూ అట్టిపెట్టలేకపోయారు. వికాసోద్యమం పూర్తయ్యేవరకు, సాంఘిక ఉద్యమం వచ్చేవరకు వికొ చారిత్రక దృష్టికి యిది చాలా అవసరం. అతని భావాలను అధ్యయనం చేయడం, సరిగా అవగాహన చేసుకోవడం జరగలేదు. విప్లవానంతరం అమెరికాలో ఫెడరలిస్టులు, ఇంగ్లండ్‌లో బర్క్, ఫ్రాన్స్‌లో డమిత్ర్, ఇటలీలో విన్‌సెన్జొ క్యుకో యీ ఉద్యమానికి ప్రాతినిధ్యం వహించారు."

ఇటలీలో వికొ తత్వానికి ముఖ్యమైన భాష్యకారులు దుని, క్యుకొలు. ఖండంలో ఖ్యాతిగాంచక పూర్వం స్వదేశంలో వికొ తత్వం చాలా చర్చనీయాంశమైంది. వికొ జీవితకాలంలోనే మతేతర మానవాళి యొక్క జంతు ఆరంభదశ గురించిన వివాదం మొదలైంది. వికొ సిద్ధాంతాన్ని సమర్థించిన వారికి దుని నాయకుడు. డొమినికన్ మతాచార్యుడు ఫినెట్టి వ్యతిరేకాభిప్రాయానికి అధ్వర్యం వహించాడు. తన న్యూసైన్స్‌ను యిష్టం వచ్చిన భాష్యంతో పాండిత్య ప్రతిభతో వికొ వ్రాసినప్పటికీ, ఫినెట్టి దానిని బాగా బట్టబయలు చేస్తూ, మతరహితమైనదని చూపాడు. సమాజం పశుతుల్యమైన మానవుల స్థాయిలో ఆరంభమైనదనడం, తరువాత అంతర్గత గతితార్కికం వలన పరిణామం చెందినదనడం, బైబిల్‌ను తృణీకరించడమేనని ఫినెట్టి సరిగా చూపాడు. కాథలిక్ ఆలోచనను కూలద్రోయడానికి యీ ప్రయత్నం అన్నాడు. లూక్రిషన్ చూపిన రీతిలో ఎపిక్యూరస్ వాదమంతా న్యూసైన్స్‌లో ఉన్నదని ఫినెట్టి చూపాడు. వికొను సమర్థవంతంగా వ్యాఖ్యానించిన క్యుకో, 1799లో నేపిల్స్ విప్లవాన్ని వ్యతిరేకిస్తూ, న్యూసైన్స్ ఫలితంగా వచ్చిన విప్లవ తత్వానికి ఇటలీలో వేరులు లేవన్నాడు. యెకవిల్లి, వికొలు చెప్పిన జాతీయ

---

5) 1792-1867 ఫ్రెంచి ఫిలాసఫీలో అన్నిటిని కలగాపులగం చేసిన ధోరణి ఇతడే ప్రవేశపెట్టాడు.
6) రాబర్ట్ ఫ్లింటా, వికొ
7) ఫ్రెంచి మత విజ్ఞాని, 1821లో మరణించాడు.

తత్వం వికాసోద్యమంలోని నైరూప్య వివేచనావాదాన్ని ముందే నిరాకరించాయి. వికొకు నవ్య హెగెల్ భాష్యం చెప్పిన క్రోషే క్యుకో రచనను "విషె ప్రాంతపు ఆలోచనగా" పేర్కొన్నాడు. "ఇది నైరూప్య వ్యతిరేకం, చారిత్రకం ప్రజల అభివృద్ధిలో జీవ చైతన్యతా భావాధారంగా వచ్చిన చారిత్రక వాదానికి నాంది. జాతీయ విమోచనలో కొత్త రాజకీయాలకు మొదలు, విప్లవాత్మకం, సరళధోరణిలో" ఉన్న గ్రంథంగా క్యుకోను క్రోషె అభివర్ణించాడు.

ఒక శతాబ్దానికి ముందే, మార్క్స్ గతి తార్కిక చారిత్రకవాదాన్ని ఊహించిన వికొను, నేడు తద్వతిరేక నియంతృత్వ శక్తులు గుత్తకు తీసుకున్నాయి. దేశాల విశ్వజనీన నియమాన్ని చాటిన వికొ, "ఆయాదేశానికి ఒక విధంగా రూపొందే లక్షణాలు, శాశ్వతమైనవి ఉంటాయని కూడా చెప్పాడు."(1) సంకుచితమైన జాతి అభిమానాన్ని యీ సిద్ధాంతం నుంచి రాబట్టవచ్చు. వికొ చెప్పిన చరిత్ర పునరావృత సిద్ధాంతం తిరోగమన సామాజిక భావాలు. స్పెంగ్లర్(2) వాదానికి దారి తీసాయి. అదే ప్రాశ్చాత్య ప్రపంచపు పతనం. సోరోకిన్(3) చెప్పిన సాంస్కృతిక పునరావృత తిరోగమన సిద్ధాంతం కూడా దీనిని పోలి వుండడం గమనార్హం.

చరిత్రలో పునరావృతమయ్యేవి దేవతల యుగం, వీరుల యుగం, మానవశకం. మానవశకంలో మానవుడి వివేచన స్వభావం బహిర్గతమౌతుంది. ఈ పునరావృత సిద్ధాంతాన్ని సమర్థించే నిమిత్తం, ప్రజాస్వామ్యాన్ని త్రోసిరాజనడానికి, తిరోగమన సాంఘిక భావాలకు వికొ అవకాశమిచ్చాడు. 17వ శతాబ్దంలో ప్రజల నియమం, రెండో 'మానవశకం' వలన జనించినట్లు వికొ ప్రకటించాడు. ఆ విధంగా స్పెంగ్లర్ పేర్కొన్న అంధకారమయ దివ్యవాణిని వికొ ముందే ఊహించాడు.(4)

జాతీయవాదాన్ని ఆమోదించినట్లుగా "న్యూసైన్స్"కు భాష్యం చెప్పిన క్రోషె, తన

---

1) కోచె, ఫిలాసఫీ ఆఫ్ వికొ

2) 1880-1936 జర్మన్ తత్వవేత్త

3) 1889 రష్యాలో జన్మించాడు. అమెరికాలో సామాజిక శాస్త్రజ్ఞుడు.

4) మానవశకం కూడా దాని గమనం పూర్తి చేసింది. క్రమశిక్షణ నియమానికి గౌరవం, మతగురువుల సామాజిక సమైక్యత యివన్నీ మానవతతో కూడిన సహనానికి దారితీశాయి. మతస్థానాన్ని తత్వం ఆక్రమించింది. సమానత్వం చనువుకు దారితీసింది. ప్రజలందరూ అనే భావం తగ్గి, వ్యక్తిగత అభిరుచి పెరిగింది. తన వాంఛల కనుగుణంగా ప్రజాసేవకులను వాడుకోగలగడం అనేది నీచుడికి కూడా సాధ్యమైంది. ఎక్కువ బేరం పెట్టిన ముఠానాయకుడికి ఓటును అమ్ముకున్నారు. మానవశకంలోని యీ చివరిదశలో, ఆచారాలు, చట్టాలు గట్టిగా అమలు పరచకపోవడం, సడలించడం, అంతర్గతంగా విచ్ఛిన్నత, బయటినుండి దండయాత్ర వలన మళ్ళీ అటవికతకు పోవడం, మళ్ళీ మూడు యుగాల వృత్తం ప్రారంభంగావడం జరిగింది. 17వ శతాబ్దంలో తత్వవేత్తల ప్రకృతి నియమం మానవశకంలోని ద్వితీయదశనుండి జనించింది.(ఫిష్, బెర్లిన్, ఇన్‌ట్రడక్షన్ టు వికొ ఆటోబయాగ్రఫీ).

గ్రంథాన్ని కాబోయే నాటి తత్వవేత్త విండల్‌బాండ్‌కు అంకితమిచ్చాడు. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో చరిత్రతత్వంపై హైడల్‌బర్గ్‌లో ఉపన్యాసాలిస్తూ విండల్‌బాండ్, జాతీయ సంస్కృతి గల చరిత్రకారునిగా వికొను విశ్వజనీనత గల హెర్డర్‌కు భిన్నంగ చూపుతాడు. “చారిత్రక రీతులలో పునరావృతమయ్యే పద్ధతులు వికొ రచనలో ఆసక్తికరమైనవి. అటవికత నుండి నాగరికతకు ఒకసారి వచ్చిన ప్రజలు, తొలిదశ కంటే అధ్వాన్నమైన అటవికతలోకి పోతారనడం సరైనదే. ఈనాడు పోలికలతో అతని పరిశీలన సరైనదనడానికి ఆధారాలున్నాయి. ఒకవైపున రష్యావారి, మరోప్రక్క ఫ్రాన్స్, ఇంగ్లండ్ వారి అటవికత్వంతో మనం బ్రతుకుతున్నాం.”

నేటి తన అనుచరులను చూస్తే సమాధిలో కూడా వికొ విలపిస్తాడు. సోరెల్ వలన ఫాసిస్టు తత్వవేత్తగా వికొకు ముద్రపడింది. వికొ, సోరెల్ నుండి, ఇటలీ ఫాసిజానికి జాతీయ సోషలిస్టు పండితులు బాటలు వేశారు.”

వివేచనవాదంపై న్యూసైన్స్‌లో తిరుగుబాటు చదివితే వికొకు పట్టినగతిలో వక్రోక్తి స్పష్టమౌతుంది. అతని చారిత్రకవాదాన్ని స్వీకరించడానికి మార్క్సిస్టులు భయపడడానికి కారణం వ్యతిరేకులు ముందే అతన్ని తమవాడుగా చేసుకోవడమే. కానీ ఉద్దేశపూర్వకంగా చేసిన తప్పుడు భాష్యాల నుంచి, కృత్రిమ వ్యాఖ్యానాలనుండి వికొను కాపాడాలి. ఎపిక్యూరస్ సంప్రదాయం, బేకన్, హాబ్జ్, గ్రోషస్ తదితరుల ఆధారంగా అతడు పెంపొందించిన మానవతా చరిత్ర తత్వాన్ని అట్టిపెట్టాలి. చరిత్ర అంటే మానవజాతి తనను తాను సృష్టించుకోవడమే. మానవుడు తన చరిత్రను తానే నిర్మించుకుంటాడు. మానవస్వేచ్ఛ అధ్యాయంలో యీ వ్యాక్యాలు సువర్ణాక్షరాలతో లిఖించాలి. అవి మానవ వివేచనా ప్రకటనలు. ఆధ్యాత్మిక బానిసత్వం లేని స్వేచ్ఛా జీవి మాటలు. తనలో తాను విశ్వాసం ప్రకటించే తీరే అది. వికొ రూపొందించిన చరిత్రతత్వం, మానవవాదాన్ని సహజవాదంతోనూ, స్వేచ్ఛను నియతివాదంతోనూ, ఇచ్ఛను వివేచనతోనూ, ఉద్వేగవాదాన్ని వివేచనవాదంతోనూ సమన్వయీకరిస్తుంది. వికొ కావాలని పునర్వికాసకారుడుగా వుండలేదు. అయినా మానవవాద విజ్ఞానాన్ని అతడు సిద్ధం చేశాడు. చరిత్రలో కొత్త విజ్ఞానం మానవుడి తిరుగుబాటును ప్రకటిస్తుంది. “సామాజిక లోకమంతా మానవసృష్టి” అని ప్రకటించడంతో ఆధునిక ప్రజాస్వామ్యానికి మూలసూత్రాన్ని వికొ రాబట్టాడు. ప్రజల స్వభావానికి యిష్టంగా ఉండాలి ప్రభుత్వాలు. ఆ స్వభావంతోనే ప్రభుత్వాలు వస్తాయి.

తన కాల స్వభావానుగుణంగా ఉన్న వికొ భావాలు, విప్లవానంతర ఉద్వేగభావాలు కనుగొని తప్పుడు భాష్యం చెప్పేలోగానే, ఐరోపా జీవితంలో కనిపించని ప్రభావం చూపెట్టింది. వివేచనకు దేవతగా చేసిన ఫ్రెంచ్ విప్లవాన్ని కూడా రూసో ద్వారా యితని

భావాలు ఉత్తేజపరచాయి. మానవాళి చరిత్ర తత్వాన్ని నిర్మించక పూర్వమే, హెర్డర్ యీ భావాలతో పరిచయం పొందాడు. అయితే హెర్డర్ స్వయంగా ఆలోచించనారంభించి, వికొతో నిమిత్తం లేకుండానే తన చరిత్రతత్వాన్ని పెంపొందించాడు. వికొలోని చారిత్రక వాద మందలి బలహీనవాదనలు తృణీకరించాడు. దీని వలన తిరోగమనవాదుల వ్యాఖ్యానాలకు హెర్డర్ అవకాశమిచ్చాడు. బాస్వే, వికొ, హెర్డర్‌లు మానవాళి చరిత్రకారులైతే, తాత్వికంగా వారందరిలో హెర్డర్ మహోన్నతుడు. మానవ సంస్కృతి నిర్మాణంలో క్లిష్టపరిస్థితులను చారిత్రకంగా అధ్యయనం చేయడంలో తార్కికంగా క్రమబద్ధతకు చేరుకున్నాడు హెర్డర్. ఆదిమానవుడి ప్రేరణలలో తొలినాగరికత ఉన్నదన్నాడు. జర్మనీలో అతడు ఉద్వేగవాదానికి పితామహుడైనా, ఆదిమ మానవుడి సాధారణ ధోరణి, తలవనితలంపుగా చేసే విధానాన్ని రూసో పైకెత్తి శ్లాఘించినట్లుగా యితడు చేయలేదు. "దైవికమైన పౌరమతజ్ఞానాన్ని" వికొ చెప్పినప్పటికీ, హెర్డర్ దానిని తృణీకరించాడు. మానవ సహజ పుట్టుక గురించిన పరిశోధనలో, భాషాశాస్త్రాలను నిశితంగా వికొ పరిశీలించలేదు. ఆదిమమానవుడు కవిత్వ ధోరణిలో మాట్లాడారని మాత్రమే వికొ చెప్పాడు. అర్థవంతమైన భాషవలన మానవుడు జనించిన సత్యాన్ని హెర్డర్ కనుగొన్నాడు. అది దైవ బహుమానం కాదన్నాడు. జీవరాశికి మానవులకు గల తేడా భాషలో ఉన్నదన్నాడు. "భాషను కనుగొనకపోతే, మానవమేధస్సు నేటి రూపంలో ఉండేదికాదు."(1)

హ్యూం ప్రచారంలోకి తెచ్చిన భయం సిద్ధాంతాన్ని హెర్డర్ నిరాకరిస్తూ, మతం ఆదిమమానవుడి వివేచనా సృష్టిగా పేర్కొన్నాడు. మానవాళి సహజ సంఘటనను వివరించే తొలి ప్రయత్నమది. మానవజాతిలో ప్రగాఢంగా వున్న నైతికభావనలు ఉన్నతమైన మతానికి తావిచ్చింది. క్రైస్తమతం సఫలం గావడానికి దాని మానవతే కారణమని హెర్డర్ అన్నాడు. అదొక నైతికవిధానంగా అతడు భాష్యం చెప్పాడు. అన్ని ఉన్నత మతాలు, ఉదాహరణకు ఇస్లాం, అంత సులభంగా వివరించవీల్లేదు. పరిణామంలోని కొన్ని దశలలో మానవమేధస్సులో మతాలు ముడిపడివున్నాయని హెర్డర్ తత్వంలో మూలసూత్రం. చారిత్రకంగానూ మనోవైజ్ఞానికంగానూ అది సరైన భావన.

వికో పేర్కొన్న బైబిల్ ఊహలు, పౌరమత జ్ఞానంతో నిమిత్తం లేకుండా, మానవ

1) మారుతున్న సంఘటనల వెనుక మారని నియమాలు ఉన్నాయనే గాఢనమ్మకం, 17వ శతాబ్దంలో బేకన్, డేకార్ట్, న్యూటన్‌లను పరిమితంగా ముందుకు సాగనిచ్చాయి. 18వ శతాబ్దంలో పదార్థ ప్రపంచమంతటికీ వీటిని అన్వయించారు. 19వ శతాబ్దంలో మానవ మేధస్సుకు దీనిని విస్తరించటం సంభవించింది. దీనికి మనం జర్మనీకి రుణపడి ఉన్నాం. ఫ్రెంచి విప్లవానికి పూర్వం, వికొ మినహా మరెవరూ మానవతాభివృద్ధి గురించి సాధారణీకరణ చేయవచ్చునని భావించలేదు. అన్నిటికంటే జటిలమైన ఉన్నతమైన యీ కృషిని జర్మనీ మేధావులు చేశారు. బకిల్, ఇన్‌ట్రడక్షన్ టు ది హిస్టరీ ఆఫ్ సివిలిజేషన్.

పరిణామమంతా స్వాభావికమని హెర్డర్ అభిప్రాయపడ్డాడు. మానవుడు ప్రకృతిలో భాగమని, మానసిక, భావ, భౌతిక రీతులన్నీ సహజస్థితిలో భిన్నరూపాలని హెర్డర్ చెప్పాడు. ప్రకృతి ధోరణికి వ్యతిరేకంగా తిరుగుబాటు గావిస్తూ మానవుడిలో వివేచనాత్మక స్వేచ్ఛాపూరిత యిచ్ఛ క్రమంగా వెల్లడౌతున్నదనే కాంట్‌భావాన్ని హెర్డర్ నిరాకరించాడు. ఆ విధంగా అధిభౌతిక వివేచనవాదాన్ని హెర్డర్ కాదన్నాడు. మానవ వివేచనకు, ప్రకృతి వివేచనకు వ్యతిరేకత వున్నదనే మార్మిక ధోరణికి హెర్డర్ విముఖత చూపాడు. ప్రకృతిలో భాగమైన మానవుడు, ప్రకృతినుండే ఇచ్ఛకుగల స్వేచ్ఛను, వివేచనను రాబట్టినట్లు స్పష్టం చేశాడు. "మానవచరిత్ర మానవ శక్తులను చూపే సహజ చరిత్ర, కాల ప్రదేశాల ననుసరించి మార్పులు సంభవిస్తుంటాయి."

19వ శతాబ్దపు విజ్ఞాన ఆలోచనంతా వికాసోద్యమంలోని వివేచనావాదం (యాంత్రిక స్వాభావికవాదం) వలన, హెర్డర్ పెంపొందించిన వివేచనాత్మక ఉద్వేగవాదం వలన ప్రభావితమైంది. వికో న్యూసైన్స్‌లోని ప్రత్యక్షధోరణులు యీ ఆలోచనా స్రవంతిలో ఉండగా, ఆధునిక ప్రజాస్వామిక సంస్కృతిలో అవి మేళవించాయి.(1) దీని తిరోగమన లక్షణాలు సమాంతరంగా పయనించి, ఒకటి విప్లవానంతర నవ్య కాథలిక్ ఉద్వేగవాదం లోకి మరొకటి హెగెల్ ద్వారా, పరస్పర విరుద్ధాలైన కమ్యూనిస్టు ఫాసిస్టు నియంతృత్వాలలోకి చొచ్చుకపోయినవి.

ఫ్రాన్స్‌లో విప్లవానంతర ధోరణికి, జర్మనీ పునర్వికాస ఆటుపోటులను తట్టుకొని, వికో కనుగొన్న సత్యాలు, మార్క్సిస్టు పిడివాదంలోనూ, ఫాసిస్టు నియంతృత్వం వలననూ పక్కదారులు పట్టలేదు. హెగెల్ పగటి కలల విజ్ఞాన వ్యతిరేకతకు మాత్రం యీ భావాలు లొంగాయి. "18వ శతాబ్దంలో వికోతో ఆరంభమైన చారిత్రక రచనలు, కొండర్సే(2) హెర్డర్, హెగెల్, కోంట్ (3) కొనసాగించగా, మహోన్నతుడైన చివరి ప్రతినిధి బకల్(4)లో యివి వచ్చి చేరాయి."(5)

సాహిత్యంలో చరిత్ర ఒక శాఖ అనే సంప్రదాయ సిద్ధాంతానికి 19వ శతాబ్దాంతానికి ఇంగ్లండ్‌లోని మితవాద విద్యావంతులు తిలోదకాలిచ్చారు. హిస్టరీ ఆఫ్

---

1) సార్‌బోన్ ఉపన్యాసాలలో టర్గాట్, తన భావాలలో మానవాళి గురించిన విషయాలు చరిత్రకు చాలా బాగా అన్వయించాడు. ఇదే భావం ది ఎడ్యుకేషన్ ఆఫ్ ది హ్యూమన్‌రేస్ అనే వ్యాసంలో లెసింగ్ వ్యక్తీకరించాడు. చారిత్రక విజ్ఞానంలో యీ భావాలకు సరైన స్థానాన్ని హెర్డర్ కల్పించాడు. ఫ్లింట్, హిస్టరీ ఆఫ్ ది ఫిలాసఫీ ఆఫ్ ది హిస్టరీ.

2) 1743–94 ఫ్రెంచి తత్వ, గణితశాస్త్రజ్ఞుడు

3) 1798–1857 ఫ్రెంచి ప్రత్యక్షవాద పితామహుడు

4) 1821–62 ఆంగ్ల చరిత్రకారుడు

5) లెకీ, హిస్టరీ ఆఫ్ రేషనలిజం

ది ఫిలాసఫీ ఆఫ్ హిస్టరీ అనే గ్రంథం ద్వారా రాబర్ట్ ఫ్లింట్ చరిత్ర సృష్టించాడు. రెండో భాగాన్ని అతడు పూర్తి చేయనేలేదు. "వికో పై ఒక చిన్న సిద్ధాంతం వ్రాసి, న్యూసైన్స్‌ను తొలిసారి ఆంగ్లమేధా ప్రపంచానికి పరిచయం చేశాడు. మానవుల పూర్వీకులు జంతువులని డార్విన్ సిద్ధాంతం బయటపెట్టడంతో, చరిత్ర పరిణామ దృక్పథం అనుభవరీత్యా వ్యవస్థాపితమైనది. వివేకులైన చట్ట నిర్మాతలుగాక, పశుతుల్యులైన వారు సమాజాన్ని స్థాపించారనే భావం, డార్విన్ సిద్ధాంతంలో యిమిడివున్నది. 19వ శతాబ్దపు మానసిక ధోరణి ఒక ఉద్యమానికి రెండురోజులుగా, విజ్ఞానంలో పరిణామ సిద్ధాంతం చారిత్రక పద్ధతి (చారిత్రకవాదం)గా పెంపొందాయి,"(1)

హాలం, గిబ్బన్ చరిత్ర తత్వకారులుకారు. కొత్త తత్వానుగుణంగా చరిత్ర వ్రాసిన ప్రథములు. మానవుడి సంతోషం ప్రమాణంగా స్వీకరించి నాగరికతను పురోభివృద్ధిని నిర్ణయించాడు గిబ్బన్. మానవుడి సంతోషానికి రాజకీయ స్వేచ్ఛ ముఖ్యం అన్నాడితడు. సమాజంలో అన్ని ఉద్యమాలను హాలం తన చరిత్ర భావనలో స్వీకరించాడు. బరీ, మేర్స్, పావెల్, ఫిర్త్ వంటి చరిత్రకారులు విజ్ఞానంలో పరిణామ సిద్ధాంతాన్ని అన్వయించి తమ పెద్దల అడుగుజాడలలో పయనించారు.

"ప్రకృతి అధ్యయనంలో పుట్టుక వహించిన ప్రాధాన్యతను, 19వ శతాబ్దంలో చరిత్ర అధ్యయనానికి సర్వసాధారణంగా అన్వయించారు. ప్రకృతిలో చారిత్రక భావం వలన సూర్యమండలం, భూమి, ప్రకృతిలోని ఖనిజాల చరిత్ర యిట్లా వచ్చినదే. ప్రకృతి విజ్ఞానాన్ని విప్లవాత్మకం చేసిందీ పద్ధతి. మానవ చరిత్ర కూడా కార్యకారణ సంబంధంతో పుట్టిందనే పద్ధతి యిలాగే పెంపొందినది. దీనివలన చరిత్ర పరిశోధన విప్లవాత్మకమైంది. చరిత్ర కూడా విజ్ఞానంగా మారింది. ప్రస్తుతం మానవజాతి కార్యకారణాల పరంపరలో భాగమే ముందున్న జాతి ప్రస్తుతానికి కారణం. దీనిని కనుగొనడం చరిత్రకారుల కృషి, కారణాన్ని వివరించి మానవాళి అభివృద్ధిని వారు తెలుసుకుంటారు."(2)

"ప్రజా బాహుళ్యం అర్థం చేసుకున్న దానినిబట్టి, మనిషికీ మనిషికీగల సంబంధాన్ని చరిత్ర అధ్యయనం చేస్తుంది. రెండు మానవసమాజాల మధ్య సంబంధాలను చక్కబరుస్తుంది. కాని విశాల దృక్పథంలో చూస్తే, ప్రకృతి చరిత్రలో మానవ చరిత్ర కలసిపోతుంది. ప్రకృతిలో మానవుడి సంబంధాన్ని పరిశీలిస్తుంది. మానవుడి పూర్వ

---

1) ఎ.ఎల్.రేసీ, ది యూస్ ఆఫ్ హిస్టరీ-టీచ్ యువర్ సెల్ఫ్ సీరీస్‌లో పీఠిక- ఇంగ్లీష్ యూనివర్సిటి ప్రెస్.

2) జె.బి.బరి సెలక్టెడ్ ఎస్సేస్

3) సర్ జాన్ మేయర్స్, ది డాన్ ఆఫ్ హిస్టరీ

చరిత్ర జంతుప్రపంచ చరిత్రలో కలసిపోతుంది."(3)

"సమాజంలో వున్న మానవ జాతుల స్థితిగతులను చరిత్ర పరిశీలిస్తుంది. ఆ పరిస్థితుల కారణాలను అన్వేషించి, అభివృద్ధికిగాని పతనానికిగాని తోడ్పడేపని కూడా చేస్తుంది. క్రమంగానో, హఠాత్తుగానో జరిగే యీ పరిణామాలను రాజకీయ, ఆర్థికస్థితిని చూపుతుంది. వివిధ కాలాల్లో ఆయా ధోరణుల ప్రభావాన్ని కూడా తెలుపుతుంది."

మార్క్సిస్టుల దృష్టిలో యివన్నీ "బూర్జువా చరిత్రకారుల అభిప్రాయాలు. కాని వీరెవరూ మార్క్స్ అన్నట్టుగా, "స్వర్గంలో చరిత్ర పుట్టుకను చూడలేదు". మానవుడు ప్రకృతి సంబంధాలకు భిన్నంగా చరిత్రను అవగాహన చేసుకున్నాడని మార్క్స్ అపహాస్యం చేసినవారిలో వీరులేరు. మార్క్సిస్టు అసహనం అలావుంచి, చరిత్రలో పరిణామ దృష్టిని అంగీకరించడం వలన, విజ్ఞానానికి వర్గ సంబంధం లేదని రుజువు అయింది. ప్రకృతి నియమం మానవ మేధస్సుద్వారా బహిర్గతమౌతుండగా, భౌతిక సంఘటనల చరిత్రతో నిమిత్తం లేకుండానే, భావ చైతన్యత స్వతంత్రించి వెల్లడౌతుంది. ఆలోచనారంగంలోగల స్వతంత్ర ప్రతిపత్తి (మతరహిత దృష్టిలో) భావస్వేచ్ఛకు పునాది. అదే మానవ ఉనికిలో అత్యున్నత ఆదర్శం.

గ్రోషెస్, హాబ్జ్ ఆరంభించిన భావోద్యమానికి వికో విస్తృత ప్రాతిపదిక కల్పించగా హెర్డర్ ఉన్నత తాత్వికదశకు పెంచాడు. ఆధునిక కాలం ఆరంభమైనప్పుడు మానవ మేధస్సుకు సవాల్‌గా తయారైన సాంఘిక సంబంధాల సమస్యకు యిది సిద్ధాంత ధోరణి కల్పిస్తున్నది. 18,19 శతాబ్దాల అనుభవం బట్టి, ప్రకృతితో మానవుడికిగల సంబంధంలో సృజన రాజకీయ సాంఘికరంగాలలో సృష్టి వైఖరి స్పష్టపడింది. వైజ్ఞానిక, సాంఘిక, రాజకీయ విప్లవాల ఫలితమిది. విప్లవభావమే ఉద్వేగపూరితం. జీవనపరిస్థితులను మార్చడానికి మానవుడి ప్రయత్నాన్ని అది సూచిస్తుంది. అవసరం కొద్దీ సాంఘికమార్పులు సంభవిస్తాయని యిది సూచిస్తుంది. కనుక, 18,19 శతాబ్దాల విప్లవాలను "వివేచనా యుగం"గా పేర్కొన్నారు.

✦ ✦ ✦

# జ్ఞానవికాసం

18వ శతాబ్దాన్ని వివేచనాయుగంగా చరిత్ర పేర్కొంటున్నది. అదే కాలానికి ఎంతో ప్రాధాన్యత ఉండడమే గాక, వివేచనావాదం తన భౌతిక సంప్రదాయానికి విడాకులిచ్చి, ఉద్వేగవాదంతో తాదాత్మ్యం చెందింది. అనేక చారిత్రక సంఘటనలు జరిగిన ఆ కాలంలో మేధావుల జీవితంలో ఉద్వేగం ఒక విశిష్ట లక్షణమైంది. విజ్ఞానం అతివేగంగా విస్తరిస్తుండగా ప్రకృతి నియమాల స్థిరత్వంలో విశ్వాసం బలపడింది. మానవుడి వ్యవహారాలకు వివేచన అన్వయించవచ్చునని, వివేచనాత్మకంగా వాటిని క్రమబద్ధంచేస్తే, విశ్వవ్యాప్తంగా మంచికి దారి తీస్తుందని నమ్మారు. జగత్తులో చిక్కులను మానవుడు పరిష్కరించే శక్తితో వుండడమేగాక, ప్రకృతి రహస్యాలలోకి ఇంకా చొచ్చుకపోగలడు. అజ్ఞానం, అసూయ, మూఢనమ్మకాలు వదిలేస్తే, సామాజిక సంబంధాలకు, వివేచనాత్మక, సమన్వయం, పొందిక సాధ్యమే. వివేచన కేవలం తాత్విక చర్చనీయాంశం కాదు. నిజజీవితంలో క్రమబద్ధం చేసే లక్షణంగా వివేచన మారింది.

మేధావులు కార్యకలాపాలలో బాగా పాల్గొన్న కాలమది. ఆలోచనాపరుల స్వేచ్ఛకు హద్దులులేని రోజులవి. విజ్ఞానం కొత్తదారులు చూపుతుండగా, నైతిక భౌతికాభివృద్ధికి కొత్త అవకాశాలను, సాహసోపేత భావాలకు అవకాశాన్నిచ్చాయి. మానవజీవితంలోని అన్ని రంగాలలో ధైర్యంగా ఊహించి, స్వేచ్ఛకు నూతన మార్గాలు వేసి, ఆనందించిన అవకాశాలు నాడు ఉన్నవి. విజ్ఞానం విస్తరించడానికి అవధులు లేవని, జీవితానికి వివేచన మార్గదర్శకం అని మేధావులు నాటి ఉద్వేగ ఉత్సాహంలో, ప్రజ్ఞాయుత మార్పులలో విశ్వసించారు. అందరూ అంగీకరించే విషయాలను దాటి తన కలగాపులగపు వాదనలను వోల్తేర్ పోనివ్వలేదు. మరొకవైపున రాజకీయాలకు తన సామాజిక ఒడంబడిక సిద్ధాంతం ద్వారా వివేచనాత్మక ప్రమాణాన్ని కనుగొన్నానని, వివేచనారహితవాద ప్రవక్త జాన్ జాక్ రూసో విశ్వసించాడు. ఎక్కడా పొందికలేని యీ యిరువురు వ్యక్తులు నాటి వివేచనాయుగానికి ప్రాతినిధ్యం వహించారు. ఒక ఇరుసుపై రెండు స్థంభాలుగా, వివేచనావాదం, ఉద్వేగవాదం 18వ శతాబ్దంలో ఐరోపాలో పరిభ్రమించాయి.

18వ శతాబ్దంలో మేధావులకు ఎనలేని ప్రోత్సాహాన్ని సమకూర్చింది విజయ ధ్వజమెత్తిన విజ్ఞానమే. ఆకాశంలో అన్ని సమస్యలకూ న్యూటన్ గురుత్వాకర్షణ నియమం

పరిష్కారమార్గమనిపించింది. పదార్థ విజ్ఞానంలోనేగాక, లిన్, బైఫన్,(1) పరిశోధనా ఫలితంగా మొక్కల, జంతువుల గురించి చాల విషయాలు తెలిసాయి. ఆధునిక రసాయనిక విజ్ఞానానికి లావాజ్యా,(2) ప్రీస్ట్లీ(3) ప్రాతిపదికలు వేశారు. మాపిరషస్, డాలంబర్(4) గణితశాస్త్రం వలన డేకార్ట్ పరిభ్రమణ సిద్ధాంతం పరీక్షకు నిలవదని తేలిపోయింది. విజ్ఞానాభివృద్ధి, గణితపద్ధతుల విస్తరణ వలన కార్టీసియస్ విశ్వసిద్ధాంతాన్ని మళ్ళీ పరిశీలించడమేగాక, యాంత్రిక విశ్వదృష్టి క్రమంగా పెంపొందింది. తొలుత జగత్తును కదలించే శక్తి ఏదో ఉన్నదనే ప్రతిపాదనను లాప్లాస్(5) త్రోసిపుచ్చాడు.

డేకార్ట్ అధిభౌతికత పరిమితులు అధిగమించి 18వ శతాబ్దంలో వివేచనావాదం ముందుపోడానికి పైరీబాల్(6) శక్తివంతమైన ప్రభావం ఒక కారణం.

బాల్ తన గురువు డేకార్ట్ కంటే ధైర్యశాలి. విజ్ఞానం, మతం డేకార్ట్ దృష్టిలో విరుద్ధమైనవిగావు వివేచన, విశ్వాసం, కలిసే ఉండేవి. ఈ లోపాన్ని బాల్ చూపాడు. డేకార్ట్ సందేహవాద ఆయుధాన్ని నైపుణ్యంతోనూ, నిర్ధాక్షిణ్యంగానూ బాల్ ఉపయోగించాడు. క్రిటికల్ అండ్ హిస్టారికల్ నిఘంటువులో మతంపై బాహాటంగా బాల్ దాడి చేయలేదు. కాని ప్రతివాక్యం కూడా సందేహానికి దారితీసేదిగా ఉన్నది. మతంతో సంబంధం లేకుండా నీతి స్వతంత్రించి ఉండగలదని తొలుత చెప్పింది బాల్. సంశయంలో ఆరిచేరినవాడని పేరు తెచ్చుకున్న బాల్ ప్రభావం వోల్తేర్‌పై ఉన్నప్పటికీ, అతడు బాల్ అంతదూరం పోలేదు. స్వేచ్ఛాలోచనకు బాల్ ఆరంభించిన ఉద్యమం, వోల్తేరు నాయకత్వాన సాగింది. బాల్ రచనలకు ఐరోపాలో వచ్చిన ప్రభావం వలన, 17వ శతాబ్దంలో విప్లవానికి తగిన రంగం సిద్ధమైంది."

18వ శతాబ్దంలో సహజవాదం ఒక వైజ్ఞానిక ఆలోచనాక్రమంగా మారింది. విజ్ఞానశాఖలలో వచ్చిన ప్రపంచానుభవాన్ని తత్వంగా సాధారణీకరించి చెప్పడానికి వీలైంది. అప్పటి వరకు సహజతత్వం పదార్థ విజ్ఞానంపై ఆధారపడి ఏకపక్షంగా ఉంటుండేది. 18వ శతాబ్దంలో, జీవశాస్త్రం, మానవ శరీరం, అంగనిర్మాణం గురించిన విజ్ఞానం పెరగడంతో యిదింకా గట్టిపడింది. విజ్ఞాన పరిధి విస్తరించగా, సహజతత్వానికి ఇంద్రియానుభూతివాదం ఆమోదయోగ్యమైంది. లాక్‌ను అధిగమించి పోయిన కాండియాక్ జ్ఞానానికి ప్రతిబింబం ఆధారం కాదన్నాడు. జ్ఞానమంతటికీ మూలం ఒక్కటేనన్నాడు. "

---

1) 1707-88 ఫ్రెంచి ప్రకృతి శాస్త్రజ్ఞుడు
2) 1743-94 ఫ్రెంచి రసాయన శాస్త్రజ్ఞుడు
3) 1733-1804 ఇంగ్లీషు రసాయన శాస్త్రజ్ఞుడు
4) 1717-83 ఫ్రెంచి గణిత శాస్త్రజ్ఞుడు
5) 1749-1827 ఫ్రెంచి గణిత, ఖగోళ శాస్త్రజ్ఞుడు
6) 1647-1706 ఫ్రెంచి తత్వవేత్త, విమర్శకుడు.

ఇంద్రియాల వలననే జ్ఞానార్జన అంతా సంభవమని" యితనివాదం.

అంతర్గత భావాలనే డేకార్ట్ సిద్ధాంతాన్ని లాక్ సందేహించాడు. అయితే, ప్రతిబింబం కూడా జ్ఞానానికి ఆధారంగా ఇతడు స్వీకరించినందున జ్ఞానసిద్ధాంతంలో స్పష్టత రాలేదు. ఈ అస్పష్టత నుండి ఇంద్రియ జ్ఞానవాదాన్ని కాండియాక్ విమోచన గావించాడు. మనస్సు పదార్థ రహితమనే సిద్ధాంతాన్ని యితడు ఒప్పుకోలేదు. ఇంద్రియానుభూతిగానే మనస్సును స్వీకరించిన కాండియాక్, ఇంద్రియాలపై బయటి వస్తువుల ప్రభావ ఫలితంగా ఇంద్రియశక్తులు పెంపొందుతాయన్నాడు. గసెండి, హాబ్జ్‌లను అనుసరించి, జ్ఞానాన్ని సంవేదనను కలిపేశాడితడు. జంతువుల పరిశీలన ఫలితాలను మానవుడి మనస్సుకు అన్వయించవచ్చునన్నాడు. అంతర్గత శక్తులున్నాయని కాండియాక్ విజ్ఞాన సహజవాదం అంగీకరించదు. "ఇంద్రియ గ్రహణం గురించి లాక్ చాలా వివరంగా చెప్పాడు. కాని యింకా కొంత అస్పష్టత వున్నది. ఆత్మశక్తులన్నీ అంతర్గత శక్తులని లాక్ అన్నాడు. ఇంద్రియానుభూతి నుండే అవి రాబట్టవచ్చునని అతనికి తోచనేలేదు."

మనస్సు, ఆత్మకు సంబంధించిన పరిశోధన, లోగడవలె ఊహాజనిత అధిభౌతిక తత్వంలోగాక, శారీరక అధ్యయనంగా జరగాలని, అంటే శారీరక శాస్త్రంలో భాగంగా మనోవిజ్ఞానాన్ని పరిగణించాలని కాండియాక్ సూచించాడు. భావ విచ్ఛేదన ప్రబలివున్న వివేచనయుగంలో సైతం ఈ సూచన సాహసోపేతమైనదే. ఈ సూచన అందుకొని, మానసిక సంఘటనలను శారీరక రీతులలో వివరించడానికి, ఆంగ్లవైద్య నిపుణుడు, డేవిడ్ హార్ట్లే ప్రయత్నించాడు. ఇంద్రియానుభూతికి ఈథర్ ప్రకంపన కారణమనే న్యూటన్ భావన ఈ పరిశీలనకు బలాన్నిచ్చింది.

మనిషిలో దేహం, మనస్సు అని రెండు భాగాలుంటాయనే ప్రతిపాదనతో ప్రారంభించి, వాటి రెండింటికీ సంబంధాన్ని చూచే ప్రయత్నం చేశాడు హార్ట్లే. బాహ్య వస్తువుల ప్రభావంతో ఈథర్‌లో ప్రకంపన వలన, మానసిక సంఘటనలు సంభవిస్తాయని అతడు తన పరిశోధనలతో నిర్ధారించాడు. ఇంద్రియాలపై ప్రభావం చూపెట్టే బాహ్య వస్తువులు మెదడులోని సూక్ష్మమైన కణాలపై, వెన్నెముకలో, నరాలపై ప్రకంపనాలు కలుగజేస్తాయట. మెదడులోని యీ పదార్థం ఇంద్రియానుభూతికి తక్షణసాధనగా హార్ట్లే గుర్తించాడు. ప్రకంపనాల వలన ఇంద్రియానుభూతి కలుగుతుంది. ఈ ఇంద్రియాను భూతులే భావాలుగా, చర్యలుగా మారతాయి. ఇవి శరీరనిర్మాణంలోని రీతులు. ఈ విశ్లేషణ ఆధారంగా హార్ట్లే ఇలా చెప్పాడు. "ప్రకంపనం అనబడే చలనం అన్ని ఇంద్రియాలపై భావాలపై కదలికలపై ప్రభావం చూపెడుతున్నట్లు ఒప్పుకుంటే, ఈ ప్రకంపనాలను మనమే సృష్టించవచ్చు. ఈ ప్రకంపనాల వలన భావాలు, సంవేదనలు కలుగుతాయని కనుగొనడం అసంభవమైనా యీ పని చేయవచ్చు. ఆత్మ సంవేదన,

మెదడులో ఉత్తేజం పొందే చలనానికి ఒక విధమైన సంబంధం ఉన్నది."

ఈ పరిశోధన ఎరాస్మస్ డార్విన్ కొనసాగించాడు. "కండరాల చలనానికి భిన్నంగా, జ్ఞానేంద్రియాల నరాల కదలిక మాత్రమే" భావం అని అతడు నిర్వచించాడు. ఇంద్రియానుభూతి సిద్ధాంతం సృష్టించిన ప్రతిమల గందరగోళాన్ని యితడు తొలగించే యత్నం చేశాడు. "మనస్ఫురణ, ఊహ జీవ కదలికలుగాక మరేమిటి? వస్తువుల ప్రతిమలు అంటారు. ఇవన్నీ ఎక్కడ వున్నవి? జీవవిధానంలో వీటిని పోలినది ఇంకేమిటి? కంటిపాపలో ప్రతిబింబించే వస్తువు యీ భ్రమకు కారణం. ఈ ప్రతిమ కాంతి నియమానికి సంబంధించిన విషయమేగాని జీవితానికి చెందినదికాదు. కంటిలోవలె కెమెరాలోనూ యీ విధానం గమనించవచ్చు. వస్తువును తొలగిస్తే ప్రతిమ శాశ్వతంగా అంతర్ధానమౌతుంది."

గ్రహణశక్తికి సంబంధించి ధైర్యంగా పైన పేర్కొన్న విషయాన్నిబట్టి, మానవుడిలో ఏదో ఆధ్యాత్మికశక్తి వుండి, ఇంద్రియానుభూతిని మార్చేస్తున్నదనే భావనను తృణీకరించింది. ఇంద్రియాలపై బయటవస్తువులు చూపే ప్రభావం వలన నాడీమండల విధానంలో జరిగే క్లిష్టమైన విధాన ఫలితంగా భావాలు జనిస్తాయి. డార్విన్ సిద్ధాంతం చెప్పే విషయం యిదే.

ఇంద్రియ గ్రహణ తత్వం కాండియాక్‌తో పరాకాష్ఠకు చేరుకున్నది. అయినా ఇంద్రియానుభూతి(తక్షణత్వం) లోని పరిమిత ప్రాధాన్యతను గ్రహించకపోవడమే ఇందులో మౌలిక లోపం. ఇందువలన, వంశపారంపర్యంగా సంక్రమిస్తూ, లోగడే వున్న ప్రభావాలను (ప్రేరణలు) స్వీకరించనేలేదు. ఫలితంగా, అనుభవానికి పూర్వమే జ్ఞానం వున్నదని, ఇదే ఆధ్యాత్మికశక్తి అని భావించడమే ఇంద్రియానుభూతి తత్వలోపం. తన సిద్ధాంతాన్ని తానే ఖండిస్తూ, అంతర్గత భావాలకు చోటిచ్చింది. ఇంద్రియానుభూతివాదం లోగల లోపాన్ని సవరించి, తార్కికంగా ప్రపంచానుభవరీత్యా దీనిని విజ్ఞాన సహజవాదంలోకి తెచ్చిన ఖ్యాతి కాడియాక్ శిష్యుడు కాబనిస్‌ది.(2) దీనినే 18వ శతాబ్దపు భౌతికవాదం అన్నారు.

ఇంద్రియజ్ఞానం అంటే ఏమిటో నిర్ధారణ చేయవలసిన అవసరాన్ని గుర్తించిన కాబనిస్, "దీనికి ముందుగా చైతన్యత, స్పష్టమైన దృష్టి వుండాలా" అని ప్రశ్నిస్తూ తన పరిశీలన ప్రారంభించాడు. "సంకల్పశక్తికి సంబంధంలేని చలనం, చూడకుండానే కలిగే ప్రభావాలు దేహంలోనే మరేదైనా భాగానికి చెందినవా? "ప్రత్యక్ష ఇంద్రియజ్ఞానంతో బాటుగా మానసిక సంఘటనలకు, 'సహజాత వాసనలు' ఆధారం అని నిర్ధారణకు వచ్చాడు. మెదడులో ఏర్పడే 'భావాలు లేక ప్రతిమలు' తక్షణం ఏర్పడే స్పందనలు కావు. అవి మెదడులో నాడీమండలంలో ముందే వున్నందున, తొలి అనుభవాల

సముదాయ ఫలితాలనవచ్చునన్నాడు. జీవితానికి మనస్సుకు భేదభావం లేకుండా తేడాను తొలగించేశాడు. జీవిత విధానంలో భాగమే మనస్సు అని కాబసన్ చూపాడు.

బయట వస్తువుల చర్యలననుసరించి, శరీరాంగాలపై అవి కలిగించే ప్రభావాలు, జ్ఞానం, వాటి ఉనికికి సంబంధించిన కారణాలు వుంటాయి. బ్రతకడమంటే సంవేదనమే. ఉనికిలో జరిగే సంఘటనల పరంపరలో, ప్రతివారిలోనూ ఏదొక శక్తి పెంపొందుతుంది. అదే ఆయా వ్యక్తులకు తృప్తినిస్తుంది. ఆ శక్తి సంతృప్తి కలిగిస్తుండగా, దానిని ఇంకా అభివృద్ధి చేసే సాధనకు ఉపక్రమిస్తాడు. మానవుడి ఇంద్రియాలపై బయట వస్తువులు నిరంతరం ప్రభావం చూపటంలోనే అతడి ఉనికి విశేషత ఉన్నది. అంటే, మేధ, కోరిక, వివేచన, ఇచ్ఛ అనేవన్నీ ఒకే జీవశక్తిని వెల్లడించే వివిధ లక్షణాలన్నమాట.

పునర్వికాస సంప్రదాయాన్ననుసరించి, మనస్సు స్వతంత్రమని డేకార్ట్ నొక్కి చెప్పాడు. మనస్సుకు సంబంధించినదిగా వివేచనను జీవితం నుంచి వేరు చేసి, మానసిక–భౌతిక సమాంతరాలను కలపడానికి వీల్లేని విధంగా చేశాడు. జగత్తుకు ప్రయోజనం ఉన్నదనే భావానికి అధిభౌతిక వివేచనావాదం మరొక మారుపేరు. ప్రజ్ఞ, వివేచనకు అలౌకిక స్వభావాన్ని కాదన్న సూచనలపై డేకార్ట్ పోరాడి, జీవశక్తి మానసికశక్తి ఒకటేనన్నాడు. "మానసిక స్వతంత్రతను కాదంటే నీతిని కూలదోయడమే. మనిషిని పశువుగా మార్చడమే. మతాన్ని అపహాస్యంగావించడమే. ఈ సత్యాన్ని సందేహిస్తే భౌతిక వాదాన్ని ఒప్పుకున్నట్లే.

మనోవిజ్ఞానాన్ని శారీరక శాస్త్రంలో కలిపేసి డేకార్ట్ ప్రమాణాన్ని కాబనస్ పడగొట్టేశాడు. ఉన్నత జీవుల చర్యలలో ఒకటిగా వివేచనను భూమిమీదకు తెచ్చాడు. 18వ శతాబ్దంలోని విజ్ఞాన సమాజవాదం కూడా పదార్థవాదం అంటే క్షమాపణ చెప్పుకోవలసి వచ్చింది. మతాన్ని ఎగతాళి చేసి, అది మూఢవిశ్వాసంపై ఆధారపడిందని చెప్పింది. నీతికి మానవుడి అంతరాత్మే స్థానం అనడం ద్వారా మంచి ప్రాతిపదిక ఏర్పరచి, శరీరంలో ఒక అంతర్భాగంగా చేసింది. ఇతర జంతువుల వలె మానవుడు కూడా ఒక యంత్రమేనని డలమిత్ర చూపాడు. మానవుడిని పశువుగా దిగజార్చక, అతని ఉనికిని, మార్పును ప్రకృతిలో భాగం చేసి, అలౌకికత నుండి తప్పించేశాడు.

డలమిత్రకు ముందు, ప్రకృతి అనే తనగ్రంథంలో జీవితానికి సూక్ష్మాణువులు కారణమని రాబిసెట్ రాశాడు. నిర్జీవ ప్రకృతిలోని భాగాలలో కూడ ఆత్మచైతన్యతలేని ఇంద్రియజ్ఞాన రహిత సూక్ష్మాణువులు ఉంటాయన్నాడు. శరీరం, భావం పరస్పర, పదార్థానికి రెండు సూత్రాలుగా ప్రభావితం చేసుకుంటాయన్నాడు.

మానవుడితో సహా ప్రపంచమంతా యంత్రమని ధైర్యంగా డలమిత్ర ప్రకటించాడు. ఆత్మ భౌతికమని, పదార్థంలో ఆత్మ ఉందని చెప్పాడు. శరీరం, ఆత్మ కలసి పెరిగి

పతనంగావడం, ఒకదానిపై మరొకటి ప్రభావం కనబరచటం వలన ఇవి రెండూ పరస్పర ఆధారితాలేగాక, పోలికలున్నవన్నాడు. జీవులన్నీ ఒకే జీవాణువు నుండి పరిణమిస్తాయి. ప్రకృతితో సంపర్కం వలన ఇవి పెంపొందుతాయి. జంతువులకు తెలివి ఉన్నది. మొక్కలకు లేదు. జంతువుల చలనం వలన ప్రకృతితో అనేక విధాల సంపర్కం పొంది, అవసరాలు పెంచుకొని, వాటిని తీర్చుకోడానికి శక్తిని వృద్ధి చేసుకుంటాయి. మానవుడికి అత్యున్నత తెలివి వున్నది. జంతువుల కంటె మానవుడికి అవసరాలు ఎక్కువ ఉండడమే యిందుకు కారణం. అతనిలో చలనం కూడా ఎక్కువే కోరికలు లేని జీవులకు మనస్సు లేదు.

సంచలనం కలిగించిన యీ భావాలు చెప్పిన వ్యక్తి అజ్ఞాని కాదు, మొండిగా ఏవో వాదనలూ చేయలేదు. డలమిత్ర అనుభవంగల వైద్యుడు. బాగా చదువుకున్నవాడు. పాతికేళ్ళుగా తన భావాలను పెంపొందించుకున్నాడు. సన్నిపాత జ్వరతీవ్రత అనుభవించి నప్పుడు రక్తప్రసరణ వేగం ఆలోచనపై ప్రభావం చూపెట్టిందని గ్రహించాడు.

తనపైనే తొలుత పరిశోధనలు చేసుకొన్న అనంతరం, ఆస్పత్రులలో అనేక రోగులను పరిశీలించాడు. ఆ పరిశోధనలు పరిశీలనల ఆధారంగా, మానవశరీర నిర్మాణ వ్యవస్థ ఫలితంగానే ఆలోచన వచ్చిందని నిర్ధారించాడు. ఆ తొలి పరిశీలనా ఫలితాలను ఆత్మ సహజ చరిత్ర పేరిట గ్రంథంగా ప్రచురించాడు.

ప్రారంభంలో జాగ్రత్తగా ఉన్నాడు. అరిస్టోటిల్ నుండి మాల్‌బ్రాన్ష్ వరకూ ఏ తత్వవేత్త కూడా ఆత్మను వివరించలేకపోయాడు. శరీరంలేని ఆత్మ, ఆకారం లేని పదార్థం వంటిది. అది అనూహ్యం. కనుక ఆత్మను గురించిన పరిశీలన శరీర అధ్యయనంతో ఆరంభించాలి. ఈ అధ్యయనం వలన మానవుడు యంత్రమని తేలింది. జబ్బు మనుషులు, కోలుకుంటున్నవారినెందరినో పరిశీలించి సేకరించిన విలువైన వాస్తవాల ఆధారంగా యీ నిర్ణయానికి వచ్చాడు. మానవుడిని గురించిన జ్ఞానం అనుభవానికి పూర్వమే వున్నదంటూ తత్వాన్ని రూపొందించ ప్రయత్నించిన డేకార్ట్, లెబ్నిజ్ వంటి తత్వవేత్తలను ఖండిస్తూ, అనుభవానంతర జ్ఞానమే సరైనదని డలమిత్ర ప్రకటించాడు. "శరీరాంగాల అధ్యయనం ద్వారా మానవుడిని గురించిన అనుభవం చాలా వరకు పొందవచ్చునన్నాడు."

అందువలన 18వ శతాబ్దపు బాధ్యతారహిత పిల్లచేష్టగా భావించిన పదార్థవాదంలో సైతం పిడివాదం లేదు. ప్రకృతికి బయట ఏమీలేదు. అది అసలు ప్రాతిపదిక. ప్రకృతికి సంబంధించిన జ్ఞానం అసంపూర్తి అని అంగీకరించారు. కాని జ్ఞానార్జనకు అవధులు లేవని విశ్వసించారు. మానవ ప్రజ్ఞాశక్తియుక్తులు అనంతమన్నారు. అంటే మానవుడి సృజనశక్తి అపారమన్నమాట. 18వ శతాబ్దపు ఉవాచః "మానవ వివేచన స్వేచ్ఛగా వుండనివ్వండి, కొన్ని తరాలకు అది ఆదర్శాలను నిర్మిస్తుంది."(డెడిరో)(1) ఆ విధంగా

ఉద్వేగవాదానికి వివేచనాయుగం కారణమైంది. "సృజనాత్మక ఊహ" వలన వివేచనను పెంపొందించాలన్నారు.

ఆనాడు జీవిత వ్యవహారాలన్నిటికీ వివేచన అన్వయించాలనే ప్రధానలక్షణం గనుకనే 19వ శతాబ్దాన్ని వివేచనాయుగం అన్నారు. అధిభౌతిక ఊహల నుంచి దిగి వచ్చిన వివేచనావాదం, రాజకీయ సామాజిక నిర్ణయాలకు కొలమానం అయింది.

లోగడ భావపరిధిలోనే మానవుడి స్వేచ్ఛాపోరాటం ఉండేది. మానవాళి చరిత్రలో అదొక ఆవశ్యకదశ. మానవ పురోగతికి ఆటంకంగా కాలదోషం పట్టిన సామాజిక సంబంధాలు, రాజకీయ సంస్థలు నిలిచాయి. వాటి సిద్ధాంతపరమైన ప్రాతిపదికలను తొలగిస్తే తప్ప వాటిని నిర్మూలించడం సాధ్యం కాదు. అలౌకిక దైవిక ప్రామాణికతను ఈ సంస్థలకు అంటగట్టగా, ప్రజలు ఆమోదించారు. ప్రపంచంలో మానవుడు స్వేచ్ఛాపిపాసువు కావడానికి మనిషి మనస్సును బంధవిమోచనం గావించవలసి వచ్చింది. మానవజాతి సంక్షేమసంఘాలను పెంపొందించడానికి ముందుగా మానవుడు తాను ప్రపంచాన్ని పునర్నిర్మించగలనని ఆత్మవిశ్వాసం పొందవలసి వచ్చింది. తనవిధికి తానే అధిపతినని విశ్వాసం కలగడానికి, దైవంలో నమ్మకం బీటలువారాలి. మానవుడి ప్రయత్నం, సంకల్పం వలన రాజకీయ సాంఘిక మార్పులకు అనుగుణమైన తాత్విక విప్లవం సృష్టించవలసి వచ్చింది.

లాక్ మొదటి రాజకీయ తాత్వికుడు. సిద్ధాంతపరంగాకాక, ఆచరణలో రాజకీయాలను మతేతరంగా వుంచాలని గట్టిగా కోరింది అతడే. మతం, రాజకీయాలు పరస్పరం సాధనలుగా మధ్యయుగాల సాంఘిక వ్యవస్థను అణచిపెట్టాయి. భావస్వేచ్ఛను అణచడానికి రాజకీయాధికారాన్ని వినియోగించారు. నిరంకుశ పరిపాలకులకు, అణచి వేసే రాజకీయ సంస్థలకు ప్రమాణాన్ని ఇచ్చింది మతం.

ఆధునిక కాలాల్లో తొలిసారిగా రాజకీయ విప్లవదృశ్యం ఇంగ్లండ్‌లో కనిపించింది. క్రాంవెల్(2) కాలంలో మత, రాజకీయ సమస్యలు గందరగోళంగా వుండేవి. రాజకీయాలను మతేతరంగా వుంచాలని ప్యూరిటన్లు(3) వత్తిడి చేయలేదు. మతఛాందసులు వివేచనా యుగానికి ముందు, మత యుద్ధాలలో ప్యూరిటన్ విప్లవం వచ్చింది. ఇంగ్లండ్ విప్లవానుభవాల దృష్ట్యా సహనం, పౌరస్వేచ్ఛా భావాలను అందుకొని, విపులీకరించాడు లాక్. ఈ స్వేచ్ఛాభావాలు ఫ్రాన్స్‌ను ఆకర్షించాయి. అక్కడ తాత్విక

---

1) 1713-84 ఫ్రెంచి విజ్ఞానసర్వస్వ కర్త, విమర్శకుడు, తాత్వికుడు.

2) 1599-1658 బ్రిటిష్ జనరల్, 1653-58 మధ్య ఇంగ్లండు సంరక్షకుడు.

3) 16వ శతాబ్దంలో ఇంగ్లండ్ ప్రొటస్టంట్ మతశాఖ, మతక్రమశిక్షణ, మతపూజలు నిరాడంబరత వీరి ప్రధానాంశాలు.

విప్లవం వారి చైతన్యతను వెల్లడించడానికి తగిన వాతావరణాన్ని సమకూర్చిపెట్టింది.

"సమాజాన్ని పునరుజ్జీవింపజేయాలనేది ఫ్రాన్స్ ఉద్యమంలో ప్రధానాంశం. వోల్తేరుకుగాని, ఆకాలంలో మరే చింతనాపరుడికిగాని ఊహాజనిత అధిభౌతికత నచ్చలేదు. లాక్, అతడి ఫ్రెంచి శిష్యుడు కాడియాక్ తత్వాలు, మానవ వివేచనను అన్వయించాలనేది సాధనగా నాడు సరిపోయింది. మతపరమైన రాగద్వేషాలు లేకుండే మధ్యయుగాల మానసిక బంధాలను తెంచి, మానవుడికి అనుకూల రాజ్యం ఏర్పరచాలనేది నాటి లక్ష్యం.(4)

మానవ సమాజం మానవుడి సృష్టి అని, నాగరికత పరిణామక్రమం అనీ చారిత్రక పరిశోధన రుజువు చేసింది. గతాన్ని కొత్తగా అవగాహన చేసుకోవడంతో భవిష్యత్తుపై వెలుగు ప్రసరించింది. జీవిత విధానం మార్చవచ్చు. మానవుడి కృషి వలన కొత్త స్వేచ్ఛా ప్రపంచం, సుఖం, సామరస్యం సృష్టించవచ్చు. ఈ మార్పులకు అనుగుణమైన సాధారణ సంకల్పం తీసుకురావాలి. ఇందునిమిత్తం, మతం నూరిపోసిన ఈర్ష్యా ద్వేషాలు మూఢనమ్మకాల నుండి మానవుడు మానసికంగా విమోచన పొందాలి. వివేచన మానవలక్షణమని అతి భౌతికం కాదని మనిషి వివేచనా జీవి అని దృఢనమ్మకం ఏర్పడాలి. గతాన్ని కొత్తగా అర్థం చేసుకోవడం వలన, వైజ్ఞానిక సహజవాదం నుంచి వచ్చిన కొత్త తత్వం వలన ఈనమ్మకం ఏర్పడింది. 18వ శతాబ్దంలో మానవుడి సృజనశక్తి పట్ల సామాజికాభివృద్ధి పట్ల విశ్వాసం కలిగింది. "ఇంద్రియజ్ఞానం, అనుభవం అనే తత్వం ద్వారా సామాజికాభివృద్ధి అవకాశాలలో నమ్మకం కనిపించింది."(5)

మతం మానవుడి జీవితానికి ఒక అర్థాన్నిచ్చింది. సాధించడానికి లక్ష్యం ఉండేది. అది సర్గసుఖం కావచ్చు. మార్మికమైన ముక్తిగావచ్చుగాక. ఈ జీవితలక్ష్యంలో విశ్వాసాన్ని పోగొట్టింది కొత్త తత్వం. జీవితం నిరంతరంగా మారుతుంటుందని కొత్త తత్వం గమనించింది. దైవప్రయోజన రహితంగా జీవితాభివృద్ధిని సమన్వయీకరణ గావించవచ్చునా? అభివృద్ధి అంటే ఒకమార్గంలో ముందుకు సాగడం. లక్ష్యానికి చేరువగా వెళ్ళడమే అభివృద్ధికి కొలమానం. జీవితానికి లక్ష్యమే లేకుంటే, కచ్చితమైన చోటుకు పయనించకపోతే, అభివృద్ధి ఏమిటి? ఈ వాదన బాగానే అనిపించవచ్చు. సంశయవాదులు అభివృద్ధి సాధ్యమనే భావాన్ని సందేహించడమేగాక, ఆ భావాన్నే అపహాస్యం చేశారు. కాని అభివృద్ధికి మరొక పరీక్ష వున్నది. ఆదిమ, నాగరికతల మధ్య దూరాన్ని చూడాలి. ఆదిమస్థాయి నుంచి మానవాళి కదలి పరిణామక్రమంలో పయనించడమే, భవిష్యత్తులో అభివృద్ధి పట్ల నమ్మకాన్ని కలిగిస్తుంది. గతంలో జరిగినదంతా దైవ ప్రయోజనార్థం

4) హెచ్.ఎ.ఎల్.ఫిషర్, ది హిస్టరీ ఆఫ్ యూరోప్.

5) జాన్ మార్లే, లైఫ్ ఆఫ్ డిడిరో

కాదని మానవ ప్రయత్న ఫలితమని గ్రహిస్తే, భవిష్యత్తులో ఆశకు అనుభవపూర్వక సమర్థన లభిస్తుంది. అభివృద్ధిని ఎంతగా కోరుకుంటే ఆమేరకు మనం దానిని ఆశించవచ్చు. భవిష్యత్తులో కోరేది ఊహ. దైవిక ప్రయోజనం అనే వివేచనకు విరుగుడు "సృజనాత్మక ఊహ" మాత్రమే.

18వ శతాబ్దంలో అభివృద్ధిని యీ దృష్టితోనే ఫ్రాన్స్ స్వీకరించింది. సంప్రదాయ వివేచనావాదంలోని విధి, ప్రయోజనవాదాన్ని ఆరాధించడం–ఆత్మ విశ్వాసానికి చుక్కెదురు. మానవుడు ప్రకృతిలో భాగం అనీ, ప్రకృతి నియమాలే మానవేచ్ఛగా ఉన్నాయనడానికి ఆనాడు విజ్ఞానాభివృద్ధి పెంపొందకపోయినా, అవకాశం ఉంటే, మానవుడు తన విధికి తానే నిర్ణీత అనే విశ్వాసం మాత్రం ప్రబలింది. ఇది పూర్ణకాలంలోనో, దేవునిపరంగానో లభించదు. మానవుడే జయించి సాధించాలి. సంప్రదాయ బద్ధమైన మతమౌఢ్యాలు, మతేతర పాలనాధికారాలు మానవుడికి అడ్డుపడుతూ వచ్చాయి. అందువలన మతానికి వ్యతిరేకంగా పోరాటం జరపాలని 18వ శతాబ్దంలో మేధావులు తలపెట్టారు. మతం నూరిపోసిన మూఢనమ్మకాల నుండి మానవుడు బయటపడితే, ఆత్మవిశ్వాసంతో, వికాసపూరితంగా తన భవిష్యత్తును తీర్చి దిద్దుకుంటాడని నమ్మారు. భావస్వేచ్ఛగల మానవులు, వివేచన ఆధారంగా, సృజనాత్మక ఊహతో మంచి భవిష్యత్తుకు బాటలు చేసుకోగలరు. 18వ శతాబ్దంలో సాంఘికాభివృద్ధి పట్ల విశ్వాసం అట్లా కనిపించింది. దీనినే ఉద్వేగవాదం అన్నారు. అయితే మానవుడి వ్యవహారాలను చక్కబరుచుకోడానికి వివేచనను ఈ వాదం కాదనలేదు.

మానవయుగానికి కొత్త తత్వం కావాలి. అది మానవ జీవితానికి చెందినదై, భావస్వేచ్ఛతో, ప్రకృతి సంఘటనలను వివరిస్తూ, మానవ అనుభవాలకు దైవ జోక్యంతో నిమిత్తం లేకుండా చెప్పే తత్వం అవసరం. అటువంటి తత్వం సంపూర్ణంగా, సర్వజ్ఞతలో, ఉనికిలో అన్ని విషయాలు గురించి పూర్తి జ్ఞానంతో వుండదు. ఆ కాలానికి విజ్ఞాన పరిధిని బట్టి, తార్కికంగా వీలై, సోపాధికంగా పోగలగడమే మార్గాంతరం.

సందేహవాదం స్థిరమైనదికాదు. అదొక వ్యతిరేకధోరణి. దీనివలన ఆచరణ స్థంబించిపోతుంది. సంధియుగంలో మానసిక ధోరణే సందేహవాదం. కాలదోషం పట్టిన భావాలు, తప్పుడు ఆదర్శాలనుండి కొత్త విశ్వాసాల మధ్యకాలంలో ఇది జనిస్తుంది. కేవలం జ్ఞానం వున్నదనకపోతే, నమ్మకంలో తప్పులేదు. సామాజిక దృక్పథంగల తత్వంలో సంశయానికి శాశ్వతస్థానం లేదు. అలౌకిక ప్రమాణాన్ని కాదనే చోట పిడివాదానికి, యిదే ఆఖరు అనడానికి వీల్లేదు. వివిధ వైజ్ఞానిక రంగాలలో క్రమంగా వస్తున్న జ్ఞానదృష్ట్యానే సాధారణీకరించడం సాధ్యం. అటువంటి సాంఘిక ప్రయోజనంతో 18వ శతాబ్దపు మేధావుల జీవితం ముందుకు సాగింది.(1)

"18వ శతాబ్దంలో ఫ్రెంచితత్వం ఒక విధంగా ఆంగ్లతత్వానికి అనుబంధంగా పెంపొందినా, ఇది సమూలంగా, ఆవేశంతో, విప్లవధోరణితో వున్నది. అధికారికతను తృణీకరించడంలో, వివేచన తప్ప మరి దేనిని గుర్తించకపోవడంతో, వివేచనాత్మక విమర్శన తప్ప యింకేదీ ఆమోదించకపోవడంలో, ఫ్రెంచితత్వం ముందంజవేసింది. వివేచనతో సరిపోతే మినహా, ప్రాచీన సంప్రదాయం, అంగీకారం, మతనమ్మకం, ప్రమాణగ్రంథాలు అన్నీ నిరుపయోగమన్నారు. ముఖ్యంగా క్రైస్తవ మత సిద్ధాంతాలు అసంభవాలనీ, మూఢ నమ్మకాలని కొత్తతత్వం ఖండించింది. ఒక వర్గంవారు మతజ్ఞానం సాధ్యం అని భావించినా, మరొకవర్గం అన్ని మతవిశ్వాసాలు భ్రాంతిగా కొట్టి పారేసింది. కొత్త తత్వం వివేచనాత్మకం. ప్రశాంతంగాగాక నిశితంగా ఉత్సాహభరితంగా ఆ తత్వం ఉండేది. ప్రపంచానుభవం, వివేచన భౌతికవాదం మిళితమైనదే యీ కొత్త తత్వం. దీని దృష్టి అంతఃకరణంలోకి, లేదా పైలోకాల వైపుకుగాక, పరిసరాల భౌతిక సాంఘిక విషయాలపై సాధించింది. 18వ శతాబ్దం ఫ్రాన్స్‌లో గణితం, ఖగోళం, పదార్థ, రసాయనిక విజ్ఞానం, ప్రకృతి చరిత్ర, భూగోళ, వైద్యశాస్త్రాలలో విశేషాభివృద్ధి సాధించారు. నాటి తత్వం వలననే ఈ సాధన జరిగింది. తమ అభిప్రాయాలనే హెూల్‌బాష్ నిర్ణయాలలో చూచినవారు, దేవుడు, ఆత్మ, అమరత్వం లేదన్నారు. నైతికంగా, రాజకీయంగా, మతపరంగా ఆ తత్వం తీవ్రస్థాయిలో వుండేది. అంత ప్రపంచాన్ని పాలించిన శక్తులను ఆవలకు నెట్టడంగాక, వాటిస్థానే కొత్తవి ఏర్పరచాలన్నారు. నైతిక రాజకీయ విషయాల ప్రత్యక్ష విశ్వాసాలు వారిబలం. న్యాయం, సహనం, స్వేచ్ఛ సౌభ్రాతృత్వం, ప్రజల సార్వభౌమత్వం, మానవహక్కులలో వారికి నమ్మకం వుంది.

వివేచన యుగారంభంలో ఫ్రాన్స్ అంతటా సంశయవాదం వ్యాపించి ఉండేది. ఆ సంధికాలంలో మాంటీన్ (2)తో బాటు పవిత్ర క్రైస్తవుడు షరన్ గూడా పాలుపంచు కున్నాడు. కాని ఫాస్కల్(3) సంశయవాది. అతడిని "చిత్తశుద్ధి, సంకుచిత, చాందస " విశ్వాసానికి మరలించి, అస్థిరత్వ భావనలోకి వెళ్ళిపోయాడు. కాని బాల్‌కు సహాయకారిగా, మతజ్ఞానాన్ని నమ్మని వ్యక్తిగా లమోతెలవాయె వున్నాడు. అతని ద్వారా కాథలిక్ ప్రభువు 14వ లూయీ కొలువులో సంశయవాదం చొచ్చుకపోయింది. అతని రచనలు జ్ఞానవికాసానికి తోడ్పడినవి. బాల్ సందేహవాద ప్రభావం తెలిసిందే. సందేహవాద ప్రమాణాల ఆధారంగానే డిడిరొ మతంపై పోరాటం ఆరంభించాడు. ఫ్రాన్స్‌లో తొలుత ఆలోచించడానికి సాహసించిన మాంటీన్ అడుగుజాడల్లో నడచిన దలమిత్ర కూడా తనను

1) ఫ్లింట్, హిస్టరీ ఆఫ్ ది ఫిలాసఫీ ఆఫ్ హిస్టరీ
2) 1533-92 ఫ్రెంచి రచయిత
3) 1623-62 ఫ్రెంచి గణిత, తత్వశాస్త్రజ్ఞుడు.

పైరొనిస్టని (4) పిలుచుకున్నాడు. వోల్టేర్ మాత్రం సంశయవాద ధోరణి విడనాడలేదు. ఒక కాలు ప్రాచీనతలో పెట్టివుంచి, ఎవాంజలిస్ట్(5) కంటె డయిె నోషియన్ పాలన వైపే మొగ్గుచూపాడు.

"14వ లూయీ(5) చనిపోవడంతో ఆధునిక చరిత్రలో పెద్దమలుపు తిరిగింది. దేశాల సాంఘిక, రాజకీయ అదృష్టాలకు, విద్యావంతులలో తాత్విక చింతనకు ఈ సంఘటన చాలా ముఖ్యమైనది. ఇంగ్లండ్, ఫ్రాన్స్‌ల మధ్య మేధస్సుకు సంబంధించిన అనుబంధం హఠాత్తుగా, ప్రగాఢంగా పెంపొందింది.

వ్యక్తి హక్కులు, పౌరస్వేచ్ఛకు సంబంధించి రాజకీయరంగంలో ఇంగ్లండ్ నుంచి ఫ్రెంచివారు భావాలను స్వీకరించారు. ఫ్రాన్స్‌లో ఆపడానికి వీల్లేని శక్తితో వున్న ప్రజాస్వామిక ధోరణితో యీ భావాలు జోడించారు. అట్లాగే, ఇంగ్లీషువారి భౌతికవాదం ఫ్రెంచి సంశయవాదం కలియగా, క్రైస్తవమతాన్ని, పీఠాధిపతుల అధికారాన్ని తృణీకరించింది. న్యూటన్, బాల్ కాలం నుండి ప్రకృతికి సంబంధించిన యాంత్రిక దృష్టితో క్రైస్తవమతం బాగా చేతులు కలుపుతూ సర్దుకుపోయింది. న్యూటన్ తత్వం ఫ్రాన్స్‌లో నాస్తికవాదాన్ని ఇంకా ముందుకు తీసుకుపోవలసి వుండగా, డేకార్ట్ కంటె న్యూటన్‌లో విశ్వాసం వల్ల తక్కువహాని వాటిల్లుతుందని ధృవపత్రం ఇచ్చారు.(6)

18వ శతాబ్దం, దైవజ్ఞులు, సంశయవాదులు, నాస్తికులు, భౌతికవాదులతో ఫ్రాన్స్ కిటకిటలాడింది. వారందరిలో ఒకటి మాత్రం సర్వసాధారణంగా అంగీకారం కుదిరిన అంశం ఉన్నది. మతాధిపత్యం నుంచి, సనాతనత్వం నుంచి రాజకీయ జీవనాన్ని విమోచన గావించడానికి వారు నిర్ధారించుకున్నారు. ఆ విధంగా వారు మతగురువుల వ్యతిరేకులు, మూఢనమ్మకం, సంప్రదాయాధికారం ఛేదించాలంటే, జ్ఞానాన్ని ప్రసరింపజేయాలి. ఆ ఉద్దేశంతోనే సుప్రసిద్ధ విజ్ఞాన సర్వస్వం(7) ప్రచురించాడు. మతం పైనగాని, విశ్వాసం గురించిగాని, పైకి ఎటువంటి విమర్శ లేదు. నాస్తికత్వాన్ని బహిరంగంగా బోధించనూ లేదు. "సహనం, మానవ జీవితంలో వాస్తవాలకు వివేచన అన్వయించడం, సహజసంఘటన, ప్రకృతి విజ్ఞానాన్ని పూర్తిగా వివరించే ప్రయత్నం చేశారు."(8)

మతసహనం, భావస్వేచ్ఛ కావాలని ప్రభుత్వానికి సామాన్య మానవుడు ప్రధాన మనే ప్రజాస్వామిక సిద్ధాంతాన్ని విజ్ఞానసర్వస్వం ప్రకటించింది. జ్ఞానాన్ని ప్రచారం

---

4) కేవల సంశయవాది

5) బైబిల్ కొత్త నిబంధనలను తు.చ. అనుసరించే క్రైస్తవమతశాఖ.

5) 1638–1715 ఫ్రెంచిరాజు, ఇతన్ని ది గ్రేట్ అని, సన్‌కింగ్ అని అంటారు.

6) లాంగ్, హిస్టరీ ఆఫ్ మెటీరియలిజం

7) 18వ శతాబ్దంలో డిడిరొ, డలంబేర్, సంపాదకత్వాన ఫ్రాన్స్‌లో వెలువడింది.

8) లిన్ థాన్‌డైక్, ది ఎన్‌సైక్లోపీడియా అండ్ హిస్టరీ ఆఫ్ సైన్స్

చేయడం వారి ముఖ్యోద్దేశం, జ్ఞానం శక్తిని ప్రసాదిస్తుంది. శక్తిబంధాల్ని తెంచుతుంది. డలంబేర్(1) ప్రచురించిన గ్రంథంలో యీ ప్రయోజనాన్ని సూచనప్రాయంగా పేర్కొన్నాడు. "దైవజ్ఞానం" శీర్షికలో "మూఢనమ్మకాలు, మంత్రాలు" చేర్చాడు.

ప్రభుత్వ సెక్యులర్ అధికారంపైన, దైవాంశ సంభూతత్వం పైనా జరుగుతున్న దాడి గురించి ప్రభుత్వం మాత్రం పొరపాటు పడలేదు సరికదా, అందులోని ప్రమాదాన్ని గ్రహించింది కూడా. విజ్ఞానసర్వస్వం రెండు సంపుటాలు ప్రచురించగానే, "రాజాధికారానికి మతానికి హానికరమని" అణచిపెట్టారు. కాని పెరికల్స్ అనంతరం ఏ కాలంలోనూ పోల్చడానికి వీల్లేనంతగా మహామేధావులు, తత్వవేత్తలు–హెల్విషస్, దలమిత్ర, దలంభేర్, మావర్టస్, లాగ్రాంజ్, గ్రిమ్, హాల్‌బాష్, డిడొరొ, కాడియాక్, కాండార్సె, బఫన్, డిట్రెసి, కాబినొ, టర్గో, వోల్తేర్– ఆ కాలంలో ఉన్నారు. వారి ప్రయత్నాలను అంత సులభంగా అణచడానికి వీల్లేదు. వర్సల్ కొలువుతో సహా సర్వత్రా వారి భావాలు చొచ్చుకుపోయాయి. మేడం పాంపొడోర్(2) ప్రభావం వలన, నాటి జాతీయ గ్రంథాలయ డైరెక్టర్ జనరల్ మాల్‌ష్రబ్స్ వలన "జాతి గౌరవాన్ని తెచ్చే" గ్రంథాన్ని తిరిగి అనుమతించారు. కాని మతం, తదితర తిరోగమన శక్తులకే పైచేయి వున్నది. మళ్ళీ ఆ గ్రంథంపై నిషేధం పెట్టించి, గ్రంథాన్ని ముద్రించడానికి వీల్లేకుండా రౌడీ విధానం ప్రయోగించారు. అన్ని సంపుటాలు పూర్తయ్యేవరకూ ఏ ఒక్కటీ ప్రచురించబోమనే హామీపై, ముద్రించుకోడానికి డిడొరొ ప్రైవేట్‌గా అనుమతి తెచ్చుకున్నాడు. అయితే, ఫ్రాన్స్‌లోనూ విదేశాలలోనూ ఈ గ్రంథాలకు బాగా ప్రచారం లభించింది. పారిస్‌లో వాటిని రహస్యంగా చదివారు. రాచవిందులో వాటిని మేడం పోంపెడోర్ బహూకరించే ఏర్పాట్లు చేసింది.

"ఒక శతాబ్దంలో పౌరుల , సాహిత్య చరిత్రలో అంత ప్రముఖ స్థానం ఆక్రమించిన, రాజకీయ ప్రాధాన్యత పొందిన విజ్ఞాన సర్వస్వం మరేదిలేదు.(3) "మతజ్ఞానం వున్నప్పటికీ, మతభ్రష్టతతో, మతాధికారాన్ని వ్యతిరేకిస్తూ, నాటి ఫ్రాన్స్‌లో సర్వశక్తివంతంగానూ, పిడివాదాలను చారిత్రకంగా పరిశీలించినట్లు" ఈ గ్రంథాన్ని గురించి చెప్పారు.(4) విజ్ఞాన సర్వస్వాన్ని "యుద్ధ యంత్రంగా" వర్ణించారు. క్రమంగా మతాధికారాన్ని, నిరంకుశ రాజకీయాధికారాన్ని , తరువాత క్రైస్తవమతాన్నే ధైర్యంగా, ముసుగులేకుండా ఈ గ్రంథం ఎదుర్కొన్నది.

---

1) డలంబేర్ 1717–1883 ఫ్రెంచి గణిత, తత్వశాస్త్రజ్ఞుడు

2)15వ లూయీ ఉంపుడుగత్తె

3) ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా 13వ ముద్రణ.

4) రోజన్ క్రట్జ్, లైఫ్ అండ్ వర్క్స్ ఆఫ్ డిడొరొ

విజ్ఞాన సర్వస్వ ప్రభావం, ప్రజాదరణ కూడా జ్ఞానవికాసానికి కొలమానం. ఉరుముకు ముందొచ్చే మెరుపువలె, మానవస్వేచ్ఛను కోరే కొత్త తత్వం ఐరోపాలో రానున్న విప్లవాగ్ని జ్వాలను చూపెట్టింది. జ్ఞానవికాసాన్ని మెచ్చుకుంటూ నెపోలియన్ ఇట్లు అన్నాడు. "గ్రంథాలను అదుపులో ఉంచగలిగితే బూర్బాన్(1) లు తమపాలన అట్టిపెట్టుకోగలిగేవారు. ఫ్యూడల్ విధానాన్ని మతవ్యవస్థ చంపేసింది. ఆధునిక సాంఘిక వ్యవస్థను రాత చంపేస్తుంది." ప్రాచీన బోర్బాన్ రాజ్యానికి పట్టిన గతే తన కొత్త సామ్రాజ్యానికి పడుతుందని నిశితదృష్టితో కార్సికన్ (2) ముందే గ్రహించాడు. అతని ఆత్రుతకు కారణం ఉన్నది. ప్రపంచాన్ని పాలించేది పుస్తకాలే. పుస్తకాలవలె మరేదీ పౌరసత్వాన్ని తీసుకరాలేదు. ఒకసారి జాతి ఆలోచనారంభిస్తే దాన్నెవరూ ఆపలేరు.(3)

1771లో డిడొరొ తన స్నేహితుడికి జాబు వ్రాసినపుడు తనతోటి తాత్వికులందరి పక్షాన మాట్లాడాడు. "మతంపై తొలిసారి చేసిన దాడి తీవ్రతరంగానూ, కొలచి చెప్పడానికి వీల్లేనిదిగానూ ఉన్నది. ఒకసారి మత పరిధులను తొలగిస్తే, మనుషులను యిక పట్టజాలం. స్వర్గ సార్వభౌమత్వాన్ని యీసడించిన మనుషులు, భూమిపై సార్వభౌమాధికారాన్ని నిర్వహించేవారి సంగతి చూస్తారు. మానవజాతిని అణగార్చిన ఈ రెండు విధానాలు, ఒకటి లేకుండా మరొకటి కొనసాగలేదు."

ఈ ధోరణికి రాకముందు, డిడొరొ చాలాదూరం పయనించవలసి వచ్చింది. డలమిత్ర వ్రాసిన నేచురల్ హిస్టరీ ఆఫ్ ది సోల్ లో చాలా జాగ్రత్తగా పదార్థవాదాన్ని వ్యక్తపరచినా, డిడొరొ వ్యతిరేకించాడు. క్రైస్తవమతాన్ని "ఆనందదాయకమైంది" అనే అభిప్రాయపడిన షాఫ్ట్స్ బరి పవిత్ర ఉద్వేగవాదంతో ఇతడు ఏకీభవించాడు.

ప్రతిమానవుడి హృదయంలోనూ ధర్మానికి సహజంగా స్థానం ఉంటుందని షాఫ్ట్స్బరి ఉత్సాహపూరిత ఆశావాదాన్ని ప్రకటించాడు. ఫ్రెంచి విప్లవ పితామహులు యీ భావాన్ని మెచ్చుకున్నారు. ఇది లాక్ సంప్రదాయ వివేచనా వాదానికి భిన్నమైనది. ఉత్సాహాన్ని అతి పోకడగానూ, గొప్పలు చెప్పుకునేదిగానూ, వేడెక్కిన మనస్సు వలన జనించేదిగానూ, వివేచనకు వ్యతిరేకమైనదిగానూ లాక్ పేర్కొన్నాడు. సామాజిక ప్రయోజనం దృష్ట్యా మతానికి దైవానికి వ్యతిరేకంగా డిడొరొ ధ్వజమెత్తవలసి వచ్చింది. వ్యవస్థాపితమైన మతంలో అసహనం, నిరంకుశత్వం, పశుత్వంపై అతడు తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

---

1) 1589-1792 మధ్య ఫ్రాన్స్‌ను పాలించిన రాజ కుటుంబీకులు

2) కార్సిక ద్వీపం మధ్యధరా సముద్రంలో ఉన్నది. ఫ్రాన్స్‌కు చెందింది.

3) టాలెంటైర్, వోల్తేర్

"అసంతృప్తితో వున్న ఈ ఆత్మలు చేసిన తప్పేమిటి? ఈ చిత్రహింసలు వారెందుకు అనుభవించాల్సివస్తున్నది? ఏ దేవుడిని వీరు కష్టపెట్టారు? ఎవరా దేవుడు? అపారమైన మంచితనం గలవాడా? కన్నీళ్ళలో స్నానం చేయగలడా అటువంటి దేవుడు. ఈ ప్రజలకు దేవుడంటే భయం లేదు. అతని పేరిట బెదిరిపోయారు. దేవుడిని గురించి మనకు చెప్పిన విషయాన్ని పరిశీలిస్తే, అతని ఆగ్రహం గమనిస్తే, పగతీర్చుకునే ధోరణి చూస్తే, ఎందరు నాశనం గావడాన్ని అనుమతిస్తున్నాడో తలచుకుంటే, అతను రక్షించే కొద్దిమంది కంటె అటువంటి దేవుడు లేకుంటే బాగుండునని ధర్మం తెలిసిన వారెవరైనా భావిస్తారు.

క్రూరమైన అన్యాయాలను ఆవరించిన వాతావరణాన్ని గమనించిన వోల్తేర్ సైతం, మర్యాదగా పాటించే దైవసంశయ వాదాన్ని వదిలేసి, దైవానికి మతానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో పాల్గొని మతాధికారాన్ని అణచివేయమంటూ గర్జించిన వారితో చేతులు గలిపాడు. కరడుగట్టిన మానవద్వేషి, ప్రశాంత విమర్శకుడైన వోల్తేర్ కూడా ఆగ్రహం వ్యక్తం పరచాడు. "ఇది హాస్యానికి సమయం కాదు. మనుష్యులను ఊచకోత కోస్తుంటే చతురోక్తులు సరిపడవు. తత్వానికి ఆనందానికి నిలయమైన దేశమేనా ఇది? బార్తొలోమూ రుషిని చిత్రవధ చేసిన దేశమిది.... సాహసోపేతుడైన డిడొరొ, భయమెరుగని డలంబర, చేతులు కలపండి. మూర్ఖులు పిరికిపందలను అధిగమించండి. సారంలేని ఆజ్ఞలను నాశనం చేయండి. దారుణమైన కుతర్కాలను ఎదిరించండి. అబద్ధాలతో వున్న చరిత్రను అనంతమైన అర్థరహిత విషయాలను తొలగించండి. బుద్ధి లేనివారిని ఉన్నవారిపై పెత్తనం చేయనివ్వకండి. భావితరాలవారు తమ స్వేచ్ఛకు, వివేచనకు మనకు రుణపడతారు.

కార్డినల్ హెూదాను తృణీకరించి, రెచ్చిపోయిన కురువృద్ధుడు, అతిజాగ్రత్తగా మెలకువగా వుండే తన ధోరణి వదిలేసి, ట్రీటిజ్ ఆన్ టాలరేషన్ రాశాడు. దానిననుసరించి మతాధిపతులకు, మతానికి వ్యతిరేకంగా పుంఖానుపుంఖంగా సాహిత్య కరపత్రాలు వెలువడ్డాయి. యుద్ధంలో ఫిరంగులవలె అన్ని దిక్కులలో యీ సాహిత్యం దూసుకు పోయింది. తన కొత్త తత్వాన్ని ప్రజాబాహుళ్యంలోకి పంపేనిమిత్తం చిన్ని పుస్తకాల రచనకు వోల్తేర్ పూనుకున్నాడు. పెద్ద పుస్తకాలకు రోజులు కావని ప్రకటించాడు. ఉత్తరోత్తరా నెపోలియన్ గుర్తించినట్లు, వోల్తేర్ పూర్తిగా విజయవంతమయ్యాడు. ఆనాడు అక్షరాస్యత పరిమితంగా ఉన్నప్పటికీ, అతడి చిన్న కరపత్రాలే వేలాదిగా అమ్ముడయ్యాయి. చదవగలిగిన ప్రతి స్త్రీ పురుషుడికి అతడి సాహిత్యం చేరింది.

వోల్తేర్ తన జీవితకాలంలో చాలావరకు కలగాపులగపు వాదనలతో, మేధావిగా వుంటూ వచ్చాడు. ప్రవక్తగా, మానవులకు సందేశాన్ని అందించే ఉత్సాహపరుడుగా అతడు తొలుతలేడు. అయినా, రూసోతో పాటు యితడుకూడా విప్లవానికి బాధ్యుడయ్యాడు. (16వ లూయీ అన్నట్లు వీరిద్దరే ఫ్రాన్స్‌ను నాశనం చేశారు.) "ఫ్రాన్స్‌ను విప్లవానికి

తీసుకెళ్ళిన ఉద్వేగ వివేచనావాదాలకు వీరిరువురూ ప్రతినిధులు. అయినా, వోల్తేర్ అందరనుకున్నట్లు ప్రాచీన సంప్రదాయవాది కాదు. రూసో ఆదిమ నాగరికత భాషతో పోల్చితే యితడు బాగా నాగరికతగల క్లిష్ట వ్యక్తిత్వం వున్నవాడు. ఉద్వేగంగా మానసికరుగ్మత, శృంగారంగల క్లిష్ట వ్యక్తి రూసో. మేధావిగా రూసో అమాయకుడు. ఉద్వేగ విప్లవానికి అతడు నమూనా. ఆలోచనా రహిత, మూర్ఖ, వివేచనారహిత భావనలే మానవధర్మం అని రూసో నమ్మాడు. ఇందుకు భిన్నంగా, మానవద్వేషం, కరడుగట్టినట్టుండే స్వభావం గల వోల్తేర్, చరిత్రలో మానవుడి పాత్రపై గట్టి నమ్మకం గలవాడు.

"విధి అన్నిటినీ నిర్ధారిస్తుంది. ప్రకృతి నియమాన్ని వ్యతిరేకించడానికి అనుమతించడంలోగాక మార్చడానికి వీల్లేని దైవేచ్ఛగా ప్రకృతి నియమానికి లోబడడంలోనే సరైన ప్రార్థన ఉన్నది."

బేకన్ చూపిన దారిలో విజ్ఞానం పయనించవచ్చు. కాని డేకార్ట్ రంగంలోకి వచ్చి అందుకు భిన్నంగా చూపాడు. ప్రకృతిని అధ్యయనం చేసేబదులు, దానిని దైవికం గావించాలనుకున్నాడు. ఇటువంటి ఉత్తమ గణిత శాస్త్రజ్ఞులు తత్వంలో ఉద్వేగాలను మాత్రమే చూపగలరు. సహజతత్వమంటే అంచనా వేయడం, తూచడం, కొలవడం, పరిశీలించడమే ! మిగిలినదంతా భ్రమే."

వోల్తేర్ మరణానంతరం 13 ఏళ్ళకు విప్లవ జాతీయ శాసనసభ ఆజ్ఞానుసారం అతని అవశేషాలను సమాధినుండి స్మారకమందిరానికి తరలించినప్పుడు "అతడు మానవుని మనస్సుకు గొప్ప ప్రోత్సాహాన్నిచ్చాడు. మనల్ని స్వేచ్ఛకు సమాయత్తపరచాడు" అని రాశారు.

వోల్తేర్ యుగానికి బాగా ప్రాతినిధ్యం వహించిన వ్యక్తిగా, విజ్ఞాన సర్వస్వ సంపాదకుడు, జ్ఞానవికాసాన్ని విజృంభింపజేసిన డిడొరొను పేర్కొనాలి. హోల్‌బాహ్ రాసిన సిస్టమ్ ఆఫ్ నేచర్ కూడా నాటి ధోరణిని చక్కగా ప్రతిబింబించింది. 1770లో ప్రచురితమైన యీ గ్రంథం పదార్థవాదానికి ప్రమాణ గ్రంథమైంది. ప్రకృతివిధానం, లేదా పదార్థ నైతిక ప్రపంచ నియమాలనే అర్థంతో శీర్షిక ఉండేది. విజ్ఞాన సర్వస్వం ద్వారా అందించిన విజ్ఞాన తార్కిక ఫలితాలు యీ గ్రంథంలో ఉన్నవి. పట్టీపట్టనట్లుగా, తొందరలో రాసిన తొలిరచనను తరువాత క్రమబద్ధంగా విజ్ఞాన సహజవాదంగా స్పష్టీకరించారు. దీని రచయిత హోల్‌బాహ్ అయినా, అసలు జీవం పోసింది డిడొరొ. విశ్వం దానంతట అది చలనంలో వుండేదేననీ, ఆత్మ శరీరంతోపాటు మరణిస్తుందనీ, మానవజాతి లక్ష్యం ఆనందమనీ, అట్లాకాకుండా సంతోషం పొందకుండానే మానవుడిని ధర్మం పాటించమనడం నిరుపయోగం, అన్యాయమనీ, మతం విధించిన అదుపాజ్ఞలస్థానే విద్యను ప్రవేశపెట్టి, మానవుడి స్వయం వికాసానికి తోడ్పడాలనీ, పరిసరాలకనుగుణంగా

మానవుడి కోర్కెలను సరిపుచ్చడానికి విజ్ఞానం ఉపయోగిస్తుందనీ యీ గ్రంథం పేర్కొన్నది. వ్యవస్థాపిత రాజకీయ విధానాన్ని, దాని సాంఘిక ప్రాతిపదికను ఎదుర్కొనడానికి తత్వాన్ని పెంపొందించారు. అదే విప్లవానికి స్వాగతం పలికింది.

గ్రంథ లక్ష్యం పీఠికలో స్పష్టం చేసారు. "ప్రకృతిని అపార్థం చేసుకోవడం వలన మానవుడు అసంతృప్తిగా వున్నాడు. అతడు శాశ్వతంగా దోషాలను చేస్తాడనే ధోరణిలో అతడి మనస్సులో బాగా ఈర్ష్యాద్వేషాలను నూరిపోశారు. చిన్ననాటినుంచి యీ భ్రమల బంధాలలో చిక్కుకున్నందున, అవి అతడిపై బాగా ప్రభావాన్ని చూపెడుతూ వున్నందున, వాటినుంచి ఎంతోకష్టం మీదకాని బయటపడలేదు. కనిపించే లోకానికి వ్యతిరేకంగా జరిగే పెనుగులాటలో బాధాకరమైన అనుభవాలు పొంది యిటువంటి ప్రయత్నాలే వృధా అనే భావనలోకి వస్తాడు. వాస్తవమైన ప్రకృతిని పరిశీలించకుండా ఎండమావులను వేటాడే అలవాటువలన , దిగ్భ్రాంతి చెంది, సత్యానికి దూరమై సంతోషాన్ని పొందలేక పోతున్నాడు. ఛాందసత్వంలో ముంచేసిన దోషాలనుంచి మానవుడు బయటపడే చికిత్సా మార్గాన్వేషణ అవసరం."

మానవాళి సంతోషం లక్ష్యంగా పెట్టుకున్న యీ తత్వం, "దారుణ పరిస్థితులకు ఎదురు తిరిగే హక్కును" సత్యసూత్రంగా ప్రకటించింది. కనుక విప్లవం సహజం, అవసరం అని పరిగణించారు. "సమాజం నుంచి అధికారం పొందే ప్రభుత్వం, సమాజం మంచి నిమిత్తం స్థాపించబడింది. సమాజావసరాల నిమిత్తం యీ అధికారాలను ఉపసంహరించవచ్చు. ప్రభుత్వ స్వరూపాన్ని మార్చవచ్చు. నాయకులకు అప్పగించిన అధికారాన్ని విస్తరించడం, పరిమితం చేయడం సంఘం ఇష్టం. సంఘానికి సర్వాధికారం, మార్చడానికి వీల్లేని ప్రకృతి నియమంలో ఇదొకభాగం."

ప్రజానీతి గురించి సంప్రదాయంగా వస్తున్న భావంపై తీవ్రవిమర్శ చేశారు. అది నేటికీ సరైనదే అనిపిస్తుంది. "మానవులను నేరస్తులుగా, దోషులుగా చేసే పరిస్థితులను సృష్టించినందున ఇన్ని నేరాలు కనబడుతున్నవి. మతాలు, ప్రభుత్వాలు, చదువు అన్నీ దోషాలవైపుకు దారితీస్తున్నవి. ధర్మాన్ని బోధించే నీతి, సమాజంలో నేరాన్ని దోషాన్ని అట్టిపెడుతూ, మానవుడికి సుఖం లేకుండా చేస్తున్నది. దోషానికి పట్టంగట్టి, గౌరవించే సమాజంలో మరీ బలహీనులనే శిక్షిస్తున్నారు. సమాజ దోషాలను పాటించేవారికి మరణదండన విధిస్తున్నారు. గొప్పవారిని గౌరవిస్తున్నారు."

వివేచనకు గట్టి ప్రాతిపదికలు నిర్మించకుండానే ఈ గ్రంథం పోను పోను భాషా భేషజం చూపింది. అదెవరు రాసినప్పటికీ, అందులో డిడొరొ ప్రేరణ స్పష్టంగా ధ్వనిస్తుంది. తాత్విక ఆలోచన నేడో రేపో సత్ఫలితాలనిస్తుంది. ప్రకృతి శాస్త్రాల విషయంలో ఇది వాస్తవమైంది. ఈ కొత్తభావానికి తీవ్ర వ్యతిరేకత తప్పదు. కాని అనుభవరీత్యా క్రమంగా

మనుషులు నేర్చుకుంటారు. ప్రస్తుతానికే మన భావాలు పరిమితం కారాదు. భవిష్యత్తు మానవజాతికి ఈ తత్వం ఉపయోగపడ్తుంది. లూక్రిషన్ రాసిన చివరి కాండాన్ని ఈ గ్రంథం గుర్తుకు తెస్తుంది. అందులో ప్రకృతి తన నియమాలకు ఒడంబడి ఉండమంటుంది. ఆనందాన్ని అనుభవించడం జన్మహక్కు అంటుంది. ధర్మాన్ని పాటించడం దోషాన్ని విడనాడడం తప్ప. దురదృష్టవంతులైన దోషులను ద్వేషించవద్దంటుంది. తనను ఉద్దేశించినట్లుగా రచయిత యిట్లా రాశాడు. మానవజాతి సంతోషాన్ని పెంపొందించడానికి తోడ్పడడంలో ప్రకృతి దూతలున్నారు. సఫలత పొందలేనివారు ప్రయత్నించామనే సంతృప్తి పొందుతారు. ప్రకృతి, దాని బిడ్డలైన ధర్మం, వివేచన, సత్యం మాత్రమే ఆరాధ్య దేవతలు, పూజనీయులు.

వివేచనావాది వోల్తేర్, ఉద్వేగవాది రూసోలు పాతవ్యవస్థను తూలనాడి కొత్త శక్తులను స్తుతించారు. వారిద్దరి దృక్పథంలో పరస్పర విరుద్ధంగా కనిపించేవాటికి సమన్వయకర్తగా, జ్ఞానవికాసానికి ప్రతిరూపంగా డిడొరొ ఉన్నాడు. డిడొరొ జీవితచరిత్రలో అతని ధోరణిలో పరిణామాన్ని గమనించవచ్చు.

"పదార్థవాదుల నాయకుడుగా పరిగణించబడిన మేధావి, ఉద్వేగి తన భౌతిక దృక్పథానికి చేరుకోవడానికి చాలా ప్రయత్నించవలసి వచ్చింది. చివరి క్షణం వరకు తన భావాలు విడమరచి, సంపూర్ణతను చేకూర్చలేని స్థితిలోనే అతడు ఉన్నాడు. ఆదర్శవాదిలో ఉండవలసిన ధర్మాధర్మాలన్నీ అతని ఉన్నత స్వభావంలో యిమిడాయి. మానవసంక్షేమం, స్నేహానికి త్యాగం, మంచితనంలో అచంచల విశ్వాసం, రామణీయకత, సత్యం, ప్రపంచ సంపూర్ణతలో నమ్మకం అతన్ని పదార్థవాదం వైపుకు అయిష్టంగా తీసుకెళ్ళాయి."(1)

కాని తన ఇష్టానికి వ్యతిరేకంగా డిడొరొ పదార్థవాదాన్ని స్వీకరించాడనడం వాస్తవం కాదు. విజ్ఞానం ఆధారంగా జీవనతత్వాన్ని రూపొందించిన కాలం అది. అదే పదార్థవాదం. దానికి డిడొరొ ప్రాతినిధ్యం వహించాడు. పదార్థవాదిగా డిడొరొ తన పాత్రను నిర్వహించలేదని సందేహించడం అజ్ఞానం అసూయల ఫలితమే. పదార్థవాది నైతికంగా పక్కదారులలో పయనిస్తాడని, రామణీయకతను పట్టించుకోడని, సంస్కృతిలో మోటుతనం చూపుతాడని, సాధారణంగా స్వార్థపరుడని భావించారు. డిడొరొ తాత్వికంగా విజ్ఞాన భౌతికవాది, వివేచనావాది, మానవుడి శక్తిగా వివేచనను పరిగణించాడు. షాఫ్ట్‌బరీ పేర్కొన్న నమూనాలో "నైతికవాది" ప్రపంచవ్యాప్తంగా నిరంతరం కొనసాగే రామణీయకతతో విశ్వాసం ఉంచిన వ్యక్తి, పైకి కనిపించే అపస్వరాల వెనుక సంపూర్ణ

1) లాంజ్, హిస్టరీ ఆఫ్ మెటీరియలిజం

సమన్వయం ఉన్నదన్నవాడు."

వివేచన ఉద్వేగాలు కలిపి, డిడొరొ సమగ్రతత్వాన్ని రూపొందించాడు. ఐరోపా అంతటిని ఉగ్రూతలూగించిన విప్లవ మేధస్సు, సాంఘిక ఉద్యమానికి అతడు ప్రతీక. నిష్పక్షపాతంగా సమర్థవంతంగా అతడి జీవిత చరిత్ర రాసిన వ్యక్తి డిడొరొను సోక్రటీస్‌తో సరిగ్గా పోల్చాడు. ఏథెన్స్ రుషివలె, 18వ శతాబ్దంలో ఈ మేధావి కూడా సంధియుగానికి ప్రాతినిధ్యం వహించాడు. కనుక నాటి ఆలోచనలు, ఉద్వేగాల స్రవంతులు, సుడిగుండాలన్ని అతడిలో చూడవచ్చు. వాటి సమన్వయం కూడా డిడొరొ వ్యక్తిత్వంలో ఉన్నవి. "వివేచన యుగంలోని అభివృద్ధి దశలన్నీ అతనిలో పరిపక్వత చెందాయి. సోక్రటీస్ వలె, డిడొరొలో కూడా భూతమేదో ఉన్నది. సత్యం, మంచితనం, సుందరభావాల కనుగుణంగా సోక్రటీస్ వలె ఇతడూ స్పందించాడు. వాటి పారవశ్యతలో అసలు డిడొరొ ఉన్నాడు. కాని సామాన్యుడు అతడి వాగ్ధోరణిలో కొట్టుకుపోయాడు."(1)

17వ శతాబ్దంలో ఆధునిక తత్వం ఆవిర్భవించినప్పుడు, మేధావుల సృజన అంతా వ్యక్తిపరంగా ఉండేది. వ్యక్తిగతంగా తాత్వికులు సంపూర్ణ విధానాలను నిర్మించారు. 18వ శతాబ్దంలో తత్వవేత్తలు సహకరించి జ్ఞానవికాసం తెచ్చారు. విజ్ఞాన సర్వస్వం, ప్రకృతి విధానం రెండూ కూడా తత్వవేత్తల సమిష్టికృషి ఫలితాలే. మానవుడి ఉత్సాహంలో కని విని ఎరుగనంతటి భావుకత 18వ శతాబ్దాన్ని ఆవరించింది. మేధస్సు, ప్రతిభ, ప్రజ్ఞ, జ్ఞానం, ఊహ అన్నీ ఉరకలు వేశాయి. వీటన్నిటిల్లో అంతర్లీనంగా ప్రయోజనం ఉన్నది. తత్వాన్ని, మానవతకు ప్రజాస్వామ్యాన్ని తెచ్చి స్వేచ్ఛ, అభ్యుదయం, ఆనందాన్ని పెంపొందించాలని సంకల్పం ఉన్నది.

"వివిధ విప్లవ ధోరణులు పరస్పరం ప్రభావం చూపెట్టాయి. నీతిని డిడొరొ అత్యుత్సాహంతో శ్లాఘిస్తుండగా, ఇంకొకరు నీతి ప్రాతిపదికనే ప్రశ్నించేవారు. కాని మత గురువుల నీతి పట్ల అసహ్యం మాత్రం ఉభయులూ కనబరచేవారు. మతాధిపతులు మానవజాతి పట్ల నిరంకుశంగా ప్రవర్తించినందుకు జుగుప్స కనబరచారు. దేవుడి ఉనికికి క్షమాపణ చెప్పుకుంటూ నాస్తికులను రెచ్చగొట్టాడు వోల్తేర్. మతజ్ఞాన బలంతో అధికారాన్ని దుర్వినియోగ పరిచినందుకు అతడు ఆందోళన చెందాడు. ఈ విధంగా, అన్ని విధాలైన పెత్తందారీతనంపై నిర్విరామంగా దెబ్బతీస్తూ, స్థాయి తీవ్రతను పెంచారు"(2)

మేధావుల మధనవలన, ఉద్వేగ ఉత్సాహాల మధ్య, నైతిక ఆగ్రహంతో, రాజకీయ

---

1) రోజెన్ క్రట్జ్, లైఫ్ అండ్ వర్క్స్ ఆఫ్ డిడొరొ

2) లాంజ్, హిస్టరీ ఆఫ్ మెటీరియలిజం

నిరాపేక్షతతో, ఆర్థిక సంక్షోభంలో, సాంఘిక అసంతృప్తితో ఒక రూపం దాల్చిన పదార్థవాదం, ఒకే తత్వవేత్త నిర్మించిన పిడివాద వివేచన మాత్రం కాదు. మానవేచ్ఛ, మానవప్రయత్నానికి ప్రాధాన్యత యివ్వని కేవల వివేచనా వాదమూ కాదు. ఏకాకి అయిన వ్యక్తికి, ప్రాధాన్యత లేని స్వేచ్ఛను, ఒట్టి సార్వభౌమత్వాన్ని ప్రకటించిన సిద్ధాంతమూ కాదు. మానవుడి సమిష్టి అనుభవం వలన సృష్టించిన పదార్థవాదం, డిడొరొ, అతని తోటి తత్వవేత్తలు పెంపొందించిన రీతిలో, మానవ ఉనికిలో అన్ని కోణాలను పరిగణనలోకి స్వీకరించి, మానవుడి సృజనాత్మక శక్తులను, మానవుడి భావుకతను కలిపిన తత్వమే పదార్థవాదం. పునర్వికాసం కాస్తా జ్ఞాన వికాసంలో పరాకాష్ఠకు చేరింది.

"ఫ్రెంచి విప్లవానికి చెందిన తత్వవేత్తలు చాలమంది రూసోకు సంబంధించిన నమ్మకాలతో విజ్ఞానాన్ని జోడించారు. హెల్విషస్, కాండొర్సెలు వివేచనను, ఉత్సాహాన్ని మిళితం చేసిన వారికి మచ్చుతునకగా చూపవచ్చు.(1) పదార్థవాదానికి చెందిన అతిభౌతిక వాదాన్ని డలమిత్ర రూపొందించాడు. నీతిని హెల్విషస్ అందించాడు. డలమిత్ర నుంచి రాబట్టిన అతడి నైతిక విధానంలో ఉద్వేగవాద వాసనలు బాగా ఉన్నవి. మానవుడి మంచితనంలోనూ, ప్రాయకమైన వివేచనలోనూ నమ్మకంగల హెల్విషన్, మానవుడిని పూర్ణ మానవుడుగా చేయడానికి సంపూర్ణవిద్య అవసరం అన్నాడు." "మానవులు అజ్ఞానులుగా పుట్టారేగాని మూర్ఖులుగాకాదు. వారిని విద్య మూర్ఖులను గావిస్తున్నది." 19వ శతాబ్దపు నైతిక తత్వంపై హెల్విషస్ ప్రభావం బాగా ఉన్నది. "భౌతిక ప్రపంచానికి బేకన్ వలె, నైతిక లోకానికి హెల్విషస్ ఉన్నాడు. నైతిక ప్రపంచానికి బేకన్ ఉన్నా, న్యూటన్ యింకా రావలసివున్నది."(2) ప్రయోజనవాద నీతి సిద్ధాంత పితామహుడు(3) తననే బహుశా నైతిక ప్రపంచానికి న్యూటన్‌గా భావించాడేమో. ఇతడి సహచరుడు జేమ్స్ మిల్(4) తన కుమారుడి విద్యకు పదార్థవాది అయిన హెల్విషస్‌ను ఆదర్శంగా పెట్టుకోవలసిందిగా సిఫారసు చేశాడు. జాన్‌మిల్(5) తాత్విక రాడికలిజానికి ప్రవక్త అయ్యాడు.

నాటి తాత్వికులలో యువకుడు కాండొర్సె. విప్లవం రగులుకొన్నప్పుడు అతడింకా యవ్వనంలో ఉన్నాడు. అందులో పాల్గొని, అమాయకంగా అనేకమందితో సహా బలి అయ్యాడు. స్వతహాగా గణిత శాస్త్రజ్ఞుడైనప్పటికీ, విప్లవతత్వం, అతన్ని ఆవేశపరచింది. కాని క్లిష్టదశలో, వివేచన అధిగమించింది. వివేచనారహిత విప్లవోత్సాహంతో

1) బెర్ట్రాండ్ రసెల్, హిస్టరీ ఆఫ్ వెస్ట్రన్ ఫిలాసఫీ
2) బెంథాం
3) జెరిమి బెంథాం 1748-1832 ఇంగ్లీషు న్యాయశాస్త్రజ్ఞుడు
4) 1773-1836 ఆంగ్ల చరిత్రకారుడు
5) 1806-73 ఇంగ్లీష్ ఆర్థికవేత్త, తత్వవేత్త.

కొట్టుకపోడానికి నిరాకరించడంతో అతన్నే బలిగొన్నది. విప్లవోత్సాహంతో అతి మూర్ఖంగా కొందరు అతన్ని బలి చేస్తున్న సందర్భంలో సైతం, విప్లవం విమోచన గావిస్తుందనే విశ్వాసం మాత్రం అతడిలో సడలలేదు. ఒకవైపు ఉరికంబం వెన్నాడుతుండగా, తన ప్రధాన తాత్విక సిద్ధాంతాన్ని రాశాడు. గందరగోళం, హింసను నాటి రక్తపిపాసువులైన విప్లవకారులు కోరుతున్న సమయం అది. 1791లో అతిక్లిష్టదశలో సైతం రాచరికం స్థానే ప్రజాస్వామ్యం కావాలని కాండొర్సె కోరాడు. ఆ విధంగా, జెరాండిస్టుల సంప్రదాయ వివేచనావాదంతో అతను తెగతెంపులు చేసుకున్నాడు. అయినా, అతడు జాకబిన్‌లతో చేరలేదు. 5 నియోకవర్గాల నుంచి శాసనసభకు ఎన్నికైన కాండొర్సె, స్వేచ్ఛకు వ్యతిరేకంగా రాజు కుట్ర చేసిన నేరస్థుడని అన్నప్పటికీ, రాజును ఉరి తీయాలని ఓటు చేయలేదు. న్యాయాన్ని దయతో అమలు పరచాలనే ధోరణి అనుసరించినందువలన, జాకబిన్ అసహనానికి కాండొర్సె గురైనాడు. రిపబ్లిక్ వ్యతిరేకంగా కుట్రపన్నాడని, యితడిని బహిష్కరించారు. స్నేహితుల సహాయంతో ఉరి తప్పించుకొని శేషజీవితాన్ని అజ్ఞాతంగా అంటే ఒక యేడాది మాత్రమే గడిపాడు. ఆ సమయంలో మానవ భావంలో అభ్యుదయ చరిత్ర రీతులు రాశాడు. చరిత్రలో పరిణామం, దానినుంచి తత్వాన్ని రాబట్టడం యిందులో గమనార్హాలు.

అన్యాయమైన చట్టాలు, అణచివేసే సంస్థలు సృష్టించి, తోటివారి స్వేచ్ఛను దోచిన మతగురువులు, రాజ వంశీకుల కుట్రవలన  జీవితరంగంలో దోషాలన్నీ వచ్చాయి. మానవజాతి శత్రువులను తుదముట్టించి, బంధవిమోచన గావడం తప్పదు. గతంలో జరిగిన నిరంతర అభివృద్ధి గమనిస్తే మానవుడి పూర్ణత్వం, భవిష్యత్తులో అనంతంగా కొనసాగుతున్నదనడానికి సాక్ష్యాధారం, పశుతుల్యమైన అట్టడుగు దశనుంచి, శారీరకంగా తప్ప మరెందులోనూ జంతువులకు మించని దశనుండి, నిరాఘాటంగా మానవుడు, జ్ఞాన వికాసం, ధర్మం, ఆనందమార్గాలలో పయనించాడు.

కాండొర్సె తన చరిత్ర సిద్ధాంతాన్ని 10 దశలలో పై విషయాన్ని ప్రకటించాడు. 18వ శతాబ్దంలోని మేధావుల విప్లవంతో 9వ దశ ఆరంభమై, 1789లో ఉవ్వెత్తున రాజకీయ సాంఘిక సంక్షోభం రావడంతో కలసిపోతుంది. 10వ దశ యింకా రావలసి వున్నది. గతంలోని చరిత్ర అంతటా కనిపించిన మూడు ధోరణులు భవిష్యత్తుకు సూచనలు. జాతులమధ్య అసమానత్వం (1) నాశనంగావించడం (2) వర్గాల మధ్య అసమానత్వాలు అదృశ్యం గావడం.(3) అనంతంగా సంపూర్ణత్వంతో కూడిన మానవ స్వభావంలో మేధస్సులో నైతికంగా శారీరకంగా వ్యక్తులు వికసిస్తూ పోవడం.

అది వివేచనావాదపు కల. కాండొర్సె ఆశావాదం నిజంగా కలకాదు. కేవలం సమానత్వం వుండదు. హక్కులు, స్వేచ్ఛలో సమానత్వం ఉంటుంది. స్వేచ్ఛాయుత వ్యక్తులు

జాతులు సమానత్వంతో వుంటాయి. సమానత్వంవైపుకు పోవడమంటే, స్వేచ్ఛవైపుకు సాగడమే. కాండొర్సె చారిత్రకవాదం మతరహిత ప్రయోజనవాదం కాదు. అతి భౌతిక వివేచనవాదం కాదు. రాజకీయ సాంఘిక పరిస్థితులననుసరించి మానవ ప్రగతి ఉంటుందని అతడికి తెలుసు. అయితే ప్రగతి ఎల్లకాలం ఆపజాలం, కాని ఆలస్యం చేయవచ్చు, అడ్డుపెట్టవచ్చు. జ్ఞానాభివృద్ధికి, ధర్మాభివృద్ధికి అవధులు లేవు. అనంతజ్ఞానం, ప్రతిఫల ఫలితంగా అనంతాభివృద్ధి, మానవ సంపూర్ణత వస్తాయి. కనుక హెల్విషస్ వలె, కాండొర్సె కూడా ప్రజాబాహుళ్యవిద్యకు ప్రాధాన్యత యిచ్చాడు. ప్రగతికి అది తప్పనిసరి పరిస్థితులను కల్పిస్తుందన్నాడు. మేధావుల విప్లవానికి మూలసూత్రం అది. అందుకే దీనిని జ్ఞాన వికాసం అన్నారు.

18వ శతాబ్దపు తత్వవేత్తలు పట్టిన సత్యజ్యోతి ఆరిపోలేదు. తెలియని భవిష్యత్తులోకి, యింకా మానవజాతి ప్రయాణం చేయవలసిన చోటకు బాటలు చూపింది ఆ జ్యోతి. జ్ఞాన వికాసం మానవ సంపద. మానవుడి ప్రతిభా వ్యుత్పన్నత అది. వివేచనను వోల్తేర్ స్తుతించాడు. దానికి బిడ్డ సత్యం గనుకనే అతడలా చేశాడు. అతి ఉత్సాహాన్ని అతడు నమ్మలేదు. ఆశాజనక భవిష్యత్తు పట్ల అతడు సంశయం వ్యక్తపరచాడు. అయినా నాటికల ప్రభావానికి అతడు స్పందించక పోలేదు. టర్గొ(1) అధికారంలోకి వచ్చినప్పుడు వోల్తేర్ యిలా అన్నాడు. "మనం స్వర్ణయుగంలో తలమునకలుగా వున్నాం" బహుశా మానవ ద్వేషి వ్యంగంగా ముసుగువేసి చెప్పిన విషయంగా దీనిని భావించవచ్చు.

"విప్లవ బీజాలు ప్రతి విషయంలోనూ కనిపిస్తున్నవి. విప్లవం ఏదో ఒకనాడు రాక తప్పదు. ఆ వెలుగు ఒకరి నుంచి మరొకరికి ప్రసరించి, అది మిరుమిట్లు గొలిపే విధంగా మారుతూ విస్తరిస్తుంది.

ఇది కూడా సంశయవాదాన్ని నెమ్మదిగా చెప్పడమే. అయినా యీ మాటలే ప్రవక్త వాక్కు అయింది. వివేచనకు సంతానమే సత్యం కదా. వోల్తేర్ హేతువాది.

---

1) 1727-81 ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు, ఆర్థికవేత్త.

# మహోన్నత విప్లవం-1

18 వ శతాబ్దాంతంలో జరిగిన సంఘటనల వలన సాంఘిక వ్యవస్థ, రాజకీయ సంస్థలకు ఐరోపాలో తగిలిన చావుదెబ్బలతో, చిరకాలంగా గౌరవం పొందుతూ, శిధిలావస్థలో వున్న ఆ వ్యవస్థలన్నీ తరువాత వచ్చిన విప్లవంలో పేకమేడల్లాగ కూలిపోయాయి. ఈ సంఘటనలు ఫ్రాన్స్‌లో సంభవించినప్పటికీ, వాటి ప్రభావం ఐరోపా అంతటా ఉన్నది. ఐరోపాకు, ఆ మాటకొస్తే విశ్వవ్యాప్త ఉద్యమానికి ఫ్రాన్స్ కేంద్రస్థానమైంది. శతాబ్దాల తరబడి లోలోపలే పెల్లుబకడానికి ప్రయత్నిస్తున్న మానవశక్తి మానవేచ్ఛల అగ్నిపర్వతం బ్రద్ధలైంది. దీని ప్రభావం వలన మధ్యయుగాల అటవికత్వం నుంచి వస్తున్న కుళ్ళువ్యవస్థకు సమాధి కట్టడంతో, ఐరోపా అంతా అగ్నిపర్వత జ్వాలలు విరజిమ్మాయి. హద్దులు లేని ఉద్వేగం, హింసాయుత ఉద్రేకాలతో బాటుగా, వివేచనకు కూడా తిలోదకాలిచ్చిన భావాలు, అపఖ్యాతి నార్జించిన ఆదర్శాలతోబాటు త్రోసిపారేయడం జరిగింది. అసహనం, వివేచనారాహిత్యతలకు వివేచనాయుగం స్వస్తి పలికిందనిపించింది. కాని క్రైస్తవమతానికి పూర్వంగల గ్రీక్ సంప్రదాయాల పట్ల కనబరచిన విప్లవాత్మక ఉత్సాహం వలన వివేచన అభాసుపాలైంది.

మానవహక్కుల ప్రకటనతోబాటు వచ్చిన హింసాయుత భీభత్సాన్ని గమనిస్తే, విప్లవం తన సంతానాన్ని హరించివేస్తుందనే నానుడికి ఆస్కారమిచ్చిందనిపిస్తుంది. చరిత్ర సృష్టించడానికి మానవుడికి అవకాశం లభిస్తే అతడు చరిత్రకు అడ్డం పడతాడనిపించింది. విప్లవం అంతా హింసాత్మకంగా, రక్తపిపాసువుగా వుండడం అవసరమా? స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే మహోన్నత ఆదర్శాలను అభిలషించిన వ్యక్తులు బాధ్యతారహితంగా అతిపోకడలు పోవడాన్ని ఖండిస్తూ అనేక గ్రంథాలు వెలువడినవి. బూటకపు సమానత్వం కోసం స్వేచ్ఛ బలి అయిందని, విప్లవకారులు ఒకరినొకరు చంపుకోవడం వలన సౌభ్రాతృత్వం అపహాస్యం పాలైంది అని రాశారు.

అదంతా వాస్తవమే. అయినప్పటికీ, సాంఘిక సంబంధాలలో సమూల మార్పులు, రాజకీయ సంస్థలను అద్యంతాలు పునర్నిర్మించడం నాటి ప్రజలు కోరినవే. పాతరాజ్య వ్యవస్థ యిక ఏమాత్రం సరిపడదనే విషయాన్ని, విప్లవంపై ధ్వజమెత్తిన విమర్శకులు సైతం కాదనలేదు. అయితే, క్రమంగా, శాంతియుతంగా ప్రత్యామ్నాయ వ్యవస్థ రావాలని

వీరంటారు. గత చరిత్రలో మార్గాంతరాల గురించి ఊహించడం కేవలం ఆదర్శం మాత్రమే. జరిగిన చారిత్రక సంఘటనలు అట్లా ఎందుకు జరిగాయో అవగాహన చేసుకోవడమే చారిత్రక పరిశోధన ప్రయోజనం.

మహోన్నతమైన ఐరోపా విప్లవంలో రాజకీయాధికారం విషయం ప్రధాన సమస్య అయింది. రాజుల దైవాంశ సంభూత హక్కును ప్రజల సార్వభౌమత్వపు హక్కు వ్యతిరేకించింది. దేవుడిపై మానవుడి తిరుగుబాటు ఫలితంగా వచ్చిన పునర్వికాసం వలన యీ మహోన్నత విప్లవం తలెత్తింది. అనేక శతాబ్దాలుగా సాగుతున్న యీ నాటకంలో తుది అంకంగా, మానవేచ్ఛ, మానవశక్తి, మానవజిజ్ఞాస అత్యద్భుతంగా ప్రదర్శితమైంది. ఇటువంటి చారిత్రక పరాకాష్ఠలో నటులు సమదృష్టిని కోల్పోవడం సహజం. అందుకే విప్లవాలు హింసాపూరితం అవుతాయి. ఫ్రెంచి విప్లవం అటువంటిదే. ఫ్రెంచివిప్లవ లక్షణాలు కొన్ని దారుణమైనవైనప్పటికీ, అవి తప్పనిసరి అని ఎటువంటి నిష్పక్షపాత చరిత్రకారుడైనా సమర్ధించవలసిన పరిస్థితులు కూడా లేకపోలేదు. విప్లవం తప్పనిసరి, గత్యంతరం లేదు. మానవశక్తి, భావన మహోన్నతంగా వ్యక్తమైన ధోరణే అదంతా.(1) పక్షపాతం. పిడివాదం అని అనుమానించడానికి వీల్లేని సుప్రసిద్ధ చరిత్రకారుని అభిప్రాయం యిది.

16వ శతాబ్దంలో జరిగిన మతయుద్ధాలు, 30 సంవత్సరాల యుద్ధం వల్ల పవిత్ర రోమన్ సామ్రాజ్యం చిన్నాభిన్నం కాగా, స్పెయిన్ శక్తి బలహీనపడగా, 17వ శతాబ్దం మధ్యకాలానికి ఐరోపా రాజ్యాలలో అత్యంత గర్వోన్నతి స్థాయిలో ఫ్రాన్స్ నిలబడివున్నది. 30 సంవత్సరాల యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని ఫ్రాన్స్ సైనికబలాన్ని పెంపొందించడంలో రిష్లూ(2) చూపెట్టిన రాజనీతిజ్ఞత వలన యీ స్థితి ఏర్పడింది. రోమ్‌కు వ్యతిరేకంగా జర్మనీ ప్రొటెస్టంట్ రాజులకు సహాయపడడంలో కాథలిక్ కార్డినల్ అంతరాత్మ వెనుకాడలేదు. తుదకు, 14వ లూయీ కాలంలో ఫ్రాన్స్ అత్యున్నతస్థాయికి చేరుకోవడంతో, అతనికి "ఉన్నత ప్రభువు" అని. "సన్ కింగ్" అని ఖ్యాతి వచ్చింది. రాజకీయంగా, సైనికంగానే గాక ఐరోపా నాగరికత సంస్కృతిలో కూడా ఫ్రాన్స్ అత్యున్నత దశలో వున్నది. 14వ లూయీ యీ కాలంలో పాస్కల్,(3) కోర్నా, (4) రాసన్, (5) మోల్యార్, (6) బోస్వే, (7) ఫన్లాన్ (8) లఫంటన్ (9) వంటి వారి హయాంగా

1) లూయీ మాడ్లిన్, ది ఫ్రెంచ్ రివల్యూషన్.
2) 1623-62 ఫ్రెంచి గణిత తత్వశాస్త్రజ్ఞుడు.
3) 1585-1642 ఫ్రెంచి కార్డినల్, రాజనీతిజ్ఞుడు.
4) 1606-84 ఫ్రెంచి కవి, నాటకకర్త.
5) 1639-99 ఫ్రెంచి నాటకకర్త.
6) 1622-73 ఫ్రెంచి నటుడు, నాటకకర్త
7) 1627-1704 ఫ్రెంచి బిషప్ వక్త, రచయిత.
8) 1651-1715 ఫ్రెంచి మతజ్ఞాని.
9) 1621-95 ఫ్రెంచి కవి, కథకుడు.

సాగింది. "గ్రీస్ చరిత్రలో పెరికల్స్, రోమ్ చరిత్రలో అగస్టన్ వలె ఫ్రాన్స్ చరిత్రలో 14వ లూయీ కాలానికి అటువంటి స్థానం ఉన్నది." (10) కేవలం రాజరికపు రోజులవి. పైకి కనిపించే సంపద, అధికారం, ఖ్యాతి అంతా అసమానత్వం పైన, అణచివేసే సాంఘిక నిర్మాణం మీద ఆధారపడింది.

భూమి అంతటినీ తమ మధ్య పంపిణీ చేసుకున్న ప్రభువర్గం, మతగురువులపై పన్నులేదు. భారమంతా రైతులమీద పడింది. అసమాన పన్ను పద్ధతి వలన, పైకి సంపన్నత కనిపిస్తున్నప్పటికీ, ఆర్థికవిధానం దివాళాకోరుతనంగానే ఉండేది. ఈ సమస్యను పరిష్కరించడానికి కోల్బ(11) నెకర్(12) టర్గో(13) వంటి ఆర్థిక నిపుణులను ఆహ్వానించారు. వారు సూచించిన సంస్కరణలను నాటి వ్యవస్థాపిత సాంఘిక సంబంధాల వలన అమలు పరచడానికి సాధ్యం కాలేదు. "రిష్లూ విధానం వలన 14వ లూయీ విజయవంతంగా, విప్లవం వలన కలిగిన నాశనం కూడా దీనివలననే అని కూడా పేర్కొనవచ్చు."(14)

రిష్లూ ప్రారంభించగా, దానిని 14వ లూయీ కట్టుదిట్టం చేసిన పద్ధతి ఏమంటే, ఫ్యూడల్ రాజవంశీకుల అధికారాలు తగ్గించి, వారికిగల అవకాశాల జోలికిపోకుండా, అప్పుడే ఆవిర్భవిస్తున్న వర్తక, బాంకింగ్ వర్గానికి రాజాదరణ లభించేటట్లు చూడడమే. ఈ కొత్త వర్గంతో పాలనా యంత్రాంగాన్ని క్రమంగా నింపారు.

రాజాదరణకు కృతజ్ఞతగా, బాంకులు హస్తగతం గావించినవారు, రాజుకు డబ్బు అప్పుగా ఇచ్చారు. ఆర్థికంగా దివాళాతీసే పరిస్థితి నిరంతరం లేకుండా అట్లా పరిస్థితి కొంతవరకు తప్పిపోయింది. మరొకప్రక్క రాజకొలువుకు ఠీవి తెచ్చే నిమిత్తం రాజ వంశీకుల జోలికి పోకుండా వారి ఫ్యూడల్ దర్పంతో రాజధానిలో వుండేటట్లు చూచారు. స్థానికాధికారుల జోక్యం లేకుండా రాష్ట్రపాలన, ఆర్థిక యంత్రాంగం నడిచేందుకు, రాజు నియమించిన బూర్జువాధికారులే స్వయంగా వీరిపై అదుపు పెట్టేటట్లు కూడా యీ విధానం ఉద్దేశించింది. ఈ చాణక్య విధానం వలన ఉన్నత వర్గాలవారు పరాన్నభుక్కులు గావటంతో, అభ్యుదయ పంథా కాస్తా తిప్పికొట్టింది. రాజు కొలువు దర్పం వలన పనిపాటులేక, వృధాగా వుంటున్న వీరంతా దిగజారిపోయారు. అవినీతి తాండవించింది. పాలకవర్గం పతనావస్థలోకి పోయింది.

---

10) రాబర్ట్ ఫ్లింట్, ది హిస్టరీ ఆఫ్ ది ఫిలాసఫీ ఆఫ్ హిస్టరీ
11) 1619-83 ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు, 14వ లూయీకి ఆర్థికమంత్రి
12) 1732-1804 ఫ్రెంచి ఆర్థిక, రాజనీతిజ్ఞుడు, సిట్జర్లండ్‌లో జన్మించాడు.
13) 1727-81 ఫ్రెంచి ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞుడు.
14) రాబర్ట్ ఫ్లింట్ గ్రంథంలో.

ఆ స్థితి నుండిబయటపడటానికి విప్లవానికి తక్కువైతే వీల్లేదు. కాని నిరంకుశ పాలన, అణచివేత, అరాచకత్వం, ఆర్థికదోపిడీకి గురైనవారు ఆ అవసరాన్ని గుర్తించలేదు. విప్లవానికి యీ పరిస్థితులే కారణమైనా, దుర్భర జీవన స్థితిగతులకు వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేసినా, ఒక శతాబ్దానికి పూర్వమే, మహాప్రభువు అస్తమించినప్పుడే, విప్లవం రావలసింది." ప్రజల దారుణస్థితి గణనీయమైనది. 1715లో వృద్ధప్రభువు చనిపోయినప్పుడు, ఫ్రాన్స్ అంతటా వూపిరి పీల్చుకున్నారు. "కాని రాజపాలన చెక్కుచెదరలేదు. వాటి విధానాలను విమర్శించలేదు. ఫ్రెంచి ప్రజలు యింకా విప్లవానికి, అవిధేయతవరకూ పోలేదు."

డోర్లాన్ పాలనలో పరిస్థితులు మరీ అధ్వాన్నమైనవి. అసమర్థత, అవినీతి వలన ప్రభుత్వం నగుబాట్ల పాలైంది. రాజుకొలువు హీనస్థాయికి దిగజారింది. మొత్తం మీద 18వ శతాబ్దారంభంలో అధికారవర్గం పతనమై, విచ్ఛిన్నమైపోయింది. ప్రజలు ఎదురు తిరిగి దెబ్బ తీస్తే తట్టుకోగల శక్తి ప్రభుత్వం కోల్పోయింది. సంప్రదాయం ఒక్కటే కాస్త పని చేసింది. కాని అంతవరకు ఆలోచనను స్థంబింపజేసిన యీ సంప్రదాయ సంకెళ్ళ నుండి ప్రజలు బయటపడే సరికి, విప్లవానికి పరిస్థితులు అనుకూలించినట్లు ప్రజలు తలచారు. రాజపాలనను పవిత్రంగా చూడడం పోయింది. ఎటువంటి ప్రతిఘటన లేకుండానే రాజరికం కూలిపోయింది. జెరికొ నగర గోడలవలె పతనమైన యీ వ్యవస్థ కుప్పగా మారిపోయింది.

విప్లవానికి ముందు రాజాధికారాన్ని ప్రశ్నించవలసి వచ్చింది. అతని నిరంకుశ పరిపాలనపై ఎదురు తిరగాలంటే రాజు దైవాంశ సంభూతుడనే హక్కును ధిక్కరించే ధైర్యం ప్రజలలో వుండాలి. జ్ఞానవికాసం వలన ఆ వాతావరణం ఏర్పడింది. అసలు దైవం ఉనికినే కాదన్న తత్వం. రాజరికానికి దైవాంశ వున్నదనే సంప్రదాయాన్ని నాశనం గావించింది. దైవాంశ హక్కు అనేది కల్పన అయితే, రాజాధికారానికి బలం ఏమిటి? అంతానికి అదే ఆరంభం. విప్లవాన్ని ప్రోదించేసిన కారణం జ్ఞానవికాసమే. మానవుడి భావ పరిణామాన్ని వెనక్కు వెళ్ళి చూడడం యిష్టం లేకున్నా, 12వ శతాబ్దంలోని పునర్వికాసంలో జ్ఞాన వికాసతత్వపు వేరులు చూడవచ్చును. 18వ శతాబ్దపు భౌతికవాదం అప్పుడు తలెత్తిన బూర్జువావర్గపు తత్వం కాదు. జ్ఞానవికాసం బూర్జువా ఆదర్శ ఉద్యమమూ కాదు.

విప్లవ నాయకులలో ప్రతి ఒక్కరూ ఒకే తత్వాన్ని – కేవలం విచ్ఛేదన తత్వాన్ని అవలంబించారు. 50 సంవత్సరాలపాటు సాహిత్యంతో విలసిల్లిన రిపబ్లిక్‌ను పరిపాలించినవారు, రచయితలు, మేధావుల భావాలతో విప్లవానికి దేశాన్ని సిద్ధం చేశారు. సిద్ధాంతపరమైన పిడివాదం, సంప్రదాయవాదం, విశ్వజనీనవాదం, మానవతావాదం, క్రైస్తవమత వ్యతిరేకవాదం, అన్ని విధాలైన అధికారాలను నాశనంగావించే తత్వం ఆనాడు

పెంపొందినవి. మానవుల మనస్సులను కదలించి అంతరాంతరాళాల మంచి ఆలోచన చేసేట్లు నాడు ప్రభావితం చేశారు. ప్రాచీనత నుంచి జ్ఞానవికాసానికి భావ చైతన్యతతో ముందుకు పోవడంలో జాకొబినులు,(1) కార్డిండ్జలు, (2) సమానత్వ సమాజంవారు, జెరాండిస్టులు(3) ఒకరికొకరు తీసిపోలేదు. జ్ఞానవికాసంలో సాధించలేని ఆదర్శాలు, వాటి ఆవశ్యకత బాబ్(4) సమర్థనలో స్పష్టపడింది. నా భావాలు సమాజాన్ని అటవికత్వానికి పుంపుతాయన్నారు. కాని యీ శతాబ్దంలో మహోన్నత తాత్వికులు అలా భావించలేదు. నేను వారి శిష్యుడను. రాజరికపు పాలనలో సైతం, విప్లవాగ్ని రగుల్కొప్పే మాబ్లె, (5) హెల్విషస్, డిడొరొ, జాజాక్ రూసో పుస్తకాలు నాకు లభించాయి.

రాజ్యాధికారానికి మతవ్యవస్థ ప్రధాన వూతం. మతసంబంధమైన మూఢనమ్మకాలు విశ్వాసాలు ప్రజలలో అట్టిపెట్టడం ద్వారా రాజరికానికి విధేయతను కూడా కొనసాగించడంలో తోడ్పడినారు. ఎంతో క్రైస్తవ భక్తుడనుకున్న 14వ లూయీ కాలంలో సైతం సందేహవాదం వున్నది. అయితే, ఉన్నత తాత్విక రంగానికి అది పరిమితమైంది. మత వ్యవస్థపై బాహాటంగా దాడి జరపడం రాజులేకుండా పాలన సాగినప్పుడు ఎక్కువైంది. విప్లవానికి ముందు విప్లవధోరణి అనే శీర్షికతో యీ ప్రధానమైన మార్పును రాక్వి తన గ్రంథంలో చూపాడు. (Rocquain, The Revolutionary spirit previous to the Revolution) 1751లో రాజాధికారానికి వ్యతిరేక గాలి "ఫ్రాన్స్‌లో వీచింది. బాల్, వోల్తేర్, మాంటస్క్, డలమిత్ర, హెల్విషస్ భావాల ప్రభావం అప్పటికే బాగా కనిపించింది. "పీఠం కదిలితే, సింహాసనం నిలబడుతుందా?"(6)

దేవుడికి మానవుడికి మధ్య సంబంధం గురించి క్రైస్తవుల విశ్వాసం 17వ శతాబ్దంలో సడలిపోగా, 18వ శతాబ్దారంభంలో యిది పూర్తిగా కదిలించబడింది. రెండుకోణాల నుంచి దాడి జరిగింది. విజ్ఞానాధారంగా వచ్చిన తత్వం ఒక వైపున అట్లా వుండగా, సహజమత వాదులు "క్రైస్తవ మత విశ్వాసాలను వ్యతిరేకించారు. ఈ కొత్త విశ్వాసానికి రూసో ప్రవక్త. ఈ మతం కొందరినే ప్రభావితం చేసిన మాట వాస్తవం. వారిలో "గొప్ప ప్రభువులు, కొలువులో అధికారులు, యువరాజులు, మంత్రులు, రచయితలు, పండితులు వున్నారు. అయితే వారంతా ప్రభుత్వాలను అదుపులో పెట్టినవారు. ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసినవారు."

---

1) ఫ్రెంచి విప్లవంలో 1789 నుంచి 1794 వరకు రాడికల్ రాజకీయ వర్గం.

2) ఫ్రెంచి విప్లవంలో రాడికల్ ముఠా

3) మితవాద రిపబ్లిక్ పక్షం 1791-93

4) ఫ్రెంచి విప్లవకారుడు1760-97 సొసైటీ ఆఫ్ ఈక్వల్ స్థాపించినవాడు.

5) ఫ్రెంచి చింతనాపరుడు.

6) మాడలిన్ గ్రంథంలో.

ఉన్నత వంశీకులు, మతగురువుల ఆధారంగా రాజరికం నిలబడింది. వారిరువురూ విజ్ఞాన సహజవాదం, సహజమత ప్రభావాన్ని చూచారు. మిగిలినవారికంటె ఉన్నత వంశీకులపై కొత్త బోధనల ప్రభావం ప్రగాఢంగా వున్నది. కొందరికి మతంలోనే నమ్మకం పోయింది. ఆ విషయాన్ని వారంగీకరించారు. మరికొందరు అనుకోకుండా రాజరికంలో విశ్వాసం కోల్పోయారు. ఇంచుమించు అందరూ తమ హక్కులలో నమ్మకాన్ని విస్మరించారు. వారిదృష్టిలో విప్లవం అంటే, రాజుల నిరంకుశత్వానికి, మతగురువుల ఛాందసత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడమే–" మతగురువులలో కిందిస్థాయి వారి ధోరణి గురించి యిదే చరిత్రకారుడు యిట్లా వ్రాసాడు. "తమపై అధికారం గల మతగురువులను ఆగ్రహంతో, అసహ్యంతో, ఈర్ష్యతో చూచారు. కొత్తతత్వం కొంతవరకు అలవడిన యీ వర్గం వారు, ప్రజాస్వామిక ధోరణిలో పోనారంభించారు. వీరంతా సామాన్యుల బిడ్డలు. నమ్మకస్థులు.

ఫ్రాన్స్‌లోని ఒక చిన్న నగరంలో 40 మంది మతగురువులలో 24 మంది విజ్ఞాన సర్వస్వానికి చందాదారులయ్యారు. అదొక ప్రత్యేక విషయం. కొత్త తత్వం, సహజమత సహాయంతో, సమానత్వాన్ని పోగొట్టడంలోనూ, పాతవ్యవస్థను సడలించడంలోనూ ఎంతో కృషి చేసింది.

18వ శతాబ్దంలో ఫ్రెంచితత్వం అధికారాన్ని ధిక్కరిస్తూ, వివేచనను తప్ప మరి దేనినీ గుర్తించక, ప్రతిదానినీ వివేచనతో చూసింది. వివేతనతో సరిపోతే తప్ప, ప్రాచీన సాంప్రదాయం, అంగీకారం, మతవ్యవస్థలో విశ్వాసం, ప్రమాణగ్రంథం యిత్యాదులన్నీ ఎందుకూ పనికిరావన్నది. ముఖ్యంగా క్రైస్తవ మత సిద్ధాంతాలన్నీ పనికిరాని మూఢనమ్మకాల కింద కొత్త తత్వం పరిగణించింది. ఇందులో కొందరు మతసిద్ధాంతాలను వివేచనాత్మకంగా పరిగణించ వచ్చునని కొందరన్నప్పటికీ, యీ విశ్వాసాలన్నీ భ్రమలని ఎక్కువమంది భావించారు. ఈ కొత్త తత్వం వివేచనాత్మకమైనది. దీని దృష్టి ప్రశాంతమైనది గాక, నిశ్చితమైనది, జిజ్ఞాసతో కూడినది.

అటువంటి తాత్విక వాతావరణంలో రూసో అపస్వరం పలికాడు. అతడు డిడొరొతోనూ, యితరులతోనూ కలహించడం గమనించిన వారు ఉద్వేగవాద ఉద్యమం వివేచన క్రూరత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు అనుకున్నారు. ఉద్వేగవాదాన్ని రూసో చెప్పే రుగ్మతతో కూడిన భావవాదంతో కలిపిచూస్తే, అది వివేచనకు వ్యతిరేకంగానే కనిపిస్తుంది. వివేచనకు, 18వ శతాబ్దపు విజ్ఞానతత్వానికి వ్యతిరేకమైన మేరకు రూసో, మహోన్నత విప్లవప్రవక్తగా కాక, విప్లవానంతర వ్యతిరేక ధోరణికి, కొత్త కాథలిక్ మతసేవలో తమ సేవా ప్రతిభను అర్పించిన ధోరణికి మాత్రమే అతడు ప్రవక్త అయ్యాడు. విప్లవంలో రూసో నిస్సందేహంగా దేవదూతే. ఉద్వేగానికి సంబంధించినంత వరకు

యితడే ఎక్కువగా ప్రోది చేశాడు. కాని సహజ మతబోధకుడుగా గాని, మార్మిక నైతికుడిగా గాని, కలలుగనే ప్రకృతివాదిగా గాని అతడు ప్రధాన పాత్ర వహించలేదు. సమాజ ఒడంబడిక సిద్ధాంతాన్ని ప్రచారం చేయడం వరకే అతడు విప్లవానికి తోడ్పడ్డాడు. అతడి దృష్టిలో అది సగం వివేచనతో కూడిన సిద్ధాంతం. లోగడ సాంఘిక, రాజకీయ తత్వాలు పెంపొందించిన గ్రోషస్, పఫన్‌డాఫ్, హబ్స్, లాక్ నుంచి యీ సిద్ధాంతాన్ని రాబట్టారన్నారు. వికో నుంచి కూడా రూసో నేర్చినట్లు నిదర్శనాలున్నాయి. రూసో సిద్ధాంతం సగం వివేచనాత్మకం అని ఎందుకంటున్నామంటే, తన సిద్ధాంతానికి తానెవరికీ రుణపడలేదని, తనదే సొంత సిద్ధాంతమని అతడు రుజువుపరచదలచాడు. తాను సొంతం చేసుకున్న సిద్ధాంతాలను అతడు తీవ్రంగా విమర్శించాడు. భాషాపటిమ, శైలివలన భావచౌర్యాన్ని కప్పిపుచ్చేశాడు.

ఏమైనా విప్లవంలో పాల్గొన్న ప్రతి ప్రముఖనాయకుడు కూడ రూసో భావోద్రేక వాదం నుంచి ప్రేరణ పొందినవాడే. విజ్ఞానం, నాగరికత, అభివృద్ధికి అతడి వ్యతిరేకతను గమనించినవారే. ఇందుకు మినహాయింపు ఒక్క రాబజ్ పీర్ మాత్రమే. అతడు ప్రశాంతంగా ఆలోచించి చేసేవాటిల్లో భావోద్వేగానికి తావులేదు. నీతివాదిగా మాత్రం అతడు రూసో శిష్యుడు. మిగిలిన విప్లవ నాయకులందరు వివేచనా వాదులే. రూసో రచనలతో బాటు, సిసిరో, అనాగ్జగోరాస్ రచనలు కూడా వీరు అధ్యయనం చేశారు. విప్లవం సృష్టించిన మహోన్నతులలో ఒకడైన డాంటన్(1) మాత్రం రూసోను నిర్మొహమాటంగా అభినందించలేదు.

విప్లవాన్ని సాధించినవారు, విజయ పరంపరలు తెచ్చినవారు, చివరకు బలి అయినవారంతా 18వ శతాబ్దపు విజ్ఞాన ధోరణితో తాదాత్మ్యం చెందారు. వీరిలో పేర్కొనదగినవారు మీరాబో,(2) బ్రిసా, వెర్గాడ్, లాంజునా, రాబాడ్, బార్బరా, కాండొర్సె, రోలాన్. "రూసో తత్వం పట్ల వీరి ధోరణి గురించి, డిస్కోర్స్ ఆన్ ది ఆరిజన్ ఆఫ్ ఇన్ ఈక్వాలిటీ గ్రంథం చదివిన అనంతరం వోల్తేర్ వ్యాఖ్యానం బాగా వ్యక్తం చేస్తుంది.

అతడు రచయితకు యిట్లారాశాడు. "మానవజాతికి వ్యతిరేకంగా మీరు రాసిన నూతన గ్రంథం చేరింది. ధన్యవాదాలు. మనల్ని పశువులుగా మార్చడంలో మీరు చూపిన హాస్యధోరణి మరెవరూ కనబరచలేదు. మీ పుస్తకం చదివిన అనంతరం మళ్ళీ నాలుగుకాళ్ళపై నడవాలనిపిస్తోంది. ఆ అలవాటు పోయి అరవై ఏళ్ళయినందున, మళ్ళీ ఇప్పుడు అట్లా చేయడం అసంభవమనిపిస్తున్నది."

---

1) 1759–94 ఫ్రెంచి విప్లవనాయకుడు

2) 1749–91 ఫ్రెంచి విప్లవ రాజనీతిజ్ఞుడు.

రూసో ఇంద్రియానుభూతి వాదం గాని, అతడి నైతికధోరణిగాని అబర్‌వాదులకు (3) ఆకర్షణీయంగా లేదు. కాని ప్రైవేట్ ఆస్తిని ఖండించినవాదం వారికి నచ్చింది. రూసో రాజకీయ సిద్ధాంతంలో యిమిడివున్న నియంతృత్వ ధోరణి, కార్మిక నియంతృత్వాన్ని కాంక్షించిన తొలి ఉగ్రవాదులను ప్రేరణాత్మకంగా పట్టివేసింది. రూసో అతిభౌతిక తత్వాన్ని నీతి విధానాన్ని అనుసరించినవారిలో రాబస్ వీర్, అతడి వ్యక్తిగత అనుచరులు మాత్రమే మిగిలారు. రూసో రాజకీయ తత్వంలో సమిష్టి ప్రాధాన్యతను చాటే యీ భావం గమనార్హం. కేవలాధికారాన్ని వూహించిన రాబస్ వీర్, వ్యక్తిపరమైన నియంతృత్వాన్ని స్థాపించదలచాడు. మిగిలిన రూసో సనాతన శిష్యులు నెపోలియన్ నియంతృత్వాధికారాన్ని స్వీకరించడంలో తోడ్పడిన తర్మిడోర్ వాదులు.(4)

రూసో జీవితంలో కొన్ని వాస్తవాలననుసరించి, అతడు సమకాలీన ఆలోచనా స్రవంతికి దూరంగా వున్నాడనే భావన కలిగే అవకాశం వున్నది. తన సొంత తత్వానికి ప్రవక్తగా వున్నాడనిపిస్తుంది. జీవితంలో పూర్వార్థమంతా నాటి మేధావుల జీవనరంగానికి దూరంగా ఏకాకిగానే రూసో గడిపాడు. తరువాత 18వ శతాబ్దంలో భావజీవితాన్ని ప్రభావితం చేసిన తత్వాలతో సన్నిహితుడయ్యాడు. కాని యీ బంధం అట్టేకాలం లేదు. తరువాత మళ్ళీ వంటరివాడయ్యాడు. అయినప్పటికీ, విప్లవ ప్రేరకులలో ఒకడుగా ఏకైక ప్రవక్తగా కాకున్నా – అతడికి గుర్తింపు లభించింది. వోల్తేర్, విజ్ఞాన సర్వస్వకర్తల ప్రభావంవలె, యితడి ప్రభావం కూడా ఫ్రాన్స్ సరిహద్దులు దాటి విరజిమ్మింది. జర్మనీలో ఆలస్యమైన పునర్వికాసాన్ని, 19వ శతాబ్దం తొలిభాగంలో ఇంగ్లండ్ ఉద్వేగ ఉద్యమాన్ని రూసో ప్రభావితం చేశాడు. అతని ప్రభావానికి కొలమానం ఏదైనప్పటికీ అది విప్లవాత్మకం కాదు. సాంఘిక, రాజకీయ విషయాలలో, విప్లవానంతర ఉద్వేగ ఉద్యమం తిరోగమనంతో కూడినదే. అయితే సాహిత్యసృష్టి బాగా జరిగిన మాట వాస్తవం. రూసో శైలివలన అతడికి ఐరోపాలో ఖ్యాతి లభించింది. ఈ శైలిని అనుకరించిన షాటోబ్రాన్ 19వ శతాబ్దపు సాహిత్యశైలికి ఒరవడి పెట్టాడు. రూసోను తత్వవేత్త అనడంకంటె, ఇంద్రియానుభూతి, స్వాప్నికుడు, ఆదర్శవాది అనవచ్చు. ఆ విధంగా కూడా అతడి భావన స్వచ్ఛమైందేమీ కాదు. 17, 18 శతాబ్దాలలో ఆదర్శ సమాజాన్ని వూహించడం సాహిత్య లక్షణంగా వుండేది. పునరుజ్జీవనం పొందిన రాజరికంలో యీ కలను సాధించాలన్నారు. "ఈ భావం, దీనితోబాటువున్న అసంతృప్తి కూడ 17వ శతాబ్దాంతంలో, 18వ శతాబ్దారంభంలో ఫ్రెంచిరాజకీయ ఉద్వేగాలలో, వూహలలో బాగా కనిపించింది.

---

3) జాక్ రాన అబర్ 1755–94 ఫ్రెంచి పత్రికా రచయిత, విప్లవకారుడు.

4) రాబస్ వీర్, అతని అనుచరుల పతనానికి తోడ్పడిన మితవాదులు. ఫ్రెంచి విప్లవ కాలండర్‌లో 11వ మాసాన జులై 19 నుంచి ఆగస్టు 17 వరకు తర్మిడోర్ అంటారు. 1794 జులై 27న, 9వ తర్మిడోర్ నాడు, అతివాదుల పతనం జరిగింది.

మానవుడిలో తలెత్తే శాశ్వత ఆశవలన, బాధిత ప్రజలు సహజంగా ప్రవక్తవలె తయారయ్యారు. ఉజ్వల భవిష్యత్తును ఆశించిన ఈ ప్రజల కాలంలోనే సాంఘిక ఆదర్శాలు స్వేచ్ఛగా వెలువడినవి. ఈ కాలంలో ఫ్రాన్స్‌లో వెలువడిన ఆదర్శ భావాలన్నిటిల్లో ఒక సాధారణ లక్షణం వున్నది. శక్తివంతమైన ఒక పాలకుడు చుట్టూ పరిభ్రమిస్తూ అతడిపై ఆధారపడే రీతిలో యీ సంక్షేమరాజ్యాన్ని వూహించారు.

రూసో ఆ సంప్రదాయానికి చెందినవాడు. అతని వూహలలో మంచిరాజుకు మాత్రమే చోటు లేదు. అయినా అతడు తిరోగమనవాది. నాగరికతను కాదని, పుక్కిటి పురాణాలలో పేర్కొన్న ప్రాచీన స్వర్ణయుగం వైపు పయనించమని మానవజాతికి ఉద్భోదించాడు.

రాచరికపు విశ్వాసం నుంచి అతడు బయటపడలేదు. ప్రాచీన గ్రీస్‌లోని నగర రిపబ్లిక్‌లను పోలిన ప్రజాస్వామ్యాన్ని రూసో వూహించాడు.

రూసో సొంత ఆలోచన గలవాడుకాడు. సాంఘిక దోషాలన్నింటికి మూలం ప్రైవేట్ ఆస్తిగనక, దానిని ఖండించే నైతికవాదిగా గాని, సహజమతాన్ని బోధించేవాడుగా గాని, రూసో ఆలోచన స్వతంత్రమైనదికాదు. సమిష్టివాదానికి ఆబెమార్లె అసలు ప్రవక్త. వూరార్(1) ద్వారా సోషలిస్ట్ ఉద్యమాన్ని 19వ శతాబ్దంలో యితడు ప్రేరేపించాడు. రూసో గ్రంథం సోషల్ కాంట్రాక్ట్‌కు 10 సంవత్సరాల ముందే ఇతడి గ్రంథం కోడ్‌డల నేచర ప్రచురితమైంది. రూసో కంటే ఈ పుస్తకంలో భావాలు చాలా సమూల మార్పులను కోరినందున, చాలాకాలం యీ పుస్తకాన్ని డిడొరొ రాసివుంటాడనుకొన్నారు. మానవుడు ఇంద్రియానుభూతిగల శరీరం గలవాడని, ఆనందాన్ని సాధించడమే అతడి ఉద్దేశమని మెరెల్లె అంగీకరించాడు. ఆనందాన్ని సాధించడం అవినీతి కాదు. మానవుడి స్వభావం మంచిది. అమాయకం కూడా. "ఆశలకు, విధులకు నీతి వ్యతిరేకం కాదు. ఇవి న్యాయసమ్మతమైన, సార్వభౌమత్వ లక్షణాలు గలవి గనుక, యధేచ్ఛగా పనిచేయనిచ్చినా హాని జరగదు. మానవుడు పేరాశలకు లోను కాకుండా, అతడి కోర్కెలు సాధించుకునే పరిస్థితి కల్పించడం ఎట్లాగన్నదే సమస్య. సంపన్నులు కావాలనే దృష్టి తొలగిస్తే యిది సాధ్యం. అదొక్కటే ప్రపంచదోషం, మానవజాతికి చీడ, సమాజాన్ని ఆవరించిన రుగ్మత" ప్రైవేట్ ఆస్తిని తొలగించి, సంపదను సమిష్టిపరం చేసినప్పుడు యీ లక్ష్యం సాధించవచ్చు. ఇంతకు మించిన విప్లవ సమాజాన్ని రూసో సూచించలేదు.

విప్లవాదర్శకులలో మరొకడు మాబ్లె. అతడు కాథలిక్ పండితుడు. మంచి దేవుడిలో నమ్మకంగల వ్యక్తిగా, చక్కని నైతిక నియమాన్ని అభిలషించాడు. రాజకీయాలలో నీతికి అధిక ప్రాధాన్యత యివ్వడమేగాక, మతం లేకుండా నీతి సాధ్యం కాదన్నాడు. సాంఘిక అసమానలతకు కారణమైన ప్రైవేట్ ఆస్తిని ఖండించాడు. "దోషాలను పరిశీలిస్తే,

సంపదలోని అసమానతలకు తొలిదోషం ముడిపడివున్నట్లు కనుగొనవచ్చును. "చరిత్రారంభంలో గల సాంఘిక సమానత్వం, సంపద సమాజ పరంగా వుండడం అనేవి ఆదర్శ సమాజ లక్షణాలని మాబ్లే ప్రకటించి, మార్క్స్ చెప్పిన "శాస్త్రీయ సోషలిజానికి" ముందే బాటలు వేశాడు.

క్రైస్తవ సనాతనత్వానికి వ్యతిరేకంగా సహజమతాన్ని బోధించడం, నీతిలోకాన్ని వూహించడం, సమిష్టివాద ప్రవక్తగా ఉండడంలో రూసోకు ముందు, అతడి సమకాలంలో కూడా యింకా కొందరు ఉన్నారు తప్ప, అతడు ఒక్కడే వీటిని పేర్కొనలేదు. వారితో కలిసి ఆ కాలానికి ఉద్వేగధోరణి కల్పించాడు. అయితే మేధస్సు అతడు ప్రమేయం పెట్టుకోలేదు. చరిత్రగతి నిర్ధారితమయ్యే కాలంలో, మానవజాతి వీరోచిత చర్యలకు పురికొల్పబడినప్పుడు, అది మంచిగానీ, చెడుగానీ, ఉగ్రూతలూగించే భాషతో మేళవించినప్పుడు, ఉద్వేగానికి ప్రేరణ కలిగించినప్పుడు, తక్షణమే చాలస్పందన కనిపిస్తుంది. అందుకే విప్లవం వచ్చినపుడు జ్ఞాన విజ్ఞానం కంటె, రూసో ప్రభావం ఎక్కువగా వున్నట్లనిపించింది. సమూల రాజకీయ సాంఘిక పునర్నిర్మాణానికి అవసరమున్నదనే ధోరణి రావడానికి అసలు కారణం తాత్విక విప్లవమే. ఈ కొత్త చైతన్యతకు రూసో శైలిలో స్పందన కనపడింది. "ఇరువురూ ఆ కాలానికి ప్రతినిధులైనప్పటికి, నాటి సాధారణ లక్షణాలు రూసో కంటె వోల్తేర్‌లో ఎక్కువగావున్నాయి. స్వతంత్ర ఆలోచన గల వ్యక్తిగా రూసోను భావించడం తరచు పొరబాటున జరిగింది. రూసో బోధనలలో కొత్తదనం చాలా స్వల్పం. నాటి పరిస్థితులను కొన్నిటిని అతడు వ్యతిరేకించడం కూడా నాటి ధోరణిలో ఉన్నదే. స్వతంత్రంగా రూసో వున్నట్లయితే, అతడి ప్రభావం అంతగా వుండేదికాదు."

చరిత్రలో రూసో స్థానం, అతడు నిర్వహించిన పాత్రపైన చక్కగా చిత్రించారు. మానవుడు తన విధిని తానే నిర్ధారించగలడనేది నాటి ధోరణిలో ముఖ్యమైనది. ఆ విశ్వాసాన్నే రూసో వెల్లడించాడు. అందుకే అతడి విజ్ఞప్తి బలంగా పనిచేసింది. దీనికి స్పందించినవారు, యిష్టం వచ్చినట్లు వ్యవహరించడం గాక, జడప్రాయంగా వున్న పరిస్థితిపై దెబ్బ తీయడానికి పురికొల్పింది. విజ్ఞానం చూపిన వెలుగుబాటలో అంధకారాన్ని చీల్చుకుంటూ ముందుకుబోవడానికి అది తోడ్పడింది. వీరోచిత చర్యలకు, ఉన్నతపాత్ర నిర్వహణకు విప్లవం పురికొల్పి, అవకాశాల నిచ్చింది. విప్లవచర్యలు ఉద్వేగపూరితాలు. శైలి, ఆలోచన మాత్రం సంప్రదాయబద్ధాలు. 18వ శతాబ్దపు తత్వం నుంచి విప్లవసిద్ధాంతం జనించింది. ప్రాచీనతలోనూ, నైరూప్య వివేచనలోనూ వూహలన్నీ యిమిడినాయి. ప్లూటార్క్(2)ను ప్రమాణంగా స్వీకరించి వాదించడం, వివేచనను ఆరాధించడం అనవాయితి అయింది.

17వ శతాబ్దాంతం వరకు మతపరమైన కలహాలు, పౌరయుద్ధాలు, జర్మనీ, ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లను చిన్నాభిన్నం గావించాయి. జీవితంలో ఉద్వేగం పట్ల అపనమ్మకం ఏర్పడి, చివరికది పిపాసగా, చాందసంగా మారింది. 30 సంవత్సరాల యుద్ధంతో పూర్తిగా అలసిపోయిన జర్మనీ, ఆధ్యాత్మిక మగతలో సాష్టాంగపడింది. ఉద్వేగాన్ని కన్నెర్ర జేసి చూశాడు ఇంగ్లండ్‌లో లాక్. 14వ లూయీ కింద, మతయుద్ధాల నుండి బయటపడిన ఫ్రాన్స్, వివేచనాయుగంలో అడుగిడింది. శాంతిభద్రతలు, సంపన్నత చవిచూచి చాలా కాలమైంది ఫ్రాన్స్‌లో. రాజరికంలో వున్న వర్గాలను గమనిస్తే అదొక స్వర్ణయుగం. కోల్బర్(1) వివేచనలో భాగం పంచుకొన్న రాజు నాటి రాజరికానికి సామాజిక ప్రాతిపదికను విస్తృతం చేయజూచాడు. రాజుకు ప్రజలకు ప్రత్యక్ష సంబంధం ఏర్పరచి, తద్వారా ఫ్యూడల్ సంపన్న వర్గాల స్థితిని తగ్గించాలని ప్రయత్నించారు. ఉన్నత వంశీకుల నాయకుడుగా కాక, ప్రజలకు దయామయుడైన సంరక్షకుడుగా రాజు ప్రవర్తించాడు. తండ్రి సంరక్షణ విధానం వలన రాజు నీతి బలపడింది. యథాస్థితి వుండాలనేది సర్వసాధారణ అంశమైంది. తరచూ వచ్చే యుద్ధాలు ఆగిపోవడంతో, శాంతిభద్రతలు కాపాడిన రాజ్యం పట్ల రైతులు విధేయులయ్యారు. వారికిగల కష్టాలను పక్కనబెట్టారు. కొత్త విధానం అంటేనే అపనమ్మకం ఏర్పడింది. ఉన్నవ్యవస్థను అట్టిపెట్టాలనే వాదం వలన సంప్రదాయ పాండితి పెరిగింది. సంప్రదాయ విధానంలోకి న్యూటన్ విశ్వవాదం పేర్కొన్న నియమ బద్ధ ప్రకృతి బాగా యిమిడింది. ప్రకృతి నియమానుసారం ప్రపంచం ప్రశాంతంగా నడుస్తుంది. కాని పిపాస వలన యీ నియమంలో క్రమం తప్పుతున్నది. కనుక వివేచన అదుపులో పిపాస ఉండాలి. వ్యవస్థను అట్టిపెట్టడంతో వివేచన వాదాన్ని కలిపేశారు. అయితే అది వివేచనావాదం కాదు, సంప్రదాయవాదం. వ్యవస్థను అట్టిపెట్టాలనే ధోరణిపై తిరుగుబాటే ఉద్వేగఉద్యమం. సంప్రదాయ పాండిత్య ప్రమాణాధారంగా ఉద్వేగవాదాన్ని కూడా వివేచనాత్మకం గావించారు. కనుక, చారిత్రకంగా, మహోన్నత విప్లవానికి నాంది పలికింది ఉద్వేగవాదం. ఆ విధంగా చూస్తే 18వ శతాబ్దంలో విప్లవానికి ప్రాతిపదికలు వేసిన విజ్ఞాన సహజతత్వంలోని వివవేచనావాదానికి యిది వ్యతిరేకం కాదు.(2) ఇవి రెండూ కలిసి 14వ లూయీ కాలపు సంప్రదాయ వాదానికి

---

1) 1619-83 ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు, 14వ లూయీకి ఆర్థికమంత్రి.

2) ఉద్వేగవాదమంటే వివేచనపై తిరుగుబాటుగాని, కేవల ఉద్రేకంగాని, వాస్తవం నుంచి తప్పించుకోవడంగాని కాదు. మానవుడి అధిపత్యంలో అన్వేషణా యాత్రే యిదంతా. ఇచ్ఛతో విడదీయరాని మానవుడి వివేచన అతడి కోర్కెలను మార్గాన బెట్టి, అతడి చర్యల ఫలితాలను అట్టిపెడుతుంది. నైరూప్యంగానూ, విడిగానూ, పరిశీలిస్తే, వివేచన-ఇచ్ఛ ఒకదానితో మరొకటి పోటీ పడుతూ, ఒకసారి కోరిక ముందుకు, మరొకసారి సాధన విస్తరించడం జరుగుతూ పోతుంటుంది. ఇవి రెండు కలిస్తేనే మనం అనుకునే నాగరికత నిర్మితమైంది. ఒక్కొక్క పర్యాయం నిస్పృహలో, వివేచన కోర్కెలననుసరించి, మన లక్ష్యానికి అనుగుణంగా నాగరికతలేదేమో అనుకుంటాం. మానవుడి ఔన్నత్యంలోనే అతడి బలహీనత వున్నదనే ఉద్వేగసత్యం గుర్తుకు వస్తుంది. జాక్ బార్జా, రొమాంటిసిజం అండ్ మోడ్రన్ యిగో.

ఎదురు తిరిగి మహోన్నత విప్లవంలో కలిశాయి.

సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్నివ్వడమే విప్లవానికి రూసో చేసిన ప్రధాన సహాయంగా పరిగణించవచ్చు. ఇదొక వివేచనాత్మక సంప్రదాయ సిద్ధాంతం. తొలుత గ్రోషస్, పఫెన్ డార్ఫ్‌లు దీనిని ప్రతిపాదించగా, హాబ్స్ రూపురేఖలు దిద్దాడు. తుదకు తన రాజకీయతత్వ ప్రాతిపదికగా లాక్ దీన్ని విస్తరించాడు.(1) అనుభవానికి ముందే జ్ఞానం వుంటుందనే సిద్ధాంతాన్ని ప్రాపంచికానుభవంతో వ్యవస్థాపించాలని మాంటిస్కు ప్రయత్నించాడు. రాజకీయంగా రూసో మాత్రం మాంటిస్క్యూ శిష్యుడే. సామాజిక ఒడంబడిక భావాన్ని స్వీకరించిన రూసో, అనుభవానికి పూర్వమే జ్ఞానం అనే ధోరణికి వెళ్ళిపోయాడు. తన సోషల్ కంట్రాక్ట్ గ్రంథం తొలి రాతప్రతిలో యిట్లా అన్నాడు. "మానవులను కూడగట్టడానికి వేలాది మార్గాలున్నాయి. వారిని ఐక్యపరచడానికి ఒకే మార్గం ఉన్నది. కనుక, రాజకీయ సమాజాల స్థాపనకు ఒకే పద్ధతిని యీ పుస్తకంలో సూచిస్తున్నాను. అయితే ఇప్పుడున్న సంఘాలలో ఏ రెండూ కూడా అదే పద్ధతిలో జనించక పోవచ్చు. సమాజ ప్రాతిపదికను, హక్కులను సూచిస్తున్నాను తప్ప, వాస్తవాలను గురించి కలహించదలచలేదు.(2) "చారిత్రకంగా అతడి సిద్ధాంతం దోషబద్ధం.(3) రాజకీయ రాజ్యాంగ సిద్ధాంతాభివృద్ధికి ఒడంబడిక భావన చాలా ఉపయోగకారి. 18వ శతాబ్దంలోనేగాదు, తరువాత కూడా, ప్రజాస్వామిక రాజకీయ తత్వానికి ప్రాతిపదిక సామాజిక ఒడంబడిక అనే నమ్మారు. ఈ భావంలోగల ప్రమాదాన్ని రూసో చూపాడు. కాని చాలాకాలం యిది రాజకీయ, రాజ్యాంగవేత్తల దృష్టిలో పడనేలేదు.

పౌరసమాజానికి ఒడంబడిక సిద్ధాంతమే మూలం అని 18వ శతాబ్దపు విప్లవకారులు ఉత్సాహంగా శ్లాఘించారు. కొత్త రాజకీయ రాజ్యానికి మతేతర ప్రమాణాన్ని ఈ సిద్ధాంతం సమకూర్చిపెట్టింది. రాజు దైవాంశ సంభూతుడని పాతవ్యవస్థ నమ్మేదిగదా.

ఈ విధంగా ఒడంబడిక సిద్ధాంతం ఒక రాజకీయ ప్రయోజనాన్ని నెరవేర్చింది. విప్లవకారులలో రూసో బహుళ ప్రచారం పొందడానికి యిదొక కారణం. "ఫ్రెంచి విప్లవనాయకులలో చాలమందికి సామాజిక ఒడంబడిక (సోషల్ కంట్రాక్ట్) గ్రంథం బైబిల్ వలె మారినప్పటికీ, బైబిల్‌ను ఎలాగైతే శ్రద్ధగా చదవలేదో, అవగాహన అంతకంటె చేసుకోలేదో, అట్లాగే యీ గ్రంథం కూడా తయారైంది. ఇందులోని సాధారణేచ్ఛ అనే

---

1) రూసో స్వభావం, ప్రతిభ అతని కాలంపై గట్టి ముద్ర వేసింది. అయితే సామాజిక ఒడంబడిక సిద్ధాంతం మాత్రం లాక్, సిడ్నీల నుండి స్వీకరించినదే. వారి నుండి రూసో భేదించిన చోట మాత్రం, ఆ సిద్ధాంతం అనుభవంగా మారింది. లెకి, ది రైజ్ ఆఫ్ రేషనలిజం ఇన్ యూరోప్.

2) సి.ఇ.వాగన్, ది పొలిటికల్ రైటింగ్స్ ఆఫ్ రూసో

3) చరిత్ర నిమిత్తం లేకుండా, వూహతో నైరూప్య స్వభావంతో, వాదనతో, చరిత్రకానుభవం లేకుండా యీ సిద్ధాంతం రూపొందించాడు. ఫ్లింట్, హిస్టరీ ఆఫ్ ది ఫిలాసఫీ ఆఫ్ హిస్టరీ.

సిద్ధాంతం వలన, నాయకుడు ప్రజలు మార్మికంగా తాదాత్మ్యం చెందే అవకాశాన్ని యిది కల్పించింది. అభిప్రాయ సేకరణ వంటి వాటి సహాయంతో ఒడంబడిక అనేది అనవసరం అనుకున్నారు. రాబస్‌పీర్ రాజ్యం ఆచరణలోకి రావడంతో ఈ సిద్ధాంత ఫలితం చవిచూసినట్లయింది. రూసో బోధనల ఫలితంగానే రష్యా, జర్మనీ (ముఖ్యంగా)లో నియంతృత్వాలు వచ్చాయి."

రూసో విస్తరించి చెప్పిన దానిని బట్టి సామాజిక ఒడంబడిక సిద్ధాంతానుసారం ప్రజాస్వామ్యం సాధ్యం కాదు. అతడి దృష్టిలో ప్రజాస్వామ్యం అంటే ప్రాచీన గ్రీస్ నగర రాజ్యాల వంటిది మాత్రమే. 18వ శతాబ్దంలో, జాతీయ రాజ్యాలు విశాల భూభాగాలను ఆక్రమించడం, విపరీత జనాభా వుండడం వలన , ప్రత్యక్ష ప్రజాస్వామ్యం సాధ్యంగాదు. కనుక రూసో తన విచారాన్ని యిట్లా వ్యక్తపరచాడు. "దేవతా ప్రజలంటూ వుంటే వారి ప్రభుత్వం, ప్రజాస్వామికంగా ఉంటుంది. అంత సంపూర్ణ ప్రభుత్వం మానవులకు పనికిరాదు. "నాగరికత ప్రపంచంలో దేవతలూ లేరు. మంచితనం ఉట్టిపడే "ఉన్నత అటవీకులు" కూడా గతంలోనే పోయారు. ఒకవైపున ధర్మబద్ధమైన ఆగ్రహంతో నాగరికతను విమర్శించిన రూసో, ఉన్నత అటవిక ధర్మాన్ని బోధిస్తూనే, రాజకీయ తత్వాన్ని, రాజ్య సిద్ధాంతాన్ని తార్కికంగా పెంపొందించాడు. నాగరిక ప్రపంచంలో ప్రత్యక్ష ప్రజాస్వామ్యం సాధ్యంకాదు గనుక, ఆదిమ సమాజంలోని సహజత్వానికి పోజాలం గనుక, నాగరిక ప్రపంచం నైతికంగా చెడిపోయింది గనుక, "పరిమితమైన సంపన్నులకు" ప్రజల స్వార్వభౌమత్వానికి ధారాదత్తం చేయడం తప్పదు. క్రమసమాజానికి, సుస్థిర ప్రభుత్వానికి అదొక్కటే ఆధారం. నాగరిక ప్రపంచంలో సామాజిక ఒడంబడిక సిద్ధాంతం అట్లా పనిచేస్తుంది.

ప్రజాస్వామికంగా కనిపించే సిద్ధాంతం అధికార దత్తతను సమర్థించి, అధికార కేంద్రీకరణను ఒప్పుకుంటున్నది. దీనిని ఆదరించడం వలన ప్రజాస్వామిక సూత్రం మోసపూరితమైన లాంఛనంగా, ఏమి విలువలేనిదిగా మారింది. సామాజిక ఒడంబడికలో "వ్యక్తి తన హక్కులన్నిటినీ సమాజానికి పూర్తిగా ధారాదత్తం చేసి తాను వైమస్కుడౌతున్నాడు. ప్రతివారూ పూర్తిగా సమాజానికి లొంగిపోవడం వలన, అందరి పరిస్థితి కూడా ఒకే రీతిలో వుంటుంది." అంటే, స్వేచ్ఛ కోల్పోతేగాని సమానత్వం రాదు! స్వేచ్ఛలేకుంటే బంధమే గనుక, సమాజ ఒడంబడిక కింద స్థాపించే సమానత్వం అందరికీ సమాన బంధం అన్నమాట.

రూసో రాజ్య సిద్ధాంతంలో ప్రజాస్వామ్యం చనిపోయి పుట్టగా, నియంతృత్వం ఒక్కటే ఆచరణయుక్తమైన సూత్రంగా భావించాడు.

"వ్యక్తులకు కొన్ని హక్కులు అట్టిపెడితే, వారికి ప్రజలకు మధ్య ఎవరు అధికులో నిర్ణయించేవారుండరు గనుక, తనకుతానే నిర్ణేతగా వుంటానని వ్యక్తి అంటాడు. తరువాత

అన్ని విషయాలలో అలాగే వుండాలంటాడు. ఒడంబడికకు ముందున్న పరిస్థితి కొనసాగుతుంది. వ్యక్తి సాంగత్యం పనిచేయకపోగా, నిరంకుశమౌతుంది." మానవుడు మంచివాడని, ఆడంబర రహితంగా వుంటాడనే ప్రకృతి సిద్ధాంతానికి రూసో తిలోదకాలిచ్చేశాడు. వ్యక్తి పూర్తిగా వైమనస్కుడౌతాడనటాన్ని సమర్థించే నిమిత్తం సమిష్టికి వ్యక్తిని బలి చేసే నిమిత్తం రూసో యీ పని చేశాడు. ఆదిమ మానవుడి కాలంలో అందరిపైనా అందరూ యుద్ధం చేసుకున్నారనే హాబ్జ్ అభిప్రాయాన్ని రూసో స్వీకరించాడు.

"హాబ్జ్ వలె, రూసో కూడా సమాజాన్ని పొందికగా నిర్మించాలని, పాలకుడి యిచ్ఛ లేదా సార్వభౌమత్వాధికారం విభజించరాదని, అపారంగా హద్దులు లేనిదిగా వుండాలని తలచాడు. కేవల సార్వభౌమత్వాన్ని హాబ్జ్ వ్యక్తికి ఇవ్వగా, రూసో దీనినే సమిష్టిత్వానికి అంటగట్టాడు. హాబ్జ్ తన లెవిథియన్‌లో రాజరికపు నియంతృత్వాన్ని ఆదర్శంగా చూపగా, సోషల్ కంట్రాక్ట్‌లో రూసో దీనినే ప్రజాస్వామిక నియంతృత్వంలో చూపాడు." రూసో భావాలను ఆచరించడానికి  రాబస్ వీర్ ప్రయత్నించాడు. ఫలితంగా మహోన్నత విప్లవం కాస్తా భయంకర పాలనగా మారింది. నియంతృత్వాధికారాలను స్వీకరించిన రాబస్ వీర్, వివేచనను కాదని, పరమార్థాన్ని ఆరాధించే పద్ధతి ప్రవేశపెట్టాడు.

హాబ్జ్ పేర్కొన్న రాజరికపు రాజకీయ సిద్ధాంతానికి, వాస్తవంగా రాజపాలకులు చేసిన దానికి సంబంధం లేదు. కాని రూసో సిద్ధాంతం రాజ్యానికి సంబంధించిన అతి భౌతిక తత్వమై కూర్చున్నది. ఫిక్టె(2) ద్వారా 20వ శతాబ్దంలో ప్రజాస్వామ్య వ్యతిరేక దండయాత్రలకు సంపదగా అనుకూలించింది. రాజ్యంలో మానవుడి పరిస్థితి గురించి హాబ్జ్ చెప్పింది వాస్తవానికి దగ్గరగా వున్నది. రూసో చెప్పిన ఉన్నత అటవికత్వంలోని మంచితనం, నిరాడంబరం అంత దగ్గరగా లేదు. ఇందులో ఒకటి సరైన ప్రాపంచికానుభవం లేనందున దోషపూరితంగా వున్న విజ్ఞాన ప్రతిపాదనగా మారింది. మరొకటి ఇంద్రియానుభూతితో కూడిన వూహ మాత్రమే. 14వ లూయీ కాలంలో వున్న అవినీతి, కరడుగట్టిన సంప్రదాయం, ఆడంబరత పట్ల ఏర్పడిన జుగుప్స వలన వచ్చిన సిద్ధాంతమే యిది. ఈ అలవాట్లు 18వ శతాబ్దంలోని సమాజంలో ఉన్నత స్థాయి వారికి  బాగా వుండేవి.

సామాజిక సమస్యల పట్ల రూసో ధోరణి విజ్ఞాన పంథాలో ఎన్నడూ లేదు. అతనిదంతా వ్యక్తిగత స్పందన మాత్రమే. జీవితంలో తొలి అనుభవాలవలన అతడిలో కలిగిన ఆగ్రహం, రుగ్మతతో కూడిన మానసిక స్థితినుండి చరిత్రకు సంబంధించిన అతడి నిరాశ దృక్పథం, అభివృద్ధిని తృణీకరించడం, నాగరికతను శాపంగా ఖండించడం యిత్యాదులన్నీ జనించాయి.

ప్రస్తుతం పట్ల విసుగెత్తిన రూసోకు భవిష్యత్తులో ఆశ కనిపించలేదు. చారిత్రకంగా గతాన్ని ఎంతో ఖండించి చూడడమే యిందుకు కారణం. గతంలో నైతికాభివృద్ధి లేకుంటే

అవినీతికర వర్తమానం నుండి మంచి భవిష్యత్తు రాజాలదు.
1)పరిణితి వచ్చిన తరువాత రూసో భిన్నంగా ఆలోచించినట్లు కనబడుతుంది. పౌర రాజ్యానికి భిన్నంగా సమాజానికి ముందున్న స్థితిని వూహిస్తూ అతడిలా రాశాడు. ప్రేరణ స్థానే మానవుడి ప్రవర్తనలో న్యాయనిర్ణయం చోటు చేసుకొని చాలా మార్పు తెచ్చింది. లోగడలేని నీతిని తన చర్యలలో మానవుడు చూపుతాడు. తనను మాత్రమే ప్రధానంగా అనుకుంటూ, తన శారీరకావసరాలనే తీర్చుకుంటున్న మానవుడు తన విధులను పరిగణనలోకి స్వీకరిస్తాడు. తన ప్రేరణల కంటే వివేచనకు ప్రాధాన్యత యివ్వాలని మనిషి భావిస్తాడు. ఈ స్థితిలో అతడికి ప్రకృతి యిచ్చిన కొన్ని సదవకాశాలు కోల్పోయినా, ఇతర విషయాలలో సాధిస్తాడు. దీని వలన అతడికి లభించే ఆనందాన్ని శ్లాఘిస్తాడు. ఊహ అనేది లేకుండా వున్న మృగం కంటె వివేచనాత్మకునిగా మనిషిగా చేసిన స్థితిని ఆనందిస్తాడు. "(సోషల్ కంట్రాక్ట్) కాని తన రాజకీయతత్వానికి ప్రాతిపదికగా సాధారణేచ్ఛను తలపెట్టిన రూసో తన సిద్ధాంతానికి తానే వ్యతిరేకమయ్యాడు.

భవిష్యత్తు గురించి రూసో ఊహించిన ఉద్వేగభూతం, మానవస్వేచ్ఛను వివేచనాత్మకంగా అభిలషించేవారికి ఉత్తేజాన్ని కలిగించలేదు. మానవజాతిని "ప్రజాస్వామిక నియంతృత్వం"గా అతడు ఖండించాడు. నాగరిక మానవుడు అవినీతి, వక్రమార్గాల నుంచి తప్పించుకోజాలడని, అంతకుమించి మంచితనం సాధ్యం కాదని అంటాడు. ఉన్నతమైన అటవికుడనేది రూసో తనకుతాను అర్పించుకున్న బహుమానం. అటవిక స్థితిలో ఆడంబరత లేకుండా వుంటారంటాడు. అతని సామాజిక ఒడంబడిక సిద్ధాంతం అతడి ఊహలలో జనించిన పుక్కిటి పురాణం మాత్రమే. "మానవుడు స్వేచ్ఛగా జన్మించాడు. కాని ప్రతిచోటా అతడికి బంధాలే. "రూసో ప్రారంభించిన రాజకీయ సిద్ధాంతానికి యిది ఎత్తుగడ అయినప్పటికీ వాస్తవం కాదు.

రూసో పిడివాదంనొక్కి చెబుతున్నాడు. అతడు చెప్పేదానిలో రెండోభాగాన్ని బట్టి మానవుడు స్వేచ్ఛాపరుడు కాలేడని అర్థం. రూసో సూత్రంలో ఒకదానిని మరొకటి ఖండిస్తున్నవి. అటవిక మానవుడు ఆనందదాయకంగా గడిపిన వూహాలోకంలోకి పోవాలో, స్వేచ్ఛలేని సమానత్వం కావాలో నాగరిక మానవుడు తేల్చుకోవలసిన సమయం ఆసన్నమైంది. మానవుడి బంధాలన్నీ నాగరికత వలన జనించినవే. తన బంధాలకు మానవుడే కారణం. నాగరికత అతడి సృష్టేగదా. రూసో ఎలుగెత్తి చాటేదేమంటే, మానవుడు చెడ్డను మాత్రమే సృష్టించగలడు. అయితే అతడిలో తొలుతవున్న మంచితనం ఏమైనట్లు? అటువంటి చీకాకు ప్రశ్నలకు రూసో సమాధానం చెప్పక, భాషాపాటవంతో తప్పించుకుంటాడు.(2) రూసో ప్రతిభను మెచ్చుకునేవారెవరైనా, ఉద్వేగ ఉద్యమానికి అతడే స్థాపకుడనలేదు. సృజనాత్మక ఊహతో వివేచనకు అండగా నిలిచింది ఉద్వేగ

ఉద్యమం. రూసో వివేచనా రహితుడు. రుగ్మతతో కూడిన అతడి ఊహ విధ్వంసపూరితం. సృజనాత్మకంకాదు. కాని ప్రకృతి పగ తీర్చుకుంటుంది. చరిత్రను పరిణామక్రమంగా చూడలేని రూసో సిద్ధాంతం నుండే అతడి ప్రజాస్వామిక నియంతృత్వం వస్తుంది.

రూసో మొండిగా విస్తరించక ముందే, నాగరిక సమాజానికి ఒడంబడిక ప్రాతిపదిక అని రాజకీయ విజ్ఞానంలో పేర్కొనక పోలేదు. సాధారణేచ్ఛ అనేసూత్రాన్ని యిందులో జొప్పించింది రూసో మాత్రమే. ఇందులో వివేచనావాదానికి స్వేచ్ఛకూ విరుద్ధత్వమనేది వూహ మాత్రం కాదు. రూసోకు 18వ శతాబ్దపు తత్వవేత్తలకు గల సంఘర్షణ అంతా, వివేచనకు విశ్వాసానికి, విజ్ఞానానికి మూఢ నమ్మకానికి గల సంఘర్షణే. మానవజాతి సంపూర్ణ చరిత్ర విషయంలోనే రూసోకు విజ్ఞాన సర్వస్వ కర్తలకు భేదాభిప్రాయం వున్నది. "దైవానికి వ్యతిరేకంగా నైతికన్యాయాన్ని తత్వవేత్తలు చూపుతుండగా, దైవం వున్నదనడానికి అదే నాకు ఆధారం."అతి ఉద్వేగవాదం అలా వుంచి, రూసో ఎన్నడూ కాల్విన్ సంప్రదాయం నుండి బయటపడలేదు. దీనివలననే నాగరికత గురించి చరిత్రకు సంబంధం లేని నిర్ణయానికి వచ్చాడు. మానవుడి జీవితం పాప భరితం. మానవుడి స్వభావంలో మంచితనం ఉన్నప్పటికీ యిది తప్పలేదు. మానవ సమాజంలో క్రమత్వం వస్తుందనే రూసో నమ్మకం కూడా కాల్విన్ మొండివాదం ప్రభావమే. మానవుడు పాపాత్ముడు. అతడికి వదిలేస్తే పాపాలే చేస్తాడు. కాని మానవుడు, జాతులద్వారా క్రమబద్ధమైన సమాజాన్ని దేవుడు సృష్టిస్తాడు. సాధరాణేచ్ఛ అనే సూత్రం ఆధారంగా, రాజకీయాలలో విధి ప్రయోజనవాదాన్ని రూసో మళ్ళీ ప్రవేశపెట్టాడు. పైగా మతేతరంగా ఈ భావానికి ప్రమాణాన్ని చూపెట్టే ప్రయత్నం చేసినట్టు కనిపించాడు. సాధారణేచ్ఛ అనే సాధనలో దైవేచ్ఛ పనిచేస్తుంది. రూసో పునర్వికాసానికి చెందినవాడుకాడనేది స్పష్టం. 18వ శతాబ్దంలో పునర్వికాస ఫలితం పరాకాష్టకు చేరుకొని, విజ్ఞాన సహజవాదానికి దారితీసింది. మతేతర సంస్కృతి వచ్చింది. రూసో సంస్కరణవాదానికి చెందినవాడు. తిరోగమన ధోరణికి అతడు ప్రాతినిధ్యం వహించాడు. 19వ శతాబ్దపు విప్లవానంతర ఉద్వేగవాదంలో యిది స్పష్టపడింది.

రాజ్యానికి సంబంధించిన అతిభౌతిక, జీవభావనలకు సాధారణేచ్ఛ సిద్ధాంతంలో ప్రాతిపదిక వున్నది. అందరి యిచ్ఛకూ సాధారణేచ్ఛకుగల తేడాను రూసో చూపగా, దానిని అంగీకరించిన హెగెల్ యిలా వ్యాఖ్యానించాడు. "ఈ విచక్షణనే ఎప్పుడూ దృష్టిలో వుంచుకుననట్లయితే రూసో యింకా బాగా రాజ్య సిద్ధాంతానికి తోడ్పడేవాడు." రూసో దృష్టిలో రాజ్యమంటే ఆదిమానవుడి అధిక్యతగలది మాత్రమే. విజ్ఞానసర్వస్వంలో రాజకీయ ఆర్థికత గురించి రూసో రాస్తూ, రాజ్యానికి వ్యక్తిత్వ లక్షణాలు అంటగట్టాడు. "మానవుడిని పోలిన జీవంగానూ, వ్యక్తీకరించేదిగానూ" రాజ్యాన్ని చిత్రించాడు. సోషల్ కంట్రాక్ట్

గ్రంథంలో రాజ్యం అంటే "నైతిక, సమిష్టి వ్యక్తి" అని వ్రాసాడు. రాజరికం పోయింది. రూసో రాజకీయ సిద్ధాంతంలో నియంతృత్వ "ప్రజాన్యాయస్థానాలు" చోటు చేసుకున్నవి. "ప్రజాస్వామ్యప్రవక్త" ను 14వ లూయీ దయ్యమై వెంటాడింది. అతడి ప్రజాస్వామిక నిరంకుశులు దైవేచ్ఛకు సాధనాలు. తన చరిత్ర సిద్ధాంతాన్ని కూడా రూసో వ్యక్తీకరించాడు. అభివృద్ధిని వెనక్కు నడపాలన్నాడు.

రూసో సిద్ధాంతంలో విధి ప్రయోజనవాదం అతడి వ్యక్తిగత అసూయగా కొట్టిపారవేసినప్పటికీ, జనేచ్ఛ అనేది ఒడంబడిక సిద్ధాంతం ప్రకారం నివశిస్తున్న వారి యిచ్ఛ. కోర్కెలకు భిన్నంగా అట్టిపెట్టిన కల్పనగా భావించవచ్చు. రూసో జనేచ్ఛలోని నియంతృత్వ లక్షణాలను కాంట్ బయటపెట్టాడు. "రాజ్యంలోని ప్రజలు లేదా, ఏ ప్రజలైతే ఐచ్ఛికంగా తమ బాహ్యస్వేచ్ఛను సమాజ జీవనం కోసం అర్పిస్తారో ఆ చర్యను రాజ్యం అంటాం. అటువంటి ఒడంబడిక వాస్తవరూపం దాల్చడం జరిగే పనికాదు. చట్టం చేసేవారు, ప్రజలంతా తమ అంగీకారాన్ని తెలియజేసినట్లే భావించి, పౌరులకు చట్టాన్ని రూపొందిస్తారు."

జనేచ్ఛ అందరి యిచ్ఛతో సమానం కాదు. ఈ విషయాన్ని హెగెల్ నొక్కి చెప్పాడు. సమాజంలో ప్రతివాడూ తన ఆసక్తి ముందు చూచుకుంటాడు. అందరి సంక్షేమం నిమిత్తం ఒడంబడిక వుంటుంది. ఆచరణలో, సమానత్వంగల వ్యక్తుల ఆసక్తులు పరస్పరం ఖండించుకుంటాయి. మిగిలినదల్లా, అందరి ఆసక్తులకు అనుగుణమైన ఒడంబడికే. ఈ విధిని నిర్వహించే వారందరి అంగీకారమే జనేచ్ఛ. ఇదొక అతిభౌతిక భావన. దీని వ్యక్తీకరణకు భౌతికసాధన కావాలి. ఆ సాధనే "ఎంపికైన సంపన్న వర్గం లేదా, ప్రజాస్వామిక నిరంకుశత్వం." మొదటి మాటను రూసో ప్రయోగించాడు. తరువాత జనేచ్ఛ ప్రతిబింబించేవారుగా నాయకులు రంగం మీదకు వచ్చారు. ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా విధ్వంసం గావించడంలోనే రూసో ప్రజాస్వామ్యలక్ష్యముంది.

రూసో రాజకీయ సిద్ధాంతం ప్రమాదకరం, మోసపూరితం. అతడి మతాభిప్రాయాలు స్పష్టంగాకున్నా నిక్కచ్చిగా వున్నవి. అందులోనూ స్థిరత్వం, పొందిక లోపించింది. దైవజ్ఞుల సహజ మతాన్ని కవిత్వంగా అనుకోవచ్చు. కాల్విన్ ధోరణి బాగా రూసోలో నాటుకుపోయినందున, అతడు సహనం గల దైవజ్ఞుడుగా వుండలేకపోయాడు. నైతిక, రామణీయక విలువలకు మార్మికమైన విశ్వాసం ఏదో వున్నదని భావించాడు. రూసో దైవశాస్త్రాన్ని రూపొందించాడు. ఇదే తరువాత ప్రొటెస్టంట్ మత జ్ఞానులకు

"మానవుడు స్వేచ్ఛగా పుట్టలేదు. మానవుడయ్యే విధానంలో అతడు స్వేచ్ఛాపరుడౌతున్నాడు. తనంతట తానుగా వుండగలిగిననాడే, అతడు తనను గురించి తెలుసుకోగలడు." ఫ్లింట్, హిస్టరి ఆఫ్ ది ఫిలాసఫి ఆఫ్ హిస్టరి.

ఆమోదయోగ్యమైంది. దేవునిలో విశ్వాసాన్ని వివేచనాత్మకవాదాతీతంగా వుంచాలన్నాడు. మనిషి మార్మికానుభవం వలన దైవం తెలుస్తుంది. అదే నీతి శాస్త్రానికి ప్రాతిపదిక అన్నాడు. "సత్యాన్ని నమ్మినట్లే దేవుడిని విశ్వసిస్తాను. నమ్మడం, నమ్మకపోవడం అనేవి నా మీద ఆధారపడినవి కావు." అంటే, దేవుడిని నమ్మక చేసేదేమీ లేదని అర్థం. నమ్మటం మానవనైజం మార్మిక మతజ్ఞానాన్ని చెప్పిన రూసో, వివేచనావాదాన్ని కూకటి వేళ్ళ దగ్గర కొట్టాడు.(1)

అయితే, రాజకీయ సిద్ధాంతకారుడుగా, రూసో వివేచనను వదలలేక పోయాడు. ఈ విధంగానే అతడు ఫ్రెంచి విప్లవానికి ప్రవక్తగా శ్లాఘించబడినాడు. రూసోకు మాత్రం, యీ రెండు విధానాలు ఒకే పద్ధతిలో కలిసిపోయాయి. మార్మిక విశ్వాసం, రుగ్మతతో కూడిన వూహ, హద్దులులేని పిపాస అధిగమించే తీరే యిదంతా. "హృదయాన్ని ప్రభావితం గావించడానికి గాని, తన అవగాహనకు గాని, రూసో ఎలాంటి సూత్రాలు పాటించలేదు. ఉద్వేగవాదులలో ప్రతిభాశాలి పేర్కొన్న కర్కశ విషయం యిది. "రాజకీయ లక్ష్యసాధనకు మానవ వివేచనేగాక, మానవ స్వభావం సర్దుబాటు గావాలి. మానవ స్వభావంలో వివేచన ఒక భాగం. అదే అత్యున్నత భాగం కాదు" అన్నాడు బర్క్. ఉద్వేగవాదులలో మరొకరైన కార్లైయిల్ సైతం రూసో ఉద్వేగవాదాన్ని దయగా చూడలేక పోయాడు. అందులో ఉద్వేగవాదం లేకపోవడం, కేవలం ఇంద్రియానుభూతి వాదం వుండడమే యిందుకు కారణం. 18వ శతాబ్దపు విజ్ఞాన సహజవాదాన్ని రూసో కాదన్నాడు. కనుత అతడిని విప్లవానికి గాక, తిరోగమనానికి ప్రవక్త అనాలి. అతని ప్రభావం వలననే విప్లవం కాస్తా రాబస్ పీర్ అధ్వర్యాన, విస్తుపోయేటట్లు చేసే నియంతృత్వంగా, కొద్దికాలమే నిలిచింది.

రూసో విరుద్ధత్వాల వలన అతడిని గురించి గందరగోళం ప్రబలింది. అతని సిద్ధాంతాలకు పరస్పర విరుద్ధంగా భాష్యం చెప్పారు. భిన్న పండితులు భిన్న రీతులలో రూసోకు చరిత్రలో స్థానం కల్పించారు. ఇంద్రియానుభూతివాదం, "స్పందన" పట్ల భక్తి ప్రదర్శించినప్పటికి, విప్లవానంతర తిరోగమనానికి రూసో ప్రేరణ కల్పించినా, అతడిని సోషలిజానికి ఆదిగురువుగా పొగిడారు. అతడిలో శక్తివంతమైన నాయకత్వాన్ని పేదలు చూచారు. మూగప్రజల వాణి అన్నారు. ప్రజాస్వామ్యానికి మళ్ళీ ఉద్ధారకుడు అన్నారు. 18వ శతాబ్దానికి ప్రతిబింబంగా భావించారు. నాటి తిరుగుబాటుకు, కోర్కెలకు, భావాలకు, ప్రేరణలకు అతడు అద్దంగా నిలిచాడు. ఇది "అసంబద్ధం అనకపోయినా, రాబర్ట్ ఫ్లింట్

---

1) వివేచనను కాదని హృదయాన్ని నమ్మడం ముందుకు పోవడం కాదు. వివేచన మత నమ్మకం వైపు ఉన్నంతకాలం యీ పద్ధతిని ఎవరూ ఆచరించలేదు. రూసో కాలంలో మతానికి వ్యతిరేకంగా వోల్తేర్ వివేచనను చూపాడు. అందుకే, వివేచన పోవాలి !" బెర్ట్రాండ్ రసెల్, హిస్టరీ ఆఫ్ వెస్టర్న్ ఫిలాసఫీ.

యిలా ప్రకటించాడు." పేదలకు నచ్చచెప్పి బుజ్జగించేవాడు. అశేష మూగప్రజల కోర్కెలలో సబబువున్నా, వాటిని అపఖ్యాతి పాలు చేసినవాడు, నిరంకుశత్వానికి మూల స్థంభాన్ని చూపెట్టే ప్రజాస్వామ్యం నిర్మించినవాడు. భయంకర పాలనకు ఉరికంబాలకు బీజాలు నాటినవాడు. వీటన్నిటినీ తన సాహిత్య రచనలలో చూపిన వాడు" రూసో.

✦ ✦ ✦

# మహోన్నత విప్లవం- 2

ప్రజాప్రతినిధులతో కలిసి మతగురువులు శాసనసభలో కూర్చోవాలని నిర్ణయించడంతో విప్లవానికి తొలి విజయం లభించింది. నెకర్ సలహాపై 16వ లూయీ ఓటు హక్కును విస్తరించడంతో, ప్రజాస్వామ్య ప్రతినిధులు శాసనసభలో అధిక సంఖ్యాకులయ్యారు. అంతకుముందు సంపన్నవర్గాలు, మతగురువులు కలసి శాశ్వతంగా అధికసంఖ్యలో వుండేవారు. రాజాజ్ఞతో యీ నిష్పత్తిని మార్చడంలోనే విప్లవం వున్నది. ప్రజాప్రతినిధులతో కలసి ఓటు చేయడానికి పై రెండు వర్గాలు నిరాకరించాయి. అంతటితో మిరాబూ నాయకత్వాన ప్రజాప్రతినిధులు తమ సార్వభౌమత్వ శాసనాధికారాన్ని ప్రకటించి శాశ్వతంగా సమావేశమైనట్లు ప్రకటించారు. మంచి విప్లవ పరిస్థితిని కల్పించారు. జ్ఞాన వికాస ప్రభావానికి గురైన మతగురువులు చీలి వచ్చి, ప్రజాప్రతినిధులతో చేరేసరికి ప్రతిష్ఠంభన తొలగింది. వారి ప్రతినిధులు ముగ్గురు శాసనసభకు వచ్చి యిట్లా ప్రకటించారు. "వివేచన వెలుగులో, జనం యిష్టానుసారంపై మాకుగల ప్రేమతో, మనస్సాక్షిగా, మా తోటి సహోదరులతో చేరడానికి వచ్చాం." అంతటితో చాలామంది చీలిపోయి వచ్చి చేరారు. శాసనసభలో కూర్చోడానికి, అంటే విప్లవంలో చేరడానికి అత్యధిక సంఖ్యాక మతగురువులు నిర్ణయించారు.

రాజరికానికి సంబంధించినంత వరకూ విప్లవం పూర్తి అయింది. భూమిపై దైవ ప్రతినిధులు తమ మద్దతు ఉపసంహరించినందున దైవాంశ సంభూతుడునని చెప్పుకునే హక్కు రాజు కోల్పోయాడు. గత రాజ్యానికి నైతిక ప్రమాణం లేదు. చిరకాలంగా వస్తున్న విశ్వాసం స్థానే వివేచన విజయం పొందింది. దైవానికి విశ్వాసపాత్రంగా వుంటూ, నమ్మకాలను కాపాడుతూ వచ్చినవారు, వివేచనను ఆమోదించారు. విప్లవం వచ్చింది.

16వ లూయీ యించుమించు ప్రజలందరికీ ఓటు హక్కు ప్రసాదించినప్పుడు, సంప్రదాయ రాజరికపు సానుభూతినే ప్రజలు చూపుతారనుకున్నాడు. సుప్రసిద్ధ విప్లవ చరిత్రకారుడు అలార్డ్ననుసరించి, యిదొక మకవెల్లి(1) సూత్రం. మేధావులు కాని రాష్ట్రప్రతినిధులతో శాసనసభ నింపివేస్తే వారంతా మతగురువులను

---

1) 1469-1527 ఇటలీ రాజనీతిజ్ఞుడు, రచయిత. నీతికంటె అవకాశవాదానికి అధిక ప్రాధాన్యత యిచ్చినవాడు.

అనుసరిస్తారనుకున్నారు. జ్ఞానవికాసానికి చెందిన వ్యక్తులు అల్ప సంఖ్యాకులౌతారను కున్నారు. బహుశా అట్లాగే జరిగేదేమో కాని జ్ఞాన వికాస ప్రభావితులైన మతగురువులు యీ మెకవెల్లి పథకాన్ని తల్లక్రిందులు చేశారు. వివిధ శక్తుల మధ్య సంబంధాలు మారిపోయాయి.

మతగురువులు మారిపోయేసరికి రాజు కొలువులో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ప్రవాహాన్ని ఆపడానికి తీవ్రచర్యలు గైకొనాలనుకున్నారు. లోగడవలె విడివిడిగా కూర్చునేటట్లు, రాజు కొలువులోకి మూడువిధాలైన ప్రతినిధులను పిలిచారు. ఈ లోగా, తిరుగుబాటుచేసిన వారిని శాసనసభలోకి ప్రవేశింపనివ్వలేదు. వారేంచెయ్యాలి? లొంగిపోవాలా లేదా విప్లవమార్గంలో సాగిపోవాలా? రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధుల నిర్ణయంపై యిది ఆధారపడి వున్నది. అప్పటికి యింకా వెలుగులోకి రాని, మిరాబూ ఎలుగెత్తి చాటాడు. "టెన్నిస్ కోర్టుకు పదండి" ! రాజాజ్ఞను ధిక్కరించి, శాసనసభ అక్కడ సమావేశం కావాలన్నారు. హర్షధ్వానాలతో దీనిని ఆమోదించారు. తత్వవేత్త బైలీ, మతగురువు సైస్‌ను అనుసరించి ప్రజాప్రతినిధులు అక్కడచేరి, "రాజ్యాంగాన్ని స్థాపించి, గట్టిపరచే వరకూ వెళ్ళిపోరాద"ని ప్రమాణం చేశారు. ఆచరణలో రాజరికం పోయింది. ఎవరి విధేయతపై ఆధారపడి యిన్నాళ్ళుగా కొనసాగిందో, వారే ఏకగ్రీవంగా దీనిని కూలద్రోశారు. మతగురువుల మార్పిడి ఫలితమే యిదంతా, అంతకు ముందురోజు వరకు తనకు అతి విధేయులుగా వున్న క్రైస్తవుల అండను కోల్పోయిన రాజుకు దైవాంశ సంభూతహక్కు కూడా పోయింది.

రెండురోజుల అనంతరం ఆర్లంజ్ ప్రభువు అధ్వర్యాన 47 మంది ఉన్నత వంశీకులు వచ్చి ప్రజాప్రతినిధులతో చేరారు. శాసనసభ సమావేశం విడిపోవాలని రాజు శాసించినా వారు ధిక్కరించారు. తిరుగుబాటు ప్రభావం సైన్యంపైబడింది. రాజుకు గత్యంతరం లేదు. మూడు విధాలైన ప్రతినిధులు జాతీయ శాసనసభలో కలసి సమావేశం కావాలని ఆజ్ఞ జారీచేశారు. ఉన్నత వంశీకులు మాత్రమే శిరసావహించారు.

ఈలోగా పారిస్‌లో సంఘటనలు అతివేగంగా సాగిపోయి, బాస్టల్( జైలును వశం చేసుకోవడంతో పరాకాష్ఠకు చేరింది. బాజాక్ రూసోకు చెందిన మిడి మిడి ఉద్వేగవాద మతప్రచారకులు రెచ్చగొట్టిన ఫలితంగా ఉద్రేకవాతావరణం ప్రబలగా, యీ చర్య సూచనప్రాయంగా జరిగింది. వర్సీలో విప్లవం పూర్తికాగా, భవిష్యత్తు భయానకంగా కనపడింది. ప్యూడల్ వర్గాలకు సదవకాశాలు రద్దుగావించాలని శాసనసభలోని ఉన్నతవంశీకులు పట్టుపట్టారు. సంపన్నులు ఒక వర్గంగా విప్లవంలో చేరలేదు. లొంగిపోయారు.

మొదటి రెండేళ్ళు జెరాండిస్టుల అధ్వర్యాన విప్లవం సాగింది. చరిత్రకారులలో

ఒక వర్గం వీరిని సంస్కరణవాదులుగానూ, తిరోగమనవాదులుగానూ చిత్రించింది. కాని, రూసోను మూర్ఖంగా అనుసరించినవారు, అన్ని అధికారాలు కోల్పోయిన రాజును చంపారు. తత్వవేత్తల ప్రభావం వలన రాజు సింహాసనం కోల్పోయిన అనంతరం, క్రమపద్ధతిలో విప్లవం సాగాలని వారు అభిలషించారు.

వారు వివేచనాపరులు, అందువలన విప్లవంలో ఎవరికీ తీసిపోలేదు కూడా. వారు అసలు జాకోబినులు, వారే సమితిని స్థాపించినవారు. రిపబ్లిక్‌ను స్థాపించడంలో ఎట్లాంటి షరతులకు లొంగనివారు, వారు మతేతరంగా వున్నారు. ఇంద్రియానుభూతివాదులు కాదు. నీతికి పవిత్రతను అంటగట్టినవారు కాదు. అందులో కాంబుర్సె ఒకడు. అతడికి అనుచరులు పెక్కురు. "కొన్ని విషయాలలో వీరు రాబస్ వీర్ కంటె ముందుకుపోయారు. అతడి వలె వీరు కూడా రూసోకు గట్టి అనుచరులు. కాని జాజాక్ వలెగాని, అతడి ప్రవక్త వలెగాని, పరమార్ధశక్తికి తలవంచలేదు వీరు. వారిలో అధిక సంఖ్యాకులు నాస్తికులు. జెరాండినులు ప్రజాస్వామికులు కనుక, రూసో పేర్కొన్న "ఎంపికైన సంపన్నులు" విప్లవానికి మూలకారకులైన నాయకులలో ఘర్షణ పడటం తప్పలేదు. వీరు జ్ఞానవికాస భావాలకు, ఆదర్శాలకు నిలబడినవారు. అంటే చిరకాలంగా మానవుడు సాగించే స్వేచ్ఛాపోరాటానికి వారసులన్నమాట.

విప్లవంలో రెండు మార్గాలు అనుసరించినవారి బలాబలాలు తేల్చుకోడానికి జాతీయ మహాసభ ఎన్నిక అవకాశాన్నిచ్చింది. వివేచనవాదులు విప్లవంలో తక్కువేమీ కాదు. మానవవాదాన్ని స్వేచ్ఛను వారు కోరారు. సమానత్వాన్ని బోధించిన పిపాసువులు అది మిధ్యాధర్మమని గమనించలేదు. అది కేవలం ఎండమావి. వీరిపక్షాన ప్రజాస్వామిక ఓటర్లకు విజ్ఞప్తి చేయడాన్నిబట్టి రెండుశక్తుల మధ్య తేడాను గమనించవచ్చు. "తాము ఉన్నత జీవులకు చెందినవారమని ఆలోచించేవారిని ఎన్నుకోరాదు." ఆలోచనను వేదనకు లొంగి వుండేటట్టు చేయాలి. వివేచన తగ్గుముఖం చూపగా, ఉద్రేకాలు విజృంభించినవి. రూసో భావాలకు వ్యక్తీకరణ చూపిన రాబస్ వీర్ ధోరణి విప్లవంలో అధిపత్యం వహించింది.

అయితే జ్ఞాన వికాసం ప్రభావం ప్రగాఢంగా వున్నందున అంత తేలికగా అది పోలేదు. ఉద్రేకవాదం వివేచనను ఆరాధించే రీతిలో బయటపడింది. దేశమంతటా మత వ్యతిరేక ప్రచారం వ్యాపించింది. తుదకు మహాసభ అధ్యక్షుడు యిలా ప్రకటించాడు. "వివేచన మినహా మరిదేనినీ ఆరాధించడాన్ని దైవం అభిలషించడు గనుక, యికనుంచి వివేచనే జాతీయ మతంగా ఉంటుంది." 18వ శతాబ్దపు నమ్మకాలపై విజయం సాధించిన వివేచనకు ఉత్సవం జరపాలని "సర్వశక్తివంతమైన పారిస్ కమ్యూన్ తీర్మానం ద్వారా షామట్ హక్కును సాధించాడు. వివేచనాలయంగా నాటర్ డాంను మార్చేయాలన్నారు. వివేచనపట్ల కనబరచిన ఆవేశం కాస్తా అత్యున్నత స్థాయినుండి అపహాస్యానికి దిగజారింది.

దీనిపట్ల డాంటన్(1) కన్నెర్ర జేశాడు. అతడి అభ్యంతరం వ్యతిరేకమార్గంలో సున్నితంగా దెబ్బకొట్టింది. విచక్షణా రహితంగా చెడుకవిత్వాన్ని చెప్పేవారినుద్దేశించి " నేను గద్యంలో వివేచన తప్ప మరొకటి వినదలచలేద"న్నాడు. రాబస్ పీర్ ధోరణి వేరు. వాసయ్ మతగురువు పవిత్ర భావనకు పీఠం కదిలే రీతిలో ఫ్రాన్స్ అంతటా వ్యాపిస్తున్న ఆబర్(2) ప్రతినిధుల ధోరణిని అతడు అంతమొందించదలచాడు. వివేచనావాదాన్ని వ్యతిరేకించాలని, అది కేవలం యిష్టమొచ్చినట్లు ప్రవర్తించడానికి ఆయుధంగా లభించిందని డాంటన్ తన విశ్వాసపాత్రులైన కోలొట్, కోథాన్, పాయన్ ప్రభృతులను పురికొల్పారు. వీరు చాటి చెప్పేదానిలో దైవం పట్ల నమ్మకం స్పష్టపడింది. అయితే విప్లవకారులను వధించే కొత్త మతానికి అధిపతిగా వేషం ధరించే సమయం అప్పటికింకా ప్రవక్త జాజాక్ రాలేదు.

1792 చివరలో జాతీయ మహాసభ సమావేశమైనప్పుడు, జెరాండిస్ట్ పెషన్‌ను ఓడించి పారిస్ నియోజక వర్గం నుంచి ఎన్నికైన రాబస్ పీర్ యింకా నాయకత్వం స్వీకరించలేదు. అప్పటికే ఆ ప్రాంతం అంతటా అగ్ని పర్వతం నిప్పుకణాలను వెదజల్లుతున్నది. అయినా కొద్దిమందే అతడిని అనుసరించారు. 1789 నుంచి1791 వరకు, విప్లవాన్ని నడిపిన మేధావులు, గొప్పవ్యక్తులు శాసనసభలో అధిపత్యం వహించడం వలన యితడి మాట అంతగా పట్టించుకోలేదు. ఎన్నిక విజయం వలన అవమానకరమైన అనుభవాలను విస్మరించాడు. కాని రంగం మీదకు మరొక శత్రువు ప్రవేశించాడు. రాబస్ పీర్ కంటె అధిక ఓట్లతో పారిస్‌లోనే డాంటనే ఎన్నికయ్యాడు. మహాసభలో చీలిక స్పష్టంగా బయటపడింది. సాంస్కృతిక సంప్రదాయం, మేధస్సుకు చెందిన విశ్వాసాలు, రాజకీయ ధోరణిననుసరించి ముఠాలు, ఏర్పడినవి.

'విప్లవం వచ్చింది' కొత్తరాజ్యం ఎట్లా వుంటుంది? మానవహక్కులతో ప్రజాస్వామిక రిపబ్లిక్ వుండాలని జెరాండిస్టులు వాదించారు. చీలిక బయటపడింది. మనస్సులో జెరాండిస్టులతో అంగీకరించాడు డాంటన్. రాబస్ పీర్ అతివాది. ఆస్తికి సంబంధించి, అతడు వ్యతిరేకపక్షం వారికి లొంగలేదు. సామాజిక ఒడంబడికలో మూర్ఖమైన విశ్వాసం గల వాడతను. అందువలన అతడు ప్రజాస్వామ్యవాది కాదు. అందరినీ స్వేచ్ఛగా వుండేటట్లు బలవంతపెట్టే జనేచ్ఛ అమలు జరగడానికి సాధనం వుండాలన్నాడు. పారిస్ మద్దతుపై ఆధారపడినాడు. ఉద్వేగ ఉద్రేకాలతో నాడు పారిస్ ఉడికిపోతున్నది. కాని పారిస్ కమ్యూన్‌లో అబర్ అనుచరుల అధిపత్యం వున్నది. రూసో సిద్ధాంతాన్ని అక్షరాల పాటించాలని వీరిమతం. అంటే వివేచనకు గుడ్డి విశ్వాస పాత్రులన్నమాట. వారు ఉగ్రవాదులేగాదు. కమ్యూనిస్టులు కూడా. రాబస్ పీర్ అసహ్యించుకున్నదంతా

1) ఫ్రెంచి విప్లవనాయకుడు 1759-94

2) హెర్బర్ట్ అబర్ 1755-94 విప్లవ నాయకుడు, పత్రికా రచయిత.

వీరు కావాలన్నారు. రాబస్ పీర్, డాంటన్‌ల మధ్య ఎవరిని అనుసరించాలి అనే సమస్య వస్తే వీరు డాంటన్‌తో వుంటారు.

విజయం సాధించిన విప్లవానికి నాయకత్వం వహించాలని రెండువర్గాలు పోటీ పడగా ప్రతినిధులంతా మౌనంగా, ఏ నిర్ణయం లేకుండా, అస్పష్టంగా వున్నారు.

రాజును విచారణ చేసే సందర్భంలో తీవ్రమైన కలహం సంభవించింది. రాజును ఉరి తీయాలని ఆందోళన చేసిన రక్తపిపాసువుల వలన పారిస్ ప్రజలలో వున్న హీనగుణాలన్నీ బయటపడినవి. ఈ ఉద్రిక్త పరిస్థితిని రాజకీయంగా వాడుకోదలచిన రాబస్ పీర్, అతని అనురులు జెరాండిస్టులను రాజరికాన్ని కోరుతున్నవారిగా నిందించారు. రాబస్ పీర్ ఇంకా పదిమందికి తెలియని న్యాయవాదిగా వుంటూండగానే, జెరాండిస్టులు రాజరికాన్ని కూలద్రోసి, ఉన్నత వంశీకులను లొంగిపోయేట్ల చేశారు. వారిలో గల మానవసంస్కృతి, సహనం పట్ల అభిమానం వలన నిస్సహాయుడైన ఒకవ్యక్తి ప్రాణం తీయడంలో అర్థం లేదని భావించారు. భయం వలన అతడు మూర్ఖంగా ప్రవర్తించి వుండవచ్చుననుకున్నారు. ఉద్వేగం మేధస్సు ఘర్షణ పడినవి. చాందసత్వం సహనంతో తలపడింది. ప్రజాస్వామ్యం కావాలని చిత్తశుద్ధితో కోరడంతో మూర్ఖస్వామ్యం పోరాడింది. "ఎంపికైన సంపన్నులు" కోరే పూర్తి అధికారానికి, క్రమబద్ధమైన ప్రజాస్వామ్యానికి పోటీ వచ్చింది. పారిస్ ప్రజల ఉన్మత్తత వలన కేంద్రంలో ప్రజాప్రతినిధులు భయ కంపితులయ్యేట్లు చేశారు. రాజుకు సానుభూతి చూపినట్లు అనుమానిస్తేచాలు చంపేశారు. మదాం రోలా తన దినచర్యలో యిట్లా వ్రాసుకున్నది. "ప్రజా ప్రతినిధులందరూ సాయుధులై తిరుగుతున్నారు. పారిస్‌లో స్వేచ్ఛ ఎంత ఆనందదాయకంగా వున్నది" అటువంటి భావనలు వ్యక్తపరచినందుకు ఆమె అచిరకాలంలోనే చాలా అనుభవించవలసి వచ్చింది. ఆనందదాయకమైన స్వేచ్ఛకు చెందిన రక్తపీఠం వద్ద తనను అర్పించుకోవలసి వచ్చింది.

ఒకప్రక్కన ప్రజాప్రతినిధులు బెదిరింపులకు గురికాగా, ఒకప్పుడు రాజుగా వుంటూ ప్రస్తుతం సామాన్యుడైన వ్యక్తిపట్ల దయ చూపమని సమావేశానికి నచ్చచెప్పటంలో జెరాండిస్టులు విఫలమయ్యారు. ప్రజా నిర్ణయానికి రాజు భవిష్యత్తును వదలేయాలని వారు ప్రతిపాదించారు. అది మానవ సహజమైన కోరిక. ప్రజాస్వామిక విధానం కూడా రాబస్ పీర్ కలవరం చెందాడు. రక్తపిపాసువులైన పారిస్ ప్రజలు దేశాన్నంతటినీ భయపెట్ట జాలక పోయాడు. రాబస్ పీర్ అనుచరులలో ఒకడు రవలర్ తన అభిప్రాయం చెబుతూ ఆయా పక్షాల నైతిక స్థోమతను అంచనావేశాడు. "ఆ సమయంలో ఖండన కంటె, తమ చర్యల ఫలితాల నుండి విమోచన పొందడానికి చాలా ధైర్యం అవసరమైంది." ప్రతి సభ్యుడు ఓటు వేయడానికి మంటపం ఎక్కవలసి వచ్చింది. అతడి పేరును పిలిచేవారు. దోషుల పేర్లను సిద్ధం చేసేవారు గాలరీలో ఆశీనులయ్యారు. విప్లవపితామహులు, చాంద

సత్వపు ఆగ్రహాన్ని ఎదుర్కొనడానికి సిద్ధమైనందున వారి గతి నిర్ధారితమైంది. ఆ క్షణంలో రాబస్ పీర్, దయనీయస్థితి గమనించి నిజం చెప్పేశాడు. అతడి గురువు అతనిలో పలికాడు. జరుగనున్న విషయాలు తెలియడానికి అనువుగా తెరలేచింది. కాబోయే నియంత యిట్లా ప్రకటించాడు. "లోకంలో ధర్మం ఎప్పుడు అల్పసంఖ్యాకంగానే నిలిచింది."

జెరాండిస్టులలో అగ్రశ్రేణిలో వున్న 22 మందినీ ఉరి తీయడంతో భయానక పాలన ప్రారంభమైంది. అందులో నలుగురు 30 సంవత్సరాలలోపు వారు, ఇంకా నలభై ఏళ్ళు దాటనివారు 8 మంది ప్రతిభావంతులు. అందరూ చనిపోయారు. నీచమైన ద్వేషానికి గురైనారు. స్వేచ్ఛలో విశ్వాసంగాని, మానవుడిలో సౌభ్రాతృత్వంగాని ఒక్కక్షణమైనా వారిలో సడలలేదు. తరువాత బలిగానున్న హెబర్ట్, నాగరిక మానవాళికి వ్యతిరేకంగా చేసిన నేరానికి జనేచ్ఛను ప్రమాణంగా స్తుతించాడు. "ప్రజలు యిదివరకే శిక్షించిన దీనజన శరీరాలను కుంచించడానికి యింత ఆర్భాటం అవసరమా?" అన్నాడు. వ్యక్తి ఇచ్ఛలు పరస్పరం మహాసభలో రద్దు అయినవి. వ్యక్తిని త్రోసిపుచ్చిన, జనేచ్ఛ పారిస్ కమ్యూన్‌లో వ్యక్తమైంది. దీనిస్థానే రాబస్ పీర్ అతి త్వరలోనే జాకొబిన్ క్లబ్ ఏర్పరచాడు.

ఆ విషాద దినం నాడు మదాం రోలా తన దినచర్యలో యిట్లా వ్రాసింది. "న్యాయపాలనకు కొందరు బలిగాక తప్పదేమో" "ప్రజల మనస్సులను పెడదారి పట్టిస్తున్నందుకు" ఆమెను కొద్దికాలానికే నిర్బంధించారు. మూడుమాసాల జైలు అనంతరం, ఆమెను ఉరి తీయబోతుండగా, తనకంటె ముందు ఉరికంబమెక్కిన వారిని శ్లాఘించింది. కాని ఆమెను మాట్లాడనివ్వలేదు.

"నేరాన్ని స్తుతిస్తున్నదని" అన్నారు. 18వ శతాబ్దంలో ఫ్రాన్స్‌లోనేగాదు నాగరిక ప్రపంచంలోనే, వికాసవంతులనదగిన వారిని నేరస్థులుగా చూచారు. తన ఆదర్శాలు ఆశయాల నుంచి విప్లవం ఎంతదూరం పోయింది.

ఉగ్రవాదుల వైపుకు విప్లవం మళ్ళిందిక అయినా, తన క్రూరత్వాలను నీతిపేరిట పవిత్రత సమర్ధించుకున్నది విప్లవం. సవాయ్ మత గురువు ధోరణి విప్లవాన్ని ఆవరించింది. నాస్తికులనే పేరిట షామెట్‌ను, హరాల్ డసెకల్‌ను ఉరికంబం ఎక్కించారు. సమావేశం ఎదుట తన ఆగ్రహాన్ని సెయింట్ జస్ట్ యిట్లా వెల్లడించాడు. "ఆత్మ శాశ్వతత్వాన్ని వీరు నిరాకరిస్తారు. చనిపోతున్న సోక్రటీస్‌కి ఇది సంతృప్తి కలిగిస్తుంది." "చెడు నీతి" పరుల పేరిట అబర్‌ను అతడి అనుచరులను చంపేశారు. ఆస్తి అన్ని దోషాలకు మూలం అని వీరంతా రూసో నుండి నేర్చుకున్నారు. దానిని నాశనం చేయాలన్నారు. కాని రూసోకు అసలు దూత రాబస్ పీర్. తన గురువు తత్వాన్ని అర్థం చేసుకొని, విప్లవం ఏమైనాసరే అది అమలు పరచాడు. అతడికి అల్ప సంఖ్యాకుల

ధర్మంపై ఎంత విశ్వాసం ఉన్నదో , ఆస్తిపై అంత నమ్మకం ఉన్నది. దైవంపై విశ్వాసం వుంచడమే గాక తన ద్వారా దైవం పనిచేస్తున్నదని నమ్మాడు. తనను అధికారంలోకి తెచ్చిన వారు, సామాజిక ఒడంబడిక ననుసరించి ప్రమాణం చేసినాసరే, అల్పసంఖ్యాకుల ధర్మం, కమ్యూనిజం వలన నాస్తికత్వంలోనూ కలుషితం గావడానికి అతడు ఇష్టపడలేదు.

1793లో ఆకురాలే కాలానికి , సరిహద్దులో పరిస్థితి మారింది. అందరికీ దయా భిక్ష కావాలని డాంటన్ ఉద్యమం ఆరంభించాడు. ఉగ్రవాద చర్యలు విప్లవాన్ని నాశనం చేస్తున్నట్టు అతడు గ్రహించాడు. తాను స్థాపించిన విప్లవ న్యాయస్థానం కేవలం పగ సాధించేదిగా మారిపోయింది. తాత్కాలికం అనుకున్నది శాశ్వతసంస్థ అవుతున్నది. ఈ సంఘాధికారం సడలించకుండానే, అనవసర ఉగ్రవాద చర్యను తగ్గించాలనుకున్నాడు. రాబస్ పీర్ అంగీకరించినట్టే కనిపించాడు. కాని ఇరువురి ధోరణులు, స్వభావాలకు సంఘర్షణ వచ్చింది. డాంటన్ మోమాటం లేనివాడు. జీవితాన్ని అనుభవించాలనేవాడు. హార్దంగా నవ్వగలడు. రాబస్ పీర్ శుద్ధ శోత్రీయుడు, సన్యాసి. హాస్యం ఎరుగడు. పల్లెటూరి నుంచి వచ్చిన న్యాయవాది. అతడికీ ఆనందానికి చాలా దూరం. ఎప్పుడు ధర్మం గురించి మాట్లాడే రాబస్ పీర్‌ను డాంటన్ ఎగతాళి చేస్తూండేవాడు. తనశక్తి, జీవితంపై ప్రేమ వలన  రాబస్ పీర్ ఆగ్రహం చెందాడు. డాంటన్‌కు వ్యక్తిగతంగా ఆశలులేవు. రాబస్ పీర్ నెమ్మదిగా, పట్టుదలతో నియంతృత్వానికి సిద్ధపడుతున్నాడు. డాంటన్ విలక్షణ ప్రజాస్వామికవాది. కీర్తికోసం తాపత్రయపడనివాడు.

సమయం కోసం డాంటన్ ఎదురు చూస్తున్నాడు. అతడు రూసోను ఆరాధించలేదు. వివేచన, విప్లవాన్ని మేళవించిన నిజమైన విప్లవవాది డాంటన్. జెరాండిస్టుల పతనానంతరం అతడే సహజంగా విప్లవనాయకుడు. రాజస్ పీర్ తన సింహాసనాన్ని కాపాడుకోవాలంటే, రక్తపిపాసువుగా మారిన విప్లవానికి పీఠాధిపతి కావాలంటే, డాంటన్ అడ్డులేకుండా పోవాలి. నియంతలను వెన్నాడే భయాందోళనలను సెయింట్ జస్ట్ యిట్లా వ్యక్తపరచాడు. "అతడిని(డాంటన్‌ను) ఉరితీయకపోతే, మనల్ని మనమే ఉరితీసుకోవలసి వుంటుంది." సకాలంలోనే డాంటన్‌కు హెచ్చరిక జరిగింది. సమావేశం ఎదుట అతడు వచ్చి తన వాగ్ధోరణితో, లోగడ అనేక పర్యాయాలు చేసినట్టే, అందరినీ ఆకట్టుకోగలిగేవాడే. కాని అతడు అలసిపోయాడు.

తనపై కుట్ర విన్నప్పుడు యిట్లా అన్నాడు. "ఇతరులను ఉరి తీయడం కంటే నేనే ఉరికంబానికి ఎక్కుతాను. మానవజాతి అంటే నాకు విసుగు వచ్చేసింది." ఔన్నత్యానికి, మానవతకు అది ప్రతిబింబం. అతడి సాహసం, దీక్ష, రాజనీతిజ్ఞతను పరిగణనలోకి తీసుకోకపోయినా సరే, ఈ చివరి మాటల వలన డాంటన్ విప్లవంలో అత్యున్నత వ్యక్తిగా గుర్తింపు పొందాడు. ఆ విధంగానే పోయాడు. రక్తపిపాస మతంగానూ, కపటత్వాన్ని

బోధించేదిగానూ మారిన విప్లవానికి మంచివారు, మహోన్నతులు యిక అవసరం లేదు. అల్పులు, నీచులు చాలు, తమ అల్పత్వాన్ని కప్పిపుచ్చుకోడానికి అలౌకిక శక్తులను వూహించి ఆరాధించడానికి, తమ నైచ్యానికి నగిషీలు పెట్టడానికి రూపంలేని మంచితనాన్ని అడ్డం పెట్టుకునే ప్రయత్నం చేశాడు.

డాంటన్‌కు వ్యతిరేకంగా రాబస్ పీర్ వ్రాసిన నోట్స్‌ను ఆధారం చేసుకొని సెయింట్ జస్ట్(1) మహాసభకు ఒక నివేదికను సమర్పించాడు. అందులో డాంటన్ బలిగోరాడు. ఆ నోట్స్ అంతా నీచమైన అసహ్యామైన వదంతుల పుట్ట. దానిని ఆధారం చేసుకొని చిలవలు పలవులు పుట్టించారు. వ్యక్తిగత సంభాషణలలో డాంటన్ అశ్రద్ధగా చేసిన సంభాషణలు, అందరికీ తెలిసిన అతని ప్రేమ వ్యవహారాలు, అతడి భోజనం, మత్తు పానీయాలు సేవించడం, అతడి నవ్వు, అన్నింటికీ విపరీతార్థాలు సృష్టించారు. జెరాండ్ మార్టీన్ మధ్య సంధికుదిర్చే ప్రయత్నానికి దురుద్దేశాలు అంటగట్టారు. రక్తపాతం లేకుండా చేయడానికి డాంటన్ చేసిన ప్రయత్నం అలా విపరీతార్థాలకు గురైంది. ధర్మం అనే మాటకే డాంటన్ నవ్వాడని రాబస్ పీర్ ఫిర్యాదు చేశాడు. సాధారణమైన, ఆరోగ్యకర వైవాహిక జీవితం గడిపానని అతడు చెప్పేదానిని బట్టి, అతడికి నీతి అంటే ఏమిటో ఒక భావన లేదని, స్వేచ్ఛను గురించి మాట్లాడే అర్హత లేదని రాబస్ పీర్ అన్నాడు. రాబస్ పీర్ ధోరణి అంతా పిచ్చి ద్వేషంగా మారింది.

డాంటన్‌ను నాశనం చేయమంటూనే, అతడి గొప్పదనం, మంచితనం, చిత్తశుద్ధితో విప్లవాన్ని రాబస్ పీర్ చాటాడు. ఖైదీలపై దయతలిస్తే రిపబ్లిక్‌పై వ్యతిరేకం వున్నట్లే. ధర్మం అంటే అతడికి ఆసక్తి లేదు. ఉగ్రచర్య అంటే వ్యతిరేకం గనుక అతడు నేరస్తుడు. "ధర్మానికి ఎంత పెద్ద అర్థం చెప్పాడు. ధర్మం అంటే తన దృష్టి ఏమిటో కూడా చెప్పాడు రాబస్ పీర్. "శాంతి సమయంలో ప్రజా ప్రభుత్వ బలమంతా ధర్మంలోనే వుంటుంది. విప్లవకాలంలో ధర్మం, ఉగ్ర చర్యలలో వుంటుంది."

డాంటన్ నిరోధిస్తే, అతడిని రాబస్ పీర్ చంపగలిగేవాడు కాదు. డాంటన్ యింకా శక్తివంతుడు. ఆకర్షణీయుడు కూడా. వివేచనకు ఉద్వేగానికి జరిగే పోరాటంలో క్రమబద్ధమైన అభివృద్ధి ప్రజాస్వామిక స్వేచ్ఛను కోరేవారి మధ్య క్రమశిక్షణ లేని ఉద్రేకంలో కొట్టుకపోయే ఉద్వేగ విప్లవవాదులు, కపట ఛాందసుల ఆశల వలన తప్పుదారిని బట్టిన దుర్వినియోగమైన వారిలో దోషపూరిత మార్గాన్ని ఎన్నుకొని, డాంటన్ తప్పు చేసానని గ్రహించాడు. ఎత్తుగడలో తొలుత చేసిన తప్పిదమే తప్ప, నిర్ణయంలో దోషం కాదది. ఉన్నతమైన బలీయమైన ఉద్రేకాలున్నప్పటికీ, అవి తన నిర్ణయాన్ని,

1) 1767 జననం, ఫ్రెంచి విప్లవంలో భయానక పాలనను సమర్థించాడు 1794 జూలై 27న అరెస్టు అయ్యాడు.

మేధస్సును మించిపోయేటంతగా డాంటన్ ఏనాడూ అనుమతించలేదు. అయినా తొలుత వేసిన తప్పటడుగు వలన అతనికి యిష్టంలేని దారిలో డాంటన్ పయనించవలసి వచ్చింది. విప్లవకోర్టును స్థాపించడానికి డాంటన్ బాధ్యుడు. ఉగ్రవాద చర్యలకు అది దయ దాక్షిణ్యంలేని సాధన అయింది. సంవత్సరం తిరగక ముందే అతడు, ఉన్మత్త చర్యలను ఆపదలచినందున, తానే బలి అయ్యాడు. అప్పటికే చాలా ఆలస్యమైంది. ఆపజాలని దోషపూరిత వ్యసనాలు ప్రబలాయి. కనుక తనను కాపాడుకోవాలనిగాని, ఆ విధంగా విప్లవాన్ని రక్షించాలని గాని డాంటన్ భావించలేదు. విధి కబంధహస్తం అతనిపైబడింది. చావును తనకొక విమోచనగా అతడు ఆహ్వానించాడు.

సాయంత్రానికి చావు కబురు డాంటన్‌కు చేరింది. మాట్లాడకుండా, పొయ్యివద్ద ఆలోచిస్తూ తెల్లవార్లూ కూర్చున్నాడు. అప్పటికే మృత్యుహస్తం అతి క్రూరంగా అతడిని బంధించింది. బలిదీయడానికి ఒకరోజు ముందు అతడిట్లా అన్నట్లు విన్నవారు చెప్పారు. “గత సంవత్సరం యిదే సమయంలో విప్లవకోర్టును స్థాపించాను. దేవుడు, మానవులు నన్ను క్షమించాలని కోరుకుంటున్నాను.” అదే కోర్టు అతడిని వినడానికి నిరాకరించడం యిందులో విడ్డూర విషయం. చివరిక్షణంలో, తన జడత్వాన్ని వదలి, చావు తనను శాశ్వతంగా మౌనం వహించేటట్లు చేయకముందే, వాస్తవాన్ని చెప్పదలచాడు. ఆ మానవ చైతన్యమూర్తి, “ధర్మానికి న్యాయానికి” ప్రతిష్ఠాపకుడనని చాటిన వ్యక్తి కలవరపడ్డాడు. మహాసభను డాంటన్ ఉద్రూతలూగించవచ్చు. మరొకసారి పారిస్ ప్రజలు లేచి, కొత్త నియంతను తొలగించడానికి ఎదురు తిరిగేటట్లు చేయవచ్చుననుకున్నాడు. “ధర్మం” కోసం, డాంటన్ నోరు నొక్కేయవలసిందిగా న్యాయస్థాన అధ్యక్షుడికి ఉత్తరువులు వెళ్ళాయి. సంక్షిప్తంగా తుది ఘడియలలో చేయవలసిన కర్మకాండను ముగించమన్నారు. కాని, ట్రిబ్యునల్ ముందుకు దాని స్థాపకుడిని తెచ్చేసరికి, న్యాయస్థానం చలించింది. విప్లవానికి వ్యతిరేకంగా కుట్ర జరిగిందనుకున్నారు. ఆ విభ్రాంతి నుంచి తేరుకుని, ఆజ్ఞలను పాటించేలోగా, డాంటన్ చెప్పదలచింది చెప్పాడు. “డాంటన్ సంపన్న వర్గంవాడు ! ఫ్రాన్స్ ఈ కథ నమ్మదు. నేను అమ్ముడుబోయాను.! నా వంటి వ్యక్తిని ఎంత ధనమైన కొనజాలదు. నా పేరు ప్రతి విప్లవసంస్థతో ముడిపడి వున్నది. విప్లవసైన్యం, విప్లవ సంఘాలు, ప్రజారక్షణసంఘం, విప్లవన్యాయస్థానం అన్నిటితో సంబంధం వున్నది.” అప్పుడు విషాదాంత సత్యాన్ని చాటాడు. “ఇంతెందుకు, నా చావు నేనే తెచ్చుకున్నాను.?”

అదంతా ప్రాయశ్చిత్తం కాదు. భవిష్యత్తులో విప్లవకారులకు అదొక హెచ్చరిక. చరిత్రను మానవుడు సృష్టిస్తాడు. కాని అప్పటికి లభించే పరికరాల వలన అనంతమైన అతడి సృజనశక్తికి పరిమితులు ఏర్పడతవి. విప్లవం అవసరం కొద్ది ఏర్పడుతుంది. కొన్నిసార్లు అది తప్పనిసరి కావచ్చు. కాని ముందే వేసుకున్న పథకంలోకి యిది యిమడదు.

ఊహలో కళాకారుడు సృష్టిస్తాడు.

విప్లవకారుడు ఆమేరకు కళాకారుడు కాదు. ఒక వ్యక్తి లేదా కొందరు వ్యక్తుల యిష్టాన్ని చరిత్రపై రుద్ధటానికి ప్రయత్నిస్తే దారుణ ఫలితాలు తప్పవు. చరిత్రలో మహోన్నత విప్లవకారుడైన డాంటన్ అనుభవరీత్యా నేర్పిన పాఠం ఇదే. మానవ స్వేచ్ఛకై భవిష్యత్తులో పోరాడేవారికి డాంటన్ ఇచ్చిన సందేశం కూడా ఇదే. ఇది నేర్వడానికి ఎంతో త్యాగం చేయవలసి వచ్చింది.

నోటికి గుడ్డ కుక్కబోతున్నప్పుడు, ఆ కిశోరం యిట్లా ఘర్జించింది. "మమ్మల్ని ద్రోహులనుకుంటున్నారా? హాలంతా హార్ధంగా నవ్వగా ప్రతిధ్వనించింది. నవ్వాడని రాయండి." ఉన్నత వ్యక్తి నాటకంలో మహోన్నత చరమాంకమది. తమ జీవితాలతో సహా దీనికి అంటి పెట్టుకోని స్వేచ్ఛాపరులు మాత్రమే మానవ స్వేచ్ఛకై మహోన్నతంగా పోరాడగలరు.

ఫ్రెంచి విప్లవంలో మహోన్నత ఉద్వేగవాదిగా డాంటన్‌ను చిత్రించాడు బుక్‌నర్. (డాంటన్స్ డెత్ గ్రంథంలో, "నన్ను పుట్టించిన నేలను ఖండిస్తున్నాను. మీతో మాట్లాడుతున్న మట్టి శరీరాన్ని ఖండిస్తున్నాను. దీనిని శిక్షించి, చంపవచ్చు. కాని నాలో ఒకభాగం శతాబ్దాల తరబడి సజీవంగా వుంటూ, మనగలుగుతుంది."(ఉరితీయబోయే ముందు డాంటన్ మాటలు)

రూసో కొత్త పతాకం కింద బోధించిన రాజకీయ పండితుడు రాబస్ పీర్ అధ్వర్యాన డాంటన్ మరణం విప్లవ ప్రతీఘాతుకానికి సూచన అనవచ్చు. ఘాతుక చర్యలను తీవ్రతరం చేసి తన "ధర్మ రాజ్యాన్ని" స్థాపించాడతడు. "ధర్మం లేకుండా, భయానక చర్యలు నిషిద్ధమైనవి. భయానక చర్యలేని ధర్మం సత్తాలేనిది. "రాబస్ పీర్ నియంతృత్వానికి నైతిక ప్రమాణం ఇదే. ధర్మాన్ని యింకా చిరకాలం వుండే ప్రాతిపదికపై వుంచదలచాడు. భయానక రాజ్యం శాశ్వతంగా కొనసాగదు. సవాయ్ మఠాధిపతి సూచించిన రీతిలో, విప్లవ గ్రంథం పేర్కొన్న తీరులో పరమాత్మను ఆరాధిస్తూ, దీనికే వ్యవస్థాపితం చేసి, వివేచనను తుడిచి పెట్టాలని తలపెట్టాడు. కాని మహాసభలో యింకా విజ్ఞాన వికాస భావాలున్న సభ్యులున్నారు. కనుక, క్రమంగా పోదలచాడు రాబస్ పీర్.

దేశంలో అధిక సంఖ్యాకులు ఐరోపా అంతటా, రాబస్ పీర్‌నే ఫ్రాన్స్ పాలకుడనుకున్నారు. ప్రజావ్యవహారాలలో ఎప్పుడూ ఒకే క్రమాన్ని అనుసరించడం, ధర్మాన్ని గురించి విసుగు చెందకుండా చెప్పడం, సమగ్రత వుండాలనడం, బోధనాత్మక ఉపన్యాసాలు వీటన్నిటి వలన, అధికారాన్ని గురించి ప్రజలకు ఒక తప్పుడు భావాన్ని రాబస్ పీర్ సృష్టించాడు. ఇతరులు తనను గురించి అనుకుంటున్నట్లే నియంతగావాలని యితడు తుదకు నిర్ణయించుకున్నాడు.

మహాసభను, పారిస్ కమ్యూన్‌ను యితడు అదుపులో పెట్టాడు. తన వక్తృత్వంతో జాకొవిన్ క్లబ్‌ను ఆకట్టుకున్నాడు. పారిస్‌లో సైన్యాధికారి హాన్రి యితడి అనుచరుడు. సర్వశక్తివంతమైన ప్రజారక్షణ సంఘంలో ప్రతిపక్షం వారున్నారు. లబ తప్ప సంఘ సభ్యులందరూ యితడిని వ్యతిరేకించగా, సైన్యాన్ని అదుపులో పెట్టిన సెయింట్ జస్ట్ విధేయతపై రాబస్ పీర్ ఆధారపడినాడు. ధర్మం, అవినీతి వ్యతిరేకత, వ్యక్తిగత ఆశలేకపోవడం అనేవి కష్టపడి పదేళ్ళపాటు ప్రచారం చేయగా అవే రాబస్ పీర్ ఆయుధాలైనవి.

సర్వశక్తివంతమైన పాలకుడు కాదలచినట్టు కోరికను వెల్లడించిన రాబస్ పీర్, రాజ్యానికి సంబంధించిన మతాధిపతిగా వుండవలసిన అవసరాన్ని గ్రహించాడు. వివేచనను ఆరాధించడం అంతమొందించాలని నిర్ణయించాడు. కొత్త దైవదూతగా ప్రతిరోజు అతడిని శ్లాఘిస్తూ లేఖలు వచ్చాయి. రాబస్ పీర్ ఇంటిముందు కత్తితో వున్న సెసిల్ రెనాల్డ్ సంఘటనవలన , దైవరక్షణలో అతడి జీవితం వున్నదని రుజువైంది. కొత్తమతంలో తొలి అద్భుతం సంభవించింది.

తన పవిత్రతకు సరిపడని ఓల్తేర్ ధోరణిలో రాబస్ పీర్ యిట్లా ప్రకటించాడు. "దేవుడు లేకుంటే, మనమే కనుగొనాలి. "ఓల్తేర్ మనుష్య ద్వేషం యిందులో దాగలేదు. అణచివేసే మత ప్రాధాన్యతను యిది బయటపెడుతున్నది. అయితే రాబస్ పీర్ చిత్తశుద్ధిగానే మాట్లాడాడు. ఇందులో వున్న ప్రయోజనాన్ని బట్టి మనుష్యద్వేషం, చిత్తశుద్ధికి గల విలువలను నిర్ణయించాలి. ప్రవక్త ధోరణిలో వున్నవాడు కాస్తా కొద్ది రోజులకే స్పష్టంగా బయటపడ్డాడు. సమస్య కేవలం ప్రతిపాదనగా లేదు. "అణగారిపోయిన అమాయకులను చూస్తూ, నేరాన్ని శిక్షిస్తూ వుంటాడనే దైవభావం ప్రజాదరణ పొందింది.

ఈ లోగా భీభత్సం పరాకాష్ఠకు చేరింది. ధర్మసేవలోనే అనుకోండి, మహాసభలో చాలామందిని తొలగించి వేశారు. ప్రజలు అలసిపోయారు. మిన్నకున్నారు. మంచి తరుణం ఆసన్నమైంది. "పరమాత్మ ఉత్సవం" జరపడానికి ప్రజారక్షణసంఘం నిర్ణయించినట్లుగా, ప్రజలకు మహాసభకు తెలియపరచారు. ఈ ప్రకటన చేస్తూ, కేథాన్ యిట్లా చెప్పాడు– "పవిత్ర ఆత్మలకు గుర్తింపు భావన వచ్చింది. పరమాత్మను ఆరాధించడం వాస్తవంగా అవసరమైంది. మత నైతిక భావాల సంబంధం, రిపబ్లిక్ సూత్రాలపై" కాబోయే మతాధిపతి సుప్రసిద్ధ ప్రసంగం చేశాడు. దైవమత స్థాపనావశ్యకతను గురించి ప్రకటనతో తన ఉపన్యాసాన్ని రాబస్ పీర్ ముగించాడు.

విప్లవం కాస్తా జారిపోయింది. రాజు పోయాడు. పరిపాలనకు దైవాంశ సంభూతత్వం మాత్రం పునరుద్ధరించారు. సామాజిక ఒడంబడిక కేవలం నమ్మించడానికే, రాబస్ పీర్ రిపబ్లిక్ సూత్రాలకు మతప్రమాణం వున్నది. విప్లవకారుల గ్రంథ

ప్రమాణాధారంగా అతడు తన పిడివాదాన్ని రూపొందించాడు. జీవితమంతా రూసో అనుభూతి పొందాడని హ్యూమ్ అన్నాడు. అతడు ఆలోచించడానికి కూడా ప్రయత్నించాడు. కాని ఇంద్రియానుభూతి, రుగ్మతతో గూడిన పిపాసతో అతడి భావాలు కలగాపులగంగా మారాయి. అందుకే సామాజిక ఒడంబడిక ఆధారంగా రాజకీయ సంస్థను వూహించాడు. అదే రాజకీయ విజ్ఞాన ప్రతిపాదనను దేనికీ కొరగాకుండా వమ్ముచేసింది.

రాబస్ పీర్‌లో ఉద్రేకం, అనుభూతి లేవు ప్రశాంతంగా అంచనా వేస్తాడు. అట్లాగని పెద్ద ఆలోచనాపరుడు కాదు. పథకాలు పన్నుతాడు మామూలు తెలివితేటలు వున్నప్పటికీ, బాగా జిత్తులమారి, ఛాందసుడు కూడా. అందుకే చిత్తశుద్ధి వుంది. దైవానికి తానొక సాధన అని ఛాందసంగా నమ్మాడు. రాజు పోయాడు. దైవాంశ సంభూతుడనే అంశ మాత్రం రాబస్ పీర్ వారసత్వంగా స్వీకరించాడు. ప్రజాస్వామ్యాన్ని గాక రూసో చెప్పిన ఎంపికైన సంపన్నుల రాజ్యాన్ని స్థాపించాడు. మతరాజ్యాధిపతిగా రాబస్ పీర్ అత్యున్నత స్థానానికి వచ్చాడు. పరమాత్మ పేరిట మత కర్మకాండ అంతా ప్రవేశ పెట్టి ఉత్సవం జరిపాడు. దీనికిగాను ఒక ప్రత్యేక ప్రార్థన సిద్ధం చేశారు. రాబస్ పీర్ ఈ ఉత్సవానికి అధ్వర్యం వహించాడు. ధూపం వేస్తుండగా, వేలాదిమంది శ్లాఘిస్తుండగా, యితడు ఎత్తయిన పీఠంపై నిలుచున్నాడు." తానే దైవం అని ఆ క్షణంలో అతడు భావించాడు. "నాస్తికత్వం పేరిట చేసిన ఒక పెద్ద విగ్రహానికి అతడే స్వయంగా నిప్పంటించాడు. ప్రక్కనే వివేకం పేరిట వేరొక విగ్రహం వున్నది. నాస్తికత బూడిద నుంచి యిది ఆవిర్భవిస్తుంది. కాని నాస్తిక విగ్రహాన్ని దగ్ధం చేసిన అగ్ని, వివేకానికి సోకగా అది నలుపెక్కింది. అందరూ నవ్వుకున్నారు. అపహాస్యం అంటే సరిపడని రాబస్ పీర్ చుట్టూ వ్యతిరేకత గమనించాడు.

పరమాత్మ ఉత్సవం జూన్ 8న జరిగినప్పుడు పొందిన అవమానం, నిస్పృహకు బదులుగా, జూన్ 10 శాసనాన్ని జారీ చేశాడు రాబస్ పీర్. తనను వ్యతిరేకించిన లేదా విమర్శించిన వారిని అడ్డులేకుండా చేయడమే దీనిలక్ష్యం. అదే అతడు ఏర్పరచిన నిరంకుశపాలన కాగా, అతడి మరణశాసనంగా మారింది. శాసనాన్ని స్వహస్తాలతో రాశాడు. అనుమానితుడెవరైనా సరే, సాక్ష్యం, విజ్ఞప్తి, న్యాయవాదితో నిమిత్తం లేకుండా, చంపేసే హక్కు ప్రజారక్షణ సంఘానికి యీ శాసనం యిచ్చింది.

ఇతడి పతనానంతరం తర్మిడోరియన్లలో(2)(మితవాదపక్షం) ఒకడైన తొలి మనుష్యద్వేష భావంతో యిట్లా వ్యాఖ్యానించాడు. "తన స్థానంలో అతడు (రాబస్ పీర్) శాశ్వతత్వాన్ని స్వీకరించగలిగేవాడే." రూసో విప్లవ ప్రవచనాన్ని చిత్తశుద్ధితో నమ్మినవ్యక్తి జీవితాన్ని గురించి అతడి అనుచరుడు చక్కగా చెప్పిన వ్యాఖ్యానమేయిది. ఈ ఆదర్శాన్ని

ఛాందసంగా సాధించినాడు. ఎంత మహోన్నత వ్యక్తి అయినాసరే, ముందే వేసుకున్న పథకం ప్రకారం చరిత్ర సృష్టించాలంటే పతనాన్ని ఎదుర్కొనక తప్పదు.

"సృజనాత్మక వూహ" పట్ల ఆకర్షణకు లోనుగావద్దని భవిష్యత్తు విప్లవకారులకు డాంటన్ హెచ్చరిస్తున్నప్పటికీ, రాబస్ పీర్‌కు అదే గతి పడుతుందని అతనికి తెలుసు. నీచమైన రాబస్ పీర్ ! ఉరికంబం నిన్ను కూడా బలిగొంటుంది నీవు నన్ను అనుసరించక తప్పదు. "అతడి భయానక రాజ్యపాలన మూడుమాసాలైనా సాగకముందే, అదే జరిగింది. భయంకర పరిస్థితి ఆధారంగా ఫ్రాన్స్‌కు ఎదురులేని పాలకుడు గావాలని రాబస్ పీర్ అనుకున్నాడు. కాని ఇతరులు దీనినే సాధన చేయదలచినప్పుడు మాత్రం వ్యతిరేకించాడు. పోప్1 యిట్లా రాశాడు. "విప్లవాధిపతి గావడానికి ఒక్క అడుగేస్తే సరిపోయేది. కాని మరొక ముప్పై తలల్ని బలిగొనవలసి వచ్చేది. "ప్రజారక్షణ సంఘంలో తనపై అధికమౌతున్న వ్యతిరేకతను గమనించిన రాబస్ పీర్, తనకు ఏకైక విశ్వాసపాత్రుడైన స్నేహితుడి అండగోరాడు. పోరాటరంగం నుండి వెంటనే పారిస్ రావలసిందిగా సెయింట్‌జస్ట్‌కు కబురు పంపాడు. బరేరి చెప్పిన దానిని బట్టి, రాబస్ పీర్‌ను నియంత చేయాలనే ప్రతిపాదనను కమిటీ ముందుంచాడు సెయింట్ జస్ట్. కమిటీలో ఐక్యతకై సెయింట్ జస్ట్ ప్రయత్నించాడు కూడా. ఏమైనా రాబస్ పీర్ విచారగ్రస్తుడయ్యాడు. తనపై తానే తరచు జాలిపడుతూ కుంగిపోయేవాడు.

రాబస్ పీర్ వలె సెయింట్ జస్ట్ ఉపన్యాసాలలో తరచు ధర్మం అనే మాట వినిపిస్తుండేది. రాబస్ పీర్ చెప్పే ధర్మం కేవలం సిద్ధాంతం, పేలవమైనది, పరోక్షమైనది. సెయింట్ జస్ట్ దృష్టిలో ధర్మం అంటే స్వయంక్రమశిక్షణ, కఠోర నియమాలు పాటించడం మానవుని స్వేచ్ఛకు అర్హుడిని గావించడం, న్యాయపిపాసువుగా చేయడం అని భావం, పాలకులు అధర్మంగా ఉంటే, జాతియావత్తు నిత్యం ధర్మంగావుంటే, జాతియావత్తు నిత్యం ధర్మాన్ని పాటించవచ్చని అతడి ఉద్దేశ్యం. వ్యక్తిగత ఆశలు లేనందున అతడు దేనికీ చలించేవాడుకాడు. తన మార్గంలో ఏ మాత్రం అడ్డుగా నిలవనిచ్చేవాడుకాడు. భయానక పాలన అంత కఠినంగా వద్దని చెబుతున్నవారిని ఖాతరు చెయ్యకుండా, డాంటన్ మరణానికి యితడు వహించిన ఆ గౌరవ పాత్ర సులభంగా బయటపడింది. ఫ్రెంచి సామాన్యుడి ప్రతినిధిగా డాంటన్ వుండేవాడు. సెయింట్ జస్ట్ ఛాందసుడు. డాంటన్ హాయిగా నవ్వుతూ కాలం గడుపుతూంటే సెయింట్ జస్ట్ వంటి ఛాందసుడికి ఉపయోగం లేదు.

జెరాండ్, మోంటేన్ మధ్య సంఘర్షణ జరుగుతుండగా, రాజీ పడితేగాని ప్రజాస్వామ్యం స్థాపించలేమని సెయింట్ జస్ట్ గుణపాఠం నేర్చాడు. ఆ పాఠం వలన

అతడిలో శత్రుత్వం పెరిగింది. అతడి కలను వాస్తవమని విజ్ఞులు భావించలేకపోయారు. బలప్రయోగం లేకుండా విప్లవం ఎలా సాధ్యం? రిపబ్లిక్‌ను నడిపే సూత్రం ధర్మమేనని మోంటెస్క్యూ నేర్పాడు. ధర్మం ఒక చేతిలో కత్తి ధరించి నేలపై నడవాలని గుర్తించాడు సెయింట్ జస్ట్.

కేంద్రంలో అధికారం అణచివేసి, స్థానిక స్వతంత్రతతో ఫెడరల్ రిపబ్లిక్ వుండాలని జెరాండ్ భావం. కేంద్రపెత్తనంలో సెయింట్ జస్ట్‌కు విశ్వాసం వున్నది. 1793 వసంతకాలంలో పోరాట కేంద్రాల నుంచి సైన్యాన్ని ఉపసంహరించడంతో అతడి నమ్మకాన్ని గట్టిపరచాడు. గట్టి కేంద్రం వుండాలని, "కేంద్రీకృతమైన యిచ్ఛ" కావాలని అతడి ఉద్దేశ్యం. ఆజ్ఞలను దేశం గుర్తించాలి. దేశాన్ని సైనికపాలన కింద అట్టిపెట్టాలన్నాడు.

రూసో నమ్మినట్టు ఆదిమానవుడు మంచివాడని, ఆడంబరాలు లేకుండా వుండేవాడని ఆ స్థితికి వెళ్ళడం సాధ్యమని సెయింట్ జస్ట్ విశ్వసించాడు. వివేచనతో, న్యాయంగా పరిపాలిస్తే మానవుడు సంతోషంగా ధర్మబద్ధంగా వుంటాడు. జనేచ్ఛను ఎన్నికైన, శాసనసభ చర్చలద్వారా వెల్లడించడం ప్రభుత్వానికి ముఖ్యమని అతడు నమ్మాడు. ప్రజల ఇచ్ఛ అవిభాజ్యం గనుక, అధికారాన్ని మరొకరికి దత్తత చేయడంగాని, ప్రాతినిధ్యం వహించడంగాని తగదన్నాడు.

జనేచ్ఛను మేధావుల పరంగానే కాండొర్సె పరిగణించినందున, దానికి అవకాశం లేకుండా పోయిందని యితడు వాదించాడు. జనేచ్ఛను తాత్వికంగా గాక వాస్తవవిషయంగా భావిస్తేనే, ప్రజల ఆసక్తికి వ్యక్తీకరణ వుంటుందన్నాడు.

రిపబ్లిక్‌లో ప్రజలు సంతోషంగా యధేచ్ఛగా గడపాలని, మానవుడి బలహీనతలకు సైతం అవకాశం వుండాలని డాంటన్ కోరాడు. విలాసాలకు అవకాశం లేకుండా పొదుపుగా వుండాలని అదే ధర్మబద్ధ జీవితమని సెయింట్ జస్ట్ అన్నాడు.

డాంటన్ సమక్షంలో నివేదిక చదవాలనుకున్నాడు సెయింట్ జస్ట్. అది చదవక పూర్వమే, డాంటన్ నిర్బంధానికి  ఉత్తరువులు జారీ చేసింది కమిటీ. సెయింట్ జస్ట్ అప్పుడు నైతిక సంక్షోభంలో పడినాడు. తనను నీచ ప్రయోజనానికి వాడుకున్నట్లు గ్రహించాడు. తన గౌరవానికి  రిపబ్లిక్‌కు మధ్య అతడు ఎన్నుకోవలసి వచ్చింది. రిపబ్లిక్‌ను ఎన్నుకొని, యీకింది వాదనతో తన నిర్ణయాన్ని సమర్ధించుకున్నాడు. కఠోర నియమాలు అనుసరించినందుకు మమ్మల్ని ఖండించేవారు. మమ్మల్ని అన్యాయంగా వుండాలంటారా? మిగిలినవి–ఆడంబరత్వాలు ఎట్లా పోయినా ఫరవాలేదు. మనిషి అంటే ఏమిటి? మన రిపబ్లిక్ వ్యవస్థాపనే సడలిపోతుండగా, మనలో ఎంతగొప్పవారైతే మాత్రం ఏమిటి?"

రాబస్ పీర్ చేసిన చివరి చర్య సంచలనాత్మకమైనది, మహాసభకు అతడు సిద్ధం

చేసిన ఉపన్యాసంలో, ప్రజారక్షణ సంఘంలోని సభ్యులే అన్నింటికీ బాధ్యులన్నారు. తన ఆజ్ఞానుసారం చేసినవాటికి ప్రజలలో జుగుప్స ఏర్పడగా అతనిలా మార్చాడు. ప్రజారక్షణ సంఘాన్ని పడగొట్టాలని మహాసభను రెచ్చగొట్టాడు. సర్వశక్తివంతమైన సభ దయనీయంగా నిస్సహాయతను వ్యక్తం చేసింది. ఇతరుల స్వార్థం వలన, వక్రమార్గావలంబన వలన, ధర్మరక్షణ పరాయణులైన అతడి సన్నిహితులు దోషాన్ని అరికట్టలేదు. సరిగదా, మంచి అంటూ ఏమీ చేయలేకపోయారు. ఈ రుగ్మతకు నివారణ ఏమిటి? చరమాంకం విద్రోహ కరంగా, పిరికితనంతో, ఘాతుకచర్యగా మారింది. "ద్రోహులను శిక్షించడానికి , సంఘాన్ని పునర్వ్యవస్థీకరించాలి. మహాసభ సర్వాధికారం కింద ఐక్య ప్రభుత్వాన్ని ఏర్పరచాలి. జాతీయాధిపత్యం కింద అన్ని చీలికలను అణచివేయాలి. న్యాయం, స్వేచ్ఛ, అధికారాన్ని పునరుద్ధరించాలి." మహాసభకు నచ్చజెప్పదలిస్తే, డాంటన్ ఎంత భిన్నంగా మాట్లాడేవాడో.

రాబస్ పీర్ ధర్మబోధనలన్నీ అబద్ధమని రుజువు పరుస్తూ, నీతిని, ధర్మాన్ని రాజ్యం నుంచి పారద్రోలిన ఖ్యాతి భయానక పాలనకు దక్కాలి. పగసాధన, భయస్వార్థం యిత్యాది నీచమైన లక్షణాలన్నీ పెత్తనం చేశాయి. దొంగలు తమలో తమకు కుదరక బయటపడడంతో, అంతవరకు నిస్పృహతో, భయంతో, నీతికి దూరమైన మహాసభ ఒక్కసారిగా తన అధికారాన్ని గుర్తుకు తెచ్చుకున్నది. గందరగోళం మధ్య, ద్రోహం చేసిన తన యజమానికి గుణపాఠం చెప్పే నిమిత్తం కంబన్ వేదిక ఎక్కి యిట్లా ఘర్జించాడు. "నా గౌరవం పోకముందే, ఫ్రాన్స్‌తో మాట్లాడతాను. మహాసభను ఒకేఒక వ్యక్తి నిర్వీర్యం చేశాడు. అతడే రాబస్ పీర్, "నిన్నటివరకు సర్వశక్తివంతుడైన నియంత గుట్టుగా మహాసభనుంచి జారుకొన్నాడు. దెబ్బతిన్న పతనావస్థలో వున్న వ్యక్తి అతడు. తనకు అండగా జాకొబిన్ క్లబ్‌ను కూడగట్టే ప్రయత్నం చేశాడు. కాని అతడి అదృష్టం బాగాలేదు. విధివశంగాక తప్పలేదు. మరునాడు మహాసభనుద్దేశించి మాట్లాడటానికి చాలా పర్యాయాలు విఫల ప్రయత్నం చేశాడు. చివరకెలాగైతేనేమి తన స్వరాన్ని వినిపించినప్పుడు, అందులో నియంత పోకడ లేదు. తన పతనాన్ని తప్పించుకోడానికి దయనీయంగా చేసిన విజ్ఞప్తి మాత్రమే అందులో వినిపించింది. విప్లవపీఠానికి గాక, జుగుప్సాకరమైన కేంద్రాన్ని ఉద్దేశించి యీ విజ్ఞప్తి చేశాడు. "పవిత్రులారా, ధర్మపరాయణులారా ! మీకు విజ్ఞప్తి చేస్తున్నాను ! హంతకులు నిరాకరిస్తున్నారు గాని, నన్ను మాట్లాడనివ్వండి." ఎంత సిగ్గుచేటు, చివరిలో అఖాతంలో పశువు వలె దిక్కుతోచక పరుగిడుతూ, విజ్ఞప్తి చేస్తూ, ఆగ్రహావేశంతో వున్న ధోరణి కనబరచాడు. ఇంతకాలంగా ఎందరినో బుజ్జగించిన అతడి స్వరంలో యిప్పుడు పరస్పర విరుద్ధ ఉద్రేకాలు కనిపించాయి. ఒకరిలా అరిచారు, "డాంటన్ రక్తం నిన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది." పతనమైన నియంతను నిర్బంధించాలని మహాసభ నిర్ణయించింది. తన నలుగురు

సహచరులతో సహా అతడిని తీసికెళ్ళారు. రూసోకు అత్యంత విశ్వాసపాత్రుడైన అనుచరుడి జీవితం అట్లా ముగిసింది.

జ్ఞాన వికాసం వలన వచ్చిన మరో విప్లవ ఫలితంగా, హింస లేకుండానే పాత వ్యవస్థను కూలద్రోశారు. అప్పుడు అనుకోకుండా సంభవించిన పరిస్థితులవలన, జయప్రదమైన రాజకీయ సాంఘిక విప్లవ నాయకత్వం భిన్న ధోరణిగల వ్యక్తుల చేతుల్లోకి పోయింది. మేధస్సులో పరిణతి లేనందున, ఆలోచనారహిత ఉత్సాహం వలన, మోసపూరిత విప్లవారాధనలో నిమగ్నులయ్యారు. 18వ శతాబ్దపు ధోరణికి వచ్చిన వ్యతిరేకతే యిదంతా. అంటే మనిషి స్వేచ్ఛగా, ధర్మంగా వుండగలడనే దానికి విరుద్ధంగా వచ్చిందన్నమాట. దైవారాధనను తిరగదోడడమంటే, ఆధ్యాత్మిక బానిసత్వంలోకి పోవడమే. ఆధునిక నాగరికత చేసిన తిరుగుబాటంతా దీనిపైనే గదా. నాగరికతను రూసో ఖండించడంలో 14వ లూయీ కాలంలో మనుష్య ద్వేషభావం, అవినీతిపై తిరుగుబాటు, ధర్మం కోసం ఆగ్రహాన్ని వెలిబుచ్చడం కనిపించింది. అటవిక మానవుడి ఔన్నత్యం కల్ల. కాని విప్లవాన్ని ఉద్వేగంగా ఆరాధించిన భక్తులు అటవిక దశలోకి దుమికారు. అది ఉన్నతముగాదు, ధర్మబద్ధముగాదు.

వ్యక్తిపరమైన ఆస్తి భావనకు వ్యతిరేకంగా రూసో చేసిన తిరుగుబాటు స్వభావాన్ని బాబఫ్ ద్వారా లూయీబ్లాన్‌కు సంక్రమించిందంటారు. "ఫ్రాన్స్‌ను రక్షించింది భయానక పాలన అనడం తప్పు. కాని విప్లవాన్ని మాత్రం అది వక్రీకరించింది." ఔను దీనికి వ్యతిరేకంగా ఏర్పడినభావమే, నెపోలియన్ నియంతృత్వానికి తోడ్పడింది.

ఫ్రెంచి విప్లవం ఒక దేశానికి పరిమితమైన అనుభవం కాదు. ఒక జాతి చరిత్రలో సంఘటన మాత్రమే కాదు. విప్లవకారులు ఫ్రాన్స్‌లో గత వైభవాన్ని స్ఫురణకు తేలేదు. సంప్రదాయబద్ధమైన ప్రాచీనతలో వారు ఉత్తేజం పొందారు. ప్రాచీన ఒడంబడికలు, పత్రాలన్నిటినీ వారు తగులబెట్టారు. సాంస్కృతిక జాతీయవాదం కూడా వారిని ఆకర్షించలేదు. గోథిక్ కళతో వున్న దేవాలయాలన్నీ అటవికత మూఢనమ్మకాల ఆలయాలుగా" వారు చిన్నచూపు చూశారు. వాటిని నాశనం చెయ్యాలన్నారు. ఐరోపా చరిత్రలో యీ విప్లవం ఒక మలుపు. ఫ్రాన్స్ సరిహద్దుల ఆవల దీని ప్రభావం సోకింది. వాల్మి వద్ద రిపబ్లికన్ సైన్యాలు అడ్డు తగిలిన సైన్యాలను ఓడించినప్పుడు గెట యిట్లా వ్రాశాడు. "ఇక్కడ ఇప్పటి నుంచి ప్రపంచంలో కొత్త శకారంభమౌతున్నది." అందుకే ఫ్రెంచి విప్లవం మహోన్నత విప్లవమైంది. శతాబ్దాలుగా మానవపోరాటానికి జరుగుతున్న పోరాటానికి తార్కిక ఫలితమే ఇది.(1) ఆ విధంగా ఐరోపా అంతటా చిరకాలంగా గౌరవం పొందిన రాజకీయ సంస్థలను, సంప్రదాయ సామాజిక సంబంధాలను ప్రశ్నించారు. ఒక దేశం తరువాత మరొకచోట కేవలం రాజరికాన్ని కూలద్రోసి, ఫ్యూడల్

సాంఘిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారు. "ఫ్రాన్స్‌లో విప్లవ రూపేణా వచ్చిన ఉద్యమం ఐరోపా అంతటా సర్వసాధారణమైంది. ఫ్యూడల్ సంస్థలను ఆధునిక రాజ్యాలుగా మార్చారు."(2)

నెపోలియన్ సైన్యం సాధనగా యీ విప్లవ సంఘటనలు వచ్చాయి. "ఐరోపాలో ఫ్రెంచి విప్లవ సైన్యాలు అడుగిడినచోట, పాత ఫ్యూడల్ వ్యవస్థ, పితృప్రాధాన్యత తుడిచిపెట్టుకుపోయింది. పారిస్ నుండి 1వ అలెగ్జాండర్ అధికారులు యీ సందేశాన్ని రష్యాకు తీసుకెళ్ళారు. అక్కడ తలెత్తుతున్న రష్యన్ మేధావులపై దీని ప్రభావం బాగా కనిపించింది. నెపోలియన్ అధ్వర్యం వహించిన సైన్యం అతడి సృష్టికాదు. అది విప్లవ సృష్టి. నెపోలియన్ సైతం విప్లవసృష్టే. కనుక అతడి వ్యక్తిగత రాగద్వేషాలెట్లావున్నా, చరిత్రలో అతడి పాత్ర బాహ్యంగా చూస్తే విప్లవాత్మకమే. అతడు హఠాత్తుగా ఆవిర్భవించినవాడు కాదు. సాహసికుడూ కాదు. సునిశితుడుగా, ఆశాజీవిగా వున్న యీ యువకుడు 18వ శతాబ్దపు భావాన్ని తన ధోరణిలో పుణికి పుచ్చుకున్నాడు.

నెపోలియన్ ధోరణి, శిక్షణ వలన అతడు వోల్తేర్ భావం గలవాడు. రూసో అంటే అభిమానం లేదు. ఇంకా చిన్న అధికారిగా వుండగానే నిర్మొహమాటంగా యిట్లా వ్యాఖ్యానించాడు. "రూసో పిచ్చివాడు. మనల్ని ఈ స్థితికి తెచ్చింది అతడే. అయినా రాబస్ పీర్ కంటే జయప్రదంగా రూసో సిద్ధాంతాన్ని యితడు ఆచరణలో పెట్టాడు. సామాజిక ఒడంబడిక నుంచి రాజకీయ పాఠాలను యితడు నేర్చినట్లు స్పష్టం. నెపోలియన్ రాజకీయాలలో మూలసూత్రం యిట్లా వుంది. "గొప్ప జాతికి ఐక్య కేంద్రం వుండాలి. 25 మిలియన్ల ప్రజలు ఒక రిపబ్లిక్‌లో వుండలేరు. రాజకీయ నినాదం కాదు. "1789లో యువకుడుగా యీ భావాలు వ్యక్తం చేశాడు. నెపోలియన్ "ప్రజాస్వామిక నియంతృత్వం" అంటే సరిగా వుంటుంది. వరుసగా మూడుసార్లు జనవాక్యాల ద్వారా మార్మికంగా జనేచ్ఛ లభించినట్లు నెపోలియన్ రాజ్యం చెప్పుకోవచ్చు.

---

1) 18వ శతాబ్దంలో విప్లవగతి చాలా మార్పులు తెచ్చింది. ఇది కేవలం ప్రభుత్వాన్ని కూలద్రోయడమేగాక, సమాజంలో ప్రాచీన వ్యవస్థను ధ్వంసం చేసింది. లోగడ గుర్తించని శక్తులు, సామాజిక జీవిత భావాలు తలెత్తాయి. ఇంతటి విశాల దృక్పథం గల విప్లవం శూన్యం నుంచి తలెత్తదు. దీని వేరులు గతంలో చాలా లోతుగా వున్నాయ్. పైన వీటి పెరుగుదలకు కారణాలను చూడవచ్చు. అంతకుముందు తరాలలో దీనికి గుర్తింపు లేదు. ఫ్రెంచి విప్లవ విషయంలో యిదంతా వాస్తవం అందుకే 18వ శతాబ్దాన్ని ఆధునిక ఐరోపాకు బీజప్రాయంగా పేర్కొంటారు. ఆచరణలో వున్న 18వ శతాబ్దమే ఫ్రెంచి విప్లవం కంటే విప్లవానికి ప్రోది చేసిన భావాలు ఆ శతాబ్దంలో పరిణమించినవి. ఆ విప్లవంలో వ్యక్తమైన భావాలు ఉత్తరోత్తరా అధిపత్యం వహించినవి. ఆ విధంగా, రాజకీయ రంగంలో అపస్వరాల మేళవింపు అర్థరహితంగా ఆలోచనా రహితంగా వచ్చి, ఆధునిక ఐరోపా రూపొందడానికి ఉపకరించినవి. విప్లవానికి ఆ భావాలే మార్గదర్శకాలు. వాటి ఆధారంగానే 19వ శతాబ్దం మనుగడ సాగించింది. ఆల్ఫ్రెడ్ కోబెన్, ఎడ్మండ్ అండ్ దివోల్డ్ అగనెస్ట్ ది ఎయిటీన్త్ సెంచరీ.

డాంటన్ ఎక్కడ విఫలమయ్యాడో నెపోలియన్ అక్కడే సఫలమయ్యాడు. విప్లవం సాధించిన  తొలి విజయాలను అతడు నిలబెట్టడంలో కృతకృత్యుడయ్యాడు. విప్లవ ఫలితాన్ని ఏ విధంగానూ చెడగొట్టకుండా, గందరగోళం మధ్య క్రమత్వాన్ని స్థాపించాడతడు. నెపోలియన్ అధ్వర్యాన సైనికశక్తికి సామాజిక ప్రాతిపదికను ఫ్రాన్స్ సాధించింది. విప్లవం వలన రైతులకు భూమి దక్కింది. దీనికి బదులుగా రైతులు, ఐరోపాను జయించే నిమిత్తం నెపోలియన్‌కు సైనికులను యిచ్చారు. దండయాత్ర అంటే విప్లవాన్ని విస్తరించడమన్నమాట. రాజరికపు సర్వాధికారం కూలద్రోసి, జయించిన దేశాలలో ప్యూడల్ వ్యవస్థను నాశనం చేశారు.

"బార్బన్ పాలనగాని, ప్యూడల్ వ్యవస్థగాని పునరుద్ధరించే ఉద్దేశం అతడికి లేదు. పైగా, ప్రాచీనరాజ్య వ్యవస్థను నాశనం చేయడం అతడి కృషిలో ముందే వేసుకున్న పథకం వలె వున్నది. విప్లవంలో అదే ప్రధానాంశంగా అతడు భావించాడు. సిద్ధాంత పరంగా విప్లవం ఏమి చెప్పింది తొలుత అతడు గ్రహించాడు. ప్రజలు మోసే భారం అందరిపై సమానంగా వుండాలని, ప్రజాకార్యాలయాలు అందరికీ అందుబాటులో వుండాలన్నాడు. పుట్టుకగాని, రాజకీయ పూర్వాపరాలుగాని గమనించక, ప్రతిభ, విధేయత తనపట్ల వుండటమే ఏకైక అర్హతగా పరిగణించాడు.

విప్లవాన్ని ఉత్తేజపరచిన  తత్వవేత్తలు మానవజాతినంతటినీ దృష్టిలో పెట్టుకొని ఆలోచించారు. మదాంరోలా తనకు విశ్వజనీన ఆత్మ వున్నదన్నప్పుడు, ఆమె ప్రజలందరినుద్దేశించి ఆ మాట అన్నది. హక్కుల ప్రకటన "చర్చకు వచ్చినపుడు ప్రజా ప్రతినిధి ఒకరు యిట్లా చాటారు. అన్ని కాలాలకు, అన్ని దేశాలకు, ప్రజలందరికీ మనం హక్కుల ప్రకటన చేస్తాం. అది ప్రపంచానికంతటికీ ఆదర్శంగా వుంటుంది." అదీ విప్లవధోరణి. నెపోలియన్ విప్లవసైన్యం యీ ఆదర్శాన్ని సాధించింది.

"అనేక  ప్రతిభాశాలుర వలె, నెపోలియన్ కూడా విప్లవంలో జనించి, వివేచన వలన సామాజిక వ్యవహారాలలో అగ్రశ్రేణికి వచ్చాడు. నాటి సంక్షోభంలోని తిరుగుబాటు, విమర్శనాత్మక సాహిత్యం అతడి యువ మనస్తత్వంపై ప్రభావం చూపెట్టాయి. నెపోలియన్ అధ్వర్యాన  ఐరోపాలోనే ఫ్రాన్స్ అధిక్యత పొందినది. ఇది కేవలం నాయకుడి ప్రతిభ వలననే గాదు. అతడి సేవలో అత్యుత్తమ నాగరిక దేశాల ప్రతిభాశాలురు వుండడం కూడా తోడ్పడింది. విజ్ఞానవంతులకు మంత్రి పదవులు లభించినవి. ఐరోపా అంతవరకూ చూడని సమర్థులు అతడి మంత్రిమండలిలో వున్నారు. సైన్యంతో గూడా కేవలం ప్రతిభ ననుసరించే మార్షల్ స్థాయిలో వారు వచ్చి విజయపరంపర సాధించారు."(1)

రాబస్ పీర్ ఛాందసవాదానికి తట్టుకొని డాంటన్ వివేచనాత్మక ధోరణి నిలబడింది. ఇంద్రియానుభూతికంటె విజ్ఞానానికి మంచి అర్హస్థానం లభించింది. ఉద్వేగపు అతి

పోకడలతో వివేచన మళ్ళీ నిలదొక్కుకున్నది. తొలుత వచ్చిన సంక్షోభాన్ని అధిగమించిన విప్లవం, ఫ్రాన్స్ సరిహద్దులు దాటి ఇతర దేశాలలో పాత వ్యవస్థను కూలద్రోయడంలో తోడ్పడింది. నెపోలియన్ వాదం విస్తరించిన విప్లవమే. విప్లవాన్ని బాల్యావస్థలోనే అణగద్రొక్కాలనే అంతర్జాతీయ సనాతనత్వానికి వ్యతిరేకంగా యిది ప్రబలింది. విప్లవంలోని సైనికదశ నెపోలియన్‌లోనే రాలేదు. విదేశ జోక్యపు ప్రమాదం వాటిల్లినపుడు అది ఆరంభమైంది. జాతి యావత్తూ ఆయుధాలు చేపట్టాలని డాంటన్ కోరాడు. ఆ సామాజిక ప్రాతిపదికపై సైన్యాన్ని కార్య వ్యవస్థీకరించాడు. విప్లవ ఫ్రాన్స్‌ను సమర్థించిన యీ సైన్యం, ఉత్తరోత్తరా నెపోలియన్ అధ్వర్యాన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే సందేశాన్ని యితర దేశాలకు తీసుకపోయింది. నెపోలియన్ కొత్త ఎత్తుగడ, పన్నాగం అతడి సైన్యం వలన నిర్ధారితమైంది. విప్లవసైన్యం దెబ్బకు తట్టుకోలేని పాత సామ్రాజ్య వ్యవస్థలు ఒకదాని వెంట మరొకటి నిలబడలేక కూలిపోయాయి. విప్లవాన్ని సమర్థించడానికి ఫ్రాన్స్‌లో అత్యుత్తమ వ్యక్తులంతా సైన్యంలో చేరి, ఆదుకున్నారు. విప్లవం ప్రారంభమైన తొలి ఉత్సాహంలో తమ సైనిక జీవితాన్ని ఆరంభించిన వారంతా నెపోలియన్ కాలంలో ప్రసిద్ధ మార్షల్ పదవులలోకి వచ్చారు. సైనిక సంగీతకారుడు విక్టర్, నెపోలియన్ సైన్యంలో మార్షల్ అయినప్పుడు యిట్లా అన్నాడు. “1791లో ఎంత మహోన్నత తిరుగుబాటు ! నేనందుకు అర్హుడనా !” ఈ అభిప్రాయాన్ని సమర్థిస్తూ మార్మన్ అనే మరొకడు యిట్లా అన్నాడు. “మనం వెలుగులో బ్రతికాం. 55 సంవత్సరాల ప్రాయంలో దాని వేడిని, శక్తిని చవిచూశాం. ఇది విప్లవంలో తొలిరోజు వలె అనుభూతి వలె ఉన్నది. !”(2)

షాంపెన్, లారెన్, బెల్జియం, వాల్మి, జెమాష్(1) యుద్ధాలలో విజయం సాధించిన వీరోచిత, విమోచన విప్లవ సంప్రదాయ సైన్యాధిపతుల అధ్వర్యాన ఐరోపా అంతటినీ తుడిచి పెట్టేశారు. ప్యూడలిజానికి ఎదురు తిరిగిన ఫ్రెంచి రైతులు యీ సైన్యంలో వున్నారు. అన్ని విధాలా అది విప్లవ సైన్యము. దాని నాయకుడు నెపోలియన్ విప్లవానికి ప్రతీక. అతడి వ్యక్తిగత ఉద్దేశం మాట అట్లా వుంచండి. “జాతి కంటె సైన్యం ఎక్కువ రిపబ్లికన్ అయింది. పౌరుల భావం అందులో ప్రతిబింబించింది. అటువంటి మార్మిక విశ్వాసం మరెక్కడా కనిపించలేదు. వారి విశ్వాసమే వారికి రక్షణ యిచ్చింది. విప్లవ సైన్యాధికారులు మార్సలజ్(2) అనే జాతీయగీతాన్ని ఆచరణలో పెట్టారు.

నెపోలియన్ రాకముందే సైనికపరంగా విప్లవం విజయాన్ని సాధించింది. రాబస్ పీర్ పతనానంతరం, భయానక పాలన పోయింది. డాంటన్ అనుచరులు పెత్తనం స్వీకరించారు. ప్రజాజీవితంలో జెరాండినులు ప్రముఖస్థానం అవలంబించారు. సాధారణ పరిస్థితి నెలకొనకపోయినా దేశంలో పరిస్థితి కొంతవరకు సడలింది. డైరక్టరీ(3)

సరిహద్దులవైపు దృష్టి సారించగలిగారు. విజయసాధకుడు కార్న యింకా రక్షణమంత్రిగా వున్నాడు. విప్లవ సైన్యం వలన హాలండ్ కాస్తా బటీవియా రిపబ్లిక్ అయింది. బెల్జియం, రైన్ నదీతీరప్రాంతం వరకూ ఫ్రెంచి రిపబ్లిక్‌లో చేరింది. అట్లాగే ఇటలీ వరకూ సరిహద్దులు విస్తరించినవి. ప్రష్యా, స్పెయిన్, టస్కనీలు విప్లవ వ్యతిరేక కూటమి నుంచి విరమించినవి. విప్లవ సైన్యం చేతుల్లో వీరు తరచు ఓటమి పొందారు. 1795 నాటికి విప్లవం అంతిమదశకు చేరింది. ప్రొటెస్టంట్ బ్రిటన్, కాథలిక్ ఆస్ట్రియాలు విప్లవ వ్యతిరేక ధోరణి అవలంబించిన శక్తివంతమైన రాజ్యాలు గనుక, వాటి అవరోధాన్ని తొలగించాలి.(4) బ్రిటన్‌కు బలవత్తరమైన నావికాదళం వున్నది. సముద్రం అడ్డం వున్నది. కనుక ముందు ఆస్ట్రియా అధికృతను తగ్గించాలని విప్లవ సైన్యం వ్యూహం పన్నింది. అందుబాటులో ఇటలీ వున్నది. ఇతర కారణాలు పురస్కరించుకొని ముందుగా ఇటలీపై విప్లవ దండయాత్ర చేయ సంకల్పించారు. నెపోలియన్ కమాండర్‌గా వున్నాడు. సమయం రాగానే అతడు ఉపక్రమించాడు.

"పర్వతాలు దాటి ఇటలీవైపు పయనించిన నెపోలియన్‌ను అనుసరించి సైన్యం, ప్రపంచానికి విమోచన సందేశాన్ని ఫ్రాన్స్ యిస్తున్నట్లు భావించారు."(1) విదేశాన్ని జయించటం వారి ఉద్దేశం కాదు. విప్లవం చూపిన మార్గంలో ఇటలీ ప్రజలకు కొత్త దారి చూపటమే గమ్యం. ఈ అర్థంతోనే నెపోలియన్ ఇటలీ ప్రజలనుద్దేశించి చాటాడు. "ఇటలీ వాసులారా ! మీ సంకెళ్ళు త్రెంచడానికి ఫ్రెంచి సైన్యం వచ్చింది. ప్రజలందరికీ ఫ్రెంచివారు స్నేహితులు. విశ్వాసంతో మమ్మల్ని కలవండి. మీ ఆస్తి, మీ మతం, మీ ఆచారాలు గౌరవిస్తాం. మిమ్మల్ని బానిసలు చేసిన నియంతలతో తప్ప మాకు ఎవరితో కలహం లేదు."

ఇటలీ జైత్రయాత్రలో విజయం సాధించిన నెపోలియన్ విప్లవం చూపిన సాధన ఆధారంగా ఐరోపా పాలకుడు కావాలని ఆశించాడు. అయినప్పటికీ, ఫ్రెంచి సైన్యాన్ని విమోచనదళంగా శ్లాఘించారు. అది ఎక్కడ ప్రవేశించినా అక్కడ రాజకీయ మార్పు తెచ్చింది. సామాజిక మార్పుకు తోడ్పడింది. ఇటలీలోజాతీయభావం పునరుజ్జీవం పొందడానికి నెపోలియన్ దండయాత్ర తోడ్పడింది. అతడు క్రూరంగా వున్నా, విమోచన కారుడుగా, కొత్త స్వేచ్ఛను తెచ్చినవాడుగా, ఇటలీకి విస్తృతాధికారాలతో కూడిన సంపద యిచ్చినవాడుగా కనిపించాడు. ఆస్ట్రియా సంకెళ్ళను తెంచిన నెపోలియన్ ఏం చేసినా మరచిపోయి, ఆధునిక రాజ్యానికి కావలసిన సంస్థలకై కృషి చేయడానికి ఆహ్వానించారు. ఇటలీ సాహితీపరులు అతడిని ఆకాశానికెత్తారు. అతడి కొలువులో లొంబార్డ్(2)లలో అత్యున్నత వ్యక్తులు చేరారు. విదేశీ పాలనతో కుంచించుకు పోయినవారు ఫ్రెంచి ఆయుధాల క్రింద రిపబ్లిక్ అనే భావాన్ని పొందారు.

నెపోలియన్ జర్మనీ దండయాత్రలు ఇంకా విప్లవాత్మక ఫలితాలు చూపెట్టినవి. అప్పటి వరకు జర్మనీ అంటూ ఏదీలేదు. నెపోలియన్ దీనికి జీవం పోశాడు. అంతవరకూ పవిత్ర రోమన్ సామ్రాజ్యం కింద వుంటున్న 360 ఫ్యూడల్ స్వదేశీ సంస్థానాలు మధ్య యుగాల సంప్రదాయంలో మ్రగ్గిపోతున్నవి. వీటికీ, సాంఘిక వ్యవస్థ కావాలనే విప్లవభావాలకు సంఘర్షణ జరగడంతో జర్మనీ తలెత్తింది. నెపోలియన్ అధ్వర్యాన ఫ్రెంచి సైన్య ప్రభావంతో, మధ్యయుగాలనుంచి జర్మనీ బయటపడి, ఆధునిక నాగరికతలోకి వచ్చినదని చరిత్రకారులందరూ అంగీకరిస్తున్నారు. ఆలస్యంగా వచ్చిన జర్మనీ పునర్వికాసంలో నాయకులందరూ ఫ్రెంచి విప్లవాన్ని మెచ్చుకున్నారు. ఉదాహరణకు, గెట నెపోలియన్ దండయాత్రలను ఆహ్వానించి, అతడి మేధస్సును శ్లాఘించాడు. నెపోలియన్ జయించిన కాలంలోనే జర్మనీ సాహిత్యరంగంలో పరాకాష్ఠకు చేరింది. భావాల ప్రభావంలోనూ అంతే, ఆధునిక ఐరోపా సంస్కృతికి యీ సమయంలో జర్మనీ ఎంతో దోహదం చేసింది.

"రాజకీయంగా నిస్సారమై, చీలికలతో వున్న సమయంలో జర్మనీ సాహిత్యం ఉచ్ఛదశలో వుండడం గమనార్హం. వేమర్(1)లో అప్పుడు గెట, షిల్లర్‌లు స్నేహితులు. జర్మనీ దేశభక్తి అతి హీనస్థాయిలో వున్నది. వప్‌సిన్(2) వద్ద ఫ్రెంచి సామ్రాట్టు ఓడిపోయినప్పుడు, గెట నిరుత్సాహం పొందాడు. విమోచన యుద్ధ సాహిత్యానికి జర్మనీ ప్రసిద్ధ కవి యిచ్చిందేమీ లేదు."(3)

రైన్ ఫెడరేషన్‌లో ఆధునిక సంస్కృతి, మేధాసంబంధమైన కార్యకలాపాలు సాగిపోతుండగా, ప్రష్యా మాత్రం ఫ్యూడల్ పద్ధతులలో వుంటూ విప్లవభావాలను నిరోధిస్తూ కొనసాగింది. వివేచన, స్వేచ్ఛ చట్టబద్ధ పాలనకు ప్రతీకగా వున్న నెపోలియన్‌ను వీరు నిరోధించారేగాని, విదేశీ దురాక్రమణ దారులని అడ్డుకోలేదు. వాటర్‌లూ అనంతరం కూడా విప్లవ భావాన్ని జర్మనీ ప్రక్కకు నెట్టివేయజాలకపోయింది. దీని ప్రభావంతో, ప్రష్యాలో వ్యవసాయ సంస్కరణలను ష్టిన్(4) ప్రవేశపెట్టాడు. పొరుగు రాజ్యాలైన పోలండ్ వెస్ట్ ఫలియలలో రైతులకు ఫ్రెంచి దండయాత్రికుడు విమోచన కల్పించాడు. ఆ విప్లవ సంఘటనకు దూరంగా ప్రష్యా వుండలేకపోయింది. ప్రష్యా పెంపొందించిన జాతీయవాదానికి, ఐరోపా విప్లవంలో విశ్వజనీన భావానికి జరిగిన సంఘర్షణ యీ విమోచన సమరం. తుదకు కొద్దికాలమే నిలచినప్పటికీ, 1849 విప్లవంలో విమోచన

---

1) జర్మనీలో ఒకనగరం – కేంద్ర స్థానంలో ఉంటుంది.
2) శాక్యనీలో ఒక నగరం – జర్మనీ మధ్యలో వున్నది.
3) ఫిషర్, ది హిస్టరి ఆఫ్ యూరోప్
4) 1757–1831 జర్మనీ రాజనీతిజ్ఞుడు.

ఉద్యమమే నెగ్గింది.

విప్లవ ప్రభావం నుంచి ఇంగ్లండ్ దూరంగా వుండలేకపోయింది. సామాజిక సిద్ధాంతాలు, నెపోలియన్ విఫల ప్రయత్నానికి పూర్వమే, ఇంగ్లండ్ చేరుకున్నవి. ఇక్కడ ప్రజోద్యమం వచ్చింది. విప్లవం అనకపోయినా ఛారిస్టు(1) ఉద్యమం వలన , తొలి సంస్కరణ శాసనం కాక తప్పలేదు. రెండవ సంస్కరణ చట్టానికి ప్రాతిపదిక తప్పనిసరైంది. ఐరోపాను ప్రభావితం చేసిన విప్లవ ఛాయల వలన 19వ శతాబ్దపు పూర్వార్థంలో రాజకీయ సంఘటనలు తప్పలేదు. బర్క్ (2) తో నిమిత్తం లేకుండా యిది సంభవించింది. విప్లవతత్వ సూత్రాలను ఆచరణలో పెట్టే ప్రయత్నం జరిగింది. రూసో ఉద్వేగవాద ప్రభావంతో సాహిత్యం, ముఖ్యంగా కవిత్వం వచ్చింది. తత్వంపై విజ్ఞాన సహజవాదం ప్రభావం కనబరచింది. బ్రిటన్‌లోని ప్రతిరంగంపై విప్లవ ప్రభావం కనపడింది.

విప్లవం సాధించిన వాటిలో నెపోలియన్ నియమావళి గొప్ప విశేషంగా పేర్కొనవచ్చు. చట్టబద్ధమైన ప్రాతిపదికలో సెల్యులర్ రాజ్యానికి యీ నియమావళి దారి తీసింది. దైవాజ్ఞగాని, నియంత అయిన రాజు అనుజ్ఞగాని సమాజ పాలనకు అవసరం లేకుండా పోయింది. 15వ శతాబ్దం నుంచి తత్వవేత్తలు పరంపరగా చేసిన కృషి ఎట్టకేలకు ఫలితాన్నిచ్చింది. ఐరోపాలో పాత ఫ్యూడల్ వ్యవస్థను నాశనం గావించడంతో నెపోలియన్ విప్లవాన్ని పూర్తిగావించాడు. మతసహనం, సాంఘిక సమానత ఆధారంగా సాధించడం అతడి ఘనవిజయం. మతగురువుల పెత్తనం లేకుండా, సాంఘిక జీవనం స్వతంత్రంగా వుండడమనేది చరిత్రలో తొలిసారిగా సాధించారు. మానవస్వేచ్ఛా తత్వం శతాబ్దాలుగా పెంపొందుతూ వస్తున్నప్పటికీ మొదటి పర్యాయం దీనిని ఆచరణలో పెట్టారు. శతాబ్దాల పోరాటానంతరం మానవుడి తిరుగుబాటు మహోన్నత విప్లవంలో పరాకాష్ఠనందుకున్నది. అందుకే యిది రెండవ పునర్వికాసం అన్నాడు మిష్‌లా.

✦ ✦ ✦

1) 1838 నుంచి 1848 వరకు రాజకీయ సంస్కరణకై జరిగిన ఉద్యమం

2) 1729-97 బ్రిటిష్ రచయిత, వక్త, రాజనీతిజ్ఞుడు.